
జ్ఞాన యోగం

విచారణ

బ్రహ్మ జిజ్ఞాస-4


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి.మహానుభావులైన సాధకులు, జిజ్ఞాసువులు జ్ఞాన ప్రచారార్ధం తాము సేకరించిన విలువైన గ్రంధాలను స్క్రిబ్డ్ వెబ్ సైట్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ సైట్(https://archive.org), గూగుల్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్ (www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్: http://www.scribd.com/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని
సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt


ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు*

స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్:

http://www.scribd.com




అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

బ్రహ్మ జిజ్ఞాస

శివశక్తుల తత్వము

అచలమత పరిశీలనము

చతుర్థ భాగము

మట్టిబోయిన రామసుబ్బయ్య

ఓమ్

బ్రహ్మజిజ్ఞాస

శివ–శక్తుల తత్త్వము
అచలమత పరిశీలనము

అను

(చతుర్థ భాగము)

BRAHMA JIGNASA
(FOURTH PART)

గ్రంథకర్త :
మజ్జిబోయిన రామసుబ్బయ్య



గ్రంథకర్త
శ్రీ మద్దిబోయిన రామసుబ్బయ్య

ప్రవేశిక మొదలగువాటి విషయసూచిక

చతుర్థభాగము - విషయసూచిక

మొదటి ప్రకరణము—శివుడు - శక్తి

రెండవ ప్రకరణము—అచలబోధ

మూడవ ప్రకరణము—ముగింపు (ఉపసంహారము)

ఓమ్

ప్రవేశిక

1. వేదాంతముయొక్క ప్రాశస్త్యము.

బ్రహ్మవిద్యయే వేదాంతము. అదియే అద్వైతము; తన్ను తా నెఱుగుట. ఇది ప్రపంచమునగల విద్యలలోకెల్ల శ్రేష్ఠతమమును, మిక్కిలి కష్టసాధ్యమునునై యున్నది. "వేదాంతకేసరి గర్జించకుండునంతవఱకే నిక్కిన శాస్త్రము లను జంబుకములు కూయుచుండును". అను సంప్రదాయ శ్లోకమును తృతీయ భాగమునందు (పుట 115లో) ఉదాహరించి యుంటిని. కనుకనే మహాత్ములు "ఆసుప్తేః ఆమృతేః కాలం నయేద్వేదాంతచింతయా" "బ్రతికియున్నంత కాలము నిద్రవచ్చునంతవఱకు వేదాంతచర్చలోనే కాలము గడపుమని" వచించిరి. మన దేశమున సామాన్యమానవునకు ఏదైన నొక కష్టమైనకార్యమును చెప్పి "ఈ కార్యమును నీవు చేయగలవా?" అని ప్రశ్నించిన, దానిని చేయగలనని అతనికి తోచిన అతడు "ఇది నాకెంతపని, ఇదియేమి బ్రహ్మవిద్యయా?" అనును. భారతదేశమునందలి సామాన్యమానవునకు వేదాంతపరిచయము లేకపోయినను, దాని గొప్పతనమును, దానిని సామాన్యులు గ్రహింపజాలరనుటయు, తెలియుటచే వేదాంతమునకు భారతదేశమే జన్మస్థానమై యుండవచ్చును. బ్రహ్మవిదులగు మహాత్ములు చక్రవర్తుల సభామందిరముల కేగినపుడు చక్రవర్తులు సింహాసనములనుండి లేచి వారి కెదురేగి స్వాగతము పలికి పూజించుచుండినట్లు పురాణాది గ్రంథములయందును చరిత్రలయందును చదివియున్నాము. మన దేశమున అట్టిదేయగు ఒక సంప్ర

దాయ మిప్పటికిని కలదు. మన దేశమున హిందూగృహములయందు, కౌపీన మాత్రధారియగు శ్రీ రమణమహర్షి చిత్రపటమునో శ్రీ శంకరభగవత్పాదుల యొక్కయు శ్రీ రామానుజాచార్యాదుల యొక్కయు చిత్రపటములనో సన్న్యాసులగు శ్రీరామకృష్ణ పరమహంస మొదలగు సాధువుల చిత్రపటముల (ఫోటోలను), ఉంచుకొని పూజలిడుదురు. కాని కోట్లకొలది ధనరాసులుగల టాటాగారి ఫోటోనుగాని, బిర్లాగారి ఫోటోనుగాని యెంతటి గర్భదరిద్రుడైనను పూజింపడు.

2. వేదాంతమును చక్కగా తెలిసినవాడు దేవుడేనట.

బ్రహ్మ సాక్షాత్కారమును (బ్రహ్మానుభవమును) పొందుట యట్లుండ వేదాంత గ్రంథములను చదివి చక్కగా అర్థము చేసికొనుటకూడ కష్టమే. దీనిని జ్ఞానయజ్ఞమని భగవద్గీత చెప్పినది. (4-33) ఇదియే జ్ఞాన తపస్సు. శ్రీ శ్రీ చిన్మయానందస్వాములవారు కఠోపనిషత్తునకు వ్రాసిన వ్యాఖ్యానమున (ఆంధ్రానువాదమున) ప్రథమవల్లి 21వ మంత్రముయొక్క వ్యాఖ్యానమున నిట్లు వ్రాసిరి :—

“వేదాంతమును సరిగా అర్థము చేసికొనినయెడల అతడు నిజమైనభక్తుడేగాక భూమిమీద దేవుడే. ఆ వేదాంతమునే సరిగా అర్థము చేసికొనక అపార్థము చేసికొనినయెడల అట్టివిద్యార్థిని అజ్ఞానబోధ పిశాచముగా తయారు చేయును”.

అదే గ్రంథమునందే స్వాములవారు వేఱొకచోట నిట్లు వ్రాసిరి.

“బ్రహ్మవిద్య యనగా ఆ పరమసత్యము .... బ్రహ్మవిద్య ఎంత విస్పష్టతకిని దాని స్వాధము చేసికొనుట అంత సులభముకాదు. గంభీర సాంకేతిక పదములను, వాని యథార్థభావములను గ్రహించుటకు కూడ విద్యార్థికి తగినంత అంతఃకరణపవిత్రత తత్ఫలితముగు కుశాగ్రబుద్ధి యుండవలెను”. (పుట. 64)

పై వాక్యములయందు అతిశయోక్తు లేవియు లేవు. భగవదనుగ్రహమున ‘బ్రహ్మజిజ్ఞాస’ యొక్క మూడు భాగములు మూడు సంపుటములుగ అచ్చయి వెలువడినవి. తత్త్వజ్ఞులగు కొందఱు పెద్దలయొక్కయు, కొన్ని పత్రికలయొక్కయు మన్నన లందగలిగినవని సవినయముగ మనవి చేసికొనుచున్నాను.

3. చతుర్థభాగమున పరిశీలించిన ముఖ్య తత్త్వములు.

ఈశ్వరానుగ్రహమున ‘బ్రహ్మజిజ్ఞాస’ చతుర్థ భాగము పూర్తి అయినది. ఇందు ముఖ్యముగా అయిదు తత్త్వగ్రంథములలోని సిద్ధాంతములను సంగ్రహముగ సమీక్షించితిని. అద్వైతమునందు దృష్టి - సృష్టి వాదులు, అజాతివాదులు గలరని చెప్పియుంటిని. శ్రీశంకరభగవత్పాదులు ఆమోదించిన అద్వైతము సంగతము అజాతవాదమే. కాని, వీరిది దృష్టి - సృష్టి వాదము కాదు. దృష్టి సృష్టి వాద

కనగా :— దృష్టి = జ్ఞానము, సృష్టి = దృశ్యము - అనగా - చూచునదియు, చూడబడునదియు, ఒకే పదార్థమను వాదము.

అజాతవాదమును పెక్కువిధముల వివరించి బోధించిన మహాగ్రంథము 'వాసిష్ఠ రామాయణమను నామాంతరముగల యోగవాసిష్ఠము' ఇది అద్భుతగ్రంథము. ఇందు తత్త్వ బోధకముగాను కల్పించిన కథలు నిరుపమానములు. సంస్కృతమున గాని, తెలుగునగాని యిట్టి కల్పనా కథలు అరుదు. గ్రంథకర్త వాల్మీకియని యున్నది. కాని, ఈ గ్రంథకర్త శ్రీమద్రామాయణమును రచియించిన వాల్మీకి కాదు. ఏ మహనీయుడో బౌద్ధయుగమున యీ గ్రంథమును వ్రాసి వాల్మీకికి కర్తృత్వమును చేకూర్చెను. ఈ గ్రంథమున ఆరు ప్రకరణములు కలవు. అవి - (1) వైరాగ్య, (2) ముముక్షు వ్యవహార, (3) ఉత్పత్తి, (4) స్థితి, (5) ఉపశమన, (6) నిర్వాణము, లనునవి, ఒక్కొక్క ప్రకరణము సర్గములుగా విభజింపబడినది. ఇందు సుమారు 32 వేల శ్లోకములు కలవు. ఈ గ్రంథము క్రీ. శ. నాలుగవ శతాబ్దియందు రచియింప బడియుండవచ్చునని కొందరు పండితుల అభిప్రాయమై యున్నది.

యోగవాసిష్ఠమను గ్రంథనామమును వ్రాయునప్పుడు 'వసిష్ఠ' నామమున మధ్యమున్న యక్షరము 'సి' దంత్యమా? లేక తాలవ్యమా? అను సంశయము కలుగుచుండును. "శ్రీమదాంధ్ర వచన జ్ఞానవాశిష్ఠ"మను గ్రంథమును రచియించిన బ్రహ్మశ్రీ వెన్నెలకంటి సుందరరామశర్మ గారు,

ఆ గ్రంథముయొక్క తొలిపలుకునందు "శబ్దకల్పద్రుమము నందలి వాక్యములవలన రెండును ఉండవచ్చునని గ్రహింపరు గాక" అని వ్రాసి, వసిష్ఠుడగు వ్యక్తి (పుంలింగమైనపుడు) 'వసిష్ఠ' డని "సి" దంత్యముగను, గ్రంథనామమైనపుడు "జ్ఞానవాశిష్ఠము" అని "శి" తాలవ్యముగను వ్రాసిరి. సంస్కృత మూలగ్రంథమునందు 'యోగవాసిష్ఠము' అనియు; వసిష్ఠమహర్షి నామమునందు సహితము "సి" అను అక్షరమునే వాడిరి. తిక్కనగారి మహాభారతమునందును 'వసిష్ఠ'మహర్షి యనియే వ్రాసియున్నారు. గ్రంథ, ఋషి నామములయందు 'సి' అను అక్షరమునే నేను వాడితిని.

మహారాష్ట్రమున జన్మించి భారతదేశమునం దంతటను ప్రసిద్ధికెక్కిన ఆర్ష మహాకవియు, తత్త్వవేత్తయు, తాంత్రిక, పాతంజలయోగియు అగు శ్రీ జ్ఞానేశ్వరులు సయితము ఒకవిధముగ అజాతవాదులే. వీరు 'జ్ఞానేశ్వరి'యను పేర మహారాష్ట్రభాషయందు భగవద్గీతకు వ్యాఖ్యను రచియించిరి. అదిగాక 'అనుభవామృతము (అమృతానుభవము) అను ఒక స్వతంత్రగ్రంథమును మహారాష్ట్రభాషయందే రచియించిరి. అవి సంస్కృత, ఆంగ్ల, ఆంధ్ర భాషలయందనువదింపబడినవి. మరికొన్ని గ్రంథములు కూడ వీరు, వీరి మాతృభాషయందే రచియించిరి. 'జ్ఞానేశ్వరిని' శ్రీమతి రాణి లలితాదేవిగారును, శ్రీ దిగవల్లి శేషగిరిరావు గారును, భక్త నరసింహముగారి పుత్రులు శ్రీ సత్యనారాయణ గారును తెనిగించిరి. శ్రీ జ్ఞానేశ్వరులు అద్వైతులే. అయినను వీరు శ్రీశంకరుల బ్రహ్మవివర్తవాదమును అంగీకరింప లేదు. శ్రీ

జ్ఞానేశ్వరులు శివ - శక్తులను గురించి చెప్పిన తాత్త్వికాంశములతో చాలవరకు ఏకీభవించిన శ్రీ అరవిందుల శివ - శక్తి తత్త్వమును గురించి కూడ కొంత వ్రాసితిని.

శ్రీ జ్ఞానేశ్వరుల తదనంతరము సుమారు 312 సంవత్సరములకు మహారాష్ట్రమునందే జన్మించిన శ్రీసమర్థ రామదాసస్వామి అనువారు 'దాసబోధ' అను స్వతంత్ర అధ్యాత్మ గ్రంథమును మహారాష్ట్రభాషయందు రచియించిరి. అది తెనిగింపబడినది. వీరు అజాతవాదులుకారు. సృష్టివాదులు. శాక్తేయులు.

నాల్గవవారు రామడుగు శివరామదీక్షితులవారు, తెలంగాణావారు. వీరు అచలబోధను స్థాపించినారని అందురు. వీరు రచియించిన యేకైక గ్రంథము "శివరామదీక్షితీయ" మను బృహద్వాసిష్ఠ సిద్ధాంతము. వీరును అజాతవాదులే.

యోగవాసిష్ఠమునుండియు, శాక్త తంత్రముల నుండియు, కొన్ని అంశములను గైకొని తమ స్వీయానుభవమును స్వీయాభిప్రాయములను చేర్చి పై నలువురును తమ గ్రంథముల (సిద్ధాంతముల) విస్తరింపజేసిరి. కనుక యోగవాసిష్ఠముతో చేర్చి యీ నాల్గింటిని చర్చించిన గాని సామాన్య పాఠకులకు తత్త్వము సులభ గ్రాహ్యము కాదని వీటిని యీ చతుర్థభాగముగా రచియించితిని.

1. వేదాంతము - తంత్రములు.

శ్రీ శంకరాచార్యులవారు అద్వైత స్థాపకులు కారు. అద్వైతమును బోధించిన శ్రుతులకు శ్రీ శంకరులవారు

చెప్పినదే సరియైన యర్థము. కనుక వారద్వైతము నుద్ధరించినందున వారిని అద్వైతస్థాపకులని తెలియనివారందురు. శ్రీ శంకరులవా రంగీకరించినదే అద్వైతము. అదియే వేదాంతము. అద్వైతమే వేదాంతమని అద్వైతమును నిందించునట్టి సాంఖ్య, వైశేషికాది దార్శనికులు సయితము శ్రీ శంకరులకు పూర్వమే అంగీకరించిరి. (ఈవిషయమై యీ గ్రంథముయొక్క తృతీయ భాగమునందలి మొదటి ప్రకరణము "(౯) వేదాంతదర్శనము" అను అధ్యాయమున విపులముగ వివరించియున్నాను).

శైవమతము అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత, ద్వైతాద్వైత మార్గముల నడచినది. శాక్తేయము అట్లుగాక అద్వైతమార్గముననే నడచినది. శైవమునకు ముఖ్యాధారములు శైవాగమములు, శాక్తేయమునకు ఆధారములు తంత్రములు. కాని తంత్రములయందలి అద్వైతమునకును, దశోపనిషత్తులను ఆధారముగా శ్రీ శంకరులు చెప్పిన అద్వైతమునకును కొంత భేదమున్నది. శ్రీ శంకరులు తాంత్రిక యోగియని సౌందర్యలహరి మొదలగు శ్రీవిద్యా ప్రతిపాద్యములగు స్తోత్ర గ్రంథములు వ్యాఖ్యానములు శ్రీ శంకర విరచితము లేనని కొందఱు పండితు లందురు. కాని, శ్రీ శంకరులు దేవీపరమగు స్తోత్రములే గాక, శివానందలహరి, శ్రీ లక్ష్మీనరసింహస్తవము, మొదలగు శివకేశవాది దేవతాపరములగు స్తోత్రగ్రంథములు కూడ వ్రాసియున్నట్లు ప్రతీతి, కనుక, అవన్నియు వివిధ దేవతలయందు భక్తిని వ్యక్తము చేయునే గాని దేవీస్తోత్రములు వ్రాసినంత మాత్రమున శ్రీ శంకరులు తాంత్రిక యోగికారని కొందఱు పండితులందురు.

శ్రీ శంకరులు పైన చెప్పిన స్తోత్రము లేవియు వ్రాయలేదనియు, అవి యెవరో శ్రీ శంకరుల పేరున వ్రాసిరనియు, మఱికొందఱందురు. అందుకు వారు చూపు నిదర్శనమేమన :— శ్రీ శంకరులు ప్రస్థానత్రయమునకు భాష్యములు రచియించిరి. అట్టి భాష్యముల యందెచ్చటను తంత్రముల నుదాహరింప లేదనియు. తాంత్రిక సిద్ధాంతములను స్వల్పముగా నైనను గ్రహింప లేదనియు, ఆ కారణమున శ్రీ శంకరులు కేవలము ప్రస్థానత్రయమునకు భాష్యములను మాత్రమే వ్రాసినట్లు స్పష్టపడుచున్నదనియు, చెప్పెదరు. ఈ రెండు వాదములను కలుపునట్టి(రాజీ) పద్ధతి యేమన :— శ్రీశంకరులు వివిధ దేవతారూపముననున్న సగుణ బ్రహ్మమునందు భక్తి భావమును చూపుచు రచియింపబడిన స్తోత్రము లన్నియు నిర్గుణ బ్రహ్మజ్ఞానమును పొందుటకు సాధనములనియు, నిర్గుణ బ్రహ్మజ్ఞానమును ప్రతిపాదించుటయే ప్రస్థానత్రయములయొక్క ముఖ్యోద్దేశమైనందున ప్రస్థానత్రయములకు వారు రచియించిన భాష్యములయందు తంత్రములనుగాని వాటి యందు ప్రతిపాదించిన జ్ఞానమును గాని స్మరింపక పోవుటకు కారణమనియు, నా యభిప్రాయము. ఈ యభిప్రాయముతో నేకీభవించిన చిక్కులన్నియు తొలగిపోవును. కాని తాంత్రిక యోగులలో కొందఱు ఈ సామరస్య పద్ధతిని అంగీకరింపక శ్రీ శంకరులు చెప్పిన అద్వైతమున కంటె తమ తాంత్రికాద్వైతమే పై మెట్టని, దానికి శ్రీ శంకరాద్వైతము క్రింది మెట్టని చెప్పెదరు. అట్లు చెప్పినవారిలో శ్రీ అరవిందు లొకరు.

తాంత్రికాద్వైతము (శ్రీవిద్య) నాకు తెలిసినంత

వఱకు రెండు శాఖలుగా నేర్పడినది. అందొకటి శ్రీ శంకరుల అద్వైతమునకు మిక్కిలి సమీపవర్తి. రెండవది కొంత దూరమైనది. ఈ విచారము చాలకష్టతరమైనది. దీని నిచట చర్చించుటకు చోటు లేకపోవుటయే గాక, సమగ్రముగా ఆ చర్చను విశదీకరించి సంపూర్ణముగ అందఱికి ఆమోదయోగ్యమగు నొక సిద్ధాంతమును చేయుటకు నేనశక్తుడను. ఈ గ్రంథముయొక్క తృతీయ చతుర్థ భాగములను చదివినవారు, కొంతవఱకు ఈ రెంటి భేదమును అర్థము చేసికొనగలరు.

5. ప్రాచీన నవీన వేదాంతములు

ప్రాచీన వేదాంత మనగా నేది? మొదటి దశోపనిషత్తులయందు చెప్పబడిన వేదాంతము ప్రాచీన వేదాంత మనియు, తరువాత వెలువడిన కొన్ని ఉపనిషత్తులయందు చెప్పబడిన వేదాంతము నవీన వేదాంతమనియు స్థూలముగా ఒక అభిప్రాయము అభిజ్ఞవర్గమునందు ప్రచారము నందున్నది. పదియవ ఉపనిషత్తుగా లెక్కింపబడినది బృహదారణ్యకోపనిషత్తు. తదనంతరము పదునొకండవదిగా ఎన్నబడిన బ్రహ్మోపనిషత్తునుండి క్రమముగా కొన్ని ఉపనిషత్తులయందు మతము ప్రవేశించి శైవ, శాక్త, వైష్ణవ మతములకు ఆధారభూతములైనవి. లేదా, పురాణములయందును, శైవ, వైష్ణవాది ఆగమములయందును, గల మతములు సర్వజనసమ్మత మగుటకును, అవి ప్రాచీనము లను విశ్వాసము ప్రజలయందు కలుగునట్లు చేయుటకును, వాటిని అంగీకరించు ఉపనిషత్తులు అవసరమని తలచి సమాజమున

ఉపనిషత్తులకు గల పలుకుబడిని చూచి ఆయామతములవారు ఆయా మత సంబంధమైన ఉపనిషత్తులను రచియించిరని పెద్దలు కొంద రందురు.

కంకంటి పాపరాజ ప్రణీతంబైన ఉత్తర రామాయణమునందు — శ్రీ రామచంద్రుడు తన అవతారమును సమాప్తి చేయుటకు మహాప్రస్థానము చేయు సమయమున ఆయన వెంట నడచిన వారిలో "సావిత్రీ మహాదేవి స్త్రీరూపధారిణియై ...... ద్వాత్రింశదుపనిషత్సమేతయై నడచె" (ఉ. రా. 8 - 268 వచనము) అని యున్నది. అనగా ఆకాలమునకు 32 ఉపనిషత్తులు మాత్రమే యుండెనని మన మూహింపవచ్చును.

ఒక వంక మతోద్ధరణకై మతపరములగు ఉపనిషత్తులు రచియింపబడినట్లే బౌద్ధమతము క్షీణదశకు వచ్చిన కాలమునందు నవీన వేదాంతమునకు బీజములుగల ఉపనిషత్తులు కూడ రచియింపబడినవని నా యభిప్రాయము. 38వ ఉపనిషత్తుగా గణనకు వచ్చిన తేజోబిందూపనిషత్తునందు శ్రీ జ్ఞానేశ్వరుల వేదాంతమునకు ఆధారములగు కొన్ని శ్లోకములు (మంత్రములు) కలవని శ్రీ జ్ఞానేశ్వరుల అనుయాయులు కొన్నింటిని యెత్తి చూపుచున్నారు. ఆ విషయమును ఇచ్చట విపులముగ చర్చించుటకు చోటులేదు. తేజోబిందూపనిషత్తు శ్రీ శంకరుల అద్వైతమునకు విరుద్ధమైనది కాదు. అందు మొదటి అధ్యాయమునందలి 15వ శ్లోకము (మంత్రము) నుండి ఆ యధ్యాయము ముగియు వఱకు గల 36 మంత్రములు ఉన్నవి ఉన్నట్లు శ్రీ శంకరులు

తమ "అపరోక్షానుభూతి" యందు 102వ శ్లోకమునుండి 140వ శ్లోకమువఱకు గ్రైకొనిరి. కానేని. శ్రీ శంకరుల 'అపరోక్షాను భూతి' రచనానంతరము తేజోబిందూపనిషత్తు రచియింపబడి యుండిన ఆ శ్లోకములు అపరోక్షానుభూతి నుండి గ్రైకొనబడినవై యుండవలయును.

ఉపనిషత్తులను గుఱించి శ్రీ వివేకానందస్వాములవారు ఒక ఉపన్యాసమున నిట్లు చెప్పిరి :—

"ఉపనిషత్తులు పెక్కులు కలవు. అవి నూటయొనిమిది అని ప్రతీతి. కాని యింకను చాల కలవని కొంద అనుచున్నారు. వీరిలో కొన్ని అనంతరకాల విరచితములనుట స్పష్టము. ఉదాహరణముగా అల్లాను స్తోత్రము చేయునట్టియు, మహమ్మదును రజసుల్లా అని పేర్కొను నట్టియు, అల్లోపనిషత్తు ఒకటి కలదు. అది హిందువులకును, మహమ్మదీయులకును, సఖ్యమును కూర్చుటకై అక్బరు కాలమున వ్రాయబడినదట. ఎక్కడనో సంహితలయందు ఒకచోట అల్లాశబ్దమో, ఇల్లాశబ్దమో దొరకగానే దానిని పట్టుకొని దాని ఆధారమున ఒక ఉపనిషత్తు వ్రాసివేసిరి. ఈ రీతిగా అల్లోపనిషత్తులో మహమ్మదు "రజసుల్లా" అయిపోయినాడు". "ఈ రీతిగా ఉపనిషత్తు లనేకములు సృజింపబడినవి. ఇప్పుడుకూడ అట్టివి సృజింపబడుచునే యున్నవని నా వినికిడి. భారతదేశమునందు కొన్ని ప్రాంతములయందు వేర్వేరు తెగలవారు అట్టి ఉపనిషత్తులను సృజించుచున్నారని నాకు చక్కగా తెలియును." (వి. సం. గ్రం. సంపుటము 6 సర్వతోముఖ వేదాంతము, పుటలు. 330 - 331).

మహోపనిషత్తు లోగ వ్రాసినమునకు సంగ్రహమను ప్రతిరూప మనవచ్చును. ఇట్టి శ్రుతులు బౌద్ధయుగము భారతదేశమున అస్తమించునట్టి కాలమున రచియింపబడి యుండవచ్చును. ప్రస్తుతము ఈ చర్చ మనకంత ప్రయోజనకారి కాదు.

శ్రీ శంకరుల అద్వైతము ప్రాచీన వేదాంతము కాదని నవీన వేదాంతములో చేరునని కొందఱందురు. వారు శంకరాద్వైతమునందలి యీర్ష్యతో అట్లు చెప్పిరని నా యభిప్రాయము. డా॥ శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ పండితు లిట్లు చెప్పిరి :—

“నిజముగా శంకరుని సిద్ధాంతము పూర్వ సంప్రదాయానుగుణమైనదో, దానికి బునర్నిర్మాణమో, లేక పూర్వ విజ్ఞానమునకు గ్రొత్తగా జేర్చిన నవ్యకల్పనమో నిర్ణయించుట సుసాధ్యము కాదు. పురాతన నవీన భావ భేదమును మనము నిర్ణయింపజాలము. ఏలయన జీవిత వ్యాపారములోఁ బ్రాత క్రొత్తలు కలసిపోయినవి”*

(భా. త. 8 అ. పుట 377)

---

* డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు స్మార్త బ్రాహ్మణ కుటుంబమున జన్మించినను వీరు సంపూర్ణముగ శాంకరతత్త్వావలంబులు కారు. వీరు శ్రీ శంకరుల అద్వైతమును అచ్చటచ్చట విమర్శించి వీరొక స్వతంత్ర దర్శనమును రచియించిరి. కొందఱు పూర్వాచార్యులవలెనే వీరును ప్రస్థానత్రయములకు వీరి దర్శనానుసారము ఆంగ్లమున భాష్యములు రచియించిరి. శ్రీ శంకరుల దర్శనమునకును, రాధాకృష్ణదర్శనమునకు గల భేదము స్వల్పము కాదు.

శ్రీ శంకరుల అద్వైతమును గురించి పశ్చిమఖండ విద్వాంసుల అభిప్రాయమును డాక్టరు. స. రాధాకృష్ణ పండితులు తమ భారతీయ తత్త్వశాస్త్రమున నిట్లుదాహరించిరి. వారిలో డాక్టరు థీబో పండితులు యిట్లు వ్రాసిరట :—

"శంకరుడు ప్రతిపాదించిన సిద్ధాంతము. మతవిషయ సంబంధము లేని శుద్ధ తాత్త్వికదృష్టితోఁ జూచినచో భారత పుణ్యభూమిలో బయల్వెడలిన వానిలో నత్యంత మనోహరము, నతి ప్రసిద్ధమునైన తత్త్వము. శంకరాద్వైతము నుండి భేదించు నితర వేదాంతములుగాని యే వేదాంతేతర తత్త్వములుగాని సంప్రదాయ సిద్ధమైనవని చెప్పబడు శంకరుని వేదాంత తత్త్వము మాపు ప్రజ్ఞాతిశయ ధైర్య గాంభీర్యములను జూపజాలవు." (భా. త. అ. ౨. పుట. ౩౩౮)

శ్రీ శంకరుల అద్వైతమును గురించి కల్నల్ జాకోబ్ గారు యిట్లు వ్రాసిరని డా॥ రాధాకృష్ణ పండితులు యీ క్రింది వాక్యముల నుదాహరించిరి.

"ఉపనిషత్తులలోని వైరుధ్యము లన్నింటిని విడదీసి, సమ్యక్సమరస్య సంపద్విలసితమైన యొక తత్త్వముగా నిర్మించు దుష్కర కార్యమునకు బూనుకొన్నచో శంకరుని తత్త్వ మొక్కటే యిట్టి కార్యమును సాధించెనని చెప్పవలెను". (వేదాంత సూత్రమున కుపోద్ఘాతము.— భా. త. పుట ౩౮౧)

పైన చెప్పిన పాశ్చాత్యపండితులు లిరువురును అద్వై

తము నందు నిష్ఠాతులు. అందువలన శ్రీ శంకరుల అద్వైతము ప్రాచీన వేదాంత మేగాని నవీన వేదాంతముకాదు.

శ్రీ లోకమాన్య బాలగంగాధర తిలక్ మహాశయులు తమ 'గీతారహస్యము' నందు— "శ్రీ శంకర భగవత్పాదులు జన్మించినది మొదలు ఇంత పర్యంతము యీ భూమి పైన అంతటి అలౌకిక తత్త్వవేత్త ఎప్పుడును జన్మించి యుండ లేదు. అని వ్రాసియున్నారు. ఇదిమరువరాని సత్యము.—

వేదాంతమునకు మూలకర్త యెవరు? ఈ ప్రశ్నకు భగవంతుడు తానే కర్తనని భగవద్గీతయందు "వేదాంతకృద్వేదవిదేవ చాహమ్" (గీతా. 15-15) వేదాంతముల చేసినవాడను వేదమును తెలిసిన వాడను నేనే. అని చెప్పిరి. కనుక వేదాంతమునకు శ్రీ శంకరులు మూలపురుషులు (కర్త) కారు.

శ్రీ వివేకానందస్వాములవారు "వేదాంతము" అను ఉపన్యాసమున నిట్లు చెప్పిరి:—

"శంకరాచార్యుల వారు అద్వైత సిద్ధాంతమునకు మూలకర్తయని మీరు తలపకూడదు. ఏది శంకరాచార్యులు పుట్టుటకు పూర్వము యుగాంతరములనుండి వచ్చుచున్నదో దాని తుది ప్రతినిధులలో ఈయన ఒకడు" (వివేకానంద సంపూర్ణ గ్రంథావళి సం. 6. పుట 430)*

---

* ఈ వాక్యములను రెండవ ప్రకరణమున (31)-వ అధ్యాయమున దీక్షితులవారు శ్రీ శంకరులను నిందించిన సందర్భమున చెప్పియున్నారు.

ఇందువలనను ఈ క్రింద చెప్పబోవు శ్రీ అరవిందుల వాక్యములవలనను శంకరాద్వైతము ప్రాచీన వేదాంతమని రూఢి యగుచున్నది.

శ్రీ అరవిందులు 'మాయ' అను వ్యాసమునం దిట్లు వ్రాసిరి :—

"ఆర్యజాతిని రక్షించుటకై భగవంతుఁడు పురాణముల యొక్కయు, తంత్రముల యొక్కయు ప్రచారముచే మాయావాదమును ప్రతిరోధించినాఁడు".

(శ్రీ అరవింద వ్యాసావళి.)

తమ పై వాక్యములవలన శ్రీ శంకరుల అద్వైతము, తంత్రములు, పురాణములు రచియింపబడుటకు పూర్వమే యుండెనని శ్రీ అరవిందు లంగీకరించిరి.

6. అచలబోధ

ఆంధ్రదేశమునను, బెంగుళూరు, మద్రాసు మొదలగు చోట్లను, అచలబోధ అచ్చటచ్చట కలదు. అది మొదట యెట్లు వ్యాపించినదో చెప్పుట కష్టమే యైనను నాకు తోచినంత వఱకు ఈ గ్రంథముయొక్క తృతీయ భాగము పుట 550లో ఇట్లు చెప్పియుంటిని :—

ఆంధ్రదేశమునందు బౌద్ధ విజ్ఞాన - మాధ్యమిక శాఖలు స్థిరముగా కొన్ని శతాబ్దములు నిలచియుండినందున ఆ శాఖల నుండియు ప్రాచీన వేదాంతము నుండియు కొన్ని అంశములను గైకొని బౌద్ధము నవీన వేదాంతముగా

రూపొందినది. అట్టి మార్పు ఎప్పటినుండి ఆరంభమైనదో చక్కగా చెప్పుట కష్టమే. అనగా :—బౌద్ధము పేరుమార్చుకొని తత్త్వమునందు ముఖ్యలక్షణమగు క్షణిక వాదమును వదలి వేదాంత వేషమును ధరించినది. అట్లు మారు వేషముతో మార్పుతో ఉన్నవానియందు, శ్రీరాముడగు శివ రామదీక్షితులవారు 'అచలబోధ' 'అచల వేదాంతము' అనునం దొకటి యని నా యభిప్రాయము"

శ్రీ శంకరభగవత్పాదులు బౌద్ధమతమునందు ఏయే లోపములను చూపి దానిని ఖండించిరో అట్టి లోపములను తదనంతర బౌద్ధులు చాలవఱకు సవరించుకొని మఱల హిందూమతమును చేకొనిరి. వేదాంత శాస్త్రము నభ్యసించుటకు స్త్రీ శూద్రాదులు అధికారులు కారను మధ్యయుగమునాటి నిషేధమును నవీన వేదాంతులు తొలగించిరి. నవీన వేదాంతమునందొక శాఖయే అచల వేదాంతమను పేర ఆంధ్ర ప్రదేశమునందు ముఖ్యముగా స్త్రీ శూద్రాదుల యందు వ్యాప్తిగాంచెను.

"శ్రీ శివరామదీక్షితులవారి అచల వాదమును గురించి తరువాత తెలిసెద"నని ఈ గ్రంథముయొక్క ప్రథమ భాగమునందు నేను వ్రాసియుంటిని. అది యీ భాగమునందు పూర్తి అయినది. శివరామ దీక్షితులవారు చెప్పినది మాత్రమే అచలవాదమని అనుకొనరాదు. వారి పుట్టుకకు పూర్వమే అచలబోధ కలదు. దానికిని దీక్షితులవారి బోధకును భేదమున్నది. ఈ విషయము ఈ భాగమున రెండవ ప్రకరణములో విపులముగా చర్చించితిని.

7. ఆంధ్ర దేశమునందలి యోగులు, యోగినులు

ఆంధ్రప్రదేశమునందు అచ్చటచ్చట సుమారు అయిదువందల సంవత్సరలమునుండి ఎందరో మహానుభావులు జన్మించి తరించిరి. కొందరి నామములు సయితము చరిత్రకెక్కనే లేదు. ఇటీవల వారి చరిత్రను గురించి శ్రద్ధగా తెలిసికొనుచున్నారు. ముఖ్యముగా ప్రసిద్ధికెక్కినవారు కడపజిల్లా బద్వేలి తాలూకాలోని కందిమల్లాయపల్లెలో సమాధిచెందిన పోతులూరు వీరబ్రహ్మయ్యగారు. (వీరు విశ్వబ్రాహ్మణ కులజులు). అదే తాలూకాలోని పలుగురాళ్లపల్లెలో నివసించియుండిన సుబ్రహ్మణ్య అయ్యగారు, (వీరు బ్రాహ్మణ కులజులు), పూదోట రామావధూతగారు, వీరి శిష్యులు అవధూత లింగమూర్తిగారు. (లింగమూర్తిగారు రెడ్డి కులమున జన్మించినవారు), చిత్తూరుజిల్లా తరిగొండ గ్రామమునుండిన తరిగొండ వెంగమాంబగారు(వీరు బ్రాహ్మణులు), యాగంటి క్షేత్రమునందుండిన - యాగంటి లక్షుమయ్యగారు. (వీరు పద్మశాలి కులజులట), వీరి శిష్యులు చిట్టెయ్యగారు, ఆదవని (ఆదోని) తిక్క లక్షుమమ్మగారు (వీరు అరుంధతీయ హరిజనకులమునకు చెందినవారు), కడపలో సమాధిపొందిన కమ్మాలు నారాయణరెడ్డి గారు, శ్రీ వెంకగురుడు, ప్రస్తుతము జీవించియుండువారియందు ముమ్మడివరం బాలయోగిగారు, (హరిజనులు) గుంటూరు జిల్లా రాజపాలెము నందున్న బాలయోగినిగారు. గుంటూరు జిల్లా కొండపాడు గ్రామం కాపురస్తులు కోట బ్రహ్మావధూతగారు, (ఈ కడపటి ఇరువురు విశ్వబ్రాహ్మణ కులజులు) కందుకూరు తాలూకా ముగలిచర్ల గ్రామములో 6-5-1976 తేదిన

సమాధి చెందిన దత్తాత్రేయస్వాములవారు, (వీరు కమ్మ్రకులమువారు). ఇందులో పేర్కొన్నవారు ఆయాకులములకు చెందినవారని వ్యవహారమునకు చెప్పుదునుగాని, వీరిని అతి వర్ణాశ్రమ లనియందురు. వీరుగాక ఎందరో మహానుభావులు. లోకమునకు వారి జీవిత చరిత్రము తెలియకుండగనే జీవించి వారి భౌతిక దేహములను వదలిరి.

పైన చెప్పినవారిలో కొందఱు సిద్ధపురుషులు. ఒక్క సమయమందే అనేక స్థలములయందు కనబడిరని వింటిని. అతి మానుషశక్తి సంపన్నులైనను కమ్మర, వడ్రంగి, మొదలగు పనులు చేసికొని బీదతనముతో జీవితమును గడపిరి. లింగావధూతగారు కానాల గ్రామమున చనిపోయిన ఒక వైశ్య యువకుని బ్రతికించిరి, గాని బిక్షాన్నముతోనే జీవితమును గడపిరి. వారు కోరిరేని కోటీశ్వరులు కాగలిగిన శక్తి వారి నుండియు ధనము కొఱకు వారు మహిమలను చూపలేదు. వీరి జీవిత చరిత్రములను సంగ్రహముగా నైనను వ్రాసి యుందునుగాని గ్రంథ విస్తర భీతిచేతను, పాఠకమహాశయులకు విసుగు కలుగునేమో అనియు వ్రాయుట మానితిని.

ఇచట ఒక విశేషము చెప్పవలసియున్నది. పైన చెప్పబడిన యోగులు - యోగినుల యందు కొందరు చదువు రానివారు. వారి పూర్వజన్మ తపఃఫలము (సాధన ఫలము) ఈ జన్మమున వారి అంతఃకరణమునందు ప్రవేశించుట వలననో మహాత్ముల అనుగ్రహమువలననో నిర్వికల్పసమాధి సిద్ధించి యుండిరని పెద్దలవలన నేను విన్నాను. ఇరువురను నేను చూచియుంటిని.

8. కొన్ని గ్రంథములు - కీర్తనలు

ఆంధ్రప్రదేశమునందు కొందఱు యోగులు కీర్తనలను పద్యములను వ్రాసియున్నారు. వానిలో శతఘంటము సీతారామ యోగిగారి 'స్వాంతవస్తుశతకము'. ఇతరులవి — ఆత్మైక్యబోధ, పూదోటవారి తత్త్వములు, పోతులూరు వీరబ్రహ్మంగారి వచనములు (కీర్తనలు) సిద్దయ్యగారి కీర్తనలు, తరిగొండ వెంగమ్మగారి వచనములు ఆత్మ యుక్త గానము, యాగంటివారి యాలలు, త్రిపురారిభట్ల సుబ్బ గురుస్వాముల వచనములు (గ్రంథములు), శివగంగా చిదంబరస్వాములవారి వచనములు, శ్రీ పరశురామ పంతుల లింగమూర్తిగారి 'సీతారామాంజనేయ సంవాదము', ఇటీవల సుమారు 80 సంవత్సరముల క్రిందట సిద్ధబోటన శ్రీ విద్యానందనాథులను దీక్షానామముగల కనుపర్తి వేంకటరామయ్యగారి 'కైవల్యనవనీత'మను గద్యపద్య గ్రంథము, నారాయణ శతకము. (త్రీలపాట) వేమన పద్యములు, వాసిష్ఠ రామాయణము, (ఇది యోగవాసిష్ఠమునకు సంగ్రహముగ రచియింపబడిన పద్య గ్రంథము) మొదలగు గ్రంథములు కీర్తనలు పరిశీలించినట్లయిన, ఇందు చెప్పబడిన వేదాంతము శాస్త్రీయమైనదే. 'సీతారామాంజనేయ సంవాదము'నకు కలిగినంత ప్రచారము యితర యే తెలుగు వేదాంత గ్రంథమునకును కలుగలేదని చెప్పవచ్చును. ఈ గ్రంథకర్తకు శిష్యులనేకులు ఉండెడివారట. శిష్యుల నాకర్షించుటకు కావలసిన హంగులను కొన్ని పద్యములయందు చెప్పియున్నారు. ఈ గ్రంథమునకు తరువాత యెక్కువ ప్రచారము కలిగియుండెడిది 'కైవల్యనవనీతము'.

9. దీక్షితులవారి అచలబోధను సంబంధించిన కొన్ని గ్రంథములు

శివరామ దీక్షితులవారి బృహద్వాసిష్ఠ సిద్ధాంతము, భాగవతుల కృష్ణంభట్లను నామాంతరముగల కృష్ణదాసుగారి కందార్థ దరువులు, కందములు, కీర్తనలు — రామసింగుగారి ద్విపదార్థ దరువులు — గాలవ కోటప్పగారు, రంగస్వామి శ్రేష్ఠిగారు, మీరాసాయబ్ గారు వ్రాసిన కీర్తనలు మొదలగు నవి —

అచలబోధకు గౌరవము కలిగించినవారు పోకల శేషాచలం నాయుడుగారు. వీరు అచలగురు పీఠాధిపతులలో ఒకరు. వీరి కీర్తి యిప్పటికి ఆంధ్ర దేశమున కలదు. వీరికి శిష్యు లనేకులు. వీరును, వీరి శిష్యులును వ్రాసిన గ్రంథములు కొన్ని గలవు. వీరి శిష్యులలో నొకరగు భోజరాజనువారు ఆదవని (ఆదోని)లో 1905 సంవత్సరమున సమాధి నొందిరట. వీరివలనను వీరి శిష్యులవలనను అచల బోధను తెలిసికొన్నవారు ఆదోని తాలూకాలో సుమారు ఇరువది వేలమంది కలరని వింటిని. బెంగుళూరునందు సుమారు రెండువేలమంది అచలవాదులు కలరట. శేషాచలం నాయుడుగారి శిష్యులు మద్రాసు నగరమున పెక్కుండ్రు కలరని వినియున్నాను.

చిత్తూరు జిల్లా వడమాలపేట అను గ్రామములో ఒక గురు పీఠమున్నది. వీరు బోధించునది శ్రీ శివరామ దీక్షితుల అచల బోధనే యని యందురు. వీరికి సుమారు రెండువేల మంది శిష్యులు గలరట.

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో శ్రీ శివరామ దీక్షితుల అచలగురు పీఠమున్నట్లు తెలియుచున్నది. ఈ పీఠాధిపతులు శ్రీ కూరాకుల రంగనాథ పంచదశీ స్వాములవారట.

నెల్లూరునందు ఒక అచలగురు పీఠముండెనేమో యని నా యనుమానము. నెల్లూరు పాటిబండ్ల సుందరరామయ్యగారను వారు 'రాజయోగ శతకము'ను, 'పాటిబండ్ల సుందరరామ శతకము'ను, మఱికొన్ని శతకములును, ద్విపదలను వ్రాసి ముద్రించిన ఒక సంపుటిని నేను చదివితిని. తమ మార్గము అచలమార్గమని వారు చెప్పుకొనిరి. వారి కాలము-

"శాలివాహనశకము చనిన వర్షంబులు
వేదరస ఋషి చంద్ర విధము దనరు"

అని చెప్పియున్నందున శా. శ. 1764లో ఆ గ్రంథమును రచియించిరి. సుమారు యిప్పటికి 137 సంవత్సరముల క్రిందట వ్రాయబడినవి.

కడపజిల్లా. ప్రాతకడపకు చెందిన మోడమీదిపల్లెలో శ్రీ శివరామదీక్షితుల అచలపీఠ మొకటి యున్నది. ఈ పీఠాధిపతి కీర్తిశేషులు శ్రీ కడిమెల్ల నరసరాజు. వీరు నాకు మిత్రులు, నిరాడంబరులు, శాస్త్ర పరిచయము కలవారు. సత్ప్రవర్తకులు, వీరికి శిష్య సంగ్రహామునందు వాంఛ లేదు. వీరికి ఒక్కడే శిష్యుడు. నరసరాజుగారికిని నాకును తరచుగా వేదాంతచర్చ జరుగుచుండెను. వారు కీర్తిశేషులగు వఱకు మా మైత్రి స్థిరముగా నుండెను,

సికిందరాబాదులో పొన్నాల రాజయ్యగారను శ్రీ దయానంద పొన్నాలరాజయోగి గారొకరు కలరు. వీరును

శివరామ దీక్షితులవారి అచలగురుపీఠాధిపతులలో ఒకరని ప్రసిద్ధి. వీరికి శిష్యులనేకులు కలరు. వీరును వీరి శిష్యులును కొన్ని గ్రంథములు రచియించిరి. ఇటీవల ఒకనాడు నామిత్రులొకరు "రాజయోగి" అను వేదాంత మాసపత్రిక నొక సంచిక నిచ్చిరి. అట్టి మాసపత్రిక ఒకటి కలదని నాకప్పుడే తెలిసినది. ఆ సంచిక 15-2-1966 తేదిన వెలువడినది. దానిని చదివితిని. అందలి సారాంశము యీ క్రింద సంగ్రహముగా వ్రాయుచున్నాను.

శ్రీ శివరామదీక్షిత గురు పీఠమను పేరు చెప్పుకొనుచు సికిందరాబాదు వాస్తవ్యులు (మాజీమంత్రి) అరిగె రామస్వామిగారు శిష్యులను చేర్చుకొని "దాసబోధ" వంటి యితర బోధలు చేయుచున్నారని, రామస్వామిగారు ఆ విధముగా చేయుటకు వారికి హక్కు లేదని, శ్రీ శివరామ దీక్షిత గురు పీఠమున్నదని, ఆ పీఠమునకు శ్రీ దయానంద పొన్నాల రాజయోగిగారు అధిపతులని, ఆవిధముగా కోర్టువారు తీర్మానించుచూ, అరిగె రామస్వామిగారి, పై చర్యలను నిషేధింపవలయునని శ్రీ రాజయోగిగారు వారి పీఠము సమీపమున డిస్ట్రిక్టు మున్సిఫ్ కోర్టులో దావా వేసిరి. ఆ కోర్టువారు ఆ దావాను విచారించి తీర్పులో "రాజయోగిగారికి పీఠాధిపత్య మీయబడిన యంశము ఋజువు కాలేదని" దావాను త్రోసివేసిరి. రాజయోగిగారు ఆ తీర్పుపై జిల్లాకోర్టు అప్పీలు చేసిరి. ఆ కోర్టువారును, అప్పీలును త్రోసివేసిరి. జిల్లా జడ్జిగారి తీర్పుపై రాజయోగిగారు హైకోర్టులో అప్పీలు చేసిరి. హైకోర్టులోను అప్పీలును త్రోసివేయుటచే రాజయోగిగారికి మూడు కోర్టులలోను ప్రతికూలమైనది. కాని, హైకోర్టు

తీర్పునందు కొన్ని వాదనాంశములు రాజయోగిగారికిని, కొన్ని యంశములు రామస్వామిగారికిని అనుకూలముగా ఉన్నవట. హైకోర్టు తీర్పును గుఱించి రాజయోగిగారికిని, రామస్వామిగారికిని వాదోపవాదములు గ్రంథములద్వారా జరిగినవట. ఇరువురును జయము తమదేనని యూరేగింపు లుత్సవములు జరుపుకొనిరి. ఈ విధముగా శివరామ దీక్షితులవారి అచలవాదము రచ్చకెక్కె, వీధికెక్కె, మూడు కోర్టులకెక్కె-నది.

10. బోధగురువులు, బాధగురువులు

అచలబోధను బోధింతుమని 'గురువుల'మని చెప్పుకొనువారిలో పెక్కండ్రు దీనిని వ్యాపారపద్ధతిలో ద్రవ్యార్జన కొరకు సాధనముగా ఉపయోగించుకొనుచున్నారు. కొందఱు గౌరవ ప్రతిష్ఠల కొఱకు యీ వృత్తి నవలంబించి యున్నారు. ఎవరో ఒకరిద్దరు పెద్దలు సంసారమునుండి ముముక్షువుల నుద్ధరింపవలెనని కరుణతో యీ బోధ చేయుచున్నారు. గురువుల యొద్దకుపోయి కారణము పొందు శిష్యబృందమునందు కొందఱు డాంబికులు తాము గురువునద్ద "కారణము" (ఉపదేశము) బొందితిమని, పరమార్థ మెఱిగితిమని, లోకుల మెప్పునకు నటింతురు. మఱికొందరు నిజమైన జిజ్ఞాసువులు, ముముక్షువులుకలరు. వారిలో పెక్కండ్రు వారి పురాకృత దుష్కృతమువలన బోధగురువుల నాశ్రయింపక బాధగురువుల నాశ్రయించుచున్నారు. వారిని చూచిన నాకు పరితాపము కలుగును. భగవంతుడు వారికి మంచి మార్గమును చూపుగాక. ముఖ్యముగా అట్టి వారికి యీ గ్రంథము (బ్రహ్మజిజ్ఞాస) సరియైన మార్గము చూప

మొదలగు వాటిని చెప్పినప్పుడు, ప్రతిదానియందును, స్వాధ్యాయ, ప్రవచనములు విడువక చెప్పియున్నందున, అధ్యయన అధ్యాపనములే ముఖ్యములని ముద్గలవంశీయుడగు మౌద్గల్యుడు చెప్పెను. అదేతపస్సు. సత్సాంగత్యము వలన కూడ క్రమముగా ముక్తి లభింపవచ్చును.

12. "మాలపల్లి (సంగవిజయము)"

ఉన్నవ లక్ష్మీనారాయణగారు మహాశయులు. వీరు 'మాలపల్లి' (సంగవిజయము) అను ఒక గ్రంథమును వ్రాసిరి. దానిని నవలయందురు. అది నవలయో, కావ్యమో గాని నేను దానిని ధర్మగ్రంథమనియు, అందు లౌకికములగు సాంఘిక, రాజకీయ, శృంగారాదులగు విషయములేగాక, ముఖ్యముగా మోక్షధర్మము సయితము చెప్పబడియున్నదని నా యభిప్రాయము. ఆ గ్రంథమున కథానాయకుడు రామదాసు(హరిజనుడు) గురుముఖమున అచలబోధను తెలిసికొన్నట్లున్నది. అందులోని పాత్రలలో ఒకరు అచలయోగి బుచ్చయ్య పంతులుగారు. శుకమహర్షి వంటివారు. రామదాసుయింటిలో యీ క్రింద చెప్పబడిన గ్రంథములున్నట్లు ('మాలపల్లి') యందు వ్రాయబడియున్నది. ఆ గ్రంథనామము లివి :-

"వెంగమ్మగారి రాజయోగసారమూ, శేషాచలం నాయుడుగారి పరమపదమార్గమూ, సిద్ధప్పగారి తత్త్వాలూ, కోటయ్యగారి గురుకీర్తనలూ, శివరామ భాగవతులవారి తత్త్వకందార్థాలూ, వీరయ్యగారి యాలలూ, సీతారామాంజ

మొదలగు వాటిని చెప్పినప్పుడు, ప్రతిదానియందును, స్వాధ్యాయ, ప్రవచనములు విడువక చెప్పియున్నందున, అధ్యయన అధ్యాపనములే ముఖ్యములని ముద్గలవంశీయుడగు మౌద్గల్యుడు చెప్పెను. అదే తపస్సు. సత్సాంగత్యము వలన కూడ క్రమముగా ముక్తి లభింపవచ్చును.

12. "మాలపల్లి (సంగవిజయము)"

ఉన్నవ లక్ష్మీనారాయణగారు మహాశయులు. వీరు 'మాలపల్లి' (సంగవిజయము) అను ఒక గ్రంథమును వ్రాసిరి. దానిని నవలయందురు. అది నవలయో, కావ్యమో గాని నేను దానిని ధర్మగ్రంథమనియు, అందు లౌకికములగు సాంఘిక, రాజకీయ, శృంగారాదులగు విషయములేగాక, ముఖ్యముగా మోక్షధర్మము సయితము చెప్పబడియున్నదని నా యభిప్రాయము. ఆ గ్రంథమున కథానాయకుడు రామదాసు(హరిజనుడు)గురుముఖమున అచలబోధను తెలిసికొన్నట్లున్నది. అందులోని పాత్రలలో ఒకరు అచలయోగి బుచ్చయ్య పంతులుగారు. శుకమహర్షి వంటివారు. రామదాసుయింటిలో యీ క్రింద చెప్పబడిన గ్రంథములున్నట్లు ('మాలపల్లి') యందు వ్రాయబడియున్నది. ఆ గ్రంథ నామము లివి :-

"వెంగమ్మగారి రాజయోగసారమూ, శేషాచలం నాయుడుగారి పరమపదమార్గమూ, సిద్ధప్పగారి తత్త్వాలూ, కోటయ్యగారి గురుకీర్తనలూ, శివరామ భాగవతులవారి తత్త్వకందార్థాలూ, పీరయ్యగారి యాలలూ, సీతారామాంజ

నేయ సంవాదమూ, బుచ్చయ్యగారి సాధన చతుష్టయమూ, శ్రీరామశాస్త్రిగారి భక్తియోగము.”

ఇవే అచలగ్రంథములు. కాని యిందులో శ్రీశివరామదీక్షితుల, శ్రీకృష్ణదాసుగార్ల మార్గము వేఱు. తక్కినవారి మార్గము వేఱు. ఈ విధముగా ఉన్నవ లక్ష్మీనారాయణగారు తమ ‘మాలపల్లి’ ద్వారా అచలబోధయను వేదాంతమొకటి ఆంధ్రప్రదేశమున ఉన్నట్లు విద్యార్థులకు యెఱుకపరచిరి. ‘మాలపల్లి’ రెండవభాగమునందలి మూడవప్రకరణమునకు “అచలబోధ” అను శీర్షిక నిడిరి. ఆ ప్రకరణమునందు, వీరబ్రహ్మస్వాములవారు, యాగంటి లక్ష్మయ్యగారు, నాసరయ్యగారు, చెప్పిన తత్త్వములను మాత్రమే ఉదాహరించియున్నారు. నాసరయ్యగారనగా — నాసరు మహామద్‌గారు. వీరి గురువు గాలబ్ సాహెబ్‌గారు. వీరి నామములబట్టియే వీరు జన్మతో ముసల్మానులని తెలిసికొనవచ్చును. వీరి కీర్తనలు కొన్ని చదివితిని. అవన్నియు అద్వైతమునే బోధించును. శివరామదీక్షితులవారి బోధను ఆ ప్రకరణమున యించుకైనను వ్రాయలేదు. ‘మాలపల్లి’ ద్వారా అనేకులకు అచలబోధ యొకటి యున్నట్లు తెలిసినను, దాని స్వరూపమెట్టిది? అను విషయము పండితులలో సయితము అనేకులకు తెలియదు.

13. ఈ గ్రంథమున అచలబోధ ప్రసక్తి

ఈ గ్రంథముయొక్క ప్రథమభాగమునందలి మొదటి ప్రకరణమున 15-వ అధ్యాయమునకు “అచలవాదము” అను శీర్షిక నిడితిని. దానిని చదివినవారిలో కొందఱు

"అచలబోధ" అని 'బ్రహ్మజిజ్ఞాస' ప్రథమభాగమున మీరు వ్రాసితిరే — అది యెట్టిది? దాని కాధారమైన గ్రంథము లేవి?" అని నన్ను ప్రశ్నించిరి. ఇట్లు ప్రశ్నించిన వారిలో ఒక స్వాములవారు (సన్న్యాసి) కూడ కలరు. వీరి కొక పెద్ద ఆశ్రమము శిష్యకోటి కలదు. అట్టి గొప్పవారని పించుకున్న వారికే అచలబోధనుగూర్చి తెలియనప్పుడు, దానినిగూర్చి తప్పక వ్రాయుట యుక్తమని తలంచితిని. అద్వైతమునకంటె అచలబోధ గొప్పదేమో అను అభిప్రాయము కొందరికి కలదు. నాకు తెలిసి సుమారు అర్ధశతాబ్దముగా యీ యభిప్రాయము అప్పుడప్పుడు ప్రచారములో కలదు. ఇట్లనుటకు కొన్ని కారణములు కలవు. కనుక, ఆ యంశములను యీ గ్రంథమున సంగ్రహముగనైనను పఠింపక పోయితిరేని "బ్రహ్మజిజ్ఞాస" సంపూర్ణ వేదాంత గ్రంథ మనిపించుకొనదు.

14. అద్వైతమునకు అచలము పైమెట్టుకాదు

దృష్టిసృష్టివాదమును బోధించు యోగవాసిష్ఠము* అద్వైతమునకు పైమెట్టని కొందరియందు ఒక అభిప్రా

* యోగవాసిష్ఠము 32 వేల శ్లోకముల గ్రంథమని తొలుత చెప్పి యుంటిని. (శ్రీ) ము. నాగలింగశాస్త్రులు గారు, దానియందలి అరణ్య వర్ణనాదులను అనేక శ్లోకములు వదలి తక్కిన గ్రంథమును "జ్ఞాన వాసిష్ఠము" అను పేర ఆరువేల శ్లోకములును, వాటికి తాత్పర్యమును రచియించిరి, దానిని "లఘుయోగవాసిష్ఠము" అనికూడ అందురు. దానిని "వావిళ్లవారు" ముద్రించిరి. అది యోగవాసిష్ఠమునకంటె

యముకలదు. ఈ యభిప్రాయము ఎట్లు వ్రాసినదో తెలియదు, ఈ విషయమున కొందఱు పండితులు సహితము పొరపడుచున్నట్లున్నది. ఉదాహరణమునకు — 'భారతి' మాసపత్రిక 1960 జూన్ నెలలో వెలువడిన సంచికయందు ఒక అచలగ్రంథము సమీక్షింపబడినది. సమీక్ష వ్రాసినవారు — అద్వైతమునకు అచలము పై మెట్టని కొందఱు పెద్దల అభిప్రాయము — అను అర్థమిచ్చు వాక్యములను వ్రాసినట్లు నాకు జ్ఞాపకమున్నది. ప్రస్తుతము ఆ 'భారతి' సంచిక నావద్ద లేదు. సారాంశమేమనగా :— 'భారతి' వంటి సుప్రసిద్ధ పత్రికకు సమీక్ష వ్రాయువారు గొప్ప పండితులే అయియుందురు. అంతగొప్ప పండితులకు సహితము ఇట్టి సంశయమెట్లు కలిగినది? అందుకు కారణము ఈ క్రింది సందర్భమును బట్టి ఉండునేమో అని నా అనుమానము. పోతులూరు వీరబ్రహ్మయ్యగారు యోగవాసిష్ఠమునకు చెందిన తత్త్వవాది. వారి శాస్త్రీయ విచారమునకు ఆధారము యోగవాసిష్ఠము. వారి అనుష్ఠానపద్ధతి పాతంజల రాజయోగము. యోగవాసిష్ఠమునందు సయితము యోగము విస్తరించి చెప్పబడినది. అచలవాదమునకు స్త్రీ శూద్రాలు కూడ అధికారులే యనుటవలన అచలబోధ గొప్పదను భావము కలుగుటకు అదియు ఒక కారణమై యుండవచ్చును. వీర

యెక్కువ ప్రచారమునకు వచ్చినది. యోగవాసిష్ఠమునందలి శ్లోకములు జ్ఞానవాసిష్ఠమునందు మార్పు చేయలేదు. — యోగవాసిష్ఠమునకంటెను వేఱగు "గురుజ్ఞానవాసిష్ఠము" అను వేఱొక గ్రంథము కలదు. దానిని నేను చూడలేదు. దక్షిణామూర్తి కృతమని చెప్పబడు భావార్థదీపికయు, భావార్థసూత్రములు కలవట.

బ్రహ్మయ్యగారివంటి పెద్దలవలన సాధువులలో కొంత ప్రచారము జరిగి అద్వైతమునకంటె అచలబోధ పైమెట్టను అభిప్రాయము అవిచారమువలన క్రమముగా ప్రబలుచు వచ్చినది. అప్పటికి శివరామదీక్షితులవారు జన్మించియుండలేదు. అందువలన యిందులో యేమైన ఘనత యున్న యీ ఘనత ప్రథమమున వారికి చెందినది కాదు. కనుక, శివరామదీక్షితులవారి అచలబోధ అద్వైతమునకంటె పైమెట్టని కాని, అద్వైతమునకంటె శ్రేష్ఠమని కాని చెప్పుట సరి కాదు.

అచలవాదులు తమ బోధ శక్త్యాద్వైతమునుండియు, బౌద్ధమతమునుండియు, కాలక్రమమున అచ్చటచ్చట కొన్ని మార్పులతోను చేర్పులతోను యీ రూపమును ధరించినదని వారెఱుగరు. ఈ గ్రంథ భాగముయొక్క రెండవ ప్రకరణము చదివిన ఎఱుగవచ్చును. ఏది యెట్లున్నను, కొందఱు జిజ్ఞాసువులకు దీక్షితులవారి అచలవాదమునందు వ్యామోహమెందుకనగా ? —

15. సహజము - ప్రయత్నము

మానవులలో అధికసంఖ్యాకులు తాము చేరదలచిన చోటునకు రాజమార్గమున్నను అది కొంతదూరము ప్రయాణము చేయవలసి యున్నచో దగ్గరత్రోవను వెదకుదురు. దగ్గరత్రోవ గమ్యస్థానమును చేర్చునా, లేక ఒక మహారణ్యమునకు కొనిపోవునా ? అని యోచింపనివారును కలరు. దగ్గరత్రోవ కంటకావృతమైనను సరకుచేయరు. గమ్యస్థానమును త్వరగా చేరుదుమన్న ఆశ (ఆతురత) వారినట్లు ప్రేరేపించును. ఇది లౌకిక విషయము. ఈ భావము ముముక్షు

ప్రళయమందును కలదు. సాధన చతుష్టయమును సాధించిన పిమ్మట వేదాంతశాస్త్ర శ్రవణము, మననము, నిదిధ్యాస మొదలగునవి అలవరచుకొనక బ్రహ్మానుభవము కలుగని శాస్త్రములు, పెద్దలు చెప్పియున్నందున, ఇన్ని శ్రమలకోర్చి చేసిన సాధనవలన యీ జన్మముననో, రాబోవు జన్మముననో, మోక్షము కలుగుననియు, నిరుత్సాహముతో నెట్టి కష్టములు లేక మోక్షమును సాధించు దగ్గరత్రోవ యేదైన కలదా? అని యోచించును. విచారింపగా ఉన్నదని గురువు నాశ్రయించిన ఒక్కదినముననే బ్రహ్మమును పొందవచ్చునని వినును. దానితో ఆ ముముక్షువునకు ఒకవిధమగు ఊరట (సంతృప్తి) కలిగి, ఒక గురువు నాశ్రయించును. గురువు "అదిగో బ్రహ్మము (అచలము) అని చూపును. ముముక్షువు దానితో తృప్తిపొందును. అతనికి బ్రహ్మమేదో, అది యెట్లుండునో, తెలిసికొనుటకు శాస్త్రజ్ఞానము లేదు. గురువు చెప్పినది నమ్మును. — సాధారణముగ లోకుల యొక్క పోకడ యీ క్రింద చెప్పబోవువిధమున నుండును :-

ఒకగొప్ప శ్రీమంతునిభార్య బంగారు వజ్రాభరణములు ధరించును. పట్టుచీరలు కట్టును. ఆమె యెదురింటి గృహిణి సామాన్యకుటుంబమునకు చెందినది. ఆమెకు ఆమె ఎదురింటి శ్రీమంతురాలు ధరించిన వస్త్రాభరణములు కొనిపెట్టుమని తనభర్తను కోరును. వానివిలువ తెలిసిన ఆమె భర్తకు తనభార్య కోర్కెను తీర్చుట అసాధ్యమని తెలియును. కాని, ఇల్లాలి అభీష్టసిద్ధికి దగ్గరత్రోవ వెదకును. వజ్రములకు మారుగా రంగూన్ వజ్రములు (Artificial diamonds) కలవు. అవి కృత్రిమమైనవి. సహజ వజ్రముల

వలెనే కనబడును. అతడు వానినికొని బంగారమునందు పొదిగించి కంఠహారము చేయించును. ఆ గృహిణి దానిని ధరించును. ఎదురింటి శ్రీమంతిభార్య కంఠమునందుగల వజ్ర హారమునకును, తనకంఠమునగల కృత్రిమ వజ్రహారము నకును గల భేదము ఆ గృహిణికి తెలియదు. ఆమెవలెనే పామర (సాధారణ) జనులనేకులు తెలిసికొనజాలరు. కృత్రిమ వజ్రహారముతో ఆ గృహిణి తృప్తిచెందును. ఏమైనను తృప్తియే ప్రధానముకదా? బీదవారు బంగారమునకు మారుగ గోమ్మిత్తలి సొమ్ములు ధరింతురు. పట్టువస్త్రము లకు మారుగ రాతిపట్టు (Ar ificial Silk) వస్త్రములు ధరించి తృప్తిచెందుదురు. ప్రాపంచిక వ్యవస్థలో యిది తప్పుకాదు. పారమార్థిక వ్యవస్థలో యిట్టిది చాల తప్పేయగును. ఇంతటి ప్రమాదము మఱియొకటి యుండదు. ప్రస్తుత సమాజమున విలువగల ప్రతి పదార్థమునకును ప్రత్యామ్నాయముగ (పోటీగా) వేలాది చౌకబారు (తక్కువ వెలగల) పదార్థ మును చేసియున్నారు. ఆ యా పదార్థముల విలువను తెలిసి కొనిన కొందరు వ్యక్తులకు తప్ప తక్కిన వారికి, సహజము లేవి? కృత్రిమము లేవి? అను భేదము తెలియనట్లే — పరతత్త్వ మిట్టిదని తెలియని గురువులచెంత చేరి వారు చెప్పినదే నిజమని నమ్ముచున్నారు. "కాననివాని నూతగొని కాననివాడు విశిష్టవస్తువుల్ కాననిభంగి" అను ప్రహ్లాదుని ప్రవచనము ఇట్టివారియెడ సార్థకమగుచున్నది.

లౌకికవిషయములయందు సహితము ఒక చిన్నతప్పు పెద్దకష్టమునకు కారణమగుచున్నది. ఇందుకు ఒక దృష్టాంత మును చెప్పెదను :—కడప రైల్వేస్టేషన్ లో మధ్యాహ్నము

మద్రాసునుండి బొంబాయికి పోవు రైలును, బొంబాయినుండి మద్రాసుకు పోవు రైలును వచ్చి అచ్చట కొంతసేపు నిలిచి యుండును. పల్లెటూరి ఒక అమాయకుడు మద్రాసునకు పోవదలచి టికెట్టుకొని అచటనున్న తనవలెనే తెలియనివాని నొకని "మద్రాసునకు పోవు రైలు యేదని" అడిగిన, అడుగబడినవాడు బొంబాయికి పోవు రైలును చూపెనను కొనుడు, ఆ ప్రయాణికుడా మాటను నమ్మి బొంబాయికి పోవు రైలులో కూర్చుండి బొంబాయిని చేరి అచ్చట ఎట్టి యిడుములపాలగునో — పరమపదమును చేరగోరినవాడు, తెలియనివానిని గురువుగా నమ్ముకొనిన, అంతకంటె గొప్ప దుర్దశనే పొందును.

ఇంద్రియనిగ్రహము మొదలగుశ్రమలులేకయే బ్రహ్మమును చూపెదమని చెప్పెడివారిలో శివరామదీక్షితుల కోవకుచెందిన కృష్ణదాసుగారు రచియించిన ఒక కీర్తనలో కొంతభాగమును, యీ క్రింద నుదాహరింతును. దానివలన వారి బోధ యెట్టిదో బోధపడును.

పల్లవి

"నరులార విని కనుడీ - అరమరలేని యీ
పరిపూర్ణమగు బోధను. భవాంబుధి తరియింతు - రిటమీదను.
... ...
చదువులలోపలి తుది యర్థమగు దీని
మరుగు దెలియని వారలు.
హృషీకముల కుదియింపగా బోదురు
విషయేచ్ఛల వదలియుండ దలతురు

సంపదగలవారికి కష్టము. వసిష్ఠమహర్షి శ్రీరామున కిట్లుపదేశించెను :—

శ్లో॥ ఉపదేశక్రమో రామ వ్యవస్థామాత్ర పాలనం,
జ్ఞప్తేస్తు కారణం శుద్ధా శిష్యప్రజ్ఞైవ కేవలా. (జ్ఞా. వా. 37-131)

తా॥ ఓ రామచంద్రా గురువువలన ఉపదేశింపబడిన మోక్షోపాయము జ్ఞానశాస్త్రమున మర్యాదకుమాత్రమే, అనగా జ్ఞానశాస్త్రమున చెప్పబడినదానికి విరుద్ధముగాక, దాని ననుసరించియున్నదా అని సరిచూచుకొనుటకేగాని, ఆత్మసాక్షాత్కారము కలుగవలయునన్న కేవల గురూపదేశముమాత్రమే చాలదు. శుద్ధమగు శిష్యునిబుద్ధియే సమర్థమైయున్నది.

భారతీయ సంస్కృతి హిందూమతమునందలి గొప్పతనమేమనగా :— మన మతతత్త్వమును అందఱికి సరిపడునట్లు వివిధమానముల పెక్కురీతుల కుట్టి సిద్ధముగా ఉంచిన వస్త్రాలయము (Readymade shop)తో పోల్చవచ్చును. అనగా: పిల్లలు, పెద్దలు, స్థూలకాయులు, బక్కచిక్కినవారు, పొడుగువారు, పొట్టివారు మొదలగువారు వస్త్రాలయమునకు పోయిన వారివారికి చక్కగా సరిపడునట్టి వస్త్రములను ఎన్నుకొని సంతసింతురు. అట్లే సంఘమున భిన్నభిన్న సంస్కారములుగల వ్యక్తులు అధికారిభేదమునుబట్టి మంత్రజపమో, దానమో, ధ్యానమో, సాకార సగుణభక్తియో, తత్త్వజ్ఞానమో యేదియో యొకదాని నవలంబించి క్రిందివారు క్రమముగా యీ జన్మముననో రాబోవు జన్మముననో తత్త్వజ్ఞానులై ముక్తులగుటకు అవకాశమున్నది. క్రైస్తవ

మతములవంటి మతములలో అందఱికి ఒక చొక్కానే కుట్టి పెట్టి యున్నట్లు, అక్కడ అధికారిభేదమునకు తగినట్లు లేదు. (ఈ వాక్యములు క్రైస్తవమతమునకేగాని, శ్రీక్రీస్తుప్రభువున కన్వయించవు. ఆయన అద్వైతి.) ఈ యంశమును చక్కగా శ్రీకృష్ణభగవానుడు గీతయందు ఇట్లుపదేశించెను :—

అర్జునా! కర్మయందాసక్తులైన అజ్ఞానులకు బుద్ధిభేదమును కలిగింపరాదు. అనగా — యజ్ఞ, యాగ, తప, జపాదులవలన ప్రయోజనము లేదని వారిని వాటినుండి మరలింపరాదు. జ్ఞానియు కర్మలను చేయుచునే అజ్ఞానులవలనగూడ కర్మలను చేయింపవలయును. (గీత. 3-25, 26)

పై యంశమును యీ భాగమునందలి రెండవ ప్రకరణమున దీక్షితులవారు చేసిన "మతనిరసనము" అను 29-వ అధ్యాయమున చర్చించితిని. శివరామదీక్షితులవారికి లభించిన "అచలమార్గము" బ్రహ్మాదులకు సైతము లభింపలేదట. భగవంతుడగు శివుడుకూడ యీ మార్గమును తెలియక అనేక అగచాట్లు పడుచున్నాడట. ఇట్టివి రెండవ ప్రకరణమున చదువగలరు. పాఠకమహాశయులు అచ్చట యీ వాక్యములు చదివినపిమ్మట, ఇది హిందూమత తత్త్వమా? కాదా? అని వారే నిశ్చయించుకొనగలరు.

శ్రీరామకృష్ణపరమహంస, శ్రీరామతీర్థస్వామి మున్నగు మహాత్ములు ఆత్మసాక్షాత్కారమునకొఱకు అనేక కష్టములను అనుభవించినట్లు వారి జీవితచరిత్రలయందు మనము చదివియుండలేదా? వైరాగ్యము మోక్షసౌధమునకు పునాదివంటిది. గురువు చూపినదే పరతత్త్వమని,

అంతకుపైన ఏమియు లేదని కొందఱు శిష్యులు సంతృప్తి చెందుదురు. ఈ సందర్భమున ఒక మాట చెప్పవలసియున్నది. ఏమన :— వారిగురువు వారిని మోసగించెనని నే ననను. అతడును అతని గురువువలన తెలిసికొని నమ్మియున్న వదే కావచ్చును. కాని, గురువు లనిపించుకొనుచుండువారు వారందఱు అట్టివారు కారు. కొందరు తమకు పరతత్త్వము తెలియదని తెలిసియును. ద్రవ్యార్జనకొఱకు అమాయకులను మోసగించుచుందురు. గురుకృపవలన ఒక్కదినములో బ్రహ్మమును (అచలమును) సాధితిమని తృప్తి చెందిన ముముక్షువులలో కొందఱితో నాకు పరిచయమున్నది. ఈ చతుర్థభాగమును శ్రద్ధతో పఠించినవారికి సహజమేదో కృత్రిమము (నకిలీ) యేదో తెలియగలదని ఆశించుచున్నాను. ఏ ఒక్క ముముక్షువునకైనను ఈ గ్రంథమును చదువుట వలన మేలుకలిగెనేని నా శ్రమ సార్థకమగును. పరమేశ్వరు డట్లనుగ్రహించుగాక.

కొందఱు అచలగురువులు తమకు శిష్యులు కాబోవు వారికి ఉపదేశము చేయుటకు ముందు తాము (గురువు) చెప్పబోవు రహస్యమును, ఇతరుల కెఱిగింపరాదని శిష్యునిచేత ప్రమాణమును చేయింతురు. కొందఱు పాత్రలో పాలుపోసి దానిని శిష్యుడు కాబోవు వానిచేతిలో పెట్టి ప్రమాణము చేయింతురు. ఈపద్ధతులు ఒక్కొక్క రొక్కొక్క విధముగా చేయింతురని వింటిని. కొందఱు ప్రమాణమును చేయింపరుగాని, "ఈ గురు గుహ్యమును యితరుల కెఱిగించిన గురుద్రోహ మహాపాతకము కలుగుననియు, కులక్షయమగు" ననియు భయమును కలిగింతురు. అచలవాదులను ఎవరైన

యేదైన ప్రశ్నించిన "మాకు అధికారము లేదు. మా గురువుగారి దగ్గరకువెళ్లు" మందురు. ఆవిధముగా వారు కనుగొన్న అచలము ఉపనిషత్తులు చెప్పిన పరబ్రహ్మముగునో కాదో పరిశీలించుకొనుటకు వారికి అవకాశము లేదు.

16. ఈ గ్రంథరచన

బ్రహ్మజిజ్ఞాస ప్రథమభాగము శాంకర తత్వమును తెలియజేయును. ద్వితీయభాగము పంచవిధ మోక్షోపాయముల తెలియజేయును. అనగా — జ్ఞానయోగ, రాజయోగ, కర్మయోగ, భక్తియోగ, ప్రపత్తి — ప్రపంచమున గల యే ఆస్తికమతమైనను, ఈ పంచవిధ మోక్షోపాయములలో చేరియే యుండును. ఆయా మతముల వారుపయోగించు పేర్లు భిన్నములు కావచ్చును, సాధనములు యేకీభవించును. — తృతీయభాగము షడ్దర్శనములను, షణ్మతములను వివరించును. ఇందులో భారతీయ తత్వమంతయు సంగ్రహించి చెప్పబడినది. — చతుర్థభాగము - తమ హస్తమునందున్నందున ప్రత్యేకించి చెప్ప నవసరము లేదు మొత్తము గ్రంథమంతయు పదునాలు ప్రకరణములు కలవు. సుమారు. 2000 పుటలకు పైబడును. ఇందులో పత్రికలు, పెద్దలు, ఈ గ్రంథమును గురించి వ్రాసిన అభిప్రాయములు, సమీక్షలు ముద్రించియుండు పుటలసంఖ్య చేర్ప లేదు.

ఈ చతుర్థభాగమునందు మొదటి ప్రకరణమున — శ్రీ జ్ఞానేశ్వరులవారి అమృతానుభవమును గురించి నాకు సమగ్ర వివేకము లేకపోయినను వారి అమృతానుభవము నందు ప్రధానముగా శ్రీశంకరభగవత్పాదుల మాయావాద

ఖండనమే యున్నందున వారివాదము (మాయావాద ఖండనము) శాస్త్ర విరుద్ధమని శాస్త్రప్రమాణములను చూపి నిరూపించితిని. శ్రీ జ్ఞానేశ్వరులు, శ్రీ అరవిందులు, శ్రీ సమర్థ రామదాసస్వామి, యోగవాసిష్ఠకర్త వీరు రచియించిన శివ-శక్తి తత్త్వములను సంగ్రహముగ వివరించితిని.

రెండవ ప్రకరణమున శివరామదీక్షితులవారి అచలబోధను గురించి తెలిపితిని. దీక్షితులవారి అచలబోధ సుమారు రెండువందల సంవత్సరములుగ అచ్చటచ్చట తొలుత స్వల్పముగను, రానురాను అచ్చటచ్చట ఇంచుక ప్రబలముగను వ్యాప్తిలోనికి వచ్చుచున్నది. బ్రహ్మవాదులు దానిని సాంగోపాంగముగ పరిశీలించి దాని స్వరూపమిట్టిదని యింతవఱకు లోకము నెఱుకపెట్టి యుండలేదు. ఆంధ్రప్రదేశమున వేదాంతమును నాకంటె గొప్పగ తెలిసిన పెద్దలున్నను, వారు దీక్షితులవారి అచలబోధను గడ్డిపోచను చూచినంత చులకనగా చూచి మాటలతో త్రోసివేసిరే కాని గ్రంథరచన చేయలేదు. అందులకు కారణము వారు (వేదాంతులు) దీక్షితులవారి యొక్కయు, వారి శిష్యుల యొక్కయు గ్రంథములను తుచ్ఛములని తలచుటచేతనో, లేక అలసత్వమువలన చదువకనో అచలమత పరిశీలనము చేయు గ్రంథములను రచియింపక కాలము గడచిపోయి యుండవచ్చును, ఎవరో ఒకానొకరు చదివినను సరియైన దృష్టితో చదివి అవగాహన చేసికొనక దీక్షితులవారిని వారి అనుయాయులను విమర్శించి వారివలన నిందింపబడిరి. అట్టి రచనల వలన వ్రాసినవారికిగాని, లోకమునకుగాని యెట్టి మేలును చేకూరక పోయినది. దీక్షితులవారు వేదాంతులను హిందూ

మత సంప్రదాయములను పెక్కురీతుల నిందించి పాఠకులను రెచ్చగొట్టునట్టి వాక్యము లనేకములను వ్రాసియున్నను, ఎవరి పాప పుణ్యములను వా రనుభవింతురని శాంత చిత్తముతో శాస్త్రోచితవిధానమున సమాధాన మిచ్చితినేగాని శ్రీ దీక్షితులను నేను నిందింపలేదు.

శ్రీ శివరామదీక్షితులు వ్రాసిన, వారి "బృహదద్వైత సిద్ధాంతము" నందు మొదటి నుండి తుదివఱకును అద్వైత నిరసనమును ప్రధానాంశముగా గైకొనియున్నారు. అదియు శాస్త్ర ప్రమాణముల చూపకయే వారి యిష్టము వచ్చినట్లు నిందించిరి. శ్రీ శంకరభగవత్పాదులను పలుచోట్ల నిందించిరి. శ్రీ శంకరులను, సీతాదేవిని, బ్రహ్మాదిదేవతలను నిందించిరి ఆ భాగములను రెండవ ప్రకరణమున క్రమముగా ౩౦, ౩౧, ౩౨ అధ్యాయములయం దుదాహరించి వారికి తగిన సమాధాన మొసంగితిని. ఈ చతుర్థ భాగమునందలి అచలబోధను - సుమారు ముప్పది సంవత్సరములుగా వ్యాధిపీడితుడను పాండిత్యము లేనివాడను, 76 సంవత్సరములకే వృద్ధుడ నైనట్టివాడనగు నేను వ్రాయుటకంటె — శృంగగిరి శ్రీ శారదా పీఠాధీశ్వరులును శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీ జగద్గురు శ్రీ చంద్రశేఖర భారతీ స్వామి భగవత్పాదులును, శ్రీవారి శిష్యులగు శ్రీ జగద్గురు శృంగేరి శ్రీమదభినవ విద్యాతీర్థ స్వాములవారును వారి శిష్యకోటిలోనివారి నొకరిని "అచలమత విమర్శనము చేయుమని" నియోగించి యుండిన బాగుండెడిది. ప్రాజ్ఞులెవ్వరును యీ కార్యము చేయనందున అజ్ఞుడనగు నేనే యీ కార్య మొనర్పవలసివచ్చినది. ఐనను నేను వ్యాధిచే

యింటనుండి బయట తిరుగకుండ చేయుట నా ప్రారబ్ధఫలమే అయినను కీడులో మేలునట్లు 'బ్రహ్మజిజ్ఞాస'ను వ్రాయ గలిగిన సుకృతముకూడ భగవంతుడే కలిగించినాడు.

నేను గ్రంథరచన యందవలంబించిన పద్ధతియేమన :- రైలు కమ్ములు రెండు ఒకదాని ప్రక్కన వేఱొకటి యున్నట్లు దీక్షితులవారి అచలవాదమును — వేదాంతమును ఒకదాని ప్రక్క మఱియొకదానిని వ్రాసి (చూపించి) ముముక్షువులగు పాఠకమహాశయులు యీ రెంటిలో దేనిని వారామోదింతురో చూచుకొనునట్లు వ్రాసితిని. మఱియు శ్రీ జ్ఞానేశ్వరాదులగు దర్శనకారుల తత్త్వములను కూడ అదేవిధముగ దీక్షితులబోధను ప్రక్కనే వ్రాసి, వాటితో దీక్షితులవారి బోధ యెంతవఱకు సరిపోవునో, ఎంతవఱకు విరుద్ధమగునో చూపినట్లు చెప్పితిని. ఈవిధముగ అచల పరిశీలనము నాకు తెలిసినంతవఱకు యెవ్వరు చేయలేదు. కరుణామూర్తియగు భగవంతుడు యీ క్షుద్రుని యందు తన కరుణామృతదృష్టిని ప్రసరింపజేసి వీనిని (నన్ను) ఒక సాధనముగ యీ కార్యమును చేయించెనని నా స్థిరమైన నమ్మకము. నేనీ గ్రంథమును వ్రాసితిననగా — భగవంతుడే ఈ గ్రంథరచనమునకు నన్నొక లేఖినిగా ఉపయోగించుకొని రచియించెనని నమ్మకము.

ఒక గ్రంథమును రచియించుటకుగాని, ఒక గ్రంథమునకు వ్యాఖ్యానమును రచియించుటకుగాని అవలంబింపవలసిన షడ్విధ తాత్పర్యలింగములయందు 'అపూర్వ' మను లింగముండవలయు నందురు. అచలవాద పరిశీలనమే యీ గ్రంథమునందుండు "అపూర్వము" ఈ గ్రంథమున అధి

కార చతుష్టయమును శాస్త్రోక్తక్రమమున చెప్పియున్నాను.

ఈ గ్రంథ భాగమును ముద్రించుటయందు రెండవ ప్రకరణమునందు శ్రీ శివరామదీక్షితులయొక్కయు, వారి శిష్యులయొక్కయు గ్రంథములనుండి యుదాహరించిన వాక్యములకు అక్షరములు (లిపి - TYPE) తదితర టైపుకన్నను భిన్నమైనది. అనగా: కొంచెము పెద్ద అక్షరము లుండును. ముద్రణాలయమువారు దానిని 16-వ పాయింటుటైపు అందురు. సూక్ష్మముగా చూచిన తెలియును. పాఠక మహాశయులు "ఇవి అచలవాదుల వాక్యము" లని సులభముగా తెలిసికొనవలెనని అట్లొనర్చితిని.

రెండవ ప్రకరణమున కేవలము అచలవాదపరిశీలనమేగాక ఆ సందర్భమున ఆనుషంగికముగా చెప్పవలసిన పరమార్థతత్త్వము నందలి అనేక నిగూఢ విషయములను వెల్లడించియున్నాను. మహర్షులు పూర్వాచార్యులు గ్రంథమును వ్రాయుటయందు ఒకపద్ధతిని అవలంబించిరి. ఎట్లన :- ఎవరో ఒకరు ఒకమహర్షిని ప్రశ్నించినట్లును, ఆ మహర్షి సమాధాన మిచ్చినట్లును, భారత, భాగవతాది గ్రంథములయందు చదివియున్నాము. ఆ పద్ధతిని విడనాడక యీ గ్రంథమున ఒకజిజ్ఞాసువు వేదాంతిని ప్రశ్నించినట్లును వేదాంతి చెప్పుచూ పోవునట్లును వ్రాసితిని. చతుర్థ భాగమున మొదటి ప్రకరణము రెండవ ప్రకరణమునకు ప్రవేశిక వంటిది. వేదాంతమునందు సామాన్యప్రవేశము కలిగిన వారికి యీ గ్రంథము అత్యంతోపకారి కాగలదని ఆశించుచున్నాను. ముఖ్యముగా యీ చతుర్థభాగము అచల సంప్రదాయము

నకు చెందినవారికి, అందును శివరామదీక్షితుల కోవకు చెందిన వారికి యెక్కువ ఫలకారియగునని నా నమ్మకము. సహృదయముతో వారు యీ గ్రంథమును చదువుదురని ఆశించుచున్నాను.

అచలవాదమును పరిశీలించు సందర్భమున దాని నేవిధముగానైన ఖండింపవలయునను తలంపు నాకు లేదు. శ్రీశివరామదీక్షితులయొక్కయు, కృష్ణదాసుగారియొక్కయు వాక్యముల నుదాహరించునపుడు వారిబోధస్వరూపమును తారుమారుచేయక, ఉన్నది ఉన్నట్లు, లోకమునకు చూపించుటయే నా యుద్దేశము. అట్టి సందర్భములయందు అచలవాదమునకు సమీపవర్తియగు నితరతత్త్వములను, అచలబోధను బలపరచు శాస్త్రవాక్యములను దాచుకొనక అవియే ప్రమాణగ్రంథములయందున్నవో వాటిని సైతముదాహరించియున్నాను. అందువలన నా పరిశీలనము వారికి కొంతవఱకైన తోడ్పడగలదని ఆశించుచున్నాను.

ఈ భాగమునందలి మూడవ ప్రకరణము 'ముగింపు' (ఉపసంహారము). ప్రస్తుతకాలమున సంఘమునందు స్వల్పముగ ప్రచారమునందున్న రెండు తత్త్వములను ఇందు సంగ్రహముగ వివరించితిని.

ఈ భాగమునందలి తాత్త్వికాంశములు మిగుల జటిలమైన వగుట వలన నా యజ్ఞానకృత దోషములుగాని, పొరపాటున గలిగిన లోపములుగాని, పెద్దలు మన్నింపవలెనని ప్రార్థన. ఒకవేళ తప్పులున్నయెడల దయతో నాకు తెలిపిన కృతజ్ఞతతో స్వీకరింతును. లోకమున సర్వజ్ఞుడు లేడుగదా? ఒకవేళ సర్వజ్ఞు లున్నారని అంగీకరించినను

నేను సర్వజ్ఞుడనుకాను. తనతప్పు తనకు తెలిపిన తజ్ఞులను నిందింపరాదు. మానవుడు వాని జీవితకాలమునందే తన యందలి దోషమును తాను తెలిసికొని సవరించుకొనినచో ధన్యుడు. అట్లుగాక — తనతప్పును తానెఱుగక యీలోకమును వదలినవాడు దురదృష్టవంతుడు. కనుక నాతప్పును నాకు తెలిపినవారియెడల నేను కృతజ్ఞుడను. నా రచనయందు తప్పులేకున్నను తప్పని చెప్పువారికి నేను ప్రత్యుత్తరమివ్వను. వారికి తప్పని తోచినదానికి సమాధానము యీ గ్రంథమున నెచ్చటనో ఉండును. కనుక, సావధానముగ గ్రంథమును పూర్ణముగ చదువక యెచ్చటనో ఒకచోట చదివి, తప్పుకానిదానిని చూచి తప్పని భ్రమింపకుందురు గాక. అట్టివారితో యెదురువాదమునకు పూనుకొనను.

ఈ గ్రంథమున ఒకచోట చెప్పిన వాక్యములనే ఆ యా సందర్భములబట్టి మఱల మఱల చెప్పవలసి వచ్చెను. వేదాంత శాస్త్రములయందు పునరుక్తి దోషము లేదు. జిజ్ఞాసువులకు బోధ ధృడపడుటకై అట్లు చెప్పవలసిన విధి యేర్పడును. ఉదాహరణకు:— ఛాందోగ్యశ్రుతియందు ఉద్దాలకమహర్షి శ్వేతకేతునకు "తత్త్వమసి" అను మహావాక్యమును పలుమారు బోధించెను.

ఈ గ్రంథమునందలి అచ్చుతప్పులను చూపునట్టి సవరణ పత్రమును గ్రంథాంతమున చూపియున్నాను. అందులో చేరకుండిన అచ్చుతప్పులను పాఠకమహాశయులు దయతో మన్నించి చదువుకొనగలరనియు, ఈ గ్రంథమును చదువుటకు ప్రారంభించినపుడే వెనుక కనుపరిచిన సవరణ పత్రము ననుసరించి గ్రంథమున తప్పులను దిద్దుకొని పిమ్మట

చదువుట కుపక్రమించిన మంచిదనియు నా ప్రార్థన.

వేదాంతవిదులగు పెద్దలను నేను ప్రార్థించున దేమనగా, అల్పజ్ఞుఁడగు నితడు (ఈ గ్రంథకర్త) మహాత్ములగు శ్రీ జ్ఞానేశ్వర శ్రీ అరవిందుల రచనలయందలి గుణదోషముల పరిశీలించువాఁడా? యని నిరసింపక —

శ్లో॥ యుక్తి యుక్త ముపాదేయం వచనం బాలకాదపి,
అన్యత్తృణ మివత్యాజ్యం మప్యుక్తం పద్మయోనినా॥

తా॥ యుక్తియుక్తమైన వచనము బాలుఁడు చెప్పినను ఉపాదేయమే (పొందతగినదే) యుక్తి యుక్తముకాని వచనము బ్రహ్మదేవుఁడు చెప్పినను గడ్డిపోచవలె త్రోసివేయవలసినదే — అను జ్ఞానవాసిష్ఠమునందలి శ్లోకమును జ్ఞప్తికి తెచ్చుకొనవలెనని ప్రార్థించుచున్నాను.

స్వస్తి.

గ్రంథకర్త.

సూచన

ఈ గ్రంథమున — 185 వ పుట, 22 వ పంక్తిలోను; 186 వ పుట, 2 వ పంక్తిలోను, 188 వ పుట, 20, 21 పంక్తులలోను చుక్కలు (....) ఉన్నవి, అవి తప్పు. వాటికిబదులు (మారుగా) సున్న (పూర్ణబిందువు)లు అనగా (౦౦౦౦) ఉండవలసినవి. ప్రస్ వారును, ప్రూఫులు దిద్దువారును మూలమును చక్కగా గమనింపక పోవుటవలననో లేక మరేకారణమువలననో అట్లు జరిగినది, ఆ చుక్కలను సున్నలుగా పాఠకమహాశయులు చదువుకొనవలెనని ప్రార్థన — గ్రంథకర్త.

భూమిక

శ్రీ రామసుబ్బయ్యగారు 'అనంతోపనిషత్తు' 'అనుగీతలు' ఇత్యాది వివిధ గ్రంథములు పరికించి అగాధ పరిశోధనచేసి "బ్రహ్మజిజ్ఞాస" యనెడి ఈ గ్రంథమును రచించిరి. అచలమత మూలగ్రంథములు ఆంధ్రభాషలోనే యున్నందున ఆంధ్రదేశమునందే అచలమత ప్రాదుర్భావము. (బృహద్వాసిష్ఠ సిద్ధాంతము కొద్దిగా సంస్కృతము చదువుకొనిన ఒకానొక వ్యక్తిచేత వ్రాయబడినదనుట స్పష్టము) ఐనను క్రమేణ ఇరుగు పొరుగు దేశములయందిది వ్యాపించి యున్నది.

నిజమైన జిజ్ఞాసువులు—ముముక్షువులు పెక్కురు పూరాకృతదుష్కృతము వలన బోధ గురువుల నాశ్రయింపక బాధ గురువుల నాశ్రయించుట తటస్థించుచున్నది. వారిని చూచి రచయితకు జాలి, పరితాపము కలిగెను. ముఖ్యముగా వారిని గుఱించి ఈ గ్రంథము రచింపబడెను.

సద్గురువు లభించునంతవఱకు ముముక్షువు చేయవలసిన పనియేమి? ౨౮-వ పుటలో మంచి సలహా యిచ్చిరి.

గ్రంథకర్తగారికి ఏర్పడిన వ్యాధి భవవ్యాధిగ్రస్తుల నుద్ధరించుటకే. రతనాలసీమయనబడే రాయలసీమలో వీరొక రత్నము. ఈ రత్నముచే ముముక్షులోకమంతటి

యొక్క దరిద్రత పటాపంచ గాకలదు. 'బ్రహ్మజిజ్ఞాస' యొక్క మూడు సంపుటములు చూచితిని. ఈ సంపుటము మరల మరల చూచితిని. హర్షము కలిగెను. హరి కృప!

ఆత్మయే (బ్రహ్మమే) అజ్ఞానమున కాశ్రయము, విషయము అనెడి భావము 42, 43 వ పుటలలో సత్సంప్రదాయానుసారము స్పష్టము చేసిరి.

ఆత్మయొక్క కారణకార్య భావాతీత స్థితి 45, 46వ పుటలలో అత్యద్భుతముగా నిరూపించిరి.

70_73 పుటలలో గొప్పతనముండియు అహంకారము లేకుండుట గొప్పవారి లక్షణము. గొప్పతనము లేకయే తమను తామే గొప్పగా ప్రకటించుకొనుట దురహంకారమని, నీచుల లక్షణమని సూచించిరి. దాసబోధ 85-వ పుటలో శివ-శక్తి పరియాయపద నిరూపణములో అనువాదకులు పొరపడి యుందురు.

132_వ పుటలలో "నా యభిప్రాయము" బహు చక్కగా ఉన్నదని నా యభిప్రాయము.

167, 168_వ పుటలలో ముక్తపురుషుని దృష్టి మధురముగా నిర్వచింపబడినది.

172 జ్ఞానశూన్యస్థలమనగా — భేదజ్ఞానశూన్యస్థలమని నిర్వచింపబడినది. భేదజ్ఞాన శూన్యజ్ఞానమనగా కేవల జ్ఞానమనియే కదా అర్థము.

173 "సారబచన్" సారవచనముచే చక్కగా ఖండింపబడినది.

175 "బ్రహ్మస్వరూపజ్ఞానముకంటె బ్రహ్మజ్ఞానము తక్కువ" అన్న మాట మిక్కిలి యెక్కువ విలువ గలది. అన్ని మాటలు దీని యెదుట తక్కువే.

179, 180—అతి గంభీరమగు స్వరూపస్థితిని అత్యంత మధురముగా నిర్వచించి మహావినయముతో మొదటి ప్రకరణము ముగింపబడినది. పెక్కుసార్లు మ్రొక్కదగిన భావములు!

అనంతోపనిషత్తును అంగీకరించినను, అంగీకరింప కున్నను అచలమతమునకు ప్రమాదమే. అంగీకరించిన శ్రుతిని ప్రమాణముగా స్వీకరించినట్లగును. అంగీకరింపకున్న అచలమతము అప్రమాణమని ఒప్పుకొనినట్లగును. పాపము! సంప్రదాయకులు తప్ప యితరులు కనిపెట్టలేని "ఎఱుక మఱుపుల నెఱిగెడి యెఱుకను"—ఎఱుక మఱుపులు లేని యెఱుకను ఎఱుగలేక వృత్తిరూపమైన ఎఱుకనే ఎఱుక యనుకొని, అది యెల్లప్పుడు ఉండునది కాదు కావున దానిని చలమని తలచిరి.

"అచలము, పరిపూర్ణము, కేవలాత్మ, భూమ" అనెడి పదములు వేదాంతశాస్త్రమునుండి దొంగిలింప బడినవే. మఱి వేఱే ఆధారమేమి యున్నది?

బయలు—ఆకాశము మిగత భూతములకంటె ఊహా కందనంత చాల పెద్దదే యైనను (జడముగావున) తన్నెఱు గదు. ఇతరము నెఱుగదు. ఇదియే అచలుల నాశరహితమైన తత్త్వము. బయలుయొక్క అనుభవములో అశాంతికి, అశాంతి

యేర్పడును. నిజమే. కాని శాంతి ఎక్కడిది? చీకటి పోవుటయే సూర్యోదయ మగునా? అప్పు తీరిపోవుటయే ఐశ్వర్య మగునా? నష్టము లేమియే లాభ మగునా? శాంతి—పరమ శాంతి స్వస్వరూపమునకు సంబంధించినది గదా! స్వస్వరూపమును (ఆత్మను) అచలులు అంగీకరింపరు. శిష్టులు ఆలోచింతురుగాక!

201. విజయ దుందుభిని వివర్శించి "ఆత్మనాత్మ విచారము అవసరమే" యనెడి తీర్పు చాల నేర్పుతో చేయ బడినది.

262—ఆంధ్రజ్ఞానేశ్వరిలోని జ్ఞానేశ్వరులు అని తలంపు.

284 — ప్రకాశోపనిషత్తు తిలకాష్ఠమహిషబంధన న్యాయము ననుసరించినవే. అనంతోపనిషత్తు సరేసరి. "సమూలో వా ఏష పరిశుష్యతి యోఽనృత మభివదతి" అనెడి శ్రుతి వాక్యమును దొంగలించి తారుమారుచేసి దానిని ప్రకాశోపనిషత్తనినారు దీక్షితులు.

శిష్టులు అంగీకరించిన ఉపనిషత్తులన్నియు అపౌర మేయములనియే మన దృఢవిశ్వాసము. బ్రహ్మంగారి కాలజ్ఞానములో భవిష్యద్విషయముల నేకములున్నవి. అట్టి పేర్లు కూడ కలవు. కాలజ్ఞానము ముందా? పేర్లు ముందా? అట్లే ఉపనిషత్తులలో దేవతలయు, ఋషులయు, రాజర్షులయు పేర్లు గలవు. వేదము సర్వజ్ఞము గదా!

313 జ్ఞాన శబ్దమునకు ఏ చోట ఏ యర్థము గ్రాహ్యమో జ్ఞానులకు తప్ప ఇతరులకు ఎట్లు గ్రాహ్య

మగును? అమృతానుభవము గలవాడు దప్ప అమృతాను భవము ననువదింప నెవడు సమర్థుడు?

324, 325. "సనత్సుజాతీయము చేత" దీక్షితులవారి మతమంతయు నంతము నొందెను. అయినను అది పిశాచమై అమాయకులను, అసంప్రదాయకులను ఆవేశించి నానా బాధలు పెట్టుచున్నది. పాపము! ఒక్కప్పుడు నన్నుకూడ అది పట్టుకొనినది అయినను హరికృపచే పారిపోయినది.

శిష్ట సంప్రదాయము ననుసరించినవారు తప్ప భూమను అర్థము చేసుకొనగలిగినవారు భూమిలో ఉండ జాలరు. అచలపదము వలెనే భూమపదమునుగూడ అచలులు దొంగిలించిరి. అయినను ఈ పదములు తమవే. బయలువే అనుచున్నారు.

352 బ్రహ్మము త్రివిధమా? అనెడి మీమాంస మిక్కిలి లాభదాయకముగా ఉన్నది. ప్రతియోగి యనగా విరుద్ధ విషయము. అన్యము కలది. ద్వైతమని యర్థము. నిష్ప్రతియోగి (కము) అనగా అన్యము లేనిది. అద్వైతమని యర్థము. అద్వైతమనినను నిష్ప్రతియోగిక మనినను అర్థము ఒక్కటే. ద్వైతాద్వైత వ్యవహారాతీతము పరతత్త్వమందురా? మంచిది! అపుడు నిష్ప్రతియోగికమనెడి వ్యవహారాతీతమునకంటెను అతీతము. పరతత్త్వమనెడి వ్యవహారము ఏర్పడుచున్నది. పరతత్త్వమనెడి మాటయు ఇట్టిదే కదా! అపుడు మహామౌనము శరణ్యమగుచున్నది. దానినే శ్రుతి "ప్రపంచోపశమం...అద్వైతమ్" అనినది. అది

యేది? "స ఆత్మ" అదే ఆత్మ అని ఉపదేశించి ఉపదేశమును ఉపసంహరించినది. బడాయిమాటలు చెప్పి అమాయకులను మోసగించుట తప్ప మరేమి విశేషమున్నది. మోసమునకు ఫలము మోసమేయని గుర్తింతురుగాక!

369 అచలమే శూన్యమై... అగోచరమై నశించుచున్నది.

370, 371 మార్పు లేని తీర్పు!

383 హఠయోగమేదో, రాజయోగమేదో తెలియక దీక్షితులు రాజయోగ నిరసన చేసిరి.

"ఆహో! బుధా! నిర్మల దృష్టయోఽపి
జగన్న పశ్యంతి విచిత్ర మేతత్"

ఆహో ఇది చాల విచిత్రమైన విషయము. బుధులకు నిజమైన జ్ఞానులకు నిర్మల దృష్టి గలిగియున్నను ఈ జగత్తు కనబడదు. వారీ జగత్తును చూడరని భావము. లేనిది లేనట్లు చూడగలుగుట రాజ యోగము. యోగములకు రాజు గావున రాజయోగము అనగా జ్ఞానయోగమే. కేవల జ్ఞానమే.

384. బ్రహ్మానందము లేనె లేదట. గుడ్లగూబ దృష్టిలో సూర్యుడే లేనట్లు, దీక్షితుల దృష్టిలో బ్రహ్మమే లేదు. ఇక బ్రహ్మానందము ఎట్లు సిద్ధించును?

394 త్రిమూర్తులకు అహంకారము కలదని గురువునకు మాత్రము లేదని దీక్షితులనిరి. 33 కోట్ల దేవతలకు

అహంకారము కలదనిరి. అప్పుడు దీక్షితుల దృష్టిలో 33 కోట్ల దేవతలున్నారన్న మాట—

417 "వర్ణాది ధర్మంహిపరిత్యజంతః" అని శ్రుతి. వర్ణాశ్రమ ధర్మములు మనలను గట్టిగా పట్టుకొనిన గదా! దానిని గట్టిగా ప్రయత్నించి వదిలిపెట్టుట?—

438 ప్రక్కటి పురాణము కానిది ఒక్కటియు లేదు. దీక్షితులయు, వారి వారియు రచనలలో—

444 చాల మంచి సంగతులు విశదపరుపబడి యున్నవి—

462 గంభీరమైన చర్చ చేసి స్ఫోటవాదము, అచల వాదము, పరస్పర విరుద్ధమని స్ఫుటము చేసిరి—

477-481 చిదాకాశ చర్చ బహుచక్కగా ఉన్నది-

499 "మాయకునుంగని" మాయకు ఆకరము (ఆశ్రయము) అని భావము—

541 సువర్ణాక్షరములతో లిఖింపదగినవి" అను వాక్యము సువర్ణాక్షరములతో లిఖింపదగినది.

601 "మోక్షసౌధములో అడుగిడగనే మాటలు లేవు, మనస్సు లేదు" ఎంత మంచి మాట!

601 ఎంత ఉత్తమ విద్య యున్నదో అంత మంచి వినయము యున్నది.

610 'కేవల కృప' చేత తత్త్వబోధచేయు నిజమైన జ్ఞానుల వలననే ముముక్షు లోకమునకు మేలు గలుగ గలదు.

614. ప్రతి ప్రకరణము, ప్రతి ఘట్టము, ప్రతి వాక్యము, ప్రతి పంక్తి, ప్రతిమాట ప్రతిభాన్వితమై ప్రయోజనవంతముగా ప్రకాశించుచున్నవి. ప్రశస్తతరమైన రచన! ఇది నిజముగా పరమేశ్వరానుగ్రహమే.

ఋషి కల్పులగు శ్రీ మ॥ రామసుబ్బయ్యగారు ఇద్దరు జడ్జిలకు తండ్రి. ఒక జడ్జి శ్రీరాములవంటి శ్రీరాములు గారు. మఱియొక జడ్జి "బ్రహ్మజిజ్ఞాస". ఈ ఇద్దరి జడ్జిల తీర్పు ఇహపరముల మేలుగూర్చ నేర్పు గలది. విజయోస్తు!

రామసుబ్బయ్య రచితా
రచనా బుధ సేవితా,
"బ్రహ్మజిజ్ఞాస" నామ్నాయా
జీయాదాచంద్ర తారకమ్.
సర్వత్ర సుఖనస్సంతు"

జనార్దన భవనము
గుంటూరు-3

(సం॥) శుద్ధచైతన్యస్వామి
19-7-1980

కృతజ్ఞత

నేను 1949 డిశంబరు నెలనుండి నరముల దౌర్బల్యమను వ్యాధితో పీడింపబడుచున్నట్లు ప్రథమ భాగము యొక్క ఉపోద్ఘాతమున వ్రాసితిని. "గోరుచుట్టుపై రోకటి పోటు"నునట్లు గుండె జబ్బుకూడా వచ్చినది. వ్యాధి అధికమైనపుడు గ్రంథ రచన నిలిచిపోవుటయు, కొంచెము శక్తి గలిగినపుడు తిరుగ రచన సాగుటయు ఈ విధముగా భగవదనుగ్రహమున గ్రంథము పూర్తి అయినది.

ఈ భాగము వ్రాయునపుడు గ్రంథము పెద్దదయిన అచ్చునకగువ్యయమధికమగునను భీతిచే అచ్చటచ్చట కొన్ని యంశములను సంగ్రహించియు, కొన్నింటిని పూర్తిగా వదలియు వ్రాసితిని. అయినను కొన్ని కారణముల వలన అచ్చునకు కావలసినదానికంటె అధిక వ్యయము అయినది. తృతీయ భాగము ముద్రణము పూర్తి అయిన తరువాత, నాకు కూర్చుండుటకు కొంచెము శక్తి కలిగినప్పుడెల్లను చతుర్థ భాగము (వ్రాతప్రతిని) చదివి పూర్తి చేసితిని. ఈ భాగముతో గ్రంథమంతయు పూర్తి అయినది. దీనినిపూర్తి చేయించిన భగవంతునకు నా కృతజ్ఞతను తెలుపుకొనుచు ఈ గ్రంథకుసుమ గుచ్ఛమును, ఆ పురుషోత్తముని పాద పద్మముల కర్పించుకొని నా జీవితము ధన్యమయినదని తలచుచున్నాను.

పూజ్యపాదులగు శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శుద్ధ చైతన్యస్వాములవారితో నాకు ముఖ పరిచయము లేదు. వారిని గురించి, వారి వృత్తమును గుఱించి ఆదవని (ఆదోని)లో నేను కొందఱు పెద్దమనుష్యులవలన వింటిని. నేను శ్రీవారి దర్శనమునకు వారున్న చోటునకు పోవుటకు శక్తిలేనివాడను. వారిని నా వద్దకు రమ్మని వ్రాయుటకు అంతకంటెను శక్తి చాలనివాడను. ఇట్టి సందర్భమున స్వామివారి దర్శన భాగ్యము లభించుటెట్లు? వారి అడ్రసు తెలిసికొంటిని. వారికి 'బ్రహ్మజిజ్ఞాస' రెండవ, మూడవ భాగముల ప్రతులను పంపితిని. స్వామివారప్పుడు అనంతపురమందుండిరి. ఆ విధముగ ఉత్తర ప్రత్యుత్తరముల ద్వారా వారితో పరిచయము కలిగించుకొంటిని. 'బ్రహ్మజిజ్ఞాస' చతుర్థభాగము వ్రాయుచుంటినని, అందు అచలమత పరిశీలనము ప్రధానాంశమని, స్వామివారికి నివేదించుకొంటిని. వారు అచలవాదులు చెప్పు బయలును తాము చూచితిమనియు, అది బ్రహ్మము కాదనియు, ఒక లేఖలో తెలియచేసిరి. సంతసించితిని.

స్వాములవారు వ్రాసిన గ్రంథములలో రెండు గ్రంథములు భగవదనుగ్రహమున నా చేత బడినవి. అందొకటి (శ్రీ) మాధవ విద్యారణ్య (శ్రీ) శంకరవిజయము నందలి శ్లోకములకు (శ్రీ)వారు వ్రాసిన తాత్పర్యము గల గ్రంథము. రెండవది (శ్రీ)మద్భగవద్గీతకు (శ్రీ)శంకరానంద వ్యాఖ్యాను

వాద సమేతము—పై రెండు గ్రంథములు చదివి స్వాముల వారికి సంస్కృతాంధ్ర భాషల యందుగల అపార పాండిత్యమును వేదాంతమునందు వారికిగల పూర్ణ ప్రజ్ఞయు తెలిసికొనగలిగితిని. మఱియు, శ్రీవారు, శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీ జగద్గురు శృంగేరీ శారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ మదభినవ విద్యాతీర్థస్వామి పూజ్యపాదులవారి శిష్యులనియు, జగద్గురువులవలన కాషాయ వస్త్రస్వీకారమును, బ్రహ్మోపదేశమును పొందిరనియు తెలిసికొంటిని. ఈ చతుర్థ భాగమునకు ఎవరిచేత పీఠిక వ్రాయింతునా యని యోచించుచున్న నాకు వెతుకదలచిన దేవుడు ఎదుట నిలిచినట్లు స్వాములవారు నా మనఃపథమున నిలిచిరి. వారిచేత భూమికను వ్రాయింప నిశ్చయించుకొంటిని.

స్వాములవారు సంస్కృతమును మధ్వశ్రీ పల్లెకృష్ణాచార్యులవారివద్ద అభ్యసించిరి. వీరు రచియించిన అనువాద గ్రంథములు వివరణ గ్రంథములు పరిష్కృతములైన గ్రంథములు అనేకములు.

శ్రీ స్వాములవారి చరిత్రయందొక విశేషమేమన:— వీరు రచియించిన గ్రంథములు వెలకు అమ్ముటలేదు. ఉచితముగా జిజ్ఞాసువులకు ఇచ్చెదరు. వీరి శిష్యులు భక్తులు ధనమొసంగిన వారి ధనముతో గ్రంథములు ముద్రించి ధనమొసంగిన వారికా ప్రతులను ఇచ్చి వాటిని ఉచితముగా జిజ్ఞాసువులకు ఇచ్చునట్లు చేయుదురు.

స్వాములవారు స్వార్థరహితులు, నిరీహులు, నిర్మలులు ధనమార్జింపవలెనన్న ఒక్క మాసములో కొన్ని లక్షలను ఆర్జింపగలరు.

స్వాములవారు చదలువాడ సుందరరామశాస్త్రిగారు రచియించిన పరమార్థ చంద్రిక గీతా వ్యాఖ్యానమును ముద్రించు కార్యమునందు నిమగ్నులై యుండిరి. (అది బృహత్కార్యము నాలుగు సంపుటములు సుమారు యేబదివేల రూప్యము ఖర్చు అయి యుండునేమో) అట్టితరి నా గ్రంథమునకు పీఠిక వ్రాయుడని అర్థించితిని. వారవ్యాజకృపతో అంగీకరించి గ్రంథమునందలి ప్రతి అక్షరమును చదివి అమూల్యమగు భూమికను వ్రాసి యిచ్చిరి. వారికి నా కృతజ్ఞతా పూర్వక ప్రణతులర్పించుచున్నాను. శ్రీవారి భూమిక నా గ్రంథమునందు వజ్రకవచమువలె ప్రకాశించుచున్నది. ఇది యంతయు ఈశ్వరకృప. మహాత్ముల దయ యూరక లభింపదు కదా?

ఈ గ్రంథమునకు అభిప్రాయములు వ్రాసి యిచ్చిన వారిలో ప॥ ప॥ శ్రీ శ్రీ రామకృష్ణానందస్వాములవారు సుపరిచితులు. (ప్రథమ భాగమునకు పరిచయ వాక్యమును వ్రాసి యిచ్చిన పూజ్యులు). కళాప్రపూర్ణ డా॥ మ॥ కోదండ రామిరెడ్డిగారు నాకు మిత్రులు. వీరందఱకు నా కృతజ్ఞతా పూర్వక వందనములు.

గ్రంథము అచ్చువేయించి యిచ్చిన శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి గారికిని, క్రాంతి ప్రెస్ వారికిని భగవంతుడు అన్ని విధముల తోడ్పడగలడు.

వేదాంతి పాటింపవలసిన నియమములలో అపరిగ్రహ మొకటి. సర్వసంగపరిత్యాగియగు సన్న్యాసి సహితము భిక్షాన్నము నర్థించి పరిగ్రహింపకున్న జీవింపజాలడుకదా? ఏదైన నొక సమయమున పుణ్యకార్యమునకై ఉత్తముడగు దాతనుండి వచ్చిన సహాయమును స్వీకరింపవచ్చును. అందువలన దాతకు పుణ్యమును పరిగృహీతకు కార్యము గడచుటయును కలుగును.

నెల్లూరు వాస్తవ్యులు దానవీర శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి గారిని గుఱించి యెఱుగని వారు ఉండరు. వారితో నాకు ముఖపరిచయము లేకున్నను నన్ను గుఱించి నా మిత్రులవలన విని 'బ్రహ్మజిజ్ఞాస' తృతీయ భాగమును చూచి 1,116/- ఒక్క వెయ్యినూట పదహారు రూపాయలు చతుర్థ భాగము అచ్చువేయుటకు విరాళ మొసగిరి. వీరు చేసిన దానములలో యిది చాల స్వల్పము. విద్యాసంస్థలకు లక్షలు దాన మొసగి యున్నారు. భగవంతుడు శ్రీ లక్ష్మీనరసారెడ్డిగారికి ఆయురారోగ్య మహాభాగ్యముల ప్రసాదించుగాక—వీరికి నా కృతజ్ఞతాపూర్వక వందనములు.

ఈ చతుర్థభాగమును చదువు పాఠక మహాశయులకు నేను చేయు విన్నపము—గ్రంథమును చదివిన పిమ్మట

భూమికను మఱల చదివి ఆయా పుటల సంఖ్యయందలి విషయమును మఱియొకమారు పరిశీలించినచో గ్రంథస్థ విషయమంతయు అరచేతియందు ఉసరికపండువలె స్పష్ట పడును. ఇది వేదాంతమునందు నిష్ణాతులైన వారిని గురించి చెప్పినది కాదు. తక్కినవారికి చేసిన విన్నపము.

సర్వేజనా స్సుఖినోభవంతు

26-7-1980 } సర్వం శ్రీరామార్పణమస్తు
ఆదవని }

స్వస్తి
గ్రంథకర్త

అభిప్రాయములు

భూమానందాశ్రమాధిపతులు

ప॥ ప॥ శ్రీశ్రీ రామకృష్ణానందస్వామివారి అభిప్రాయము

ధన్యజీవికి నా హార్దిక ప్రశంస—

బ్రహ్మమనీషి స్వాధ్యాయ తపస్వి శ్రీ మణ్ణిబోయిన రామసుబ్బయ్యగారు రచించిన "బ్రహ్మజిజ్ఞాస" నాల్గవ భాగాన్ని నిష్ఠతో పఠించాను. ఈ వరకు రచించిన మూడు భాగములు ఒక యెత్తు; ఈ నాల్గవ భాగము ఒక యెత్తు. గ్రంథము కూడా వెనుకటి వాటికంటె పెద్దది; విషయ విమర్శనము అత్యంతం దురవగాహమైంది. వారే తమ మాటలలో ప్రవేశికలోని నలభై రెండవ పేజీలో "ఈ భాగములోని తాత్వికాంశములు మిగుల జటిలమైనవి" అని వ్రాసుకొని ఉన్నారు.

ప్రవేశిక ముప్పై యేడవ పేజీలో మొత్తం నాల్గు భాగములలోని విషయ సూచికను ఉల్లేఖించి యున్నారు. మొత్తము గ్రంథము రెండువేల పుటలకుపైన; ప్రకరణములు పదునాలు. ఈ నాల్గవ భాగములో శ్రీ శంకర భగవత్పాదుల మాయావాదమునకును శ్రీ జ్ఞానేశ్వర, శ్రీసమర్థ రామ, యోగవాసిష్ఠ శ్రీ అరవిందుల అభిప్రాయములకును తులనాత్మక వివేచనము చేసినారు. ఈ ఘట్టములు కొన్ని చోట్ల మిగుల దుర్గ్రాహ్యములు.

నాగపూర్ డాక్టర్ యస్. డి. పాండిసే అనువారు మరాఠీలో "శ్రీ జ్ఞానేశ్వరాంచేత త్త్వజ్ఞాన" అనే గ్రంథాన్ని రచించారు. శ్రీ జ్ఞానేశ్వరులు శంకరవిధేయులు. వారు పద్దెనిమిదవ అధ్యాయంలో "భాష్యకారాంతేం" అనే పదము శ్రీ శంకరాచార్యులను ఉద్దేశించింది. ముఖ్య సిద్ధాంతంలో వారికి వీరికి భిన్నత లేదు. అవాంతర విషయా లలో "సన్యాసము-వర్ణాశ్రమములు" ఈలాంటి వాటిలో సార్థక్యత కల్గింది. వైదిక విజ్ఞానము శాంకరాద్వైతము నాథసంప్రదాయ యోగప్రక్రియ జ్ఞానేశ్వరిలో పెనవేసు కొన్నాయని వారన్నారు.

మఱి ముఖ్యవిషయ మేమంటే, ఈ గ్రంథములోని "అపూర్వత" అచలమత పరిశీలనము. "మేము అచలుల మని మాది అద్వైతానికంటె పై మెట్టు"ని లోకులను భ్రమింపజేయు అచలమతాన్ని దాని పుట్టుపూర్వోత్తరా లను దాని అవైదిక సంప్రదాయ స్వరూపాన్ని ఆ మతానికి మూలపురుషుడైన శ్రీ శివరామదీక్షితులవారి ప్రసంగముల లోని అసంబద్ధతను స్వవచన వ్యాఘాతాన్ని బ్రద్దలుచేసి చూపించినారు. వీరు, అచలవాదులు తమ గురుపరంపరలో చెప్పుకొను జ్ఞానేశ్వర శ్రీధరస్వాములవారిని గుఱించి చారి త్రక తాత్త్విక విమర్శచేసి వారి సిద్ధాంతాలకు అచల సిద్ధాం తానికి గల అనుపపత్తులను వెల్లడించినారు. అచలుడు చెప్పు రహస్యత్రయాన్ని వారి గ్రంథాలను పేర్కొని గాలించి వదలినారు. ఇంతకూ అనన్య సాధారణమైన పని

చేసినారు. శ్రీమళయాళస్వాములవారు తమ ప్రచండ తపః ప్రభావముతో అచలమతాన్ని నిర్వీర్యము చేసినారు. వీరు శాస్త్రీయ పద్ధతిలో దాని గుట్టును రట్టు చేసినారు.

"బౌద్ధము పేరు మార్చుకొని తత్త్వమునందు ముఖ్య లక్షణమగు క్షణిక వాదమును వదలి వేదాంత వేషమును ధరించెను. అదే శ్రీ శివరామదీక్షితుల 'అచల బోధ' అని నా యభిప్రాయము" అని వ్రాసియున్నారు.

ఈ అభిప్రాయము నాకును ఉండినది కాని తగిన నిరూపణకు పరిశ్రమ చేయలేదు. ఆ లోటును తీర్చి శ్రీరామ సుబ్బయ్యగారు నాకెంతో తృప్తిని కల్గించినారు. ముఖ్యముగ ఈ ఘట్టము గ్రుడ్డిచాటుగ అచలమతములో పడిపోవు ఆంధ్రుల కన్ను తెరిపించింది. శ్రీ శివరామ దీక్షితులవారు తెలుగువారగుటచే యీ ప్రదేశమున దీనికి బాహుళ్యము కల్గినది. రాను రాను విజ్ఞానవేత్తల సంఘములో దీనికి ఆదరణ తఱిగినది.

నేడు మనము వింటూన్న "సహజమార్గము"ను గూర్చికూడ తాకి వదలినారు. వైదిక సంప్రదాయము కాదని తేల్చినారు. అబ్బ! ఎన్ని చెప్పడం? అగాధ గహనవిషయాలకు పుట్టు. విశ్వప్రపంచ మహామనీషులు భారతీయ వైదిక సంస్కృతి వైభవానికి ముగ్ధులై అఱ్ఱులు చాచుచుండ భారతీయులు పాశ్చాత్య సంపర్కంతో అవైదిక మార్గాలలో

పడిపోవుట శోచనీయము. ఆ అధోగతిని అరికట్టుటకు ఈ గ్రంథము గొప్ప వరప్రసాదము. జిజ్ఞాసువులు సద్వినియోగము చేసికొని ధన్యులగుదురుగాక!

రామసుబ్బయ్యగారూ! మీ జీవితము చతురస్ర సమగ్రత పొందింది. ధన్యులు మీరు. ధన్యులు మీరు—ఓం. శం.

గండిక్షేత్రము
కడప జిల్లా
20-6-1980

(సం) శ్రీరామకృష్ణానందస్వామి

కళాప్రపూర్ణ డాక్టర్ శ్రీ మరుపూరు కోదండరామిరెడ్డిగారి అభిప్రాయము

అపర్ణ
జేమ్సుగార్డెన్
నెల్లూరు-524 002

బ్రహ్మవిద్యకు చతుర్థ ముఖం ఈ చతుర్థ భాగం. శ్రీరామసుబ్బయ్య పరిణతమైన మనోక్షేత్రం పండించిన అపూర్వతత్త్వ విజ్ఞాన ధాన్యరాశి— ఈ నాల్గవభాగం. ఈయన వ్రాసిన నాల్గు పుస్తకాలు గోపురాకృతిని దాల్చి ఇది దానికి శిఖరమై ధర్మజ్యోతికి స్తంభమైనది.

ఈ రచన సకల వేదాంతసార సంగ్రహమైనది. దీనికి దారి తీసినది అచల మత ఖండన పాండిత్యము. ఈ అచల మతం ఇన్నూరు ఏండ్ల నాడు తెలంగాణా నల్లగొండ ప్రాంతాన రామడుగు శివరామదీక్షితుల పుర్రెలో బుట్టి ఆంధ్రలో అక్కడక్కడ కొన్ని మతాలను నెలకొల్పుకొన్నది. ఇందు శూద్రస్వాముల ప్రాబల్యము గుర్తించదగి ఉన్నది. ఉన్నవ లక్ష్మీనారాయణ తమ మాలపల్లె గ్రంథములో గూడ దీనిని ఎక్కించినారు.

అచలమత ప్రవక్త–శివరామదీక్షితులవారికి హిందూ వేదాంతం అజీర్ణం చేసినట్లున్నది. అపండితులకంటె అర్థ

పండితులు అపాయకారులుగదా! దీక్షితుల వ్రాతలో స్వవచన వ్యాఘాతాలు వక్రభాష్యాలు మెండు. ఇక వీరి శిష్యకోటి వ్రాతలలో పిచ్చిరేగి ఉన్నది. మహారాష్ట్ర జ్ఞానేశ్వర పంథా అంటూనే ఈ తెలంగాణా పంథా భిన్నమైనది. ఇది మన ముగ్గురు ఆచార్యుల మతానికే అది అర్థంకాక - ఎసరు బెట్టినది.

ఈ అచలాన్ని ప్రవచించను ఒక వేమన గూడ ప్రభవించినాడు. ప్రజాకవి వేమనయోగి ఈయన కానే కాదు. ఈ కాపు వేదాంతి కారణ విమర్శక శక్తికి పట్టాభిషేకం చేసిన అద్వైతి. ఈ అచల వేదాంతం వేమనయోగి తత్త్వానికే వెలితి అయినది. తుంగ వేమన, కటారిపల్లె వేమనలవలె ఈ అచలవేమన భిన్నుడు. అచలమతబీజంలో బలంలేక ఎక్కడా అంతగా వేరులు పారించుకోలేక పోతున్నది.

శ్రీరామసుబ్బయ్య తత్త్వ బోధక మహనీయ వాక్యాలన్నిటిని ఉపయోగించి ఈ అచల మతవాదభేదనం చేసినారు. ఈ పుస్తకం ఇంతవరకు ఈయన వ్రాసిన తత్త్వశాస్త్రగ్రంథసారంగా, వివిధ దర్శన విద్యాపునఃప్రకటనంగా చదువరికి పునశ్చరణంగా ఎరుక పెంపుకు దారి తీస్తున్నది. మన మూల వేదాంతానికి ఇది ఒక కూలంకష వ్యాఖ్యగా సంతన పడి ఉన్నది.

గ్రంథకర్త వాదబలం, భాషాసౌలభ్యం, శయ్యావిధానం, దార్శనిక విద్యా ప్రాగ్భల్యం ఇందు మిరుమిట్లు

గొలుపుతున్నవి. శ్రీరామసుబ్బయ్యలో విశేషమేమంటే - ఇందు ఉదహరించిన సూత్రాలు పద్యాలు ఆయనకు నోటికి వచ్చి ప్రసంగంలో చెరువు కలుజులు దీసినట్లు గలగల పారి పోతుంటవి.

అచలమత మృషా వాదానికి ఇది గొడ్డలి పెట్టు. ఇంత ధైర్యంగా ఇంతటి పాండిత్య ప్రకర్షకంగా అచలాన్ని ఎదుర్కొన్నవారు లేరు. స్వబోధతో తత్త్వమరసి, దర్శన పండితుడైన సుకృతి-ఈ యాదవ ప్రముఖుడు-సత్యం అందరి సొత్తు గదా!

ఆంధ్ర ఆస్తికలోకం ఈ వేదాంతికి నెనరుచూపవలసి ఉన్నది.

నెల్లూరు
26-6-1980

(సం) మరుపూరు కోదండరామిరెడ్డి

'బ్రహ్మజిజ్ఞాస' తృతీయా భాగమును గుఱించి కొన్ని పత్రికాభిప్రాయములు

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక— 2-9-1977.

---

625 పుటల గొప్ప గ్రంథమిది. వేదాంత విషయాలను సులభమైన భాషలో సుబోధకంగా రచించిన వచన గ్రంథమిది. వేదాంతాన్ని గుఱించి అధికారయుతంగా బోధించగల సప్రమాణ ఆంధ్ర గ్రంథాలలో ఇది ఉత్తమమైనది. సరళమూ స్వచ్ఛమూ అయిన గద్యంలో సర్వులకూ ఉపయుక్తంగా రచింపబడింది గ్రంథము.

ఇది మూడవ భాగము. ఇందులో ఆరు దర్శనాలను గుఱించి, ఆరు మతములను గుఱించి రామసుబ్బయ్యగారు విపులముగా చర్చించారు. "ఆధునిక దృష్టి కొరవడినా, పురాణ వాఙ్మయ నిష్ణాతులైన ఛాందసుల పిడివాదము వీరికి లేదు. ఈ గ్రంథము ఆత్మతత్వజిజ్ఞాసువులకు మహోపకారకము."

ఇందులో జిజ్ఞాసువు ప్రశ్నిస్తూంటే వేదాంతి సమాధానమిస్తూంటాడు. వేదాలను గుఱించి, దర్శనాలను గురించి ప్రమాణాలతో విశదీకరించారు రామసుబ్బయ్యగారు.

మొదటి ప్రకరణంలో, రెండవ ప్రకరణంలో అద్వైత విశిష్టాద్వైత, ద్వైత, ద్వైతాద్వైత, శుద్ధాద్వైత, శైవ, కాశ్మీర శైవ, వీరశైవ, వైష్ణవ, గాణాపత్య, శాక్త, కౌమారాది మతములనూ, మతాచార్యులనూ, మతప్రచారక గ్రంథాలనూ పరిచయం చేశారు.

జైన మతమును గురించి మతాచార్యులను గురించి జైన సంఘమును గురించి విమర్శించారు. మూడవ ప్రకరణంలో. నాలుగవ ప్రకరణం బౌద్ధమతానికి సంబంధించిన విషయాలను ప్రకటిస్తుంది. బుద్ధదేవుని సంగ్రహ జీవితంతో ప్రారంభమైంది. బౌద్ధధర్మ సిద్ధాంతాలనూ, హీనయాన మహాయానాలనూ చక్కగా చర్చించారు రచయిత. వైభాషికులూ, సౌత్రాంతికులూ, యోగాచార్యులూ, మాధ్యమికులు మొదలైన బౌద్ధమత శాఖలవారిని గురించి కూడా తేటతెల్లంగా తెలియజేశారు.

చార్వాక - లోకాయత - నాస్తికమతాలను గురించి చెపుతుంది అయిదవ ప్రకరణం.

ఈ గ్రంథంలో శంకరాద్వైత సిద్ధాంతాన్నే రచయిత నిరూపించారేమో! న్యాయసూత్రాలనూ గౌతమ కాణాదుల సిద్ధాంతాలనూ, అణువాదాన్ని కూడా ఈ గ్రంథంలో పేర్కొన్నారు.

వీరి పాండిత్యమపారమనిపిస్తుంది. భావప్రకటనలో సిద్ధహస్తులనిపిస్తారు. బ్రహ్మజిజ్ఞాస - షడ్దర్శన షణ్మత సార

సంగ్రహము. ఆంధ్రసాహిత్యాని కలంకారం. ఆంధ్రులకు ఆదరణీయమైన వేదాంతగ్రంథం — వి. శి. రా.

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక **2-11-1977**

ఆధ్యాత్మిక విషయాల్లో అత్యధికమైన కృషి చేసిన గ్రంథకర్త. బ్రహ్మజిజ్ఞాసను గురించి తాము తెలుసుకున్న విషయాలన్నింటినీ అందరికీ అందజేయదలచి పయి పేరుతో గ్రంథ రచనకు పూనుకున్నారు. ఇదివరలో రెండు భాగాలను ప్రకటించి తత్త్వవేత్తల యొక్కయు, విద్వాంసుల యొక్కయు మన్ననలను అందుకొన్నారు. ఇప్పుడు షడ్దర్శనములనియు, షణ్మతాలయు స్వరూపాల సారాన్ని ఈ గ్రంథంలో సంగ్రహంగా తెలియజేశారు.

షడ్దర్శనాలు, షణ్మతాలు అనే పేర్లు సర్వసాధారణంగా అందరి చెవుల్లోనూ పడుతూ ఉంటాయి. కాని అవి ఏవో, వాటి స్వరూప స్వభావాలేవో తెలిసినవారు మాత్రం స్వల్పంగానే ఉంటారు. ఉన్నవారిలో ఏ కొద్దిమందియో ఇతరులకు వాటిని గురించి చెప్పగలుగుతారు. తమకు తెలిసినదానిని వ్రాతలో పెట్టగలవారు మిక్కిలి తక్కువగా ఉంటారు. అట్టివారిలో రామసుబ్బయ్యగారొకరు. వీరు తమ గ్రంథాన్ని సర్వజనులకు సుబోధకంగా ఉండేరీతిని సరళమైన భాషలో వ్రాయడం దీని ప్రత్యేకతకు తార్కాణం.

“బ్రహ్మజిజ్ఞాస”లో ఇది మూడవ భాగం. అయినా వెనకటి భాగాలు చదివితేనేగాని ఇది అవగాహన కాదని అనుకోకూడదు. ఏ భాగానికదే ఒక ప్రత్యేక గ్రంథం.

వెనుకటి భాగాల ప్రమేయం లేకుండా దీనిని సులభంగా అర్థం చేసుకోవచ్చును.

ఇందులో మొదటి ప్రకరణంలో పూర్వోత్తర మీమాంసలు, న్యాయవైశేషికములు, సాంఖ్యయోగములు అనే షడ్దర్శనాలూ వివరింపబడినవి. పరతత్త్వాన్ని గురించి ఆయా దర్శనకారులు విపులంగా చర్చించి తమ సిద్ధాంతాలను వీటిలో వివరించారు. ఆ వివరణ ఈ ప్రకరణంలో ఉన్నది. రెండవ ప్రకరణంలో ద్వైతాద్వైత విశిష్టాద్వైతాది వైదిక మతాలు, శైవ వైష్ణవ గాణాపత్యాదులు చూపబడినవి. తరువాతి రెండు ప్రకరణాలలో జైన, బౌద్ధ మతాలు చర్చింపబడినవి. చివరిదైన అయిదవ ప్రకరణంలో చార్వాకాది నాస్తికమతాలను గురించి ఉన్నది.

ఈ విషయాలే కాకుండా ఇందులో ఆనుషంగికాలైన పురాణాదులను గుఱించీ, ధర్మానికి సంబంధించిన ఇతర విషయాలను గురించీ కూడ పెక్కు విషయాలు తెలుపబడినవి. భారతదేశంలోని ఆస్తిక నాస్తిక మతాల తత్త్వాన్ని సులభంగా గ్రహించడానికి ఈ గ్రంథం మిక్కిలి ఉపయోగకరమైనది. రచయిత ప్రతిభ ఇందులో వ్యక్తమవుతున్నది. ఇది తప్పక పరతత్త్వ జిజ్ఞాసువుల ఆమోద, ప్రోత్సాహాలను పొందగలదని నా విశ్వాసం.

— ఆయాస్య

ఈ చతుర్థ భాగముయొక్క రచనకు ప్రమాణములుగా ఉదహరింపబడిన గ్రంథములు వాటియొక్క సంకేతాక్షరములు మొదలగు వివరములు

ఉపనిషత్తులు

1. ఈశావాస్య (ఈశ)
2. కేన
3. కఠ
4. ప్రశ్న
5. ముండక (ముం.)
6. మాండూక్య (మాం)
7. తైత్తిరీయ (తైత్తి)
8. ఐతరేయ (ఐత)
9. ఛాందోగ్య (ఛాం)
10. బృహదారణ్యక (బృహదా)
11. తేజోబిందు (తే. జో)
12. మహోపనిషత్తు (మహో)
13. పైంగల
14. కైవల్య
15. జాబాల
16. శ్వేతాశ్వతర
17. సుబాల
18. యోగతత్త్వ (యో. త)
19. శుకరహస్య
20. మైత్రేయ
21. ముద్గల
22. అన్నపూర్ణ
23. ముక్తిక (ముక్తి)
24. మండల బ్రాహ్మణ (మండల)
25. వాసుదేవ
26. అధ్యాత్మ
27. శారీరక
28. సౌభాగ్యలక్ష్మి
29. త్రిపురతాపిని
30. ఆత్మ
31. సరస్వతీ రహస్య
32. అక్షి
33. ధ్యానబిందు (ధ్యాన)
34. మైత్రాయణి
35. వరాహ (వరా)
36. అథర్వశిర

ఇతర గ్రంథములు

37. బ్రహ్మసూత్రములు (బ్ర. సూ)
38. భగవద్గీత. శ్రీధరస్వాములవారి వ్యాఖ్యానము

39. భగవద్గీత శ్రీ శంకరానందస్వాములవారి వ్యాఖ్యానమునకు శ్రీ. శ్రీ. శుద్ధచైతన్యస్వాములవారి ఆంధ్రానువాదము.
40. ఉత్తరగీత (ఉ. గీ) "వావిళ్ళ"
41. గణేశగీత (గ.గీ) ,,
42. దేవీగీత (దే. గీ) ,,
43. ఋభుగీత (ఋ. గీ) ,,
44. శ్రీ రమణగీత (ర. గీ)
45. గీతా రహస్యము. (గీ. ర) శ్రీ లోకమాన్య తిలక్‌గారి గ్రంథమునకు ఆంధ్రానువాదము
46. జ్ఞానేశ్వరి. శ్రీ జ్ఞానేశ్వరుల గీతా వ్యాఖ్యానమునకు శ్రీమతి రాణి లలితాదేవిగారి అనువాదము
47. అమృతానుభవము (అమృ) శ్రీ జ్ఞానేశ్వరులు. విజయ దుందుభి వ్యాఖ్యానము (వి. దుం)
48. అనుభవామృతము (అను) మూలము శ్రీ జ్ఞానేశ్వరులు. అమృతానుభవమునకు శ్రీ కోపూరు కోటేశ్వరరావుగారి ఆంధ్రానువాదము.
49. యోగవాసిష్ఠము (యో. వా)
50. వేదాంత పంచదశి (వే. పం)
51. భారతీయ తత్త్వశాస్త్రము (భా. త) డాక్టర్ రాధాకృష్ణ పండితుల ఇండియన్ ఫిలాసఫీకి శ్రీ బులుసు వేంకటేశ్వరుల వారి ఆంధ్రానువాదము.
52. తెలుగు విజ్ఞాన సర్వస్వము (వి.స) 6.7 సంపుటములు.
53. హఠయోగ ప్రదీపిక (హ. ప్ర) శ్రీ స్వాత్మారామయోగీంద్రు విరచితమునకు ఆంధ్రానువాదము.
54. శ్రీ శంకర విజయము — శ్రీ మాధవాచార్య కృతము, తాత్పర్యము శ్రీ శ్రీ శుద్ధచైతన్యస్వాములవారు.

55. శ్రీ వివేకానందస్వామి సంపూర్ణ గ్రంథావళి (వి. సం. గ్ర)

56. జ్ఞానయోగము (జ్ఞా. యో) శ్రీ వివేకానందస్వామి. అనువాదకుడు శ్రీ తత్త్వానందస్వామి.

57. ఉపదేశ సాహస్రి (ఉ. సా) శ్రీ శంకరాచార్య కృతము

58. మనీషా పంచకము ,, ,,

59. దక్షిణామూర్తిస్తోత్రము ,, ,,

60. దృగ్దృశ్య వివేకము (దృ. వి) ,,

61. వివేక చూడామణి ,, ,,

62. సనత్సు జాతీయము ,, ,,

63. అపరోక్షానుభూతి ,, ,,

64. ఆత్మబోధ ,, ,,

65. లలితాత్రిశతీభాష్యము శ్రీ కృష్ణమూర్తి తాత్పర్యము—

66. లలితా సహస్రనామములు

67. నైష్కర్మ్యసిద్ధి శ్రీ సురేశ్వరాచార్యులు

68. సిద్ధాంత శిఖామణి (సి. శి)
ఈశ్వరసత్యనారాయణగారి ఆంధ్రవిస్తృతి

69. కైవల్య నవనీతము. శ్రీ కనుపర్తి వేంకటరామయ్య ప్రణీతము.

70. శ్రీ సీతారామాంజనేయ సంవాదము. శ్రీ పరశురామ పంతుల లింగమూర్తి ప్రణీతము

71. ఆంధ్రమహాభారతము, కవిత్రయమువారిది

72. శాంతిపర్వము శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారిది

73. శ్రీమదాంధ్ర మహాభాగవతము. శ్రీపోతనామాత్య ప్రణీతము

74. ఆంధ్ర దేవీ భాగవతము, పూజ్యులు తిరుపతి వేంకటేశ్వరకవులు

75. మాలపల్లి—శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ ప్రణీతము.

76. సదానందయోగి శతకము
77. వేమన పద్యములు
78. ప్రపన్నామృతము (ప్ర. ప)
79. అద్వైత సుధానిధి
80. దాసబోధ (దా. బో) శ్రీ సమర్థ రామదాసస్వామి. శ్రీ కోణంకి చక్రధరరావుగారి ఆంధ్రానువాదము.
81. శ్రీ రమణలీల. శ్రీకృష్ణభిక్షువు
82. "నాయన"—శ్రీ వాసిష్ఠ గణపతి మునిజీవిత చరిత్రము—కర్త శ్రీ గుంటూరు లక్ష్మీకాంతం.
83. యోగదర్శనము. కళాప్రపూర్ణ కొ. వీరరాఘవాచార్యులు.
84. రామకథ శ్రీరామతీర్థస్వామి జీవితచరిత్ర. కర్త శ్రీ స్వామి కేశవతీర్థ.
85. అంబాస్తవము. శ్రీ కాళిదాస మహాకవి
86. మంత్ర పుష్పము
87. నవనాథచరితము
88. "విశ్వము—డాక్టర్ ఐన్‌స్టయిన్" లింకన్ బార్‌లెట్ గారి గ్రంథమునకు శ్రీ ఎ. వి. యస్. రామరావుగారి అనువాదము.

అచల మత గ్రంథములు

89. బృహద్వాసిష్ఠ సిద్ధాంతము-అను శివరామ దీక్షితీయము (బృ)
90. శుద్ధ నిర్గుణతత్వ కందార్థములు (కందా) శ్రీ భాగవతుల కృష్ణదాసు.
91. క్షరాక్షరోపాది ద్వయదోషరహిత కందములు (కం)
92. ద్విపదార్థములు (ద్వి) శ్రీ బాలారామ్
93. అనంతోపనిషత్తు

బ్రహ్మజిజ్ఞాస

చతుర్థ భాగము

ఓమ్

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

బ్రహ్మ జిజ్ఞాస

చతుర్థ భాగము

మొదటి ప్రకరణము : శివుడు - శక్తి

"నమశ్శివాభ్యాం నవయౌవనాభ్యాం
పరస్పరాశ్లిష్ట వపుర్ధరాభ్యామ్,
నగేంద్రకన్యా వృషకేతనాభ్యాం
నమోనమ శ్శంకర పార్వతీభ్యామ్."

(౧) ఆరంభము

జిజ్ఞాసువు :- మీవలన పెక్కు దర్శనముల వింటిని. ధన్యుడనైతిని. శ్రీ శివరామదీక్షితుల అచలమును గురించి చెప్పెదనంటిరి. ఇప్పుడు దానిని వినుటకు నా కర్హత కలదేని అనుగ్రహింపుడు.

వేదాంతి :- అచలవేదాంతస్థాపకులని ప్రసిద్ధిపొందిన రామడుగు శివరామదీక్షితులవారు తమ అచలబోధ, ద్వాపరయుగమునం దుండిన సాందీపనినుండి శ్రీకృష్ణభగవానునకును, వారినుండి ఉద్ధవునకును, వారినుండి శ్రీ జ్ఞానేశ్వరులకును, వారినుండి శ్రీ శ్రీధరస్వాములకును, వారినుండి తమకు (శ్రీ శివరామదీక్షితులకు)ను లభించినట్లు చెప్పిరి. వీరు చెప్పిన గురుపరంపరయందు శ్రీకృష్ణ ఉద్ధవులను వదలిన శ్రీ జ్ఞానేశ్వరులు సుప్రసిద్ధులు. శ్రీ జ్ఞానేశ్వరుల మత మిట్టిదని తొలుత తెలిసికొని, పిమ్మట శ్రీ శివరామదీక్షితుల అచల

బోధను తెలిసికొనుట మంచిది. శివరామదీక్షితులవారు జ్ఞానేశ్వరస్వామివారికోవకు చెందినవారేనా? కారా? అను విషయమును తొలుత విచారింతము.

(౨) శ్రీ జ్ఞానేశ్వరులు - వారి గురుపరంపర

శ్రీ జ్ఞానేశ్వరులనే 'సంత్ జ్ఞానదేవమహారాజ్' అని పిలుతురు. వీరు మహారాష్ట్రబ్రాహ్మణకుటుంబమున శా. శ. 1197 నకు సరియగు క్రీ. శ. 1275 వ సంవత్సరమునందలి యువ శ్రావణ బ ౮ దినమున జన్మించిరి. క్రీ. శ. 25-10-1296 సరియగు విక్రమ శకము 1353 సం॥ మార్గశిర బ ౧౩ గురువారము మధ్యాహ్నము ఆళందియను గ్రామమున జీవసమాధి నొంది రట. వీరి చరితము పావనమును కరుణారసభరితమును నగునది.

శ్రీ జ్ఞానేశ్వరస్వాములు మహారాష్ట్రభాషయందు భగవద్గీతకు "జ్ఞానేశ్వరి" అనుపేర వ్యాఖ్యను రచియించిరి. జ్ఞానేశ్వరిని ఆంధ్రమున అనువదించినవారిలో ఒకరగు భక్త సత్యనారాయణగారు జ్ఞానేశ్వరులవారిని గురించి యిట్లు వ్రాసిరి. "జ్ఞానేశ్వరమహరాజ్ పండరీపుర వార్కరీ (భక్తి) సంప్రదాయమునకు మూలపురుషుడు" "జ్ఞానేశ్వరి"ని రచియించునప్పటికి వారి వయస్సు 15 సంవత్సరములు మాత్రమేనట. ఇది క్రీ. శ. 1290 లో నేవాసేగ్రామమందలి మహాళయాదేవి మందిరమున రచియించినట్లు చెప్పుదురు.*

---

* "జ్ఞానేశ్వరి ఏకనాథునిచే యిటుకే శుద్ధము చేయబడివ దని ప్రసిద్ధి కలదు" అని శ్రీ లోకమాన్యతిలక్ మహాశయులు వారి గీతా

జ్ఞానేశ్వరిగాక అమృతానుభవము (అనుభవామృతము), చాంగదేవప్రశస్తి, హరిపథము, నామన అభంగములు అను గ్రంథములు రచియించిరి. వీరు జ్ఞానేశ్వరిని ముగించుచు, వీరి మతమునందలి రహస్యము వీరి గురుపరంపర నుండి వీరికి లభించినట్లు యీ క్రిందివిధమున వివరించిరి :—

అతి ప్రాచీన కాలమున క్షీరసాగరతీరమున శంకరుడు పార్వతీదేవి చెవియందు చెప్పినట్టి ఒక రహస్యము (ఆత్మానుభూతి అను అమృతానుభవము)ను క్షీరసాగరతీరమునందలి తరంగములయందు తేలియాడుచున్నట్టి ఒక మొసలిగర్భమునందు నివసించుచున్న మత్స్యేంద్రనాథులను వారికి లభించినది. (వినిరి). వారివలన చౌరంగీనాథులకును, వారినుండి గైనీనాథులను వారికిని, వారినుండి జ్ఞానేశ్వరుల అన్నగారగు శ్రీ నివృత్తినాథులకును, వారినుండి శ్రీ జ్ఞానేశ్వరులకును, ఆ రహస్యము లభించినట్లు చెప్పిరి. ఈ గురుపరంపర సంప్రదాయమునే హఠయోగులు సహితము చెప్పెదురు. హఠయోగప్రదీపిక యను గ్రంథమున యోగుల గురుపరంపర యిట్లు చెప్పబడినది :—

శ్లో॥ శ్రీ ఆదినాథ మత్స్యేంద్ర శాబ రానంద భైరవాః,
చౌరంగీ మీన గోరక్ష విరూపాక్ష బిలేశయాః.

పై శ్లోకమునందు చెప్పబడిన ఆదినాథుడు శివుడు. వారి శిష్యుడు మత్స్యేంద్రనాథులు. శాబర, ఆనంద భైర

రహస్యమునందు (- పరిశిష్టము - గీతలు - బ్రహ్మసూత్రములు - పుట 735) చెప్పియున్నారు. ఏకనాథులవారు శ్రీజ్ఞానదేవుల శిష్యపరంపరలోని వారు.

వులు కూడ ఆదినాథునివలననే సిద్ధులైరని పై శ్లోకము యొక్క విశేషార్థము నందు చెప్పిరి. మత్స్యేంద్రనాథుల శిష్యుడు చౌరంగీనాథులు. (హిందూస్తానీభాషలో కాళ్లు, చేతులు తరుగబడినవారికి చౌరంగియని పేరు.) మత్స్యేంద్రనాథు లొకప్పుడు భూసంచారము చేయుచుండ వారిదృష్టి కాళ్లు చేతులు తెరుగబడిన చౌరంగిపై బడ చౌరంగికి ఎప్పటియట్ల (మునుపున్నరీతిగ), కాళ్లు చేతులు మొలచిన వట. అప్పటినుండి చౌరంగి మత్స్యేంద్రుల శిష్యులై, యోగియై, చౌరంగినాథులని పిలువబడిరి. చౌరంగినాథుల నుండి క్రమముగ మీననాథ, గోరక్షనాథ, విరూపాక్షనాథ, బిలేశయనాథులు ఒకరినుండి మఱియొకరు యీ యోగమును తెలిసికొనిరి. ఈ గురుపరంపరలోనివారికి వారి నామాంత మున 'నాథ' శబ్దముండుటవలన వీరిది 'నాథ' సంప్రదాయ మందురు. 'హఠయోగప్రదీపిక' యందు పై శ్లోకము తరు వాత గల నాలుగు శ్లోకములయందును వీరి గురుపరంపరకు చెందిన యోగుల నామములు చెప్పబడినవి.

శ్రీ విద్యాసంప్రదాయమునకు చెందినవారియందు వారి గురువు, శిష్యునకు, మంత్రదీక్షనొసంగుసమయమున దీక్షానామమొసంగును. అట్టి నామము 'నాథ' శబ్దాంత ముగ నున్నట్లు యిదివఱలో (తృతీయభాగము 386, 387 పుటలయందు) తెలిపియుంటిని. కనుక శ్రీవిద్యాసంబంధమైన యోగముతోను కాశ్మీరశైవముతోను శ్రీజ్ఞానేశ్వర సంప్ర దాయమువారికి సంబంధము కలదని విదితమగుచున్నది.

కొందఱు యీ క్రిందివిధముగా చెప్పుదురు :-

మత్స్యేంద్రనాథులు దత్తాత్రేయులను ప్రసన్నులనుగా చేసికొనుటకై హిమవత్పర్వతమునం దొకచోట తపమాచరించుచుండిరి. శివుడును దత్తాత్రేయులును కలిసి ఆ పరిసరారణ్యమున విహరించుచుండ వారిదృష్టి మత్స్యేంద్రులపై బడెను. అంత శివుడు దత్తాత్రేయులతో 'నీవు పోయి అచట తపమాచరించుచుండు వాడెవడో తెలిసికొని రమ్ము' అనెను. దత్తాత్రేయులు మత్స్యేంద్రులకు దర్శనమిచ్చి, తనకొఱకే అతడు తపమొనర్చుచుండెనని మత్స్యేంద్రులవలన విని సంతసించి అతని ననుగ్రహించి అతనికి మంత్రోపదేశము చేసి మత్స్యేంద్రుని శివునిసన్నిధికి పిలుచుకొనివచ్చెను. శివుడు మత్స్యేంద్రులను చూచి దత్తాత్రేయులతో 'ఇతడు నీ శిష్యుడు లోకోపకారార్థము ఇతనికి సర్వసిద్ధులు ప్రసాదింపుము" అని చెప్పెను. దత్తాత్రేయులు ఆవిధముగా శిష్యు ననుగ్రహించి "నాథు" డను బిరుదము నొసంగిరి. అంతటినుండి మత్స్యేంద్రులు మత్స్యేంద్రనాథులని పిలువబడుటచే, వారి శిష్యపరంపరలోనివారికి, వారి నామాంతమున నాథశబ్దము చేర్చి, వారిది 'నాథ' సంప్రదాయమని ప్రచారము కలిగెను.

మహారాష్ట్రభాషలో నవనాథచరితమును వ్రాసిన "మాలు" అనుకవి, గోరక్షనాథులచే రచియింపబడిన "కిమియాగర్" అను మూలగ్రంథమును ఆధారముగా చేసికొని పై విధముగా వ్రాసిరని చెప్పుదురు.

ఇచట శివునకును మత్స్యేంద్రులకును మధ్య దత్తాత్రేయులను పేర్కొనుటచే యిది "దత్తసంప్రదాయ" మనియు అందురట.

'విజ్ఞానసర్వస్వము' నందు నాథసంప్రదాయమును గురించి యిట్లు వ్రాసిరి.

"శ్రీజ్ఞానేశ్వరులవారి కాలమునకు పూర్వమే, మరాఠీ సారస్వతమున తొలిగ్రంథమని చెప్పదగిన 'వివేకసింధు' అను గ్రంథమును రచియించిన ముకుందరాజు (క్రీ. శ. 1189) కాలమునాటికే, మహారాష్ట్రమున కొన్ని తావుల 'నాథ పంథ' అను మతసంప్రదాయము విరివిగ ప్రచారమున నుండెనట. ఆ సంప్రదాయమునకు చెందిన ఆనాటి గ్రంథములయందు 'గోరక్షామరసంవాద్' 'గోరక్షగీత' అనునవి పేర్కొనదగినవి." (వి. స. 6 వ సం॥ పుట 333)

"మహానుభావపంథతో పాటుగ వార్కరీపంథయు మరాఠీ సారస్వతమును వృద్ధినొందించెను. ఈ పంథనే 'భాగవతపంథ' అనియు వ్యవహరింతురు. ఈ పంథ వైదికసిద్ధాంతములను ప్రోత్సహించుచు, కాలానుగుణముగ ఆ సిద్ధాంతములకు కొన్ని నూత్నభావములను జోడించెను. ఈ పంథకు చెందిన కవులలో తొలుత పేర్కొనతగినవాడు జ్ఞానేశ్వరుడు. (1275-1296) ఈతడు ఆర్షకవి. వైదికమతసమ్మతము లగు భక్తి జ్ఞాన వైరాగ్యములు మాత్రమే మోక్షదాయకములని యీ మహర్షి బోధించెను."

(వి. స. 6 వ సంపుటము, పుట 339)

ఇచట ఒకవిషయము గమనింపవలయును. ఏమన? క్షీరసాగరతీరమున పార్వతీదేవికి శివుడు శ్రీజ్ఞానేశ్వర సంప్రదాయమునకు చెందిన తత్త్వమును (రహస్యమును) ఉపదే

శించినట్లు శ్రీజ్ఞానేశ్వరులవారే స్వయముగ చెప్పియున్నందున, ఆకథయొక్క వాస్తవస్వరూప మెట్టిదైనను, వీరి సంప్రదాయ సిద్ధాంతము, పైకథ ననుసరించి శైవ - శాక్త తత్త్వములకు సంబంధించినదని బోధపడుచున్నది. అనగా :- శైవ - శాక్త మతసిద్ధాంతములయందలి ముఖ్యాంశములను అధికముగ గైకొని తమ (నూతన) భావములను కొన్నింటిని వానితో చేర్చి శ్రీజ్ఞానేశ్వరులు తాము రచియించిన అనుభవామృతము (అమృతానుభవము) నందు తమ మతతత్త్వమును రూపొందించి యుండవచ్చును.

శ్రీ జ్ఞానదేవులు అమృతానుభవము మొదలగు తమ గ్రంథములు తమ మాతృభాషయగు మహారాష్ట్రభాష యందే రచియించిరి. అమృతానుభవమునందు మంగళాచరణమునందు గల మొదటి అయిదు శ్లోకములు సంస్కృతమునను, మిగత పది అధ్యాయములు గల గ్రంథమంతయు 807 మహారాష్ట్రభాషయందలి ఓవీ ఛందములుగను రచియించిరి. ఈ గ్రంథము ఆంగ్లభాషయం దనువదింపబడినది. ఆంగ్లభాషానువాదము ననుసరించి శ్రీ కోవూరు కోటేశ్వరరావుగారు "అనుభవామృతము" అను పేర ఆంధ్రమున గద్యములుగ అనువదించిరి.

ఇదిగాక మూలగ్రంథము శ్లోకరూపముగా సంస్కృతానువాదము చేయబడినది. దానికి సంస్కృతభాషయందే వ్యాఖ్యానము (టీక) సహితము వ్రాయబడినది. వాటిననుసరించి శ్రీ స్వామ్యమృతానందతీర్థ కలగ ఆంజనేయశాస్త్రి గారు "విజయదుందుభి" అను ఆంధ్రవ్యాఖ్యానమును రచి

యించిరి. నేను (ఈ గ్రంథమున) సంస్కృతశ్లోకములను, ఆంధ్రగద్యానువాదమును, విజయదుందుభినామకాంధ్రానువాదమును ఆ యా సందర్భములబట్టి యుదాహరింతును.

జ్ఞానేశ్వరియందు చెప్పబడిన గురుశిష్యపరంపరయే 'హఠయోగప్రదీపిక' యందు చెప్పబడిన నాథసంప్రదాయము. హఠయోగప్రదీపిక యొక్క టీకాకారులు రచియించిన చౌరంగి కథ జ్ఞానేశ్వరియందును గలదు. దీనినిబట్టి శివరామదీక్షితులవారు చెప్పినట్లు తమ సంప్రదాయ రహస్యము శ్రీకృష్ణ, ఉద్ధవాదులనుండి గురుశిష్యపరంపరగ శ్రీజ్ఞానేశ్వరులకు లభించినదనుటకు యెట్టి ఆధారమును లేదు. అయినను మున్ముందు శ్రీజ్ఞానేశ్వరులయొక్కయు, దీక్షితుల వారి* యొక్కయు మతములు శ్రీకృష్ణభగవానుని యొక్క మతముతో నెంతవఱకు సరిపోవునో పరిశీలించి చూడవలసి యున్నది.

జిజ్ఞాసువు :- అయ్యా! తమరు నవనాథుల చరితమని చెప్పితిరే ఆ నవనాథు లెవరు? వారిలో జ్ఞానేశ్వరులవా రొకరా?

వేదాంతి :- ప్రస్తుతాంశమునకు నవనాథుల చరితము మన కవసరము లేదు. అయినను, నీ వడిగితివి కనుక "నవనాథుల చరిత్రము" నందు చెప్పబడిన వారిని గుఱించి సంగ్రహముగా చెప్పెదను.

---

* ఈ గ్రంథమున దీక్షితులు అనగా శ్రీ రామకృష్ణ శివరామదీక్షితులని అర్థము.

పూర్వము స్వాయంభువునకు పుత్రుడు ప్రియవ్రతుడు, అతనికి అగ్నీధ్రుడు, అతనికి నాభి, అతనికి ఋషభుడను మహారాజు జన్మించిరి. శ్రీమన్నారాయణుని యేకవింశత్యవతారములయందు ఋషభావతార మొకటి. జైనులు ఋషభదేవుని ప్రథమతీర్థంకరుడందురు. అతనికి నూర్గురు కుమారులు. అందులో భరతుడు ప్రసిద్ధుడు. తక్కినవారిలో తొమ్మండుగురు అవధూతలు, ఊర్ధ్వరేతస్కులు, బ్రహ్మవిద్యావిశారదులు. వీరు విదేహరాజునకు తత్త్వోపదేశము చేసినట్లు మహాభాగవత ఏకాదశస్కంధమున కలదు.

ఆ తొమ్మండుగురు 'నవనాథ చరితము'న, నవనారాయణులని పేర్కొనబడిరి. ఒకానొకసమయమున శ్రీకృష్ణ భగవానుడు ద్వారకయందుండి నవనారాయణులను స్మరింపగా వారచటి కరుదెంచిరి. భగవానుడు వారితో "మీరు కలియుగమున జన్మించి అజ్ఞానులకు ఆత్మవిద్య నుపదేశింపుడు, నేను జ్ఞానేశ్వరులనుపేర జన్మింతును, శివుడు నివృత్తినాథుడుగను, బ్రహ్మ సోపానదేవుడుగను, రేవణమాయ ముక్తాంబగను పుట్టుదురు" అని చెప్పి పంపెను.

ఋషభదేవుని పుత్రులగు (1) కవి, (2) హరి, (3) అంతరిక్ష, (4) ప్రబుద్ధ, (5) పిప్పలాయన, (6) ఆవిర్హోత్ర, (7) ద్రమీళ, (8) చమ, (9) కరభాజను — లను వీరే కలియుగమున క్రమముగ (1) మత్స్యేంద్ర, (2) గోరక్ష, (3) జాలంధర, (4) కానిపా, (5) చర్పట, (6) నాగేశ, (7) భర్తరీ, (8) రేవణ, (9) గహనీ — అను నామముల జన్మించి ప్రసిద్ధులైరి. వీరి నామాంతమున 'నాథ' అను

బిరుదమును చేర్పవలయును. వీరే నవనాథులు. వీరుగాక మఱికొందఱు మహాత్ములు జన్మించినట్లు కలదు. వారి ప్రసక్తికి యిచట చోటులేదు.

మత్స్యేంద్రనాథులు క్షీరసాగరతీరమున సాగరమందు, మొసలిగర్భముననుండి, శివుడు పార్వతీదేవికి చెప్పిన రహస్యమును వినెనని శ్రీ జ్ఞానేశ్వరులు వ్రాసిరి. నవనాథ చరితమున క్షీరసాగరమును యమునానదిగను, మొసలిని చేపగను, మార్చి చెప్పిరి.

(3) శ్రీ జ్ఞానేశ్వర - శ్రీ శంకర - మతతత్త్వముల సంగ్రహ విచారము

శ్రీజ్ఞానేశ్వరులు శ్రీశంకరాది ఆచార్యపురుషులవలె ప్రస్థానత్రయమునకు తమ మతానుసారము భాష్యములు రచియించినవారు కారు. శ్రీజ్ఞానేశ్వరులు భగవద్గీతకు మాత్రమే వ్యాఖ్యను రచియించిరి. అదియును భాష్యము కాదు. అది కొంతవఱకు స్వతంత్రమైనదే. జ్ఞానేశ్వరి (గీతా వ్యాఖ్యానము) అమృతానుభవముల నుండి వారిమత మిట్టిదని కొంతవఱకు గ్రహింపవచ్చును. అమృతానుభవము స్వతంత్ర గ్రంథము. ఇందు తత్త్వబోధ చాలవఱకు కవిత్వధోరణిలో (కావ్యపద్ధతిలో) నడచినది. అందువలన ఆ గ్రంథమునందలి కొన్ని స్థలములయందు పాఠకులకు అర్థము సులభగ్రాహ్యము కాదు. వారి తత్త్వమునందలి రహస్యమును, వారి సంప్రదాయమునకు చెందినట్టి గురుముఖమున నుండియే గ్రహింపనగునందురు. అట్టివారికిమాత్రమే ఆ గ్రంథములు సులభ

ముగ అర్థమగునట. నా కట్టి అదృష్టము లేనందున శ్రీజ్ఞానేశ్వరమహారాజ్ గారిమత మిట్టిదని వివరించుట కష్టమైన పనియే, అయినను, కొన్ని చోట్ల నా వాక్యములలోను, కొన్ని చోట్ల అనువదించినవారి వాక్యములలోను సూత్రప్రాయముగ శ్రీజ్ఞానేశ్వరులమత మిట్టిదని తెలిపెదను.

శ్రీజ్ఞానేశ్వరులు బోధించిన తత్త్వము అద్వైతమే. అయినను పూర్తిగా శ్రీశంకరులు చెప్పిన అద్వైతము కాదు. శ్రీజ్ఞానేశ్వరులమత మిట్టిదని తెలుపునపుడు అనుషంగికముగా నైనను శంకరాద్వైతప్రసక్తి వచ్చును. అందువలన శ్రీజ్ఞానేశ్వరుల మతతత్త్వమును అర్థము చేసికొనుట సులభమగును. అదిగాక, శ్రీశంకర, శ్రీజ్ఞానదేవుల సిద్ధాంతములు పర్యవసానమున రెండును ఒక్కచోట చేరినను వారు నడచిన మార్గములు భిన్నమైనవి. శ్రీశంకరుల అద్వైత మిట్టిదని, యిదివఱలో అట్టి సందర్భము కలిగినపుడెల్లను, చెప్పియుండినను ప్రస్తుతము సంగ్రహముగా చెప్పుట దోషము కాదు. ఆ తత్త్వమిది :—

ఉన్నది ఒకబ్రహ్మమే. అది నిర్గుణము, నిరాకారము, నిరంజనము, నిరుపమము, ఏకము. బ్రహ్మేతర మేదియు లేదు, అవిద్యవలన బ్రహ్మమునే ప్రపంచముగా చూచుచున్నాము, అవిద్య అనిర్వచనీయము గనుక యిచట ద్వైతమునకు చోటు లేదు. బ్రహ్మము ప్రపంచముగా మారలేదు; మారదు. మారవలెనను సంకల్పము బ్రహ్మమునకు లేదు. మార్పులుగల ప్రతిపదార్థము నశించునదే. మార్పులేనిది కనుక బ్రహ్మము నిత్యము. మసకచీకటిలో త్రాటిని చూచి

పామని భ్రమించినట్లు బ్రహ్మమునే భ్రాంతివశమున ప్రపంచముగా చూచుచున్నాము. దర్పణమునందు పట్టణము కనబడునట్లు బ్రహ్మమునందు మాయాప్రభావమున జగత్తును చూచుచున్నాము. ఇది బ్రహ్మవివర్తవాదము.

శ్రీజ్ఞానేశ్వరులవారి మతతత్త్వమును తెలిపెదను. శ్రీశంకరులు చెప్పినట్లు వీరిది వివర్తవాదము కాదు. బ్రహ్మపరిణామవాదమును కాదు. బ్రహ్మ మొక్కటియే. అదియే ఆత్మ; అదియే విశుద్ధజ్ఞానము. ప్రపంచము ఆత్మయొక్క విలాసమే, ఆత్మయొక్క లీలయే. జలము తరంగరూపమున నున్నను జలముకంటె వేఱుకానట్లు, బంగారము ఆభరణరూపముననున్నను ముద్దగా నున్నను బంగారముకంటె వేఱు కానట్లు, ప్రపంచరూపమున నున్నది ఆత్మయే (బ్రహ్మమే). కాని యిందులో భ్రాంతియనునది లేదు. భ్రాంతి, అజ్ఞానము, అవిద్య, మాయ, అనునవి వంధ్యాపుత్రుడు, గగనకుసుమము, శశవిషాణములవలె మూడుకాలములయందును లేనివే. అజ్ఞానమనునది ఒక కారణమునకు కార్యముగాని, ఒక కార్యమునకు కారణముగాని కాదు. జ్ఞానముయొక్క అభావమునే అజ్ఞానమని లోకులందురు. ఆత్మయందలి విమర్శరూపశక్తియే* శివశక్తిద్వయముగ భాసించినది. శివుడు త్రికాలా

* ఇచట విమర్శరూపశక్తి అనగా మాయయే. ఇందులకు ప్రమాణము.

శ్లో॥ విమర్శ ఇతి తాం ప్రాహుః శైవశాస్త్రవిశారదాః,
అవిద్యామితరే ప్రాహు ర్వేదతత్త్వార్థచింతకాః.

(శ్రీ దేవీగీత 1_10)

బాధితు డగుటవలన 'సత్' శబ్దముచేతను, శివునియందున్న విమర్శరూపమగు జ్ఞాన మేదికలదో అది 'చిత్' శబ్దము చేతను చెప్పబడెను. శివశక్తులయందుగల అన్యోన్యప్రేమయే ఆనందశబ్దముచేత చెప్పబడెను. వాస్తవముగ శివశక్తు లిరు వురును ఒక్కరే యైనను విలాసమాత్రమున యిరువురుగా తోచుచున్నారు. అందు జ్ఞానము (శక్తి) వలన జగత్కల్ప నము జరిగినది. జ్ఞానమే దృశ్యరూపమున జ్ఞానమునకే గోచరమగుచున్నది. శివ శక్తు లిరువురు శుద్ధ జ్ఞానస్వరూప మగు ఆత్మకంటె భిన్నులు కారు. విశుద్ధజ్ఞానముయొక్క స్పందమే జగత్తు. కనుక, జగత్తు ఒకప్పుడును పుట్టినది కాదు. అందువలన యీ మతమును అజాతవాద మనిరి.

శ్రీశంకర, శ్రీజ్ఞానదేవుల మతమునందు ప్రధాన వైరుధ్యమును చెప్పితిని. వీ రిరువురయందుగల ఏకీభావ మేమనగా :—

జలము - తరంగము, అను నీ రెండింటియందును మనము తరంగమును చేతిలో తీసికొన్న చేజిక్కినది జలమే కదా. కనుక, సర్వమును ఆత్మస్వరూపమే, అన్నారు శ్రీజ్ఞానేశ్వరులు — జలము, తరంగము, అను నీ రెండింటి

తా॥ ఈ మాయనే శైవశాస్త్రవేత్తలు విమర్శ అని చెప్పిరి. వేదతత్త్వార్థచింతనము చేసి యథార్థమెఱిగిన మఱికొందఱు విమర్శనే అవిద్య యనిరి.

శ్లో॥ అనాద్యవిద్యాయుక్తస్సన్ జగత్కారణతాం వ్రజే.
(శివగీత 9 - 3)

అనాదియగు నజ్ఞానముతోఁగూడి జగత్కారణత్వము నందెదను.

యందు, తరంగమను నామము, నిడుపుగా ఎత్తుగా కనబడు జలముయొక్క రూపము (తరంగరూపము), అను యీ నామరూపములు రెండును మిథ్య. జలమునే తరంగ మని చెప్పుట అజ్ఞానము, ఏలయన, వాస్తవముగ అచట ఉన్నది జలమే కదా — అన్నారు శ్రీశంకరులు. ఇరువుర వాక్యములయందలి అర్థమొక్కటే. ఈవిధముగ పర్యవసానమున యిరువుర మతములు ఒక్కటిగనే యున్నవి.

సూత్రప్రాయముగ శ్రీశంకర, శ్రీజ్ఞానదేవుల మతము లిట్టివని చెప్పితిని. ఇప్పుడు శ్రీజ్ఞానేశ్వరుల వాక్యముల కొన్నింటిని ఉదాహరించి వారి మతమును దిఙ్మాత్రముగ సూచింతును.

(౪) ఆత్మ - దాని లీల

ఆత్మ (పరబ్రహ్మము)ను గుఱించి శ్రీజ్ఞానదేవులు యిట్లు చెప్పిరి:—

"... ఆత్మ స్థితియుతంబుగాని, స్థితిరహితంబుగాని కాకపోవుటంజేసి కేవల స్థితిరహితంబట్లు తెలియంబడియెడి."

"మఱియు న య్యాత్మ స్థితిరహితంబయె విరాజిల్లు నన్నచోఁ దత్ప్రత్యభావంబు నేసియుఁ దెలియంగల నరుం డెవ్వఁడగు." (అను. 4-25, 26)

"ఆత్మ స్థితియుతంబగునని వల్కుట కనుకూలంబుగ నయ్యాత్మ వర్తింపకుండు. కాని య య్యాత్మ స్థితిరహితం బని వల్కుట కేనియుఁ గారణంబు కానరాకుండు."

(అను. 7-108)

"అజ్ఞానాంధకారంబునఁ బ్రకాశవంతంబగు జ్ఞానంబు సహితము శుద్ధజ్ఞానంబుచేఁ గబళింపంబడియెడి."

(అను. 4-14)

"మఱియు నివ్విశుద్ధజ్ఞానం బన్యజ్ఞానంబుచేఁ గాంతివంతంబుగాకయును, నజ్ఞానంబుచే మఱుఁగువడకయును మహిమాయుతంబై భాసిల్లుచుండు." (అను. 4-17)

"కాని యివ్విశుద్ధజ్ఞానంబేనియు స్వస్థితిం గూర్చి యెఱుంగజాలునె? నేత్రాండంబు స్వస్వరూపంబు నాలోకింపంగల్గునె?" (అను. 4-18)

"మఱియు నయ్యాత్మ తాన దృష్టియై వర్తించుటం జేసి యాలోకనంబును గూర్చికాని, తదభావంబును గూర్చికాని యెఱుంగఁజాలకుండు. అయ్యుభయ విషయంబులకును నాత్మ తాన మూలకారణంబై యుపారుచుండు."

(అను. 7-197)

"సత్పదార్థంబు సహిత మిమ్మూఁడిఁ స్థిత్యస్థితులనం జెల్లు సామాన్య భావంబున కతీతంబై స్వాంతరస్థితంబై భాసిల్లుచుండు." (అను. 4-40)

"మఱియు నయ్యాత్మ రూపరహితంబగు సౌందర్యంబుమాడ్కిని దేహరహితంబగు యౌవనంబు పోల్కిని, గర్మరహితంబగు సిద్ధిచందంబునను విశిష్టంబై విరాజిల్లుచుండు." (అను. 5-46)

జిజ్ఞా :- ఉపనిషత్తులు చెప్పిన నిర్గుణబ్రహ్మము, పరబ్రహ్మము, పరమేశ్వరుడు, అను తత్త్వమునే శ్రీజ్ఞానేశ్వ

రులు 'ఆత్మ' యని 'విశుద్ధజ్ఞాన' మని 'సత్పదార్థ' మని చెప్పిరికదా ?

వే :- చాలవఱకును అంతే. కడపటి పద్యము (అను. 5-46) నందలి భావము ఆత్మమనోవాక్కుల కందనిదనియే. ఏలయన :— మానవబుద్ధికి రూపరహితమగు సౌందర్యము గాని, దేహరహితమగు యౌవనము గాని, మనూహ్యము. వాక్కుచే వర్ణింపజాలము.

"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ."

(తైత్తి. 2-4-1)

అను శ్రుతి తాత్పర్యమునే శ్రీజ్ఞానేశ్వరులు కవితా ధోరణిలో అట్లు చెప్పిరి.

జిజ్ఞా :- శ్రీజ్ఞానదేవులు చెప్పిన ఆత్మ తనను తా నెఱుగదు. దానిని తెలిసికొనుటకు ఆత్మేతరమగు వస్తు వేదియును లేదు. అన్యజ్ఞానము దానిని ప్రకాశింపజేయ లేదు. ఇట్లుండ ఆత్మయొక్క అస్తిత్వంబును గూర్చి యెఱిగినవా రెవ్వరు ?

వేదాంతి :- ఆత్మ తనను తా నెఱుగదనునది వేదాంతులకు సమ్మతముకాదు. "అయంపురుషః స్వయంజ్యోతిః" ఆత్మ స్వయంప్రకాశమైన వెలుగు. (బృహ. 4-3-9) మొదలగు శ్రుతులు యిందులకు ప్రమాణము. — శ్రీజ్ఞానేశ్వరులు యిట్లు చెప్పిరి :—

"అగణితరూపంబులును నిరంతరాస్తిత్వంబుఁగాంచి

కొమరొప్పుచుండినను, తత్సర్వంబున నొక్క సత్పదార్థంబ మూలంబై యలరారుచుండు." (అను. 7-124)

"ఈరీతిగా సమస్తవస్తుసముదాయంబునకును మూలకారణంబై పొల్పొందు నవిశుద్ధజ్ఞానంబు మహనీయంబగు దృష్టివైభవంబుచే నుత్తిల్లుటం జేసి విభిన్నవస్తురూపంబుతోడ నొప్పు మణిదర్పణంబు నయ్యది మగిడి నాలోకింపకుండు." (అను. 7-125)

"అంతియకాక యయ్యాత్మ క్షణక్షణంబున వస్తురూపగ్రహణంబను నవ్యభూషాసముదయంబు ధరించుచుండుటం జేసి తాను కర్తృత్వంబు సహితము కల్పించుకొనుచుండు." (అను. 7-128)

"స్వస్వరూపంబు నాలోకించు వాంఛ యొసంగుటం జేసి యేతత్సహజస్థితి జెడుపరాకుండెడు విధంబున (ద్రష్టృత్వ-దృశ్యత్వాదులగు) సమస్త స్థితివిధంబులును నుద్భూతంబులగుచుండు" — "మఱియు నయ్యాత్మ దృశ్యత్వంబుఁ దొలంగియుండఁ గోరుచున్నచో, దృశ్యత్వ విషయంబునం జెల్లు నయ్యభావంబ యచ్చో దృశ్యత్వమై యుంపారుచుండు. మఱియు నివ్విధ దృశ్యత్వంబునం జేసి యా దృశ్యత్వంబును, దదభావంబు సహిత మదృశ్యంబగు." (అను. 7-255, 256)

జిజ్ఞా :- అయ్యా! ఆత్మకు స్వస్వరూపంబు నాలోకించు వాంఛ కలుగుటకు కారణమేమి? వాంఛ (కోరిక) అపరిపూర్ణుడగు పురుషునకు కలుగవలయును, పరిపూర్ణునకు కోరిక యెట్లు కలుగును? ఆత్మ "నవ్యభూషాసముదయంబు ధరించు

చుండుటంజేసి" ఆత్మ కర్తృత్వము కల్పించుకొనిన ఆత్మకు వికారము సంభవింపదా? దాని అఖండత్వమునకు భంగము కలుగదా?

వేదాంతి :- అట్టి వికారము ఆత్మకు కలుగదనుటకు శ్రీజ్ఞానేశ్వరులు అనేక ఉదాహరణముల నిచ్చిరి. అందులో కొన్నింటిని చెప్పెదను వినుము :—

నిలిచి నిద్రించిన భద్రాశ్వము మేల్కొన్న పిదప గూడ నిలిచియే యున్నట్లు, జలము తరంగరూపము వహించి తనకు తా క్రీడించుచుండినను జలమే యైనయట్లు, అగ్ని విజృంభించి స్వీయంబగు జ్వాలావస్త్రమును ధరించిన అది అగ్నియే యైనట్లు, సూర్యుడు తన కిరణసమూహంబుకంటె భిన్నము కానియట్లు, స్వప్రకాశాచ్ఛాదితుండయ్యు చంద్రు డొక్కడ యైనట్లు, వేయి రేకులు కలిగియుండినను పద్మముయొక్క ఏకత్వము చెడనియట్లు, తత్సహజస్థితి జెడుపరాకుండెడు విధంబున ఆత్మకు వికారము సంభవింప దనిరి.

(అను. 7-134 నుండి 139 వఱకు)

జిజ్ఞా :- అయ్యా! జ్ఞానేశ్వరులవారు చెప్పిన భద్రాశ్వాదులగు న వన్నియు పరిచ్ఛిన్నములును, సావయవములును నగునవి. ఏకము శుద్ధజ్ఞానస్వరూపము నిరవయవము అగు ఆత్మ, జలము తరంగరూపమును పొందినట్లు ప్రపంచాకారమును పొందజాలదు. అదిగాక ఆత్మకు తనకు తాను చూడవలెనను కోర్కె యెట్లు కలిగినదో వారు చెప్పలేదు.

వేదాంతి :- విశుద్ధజ్ఞానముయొక్క (ఆత్మయొక్క) స్పందనమే* జగద్రూపము. శ్రీజ్ఞానదేవు లిట్లు చెప్పిరి :—

"ఇవ్విధంబుగా నాత్మదృష్టయై వర్తించినను, లేక దృశ్యపదార్థంబై భాసిల్లుచుండినను నుపర్యుక్తంబగు స్థితి ద్వయంబుంగూడ నర్థరహితంబయగు. ఏలన నాత్మయొక్క యద్వైతస్థితి యొక్కరుండ సర్వత్ర స్పందించుటం జేసి.
(అను. 7-244)

"కేవల స్పందన విషయంబునే భావించి యాలోకించుచో, మన కా స్పందనంబునకంటెను భిన్నపదార్థంబు వేరొక్కరుండు కానరాకుండు. ఇవ్విధంబుననే యాత్మ తాను వీక్షించినను నా ప్రకారంబుగ వీక్షింపకుండు."
(అను. -245)

"ఇట్లనుటంజేసి రూపత్వంబు పురోభాగంబున స్థితంబైయుండ ద్రష్టయగు నతండు తత్పార్శ్వప్రదేశంబునం జేరి దానిం గాంచునని యర్థముఁ జేయరాకుండు. ఆత్మ స్వస్వరూపదర్శనంబుఁ జేయునెడ నయ్యది తత్స్పందనంబ యగు." (అను. 7-246)

"ఆత్మవిషయంబునం గొమరొప్పుచుండు నా స్పందనంబు జలోపరిభాగంబున విజృంభించు సూక్ష్మతరంగంబుల సంచలనంబురీతి నగు. కాదేని హేమఖండంబును గప్పియుంచు హేమత్వంబుపగిది నగు. కాదేని మంత్రబద్ధం

* స్పందము = ఇంచుక కంపము; చలనము, కదలుట.

బగుటంజేసి స్వస్వరూపంబు గ్రహించు నేత్రదృష్టి నూడ్కి-నగు." అను. 7-247)

జిజ్ఞా :- నిర్గుణము, శుద్ధము, నామరూపరహితము అగు ఆత్మయొక్క స్పందనము - శుద్ధము, నామరూపరహితమై యుండవలెనేగాని, అశుద్ధము, నామరూపాత్మకము అగు జగత్తుగా కనబడుట కేమి కారణము? విశుద్ధజ్ఞానమునకు ఆకార మెచటినుండి వచ్చెను? జలోపరిభాగమున విజృంభించు సూక్ష్మతరంగము జలరూపముననే యున్నదిగాని రాళ్లు, మట్టి, మృగములు మొదలగు రూపమున లేదుకదా? హేమఖండమును కప్పిన హేమత్వము హేమరూపముననే యున్నది గాని యినుము, బురద మొదలగు రూపమున కన్పట్టుట లేదే?

వేదాంతి :- ఇది ఆత్మకొకలీల యని నుడివిరి.

జిజ్ఞా :- 'లీల' యననేమి? అ దెట్లుండును?

వేదాంతి :- శ్రీజ్ఞానేశ్వరు లిట్లుచెప్పిరి :—

"ఇట్లగుటంజేసి య య్యాత్మయొక్క లీలావిలాసంబునకు సాదృశ్యంబు గావింపరాకుండు. మఱియు నాత్మకు నాత్మయే సాటియగు." (అను. 7-266)

జిజ్ఞా :- 'లీల' యని చెప్పిన జిజ్ఞాసువగు శ్రోతకు తృప్తికలుగునా? లీలావిలాసములను ప్రదర్శించు కర్త వ్యక్తియై యుండవలయును. అతనికి స్థూలమో, సూక్ష్మమో, దివ్యమో, పాంచభౌతికమో, (శుద్ధ) సత్త్వగుణనిర్మితమో,

అల్పమగునదియో, అధికమైనదియో, ఏదియో యొక పరిమాణము గల శరీర ముండవలయును. శరీరము లేనిదే 'లీల' జరుగదు. శరీరము ఎట్టిదైనను అది పరిచ్ఛిన్నమే. (హద్దులు కలదియే) అట్టిది నశింపక తప్పదు. విశుద్ధజ్ఞాన స్వరూపమగు ఆత్మకు శరీరమున్నదని చెప్పుదురా? అప్పుడు ఆత్మ వేఱు, ఆత్మయొక్క శరీరము వేఱు, అను ద్వైతము సిద్ధించును కదా?

వేదాంతి :- లీల అను శబ్దము శ్రీజ్ఞానేశ్వరులు క్రొత్తగా ఉపయోగించినది కాదు. పురాణములయందు విష్ణులీల, కృష్ణలీల, ఈశ్వరలీల, పరమేశ్వరలీల, అని పెక్కురీతుల లీలాశబ్దము ప్రయోగింపబడినది. శ్రీమద్రామానుజాచార్యాదులగు మతాచార్యులు కొందఱు లీలాశబ్దమును వాడిరి. బ్రహ్మసూత్రములయందు సూ॥ లోకవత్తు లీలాకైవల్యం (బ్ర. సూ. 2- -౩౩) అను సూత్రమున 'లీలా' శబ్దమును ఉపయోగించియున్నారు. అచ్చటి సందర్భమేమనగా :— పరమేశ్వరుడు (పరబ్రహ్మము) జగదుత్పత్తి స్థితిలయములు చేయునని చెప్పెడివారిని వారి ప్రతిపక్షులు 'జగత్తును సృష్టించుటవలన పరమేశ్వరునకు కలుగు ప్రయోజన మేమి?' అని ప్రశ్నింపగా — జగత్తును సృష్టించుటవలన పరమేశ్వరునకు ప్రయోజన మేమియు లేనియు, అది కేవలము ఆయన లీలయనియు, సృష్టివాదులు సమాధానము చెప్పిరి.

ఇట్లు లీలయను శబ్దము పైన చెప్పిన సృష్టివాదుల వాదమునకు బలము చేకూర్చునేగాని, సృష్టియే జరుగ లేదను

అజాతవాదులగు శ్రీజ్ఞానేశ్వరులకు — 'జగత్తు ఆత్మయొక్క లీల' యని లీలాశబ్దమును తమ మతమున కనుకూలముగ ఉపయోగించుకొనుట తగదేమో యని నా సంశయము. శంకరాద్వైతులు సగుణబ్రహ్మమగు యీశ్వరునకు సృష్టి స్థితి సంహారములు లీలామాత్రములని అంగీకరింతురు. కాని, నిర్గుణబ్రహ్మమున కొక లీల కలదని అంగీకరింపరు. లీల కేవల వ్యావహారిక సత్యమేగాని, పారమార్థిక సత్యము కాదు. శంకరులవారి దృష్టిలో — లీల అనగా మాయావిలాసము. మిథ్య అని తాత్పర్యము.

శ్రీజ్ఞానేశ్వరులు "ఆత్మకర్తృత్వము సహితము కల్పించుకొనుచుండు" (అను. 7-128) అని చెప్పియున్నారు. ఆత్మకు కర్తృత్వము వేదాంతు లంగీకరింపరు. "అసంగో హ్యయం పురుషః" (బృహ. 4-3-16) ఈ పురుషుడు సంగము లేనివాడు. అని ఉన్నది. కొన్ని శ్రుతులయందు కర్తృత్వము చెప్పియున్నారు కదా? యనిన — అట్టి కర్తృత్వము ఆత్మకు ఉపాధికృతమనియే తాత్పర్యము.

జిజ్ఞా:- "ఆత్మకు శరీరము లేదు. ఉండనవసరము లేదు. ఆత్మస్పందనమే లీల" అని చెప్పారు రా? స్పందన మనగా :— కదలుట, లేక, చలనము — అనియే కదా అర్థము? అఖండము, ఏకము, అద్వితీయము, అగు వస్తువు అచలమైయుండగా దానియందు చలన మెట్లు కలుగును? పరిచ్ఛిన్న (హద్దులుగల) పదార్థమునకే చలనము కలుగును. అపరిచ్ఛిన్నము అచలము కదా?

వేదాంతి :— నీ విమర్శ సహేతుకమే. శ్రీశంకర

భగవత్పాదులుచెప్పిన మాయావాదమును అంగీకరింపకున్న యిట్టి చిక్కుల నెదుర్కొనవలసి వచ్చును. శ్రీజ్ఞానదేవ మహారాజ్ మాయావాదము సరియైనది కాదని నిరూపించుటకు వారికిగల అద్భుత తార్కికశక్తిని చూపిరి. "అజ్ఞానము (మాయ) కలదని యెవ్వరైన చెప్పిన ఆ మాటను మన మించుకయు సహింపరాకుండుదుము" అని చెప్పిరి. వీరి మతమునననుసరించి సమస్తవిశ్వమును విశుద్ధజ్ఞానముయొక్క స్పందనమే. మాయ అవిద్య అనునది వంధ్యాపుత్రునివలె మూడు కాలములయందును లేనిదే యనిరి. ఆత్మ నూతనాభరణముల ధరించుచున్నదనిరి. (అను. 7-128)

జిజ్ఞా :- అయ్యా! ఈ మతమును శాస్త్రము లంగీకరించునా? ఆత్మయందు వికారము కలుగకనే జగద్రూపమున నగునా?

వేదాంతి :- ఇది ఒకవిధమగు వేదాంతము. యోగవాసిష్ఠమునందలి నిర్వాణ ప్రకరణమున, యీ చర్చ విపులముగా చేయబడినది. ఆ విషయము తరువాత చెప్పెదను. అద్వైతులు మాయ యని దేని నందురో దానిని గురించి నే నిదివఱలో చెప్పియుంటిని. దానిని గురించి మరల తెలిసికొనుము. అందువలన తరువాత చెప్పబోవు విషయములు నీకు సులభముగ బోధపడును.

(౫) అద్వైతుల మాయావాదము

శ్రీశంకరులు 'మాయ' యని దేనిని చెప్పిరో దాని స్వరూపమును మనము విచారించి పిమ్మట జ్ఞానదేవులు

మాయ లేదని యెట్లు సమర్థింప చూచిరో చూతము. మాయనుగుఱించి శ్రీశంకరులు యిట్లు చెప్పిరి :—

"సర్వేశ్వరస్య ఆత్మభూతే ఇ వావిద్యాకల్పితే నామరూపే తత్త్వాన్యత్వాభ్యా మనిర్వచనీయే సంసారప్రపంచబీజభూతే సర్వజ్ఞస్యేశ్వరస్య 'మాయా' 'శక్తి' 'ప్రకృతి' రితి చ శ్రుతి స్మృత్యో రభిలప్యేతే." (బ్ర. సూ. శాం. భా. 1-4-3)

తా॥ "ఏవి ఇంద్రియములయొక్క అజ్ఞానముచే మూలబ్రహ్మమందుఁ గల్పింపఁబడినవో, ఏవి సర్వజ్ఞుఁడగు పరమేశ్వరునకు నాత్మభూతములుగ నున్నటులు కాన్పించునో, ఏవి జడములగుటచేఁ బరమేశ్వరునకంటె భిన్నములనియు, నభిన్నములనియు (తత్త్వాన్యత్వమును) వచించుటకు సాధ్యము కానేరదో, ఏవి జగత్సృష్టియొక్క (దృశ్యముయొక్క) వ్యాప్తికి మూలముగనున్నవో, ఆ నామరూపములనే శ్రుతి స్మృతి గ్రంథములలో సర్వజ్ఞుఁడగు నీశ్వరునియొక్క 'మాయ' యనియు, 'శక్తి' యనియు, లేక ప్రకృతి యనియుఁ జెప్పుచున్నారు."*

శ్రీశంకరుల 'వివేకచూడామణి' యందు మాయను గుఱించి యిట్లు చెప్పిరి :—

శ్లో॥ సన్నాప్య సన్నా ప్యుభయాత్మికా నో
భిన్నాప్య భిన్నా ప్యుభయాత్మికా నో,
సాఙ్గా ప్యనఙ్గా హ్యుభయాత్మికా నో
మహాద్భుతాఽనిర్వచనీయ రూపా. (వి. చూ. 111)

---

* లోకమాన్యతిలక్ గారి గీతారహస్యము (361-362 పుటలు) కర్మవిపాకము - ఆత్మస్వాతంత్ర్య మను ప్రకరణమునందలి తాత్పర్యము నుండి.

తా॥ మాయ సత్తును కాదు. అసత్తును కాదు. (ఉన్నదియు కాదు, లేనిదియు కాదు) రెండును కలసిన సదసద్రూపమును కాదు. ఆవిధముగనే యీ మాయ పరబ్రహ్మమునకంటె భిన్నమైనది కాదు. ఏలయన :— ఉన్నది ఒక్క పరబ్రహ్మమే. పరబ్రహ్మమునకంటె వేఱైన వస్తువు లేదు. కనుక — అభిన్నమా ? యనిన అభిన్నమును కాదు. పోనీ, (పరబ్రహ్మమునకంటె మాయ) భిన్నాభిన్నమును కాదు. ఏలయన :— పరస్పర విరుద్ధమగు రెండు ధర్మములు ఒకటి కానేరవు. అట్లే, మాయ అవయవములు కలదియు కాదు. నిరవయవమును కాదు. సావయవనిరవయవ ఉభయ స్వరూపమా ? కాదు. ఆశ్చర్యకరమైనది, అనిర్వచనీయ రూపమైనది.

మాయయందున్న త్రిగుణములయందు శుద్ధమగు సత్త్వగుణముగలదానిని 'మాయ' యనియును, కొంచెము అశుద్ధమగు సత్త్వగుణముగల మాయను 'అవిద్య' యనియును వ్యావహారికముగా రెండువిధములని చెప్పిరి. — అవిద్యనుగుఱించి శ్రీశంకరులే యిట్లు చెప్పిరి :—

శ్లో॥ అనాద్యవిద్యా ఽనిర్వాచ్యా కారణోపాధి రుచ్యతే,
ఉపాధిత్రితయా దన్య మాత్మాన మవధారయేత్. (ఆత్మబోధ)

తా॥ అవిద్య అనాదియైనది. అనిర్వచనీయమైనది. ఈ అవిద్య, కారణోపాధి వ్యష్టి సమష్టి భేదములచేత స్థూల సూక్ష్మప్రపంచమునకు కారణభూతము (బీజభూతము)గా నున్నది. ఆత్మ యీ మూడింటికంటె భిన్నమైనది.

శ్రీశంకరులు చెప్పిన మాయయొక్క నిర్వచనమునందు

మాయకు 'శక్తి' 'ప్రకృతి' అను నామములను పర్యాయములుగా వాడిరి. మాయయొక్క శబ్దార్థమును (ఉత్పత్త్యర్థమును) కొందఱు యీ క్రిందివిధముగా చెప్పుదురు :—

యా - మా, సా. మాయా = అనగా లేనిదగుటచే 'మాయా' అనిరి. దీనినాధారముగా కొని మాయ యనునది వంధ్యాపుత్రునివలె లేనిదే యని అచలవాదు లనిరి. కాని, శ్రీశంకరుల నిర్వచన మట్టిది కాదు. అది లేనిదేయని వారు చెప్పలేదు. మాయ లేనిదేయన్నచో అది అనిర్వచనీయ మెట్లగును? అది ఉన్నది కాదు - లేనిదియు కాదు. దానిని 'మాయ' అను పేరుతో పిలుచుటకు యిష్టపడనివారు శ్రీశంకరులు చెప్పినట్లు 'పరమేశ్వరుని శక్తి' లేక 'ప్రకృతి' అని పిలువవచ్చునుగదా? శ్రీజ్ఞానేశ్వరులు ఆత్మయొక్క శక్తిని 'శక్తి' 'ప్రకృతి' అని పిలిచిరికదా? శ్రీశంకరులు దేనిని మాయ, లేక, శక్తి యనిరో దానినే శ్రీజ్ఞానేశ్వరులు స్పందనము 'లీల' అనిరని మనము సమాధానపడినచో యిరువుర మతములను ఒకదాని సమీపమునకు వేఱొకదానిని తెచ్చినవార మగుదుము.

శ్రీవివేకానందస్వాములవారు యీ యంశమును ఒక చక్కని దృష్టాంతముతో చెప్పిరి. దాని సారాంశము నిట వివరింతును — "మాయ యను గాజుపలక మనయెదుట ఉన్నదనుకొనుము. దానినుండి మనము మన దృష్టిని ముందుకు ప్రసరించితిమేని మనయెదుటనున్న నామరూపరహితమగు నిర్గుణబ్రహ్మమే నామరూపాత్మక ప్రపంచముగ గోచరించుచున్నది. గాజుపలకను మనయెదుటనుండి తొల

గించితి మేని మనకు గోచరించునది నిర్గుణబ్రహ్మమే. (ఆత్మమాత్రమే) అన్యమేమియును లేదు. మనయెదుటనున్న గాజుపలకయే మాయ. మాయ యనగా నామరూపములే."

'మాతృత్వం యాతీతి మాయా' సమస్త జగత్తునకు మాతృస్వరూపిణి గనుక మాయా అను పేరుకలిగెనని వీరశైవులందురు. (సి. శి. 1-9) ఇదియే సరియైన యర్థము.

మాయ, ప్రకృతి, ఈశ్వరశక్తి, అవిద్య, అజ్ఞానము, నామరూపములు యివన్నియు మాయకు పర్యాయనామములు. పై నామముల నన్నింటినివదలి శ్రీజ్ఞానేశ్వరులు తమ అమృతానుభవమున ఒక్క 'అజ్ఞాన' శబ్దము (నామము)నే వాడిరి. 'అజ్ఞాన' మనునది వంధ్యాపుత్రుని వంటిదని చెప్పిన శ్రీజ్ఞానేశ్వరుల వాక్యములు కొన్నింటినిట నుదాహరింతును.

(౬) శ్రీజ్ఞానేశ్వరులుచేసిన అజ్ఞానవాదఖండనము

1. "అజ్ఞానంబు నైజంబుగ జ్ఞానమునందు వాసంబుండునో నయ్యది యా జ్ఞానంబును సహితము స్వీయంబగు నజ్ఞానపదార్థంబుగ నెందులకుఁ బరిణామం జెందింపకుండు?"
(అను. 7-8)

2. "అట్లుగాక యయ్యజ్ఞానంబు కేవల మాత్మయందు వాసంబుండి యా యాత్మనే యాచ్ఛాదించి వైచునని శాస్త్రంబులు ఘోషించు నన్నచో నందులకు సమాధానంబెద్దియున, నజ్ఞానాంధకారంబు ద్వైతదూరంబగు విశిష్టస్థితింగల్గి చెల్వొందుచున్ననాఁడ యజ్ఞానాస్తిత్వంబు నేనియుఁ దెలియంజాలిన మనుష్యుం డెవ్వఁడగు?" (అను. 7-10, 11)

3. "ఆత్మ యజ్ఞానంబుచే బరిపూర్ణంబుగ నాచ్ఛాదితంబయ్యు స్వస్థితిం దొరంగకుండుచో నజ్ఞానంబను శబ్దంబు నిరర్థకంబై పోవుట తథ్యంబగు." (అను. 7-23)

4. అదియునుంగాక యజ్ఞానంబనునది యాత్మయందు వాసంబుండుననుట తార్కికంబుగనైన యుక్తంబుగానేరకుండు." (అను. 7-34)

5. "అజ్ఞానంబు తిమిరపుంజంబై యెసంగుచో నాత్మపదార్థంబు తేజోనిదానంబై యింపారుచుండు. అట్టియెడ నజ్ఞానంబును, నాత్మయును బరస్పరైక్యంబు నొందుట యెట్లు భావ్యంబగు?" (అను. 7-25)

6. "అజ్ఞానంబనునది జ్ఞానంబునకుం గేవల విరుద్ధవిషయంబై యొప్పుచుండుకారణంబున జ్ఞానస్థానంబున వాసంబుండ నసమర్థంబగు. మఱియు, నయ్యజ్ఞానంబు స్వతంత్రంబుగనైన మనం జాలకుండు." (అను. 7-35)

7. "అజ్ఞానంబు కానరాకున్నయెడ నాత్మ ప్రకాశించుచుండు" — ననియెడు వాక్యంబులు కేవల మనుచితంబులగు. కావున విజ్ఞులిట్టి సిద్ధాంతంబు లామోదింపరాకుండు." (అను. 7-37)

8. "అజ్ఞానంబనునది యివ్విధంబుగం బ్రత్యక్షానుమానాది ప్రమాణంబులచేతనైన సాధింపజాలకుండుటం జేసి యయ్యది కేవలస్థితిరహితంబయని నిరూపింపబడియె."

(అను. 7-55)

9. "మఱియు, నీ యజ్ఞానంబనునది యెవ్విధకార్యం

బునకుఁ గారణంబుగాని, యెవ్విధకారణంబునకుఁ గార్యంబు గాని కాకపోవుటం జేసి, యు య్యజ్ఞానంబును గూర్చి యది యొక నిత్యవిషయంబని విశ్వసించుటకు భయంబయ్యెఁ." (అను. 7-56)

10. "కావుననే న య్యజ్ఞానంబనియెడి శబ్దంబును స్వప్నమునందేనియు నుచ్చరింప నొల్లకుండుదును. కాని, యెట్టకేల కయ్యజ్ఞానభావం బొకరుండు మనంబునం దోచు." (అను. 7-65)

11. "దృగ్గోచర ప్రపంచంబునం దింపారు సమస్త కార్యకలాపంబును జ్ఞానమూలంబునం జేసి ప్రకాశవంతం బై యెసంగుచుండ న య్యజ్ఞానప్రవాహంబు నిందు గొనిరా నర్హంబై యుండునె." (అను. 7-100)

ఈవిధముగ శ్రీజ్ఞానేశ్వరులు అజ్ఞానమనునది వంధ్యాపుత్రునివలె త్రికాలములయందును లేనిదేయని పెక్కురీతుల అనేక ఉపమానములను, యుక్తులను చూపి చెప్పిరి. ఇదివఱలో మాయావాదమును నిరసించినవారు జగత్తు మిథ్యకాదని, మాయ జగత్కారణముకాదని చెప్పిరేగాని శ్రీజ్ఞానేశ్వరుల వలె మాయ, అవిద్య, అజ్ఞానము వంధ్యాపుత్రునివలె అభావమని చెప్పియుండలేదు. శ్రీజ్ఞానేశ్వరులు అజ్ఞానఖండనమునకు చెప్పిన ఒక్కొక్క అంశమునకు (పైన చూపినట్లు 1 నుండి 11 వఱకు గల అంశములకు) శంకరాద్వైతులు చెప్పునట్టి సమాధానమును వరుసక్రమమున సంగ్రహముగా చెప్పెదను.

(౨) అజ్ఞానవాదఖండనమునకు అద్వైతుల సమాధానము

1. సమాధానము :- బ్రహ్మము అజ్ఞానమునకుగాని, మఱి దేనికిగాని విరోధి కాదు. అదిగాక — మాయ (శ్రీజ్ఞానేశ్వరుల పరిభాషలో అజ్ఞానము) బ్రహ్మమునకంటె వేఱనిగాని, వేఱుకాదనిగాని చెప్పుటకు వీలు లేనందున జ్వాల అగ్నిని దహింపజాలనియట్లు అజ్ఞానము దాని ప్రభావమును తనకాధారమగు బ్రహ్మమునందు చూపజాలదు. అనగా బ్రహ్మమును అజ్ఞానస్వరూపముగా పరిణతినొందింపజాలదు.

2. సమాధానము :- పైన చెప్పిన సమాధానమునే యిచటను అనుసంధించుకొనవలెను. బ్రహ్మమునందంతటను మాయ లేదు. 'ఏకాంశేన స్థితో జగత్' అను గీతావాక్యము ననుసరించి బ్రహ్మమునందు మాయ ఏకదేశస్థమైయున్నది. మాయ బ్రహ్మమునకు విరోధికాదని యిదివఱకే చెప్పితిని. మాయకు ఆధారము బ్రహ్మమే.

3. సమాధానము :- 'మాయ' యన కేవలము అజ్ఞానమనియే భావింపరాదు. జ్ఞానాజ్ఞానములు రెండును మాయయే. జ్ఞానాజ్ఞానముల రెండింటికిని అతీతమగు ప్రజ్ఞానము (శుద్ధజ్ఞానము)ను, అజ్ఞానము అజ్ఞానముగా మార్చలేక పోయినంతమాత్రమున అజ్ఞానము అభావమగునా? సీతాదేవిని అగ్ని దహింపజాలకపోయినంతమాత్రమున అగ్నియందు దహనశక్తి లేదందుమా? హాలాహలము శివుని చంపలేకపోయినంతమాత్రమున దానియందు ప్రాణిని చంపు శక్తి లేదందుమా?

4. సమాధానము :- అజ్ఞానము కలదని శాస్త్రము

లంగీకరించుచున్నవి. శ్రుతివిరుద్ధమైన తర్కము నిరుపయోగము. ఆత్మయే అజ్ఞానమున కాశ్రయమను అంశమును ముందు నిరూపింతును.

5. సమాధానము :- బ్రహ్మమునకు మాయకు తేజస్తిమిరములకున్న విరోధము లేదు. ఆత్మకు (బ్రహ్మమునకు) మాయ (అజ్ఞానమున)కు గల సంబంధము శక్తికిని శక్తిమంతునకును గల సంబంధమువంటిది. ఆత్మ స్వరూపజ్ఞానము అవిద్యను (అజ్ఞానమును) నశింపచేయదు. సంయక్ (వృత్తి) జ్ఞానము అవిద్యను నశింపజేయును. ఆత్మ అజ్ఞానమునకు ఆశ్రయము. కనుక ఆత్మ విరోధి కాదు. సంయక్ జ్ఞానమే అజ్ఞానమునకు విరోధి. మానవునియందు సత్త్వగుణాధిక్యత వలనను ఆత్మానాత్మ విచారము వలనను, తత్త్వమస్యాది మహావాక్య శ్రవణము వలనను సంయక్ జ్ఞానము కలుగును. ఆత్మ - జ్ఞానాజ్ఞానములకు ఆశ్రయము.

6. సమాధానము :- పైన చెప్పబడిన (5-వ) సమాధానమే ఆఱవ ప్రశ్నమునకును సమాధానము. అజ్ఞానము స్వతంత్రముగా ఉండజాలదనుట అద్వైతు లంగీకరింతురు.

7. సమాధానము :- ఆత్మ సూర్యుని వంటి వాడు. అజ్ఞానము మేఘమువంటిది. సంయక్ జ్ఞానము మహామారుతమువంటిది. మేఘావృతుడైన సూర్యుడు బాగుగా కనపడడు. కాని, సూర్యకాంతి సహాయముననే మనము మేఘమును చూడగలుగుచున్నాము. పెద్దగాలి వీచుటవలన మేఘము తొలగిపోయి సూర్యుడు బాగుగా కనపడును. అట్లే సంయక్ జ్ఞానముచే అజ్ఞానము నశింపగా ఆత్మ సాక్షా

త్మాకారమగును. మేఘము సూర్యుని యెల్లప్పుడును గాని సంపూర్ణముగ గాని కప్పియుండలేదు. ఆత్మ సూర్యునివలె యెల్లప్పుడును ఒక్కరీతిగనే ప్రకాశించుచుండును. గీత యొక్క యీ క్రింది శ్లోకమునకు శ్రీజ్ఞానేశ్వరులు వ్రాసిన వ్యాఖ్యానమే వారి (7-వ) ప్రశ్నమునకు సమాధానమగుచున్నది.

శ్లో॥ జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః,
తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్. (గీత. 5-16)

(ఈ శ్లోకమునకు శ్రీజ్ఞానేశ్వరులు వ్రాసిన వ్యాఖ్యనే యీ క్రింద చెప్పెదను.)

“ ఈఅజ్ఞానము పూర్ణముగా నష్టమైనతరువాత భ్రాంతి అను చీకటి కూడా నశించి మనుష్యునికి, ‘ నేను ఈశ్వరుడను అకర్తను ’ అను అనుభవము కలుగ నారంభించును. ‘ ఈశ్వరుడు అకర్త ’ అను విషయము మనస్సులో నిశ్చయమైన, ‘ నేను ఈశ్వరుడను ’ అను తత్త్వము పూర్ణముగా సిద్ధించును. ఇట్టి జ్ఞానము ఒక్కమారు చిత్తములో ప్రవేశించిన యీ త్రిభువనమున భేదభావము ఉండనే ఉండదు. మనుష్యుడు ఇట్టిస్థితిలో ముక్తుడై సమస్త జగత్తును ఆత్మస్వరూపముతోనే చూచును. తూర్పున సూర్యోదయమైనదని ఆ దిశయందే ప్రకాశము వ్యాపించి ఇతర దిశలయందు చీకటి మిగిలియుండునేమో నీవే చెప్పుము. ”

(ఆంధ్రజ్ఞానేశ్వరి. 5-16)

పై గీతావ్యాఖ్యానమువలన జ్ఞానదేవుల 7-వ ఆక్షేపణ ఖండింప బడినది.

8. సమాధానము :- శ్రుతి, అనుభవజ్ఞానము వీటి వలన అజ్ఞానము స్థితియుతమని తెలియబడును. కాని, దానిని 'సత్తు' ని గాని 'అసత్తు' ని గాని చెప్పుటకు వీలులేనందున అనిర్వచనీయ మనిరి. స్థితిరహితమని నిరూపింపబడ లేదు.

9. సమాధానము :- అజ్ఞానమునకు కారణము లేదు. దానికి కార్యము కలదు. దాని కార్యమే అనాత్మ. అనగా జడద్రవ్యము.

10, 11. సమాధానము :- శ్రీజ్ఞానేశ్వరులు అజ్ఞాన శబ్దమును స్వప్నమునందైనను నుచ్చరింప నొల్లకున్నను "యెట్టకేల కయ్యజ్ఞానభావం బొకరుండు మనంబునం దోచు" అని అంగీకరించియున్నారు. —

అజ్ఞానము (మాయ)యొక్క అస్తిత్వమును శాస్త్రము లేవిధముగ అంగీకరించియున్నవో తెలిపెదను.

(౮) అజ్ఞానము (మాయ) కలదనుటకు శాస్త్రప్రమాణము

మాయ కలదని అది బ్రహ్మమును కప్పియున్నదని ఋగ్వేదమునందలి యీ క్రింది ఋక్కు చెప్పుచున్నది.

"తమ ఆసీ త్తమసా గూఢ మగ్రే
ప్రకేతం సలిలం సర్వమా యిదమ్,
తుచ్ఛేనాభ పిహితం యదాసీత్
తపసస్త న్మహినాఽజాయతైకమ్."

తా॥ "అంధకారముండెను. ఆరంభమునం దిది యంతయు నంధకారముచే వ్యాప్తమును, (మఱియు) భేదా

భేదవిరహితో జలముగ నుండెను. లేక, ఆభు, అనగ సర్వ వ్యాపియగు బ్రహ్మము (ఆరంభముననే) తుచ్ఛము చేతనే, అనగా అసత్యమగు మాయచేతనే, యాచ్ఛాదితమైనది. అని (యత్) ఏది (చెప్పబడుచున్నదో) అది (తత్) మూలమున నొకటియే (బ్రహ్మమే) తమస్సుయొక్క మహిమచే (రూపాంతరముచేఁ) బిదపఁ బ్రచురమైనది.''

పై ఋక్కునందు మాయ 'తుచ్ఛ' శబ్దముచేత చెప్పబడినది.

"విద్యాదృష్ట్యా శ్రుతంతుచ్ఛం తస్య నిత్య నివృత్తితః.
(వే. పం. 6-129)

తా॥ జ్ఞానదృష్టిచేత ఎల్లప్పుడును నివర్తించుటవలన (మాయ) తుచ్ఛమైనది.

శ్లో॥ తుచ్ఛాఽనిర్వచనీయాచ వాస్తవీచేత్యసౌ త్రిధా,
జ్ఞేయం మాయా త్రిభిర్బోధైః శ్రౌతయౌక్తికలౌకికైః.
(వే. పం. 6-130)

తా॥ "తుచ్ఛ (మాయ) శ్రౌతసంబంధమగు దృష్టిచేత మూడుకాలములయందు లేనిదేయనియు, యుక్తిసంబంధమగు దృష్టిచేత చెప్పనలవికాని (అనిర్వచనీయమైన)దనియు, లోకసంబంధమగు దృష్టిచేత సత్యమైనదనియు (తుచ్ఛ, అనిర్వచనీయ, వాస్తవి, అని మూడు విధములు గలదిగ) తెలిసికొనవలయును."

"ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే." (ఋ. 6-47-18)

"తనమాయచే ఇంద్రుడు అనేకరూపముల బొందు చున్నాడు" అని చెప్పబడినది.

మం॥ విద్యాం చావిద్యాంచ యస్తద్వేదోభయగ్ంసహ,
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే.
(ఈశావాశ్య శ్రుతి. 11)

తా॥ విద్యావిద్యల తత్త్వమును తెలిసిన తత్త్వ విదుడు అవిద్యారూపమగు మృత్యువును దాటి విద్యవలన గలుగు అమృతమును (పరమాత్మను) తెలియుచున్నాడు.

మం॥ హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్,
తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే.
(ఈశా. 15)

తా॥ ఓ సూర్యభగవానుడా! సత్యము యొక్క ముఖము బంగారుపాత్రచే మూయబడియున్నది. సత్యధర్ముడ నైన నేను నిన్ను చూచుటకై పై మూతను దీయుము. అనగా నామరూపము లనుమాయయే బంగారుపాత్ర. దానిని తొలగించిన సత్యము (పరబ్రహ్మము) చూడగలను. అని సూర్యుని స్తుతించినది.

శ్రు॥ అవిద్యాయా మంతరే వర్తమానాః,
స్వయంధీరాః పండితం మన్యమానాః. (కఠ. 1-2-5)

తా॥ అవిద్య (అజ్ఞానము)చే కప్పబడినవారు తామే బుద్ధిమంతులమనియు పండితులమనియు భావింతురు.

ఈ మంత్రమే ముండకశ్రుతి 1-2-8 వ మంత్రముగా కొలది మార్పులతో చెప్పబడినది.

శ్రు॥ అవిద్యాయాం బహుధా వర్తమానా
వయం కృతార్థా ఇత్యభిమన్యంతి బాలాః.
(ముండక. 1-2-9)

తా॥ అవిద్య (అజ్ఞానము) వలన నానాజన్మముల నొందుచు, తాము కృతార్థులమని బాలబుద్ధిగలవారలై మోహితులగుదురు.

శ్లో॥ త్రిభిర్గుణ మయై ర్భావై రేభి స్సర్వ మిదం జగత్,
మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్. (గీత. 7-13)

తా॥ త్రిగుణాత్మక మాయచే మోహింపబడిన మానవులు పరుడను అవ్యయుడను అగు నన్ను తెలిసికొనలేరు. (మాయ అడ్డుపడుచున్నదనికదా భగవానుడు చెప్పెను.)

శ్లో॥ దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా,
మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే.
(గీత. 7-14)

ఈ శ్లోకమునకు శ్రీజ్ఞానేశ్వరులు వ్రాసిన వ్యాఖ్యానము యిట్లున్నది :—

"ఓ అర్జునా! మహత్తత్త్వము మొదలగు నా మాయను దాటి నా మూలరూపమును ఎట్లు పొందుట అను ప్రశ్న ఉదయించుచున్నది...... కొందఱు అజ్ఞానము అనెడి గుండములో అభిమానముయొక్క నోటిలో పడిపోవుదురు"
(ఆంధ్రజ్ఞానేశ్వరి)

పై శ్లోకముయొక్క తాత్పర్యమేమనగా :— నన్ను చేరుటకు నా మాయ అడ్డుతగులుచున్నది. అది దాటుటకు

శక్యముకానిది. నన్ను శరణుపొందినవారు మాత్రమే దానిని తరింపగలరు.

శ్లో॥ న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః,
మాయయాఽపహృతజ్ఞానా ఆసురం భావ మాశ్రితాః.
(గీత. 7-15)

తా॥ పాపముచేసిన మూఢులగు నరాధములు మాయచేత అపహరింపబడిన జ్ఞానము గలవారలై అసుర స్వభావులై హింసాదికర్మలు చేయుచు నన్ను శరణుపొందరు.

శ్లో॥ నాహం ప్రకాశస్సర్వస్య యోగమాయా సమావృతః,
మూఢోఽయం నాభిజానాతి లోకో మా మజమవ్యయమ్.
(గీత. 7-25)

తా॥ యోగమాయచేత కప్పబడి మోహమునొందిన వారికి నా స్వరూపజ్ఞానము లేదు. అందువలన నన్ను నాశరహితునిగా నెఱుగరు.

అవిద్యకు యోగమాయ యనునది పర్యాయపదమే. ఇది పరమేశ్వరునకు సంబంధించినదే కనుక అదియే ఆయన లీల. ఆయనను ఆయనలీలయే కప్పినది — శ్రీజ్ఞానేశ్వరులు "జ్ఞానమును అజ్ఞానము కప్పజాలదనిరి కదా? (అను. 7-10, 11) ఈ సిద్ధాంతము యీ క్రింది గీతావాక్యముచే ఖండింపబడినది.

శ్లో॥ "అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః."
(గీత. 5-15)

తా॥ అజ్ఞానము జ్ఞానమును కప్పియున్నది. కాన, మానవులు అవివేకులై మోహమును చెందుచున్నారు.

(శ్లోకమునందు 'జంతవః' అని యన్నందున మానవులు మాత్రమే కాదు, పుట్టుకగల సమస్త ప్రాణులు అని అర్థము.)

సూర్యుని మేఘము కప్పినదని లోకు లనుచున్నారు. అది వ్యావహారిక సత్యమే గాని పారమార్థిక సత్యముకాదు. మనము మనశరీరము కనపడకుండులాగున వస్త్రమును కప్పుకొందుము. ఆవిధముగ మేఘము సూర్యుని కప్పజాలదు. అది సూర్యుని సమీపింపజాలదు. కాని, మేఘము మన నేత్రమునకును సూర్యునకును మధ్యగా ఉండునప్పుడు మన దృష్టికిమాత్రమే మేఘము అడ్డుతగులుచున్నది. మేఘము సూర్యుని పూర్ణముగ కప్పియుండిన మనదృష్టికి సూర్యుడే కాక మేఘము సహితము గోచరింపదు. అట్లే బ్రహ్మమును మాయ పూర్ణముగ ఆవరించియుండ లేదు.

జిజ్ఞా:- ప్రాచీన ఉపనిషత్తులయందు 'మాయ' ను గురించి చెప్పబడలేదందురు. మీరును ముండక, కఠ, శ్రుతులనుండి ఉదాహరించిన వాక్యములయందు 'అవిద్యా' శబ్దమునే ఉదాహరించితిరి.

వేదాంతి :- మాయాస్వరూప నిర్వచనమునందు శ్రీశంకరులు నామరూపములకే 'మాయ' అను నామమును చెప్పియున్నారు. పారమార్థికదృష్టితో చూచిన నామరూపములు లేనివేయగుటచే పట్టుకు చిక్కనవికావు. కాని, వ్యావహారికదృష్టితో చూచిన అవి సత్యములే. ప్రాచీన

శ్రుతులయందు నామరూపములకు ఎచట సత్య శబ్దము నుపయోగించిరో, అచట నామరూపములకు పరమునందున్న పరబ్రహ్మమునకు అమృతశబ్దము నుపయోగించిరి. తరువాత రానురాను వ్యావహారికదృష్టితో కాక సత్యదృష్టితో (పారమార్థికదృష్టితో) పూర్వము సత్యశబ్దము నుపయోగించిన నామరూపములకే మాయాశబ్దము నుపయోగించి అమృతశబ్దమునకు బదులు పరబ్రహ్మమును సత్యశబ్దముతో పిలిచిరి. మఱియు సవిమర్శగా అర్థమగుటకై బ్రహ్మమును 'సత్యస్య సత్యం' వ్యావహారిక సత్యమునకంటె పరమునందున్న సత్యమని చెప్పిరి. ఈ యంశమును శ్రీలోకమాన్యతిలక్ మహాశయులు వారి గీతారహస్యమునందలి 'అధ్యాత్మము' అను ప్రకరణమునందు (పుటలు. 304, 305) విపులముగ చర్చించిరి.

అజ్ఞానము అభావమని శ్రీజ్ఞానేశ్వరులు అనేకవిధముల చెప్పియుండియు, వారే గ్రంథమున అజ్ఞానము కలదనునట్టి అర్థమిచ్చు వాక్యముల కొన్నింటిని వ్రాసియున్నారు. వాటిలో కొన్నింటి నిచట ఉదాహరించుచున్నాను.

"అజ్ఞానాంధకార మధ్యంబునం బారాడుచు, స్వానుభూతినొందుచుఁ జెల్వొందు న స్వశుద్ధజ్ఞాన సంగ్రహ కార్యంబున సహాయంబొనర్చు న గ్గురుదేవునకుం బ్రణామంబు గావించెద." (అను. 2-2)

"మాయామత్తేభంబునుఁ గూల్చివైచి తత్కుంభస్థల స్థితంబగు రత్నచయంబుఁగాని మగిడిఁ ద (మత్తేభము) దర్శణంబుఁ గావింపగల్గి....." (అను. 2-3)

"అజ్ఞానాంధకారంబునఁ బ్రకాశవంతంబగు జ్ఞానంబు సహితము శుద్ధజ్ఞానంబుచేఁ గబళింపబడియెడి." (అను. 4-14)

"ఇవ్విధంబున నజ్ఞానంబు సహితము స్వాస్తిత్వంబును గాంచు నవసరంబున మిథ్యాజ్ఞానంబును గల్పించు." (అను. 3-10) అని వ్రాసియున్నారు.*

జిజ్ఞా :- అయ్యా! శ్రీజ్ఞానదేవులే స్వయముగా యిట్లు వ్రాసియు మాయావాదఖండన మేల చేసిరో నాకు బోధపడ లేదు. బహుశః వారిదృష్టిలో అజ్ఞానమనునది ఒక భావ పదార్థము కాదనియు, జ్ఞానముయొక్క అభావము నే లోకులు అజ్ఞాన మందురని భావించి యుండవచ్చును. లేదా జ్ఞానముయొక్క ప్రాగభావమే అజ్ఞానమని అనుకొని యుండవచ్చునా?

వేదాంతి :- ఆవిధముగ తలంచుటకు వారి మతము ననుసరించి వీలులేదు. ఏమన? సర్వమును జ్ఞానస్వరూపమై యుండ దాని ప్రాగభావమును భావించుటకు వీలులేదు. ఈ యంశమును శ్రీ సురేశ్వరాచార్యులు తమ 'నైష్కర్మ్య

---

* ఈ యర్థమే సంస్కృతానువాదమునం దిట్లున్నది.

శ్లో॥ అవిద్యా ప్రతిబంధాచ్చ భవచక్రేణ పీడితమ్,
కారుణ్యా జ్జీవచైతన్యం యో మోచయతి దుఃఖతః.
(అమృతా. 2-2)

శ్లో॥ మాయానాగం విదార్యాథా శయతి ముక్తి మౌక్తికం,
సద్గురుం హరిరూపం తం నివృత్త్యాఖ్యం నమామ్యహమ్.
(అమృతానుభవము. 2-3)

సిద్ధి' యందు (అ. 3. 2-63) విచారించి ఖండించిరి. ఇట్లుండ శ్రుతిస్మృతులయందు మాయ (అజ్ఞానము) స్థితియుతమని నిరూపింప బడియున్నదను విషయమున ఇంకను సంశయ ముండునా ?

అదిగాక మన నిత్యానుభవమునందు చూడుము 'మామహం జానామి' నన్ను నే నెఱుగుదును 'మామహం నజానామి' నన్ను నే నెఱుగను, ఇత్యాది వాక్యముల యందు జ్ఞానాజ్ఞానములు రెండును స్వానుభవమునందు వ్యక్తమగుచున్నవి. నీవు ఆత్మవై యుండగా దేహమునననియు, నీవు నిత్యుడవై యుండగా అనిత్యుడననియు, పొరపడుటకు హేతు వేదియో అదియే అవిద్య. ఇది స్వానుభవము. అజ్ఞానమే లేకపోయినచో లేని అజ్ఞానమువలన నీకిట్టి పొరపాటు కలుగజాలదు. అజ్ఞానము వంధ్యాపుత్రునివంటి అభావము కాదనుటకు శంకరాద్వైతులు చెప్పిన సమాధానము వింటివి. ఇంతకంటెను యెక్కువగ చెప్పనవసరము లేదనుకొందును.

జిజ్ఞా :- తమ వాక్యములవలన అజ్ఞానము వ్యావహారికముగ స్థితియుతమైనదే యని నిశ్చయించుకొంటిని. కాని, అజ్ఞానము ఆత్మ నాశ్రయించుకొని యున్నదను విషయమై సంశయమున్నది. దానిని వివరింపుడు.

(౯) ఆత్మయే అజ్ఞానమునకాశ్రయము

అద్వైతు లిట్లు చెప్పుదురు :- ఆత్మ - అనాత్మ అను రెండు పదార్థములుమాత్రమే కలవు. ఇవిగాక మూడవ

దేనియును లేదు. అందు ఆత్మ సత్యము, అనాత్మ అసత్యము. నేనీ జగత్తును చూచుచున్నాను. జగత్తు నాచేత చూడబడుచున్నది. ఇచ్చట చూచువా డొకడును, చూడబడున దొకటియు నను రెండు పదార్థములు పరస్పర భిన్నములనుట నిస్సంశయము. చూచువాడు ద్రష్ట, చూడబడునది దృశ్యము. ద్రష్ట అనగా: చూచునట్టి స్వభావముకలవాడు. దృశ్యము అనగా: చూడబడునట్టి స్వభావముకలది. భిన్న స్వభావములుగల యీ రెండును. ఒక్కటి కానేరవు. దృశ్య పదార్థము జడము. అది తన్ను తా నెఱుగదు. ఇతరమును తా నెఱుగదు. ఇతరమును యెఱుగజాలదు. కనుక అది అనాత్మ. తన్ను తా నెఱుగుచు దృశ్యము నెఱుగునట్టివాడు ఆత్మ.

ఆత్మ, అనాత్మ అను నీ రెంటియందు అజ్ఞానము దేనినైన నొకదాని నాశ్రయించుకొని యుండవలయును కదా? ఆత్మానాత్మలయందు అజ్ఞానమున కాశ్రయ మేది? అని మనము విచారించిన, జడమగు అనాత్మ అజ్ఞానమున కాశ్రయము కాజాలదు. ఏలయన:— అనాత్మకూడ అజ్ఞానమే. అజ్ఞానము అజ్ఞానమున కాశ్రయము కాజాలదు. అనాత్మ అజ్ఞానముయొక్క కార్యమని అంగీకరింపక తప్పదు. అజ్ఞాన కార్యమైన అనాత్మ అజ్ఞానమున కెట్లు ఆశ్రయమగును? అనాత్మ కలుగుటకు పూర్వమే అజ్ఞాన ముండెనుకదా? అప్పుడు అజ్ఞానమున కాశ్రయ మేది? ఆత్మానాత్మలయందు అనాత్మ అజ్ఞానమున కాశ్రయము కాదని స్థిరపడిన పిదప ఆత్మయే అజ్ఞానమున కాశ్రయమని తేలినది. త్రాటియందు

పామువలెను, శుక్తియందు రజతమువలెను ఆత్మయందు అజ్ఞానమువలన అనాత్మ తోచుచున్నది. మన అనుభవము కూడ యీ విషయమునే ధృఢపరుచుచున్నది. ఎట్లన :—

జడపదార్థ మేది యైనను 'మామహంనజానామి' నన్ను నే నెఱుంగను, అనిగాని 'నజానామి' ఎఱుగను అని గాని చెప్పుటలేదు. లేక, తలచుటలేదు. అంతఃకరణ ముండినచే అజ్ఞాన ముండును. ఒక ఘటమునకు 'నేను ఘటమును' అను జ్ఞానము లేదు. ఏలయన? దానికి అంతఃకరణము లేదు. అది జడము. అజ్ఞాన నివర్తకమగు సంయక్ జ్ఞాన మెచ్చట నుండునో (దేని నాశ్రయించి యుండునో) అచ్చటనే అజ్ఞాన ముండును. అనాత్మ యందు సంయక్ జ్ఞానము లేదు. కనుక అజ్ఞానము లేదు. మఱియొక విషయ మేమన :—

అజ్ఞానము కారణము, అనాత్మ దానియొక్క కార్యము. అందువలన కారణము కార్యము నాశ్రయించియుండదు. ఎన్నివిధముల చూచినను అనాత్మతో అజ్ఞానమునకు ఆశ్రయాశ్రయీ సంబంధము లేదు. అవి రెండును ఒకదానిని వేఱొకటి యెఱుగవు. కనుక, నారెంటికి విషయ విషయి సంబంధము కూడ లేదు. ఇట్లు ఆత్మానాత్మలయందు అనాత్మ అజ్ఞానమునకు ఆశ్రయము కాదనియు, అనాత్మ పదార్థము అజ్ఞానమునకు విషయము కాదనియు, స్థిరపడిన పిదప ఇక మిగిలియుండునది ఆత్మయే అయినందున ఆత్మయే అజ్ఞానమునకు ఆశ్రయము. అదియెట్లో యింకను వివరింతును.

1. ప్రమాజ్ఞానము (ఇదియే సంయక్ జ్ఞానము). 2.

సంశయ జ్ఞానము. 3. మిథ్యా జ్ఞానములచేత బుద్ధియే శేషించుచున్నది. ప్రమాజ్ఞానము అబాధితార్థమును తెలియ చేయును. అనగా త్రాటిని చూచి 'ఇది త్రాడు' అని తెలిసి కొనును. సంశయజ్ఞానము మసక చీకటిలో త్రాటిని చూచి 'ఇది త్రాడా? పామా?' అని సంశయించును. మందాంధ కారములో తాటినిచూచి పామని తలచుట మిథ్యాజ్ఞానము. ఈ మిథ్యాజ్ఞానమునే విపర్యయజ్ఞానమందురు.

ఈ మూడును యెచట నుండునో అచటనే అజ్ఞానము ఆశ్రయించి యుండును. ఈ త్రివిధ జ్ఞానములకును ఆత్మయే ఆశ్రయము. అనాత్మగాని దాని కార్యములగు ఘట కుడ్యా దులుగాని అజ్ఞానమునకు ఆశ్రయములు కావు. కనుకనే ఆత్మా శ్రయమైన సంశయ మిథ్యాజ్ఞానములను సంయక్ జ్ఞానము తొలగించుచుచున్నది. శాస్త్రములు సహితము అజ్ఞానము ఆత్మ నాశ్రయించి యున్నదని నిరూపించినవి. ఇందుకు ఉదా హరణము :—

నారదమహర్షి సనత్కుమారమహర్షికడ కేగి "ఓ భగవానుడా! ఋగ్వేదాదుల నెఱిగితిని ఆత్మనెఱిగినవాడను కాను" అని చెప్పినట్లు ఛాందోగ్య శ్రుతియందు కలదు. ఇచట నారదమహర్షి తనకుగల అజ్ఞానానుభవమును తెలియ చేసెను.

అజ్ఞానమునకు అనాత్మ ఆశ్రయమని చెప్పిన యేదోష ములు సంభవించునో అట్టి దోషములు ఆత్మ అజ్ఞానమున కాశ్రయమని చెప్పిన కలుగవు. అజ్ఞానమునకు ఆత్మ ఆశ్రయ మైనందుననే నిత్య శుద్ధ బుద్ధ మగు అద్వితీయాత్మవస్తువు

తాను అనిత్య అశుద్ధమగు దేహాదికముగ భావించుచున్నది. ఈ కారణములవలన ఆత్మ - అజ్ఞానములకు ఆశ్రయ ఆశ్రయీభావ సంబంధము, విషయ విషయీభావ సంబంధము కూడ కలవు.

జిజ్ఞా :- అయ్యా! అనాత్మకు అజ్ఞానము కారణమంటిరికదా? అజ్ఞానమునకు కారణమేది? అజ్ఞానమునది దేని కార్యము.

వేదాంతి :- అజ్ఞానమునకు కారణము లేదు. అజ్ఞానమునకు కార్యమున్నది. వ్యష్టిగతముగా విచారించిన సుషుప్తి అజ్ఞానము. సుషుప్తి నుండి స్వప్నజాగరములు కలిగినవి. కనుక సుషుప్తి కారణము, స్వప్నజాగరములు దాని కార్యములు. అట్లే సమష్టియందు యీశ్వరుడు కారణము. హిరణ్యగర్భ, విరాట్టులు కార్యములు. ఈవిధముగ అజ్ఞానము కారణబద్ధమైయున్నది. స్వప్నము కార్యకారణబద్ధమైయున్నది. జాగ్రత్త కారణబద్ధమై యున్నది. ఈ త్రివిధావస్థలకంటె వేఱగు జగత్తు లేదు. కనుక జగత్తునకు బీజము అజ్ఞానము.

జిజ్ఞా :- అజ్ఞానమునకు కారణము ఆత్మకాదా?

వేదాంతి :- కాదు. వ్యవహారికముగ మాత్రమే ఆత్మయందు కారణత్వ మారోపించుచున్నారు. ఆత్మ ఒకదానికి కారణమును కాదు, కార్యమును కాదు. కారణ కార్య ధర్మములు రెండును ఆత్మను బంధింపవు. ఆత్మ కారణ కార్యములకంటె పరమునందు (అతీతమై) ఉన్నది. శ్రీజ్ఞానే

శ్వరులు అజ్ఞానమును గుఱించి విమర్శించిన సందర్భమున "నీ యజ్ఞానమనునది యెవ్విధ కార్యంబునకుఁ గారణంబు గాని, యెవ్విధ కారణంబునకుఁ గార్యంబుగాని కాకపోవు... ..." (అను. 7-56) అని చెప్పిన వాక్యములు అద్వైతులకు సమ్మతము కావని యిచట నిరూపింపబడెను.

సూర్యునియందు చీకటి కాపురముండునా? యని శ్రీజ్ఞానేశ్వరులు ప్రశ్నించిరి. ఆత్మకు సాక్షి చైతన్యమే స్వభావము కనుక, సాక్షి చైతన్యము అజ్ఞానమునకు విరోధి కాదు. సంయక్ జ్ఞానమే అజ్ఞానమునకు విరోధి. ఇచట యింకొకవిషయము జ్ఞాపకముంచుకొనవలయును. ఆశ్రయ ఆశ్రయీ భావాది భేదమంతయు వ్యావహారికమేగాని పారమార్థికమని అద్వైతులంగీకరింపరు.

ఆత్మకు రెండు ఆకారములు కలవు. 1. 'అహం' సామాన్యముగ కనబడునట్టి ఆకారము. ఇదియే జ్ఞానాజ్ఞానములకు ఆశ్రయము. దీనిని ప్రతీయమానమందురు. 2. అద్వితీయ సచ్చిదానంద ఆకారము. ఇది అప్రతీయమానము. ఇది శాస్త్రగమ్యమైనది.

శ్రీజ్ఞానేశ్వరులు అజ్ఞానము లేనిదనుటయేగాక జ్ఞానము సహితము లేనిదే యనిరి. అజ్ఞానమనునది లేనియెడల జ్ఞానముతో నిమిత్తము లేదు. ఉన్నదన్న అట్టి జ్ఞానమువలన ప్రయోజనమేమి? "చీకటిరాగా దీపము వెలిగింతుముకాని సూర్యుడే ప్రకాశించుచుండగా దీపముతో అవసరమేమి" అని చెప్పిరి. (అను. 8-10, 11, 12) వారి వాక్యముల పర్యవసానమేమన జ్ఞానాజ్ఞానములు రెండును లేనివే. శుద్ధజ్ఞానము

జ్ఞానాజ్ఞానరహితము. అద్వైతులు వ్యావహారికముగ జ్ఞానాజ్ఞానముల రెంటియొక్క భావమును అంగీకరింతురు. కాని, రెండును మాయికములే యగుటవలన రెండును నశించునవే యనిరి. అందువలన బంధమోక్షము లనునవి మృషయని అద్వైతుల సిద్ధాంతము. ఈ యంశమున శ్రీజ్ఞానేశ్వరుల యొక్కయు అద్వైతులయొక్కయు అభిప్రాయములు ఒక్కటియే.

జిజ్ఞా :- శ్రీజ్ఞానేశ్వరులు ఆత్మయే జగద్రూపమున కనబడుచున్నదనిరికదా? దానిని వా రేవిధముగా వివరించిరో బోధింపుడు.

(౧౦) శ్రీజ్ఞానేశ్వరులు చెప్పిన శివ - శక్తులు

వేదాంతి :- ఆత్మయొక్క స్పందనమే శివశక్తిరూపమునుపొంది జగద్రూపమున కనబడుచున్నారని శ్రీజ్ఞానేశ్వరులు యీ క్రింది విధముగా వారి అనుభవామృతమునందు చెప్పిరి :—

1. "నిరుపాధికంబును విశ్వంబునకాది కారణంబునై దీపించు నద్దివ్యదేవస్వరూపంబున కిమ్మాడ్కి భక్తియుక్తంబుగ వందనంబు గావించువాడ." (అను. 1-1)*

---

* ఈ పద్యములయొక్క తాత్పర్యము ఈ క్రింది పరుసక్రమము ననుసరించి చెప్పుచున్నాను.

1. శివశక్త్యాత్మకమైన నిరుపాధికబ్రహ్మమే జగత్కారణమని చెప్పబడినది.

2. "మనోహర ప్రదేశంబునం దాసీనుండగు ప్రేమకుండు (శివుండు) స్వీయంబగు ప్రేమాతిశయంబునం జేసి తత్తుల్యమాంసోపనిర్మితంబై తుల్యాహారంబుఁ గైకొనియెడు స్వప్రియా శక్తి) రూపంబు నొందుచుండు." (అను. 1-2)

3. "ఇవ్విధంబున నా శివుండును శక్తియు దీవ్రంబగు వాంఛాపారవశ్యంబుచేఁ బరస్పరంబుఁ గబళించుకొను వారలై మగిడిఁ దదీయంబగు ద్వైతాభిలాషంబునఁ బరస్పరంబు నుద్గీరించుకొనుచుందురు." (అను. 1-3)

4. "త (శివుండును శక్తియును) ద్విషయంబునఁ బూర్ణంబగు భిన్నత్వంబేనియు నభిన్నత్వంబేనియుఁ గానరాకుండెడు కతంబునఁ దత్సహజస్వభావంబును మన మెఱుగఁజాలకుండుదుము." (అను. 1-4)

5. "శివుండును, శక్తియును నభిన్నత్వంబున నెల్లందుచుండియును, సామాన్యంబుగ నిర్ధారట్లు కానవచ్చుటంజేసి, యెవ్వారి యర్థాంశంబుసని యన్యార్థాంశంబున నైక్యంబగునా యని యూహింప నసాధ్యంబగు.
(అను. ఈశ్వరప్రార్థనము 3)

---

2. సద్రూపుడైన శివుడు చిద్రూపిణియగు శక్తి (ప్రకృతి) రూపమును పొందుననగా సచ్చిద్రూపములు రెండును ఒకటియేయని, శివుని యిచ్ఛయే ఆవిధముగ భేదరూపమున తోచుచున్నదని అర్థము.

3. శివుడు శివుడుగా నున్నప్పుడు శక్తి తోచుటలేదు. శక్తి శక్తిగా నున్నప్పుడు శివుడు గోచరింపడు. అని భావము.

4. శివశక్తులిరువురు భిన్నులనిగాని అభిన్నులనిగాని చెప్పుటకు సాధ్యపడనందున వారి నిజస్వరూప మిట్టిదని తెలియదు.

5. పైన చెప్పిన తాత్పర్యమే దీనికి అన్వయించును.

6. "ఆద్దేవుని కారణంబునం జేసి దేవ్యస్తిత్వంబు గొమరొప్పుచుండు. మఱియు నద్దేవ్యభావంబుచే దేవాస్తిత్వంబును బద్ధంబై తనర్చు. సారాంశంబేమనఁ దదుభయాస్తిత్వంబునుఁ బరస్పరాధారంబై వెలయుచుండు."

(అను. 1-10)

7. "విశ్వంబనియెడు విశాలగృహంబున వాసంబుండు వారలీ యిర్వురుమాత్రమనంజెల్లు, మఱియు నీయిర్వురందునుఁ బ్రభుండు సుషుప్తిం జెందియుండునెడ నద్దేవి యజాగృతయై తాన కార్యద్వయంబును నిర్వహించుచుండు."

(అను. 1-13)

---

6. శివశక్తులిరువురకు పరస్పరము శేషశేషీభావము సమానమని యిచట చెప్పబడినది.

7. సత్తు - చిత్తు అనునవి రెండే విశ్వాకారమున గోచరించును. అనగా: చిజ్జడములను రెండే యీ విశాల విశ్వమను యింటియందు కాపురమున్నవనియు, అందు శక్తియను జ్ఞానము శివునియందు జగద్రూపమును గోచరింపజేయుచున్నందున యెంతవరకు జగత్తు గోచరించునో అంతపర్యంతము సత్పదార్థము (శివుడు) గోచరము కాదు. దానినే కవి "ప్రభుండు సుషుప్తి చెందియుండునెడ, దేవియే మేల్కొనియుండి సంసారము (ప్రపంచము)ను నిర్వహించును. దేవి ప్రభునియందు ప్రేమ చూపుట యనగా: విశ్వాభిముఖమైన జ్ఞానము సన్మాత్ర వస్తువున కభిముఖమైనపుడు దానియందు (సత్పదార్థమునందు) లయమగును. అప్పుడు విశ్వము గోచరించుటలేదు. అదియే సుషుప్తి (ప్రళయము). అప్పుడు ప్రత్యేకించి శక్తిలేదు. సద్రూపుడగు శివుడే మిగిలియుండును. ఇట్లు విశ్వాకృతియు, సద్రూపమును గోచరింపజేయుటయు, అను కార్యద్వయమును శక్తియే చేయుచున్నదని" భావము.

8. "అట్లుగాక యయ్యుభయులు జాగృతులై యుండిరేనిఁ దన్నికేతన సర్వస్వంబును నొక్కటిగ గబళింపంబడియెడి. అట్టియెడ నందింకెద్దియును శేషింపకుండు."

(అను. 1-14)

9. "నానాత్వంబు నిర్వహించెడు నిమిత్తంబు వారిర్వురును (శివుండును, శక్తియును) భిన్నరీతిఁ బూర్ణత్వంబునం దర్ధాంశంబులై యొప్పుచుండుదురు. మఱియు స్వీయంబగు ద్వైతంబు నైక్యంబునందు విలీనంబుఁ గావించుకొనియెడు ప్రయత్నంబున వారు విరాజిల్లుచుండుదురు."

(అను. 1-15)

10. "మఱియు, శివుండొక్కండ స్త్రీ పురుషాత్మకంబగు రూపాభాసంబున సుఖంబుండఁ దదీయంబులగు నర్ధాంశంబులు పరస్పరైక్యంబు నొందుటంబట్టి విశ్వస్థితియు గోచరంబయ్యెడి." (అను 1-17)

---

8. ఉభయులు మేలుకొనుట యన నిజజాగ్రత (భ్రాంతిరహిత స్థితి) యందు సత్తునిగాని, చిత్తునిగాని, అను వ్యవహారము లేని విశుద్ధజ్ఞానము (ఆత్మ) మాత్రమే మిగిలియుండును. అది యిట్టిదని వచింపరానిది.

9. నానాత్వము నిర్వహించుట యనగా: ప్రపంచాకృతిగ భాసించుట. అప్పుడును శివశక్తు లిరువురును వేఱువేఱుగా తోచక శర్కరామాధుర్యములవలెను, కర్పూరపరిమళంబులవలెను పూర్ణత్వంబున అర్ధాంశంబులై యుండుటచే ద్వైతము లేదని భావము.

10. శక్తి స్వరూపమున నున్నది శివుడే, జగమున స్త్రీ పురుష లింగ భేదము శివునియందే (దేహమునందే) కనబడుచున్నది. సద్రూపమునందున్న విమర్శ యేదికలదో అదియే శివుని శక్తియని భావము.

11. "వీణాద్వయంబును నొక్కస్వరంబునే యుత్పాదించెడు చందంబునను, సుమద్వయంబును నొక్కపరిమళంబునే ప్రతిపాదించు విధంబునను, దీపద్వయంబును నొక్కప్రకాశంబునే ప్రకటించెడుభంగిని." (అను. ౧-౯)

12. "ఓష్ఠద్వయంబును నొక్కశబ్దంబునే యుచ్చరించెడు రీతిని, నేత్రద్వయంబును నొక్కదృశ్యంబునే వీక్షించెడు మాడ్కిని, న య్యుభయులును (శివుండును, శక్తియును) నొక్కప్రపంచంబునే కావించుచుండుదురు." (అను. 1-19)

శ్రీజ్ఞానేశ్వరులు శివశక్తులను గుఱించి చెప్పిన వాక్యములయందు కొన్నింటిని చెప్పితిని. దీనిని మనము చక్కగా అవగాహనము చేసికొనవలయును.

జిజ్ఞా :- అయ్యా! ఈ శివశక్తు లెవరు? అద్వితీయమగు ఆత్మ తప్ప అన్యమేమియును లేని స్థితియందు యీ ద్వైతభావము కలుగుటకు కారణమేమి?

వేదాంతి :- అగ్ని కొంచెము ముందునకుసాగి జ్వాలారూపమున కనబడినట్లు ఆత్మస్పందనమే శివశక్తులైనది. పైన చెప్పబడిన పద్యముల (ఓవీఛందముల) యందు 4-వ పద్యమున శివశక్తులు భిన్నులనిగాని, అభిన్నులనిగాని, చెప్ప

11, 12. ఈ రెండు పద్యములయందలి అర్థ మొక్కటియే. లోకమున దంపతులు దాంపత్య ధర్మమును నిర్వహించునపుడు, భర్తయొక్క శుక్లమును భార్యయొక్క శోణితమును కలిసియే శిశువు జన్మించుచున్నది కదా? ఆ విధముగనే శక్తి శివుని ఆధారముగ నైకొని గర్భము ధరించి విశ్వమను బాలకుని కనుచున్నదని భావము.

జాలనందున వారి "సహజస్వభావము మన మెఱుగజాలకుందుము." అని యున్నది, దీని భావ మేమి? శ్రీశంకరులు చెప్పిన మాయనే ఒకవిధముగా శ్రీజ్ఞానేశ్వరులు పరోక్షమున అంగీకరించినట్లయినదని నా యభిప్రాయము. 5-వ పద్యమున, శివశక్తులు యిరువురవలె కనబడుదురే గాని యిరువురు ఒక్కటియే యని చెప్పిరి. ఇరువురు ఒక్కటె ట్లగుదురు? "ఎవరి అర్ధాంశములు చని అన్యుల అర్ధాంశమున ప్రవేశించెనో చెప్పలేము" అనిరి. వేఱువేఱు భాగములు రెండు ఒక్కటియైనవని తలంపవచ్చునా? అట్లు చెప్పుటకు వీలు లేదు.

శివశక్తులు అర్ధనారీశ్వరునివలె యున్నారని కొందఱందురు. అర్ధనారీశ్వర విగ్రహమునుగాని అట్టి చిత్రపటమునుగాని మనలో అనేకులు చూచియేయున్నాము. అర్ధనారీశ్వర రూపకల్పనమునందు మనకు ఏకత్వమున భిన్నత్వము కనబడును. అది స్వగతభేదము వంటిది కాదందురు. అట్టి వారే యీ శివశక్తులని శ్రీ జ్ఞానదేవుల అభిప్రాయమా? అర్ధనారీశ్వర విగ్రహమున (రూపమున) యే సగభాగమైనను తీసి వేఱుచేసిన రెండుభాగములును నిరుపయోగమగును. రెండును ఒకటిగా ఉన్నప్పుడే ప్రవృత్తి, లేక, వ్యాపారము కలుగునని 6-వ పద్యము యొక్క తాత్పర్యము. అర్ధనారీశ్వరులు నడచినను, సంభాషించినను యేమిచేసిన యిరువురు ఒక వ్యాపారమునే (క్రియనే) చేయుదురు. కాని, ప్రత్యేకించి యేమియు చేయజాలరు. ఇది 11, 12 పద్యముల యందలి సారాంశము. కాని, అర్ధనారీశ్వర విగ్రహమును

ఉపమానముగ గైకొని శివశక్తుల స్వరూపనిరూపణము చేయుటకు వీలు లేనట్లుగ వారిరువురు "సమీర చలనంబుల వలెను, స్వర్ణకాంతుల కరణియు, కస్తూరి పరిమళంబుల మాడ్కిని, విభాగింప నలవిగాకుండుదురు" అని (అను. 1-41, 42) శ్రీజ్ఞానేశ్వరులే చెప్పియున్నందున అర్ధనారీశ్వర విగ్రహ సామ్యమిచట సరిపడదు. ఒక సగభాగము పురుషాకృతిగను, వేఱొక సగభాగము స్త్రీయాకృతిగను కనబడు అర్ధనారీశ్వర విగ్రహసామ్యము వలన ఏ అర్ధభాగము లేకున్నను మిగత అర్ధభాగము వ్యర్థమగునట్లు శివశక్తుల యందు ఏ ఒకరు లేకున్నను తక్కినవారి యునికి ప్రయోజనకారి (క్రియావంతము) కాదని మాత్రమే బోధించుటకు సహాయకారి యగునేగాని అర్ధనారీశ్వర విగ్రహము శివశక్తుల స్వరూపనిరూపణము చేయజాలదు.

శివ శక్తు లిరువురు పురుషుడు ప్రకృతియు నని శ్రీజ్ఞానదేవులు చెప్పుటకంటె వస్తువు, దాని గుణము అని చెప్పుట వారి వాదమునకు సరిపడును. ప్రకృతి పురుషులనగా: వీరు కాపిలసాంఖ్యమునందు చెప్పిన ప్రకృతి పురుషులవంటివారు కారు. కాపిలసాంఖ్యమున ప్రకృతి పురుషు లిరువురు పరస్పరము భిన్నులు, స్వతంత్రులు. ఇచట వీ రిరువురు అభిన్నులును, భిన్నులును కూడా. వీ రొకరిపై ఒకరాధారపడిన వారు. వేదాంతులయొక్కయు, సాంఖ్యులయొక్కయు తత్త్వముల ననుసరించి ప్రకృతిజడము, పురుషుడు (ఆత్మ) చైతన్యస్వరూపుడు.

శ్రీజ్ఞానేశ్వరులు చెప్పిన శివ - శక్తులు సత్తా -

స్ఫూర్తులు. సత్య - జ్ఞానములు. అనగా: సత్తు - చిత్తు లనుగా వర్ణించిరి. ఇందు శివుడు (పురుషుడు) శక్తియందు ప్రేమ చూపినపుడు ప్రపంచాకృతిగ భాసించును. శక్తి (ప్రకృతి) శివునియందు ప్రేమ చూపినపుడు, శక్తి పురుషుని యందు లయమగును. అప్పుడు ప్రపంచము భాసించదు. అనగా: సత్తు చిత్తు అను రెండింటియందు చిత్తు సత్తునందు లయమగుటవలన సన్మాత్రమే మిగిలియుండును. శ్రీజ్ఞానేశ్వరులు చెప్పినట్టి సత్తు - చిత్తు అను వాటియందు 'చిత్తు' అనునది అద్వైతులు చెప్పినట్టి వృత్తిజ్ఞానమే* యైయుండవలయునేగాని అద్వైతులు చెప్పినట్టి చిత్తుకాదు. అనగా: కూటస్థాత్మకాదు. సాక్షికాదు. ఏలయన:— వృత్తిజ్ఞానము ఆగమాపాయములు (రాకడ పోకడ) కలది. ఆత్మయందు లయమగుచున్నది. కూటస్థజ్ఞానమునకు లయములేదు. ఇది రాకడ పోకడలు లేక యేకాకృతిగ ప్రకాశించునది.

---

* వృత్తి జ్ఞానమనగా:— సాభాసాంతఃకరణమునందొక భాగమగు మనస్సు జ్ఞానేంద్రియములతో చేరి ఘటాదివిషయములయందు ప్రసరించుచున్నది. అనగా:— విషయములతో సంయోగము కలుగుచున్నది. అప్పుడు మనస్సు ఆ విషయముయొక్క ఆకృతిని లోనికి గొనిపోయి బుద్ధియెదుట నిలుపును. బుద్ధి ఆ విషయాకారముగ పరిణమించును. ఇచట బుద్ధి అనగా: చిదాభాససహితమగు బుద్ధి. ఈ విషయాకారముగ పరిణమించిన బుద్ధినే 'వృత్తి' యని 'బుద్ధివృత్తి' యని 'వృత్తిజ్ఞాన' మని 'ప్రత్యయజ్ఞాన' మని అందురు. ఈ గ్రంథముయొక్క ప్రథమ భాగము రెండవ ప్రకరణమున కూటస్థచిదాభాసులను (౨౯)వ అధ్యాయమున యీ విషయము చర్చించితిని.

అనుభవామృతమునందలి ఐదవ ప్రకరణమునందు శ్రీజ్ఞానదేవులు సచ్చిదానందశబ్దవిచారము చేసిరి. అందు సత్తు, చిత్తు, ఆనందము అను నీ "శబ్దత్రయమును సత్పదార్థ నిరూపణమున నిరుపయోగంబగు. మఱియు నీ శబ్దత్రయంబు భావంబులందు శేషించు స్వభావంబుఁగలవియై వెలయు చుండు." (అను. 5-19) మఱియు "ఈ శబ్దత్రయం బేకమై జ్ఞాతకవగతంబగుననియు, వర్షించినపిమ్మట మేఘమువలెను, సముద్రమున సంగమించిన నదివలెను, గమ్యస్థలమును చేర్చిన మార్గమువలెను, ద్రష్టకు తన్నిజస్వరూపంబు జూపి, అంత మౌనంబున వినష్టంబగు" (అను. 5-20, 21, 25) అని వచించిరి. అయినను ఆత్మను 'సత్' అనుటవలన అసత్తు కాదనియు, 'చిత్' అనుటవలన జడముకాదనియు, 'ఆనంద' మనుటవలన చింతారహితమైనదనియు శ్రుతి బోధించి యున్నట్లు చెప్పిరి.

శ్రీజ్ఞానేశ్వర సంప్రదాయమునకు చెందిన పెద్దలు యిట్లు చెప్పుదురు :— ఆత్మ నిత్యానందస్వరూపము, లేక, సచ్చిదానందము. ఇచట 'నిత్య' శబ్దమునకు సత్యజ్ఞానమని అర్థము. సత్యజ్ఞానమును విడదీసి (వికల్పించి)న, సత్య + జ్ఞానము అని యగును. ఇందులో 'సత్య' మనునది త్రికాలాబాధిత మగుటవలన శివుడు, 'జ్ఞాన' శబ్దము విచారణాత్మక మగుటవలన శక్తి. ఆత్మ స్వసంవేద్యము (తనను తా నెఱుగును) కాన జ్ఞాతృజ్ఞేయత్వము ప్రాప్యప్రాపకత్వము అను రెండును ఆత్మయే యైనట్లు సత్య జ్ఞానములు రెండును ఒకటియే. సత్య జ్ఞానముల కలయిక ఆనందము.

ఇచట ముఖ్య విషయమొకటి చెప్పవలసియున్నది. ఆనందము సత్య జ్ఞానములయొక్క కలయిక యని అమృతానుభవముయొక్క వ్యాఖ్యానమున కలదు. ఎట్లన?:—

"లోకమున సామాన్య మానవుడు కర్రను చేతను బట్టినప్పుడు దండి, అనగా దండము కలవాడని పిలువబడుచున్నాడు. అట్లే శబ్దరహితమైన పరమాత్మ దుఃఖాతీత లక్షణము ననుసరించి ఆనందశబ్దముచే పిలువబడుచున్నాడు. ఆత్మ కానందశబ్దము ధర్మము ననుసరించి వచ్చినదేగాని స్వరూపతః లేనేలేదు." (విజయదుందుభి పుట 38)

దీనిని శ్రుతు లంగీకరింపవు. ఆత్మకు ఆనందము ధర్మముకాదు, గుణముకాదు. ఆత్మ దేనికిని ధర్మికాని, గుణికాని కాదు. ఆనందము ఆత్మస్వరూపము. ఆత్మయే ఆనందము. ఆనందమే ఆత్మ. సచ్చిదానందములు ఆత్మస్వరూపమని తైత్తిరీయోపనిషత్తునందును, ఇతర శ్రుతులయందును స్పష్టముగ చెప్పియున్నవి. ధర్మముగాని గుణముగాని వస్తువుయొక్క స్వరూపమునకంటె భిన్నములు. ఆనందము ఆత్మధర్మమని చెప్పినవారి దర్శనము వేదాంతము కాదు. కాని, శ్రీజ్ఞానేశ్వరుల అమృతానుభవముయొక్క ప్రారంభమున మంగళాచరణ శ్లోకమునందే ఆత్మ ఆనంద మని చెప్పిరి.

శ్లో॥ యదక్షర మనాఖ్యేయ మానంద మజమేకలం
శ్రీమన్ని వృత్తినాథేతి ఖ్యాతం దైవత మాశ్రయే.

(అమృ. 1-1)

గద్యము. "మహిమాన్వితంబును శ్రీనివృత్తినాథ నామాలంకృతంబును శాశ్వతంబును, వర్ణాతీతంబును, నానంద పూర్ణంబును నిత్యంబునైయొప్పు నప్పరమేశ్వర తత్త్వంబు నాశ్రయించెద." (అను. 1-1)

అని చెప్పియున్నందున వ్యాఖ్యాతయే పొరపడియుండు రని నా అనుమానము.

అద్వైతులు స్వల్పభేదముతో పై విషయము నే యిట్లు చెప్పుదురు :— ఆత్మ - అనృత, జడ, దుఃఖాత్మక ప్రపంచమువంటిది కాదని నిషేధరూపమున తెలియచేయుటకు శ్రుతి 'అనృత' శబ్దమునకు వ్యతిరేకమగు (విరుద్ధమగు) 'సత్' (సత్య) శబ్దమును; ఆత్మ జడము కాదనుటకు 'జడ' శబ్దమునకు విరుద్ధమగు 'జ్ఞాన' (చిత్) శబ్దమును, ఆత్మ దుఃఖస్వరూపము కాదని తెలియ చేయుటకు 'దుఃఖ' శబ్దమునకు విరుద్ధమగు 'ఆనంద' శబ్దమును, ఉపయోగించి ఆత్మ సచ్చిదానందమని శ్రుతి చెప్పినది. ఇది నిషేధరూపమే. అయినను యిందు విధివాక్యములున్నవి. ఆత్మయే సత్తు, ఆత్మయే చిత్తు, ఆత్మయే ఆనందము అని తాత్పర్యము. దీనినే 'సత్యజ్ఞానానందము' లనియు, 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ' అనియును శ్రుతి చెప్పినది.* — పర్యవసానమేమన :— శ్రీశంకరాద్వైతులు సచ్చిదానందములు

---

* ఈ గ్రంథముయొక్క ప్రథమ భాగమునందలి రెండవ ప్రకరణమున "(౨౨) సచ్చిదానందములు" "(౨౩) సత్తు - అసత్తు" "(౨౪) చిత్తు - జడము" "(౨౫) ఆనందము - దుఃఖము" అను అధ్యాయము యందు వీటిని గురించి విపులముగ వ్రాసితిని.

పరబ్రహ్మవాచకములందురు. శ్రీజ్ఞానేశ్వరులు అవి వస్తువాచకములు కావందురు మఱియు, వీరు జగత్తు దుఃఖాత్మకమని అంగీకరింపరు. కనుక, ఆత్మ 'చింతారహిత' మగుట వలన ఆనందమని స్వల్పముగ మార్చి చెప్పిరి. చింత = అనగా : దుఃఖమేకదా? చింతయందు స్వల్పమాత్రమగు దుఃఖము గోచరించునుగదా? పై విధముగ శ్రీజ్ఞానేశ్వరులు శివశక్తులను గుఱించి చెప్పిరి.

జిజ్ఞా :- శివశక్తులు ప్రకృతి పురుషులని పై విధముగ చెప్పిన పెద్ద లెవరైన గలరా?

వేదాంతి :- లేకేమి? మన కాలమునందే మహాతాంత్రిక యోగియని ప్రసిద్ధికెక్కిన మహనీయులు శ్రీఅరవిందులు, శివ - శక్తి తత్త్వములను గుఱించి వివరించియున్నారు. వీరు చెప్పిన తత్త్వమును సంగ్రహించి చెప్పెదను. సావధానుడవై వినుము.

(౧౧) శ్రీమాత - శ్రీఅరవిందులు

శ్రీమాత ఫ్రెంచిదేశమున 21-8-1878 జన్మించి, మనదేశమున 17-11-1973 లో విదేహముక్తి నొందిరి. శ్రీఅరవిందులు 15-8-1872 జన్మించి 5-12-1950 విదేహముక్తి నొందిరి.

వంగదేశవిభజన సందర్భమున అప్పటి బ్రిటిషు ప్రభుత్వము శ్రీఅరవిందులపై రాజద్రోహనేరమును మోపి అలీపూర్ జైలునందు నిర్బంధించిరి. నిరపరాధులగు శ్రీఅరవిందులు తమస్థితినిగుఱించి ఒకనాడు భగవంతునకు నివే

దించుకొనిరి. ఆ ప్రార్థన వ్యర్థముకాలేదు. వారిపై పెట్టిన కేసును న్యాయాధిపతి త్రోసివేసిరి. కారాగారమునందే శ్రీఅరవిందులకు భగవద్వాణి మూడు, లేక, నాలుగు మారులు వినిపించెను. "భారతీయ సనాతన ధర్మమును లోకమునకు వినిపింపు" మనియే భగవద్వాణియొక్క ఆదేశము. దానిని శ్రీఅరవిందులు నమ్మి, వారు నమ్మిన దానినే లోకమునకు బోధించిరి. ఈ మహాకార్యమునకు శ్రీఅరవిందులకు శ్రీమాత తోడ్పడిరి. శ్రీఅరవిందులు తమ్ము గుఱించి తామే యిట్లు చెప్పుకొనిరి :—

"భారతీయులకుగాని యూరోపియనులకుగాని అవగతంగాని ఉపనిషద్రహస్యాలు నాకవగతం చేశాడు కృష్ణ భగవానుడు. కాబట్టి వేదాన్ని వేదాంతాన్ని పునర్వికాసితం చేయవలసిన బాధ్యత నాపైన వుంది."

(భారతీయత దాని నిజతత్త్వము 1 సం॥ పుట 14)

శ్రీఅరవిందులు పరతత్త్వమును ద్వివిధముగ పేర్కొని సృష్టికిపూర్వమునందున్న వస్తువును 'అతీతసత్యము' అనిరి. తాంత్రికులు ఆ అతీతసత్యమునే 'పరసంవిత్' అనిరి. ఈ అతీతసత్యమునుండి అభివ్యక్తమైన సత్యమునే ఈశ్వరుడు, జీవుడు, మాయ, జగము మొదలగు యీ సమస్తమును, కాలాతీతమైన అతీతసత్యముయొక్క అంశములై కాలములో వ్యవహరించుచున్నవి.

శివుడాది క్షితి పర్యంతము శైవదర్శనము 36 తత్త్వములుగా చెప్పినది. వాటినే శాక్తతంత్రములు (ఆగమములు) అంగీకరించినవి. ఒక భూరేణువుగాని, భూమిపైనుండు చిన్న

గడ్డిపోచగాని, పరమశివుడెంత సత్యమో అంతసత్యమే. సత్యము కాని దేదియు సృష్టియందు లేదు. శైవమతమును చెప్పిన సందర్భమున 36 తత్త్వముల వివరించియుంటిని. శ్రీఅరవిందులు యీ తత్త్వములను ఆమోదించిరి.

శ్రీఅరవిందులు తమ దర్శనమును శాక్త తంత్రముల నుండి గ్రహించి దానిని తమ అనుభవమునకు అనుగుణముగా ఆధునికులకు తృప్తికరమగు భావలో (విధానములో) రూపొందించిరి. శ్రీఅరవిందులు తాము 'తాంత్రిక యోగి' అని చెప్పుకొనిరి.

శ్రీశంకరులును, శ్రీఅరవిందులును, పరమసత్యము మనోవాక్కుల కందనిదని అంగీకరించిరి. శ్రీశంకరుల నిర్గుణ బ్రహ్మము స్థితిస్వరూపము. స్థితి - అనగా సత్తు, లేక, పరమ సత్యము. సత్యమే చిత్తు. (జ్ఞానము.) చిత్తే ఆనందము. సచ్చిదానందములు మూడును ఒకవస్తువే, భిన్నములుకావు. శ్రీఅరవిందుల పరమసత్యము స్థితి — గతి (Motion) లేక చలనము కలది. అనగా: పరమసత్యము స్థితి - గతి స్వరూపముగా గలదని అర్థము. ఇచట స్థితి, అచలము — గతిచలము అని తాత్పర్యము. శ్రీశంకర, శ్రీఅరవిందుల దర్శనముల యందు గల ముఖ్యభేదమిది. ఇందుండి అనేక భేదములు కలుగును. సృష్టికి పూర్వమందున్న స్థితిని (పరమసత్యమును) శాక్తేయులు (తాంత్రికులు) సెనగగింజతోగాని, పెసరగింజతోగాని పోల్తురు. అరవిందులు ఆవిధానమునే గైకొనిరి. సెనగగింజ ఒకటిగానున్నను దానియందు రెండుభాగములు (రెండుబేడలు)న్నవి. ఆలాగే పరమతత్త్వము సహితము

స్థితిని - గతిని, ఆ గింజయందలి రెండుభాగములతో పోల్తురు. పై పొట్టు రెండు బేడలను ఒక గింజగా చేసి, లేక ఒక గింజగా ఉన్నట్లు మనకు చూపుచున్నది. పరమసత్యము నందు స్థితి - గతి, కలిసి యేకముగా ఉన్నవి. అవియే శివుడు - శక్తి. శనగగింజకు పై పొట్టునవలె మాయాశక్తి, శివశక్తులను కప్పియున్నది.

శివుడు తన పరబ్రహ్మస్వరూపమున (పరమసత్యమున) శివ - శక్తి సామరస్య స్వరూపమున నున్నాడు. అందు శక్తి — (1) చిత్ - శక్తి యనియు (2) మాయా శక్తి యనియు రెండువిధముల కనబడుచున్నను, సృష్ట్యాత్మకమును, మార్పులు లేనిదిగను ఉన్న అచిత్ శక్తియే మార్పులుచెందుమాయాశక్తిగ అగుచున్న దనిరి. అనగా: పరాశక్తి ఒకేశక్తి యయ్యును, రెండుశక్తులుగ గోచరమగుచున్నది. కనుక మాయాశక్తిని చిత్ - శక్తిని రెండుగా (భిన్నమైనవిగా) తలపరాదు.

శ్రీఅరవిందులు చెప్పిన మాయాశక్తి, శ్రీశంకరులు చెప్పిన మాయవలె అనిర్వచనీయమైనది కాదు. శ్రీఅరవిందులు చెప్పిన మాయాశక్తినే వారు (శ్రీ అరవిందులు) బ్రహ్మమనియు, నిత్యవస్తువైన శివస్వరూపమనియు, చైతన్యస్వరూపమనియు చెప్పుదురు. అది ప్రకృతి కాదు. జడము కాదు. జడజగత్తుగా కనబడుచున్నదే యనిన, జడమనునది యెచ్చటను లేదు. ఉన్నదంతయు చైతన్యమే. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' 'సర్వము చైతన్యస్వరూపమే' అను శ్రుతి ప్రమాణమును చూపుదురు. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అను

శ్రుతివాక్యమునందలి అర్థము శ్రీఅరవిందులు చెప్పిన సందర్భమునకు సరిపడదు. భ్రాంతి జ్ఞాన ముదయించి, త్రాటిని చూచి పాము అనుకొన్న సమయమునందును – వెలుతురువచ్చిన పిమ్మట ప్రమాజ్ఞాన ముదయించి అచట ఉన్నది పాముకాదు, త్రాడే అని తెలిసికొన్న సమయమునందును, ఈ సమయ ద్వయమునందును ఉన్నది రజ్జువే అన్నట్లు 'సర్వం ఖ ల్విదం బ్రహ్మ' అని శ్రుతి చెప్పినదని నా తాత్పర్యము. మఱియు శ్రీఅరవిందు లిట్లు చెప్పిరి :—

మాయ తన స్వరూపమును మరుగుపరచుటద్వారా అందు కొంతభాగమును జడమని మన మనుకొందుము. కాని, జడమని మన మనుకొనినది మాయాశక్తియొక్క ఒక యంశము. మాయాశక్తి తన స్వరూపమును మరుగుపరచుట ద్వారా దాని శక్తు లుద్భవించునందురు. మఱియు శ్రీఅరవిందుల మతమున మాయాశక్తి సచ్చిదానందస్వరూపిణి. మాయాశక్తి ప్రభావ మేమన :— పూర్ణమును అపూర్ణము గను, నిరాకారమును సాకారముగను, శుద్ధచైతన్యమును తగ్గించిగాని, దానిని కప్పిగాని, లేదనిపించును. జీవాత్మ చేత నను కప్పి భేదభావమును కలిగించును. ఈ వాక్యములు శ్రీజ్ఞానేశ్వరుల మాయాఖండవాదమును ఖండించుచున్నవి.

అరవిందుల తత్త్వ మిట్లుండును :— దైవము తన్ను తాను వ్యక్తీకరింపవలెనని తలచినది. అది కోరిక కాదు. అదిఒక ఆనందము, లేక, లీల.* అగ్నిదాహకములవలె

* శ్రీజ్ఞానేశ్వరాదులు కొందఱు 'లీల' అని చెప్పియున్నా రనునది విదితమే.

శక్తి, శక్తిమంతునకంటె వేఱుకాదు. పరబ్రహ్మము (పరమశివుని) యందున్న చిత్ - శక్తి ఆయనయందుండి వేఱైనపుడు, పరబ్రహ్మము క్రియారహితమగు అచలస్థితి యందుండును. అట్టి సమయమున శక్తి పరశివునియందున్న సమస్తమును జగద్రూపమున వ్యక్తీకరించి* వ్యక్తమైన విశ్వమును పాలించి తిరుగ వ్యక్తమునంతము బ్రహ్మసత్త్వయం దుపసంహరించి, తానుకూడ ఆసత్త్వయందే లయమై, అచలస్థితి నొందును. వీటినే సర్గ, ప్రళయము లందురు. ఇట్టివి యెన్ని పర్యాయములు జరిగెనో యెవ్వరును చెప్పజాలరు. ప్రథమసర్గమునుగుఱించి యెవ్వరికి తెలియదు. ఏస్థితియందున్నను ఉన్నదంతయు శివశక్తుల స్వరూపమే.

శైవమునందు చెప్పిన 36 తత్త్వములనే శాక్తతంత్రములు గైకొన్నవి. ఆ తత్త్వములు సృష్టిక్రమమును తెలియచేయును. 36 తత్త్వములయందు శివతత్త్వము మొదటిది. మాయాతత్త్వము ఆఱవది. ఆ వరుసక్రమ మిట్లున్నది :—

(1) శివ, (2) శక్తి, (3) సదాశివ, (4) ఈశ్వర, (5) శుద్ధవిద్య, (6) మాయ. శివునియందు అభేదరూపముతో నున్న శివుని విమర్శరూపశక్తియొక్క భిన్నరూపములతో

---

* ఈ యంశమును శ్రీజ్ఞానేశ్వరులవారిట్లు వ్రాసిరి :— "రూపాభావంబున భాసమానుండై యొసంగు పతిని స్వీయంబగు మనోహరాకృతినిఁగూడ నొక్కటం బరిశీలించు నద్దేవి అజాశీలయై విశ్వాధిక నామరూపంబులనియెడు భూషావిశేషంబులచేతఁ బ్రభు నలంకృతుం గావించె." (అను. 1-30)

(భిన్న శక్తులతో) శివునకు సంయోగము కలిగినపుడు శివుని యందు పరిణమించు శివస్వరూపములే పై ఆఱు తత్త్వములు. ప్రథమతత్త్వమగు శివుడు సృష్టికి నిమిత్త కారణమును, ఆఱవ తత్త్వమగు మాయ సృష్టికి ఉపాదానకారణము అయి యున్నవి. తరువాత యీ క్రింది తత్త్వములు చెప్పబడినవి : (7) కల, (8) విద్య, (9) రాగ, (10) కాల, (11) నియతి, (12) ప్రకృతి, (13) మహత్తు, (14) బుద్ధి. పైన చెప్పిన కల, విద్య, రాగ, కాల, నియతి తత్త్వము లైదును కంచుకముల వంటివి. వీటిలో ప్రవేశించి శివుడు తన సర్వజ్ఞత్వాది శక్తులను సంకుచితము చేసికొని జీవసంజ్ఞ నొందుచున్నాడు.

జిజ్ఞాసువు :- అయ్యా! ఈ పదునాలుగు తత్త్వములలో శివ - శక్తు లెవ్వరు?

వేదాంతి :- నీ వడిగిన ప్రశ్న చాల చిక్కైనది. శ్రీఅరవిందులు వారి అనుచరులు శివ - శక్తులను గుఱించి యిట్లు చెప్పిరి :—

(1) "మానవుని ఆత్మ శివుడు, మానవుని మనో ప్రాణ శరీరములు శక్తి. శివ శక్తు లొక్కటియే కాని వేఱు కాదు." (జగన్మిథ్యా తత్త్వపరిశీలనము. పుట 54)

(2) "జీవాత్మకూడా శివశక్తి స్వరూపమే"
(జ. త. ప. పుట 57)

జ. త. ప. అనగా : జగన్మిథ్యా తత్త్వ పరిశీలనము. ఇందులో 41 పుట వఱకు శ్రీ అరవిందుల రచనకు ఆంధ్రానువాదము తక్కిన గ్రంథము అనువాదకుల సొంత రచన.

(3) "శుద్ధచైతన్యమే శివుడు."

(జ. త. ప. పుట 57)

(4) "శివుడు చిత్తుగను, శక్తి చిద్రూపిణిగను నున్నవి." (జ. త. ప. పుట 51)

(5) "అతడు - ఆమె యను పదములు సర్వోత్కృష్టమైన ఒకానొక చేతనాశక్తి, అనగా: పురుషుడు - ప్రకృతి, ఈశ్వరుడు - ఈశ్వరి, శివుడు - పార్వతి, నారాయణుడు - లక్ష్మి; వీరు ద్వైతభావముగల ఒకేఒక విభూతి. ఒకటి స్థిరశక్తి, మరొకటి సామర్థ్యయుక్తమైనశక్తి; ఒకటి జడము - మరొకటి చేతనము; భగవంతుడు - శక్తి."

(ఎవరీమాత. పుట 18)

(6) "ప్రపంచసృష్టికి పూనుకొన్నప్పుడు శివశక్తిలోని శక్తి, నిషేధవ్యాపారరూపమును దాల్చి (Negates Her-Self) తాను 'ఇది' (This) అయి, శివచైతన్యము 'నేను' (I) గా నగును. పరమశివునియొక్క ప్రకాశనమువలన అతని శక్తి విమర్శాశక్తియై విశ్వమంతటిని సృజించును."

(జ. త. ప. పుట 60)

(7) "వ్యక్తిరూపమును నొందిన చైతన్యమే జీవుడు. ప్రకృతి శక్తినుండి మూడు శరీరముల పొందినవాడగును. జీవుడు మొదలు కారణ శరీరముగలవాడై పరమాత్మతో నైక్యమగు వఱకు ఈ కారణ శరీరముతో నుండును."

(జ. త. ప. పుటలు 62, 63)

(8) "పరాప్రకృతి జీవభూతమగును."

(యోగదీపికలు. పుట 27)

(9) "అపరాప్రకృతి దైవమునుంచి విడదీయబడిన మనః ప్రాణ శరీర అవిద్యాప్రకృతి. పరాప్రకృతి సచ్చిదానందముయొక్క దివ్యప్రకృతి." (యోగదీపికలు. పుట 34)*

(10) "శివుడు శక్తి రెండును చేతనమైనను శివుడు ఆ చేతనయొక్క మార్పులేని అచలస్థితిగను, శక్తి ఆ చేతనయొక్క మార్పునొందు ఉధృతస్థితిగనున్నది"

(జ. త. ప. పుట. 59)

(11) "పరాత్పరుడు శాశ్వత సచ్చిదానంద రూపుడుగా ఆమెయందు మూర్తీభవించి నిరతముగా నుండును. పరాత్పరుడు ఆమె ద్వారా ఏకము, ద్వంద్వమును అయిన ఈశ్వరశక్తిచైతన్యముగను, పురుషప్రకృతి అను ద్వంద్వతత్వముగను, లోకమునందు వ్యక్తమగుచున్నది."

(మాతృశ్రీ. పుట. 45)

"స్వభావము, ప్రకృతి, యని మనచే తెల్పబడునవి ఆమెయొక్క కార్యనిర్వాహక బాహ్యరూపమే"

(మాతృశ్రీ. 47)

(12) "ప్రకృతి వున్నంతవరకు అతడు (పురుషుడు) కూడ అచ్చటనే యుండును. యేలయన, అతడు—ఆమె, ఒక్కటే యనుసత్యము నిశ్చయమైనది గనుక అతడు నిద్రిం

* శ్రీఅరవిందులు, 8 - 9 సంఖ్యగల పరా, అపరా ప్రకృతులను గురించి భగవద్గీత ఏడవ అధ్యాయమునందు వ్రాసినరీతిగా గ్రహించిరి.

చునప్పుడుకూడ ఆమెను తన వక్షస్థలముపై వుంచుకొనును. ఎవరు ఆమెను వదలిపెట్టినను ఆమెవినా నాతడు అవేద్యుని యందు విశ్రాంతికైనను పోజాలడు.

(ఎవరీమాత - సావిత్రి స్వరూపము. పుట. 153)

శ్రీ అరవిందు లిట్లు చెప్పిరి :- ఆమే లేనిది ఆయన వ్యక్తీకరింపబడడు, ఆయన లేక ఆమె యునికి లేదు.*

జిజ్ఞాసువు :- అయ్యా! పరమసత్త అద్వితీయము అఖండము సర్వగతము అచలము కదా? ఆవస్తువునందుండి ఆవిష్కరించుట, ఆవిర్భవించుట వ్యక్తీకరింపబడుట, పరిణమింపబడుట, ఇత్యాదులు కలిగినవని చెప్పనగునా? విత్తనము నుండి చెట్టు (మొక్క) ఆవిర్భవించినదనగా - ఆవిర్భవించుటకు పూర్వము అది లేనిచోటున వ్యక్తమైనదనికదా అర్థము. పరమసత్తనుండి శక్తి వ్యక్తమైనదనగా? - ఎందుకు వ్యక్తమైనది? ఎచట వ్యక్తమైనది? దానికి సాక్షి యెవరు? ఉన్న దంతయు పరమసత్తయేకదా? ఇట్టి సంశయములు తొలగు టెట్లు? అదియునుగాక, ఒకే చైతన్యము శివశక్తు లిరువురై రని చెప్పిరి. శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పినది చాలవఱకు యిదియే కదా? శ్రీ జ్ఞానేశ్వరులు :- కస్తూరి దాని పరిమళముతోను ; శర్కరా మాధుర్యములతోను శివ - శక్తులను పోల్చి చెప్పిరి. శ్రీ అరవిందులు ఒక సెనగగింజలోని రెండు బేడలతో శివ - శక్తులను పోల్చి చెప్పిరి. శివశక్తులస్వరూపము నిరూపించుటకు

---

* "అత శ్లేష శ్లేషీ త్వయ ముభయ సాధారణతయా"

శివ శక్తులకు అన్యోన్య శేష శేషీ భావము సమానమగునని (సౌందర్యలహరి యందు) చెప్పినదే శ్రీ జ్ఞానదేవులును చెప్పిరి (అను. 1-10).

శ్రీ జ్ఞానేశ్వర దర్శనమునందు చెప్పబడిన ఉపమానము లెట్లు సరిపడవో, శ్రీ అరవిందుల దర్శనమునందు చెప్పిన సెనగగింజ, అగ్ని దాహకశక్తుల యుపమానములు సహితము వీరి తత్త్వమును అవగతము చేసికొనుటకు సరిపడవు. సెనగగింజయందున్న రెండు భాగములయందు ఒకభాగమును నశింపజేసితిమేని రెండవ భాగము దానితోపాటు నశింపదు. కనుక, సెనగగింజలోని రెండు భాగములు ఒకటేననికాని, రెండని కాని, చెప్పలేము. అట్లే అగ్ని - దాని దాహకశక్తియు ఒకటేనని చెప్పలేము. ఏలయన? మణి మంత్రౌషధముల ప్రభావమువలనగాని, శీలప్రభావము, లేక తపః ప్రభావము వలనగాని ఒకసమయమున దాహకశక్తి పనిచేయదు. అనగా అగ్నికి కాల్చునట్టిశక్తి యుండదు. సీతాదేవి అగ్నియందు ప్రవేశించినను అగ్ని ఆమెను దహింపలేదు. ఆసమయమున అగ్నికి దహనశక్తి లేదు. కనుక, అగ్నియే దహనశక్తియని చెప్పలేము. కాని, అగ్నియు, దానియందలి దహనశక్తియు భిన్నములనికూడా చెప్పలేము. ఇందువలన శ్రీశంకరులు చెప్పిన అనిర్వచనీయమును శ్రీ అరవిందులు పరోక్షమున అంగీకరించిన ట్లయినదికదా?

వేదాంతి :- నీప్రశ్న సరియైనదే. నీకుగల సంశయములు జగత్సత్యవాదులు తీర్ప లేరని నా యభిప్రాయము. అదిగాక, శ్రీ అరవిందుల తత్త్వమున పరతత్త్వము స్థితి - గతి కలది అని చెప్పితినిగదా? శివుడు అచలుడు, శక్తి చలనముగలది. కనుక నేను నీకు వినిపించిన 12 అంశములలో పదియవయంశమును స్మృతికి తెచ్చుకొనుము. ...శక్తి ఆ చేతనయొక్క క్రియారూపమగును.'' అనిరి. 'చేతన'

అనగా — వీరి భావమేమి? అద్వైతము ననుసరించి చేతన అనగా ప్రాణాదుల స్పందనము "చేతనాధృతి" అనిగీతి 13 - శ్లోకమునందు రూఢిపఱుపబడినది. చేతన జడము - "చైతన్యము" శుద్ధ జ్ఞానము. ఇది అనంతాఖండ శుద్ధ వస్తువు. శ్రీ అరవిందులు 'చేతన' అను శబ్దమును చైతన్య శబ్దమునకు పర్యాయముగా వాడియుండిన, చేతనము అచలము కదా, అచలమునందు క్రియ యెట్లు కలుగును? 11వ అంశ మున "ప్రకృతి ఉన్నంతవఱకు పురుషుడుండును" అన్నారు. 1వ అంశమున మానవునిఆత్మ శివుడు, మానవుని మనో ప్రాణ శరీరములు శక్తి అని చెప్పిరి. ఇవి ఒకదానిని విడిచి వేఱొకటి యుండ వనిరి కదా? ఇందుకు విరుద్ధముగ శ్రీ మాతనుగుఱించి చెప్పిన ఒక సంఘటనను యిచట తెలిపె దను :-

ఒక సమయమున శ్రీమాత మధ్యధరాసముద్రమున ఒక యోడలో పయనించుచుండిరి. పెద్దతుపాను చెల రేగెను, దాని నాపుటకై శ్రీమాత వెంటనే తాముున్నగదికి (Cabin)కు వెళ్లి తాము తమ శరీరమును అచట వదలి సూక్ష్మ శరీర ముతో స్వేచ్ఛగా సముద్ర మధ్యమునకు వెళ్లి అచట రూప ములులేని జీవులు సముద్రమును అల్లకల్లోలమును చేయు చుండుటను చూచి, వారితో మృదువుగా సంభాషించి వారి చర్యలనాపి తుపాను రాకుండ చేసి, తిరిగి తమగదికి వెళ్లి తమ శరీరములో ప్రవేశించిరట. (ఎవరీమాత. పుట. 30) ఇందు వలన దేహి దేహములు రెండును భిన్నములని తెలిపినట్లే కదా?

దురదృష్టవశమున శ్రీ శంకరులవారి అనంతరము జన్మించిన మతాచార్యులు దార్శనికులు శ్రీ శంకరుల జగన్మిథ్యావాదమును ఉన్నదున్నట్లు చక్కగా అనువదింపక, వారు విమర్శించుటకు వారివారికి అనుకూలమగు పదజాలము నుపయోగించి అనువదించి వారివారికి తోచిన తార్కిక బుద్ధిచే విమర్శించిరి. కాని, జగత్సత్యవాదమును తర్కము నెదుట నిలుచునట్లు శ్రీ అరవిందులుగాని మతెవ్వరైనను గాని ఒక నిర్దిష్టమగు సిద్ధాంతమునుచేసియుండలేదు. జగన్మిథ్యావాదము కొందఱకు కొంతవఱకు అసంతృప్తికరముగా ఉండినను, జగత్సత్యవాదమునందున్న, విడదీయుటకు వీలుగానట్టి చిక్కు జగన్మిథ్యావాదమున లేదు. కొందఱు శ్రీ శంకరులను తూలనాడినను అట్టివారి ఘనత యెక్కువకాలేదు. శ్రీ జ్ఞానేశ్వరులు, శ్రీ అరవిందులు, శ్రీ శంకరుల యోగ్యతను గుర్తించి మృదువైన పదజాలముతో విమర్శించి, వారి ఘనతను వెల్లడించుకొనిరి. గతకాలమునందేగాక యీకాలము నందుకూడా ప్రపంచమునగల మహామేధావులగు తత్త్వవేత్తలలో అధికసంఖ్యాకులు శ్రీ శంకరుల పక్షముననే గలరు.

బుద్ధభగవానులును, శ్రీ శంకరులును సాధించినదాని కంటె తాము (శ్రీ అరవిందులు) సాధించినది ఎక్కువని శ్రీ అరవిందులు చెప్పుకొనిరి, వారి వాక్యములు యీ క్రింద నుదాహరింతును :—

"శంకరుల తత్త్వము యీ విచారమున, విశిష్ట మాయా తత్త్వమని (Qualified Illusionism) చెప్పవచ్చును.

మాయకు పరిమిత సత్యము యీతత్త్వములో చూపబడినది. దీనిని (మాయను) వాచామగోచర మైనట్టిదియు, అగణనీయమైనట్టిదియు, అద్భుత రహస్యముగా వర్ణించి, మనస్సునకు సంతృప్తినొసంగు విధమున జగదనిత్యతను, మానవ మూఢత్వమును, అశాశ్వత జీవిత పరిధులను, నిరూపించి శంకరుడీతత్త్వమును మహోన్నత విస్తారతోను, శక్తివంతముగను లోకమునకు సమర్పించినాడు. శంకరులు స్వతః స్ఫురణ విజ్ఞానములచే కేవలము అతీతమైన అంతఃకరణ సత్త యొక్క సత్యమును చక్కగా నిర్ణయించి, తన అఖండ మేధాశక్తిచే ప్రపంచ విధమును, దాని అనిత్యతను నిరూపించెను. బుద్ధియొక్క వివేచనాశక్తిచే వాస్తవ జగమును, ఆంతరిక విజ్ఞానముచే అతీతమును నిర్ణయించియు శంకరుడీ రెండింటియొక్క సమన్వయమును సమగ్రముగా ననుసరింపకుండుట దురదృష్టకరము". (జ. త. ప. పుట. 27).

"బుద్ధుడు తన నిశిత సూక్ష్మబుద్ధిద్వారా ప్రపంచము యొక్క నిర్మాణమును, యీ నిర్మాణమునుండి ఉపశమించు మార్గమును మాత్రము కనుగొని తరువాత ముందుకుబోను తిరస్కరించెను. శంకరుడు బుద్ధునికంటెను ముందంజవేసి బుద్ధుని సంస్కార శూన్యానుభవమున కతీతుడై, పరమ సత్యమునకు ప్రపంచమునకు మధ్యలో నిలబడి జగత్తుయొక్క రహస్యము భేదింపరానిదనియు, బుద్ధిచే అగ్రాహ్యమనియు చెప్పెను. కాని బుద్ధితో చూచినపుడు ప్రపంచము నిజముగా కనబడుచున్నందున దీనిని అనిత్య సత్యమనియు, కేవల సత్తయే యదార్థమనియు, ప్రవచించెను, కాని శంకరులు

యింకను బుద్ధి కూర్ధ్వమునను్న విజ్ఞానములోనికి బోయి, అచట స్థావర మేర్పరచుకొని సర్వమును పరిశీలించియుండి నచో బ్రహ్మముయొక్క ముఖములన్నియు, స్థితిగతులన్నియు సమగ్రముగ గోచరమయి వేదవాక్కుల ప్రకారం 'సర్వము బ్రహ్మ'మని తన యఖండ మేధాశక్తితో నిర్ణయించెడి వారు." (జ. త. ప. పుటలు 32, 33)

శ్రీ అరవిందులు తమ దర్శనమునందు దివ్య సత్త యనుదానిని పేర్కొనిరి. దివ్యసత్త యనగా నేమి? దానిని గురించి శ్రీ అరవిందులే యిట్లు చెప్పిరి:—

"స్థితి రూపకముగను, వేరుగను నిరాకారముగ నుండు ఆత్మకు ఆవల మహోన్నత చేతన యున్నది. ఈ బృహత్ చైతన్యములో నిశ్చలతయు విశ్వకార్యకలాపము యీ రెండును కలిసికొని ఏకముగనున్నవి. స్థితిరూపమైన పరమసత్త (Static Self) దివ్యసత్త (Divine Reality) యొక్క ఒకపార్శ్వము మాత్రమే యగును. ఈ స్థితిరూపమైన సత్త ఒక అంతిస్సు మాత్రమే యగును. దీనిలో నున్నప్పుడు, దీని కావల బోనపుడు దీనినే తుదిమెట్టుగా నెంచి మాయా వాదులు జగమును మిథ్యగా భావించిరి. కాని మానవుడు ఆ బృహచ్చైతన్యమును చేరినపుడు విశ్వస్థితి, రూపము, జీవితము, మనస్సు యివన్నియు ఆకస్మికముగ కనబడక అర్థ వంతమగును. ఊర్ధ్వగతిలో సహితము రెండంతస్థులు అధిమానసము అతీతమానసమనునవి యున్నవి. కాని అతీతమానస

స్థితిని చేరినపుడే మానవునికి విశ్వస్థితిగతులయొక్క నిజ స్వభావ సత్యములు సమగ్రముగ గోచరించును.”

(జ. త. ప. పుట 41)

శ్రీ అరవిందుల పై రచనలవలన బోధపడిన దేమన - శ్రీ శంకరులు పైన చెప్పిన బృహత్ చైతన్యమును, లేక, దివ్యసత్తను గుఱించి యెఱుగరని, దివ్యసత్తయందు ఒక పార్శ్వమే యగు స్థితిరూపమైన పరమ సత్తవఱకే వారి అనుభవమగుటచే అదియే తుదిమెట్టుగా భావించిరని, అట్లు భావించుటకు కారణము శ్రీ శంకరులు అధిమానసము వఱకు పోగలిగిరి కాని, అతీతమానసమువఱకు పోజాలకపోయిరని, శ్రీ అరవిందులు భావించినట్లు స్పష్టమగుచున్నది. ఇది మిక్కిలి సాహసోపేతమగు వారి యూహమాత్రమే కాదా?

శ్రీ అరవిందులు చెప్పిన పరమసత్త స్థితి - గతి కలది. అనగా - అచలము - చలముల రెండింటి సమ్మేళనము. ఈ రెండును పరస్పర విరుద్ధములు, ఒకటి ఉన్నచో ఆస్థానమున మఱియొకటి యుండజాలదు. రెండింటి కలయికయే దివ్యసత్త యొక్క స్వరూప మనిన — “మాయ కలిమిలేముల కలియిక యని చెప్పిన అద్వైతుల నెదిరించువారు, ఎట్టి ఆక్షేపణలు చేసియున్నారో అవన్నియు దివ్యసత్తకు అన్వయించును. అదిగాక స్థితి - గతి, అని రెంటిని కలిపి చెప్పినపుడు “ఏకమేవాద్వితీయం బ్రహ్మ” అను శ్రుతికి విరోధము సంభవించును. ఏమైనను యీ విషయమును యిచట పూర్ణముగ చర్చించుటకు చోటులేదు. కేవల శివ - శక్తులను

గుఱించిన చర్చలో యీ యంశము అనుషంగికముగా వచ్చినది.

(౧౨) దాసబోధ — శివ - శక్తులు

జిజ్ఞాసువు :- శ్రీ జ్ఞానేశ్వరులవారి తదనంతరము క్రీ. శ. 1608 - 1682 మధ్య శ్రీ సమర్థ రామదాసస్వామి వారను నొక మహనీయులు జన్మించిరని, వీరు "రామదాసీయ పంథ" అను నొక సంఘము నేర్పరచిరని, వీరును శివ - శక్తుల గుఱించి చెప్పిరని వింటిని. వారి తత్త్వమెట్టిదో దయ యుంచి తెలుపుడు.

వేదాంతి :- వీరు ఛత్రపతి శ్రీ శివాజీ మహారాజుగారికి గురువులు 'దాసబోధ'యను వేదాంత గ్రంథమును రచి యించిరి. ఆగ్రంథము నుండి కొన్ని భాగముల నిట నుదాహ రింతును :—

(1) "ఆదియందు నిత్యము ముక్తము పరమార్థ క్రియయు నగు పరబ్రహ్మయొక్కటియే గలదు. దానియందు అస్పష్టముగను, సూక్ష్మముగను మూలమాయ కలిగెను."
(దా. బో. 8-2-3)*

"నిశ్చలమగు ఆకాశమునందుఁ జంచలమగు వాయువు ఎట్లు కలుగుచున్నదో యటులే అచలమును నిరాకారమునగు స్వరూపమునందు మూలమాయ కలుగుచున్నది."
(దా. బో. 8-3-27)

---

*దాసబోధయందలి వాక్యములకు మండలియందు చేసిన అంకెలు దా. బో. అని గుర్తుపెట్టినాను.

"కాని వాయు వుండుటవలన నాకాశముయొక్క నిశ్చలత్వమునకు నేలోకవిధమగు బాధ కలుగుట సంభవింపదు." (దా. తో. 8-3-28)

"ఇటులే మూలమాయ యుండుటవలనఁ బరమాత్మని నిర్గుణత్వమునందుఁగూడ నేవిధమగు బాధయుఁ గలుగదు" (29) "వాయువు మొదటనుండియే యుండవలయునను నియమము లేదు. ఇటులే మూలమాయయుఁ బురాతనముగాదు. దానిని సత్యమని యంగీకరించుచో అది మఱల లీనము గూడఁ గావలసియున్నది." (30) "వాయువునకు వలె మూలమాయకుఁగూడ స్వరూప మెఱుంగవలయును. వాయువు భాసమానమగుచున్నదిగాని దృష్టిలోకి రాదు." (31) "...అవిద్యమాయయొక్క విస్తరము సుమా."(33).

(2) "బ్రహ్మమునందున్న మూలమాయయే ముందున కరిగి అష్టవిధ ప్రకృతి యనబడుచున్నది. (పంచభూతములు త్రిగుణములు అష్టవిధ ప్రకృతి) పంచ భూతములయందును త్రిగుణములయందును మూలమాయ కలసియే యుండును" (దా. బో. 10-4-9) బ్రహ్మమునందు సమీరరూపముననున్న మూలమాయయందుగల చైతన్యమే యీశ్వరుడు. ఆ చైతన్యమును ఈశ్వరుడనియు సర్వేశ్వరుడనియుఁగూడఁ జెప్పుదురు." (దా. బో. 10-4-16) "ఆ ఈశ్వరుడే గుణయుక్తుడైనపు డాతని గుణముల ననుసరించి మూడు భేదములు కలుగుచున్నవి. ఆ భేదములను బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు అని అందురు". (దా. బో. 10-4-17). "మొదట బ్రహ్మమునందు మూలమాయ కలిగెను.

తరువాత దానినుండి గుణమాయ జనించెను. ఇందువలననే మాయను గుణక్షోభిని అని చెప్పుచున్నారు. (దా. బో. 8-4-2) మాయవలన సత్త్వ రజస్తమోగుణములు మూడు గలిగెను. ఆపిమ్మట తమోగుణమునుండి పంచమహాభూతము లేర్పడెను". (3) "మూలమాయయందుగల యెఱుకయే సత్త్వగుణము. ఎఱుకలేమియే (మఱపే) తమోగుణము రెండింటి మధ్యదశ (కొంత యెఱుక - కొంత యెఱుక నేమి) రజోగుణము" (దా, బో. 9-6-3) "ఏమియు నెఱుగకుం డుట యజ్ఞానము. అన్నిటిని నెఱుగుట జ్ఞానము. ఇట్లే అన్నింటి నెఱిగినభావనగూడ లయమైపోవుట విజ్ఞానము. ఈదశ కలిగినపిమ్మట ప్రాణి స్వయముగా ఆత్మయైపోవును" (దా. బో. 9-7-51).

(3) "వాసనావృత్తి ప్రాణులను వెంట నంటి యుండును. కావున బంచప్రాణములు తమతమ స్థానములను విడిచిపోవుచున్నప్పుడు వాసనకూడా దేహమును విడిచి వాని వెంట వెడలిపోవును" (దా, బో. 9-8-4) ఈవిధముగా ప్రాణవాయువుల వెంటనంటి తొలుదొలుత వెడలిపోవునది వాసనయే. మఱల హేతువు ననుసరించి యదియే జన్మము గైకొని ప్రపంచములోనికి వచ్చును. (9-8-5) "...ఊది నంతనే అగ్ని ప్రకటన మగునట్లు వాసనారూపమగు వాయువు గూడ జన్మము నొందుచుండును" (దా. బో. 9-8-11) "మనస్సునకు నానావిధములగు వృత్తులు గలవు. వానియందే (ఆ వృత్తులయందే) వాసన యుత్పత్తియగును. వాసనయను నది చూచుటకు గాన్పింపకున్నను అది యవశ్యముగా నున్నది

సుమా" (12) "వాసనయందు యెఱుక యొక్క హేతువు యున్నది. ఈ ఎఱుక మూలమాయ నుండి వెడలిన తంతువు. ఇది కారణరూపములో మూలమాయయందు మిశ్రితమై యుండును." (13)

(4) "వాస్తవమునకు జలశక్తి నెఱుక యందురు. వాయువునందు సమస్త గుణములున్న సంగతి నెనుకఁ జెప్పి యున్నాము. ఈవిధముగా ఎఱుక మఱుపులతో మిశ్రమములై పంచభూతము లన్నియు వర్తించును కావున భూతములయందు ఎఱుక యవశ్యముగ నున్నది."

(దా. బో. 9-6-19, 20)

"ఈ ప్రకారముగా యెఱుక యొకచోట గుప్తముగను ఒకచోట ప్రకటముగను జగమునందు వర్తించుచుండును." (దా. బో. 9-8-26)

"అంతఃకరణమని సంజ్ఞకు చెప్పుదురు. సంజ్ఞయని యెఱింగెడి స్వభావమునకుఁ జెప్పుదురు. ఇదియే దేహరక్షణకుపాయము. (ఎఱుగుట్టి *శ)" (దా. బో 10-1-11, 12) సర్పమెఱిగి కరవ వచ్చుచున్నది. ప్రాణి యెఱిగి పారిపోవుచున్నాడు. సంజ్ఞ (Consciousness) ఇరు పక్షముల నున్నది. (13) *సంజ్ఞ యనునది రెండుపక్షముల నొక్కటియే యున్నట్లుగాఁ జూచెదమేని అంతఃకరణము గూడ నొక్కటియే యగును. ఏలయన అంతఃకరణము సంజ్ఞారూపమని యింతకు ముందే చెప్పితిని." (14)

---

* ( )బండలిలో ఒక్క సంఖ్య వేసినవన్నియు ఆపైన వేసిన అధ్యాయమునందలి వాక్యములని గుర్తింపవలయును.

(5) "మూలమాయ జడపదార్థమునకు చేతనము నొసంగుచున్నది. కాన దానిని చైతన్యమందురు." "వాయువు చేతనశక్తి (జగజ్జ్యోతి) కలసి మూలమాయ యనఁబడును." పురుషుఁడు ప్రకృతి యని సైతము దీని నందురు." (దా. బో. 10-9-7) "వాయువును ప్రకృతి యనియు జగజ్జ్యోతిని పురుషుడనియు యందురు. వీనికే 'పురుష ప్రకృతులు, శివశక్తులు అని పేరులు గలవు". (8) "వాయువునందు గల చేతన విశేషమే ప్రకృతియందు పురుషుడు. ఈ విషయమునందు విశ్వాస ముంచవలయును." (9) "వాయువు శక్తి, చేతనము శివుడు. వీనినే జనులు అర్ధనారీ నటేశ్వరు డందురు". (10) "వాయువులో చేతన గుణము గలదు. ఇదియే ఈశ్వర లక్షణము. దీనినుండియే మఱలఁ ద్రిగుణము లేర్పడెను". (11) త్రిగుణములలో సత్వ గుణము శుద్ధ చైతన్య లక్షణము. దీని దేహధారి 'స్వరూపము శ్రీవిష్ణుమూర్తి.' (12) ... ఆత్మ, జగజ్జ్యోతి, సర్వజ్ఞత్వము అను నీ మూఁడింటిని నొక్కటి యనియే తెలిసికొనవలెను. దానినే అంతఃకరణము, లేక జ్ఞప్తియని నిశ్చయ పూర్వకముగా నెఱుఁగవలయును. (దా. బో. 10-10-33) ... అన్నింటిని నడుపునది అదియొక్కటియే. ఆ అంతరాత్మ అనంత బ్రహ్మాండముల వ్యాపారమును నడుపుచున్నది. ... (35) అది క్షేత్రమును క్షేత్రవాసియునైయున్నది. మఱియు దానిని దేహియనియుఁ, గూటస్థుఁడనియుఁ గూడ నుడువుదురు." (44)

(6) "అవిద్య జడము. ఆత్మ చంచలము. జడము (అవిద్య) కర్పూరము. ఆత్మ అనలము. రెండును కాలిన వెంటనే చల్లారుచున్నవి. (దా. బో. 13-7-6). బ్రహ్మము ఆకాశము నిశ్చలజాతివి. ఆత్మయు, వాయువు చంచలజాతివి ... (7) జడ మనేకముగలది. ఆత్మ యేకము. ఇదియే ఆత్మానాత్మ వివేకము. జగత్తుయొక్క వ్యవహారమును నడపువాడు జగన్నాయకుడు. (8) జడము అనాత్మ, చేతనము ఆత్మ. అన్నింటియందును వర్తించునది సర్వాత్మ. అన్నియుఁగలసి చంచలాత్మ యయ్యెను. ఇది నిశ్చలమైనది కాదు (9) పరబ్రహ్మము నిశ్చలము. దానికి దృశ్యభ్రమ లేదు. విమలబ్రహ్మమునకు భ్రమ లేదు. అది యచలము." (10) "ఇట్లే దేహి (ఆత్మ) దేహములు (అనాత్మలు) రెండును భిన్నములుగా నున్నవి. మఱియు నీ రెంటికిని భిన్నముగా నున్నది నిరంజనమును నిరుపమును నగు పరమాత్మ."

(దా. బో. 13-10-7)

సమర్థులవారి వాక్యములయందలి తాత్పర్యమును వారి వాక్యములకు ప్రారంభమున సూచించిన సంఖ్య క్రమము ననుసరించి చెప్పెదను. సావధానముగా వినవలయును.* ఇందులో అచ్చటచ్చట నా యభిప్రాయమును గూడ తెలియచేయుదును.

---

* ముందు చెప్పబోవు శివరామదీక్షితులవారి అచలవేదాంతమునకు సమర్థులవారి బోధకును యెట్టి సంబంధమైన కలదా యను యంశమును ముందు చర్చింపబడును. కనుక, యీ విషయమును ఇచట చక్కగా అవగాహనము చేసికొనిన ముందు చెప్పబోవు అచలవేదాంతము సులభముగ బోధపడును.

(1) శ్రీజ్ఞానేశ్వరులవలెగాక, శ్రీసమర్థులు అద్వైతులవలె మాయ అవిద్యలయొక్క స్థితిని అంగీకరించిరి. కాని, వీరు చెప్పిన మూలమాయయొక్క స్వరూపమునకును, అద్వైతులు చెప్పిన మాయ స్వరూపమునకును, భేదమున్నది. మూలమాయ సాంఖ్యుల ప్రకృతివంటిది కాదు.

(2) సమర్థులవారు మూలమాయయే గాక గుణమాయయను మఱియొకటి కలదనిరి. మూలమాయయే గుణమాయగా పరిణమించినట్లు చెప్పిరి. మూలమాయ బ్రహ్మమునందు పుట్టినది. అందే గిట్టుచున్నది. శుద్ధజ్ఞానము పరబ్రహ్మస్వరూపము. శ్రీసమర్థులు చైతన్యము, జడము అను రెండును మూలమాయయొక్క లక్షణము లనుటవలన పరబ్రహ్మము చైతన్యస్వరూపము కాదని పరోక్షముగ చెప్పినట్లైనది. కాని పరబ్రహ్మము శుద్ధ జ్ఞాన స్వరూపమని చెప్పయున్నారు. పరబ్రహ్మము శుద్ధజ్ఞానమని చెప్పుటవలన ఆ శుద్ధజ్ఞానమునకంటె భిన్నమగు జ్ఞానము మఱియొకటి కలదని తాత్పర్యము. అది కేవల వృత్తిజ్ఞానమే. అనగా : అంతఃకరణ వృత్తియని అర్థము చేసికొనవలసియున్నది. శ్రీసమర్థులు ఒక విధమగు అద్వైతము నంగీకరించియున్నను శ్రీశంకరుల చిదాభాసు నంగీకరింపలేదు. ఆ కారణమున శ్రీసమర్థులు చెప్పిన అంతఃకరణమే జీవుడు, ఈశ్వరుడు. వారు చెప్పిన అంతఃకరణము విభువు. ఇందువలన శ్రీసమర్థుల అద్వైతము శ్రీశంకరుల అద్వైతముకంటెను భిన్నమైనది. సమర్థులవారి మతమున గల ముఖ్యమైన తప్పేమనగా:— పరమాత్మ, సర్వాత్మ, నిశ్చలమగు పరబ్రహ్మము, అచలము, అను

నామములతో చెప్పబడిన శుద్ధబ్రహ్మము విభువే. అంతః కరణము విభువే. విభువనగా సర్వవ్యాపి. రెండు విభువు లుండుట అసంభవము. ఇది సవరింపరాని తప్పు.

మూలమాయ వాయురూపమున నున్నదని పలుమారు చెప్పిరి. వాయు వెచ్చటనుండి వచ్చినది? అప్పటికి పంచ భూతములు పుట్టియుండలేదే. కనుక, శ్రీసమర్థులు చెప్పిన వాయువు ముండకశ్రుతియందు (ముం. 2-1-3) చెప్పిన ముఖ్య ప్రాణమే యనవచ్చునా?

మూలమాయ, గుణమాయ అని సమర్థులు చెప్పిన మాయాద్వయమును ఒకవిధముగా వీరశైవమత మంగీక రించినది.* అద్వైతులు చెప్పు మాయ జడము త్రిగుణాత్మ కము సమర్థులవారు చెప్పు మూలమాయ చైతన్యము, జడము, రెండింటియొక్క మిశ్రమము. చైతన్యము చేతన అను రెండు పదములు సర్వత్ర సమానార్థకములు కావు. చైతన్యము శుద్ధజ్ఞానము. ఉప్పుకల్లునందు లవణరసము

* వీరశైవమతము ననుసరించి మాయోపాధి శుద్ధమని అశుద్ధమని రెండు విధములు: (1) శుద్ధమాయయే ఊర్ధ్వమాయ యనియు, (2) అశుద్ధమాయ అధోమాయ యనియు, ప్రకృతి యనియు, అవిద్యాశక్తి యనియు, పిలువబడును. ఊర్ధ్వమాయ శివునాశ్రయించియున్నను అతనికి మోహాదులను కలుగనీయదు. — అవిద్యాశక్తి భేదముచేత నే జీవు లనేకవిధము లగుచున్నారని, (సిద్ధాంత శిఖామణి 5-40, 41) శ్రీజ్ఞానేశ్వరులు అజ్ఞానము బ్రహ్మమునందు వాసంబున్న బ్రహ్మమును (జ్ఞానమును) అజ్ఞానముగా యేల మార్చదు! (అను. 7-8) అని చెప్పిన వాక్యములు వీరశైవమతమునకు సమ్మతములుగా దని విదితమైనది.

తప్ప అన్యరసము లేనియట్లు చైతన్యమునందు జ్ఞానము తప్ప జడపదార్థము లేదు. సమర్థులవారు 'చేతనము' 'చైతన్యము' అను శబ్దద్వయము సర్వత్ర సమానార్థకము లుగా వాడిరి. చైతన్య సాన్నిధ్యమున జడమునందు చైతన్యము కలుగును. ముఖ్యప్రాణమును చేతన యన వచ్చును, గాని చైతన్య మనరాదు. ముఖ్యప్రాణమే మూల మాయయను భావముతో అందులో చైతన్య మున్నదని సమర్థులు తలచిరి. అది పొరపాటు. చేతన (ప్రాణచలనము) మాత్రమే కలదు.

శ్రీసమర్థులు వాయురూపముననున్న మూలమాయ యందుగల చేతనమే ఈశ్వరుడనిరి. అందువలన శ్రీశంకరుల వారి ఆభాసవాదమును వీరు త్రోసిపుచ్చిరని స్పష్టమైనది. సమర్థులవారు చెప్పిన అష్టవిధ ప్రకృతులకును గీతయందు (7-4) చెప్పిన అపరా ప్రకృతి సంబంధమగు అష్టవిధ ప్రకృతులకును భేదమున్నది. గీత చెప్పిన అపరాప్రకృతి అహంకారము, బుద్ధి, మనస్సు, పంచభూతములు. శ్రీ సమర్థులు చెప్పిన అష్టవిధ ప్రకృతులు, పంచభూతములు, త్రిగుణములు.

(3) వేదాంతులయందలి భిన్న భిన్న శాఖలు జీవు డున్నట్లు అంగీకరించినవి. బౌద్ధులవలె శ్రీ సమర్థులును జీవుని స్థానమున వాసనను ప్రవేశపెట్టిరి. మరణకాలమున పంచ ప్రాణములవెంట దేహమును విడిచి పోవునదియు, దేహాంత రము పొందునదియు, వాసనయే యనిరి. వీ రిట్లు చెప్పుటకు కారణమేమన, వీరు చెప్పిన అంతకరణ మనునది విభువు,

(సర్వవ్యాపి). కనుక, అది ఒక చోటునుండి మఱియొక చోటు నకు పోజాలదు. అందువలన గమనాగమనములు వాసనకే చెప్పిరి. బౌద్ధులు సహితము మరణకాలమున దేహమును విడిచి పోవునదియు, పునర్జన్మ యెత్తునదియు 'భావాదు' లే యని చెప్పిన సంగతి తెలిసినదే. దీనిని వేదాంతులయందు ఇతర శాఖ లెవ్వియు అంగీకరింపవు. కాని, న్యాయ వైశేషిక దర్శనములయందు "మరణకాలమునందు దేహము నుండి వెడలిపోవునది మనస్సనియు, మనస్సు వాసనలను తనయందిముడ్చుకొనియుండు పెట్టెవంటిదనియు, పునర్జన్మ మున నూతనదేహమునందు ప్రవేశించిన మనస్సు తనయం దున్న వాసనలను క్రమముగా బయటికి వదలుననియు అందురు. నైయాయికులు చెప్పినది వేదాంతులకు సమ్మతము కాకపోయినను సమర్థులవారు చెప్పినదానికంటె యుక్తము గనే యున్నది. నైయాయికుల మనస్సు విభువుకాదు. కనుక, గమనాగమనములు దానికి చెప్పవచ్చును. అంతఃకరణము చైతన్యమని శ్రీ సమర్థులు చెప్పిరి, కాని వాసన చైతన్యము కాదు. వాసనలే పునర్జన్మమెత్తిన, పూర్వజన్మమున చేసిన కర్మ ఫలమును అనుభవించు వా రెవ్వరు? వాసనలు పురు షుడు కాదు గదా? మనస్సునందు నానావిధవృత్తులు గల వనియు, వృత్తులయందు వాసనలున్నవనియు చెప్పియుండుట వలనను; వాసనలయందు యొకొకటి మూలమున్నదని చెప్పియుండుటవలనను, మనస్సే జన్మాంతరము నొందు చున్నదని యొకవిధముగా సమాధానపడవచ్చును. అయినను యీ సిద్ధాంతము వేదాంతులలో యెవ్వరికిని సమ్మతము కాదు.

(4) ఈ యంశమున ఎఱుక అంతఃకరణము అను వాటిని గురించి చెప్పిరి. 'అంతఃకరణమని సంజ్ఞను చెప్పెదరు' అని చెప్పియున్నారు. దీనినిబట్టి సమర్థులవారు చెప్పిన 'ఎఱుక' — అంతఃకరణము (సంజ్ఞ) అనునవి సమానార్థకములు కావను సంశయము కలుగుచున్నది.

(5) సమర్థువారు చెప్పిన మూలమాయ యందు వాయువు, చేతనశక్తి యనునవి రెండు కలవు. ఇందులో చేతనశక్తి (జగజ్జ్యోతి)ని పురుషుడనియును, వాయువును ప్రకృతియనియు చెప్పిరి. ఇందులో పురుషుడు, శివుడు, ప్రకృతిశక్తి. ఈ విధముగా పురుషప్రకృతులు, శివశక్తులు నిర్వచింపబడిరి. ఈ జంటనే అర్థనటేశ్వరులని కూడ చెప్పిరి. వీరు చెప్పిన శివశక్తులకును, శ్రీజ్ఞానేశ్వరులు చెప్పిన శివశక్తులకు భేదమున్నది. శ్రీజ్ఞానేశ్వరులు యే తత్త్వమును శివుడనిరో దానిని శ్రీ సమర్థులు శక్తియనియు, శ్రీజ్ఞానేశ్వరులు దేనిని శక్తియని చెప్పిరో ఆ తత్త్వమును శ్రీసమర్థులు శివుడనియు తారుమారుగా చెప్పిరి. వీరిమతము ననుసరించి ఆత్మ యనునది అంతఃకరణమే. అదియే జగజ్జ్యోతి. అదియే క్షేత్రమని క్షేత్రజ్ఞుడనిరి. దానినే దేహి దేహము లని కూడ చెప్పిరి. ఆత్మను క్షేత్రమని చెప్పుట పొరపాటై యుండవచ్చును. ఏలయన, శ్రీ సమర్థులే క్రింద చెప్పబోవు శివ

శక్తుల నామములయందు క్షేత్రమును 'శక్తి' యొక్క నామములలో చేర్చిరి.

దాసబోధయందు శివుడు, శక్తి అను నీ నామ ద్వయమునకు పర్యాయనామముల యీ క్రింది విధముగా చెప్పియున్నారు :—

శివునకు పర్యాయనామము లివి :— ఎటులక, ఆది నారాయణుడు, విష్ణుదేవుడు, జగజ్జ్యోతి, సత్త్వగుణము, జ్ఞాత, సర్వజ్ఞుడు, జీవుడు, ఈశ్వరుడు, ఆత్మ, జ్ఞప్తి, సంజ్ఞ, క్షేత్రవాసి, లేక, క్షేత్రజ్ఞుడు, కూటస్థుడు, జగన్నాయకుడు, సర్వాత్మ, చంచలాత్మ, చైతన్యము, చేతన, అహంకారము, దేహి, అంతఃకరణము.

శక్తికి పర్యాయనామము లివి :— ప్రకృతి, జడము, తమోగుణము, అనాత్మ, క్షేత్రము, లేక దేహము, వాయువు, జ్ఞేయము.

శ్రీ సమర్థుల మతమున మూలమాయయే ఆత్మానాత్మలైనది. ఆత్మ అనగా అంతఃకరణము (జీవుడు), అనాత్మ అనగా అంతఃకరణమునకంటె భిన్నమగు దేహాది సంఘాతము.

(6) ఆఱవ అంశము నందును ఆత్మానాత్మల వివేచనము చేయబడెను. కాని రెండును భిన్నములని చెప్పెను. అవి రెండును ఒకే మూలమాయయందు కలిగినవి కదా? భిన్నములని చెప్పుట యేల? అను సంశయము కలుగును. శరీరమునందు తక్కిన భాగములకంటె గోళ్లు వెంట్రుకలు

భిన్నములైనట్లు దేహాది సంఘాతముకంటె అంతఃకరణము భిన్నమని వారి మతమైయుండవచ్చునేమో!

శ్రీ సమర్థులవారు "జడము (అవిద్య) కర్పూరము, ఆత్మ అనలము రెండును కాలిన వెంటనే చల్లారును" అని చెప్పిరి. ఇది సరికాదు. ఒక జడపదార్థమును, ఆత్మ (అంతఃకరణము) తెలిసికొన్నంత మాత్రమున ఆ జడపదార్థము నశించి పోవుచున్నదా? అట్లగుటలేదే? జడపదార్థమును కర్పూరముతో పోల్చుటెందులకు? ఆత్మ అనల మెట్లగును? అద్వైతులు చెప్పిన ప్రకారము అవిద్య కర్పూరము, సంయక్ జ్ఞానము అగ్ని అను సామ్యము సరిపోవును.

శ్రీ శంకరులు చెప్పిన ఆత్మ నిర్గుణబ్రహ్మము, శ్రీ సమర్థులు చెప్పిన శుద్ధజ్ఞానము (నిర్గుణబ్రహ్మము) ఒక్కటియే. శ్రీ శంకరులు చెప్పిన సూక్ష్మదేహముతో శ్రీ సమర్థులు చెప్పిన ప్రాణపంచకముతోటి వాసనలను పోల్చవచ్చును. శ్రీ సమర్థుల ఆత్మ (అంతఃకరణము) శంకరుల మతమున చెప్పిన అంతఃకరణమునకంటె వేఱు.

జిజ్ఞాసువు :- ఈ మతము ననుసరించి బంధమోక్షము లెవనికి కలుగుచున్నవి? వాసనకేనా? బ్రతికియుండగా భోగ మనుభవించువా డెవడు?

వేదాంతి :- వేదాంతుల మతానుసారమే శ్రీ సమర్థుల మతమునందును సంసార మున్నంతవఱకును బంధమున్నది. స్వర్గనరకము లున్నవి. పరమార్థమున బంధమోక్షము లనునవి యెవ్వరికిని లేవు. ఉన్నది ఒక్క బ్రహ్మమే. దాని యందుండి కలిగిన మూలమాయయే ప్రకృతి పురుషులై

(శివ - శక్తులై) సమస్త విశ్వము ఉన్నట్లు కల్పించుకొని సమస్త నాటకమును ఆడి తుద కవి రెండును యేకమై (మూలమాయయై) తొలుత ఆ మూలమాయ యేపర బ్రహ్మమునుండి కలిగెనో ఆ పరబ్రహ్మమునందే లయమగు చున్నది. అంతటితో నీవు, నేను, సమస్త విశ్వమును కలలో తోచిన వస్తువులు మేల్కొనగనే యేమియు లేనియట్లు లేక పోవుచున్నవి. మాయయే తాను దేహధారియైనట్లు, సుఖదుఃఖముల ననుభవించినట్లు తలంచుచున్నది. ఇదియే సంసారము. ఈ సంసారము తొలగిపోవలయునన్న శుద్ధ జ్ఞానము కలుగవలయు నందురు. శుద్ధజ్ఞానము కలుగగనే ఆత్మ నశించునట. అనగా: ఆత్మ దేనియందుండి వచ్చినదో దానియందు లయమగును. అప్పుడు మనము శుద్ధ జ్ఞాన స్వరూపులమై యుందుము. శుద్ధజ్ఞానమనగా పరబ్రహ్మము.

జిజ్ఞాసువు :- దీనికి సాధన యేమియు అవసరము లేదా?

వేదాంతి :- సమర్థులవా రిట్లు చెప్పిరి: "శ్రోతలారా! ఇపుడు మీరు శుద్ధ జ్ఞాన లక్షణములను వినుడు. మనము శుద్ధ జ్ఞాన స్వరూపులమే, యనుదానియం దనుభవము కలుగుటయే శుద్ధజ్ఞానము. మహావాక్యమంత్రము మంచిదే. తత్త్వమసి (తత్ + త్వం + అసి = ఆ బ్రహ్మము నీవేయై యున్నాడవు) ఈ మంత్రమును జపింపుమని చెప్పలేదు. ఈ వాక్యమును సాధకుడు విచారము గావింపవలసి యున్నది." (దా. బో. 5-6-10-11) "ఈ మహావాక్య వివరణము గావించుటయే జ్ఞానమునకు ముఖ్యలక్షణము.

అట్టి ముఖ్యలక్షణము కలిగిన మనము బ్రహ్మస్వరూపులమను సంగతి సుబోధమగును. (దా. బో. 5-6-14) తనకు తనది లభించుట [నే నెవ్వరని తెలిసికొనుట, లేక, ఆత్మస్వరూప మెఱుగుట] యను నీ జ్ఞానము పరమ దుర్లభమైనది. ఈ జ్ఞాన మాద్యంతమునందు స్వయంభూస్వరూపమున నున్నది." "సమస్తము నెచటనుండి ప్రకటిత మగుచున్నదో దేనియందని యంతయు లీనమగుచున్నదో యట్టి జ్ఞానము కలిగిన పిమ్మట బంధనములను గూర్చిన భ్రాంతి యంతయును నశించును." (దా. బో. 5-6-16)

పర్యవసానమున శాంకరమతముతో సమర్థులు ఒక విధముగా ఏకీభవించిరి గాని ప్రారంభమునుండియు శంకరుల మార్గమునకు భిన్నముగనే నడచిరి. ఆత్మైక్య జ్ఞానమును బోధించుటచే పర్యవసాన మొక్కటే అయినది.

జిజ్ఞాసువు :- ఈ బోధ ప్రస్థానత్రయములకు సమ్మతమైనదేనా ? దీనికి మూలమేది ?

వేదాంతి :- ఈబోధ శ్రీ సమర్థులు స్వయము స్థాపించినది కాదు. ఇది యొకవిధముగ శైవశాక్త సంబంధమగు తత్త్వము. కొంతవఱకు ప్రాచీనమైనదేయని చెప్పవచ్చును. దేహి దేహములు రెండును మాయికములే (ప్రకృతియే) యను వీరి యీ సిద్ధాంతము మాత్రము ప్రస్థానత్రయములకు సమ్మతము కాకపోయినను తక్కిన యంశములు మాత్రము చాల వఱకును సమ్మతమైనవే. ఇదియు ఒకవిధమగు అద్వైతమే. శ్రీశంకరులవలెనే వీరును మాయ నంగీకరించిరి. కాని, చిదాభాసుని అంగీకరింపలేదు. అద్వైతులలోని అవచ్ఛిన్నవాద

మును కూడ వీ రంగీకరింపలేదు. వీరిబోధ యోగవాసిష్ఠము వంటి అద్వైత గ్రంథములయందు చెప్పిన దృష్టి సృష్టి వాద ములో కొంతవఱకుమాత్రమే సరిపోవును. దాసబోధయందు శ్రీశంకరులు చెప్పినట్లు మాయోపాధికుడు ఈశ్వరుడనియు, అవిద్యోపాధికుడు జీవుడనియు, యేర్పాటు లేదు. ఈశ్వరుడు, జీవుడు, అను వారి స్థానములందు అంతఃకరణమునే చెప్పిరి. అంతఃకరణమే (ఎఱుకయే) తాను. తానే (అంతఃకరణమే) తనకొక శరీరము తల్లిదండ్రు లున్నట్లును, ఈశ్వరు డొక డున్నట్లును అతడీ సమస్త విశ్వమును సృష్టించినట్లును కల్పించుకొన్నది. యదార్థము విచారించిన ఈశ్వరుడు లేడు. ప్రపంచము లేదు. ఉన్నది ఒక్క బ్రహ్మమే.

జిజ్ఞాసువు :- అయితే ఈశ్వర భజనము వ్యర్థమని యేనా వీరిమతము ?

వేదాంతి :- వ్యర్థమనరు. ఒకనికి కల తోచినది. అందులో తాను దరిద్రుడై అన్నవస్త్రములు లేక అలమటించి పోవుచు ఒక రాజును చేరి ఆయనను సేవించి రాజుయొక్క అనుగ్రహమున ధనధాన్య సంపదలు కలిగి సుఖించినట్లే, తాను, భ్రాంతి వలన ఉన్నట్లు కల్పించుకొన్న ఈశ్వరుని సేవించి, చిత్తశుద్ధి కలిగి శుద్ధజ్ఞానరూపు డగుచున్నాడు.

జిజ్ఞాసువు :- యోగవాసిష్ఠమున శివశక్తులను గుఱించి చెప్పబడినదని వింటిని. అచట శివశక్తులయొక్క స్వరూప విచార మెట్లు చేసిరో దయయుంచి తెలుపుడు.

(౧౩) యోగవాసిష్ఠము : శివ - శక్తుల స్వరూపవిచారము

వేదాంతి :- యోగవాసిష్ఠమునందు శివ శక్తులను గురించిన చర్చ అచ్చటచ్చట కలదు. ముఖ్యముగ నిర్వాణ ప్రకరణమునందలి 81 వ సర్గము నుండి 85 వ సర్గముయొక్క చివరవఱకు యీ విషయము విపులముగ చర్చించబడినది. యోగవాసిష్ఠము దృష్టి సృష్టి వాదమను అద్వైతమును బోధించును. దృష్టి అనగా - జ్ఞానము ; సృష్టి అనగా - జగత్తు. జ్ఞానమే జగద్రూపమున ఉన్నదని సారాంశము. చిత్తు (బ్రహ్మము) యొక్క శక్తి (చిత్ + శక్తి) యే చిత్రరూపమును పొంది జగద్రచన చేసినదని బోధించును. దీనినే దృష్టి సృష్టి వాదమందురు. యోగవాసిష్ఠమున శ్రీ రామునకు శ్రీ వసిష్ఠమహర్షి యిట్లు బోధించినట్లు కలదు :—

శ్లో॥ "మనో మనన నిర్మాణమాత్ర మేతజ్జగత్త్రయమ్,
న సన్నాస దివ స్ఫారముదితం నేతరన్మనే." (4-11-23)

తా॥ మునీంద్రా! ముల్లోకములును మనోనిర్మాణ* మాత్రమే. సదసద్విలక్షణంబగు మనస్సే యీవిధముగ నిర్మించుచున్నది.

చిత్తు, చిత్తునందున్న జగన్నిర్మాణ సామర్థ్యరూపశక్తి రెండును చిత్తే అని నిర్వాణప్రకరణమున యీ క్రింది విధమున చెప్పబడినది :—

---

* ఇచట చెప్పబడిన మనస్సు పంచభూతములయొక్క సాత్వికాంశములయందు అయిదు అర్ధభాగముల సమష్టిరూపమైన సామాన్య మానవ మానసము కాదు. అది అతీతమానసము. (అనిర్వచనీయమైన మాయాశక్తియని యెఱుంగవలెను.)

శ్లో॥ స భైరవశ్చిదాకాశః శివ ఇత్యభిధీయతే,
అనన్యాం తస్య తాం విద్ధి స్పన్దశక్తిం మనోమయీమ్.
(యో. వా. 6-84-2)

తా॥ శ్రీ వసిష్ఠుడు :— "ఓ రామచంద్రా! ఆ భైరవుడు చిదాకాశమగు శివరూపుడని చెప్పబడుచున్నాడు. ఆ కాళికాదేవి అతనికంటెను వేఱు కానిదిగను అతని స్పందన శక్తిగను, మనోమయ రూపిణిగను నెఱుగుము."

శ్లో॥ "యథైకం పవనస్పన్దమేక మౌష్ణ్యానలౌ యథా,
చిన్మాత్రం స్పన్దశక్తిశ్చ తథైవైకాత్మ సర్వదా."
(యో. వా. 6-84-3)

తా॥ "వాయువు, అద్దాని స్పందమును, అగ్ని, అద్దాని యుష్ణత్వమును నొకేపదార్థమగునట్లు చిన్మాత్రము, అద్దాని స్పందనశక్తియు సదా యేకమే యగును."

శ్లో॥ "స్పందేన లక్ష్యతే వాయుః వహ్నిరౌష్ణ్యేన లక్ష్యతే,
చిన్మాత్రమమలం శాంతం శివ ఇత్యభిధీయతే."

శ్లో॥ "తత్స్పన్దమాయా శక్త్యైవ లక్ష్యతే నాన్యథాకిల,
శివం బ్రహ్మ విదుః శాన్తమవాచ్యం వాగ్విదామపి."
(యో. వా. 6-84-4-5)

తా॥ స్పందము (= ఇంచుక కంపనము) చేత వాయు వెఱుగబడుచున్నది. వేడిచేత అగ్ని యెఱుగబడుచున్నది. అట్లే శాంతుడైన శివుడు స్పందరూపమగు మాయాశక్తి చేతనే యెఱుగబడుచుచున్నాడు. అన్యథా యెఱుగబడడు. ఆ శివుడే బ్రహ్మమని బ్రహ్మవిదులు చెప్పుచున్నారు.

శ్లో॥ "స్పన్దశక్తి స్తదిచ్ఛేదం దృశ్యాభాసం తనోతి సా,
సాకారస్య నరస్యేచ్ఛా యథా వై కల్పనా పురమ్."
(యో. వా. 6-84-6)

తా॥ సాకారమైన నరుని యిచ్ఛ (సంకల్పము) మనోరాజ్యమును కల్పించుకొనునట్లు శివుని స్పందనశక్తియైన ఇచ్ఛారూపిణియగు కాళి (శక్తి) ఈ దృశ్యప్రపంచమును విస్తరింప జేయుచున్నది.

శ్లో॥ "చితిశక్తేః క్రియా దేవ్యాః ప్రతిష్ఠానం యదాత్మని,
యథా భూతస్థితేరేవ తదేవ శివ ఉచ్యతే."
(యో. వా. 6-84-2)

తా॥ చితిశక్తి తనయందు స్పంద జడభావముతోటి ఉండుట యేది కలదో అదియే క్రియ (శక్తి) యనబడును. తన స్వాభావిక చిన్మాత్ర స్వభావముతోటి యుండుట యేది కలదో, అదియే శివరూప మనబడును.

జిజ్ఞాసువు :- చితి శక్తి విశ్వనిర్మాణము చేయుచున్న దంటిరి గదా? దీనికి ఉపాదానకారణ మేది? జీవకోటి ఎట్లు సృజింపబడెను?

వేదాంతి :- ఈ మతమునందు సృష్టి కలిగిన దనుట కేవలము వ్యావహారిక మే. సృష్టి కలుగను లేదు, నశింపను లేదు. నీవు స్వప్నము కలిగిన దనుకొనుము. ఆ స్వప్నమున ప్రపంచము వాస్తముగ కలిగిన దేనా? మేలుకొనగనే దానికి నాశనము కలిగినదందువా? మొదట కలుగనూ లేదు, తుదకు నశింపనూ లేదు. మనోరాజ్యమును మానవుడు నిర్మించుకొని నపుడు కలిగినదందుమా? అట్లే చిత్తముచేత సమస్తమును

కల్పితమైనది. స్వప్నలోకమునందలి జీవులందఱు ఆభాస జీవులే. స్వప్నప్రపంచము సహితము ఆభాసమాత్రమే. అట్లే జాగ్రత్తయందుతోచు విశ్వమును, ఇందుండు దేవ, మానవ, పశు, పక్ష్యాది, జీవరాసులు యీ మతము ననుసరించి స్వప్న సృష్టివంటివారే. "స్వప్నజాగరములు సమములు." ద్వివిధ సత్తల నంగీకరించు మతమిది. త్రివిధ సత్తల నంగీకరింపరు.

జిజ్ఞాసువు :- అట్లైన స్వప్నము జాగ్రత్తవలన నశించుచున్నది కదా? ఈ జగత్తుకు నాశన మెట్లు కలుగును?

వేదాంతి :- ఈ విషయమై యోగవాసిష్ఠము 85 సర్గమున 7 వ శ్లోకము నుండి 27 వ శ్లోకము వఱకు విస్తరించి చెప్పబడియున్నది. దానిని సంగ్రహించి తెలిపెదను.

పద్మమునందున్న భ్రమరము పద్మమును విడిచి 'ఝుం' అని ఝుంకారము చేయుచు బయలున తిరిగి తిరిగి అలసినదై, కాకతాళీయ న్యాయమున తిరిగి ఆ పద్మమునేచేరి పద్మమునందలి మకరందము నాస్వాదించుచు తన్మయత్వముతో శబ్దమును మానియుండునట్లు చిదాకాశము (పరబ్రహ్మము) నందు నృత్యము (జగత్కల్పనము) చేయుచున్న శక్తి కాకతాళీయ యోగముచే తన ప్రియుడగు శివునియందు గల ప్రేమవశమున ప్రియుడగు శివుని సమీపించి శివుని స్పృశించినంతనే తత్స్పర్శ మాత్రమున ఆవరణశక్తిని కోల్పోయినదై, నదీజలము సముద్రమునందు ప్రవేశించి సముద్రరూపమును బొందునట్లు శివరూపమునే బొందును. అప్పుడు చిన్మాత్రమే మిగులును.

ఇట్టి యనుభవమునే అమృతానుభవమనియు, అస్పర్శ యోగమనియు, అఖండైకరసస్వరూపమనియు, నిర్వికల్ప సమాధియనియు, పూర్ణావస్థయనియు, అచలమనియు, 'నేను లేకపోయితి' ననియు, వారివారికి తోచిన నామములనిడి యున్నారు. ఇట్టి స్థితినే లోకవ్యవహారమునందు ప్రళయ మనియు, జగత్తు నశించుట యనియు అనుచుందురు.

(౧౪) బ్రహ్మము - సృష్టి (సర్గము) ప్రళయము

శ్రీజ్ఞానేశ్వరుల, శ్రీఅరవిందుల. శ్రీసమర్థుల, యోగ వాసిష్ఠకారులచే చెప్పబడిన శివ శక్తులను గుఱించి తెలిసి కొంటిమి. నామరూపాత్మక జగత్కల్పనను, శివశక్తుల విచారమనినను, సృష్టిని గుఱించి విచారమనినను, ఒక్కటియే. ప్రపంచమునందు గల ప్రతి మతమునందును సృష్టి యెట్లు కలిగినదను విచారము చేయబడియున్నది.

నామరూపరహితమై, నిర్గుణమై, నిరంజనమై, సర్వ వ్యాపకమై అఖండాద్వితీయ బ్రహ్మము ఒక్కటియే సృష్టికి పూర్వముండెను. ఆయనయందుండి నామరూపాత్మక ప్రపంచము కలిగినది. కలిగినదనగా — యెట్లు కలిగినది? లేక బ్రహ్మమే నామరూపాత్మక జగత్తుగా పరిణమించెనా? పరిణమించెననిన ఏల పరిణమించెను? ఎట్లు పరిణమించెను? పరబ్రహ్మము అనృత, జడ, దుఃఖాత్మకమగు జగత్తు నేల సృజించెను? ఇట్టి ప్రశ్నలన్నియు ఒకటే ప్రశ్న. సృష్టి ఎట్లు కలిగిన దనుటయే. ఈ ప్రశ్నకు అందరిని తృప్తిని కలిగింప గల సమాధానము చెప్పగలుగుట మానవబుద్ధికి సాధ్యము కాదు. ఏలయన, సృష్టియొక్క యీ రహస్యము యెవ్వరికిని

పూర్ణముగా తెలియదు. ఈశ్వరవాక్కులని ప్రసిద్ధికెక్కిన వేదములు సయితము చెప్పలేకపోయినవి. ఋగ్వేదమునందలి నాసదీయ సూక్తమున* యీ యంశము ఏడు మంత్రముల యందు చెప్పబడియున్నది. అందు అయిదు మంత్రముల సారాంశమును, రెండు మంత్రములును వాటి తాత్పర్యమును యీ క్రింది క్రమముగ వివరింతును :—

1. మొదట సత్తుగాని, అసత్తుగాని, అంతరిక్షముగాని, ఆకాశముగాని, జలముగాని లేకుండెను.

2. మృత్యువుగాని, అమృతముగాని, రాత్రింబవళ్లను భేదముగాని, భేదమును తెలిసికొను సాధనములుగాని లేకుండెను. అప్పుడు ఏది యుండెనో అది (ఆవస్తువు) తనశక్తిచే వాయువు లేకనే, శ్వాసోచ్ఛ్వాసములు చేయుచుండెను. అదితప్ప మఱియొకవస్తువు లేదు.

3. సర్వవ్యాపియగు బ్రహ్మము, మాయ (తమస్సు) చే ఆచ్ఛాదింపబడి యుండెను. ఆ సర్వవ్యాపియే తన మాయచే తాను ప్రకటితమైనది.

4. దానియొక్క బీజమునే (రేతస్సునే) కాలమనియు, శక్తియనియు చెప్పిరి.

5. ఆశక్తి గొప్ప వ్యాప్తికలది.

6. "కో అద్దా వేదక ఇహ ప్రవోచత్
కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః
అర్వాగ్దేవా అస్య విసర్జనేనా
థకో వేద యుత ఆభభూవ."

---

* ఋ. 10 వ మండలమునందు 129 వ సూక్తము.

తా॥ "(సత్తుయొక్క) ఈవిసర్గము, అనగా వ్యాప్తి, యెక్కడనుండి వచ్చెను? (దీనికంటె) 'ప్ర' అనగా విస్తారముగ, ఇచ్చోఁ జెప్పువారెవ్వరు? నిశ్చయముగఁ దెలిసికొనుచున్నవారెవరు? దేవతలు సైత మీ (సత్ సృష్టి యొక్క) విసర్గాంతముననే పుట్టినవారు. మఱి యది యెచ్చో నుండి వెలువడినదియు నెవరెఱుంగుదురు?"

7. "ఇదం విసృష్టి ర్యత ఆ బభూవ
యదివా దధే యది వా నవధే
యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్
సో అంగ వేద యదివా న దేవ."

తా॥ "(సత్తుయొక్క) ఈ విసర్గము అనగా వ్యాపక మెచ్చోనుండి వచ్చినది? లేక, అది నిర్మించినను నిర్మింపక పోయినను సరే. అది పరమగు నాకాశమునందుండెడి నీ జగత్తునకు నధ్యక్షుడునగు వా డెవడున్నాడో (హిరణ్యగర్భుఁడు) వాఁ డెఱిగియుండును; లేక, యెఱుగక సైత ముండును. (ఎవరు సెప్పగలరు.)"

ఈ విధముగ సృష్టి రహస్యము హిరణ్యగర్భునకు సైతము తెలియునని చెప్పుటకు వేదమే భయపడి "ఎఱిగి యుండును, లేక, యెఱిగియుండక పోవచ్చును," అని సందిగ్ధముగా చెప్పినది. మఱియు ఋగ్వేదము (10-129-4) నందు "ఆదియందు అసత్తు (బ్రహ్మము) మాత్రమే యుండెను. దానియందుండి 'సత్' అనగా: నామరూపాత్మక జగత్తు వెలువడెను." అని చెప్పబడినది.

తరువాత ఉపనిషత్తులు సాహసించి సృష్టినిగుఱించి అనేకవిధముల చెప్పినవి. పైన వేదము చెప్పిన విధముగనే (అసత్తు తొలుత కలదనినట్లే) "అసద్వా ఇదమగ్ర ఆసీత్ తతో వై సదజాయత" (తైత్తిరీయశ్రుతి 2-7) ఆదియందు 'అసత్తే' మాత్రమే యుండెను దానియందుండి 'సత్తు' కలిగెను అని చెప్పబడెను. 'స ఐక్షత' ఆ బ్రహ్మము సృష్టి చేయవలయునని సంకల్పించెను. "సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి" (తై. 2-6; ఛాం. 6-2-3) ఈ బ్రహ్మమునకే "నేను అనేకమగుదునను యిచ్ఛకలిగెను." అని చెప్పబడెను. ఆ యిచ్ఛయే (ఆ సంకల్పమే) కర్మ యని, మాయ యని శాంకరమతము. అదియే పిమ్మట జగత్కల్పన చేసినది. అనగా: బ్రహ్మమునందు జగద్భ్రాంతిని కలిగించినది.

పైన 'సృష్టికర్త సంకల్పించెను' అచట 'సృష్టికర్త' అనునతడు నిర్గుణబ్రహ్మముకాడు. అద్వైతమతమునను సరించి ఆయన సగుణ బ్రహ్మమగు యీశ్వరుడే. ఆయననుండి కలిగినవాడు హిరణ్యగర్భుడు. బృహదారణ్యక శ్రుతి ప్రథమాధ్యాయము 4-వ బ్రాహ్మణము 1, 2, 3 మంత్రములయందు యిట్లున్నది.

ఆత్మైవేద మగ్ర ఆసీత్ పురుషవిధః సోఽను వీక్ష్య నాన్యదాత్మనోఽపశ్యత్ సోఽహ మస్మీత్యగ్రే వ్యాహర త్తతోఽహం నామాభవత్ .... (బృహదా. 1-4-1)

"స వై నైవ రేమే తస్మా దేకాకీ న రమతే స ద్వితీయ మైచ్ఛత్, స హైతావా నాస యథా స్త్రీపుమాంసౌ సంపరిష్వక్తౌ స ఇమ మే

వాత్మానం ద్వేధాఽపాతయ త్తతః పతిశ్చ పత్నీచా భవతాం తస్మా దిద మర్ధ బృగల మివ స్వ ఇతి హ స్మాహ యాజ్ఞవల్క్య స్తస్మాదయ మాకాశః, స్త్రీయా పూర్యత ఏవ తాగ్ం సమభవ త్తతో మనుష్యా అజాయంత" (బృహ దా. 1-4-3)

తా॥ సృష్టికి పూర్వము ఆత్మ ఒక్కడే యుండెను. అన్యులెవ్వరును లేరే అని ఆత్మ తలచుటవలన అది 'అహం' అను పేరుగలదాయెను. ఆ 'అహ' మే హిరణ్యగర్భుడు. అతడే పురుషుడాయెను. ఒంటరిగా ఉన్న హిరణ్యగర్భుడు (బ్రహ్మదేవుడు) తన ఒంటరితనమునకు తృప్తిచెందక ఒంటరితనమునందు ఆనందము లేదని రెండవదాని నపేక్షించెను. అపుడతడు స్త్రీపురుషులజంట యెట్లుండెనో అట్లుండెను. తనను రెండు భాగములుగా చేసికొనెను. అతడే భార్యాభర్త లను యిద్దరు వ్యక్తులయ్యెను. కాబట్టి మనుష్యుడు చీల్చిన వెదురు బొంగువలె ఉన్నాడని యాజ్ఞవల్క్యముని చెప్పెను. అందుచేత పురుషునియందున్న యీ యర్ధభాగము స్త్రీచే పూర్ణము చేయబడినది. అట్టి యీ యిరువురవలనను మనుష్యులు పుట్టిరి.

(తరువాత 4-వ మంత్రముయొక్క తాత్పర్య మిట్లు చెప్పవచ్చును.)

అట్లు హిరణ్యగర్భునివలన పుట్టింపబడిన స్త్రీ తననుంచి యితడు నన్ను పుట్టించి నాతోనే గవయవచ్చుచున్నాడని అంతర్ధానమునొంది గోరూపిణి యయ్యెను. హిరణ్యగర్భుడు వృషభమై ఆమెతో కూడెను. వారి కలయికవలన వృషభములు గోవులు పుట్టెను. ఇట్లే గుఱ్ఱములు, గాడిదలు,

మేకలు, గొఱ్ఱెలు మొదలగు సకల ప్రాణులు పుట్టినట్లు చెప్పబడెను.*

జిజ్ఞాసువు - మహాత్మా! ఈ సృష్టివిధానము బైబిల్ లోని సృష్టిక్రమముతో పోలియున్నదే. తత్త్వజ్ఞులుగాని పామరులకొఱకు చెప్పబడియుండునా? లేక ఆధ్యాత్మికముగ అర్థమున్నదా?

వేదాంతి :- దీనిని మహాత్ములు వారి అనుభవము ననుసరించి చెప్పిరి. ప్రళయ మేక్రమమున జరిగెనో దానికి వ్యతిరేకముగ (ప్రతిలోమముగ) సృష్టిజరుగును. సర్గ ప్రళయముల గుఱించి వేఱువేఱు దర్శనములు, ఉపనిషత్తులు చెప్పిన భిన్నభిన్న విధానములన్నియు యిదివఱకే నీకు వివరించియుంటిని. ఇప్పుడు యింకొకపద్ధతిని వివరింతును. ఇదియు

---

* యూదులకు క్రైస్తవులకు పవిత్ర గ్రంథమగు బైబిల్ ప్రాత నిబంధనయందు దేవుడు ద్వివిధసృష్టిని చేసినట్లు చెప్పబడినది. దేవుడు తొలుత భూతములను పశు పక్షి తరు లతా గుల్మాదులను తన సంకల్ప మాత్రమున చేయుట ఒకవిధమగు సృష్టి; రెండవది కుమ్మరివాడు మట్టితో కుండను చేసినట్లు నరుని సృష్టించుట అను ఈ విషయము బైబిల్ లో యిట్లున్నది. "దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రముల జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను.... నరుడు ఒంటరిగా నుండుట మంచిదికాదు; వానికి సాటియైన సహాయమును వానికొఱకు చేయుదుననుకొనెను ...... ఆదామునకు (ఆ నరునకు) గాఢనిద్ర కలుగజేసి అతడు నిద్రించినపుడు అతని ప్రక్క టెముకలలో ఒకదానినితీసి ఆ చోటును మాంసముతో పూడ్చివేసెను. తరువాత దేవుడు ఆ దామునుండి తీసిన ప్రక్క టెముకను స్త్రీగా నిర్మించెను."

శాస్త్రసమ్మతమే. వేదాంతుల మతమే. శ్రద్ధతో వినుము :—

ఆకాశము జడద్రవ్యమున కాశ్రయము. ద్రవ్యరాశి యొక్క మూలస్వరూపము. శక్తికి జడద్రవ్యమాశ్రయము. ఆత్మనుండి తొలుత ఆకాశము కలిగినదని తైత్తిరీయ శ్రుతి చెప్పినది. (తై-2. అ-1 అనువాకము) ఆకాశము అత్యంత సూక్ష్మభూతము. భూమి అన్నిటికంటె స్థూలభూతము. అన్నింటికంటె జడమైనది.

ముండకశ్రుతి, బ్రహ్మమునుండి తొలుత ముఖ్య ప్రాణము.* తరువాత అంతఃకరణము ఆకాశాదిభూతములు కలిగినట్లు చెప్పినది. (ముం. 2-1-3)

ప్రళయసమయమున జడద్రవ్యమంతయు విచ్ఛిన్నమై అందున్న శక్తి బహిర్గతమగును. ఆ సమయముననే సమస్త ప్రాణుల స్థూలశరీరములు నశింపగా, అందు ప్రాణరూపమున నున్న శక్తి బహిర్గతమై విశ్వవ్యాప్తమైయున్న (ప్రాణ) శక్తియందు కలియును. ఇదియే సమష్టిప్రాణము లేక ప్రాణశక్తి. ముండకశ్రుతి తొలుత పుట్టినట్లు చెప్పిన ప్రాణ మిదియే. ప్రతి జడద్రవ్యమునందును అంతర్గతమై శక్తికలదు. ఆ యా ఉపాధులు నాశముకాగా ఆ యా ఉపాధులు నశించుటవలన వాటినుండి బహిర్గతమైనశక్తి ఏకమై ఆకాశ మంతటను వ్యాపించి స్పందించును. స్పందమే శక్తి యని

* ఇచట ప్రాణమనగా 'స్పందన' అని అర్థము చేసికొనిన శ్రీ జ్ఞానదేవుల సిద్ధాంతములోను యోగవాసిష్ఠకారుల సిద్ధాంతములోను సరిపోవును.

నీ వెలుగునవు. అట్లు ఆకాశమంతటను వ్యాపించిన శక్తి ఉద్ధృతముగా స్పందించుట కారంభించును. అంతవఱకు అచలమై (చలనములేనిదై) యున్న ఆకాశము కూడ చలించును. అట్టి స్థితిలో ఈశ్వరసిద్ధాంతమును స్థూలసృష్టి నశించుట (సూక్ష్మావస్థకు మారుట)కు ఆరంభించును.

సృష్టియందలి సమస్త జడద్రవ్యమునకును ఏదో ఒక రూపమున్నది. రూపమున్న ద్రవ్యమునకును రూపరహిత ద్రవ్యమునకును నామములున్నవి. పైన చెప్పినస్థితి (సమయ) మందు రూపములన్నియు నశించినవి, కాని, శబ్దము (నామము) నశింపలేదు. ఎట్లన:—మనయెదుట ఒకఘటము కలదనుకొనుము. అది మరుక్షణమున యేదో ఒక కారణమున భగ్నమగు ననుకొనుము. కాని, ఘటరూపనాశనముతో ఘటనామము నశింపదు. శబ్దమనగా భావము. స్థూలరూపము నశించినను సూక్ష్మమగు శబ్దము నశింపక భావరూపమున మిగిలియుండును. సృష్టి ఆరంభమునుండి ప్రళయపర్యంతము, ప్రపంచమున ఉద్భవించిన నానావిధ శబ్దరాశి (భావరాశి) అంతయు నశింపక నిలిచియుండును. ఆ శబ్దరాశియొక్క సమష్టిరూపము 'ఓం' అను నాదము. పైన చెప్పిన విధమున ఆకాశ, ప్రాణములు స్పందించు నప్పుడు ఓంకారనాదము కూడా సర్వత్ర వ్యాపించును. ఆకాశ, ప్రాణస్పందనధ్వనితో ఓంకారనాదము కూడ కలసి పోవును. ఓంకారము భావరాశినంతయు తనయందు లీనము చేసికొని (ఇముడ్చుకొని) యుండును. ఈ మూడును ఒక రాశిగా యేర్పడునని చెప్పవచ్చును, ఇట్లేర్పడిన యీ రాశి

(ఏకద్రవ్యము) ఆవిధముగా యెంతకాలముండునో చెప్పజాలము. కాని వాని శుద్ధత స్పందము క్రమక్రమముగా తగ్గుచు, తుదకు పరమసత్త్వయందవి లీనమగును. లీనమనగా: నీటియందు నీరువలెను పాలయందు పాలవలెను కలసిపోవునట్లుగాదు. సరోవరమునందు గొప్పగా లేచిన తరంగము తగ్గి అత్యంత అల్పతరంగముగా గోచరించునట్లని అర్థము చేసికొనవలెను. పూర్తిగా కలిసిపోవునని కొందఱందురు. పూర్తిగా లీనమైనచో తిరిగి నూతన సర్గమునకు కారణము నశించును. మఱేమనగా: పరమసత్త్వయందు స్పందము లీనమయ్యును లీనము కానియట్లు; ఉండియు, లేనట్లుండును. అది విశ్వమునకు విశ్రాంతి. చలనరహితస్థితియే విశ్రాంతి.

తిరిగి విశ్వమావిష్కరించును. ఆ విష్కరించుట యేమో మన పూర్వులకంటె మనకు బాగుగా తెలియుటకు సాధనము లేర్పడినవి. మనము చలనచిత్రములను చూచుచున్నాము. మనలో పెక్కుండ్రకు దాని రహస్యమేమియో తెలియును. సుమారు 10 మిల్లిమీటర్లు గల చిన్న చిత్ర సముదాయమును (ఫోటోలను) ఒక చుట్టగా చుట్టి దానిని ప్రొజెక్టరులో పెట్టి అది తిరుగునట్లు చేయుదురు. ఫిలిమునందు సూక్ష్మముగా ఉన్న నానావిధరూపములును, అవ్యక్తస్థితియందున్న వాక్యములును (శబ్దమును) ఫిలిమ్ తిరుగుటవలన తెల్లతెరపై అభివ్యక్తమగును. అనగా అదేవఱకు ఫిలిమ్‌లో సూక్ష్మముగను అవ్యక్తముగ నున్నదే స్థూలముగా మన నేత్ర, శ్రోత్రేంద్రియములకు వ్యక్తమగును. అట్లే హిరణ్యగర్భునుండి స్థూలసృష్టి యేర్పడినది. సూక్ష్మమునందు లేనిది

స్థూలముగ వ్యక్తముకాదు. ఇట్లనేక పర్యాయములు జరిగి నది. ప్రథమ సర్గము (సృష్టి) ఎట్లు జరిగినదో "హిరణ్య గర్భుడు ఎఱిగియుండును లేక యెఱుగక పైతముండును (ఎవరు చెప్పగరు)" అని వేదమే చెప్పలేక పోయినది.

కల్పము చలనముతోనే ప్రారంభమైనది. ఈ చల నము తిరుగ శాంతి పొందుటకే చలించును. ఒక భ్రమరము పద్మమునందలి తేనెను త్రాగి పద్మము చుట్టును 'ఝుం' అనుచు తిరిగి తిరిగి అలసి తుదకు ఆ పద్మమునందే పరుండి నిద్రించి శ్రమను పోగొట్టుకొని విశ్రాంతిని గొనునట్లు విశ్వము చలనరూపమున శాంతిని గోల్పోయి తిరుగ శాంతికొఱకే ఆరాటపడుచున్నది. తుదకు ప్రళయమున శాంతి లభించు చున్నది. వ్యక్తికి సమాధియందు శాంతి లభించుచున్నది. సామాన్య ప్రాణికి స్వప్నరహిత సుషుప్తియందు శాంతి లభించుచున్నది. సుషుప్తి నిత్యప్రళయముగదా? యోగి సమాధినుండి లేచునప్పుడు నాదము (ఓమ్) తొలుత స్వయం వ్యక్తమగుచున్నదని పెద్దలందురు.

జిజ్ఞాసువు :- ఇచట శివ శక్తు లెవ్వరో తెలియ జేయుడు?

వేదాంతి :- ప్రళయారంభసమయమున మిగిలినవి రెండే వస్తువులని చెప్పియుంటిని. ఒకటి ద్రవ్యరాశిరూపముగు ఆకాశము — రెండవది ప్రాణరూపశక్తి. (ప్రాణమే హిరణ్య గర్భుడు; అతని శక్తియే నాదము - శబ్దము) ఈ శక్తియందే శబ్దాంతర్గతమగు నాదము కూడ కలసియున్నదని చెప్పితిని. కనుక లెక్కకు వచ్చునవి రెండే. అందు మొదటిది శివుడు

— రెండవది శక్తి. హిరణ్యగర్భుడే పురాణములయందు చతుర్ముఖ బ్రహ్మదేవుడు. అతనియందుండి ఒక స్త్రీని సృష్టించెనని శబ్దశక్తిని వ్యక్తీకరించెనని అర్థము. శబ్దరూపిణినే పురాణములయందు సరస్వతీ దేవి యని యందురు. హిరణ్యగర్భునే తత్త్వశాస్త్రములందు మహత్తత్త్వమందురు. ముందు అదలబోధను గురించి చెప్పినప్పుడు (- శబ్ద బ్రహ్మము - స్ఫోటవాదము) *సృష్టి లయముల గురించి మరికొన్ని సంగతుల వివరింతును. వాటిని విన్న నీకు గల సంశయములు తొలగిపోవును. శివ శక్తులను గురించి యిచట మరియు కొన్నింటిని వివరింతును, సావధానుడవై వినుము :—

(౧౫) శివ - శక్తి తత్త్వముల పరిశీలనము

శివ శక్తులనే ప్రకృతి పురుషులనిరి. శివ శక్తులను గురించి అనేకులు అనేకవిధముల చెప్పిరి.

శాక్తేయులు (దేవీభక్తులు) శివశక్తి తత్త్వములకు యెక్కువ ప్రాముఖ్యమిచ్చిరి. దేవీభాగవతమునందిట్లున్నది :— "సృష్ట్యాది నాత్మ రెండు విధంబులయ్యె నందుఁ గుడిని బురుషుండు నెడమఁ బ్రకృతియు నుండునదియె బ్రహ్మరూపము. నిత్యము సనాతనము నై యలరారు అగ్నిదాహికలకు బోలె నాత్మ శక్తులకు భేదముండదు." (ఆంధ్ర దేవీ. భా. 9-24) తరువాత దేవీభక్తులందఱును ఆవిధముగనే అనుసరించిరి.

---

* ఈ గ్రంథముయొక్క ప్రథమభాగమున వివిధములగు సృష్టి క్రమములను చెప్పియుంటిని. కనుక యిచ్చట చెప్పుటనవసరము.

శ్లో॥ "త్వం చంద్రికా శశిని తిగ్మరుచౌ రుచిస్త్వం
త్వం చేతనాసి పురుషే పవనే బలం త్వం
త్వం స్వాదుతాసి సలిలే శిఖిని త్వ మూష్మా
నిస్సారమేవ నిఖిలం త్వదృతే యదిస్యాత్."

అని మహాకవి కాళిదాసు అంబా స్తవమునందు దేవిని స్తుతించిరి. పై శ్లోకమున, సూర్యునియందు కాంతిని, పురుషునియందు చేతనము, దేవియే యనిరి.

తత్త్వదృష్టిచే చూచిన పురుషుడు చైతన్యస్వరూపుడు. చైతన్యము మినహా పురుషుడు (ఆత్ముడు) లేడు. చైతన్యము పురుషుని గుణముకాదు, స్వరూపము. ఈ విధముగ తాత్త్వికదృష్టితో చూచిన అచ్చట శక్తికి స్థానము లేదు. శైవ తత్త్వము ననుసరించి చూచిన చైతన్యస్వరూపుడగు శివునకును, జడ జగత్తునకును సంధానకర్త్రి శక్తి. లౌకికదృష్టినుండి చూచిన శక్తి యనునది జడము. ఈ శక్తి, జ్ఞానము (చైతన్యము) కాదు. ఇదివఱలో న్యాయవైశేషిక వాదులును పూర్వమీమాంసావాదులయందు ప్రభాకరులును, ఆత్మ అచేతనమనువారు. (జడాత్మవాదులు)

శివుడు జడమైనచో జడమునుండి చైతన్యము కలిగినదని అంగీకరింపవలసి వచ్చును. జ్ఞానము పుట్టినదైనచో అదియు జడమేకావలెను. పుట్టినదంతయు జడమేయని అట్టిది నశించునని వేదాంతుల మతము.

జిజ్ఞాసువు :- అయ్యా! శివశక్తులను గుఱించిన భిన్నాభిప్రాయములు ఎట్లు కలిగినవి? ఎవరు చెప్పినది సరియైనది?

వేదాంతి :- మనదేశమున దర్శనకారులు అనేకులు జన్మించి భిన్న భిన్న దర్శనములను రచియించిరి. ఆత్మ (ఆత్మలు) జడములని చెప్పు న్యాయ వైశేషిక పూర్వమీమాంసాదర్శనములను గురించి చెప్పియుంటిని. వాటిని పూర్వము కొందఱు పండితులు చాలకాలము పఠించియుందురు. అందువలన అట్టివారు ఆదర్శనములయందు భక్తిగలవారై యుందురు. ఆ కారణమువలన ఆత్మ జడమను సిద్ధాంతము వారి బుద్ధియందు బలముగా నాటుకొనియుండును. కొంతకాలమైన తరువాత వారు వేదాంత దర్శనమును పఠించియుందురు. ఆత్మచైతన్యస్వరూపమను వేదాంత సిద్ధాంతము యుక్తి యుక్తమైనదనియు, శ్రుతిసమ్మతమనియు, వారికి నమ్మకము కలిగియుండును. అట్లు నమ్మకము కలిగియుండియు — వెనుకటి సంస్కారములు వారి బుద్ధియందు బీజరూపమున నున్నందున వాటిని వదలించుకోలేక పోవుటచే ఆత్మజడమనిగాని చైతన్యమనిగాని విస్పష్టముగ చెప్పలేక ఆత్మయొక్క శక్తియే చైతన్యము (జ్ఞానము) అని సిద్ధాంతము చేసికొని జడచైతన్య సమరస భావమును (సామరస్యమును) స్థాపించి తృప్తిచెందియుందురేమో అని నా యూహ. ఆత్మయే (బ్రహ్మమే) ప్రపంచమును సృష్టిచేసినదన్న సిద్ధాంతము తర్కము నెదుట నిలువదు. కనుక ఆత్మయందంతర్లీనమైయున్న విమర్శరూప ఆత్మయొక్క (చిత్) శక్తి ఆత్మనుండి వేఱై ఆత్మయందే, అద్దమునందు నగరము తోచునట్లు, జగద్రచనము చేసినదనిన ఆత్మకు కర్తృత్వదోష మాపాదింపబడకుండ నివారించినట్లగును. అంతేగాక వారు ఆత్మ జడమనిగాని చైతన్యమని

గాని చెప్పక తప్పించుకొనవచ్చును. లేదా, సమయానుకూలముగ ఆత్మ జడమని చెప్పినను, ఆత్మయొక్క గుణమే చైతన్యమని చెప్పి తృప్తి చెందవచ్చును. ఈవిధముగ ఆత్మ జడమను వాదమును ఆధారముగ శివ శక్తుల భావ ముద్భవించి యుండవచ్చునేమోయని నా యభిప్రాయము.

దేవునకు భార్య కలదని చెప్పినవాడు ఈ కాలమున పరిహాసాస్పదు డగును. కాని, లోతునకు పోయి శోధించిన వాడు ఆ భావమును అంత తేలికగా త్రోసివేయజాలడు. ఏలయన? మనకు గల జ్ఞానమంతయు మన అనుభవమును బట్టి యుండును. ఒక విత్తనము భూమిలో పడిన అది నీటి సంసర్గమున మొలకయెత్తును. ఆ అంకురమే క్రమముగ మహావృక్షమగును. విత్తనము వృక్షమునందు కనబడదు. వృక్షమునకు తరుణ వయస్సు వచ్చినపుడు పుష్పించును. కాయ కాయును. కాయ పండగును. ఫలమునందు విత్తనము గోచరించును. మొదట భూమిలో వేసినది ఒకవిత్తనమే యైనను వృక్షమునందుగల అనేక ఫలములయందు వేలు, లక్షల సంఖ్యలలో బీజము లుండును. ఇది విశ్వమునందలి అద్భుత నియమము. బీజమునందు రెండు భాగములు కలసి యేకరూపమున నుండును. బీజము అంకురమైనపుడు అంకురమునందు రెండు దళము లుండును. స్థావరములగు ప్రాణుల విషయమిది.

జంగమములగు ప్రాణులయందు మనుష్యులను దృష్టాంతముగ తీసికొందము. నరనారీరూపద్వయమువలననే సృష్టి జరుగుచున్నది. స్త్రీ లేని పురుషునివలన గాని, పురుషుడు

లేని స్త్రీవలనగాని సంతతి కలుగదు. శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పినట్లు "ఓష్ఠ ద్వయంబును నొక్క శబ్దమునే యుచ్చరించెడి రీతిని నేత్రద్వయంబును నొక్క దృశ్యమునే వీక్షించెడు మాడ్కిని నయ్యుభయులును (శివుండును, శక్తియు) నొక్క ప్రపంచంబునే భావించుచుందురు." అను అనుభవము ననుసరించియే స్త్రీ పురుషు లిరువురు కలసి ఒక్క సంతానమునే కనుచుందురు.

వృక్షమునందలి ఫలమును పరిశీలించిన యీ చెట్టు పుట్టుటకు కారణమైన బీజ మిది యేయని తెలియును. తొలుత భూమిలో వేసిన విత్తు ఇంతకాలమునకు ఫలమునందు తిరుగ మన కగపడుచున్నదని తెలిసిన పిమ్మట అట్టి అనుభవము వలన పొందిన వివేకముచే సృష్టికి పూర్వమున సృష్టికి కారణమగు వారు, ఒకరుగాక యిరువురు, కలరను నూహా సామాన్యముగా మానవునకు కలుగుచున్నది. కాని యీ ద్వైతభావము సరియైనది కాదని విశేష విచక్షణచే స్థిరపడిన పిమ్మట ద్వైతాద్వైతములకు మధ్య ఒక రాజీ మార్గమును కుదుర్చుకొనిరి. ఎట్లన :— మూలకారణమగు బ్రహ్మము లేక (ఈశ్వరుడు) ఒకడుగానేయుండి తనయందుండియే వేఱొకదానిని (శక్తిని) సృష్టించినట్లు చెప్పిరి. చూచుటకు వా రిరువురవలె నుందురేగాని ఒకరుమాత్రమే యని అద్వైతమునే స్థాపించిరి.

(౧౬) భౌతిక విజ్ఞానవేత్తల శక్తివాదము

శక్తినిగురించి భౌతిక విజ్ఞానవేత్తలు (Scientists) చెప్పినదానిని కూడ కొలదిగా విచారింతము. శక్తి అనగా

సామర్థ్యము, బలము. (Energy). (ఇది అద్వైతులు చెప్పు మాయాశక్తియం దొక యంశము మాత్రమే. శక్తిని గుఱించిన వాదము శక్తివాదము (Energism) అందురు. వీరి సిద్ధాంతము ననుసరించి విశ్వమున మనకు తెలియవచ్చునవి రెండే. అందు ఒకటి ద్రవ్యము (Matter) రెండవది శక్తి అని చాలకాలమువఱకు నమ్ముచుండిరి. వేదాంతులమతమున నీ రెండును జడములే. జడద్రవ్యము నాశ్రయించుకొని శక్తియుండును. ఏది ద్రవ్యము (భౌతికపదార్థము) నాశ్రయించుకొనియుండి దానిచేత కార్యమును చేయించునో అట్టి దానిని శక్తియందురు.

ఒకానొకసందర్భమున శ్రీ వివేకానందస్వాములవారు యిట్లు చెప్పిరి :— "భౌతిక పదార్థమనగా నేమి? శక్తి తన బలమును దేనిపై ప్రయోగించునో అది. శక్తి యనగా నేమి? భౌతిక పదార్థముపై నేది తన బలము నుపయోగించునో అది." (జ్ఞానయోగము విశ్వమతాదర్శము)

శక్తిగల పదార్థము (ద్రవ్యము) శక్తము. శక్తిగల వాడు శక్తిమంతుడు. ద్రవ్యము - శక్తి, అనునవి వేఱు వేఱుగా కనబడును. (శివశక్తులవలె) అవి ఒకదానిని విడిచి మఱియొకటి ఉండవు. శక్తిచేతనే జడద్రవ్యమునకు చలనము కలుగుచున్నదని తలచిరి. పరమాణువు విచ్ఛిన్నమైన పిమ్మట దానిచుట్టు తిరుగుచుండు ఎలెక్ట్రానులవలన ద్రవ్యమునకు చలనము కలదని అంగీకరించిరి. ద్రవ్యము వివిధరూపము లలో మనకు కనబడుచున్నను ద్రవ్యరాశినంతయు పగుల

గొట్టి అణువులుగాను పరమాణువులుగాను చేయవచ్చును. అనగా: వివిధ నామరూపములతో కనబడుచున్న ద్రవ్యమంతయు ఒక్కటే — అని వెనుక చెప్పితినిగదా? అట్లె శక్తియును - ఉష్ణము, కాంతి, విద్యుత్తు మొదలగు వివిధ రూపములతో మనకు కనబడుచున్నది. ఒక రూపములో కనబడుశక్తి యింకొకరూపముగా పరివర్తన చెందుచుండును. కొంతకాలముక్రిందటివరకు యీ శాస్త్రజ్ఞులు చెప్పిన దేమనగా:— "మనము శక్తిని క్రొత్తగా సృష్టింపజాలము, నాశనముచేయజాలము" దానినే శక్త్యవినాశనియమ మందురు. (Law of Conservation of Energy) శక్తి యెట్లు అవినాశియో ద్రవ్యము సంతతము అవనాశి యనుచుండిరి. కాని, తరువాత జరిగిన పరిశోధనలవలన రెండును వినాశము చెందునని అంగీకరించిరట.

భౌతిక తత్త్వవేత్తలు విశ్వమును - ద్రవ్యము, శక్తి అను రెండు స్పష్టమైన మూలకములని కొన్నిశతాబ్దములుగా నమ్మిరి. వారట్లు నమ్ముటకు కారణము యిట్లు తలచిరి:— "ద్రవ్యము జడత్వము గలది. స్పర్శేంద్రియ గ్రాహ్యమయినది. ద్రవ్య రాశి అని పిలువబడే ఒక ధర్మమువలన విలక్షణమయినది. శక్తి చైతన్యపూరితమయినది. అగోచరమయినది. ద్రవ్యరహితమైనది." కాని డాక్టరు ఆల్బర్టు ఐన్‌స్టయిన్ మహాశయుడు చాలవరకు పూర్వుల సిద్ధాంతములను తారుమారు చేసి తన సాపేక్ష సిద్ధాంతమును (Theroy of Relativity) స్థాపించిన పిమ్మట, ఆ సిద్ధాంతమును కాలక్రమమున ప్రపంచమునందలి మహామేధావులగు భౌతికశాస్త్రవేత్తలు, విశ్వ

శాస్త్రజ్ఞులు, గణితశాస్త్రజ్ఞులు, ఖగోళశాస్త్రజ్ఞులు ఆమోదించిరి. డా॥ ఐన్‌స్టయిన్ సిద్ధాంతమును కొద్ది వాక్యములలో యీ క్రింది విధముగ చెప్పిరి :—

"ద్రవ్యము, శక్తి, తుల్యము యినవని ఐన్‌స్టయిన్ చూపించెను. ద్రవ్యము అని పిలువబడే లక్షణము కేంద్రీకృతమయినశక్తి మాత్రమే. వేరేమాటలలో ద్రవ్యరాశియేశక్తి; శక్తి యేద్రవ్యరాశి. వాటికిపున్న వ్యత్యాసము తాత్కాలికస్థితి మాత్రమే."

('విశ్వము — డాక్టర్ ఐన్‌స్టయిన్' పుట 79)

స్థూలదృష్టికి ద్రవ్యము భిన్న భిన్నముగ కనబడుచున్నను; వివిధ ద్రవ్యముల పరిశోధించినపిమ్మట అంతయు ఏకద్రవ్యమే — అను సిద్ధాంతమునకు వచ్చినట్లే, భిన్న భిన్నముగా కనబడుచుండు శక్తులను పరిశోధించిన పిమ్మట శక్తి ఏక మను సిద్ధాంతమునకు వచ్చినట్లే, భిన్న భిన్నముగా కనబడుచుండు ద్రవ్యము — శక్తులను పరిశోధించిన పిమ్మట అవి రెండును ఏకమను 'ద్రవ్యశక్తి' అను అద్వైత సిద్ధాంతమునకు వచ్చిరి. కాని, వ్యావహారికముగా 'ద్రవ్యము' - 'శక్తి' అను అద్వైతభావమును విసర్జింపలేము. సృష్టియొక్క మూలతత్త్వమును శోధింపగోరువారికి అద్వైతమే శరణ్యము.

భౌతికతత్త్వవేత్తల సిద్ధాంతములు స్థిరముగ నిలువక పోయినను, మొదటి సిద్ధాంతము ఆధారముగా గైకొని వారి పరిశోధనలు ముందుకు సాగిపోజొచ్చినవి. ఉదాహరణము

నకు, మొదట, ఆంగ్లేయుడైన డాల్టన్ (క్రీ. శ. 1801-03) ద్రవ్యము సూక్ష్మతరమైన పరమాణువులచేత నిర్మింపబడిన దని తెలిపెను. ఏ రసాయన ప్రక్రియవలనను పరమాణువు విచ్ఛిన్నము కాదని తెలిపెను.

రష్యన్ భౌతికతత్త్వవేత్తయగు మెండలీఫు (1834-1907) ఆవర్తననియమము (ఆవర్తసంవిభాగము) అను సిద్ధాంతమును కనిపెట్టెను. ఈ సిద్ధాంతము ననుసరించి సృష్టియందలి అనంతనామరూపములు గల ద్రవ్యరాశి మనము చూచుచున్నన్ని విధములుగా లేవనియు, మూలతత్త్వములు 92 మాత్రమే కలవనియు, నిరూపించి వాటి అణుభారమును ఇతర లక్షణములనుబట్టి 1 మొదలు క్రిందికి 92 గా ఒక పట్టిక వ్రాసి తత్త్వములను ఆ క్రమములో పెట్టి చూచిరి. 1 నుండి ప్రతి 8 వ తత్త్వము ఒకేజాతికి చెందినదని — (అనగా :— 1, 8, 16, 24, 32, 40 యీ ప్రకారము) చూపించెను. ఇందువల్ల కలిగిన లాభమేమనగా — మనము తోలుత ద్రవ్యములు, భేదములో అనంతమనుకొనినవి 92 మాత్రమే అనియు; అవియు 8 విధములగు వంశములకు చెందినవిగా ఉన్నవనియు అర్థమైనది. మెండలీఫు కాలము నాటికి 92 అన్న తత్త్వములు నేటికి 105 అయినవని చెప్పుచున్నారు. అయినను ముఖ్యమయినవి 92 అనుచున్నారు.

ఆంగ్లేయ భౌతికతత్త్వవేత్తయగు సర్. జె. జె. థాంసను విద్యుత్ శక్తిని పరమాణువుమీద ప్రయోగించి చూడగా పరమాణువునుండి చిన్న చిన్న తునకలు ఊడి పడినవి. వాటికి ఎలెక్ట్రానులని అతడు పేరుపెట్టెను. అది

వలనకే కనుగొనబడిన హైడ్రోజన్ పరమాణువు. క్రొత్తగా తెలిసికొన్నది ఎలెక్ట్రాన్ పరమాణువు. 1850 ఎలక్ట్రానుల బరువు ఒక హైడ్రోజన్ పరమాణువంత బరువుకు సరితూగును. దీనితో పరమాణువు అవిభాజ్యమను డాల్టన్ సిద్ధాంతము త్రోసివేయబడినది.

ఈరీతిగా భౌతికపరిశోధన ముందుకు సాగిపోవుకొలదిని వెనుకటి సిద్ధాంతములకు విలువ తగ్గినది. భారతీయుల ఆధ్యాత్మిక పరిశోధన, స్వానుభవరూపమగుటచే దానికి చలనము లేదు.

విశ్వసృష్టి (సర్గము) యెట్లు కలిగిన దను ప్రశ్నను పరిష్కరించుటకు మతకర్తలవలెనే భౌతిక విజ్ఞానవాదులును అనేకవిధముల ప్రయత్నించిరి. న్యూట్రానును, ప్రోటానును, ఎలక్ట్రానును రూపకమైన ద్రవ్యబీజము ఎట్టి విచిత్రసంఘటన వలన ప్రదేశమునందు తొలుత యేర్పడినదో చెప్పలేక పోయిరి. కాని, యూరపుఖండమునందలి భౌతిక విజ్ఞాన వేత్తలు చేసిన పరిశోధనాఫలితమే నేటికి మానవుడు చంద్రలోకమునకు పోయి వచ్చుటకు నిచ్చెనవలె ఉపకరించినది. పరమాణువాదియగు డాల్టన్, పరిణామవాదియగు డార్విన్ మహాశయులకంటె అనేక శతాబ్దముల పూర్వమే గౌతమ, కాణాదఋషులును, జైనులును, బౌద్ధులును పరమాణువులను గురించి తెలిసికొనిరి. సాంఖ్యమతాచార్యులగు కపిలమహర్షి పరిణామవాది. మనవారు భౌతికవిజ్ఞానమునందు గౌతమాదులు చూపిన మార్గములయందు ముందునకు సాగిపోవుటకు సాధనములు లేకనో అలసత్వమువలననో కొన్ని సందర్భ

ములయందు వెనుకపడిపోయిరి. దానికి కారణము మన పరాధీనత యని కొంద ఱందురు. అది ఎట్లున్నను యింకొక కారణమున్నది.

మనదేశమునం దుదయించిన యే విద్యయైనను, అనగా — దర్శనము, శిల్పము, సంగీతము, జ్యోతిషము, నాట్యము, వైద్యము, మొదలగు యే కళయైనను దాని పర్యవసానము భగవత్సన్నిధిని జీవుడు చేర్చునట్టిదిగా కల్పించిరి. అందువలన యూరోపియన్ భౌతిక విద్యావేత్తలకు, భారతీయ తత్త్వవేత్తలకు, లక్ష్యములో భిన్నత్వముండుట వలన భౌతికమగు యే అన్వేషణమైనను భగవదన్వేషణా నందమున మనవారు సంతృప్తులై యుందురు. యూరోపియన్లు ఆ మార్గమును చూడక వారు వారు పూనిన భౌతిక పరిశోధనలయందు అన్వేషణము అవిచ్ఛిన్నముగ జరుపుచునే యుందురు.

ద్రవ్యనాశనమువలన అపారమగు శక్తి విజృంభించు చున్నది. ఒక కట్టెను కాల్చిన అది కాలుచున్నపుడు అందలి శక్తి వెలుతురు వేడి రూపమున బహిర్గతమగును. కట్టె బూడిద యగుననగా — అణురూపమును పొందును. ఒకా నొక కారణమున, ప్రళయకాలమున అణువులు సయితము విభాజ్యమై పరమాణురూపమును పొందును. విశ్వమునందు గల ద్రవ్యమంతయు ఆ కాలమున (ప్రళయమున) నామరూప ములను కోల్పోయి పరమాణువులగును. పరమాణువులు ప్రదేశమునందు మహావేగముగా తిరుగుటవలన ఒకదాని నొకటి ఢీకొని అవియు వాటి స్వరూపమును గోల్పోయి తేజ

ముగా (విద్యుత్తుగా) మారును. అంతటితో ద్రవ్యమనునది లేకపోయెను. ద్రవ్యశబ్దము మాత్రమే మిగిలెను. అప్పుడు కాలభావమనునది సైతము లేదు. ఏల యనగా, కాలసూచకములగు సంఘటనలు లేని ఆ సమయమున కాలభావమెట్లుండును?

భౌతిక శాస్త్రవేత్తలలో అగ్రగణ్యుడనదగిన డాక్టర్ ఐన్‌స్టయిన్ సాపేక్షసిద్ధాంతము యొక్క సారమేమి? — ప్రదేశ కాలములు రెండును ఒకటేగాని రెండు కావని, ప్రదేశమునందలి ఒక భాగమే కాలము. కాలము లేకపోవుననగా ప్రదేశము సయితము లేనిదే అని అర్థము. అవి (అది) లేకపోవుననగా దేనియొక్క రూపాంతరములో అట్టి విజ్ఞానము మాత్రము మిగులును. "డా॥ ఐన్‌స్టయిన్ యీ తారకసూత్రమును చరమావధులకు తీసికొనిపోయి ప్రదేశ కాలములు సైతము దివ్యజ్ఞానము (Intution) యొక్క రూపములేయని, రంగు, ఆకారము లేదా పరిమాణము అనే మన భావములను ఏవిధముగా అంతఃకరణమునుండి వేరుపరచజాలమో అదేవిధముగా ప్రదేశకాలమును కూడా అంతఃకరణమునుండి వేరుపరచజాలమని చూపినాడు."

(విశ్వము — డాక్టర్ ఐన్‌స్టయిన్ పుట 20, 21)

మహామనీషియగు డా॥ ఐన్‌స్టయిన్ కూడను భౌతిక విజ్ఞానపరిధినిదాటి తత్త్వశాస్త్రములో ప్రవేశింపక తప్పలేదు.

భేదింపబడిన పరమాణువులనుండి మహాశక్తి ఆవిర్భవించును. నేటి ఆటంబాంబులు, హైడ్రోజన్ బాంబులను

గురించి వచనము వినియున్నాము. అట్లు పరమాణువులు నశింపగా వాటియందుండి ఆవిర్భవించు మహాశక్తి అఖండమగు తేజోతరంగముగా రూపొందును. అట్టి తేజము సయితము క్రమక్రమముగా చల్లారి అదృశ్యమగును. ఏలయనగ తేజోరాశికి ఇంధనమగు పరమాణువులు అప్పుడు లేకపోవుట వలన తేజము పరబ్రహ్మమునందు లీనమయి పెంజీకటి వ్యాపించును. అఖండాకారమగు తేజోరాశికిని, అది అస్తమించిన పిమ్మట ఆవహించెడి అఖండాంధకారమునకును, ఏది ఆధారమై యుండునో అదియే పరబ్రహ్మము. అట్టి బ్రహ్మమునందే మహాశక్తి ఇముడుచుగా లీనమై పోవును, బ్రహ్మమునందు లీనమగుననుటకు మారుగ భౌతిక విజ్ఞానవేత్తలు శక్తి (తేజము) అదృశ్యమగునందురు. తిరుగా ఎప్పుడో ఒకప్పుడు బ్రహ్మమునందు లీనమైన ఆ మహాశక్తి క్రమక్రమముగా ఆవిర్భవించి విశ్వాకృతి నొందును.

శక్తి విశ్వమంతటను సమముగ వ్యాపించియున్నది. కాని అది పరబ్రహ్మము వలె విశ్వాతీతము కాదు. పరబ్రహ్మము విశ్వాంతర్యామి. విశ్వాతీతుడు కూడ. శక్తి అఖండతయును సర్వవ్యాపకత్వమును, విశ్వము నొక్క హద్దులకు లోపలనే అని అర్థము. శక్తి సర్వత్ర సమముగ నున్నను ఉపాధులనుబట్టి ఒక్కొక్కచోట అధికముగ విజృంభించునని వేదాంతపంచదశియందు (13 వ ప్రకరణమున) చెప్పబడినది. భౌతిక విజ్ఞానవేత్తలు నయితము మఱొకవిధముగ శక్తి సమవిభాగ సిద్ధాంతమును (Equi-partition of Energy) అంగీకరింతురు.

ద్రవ్యశక్తి ఏవిధముగా పరశివబ్రహ్మమునందు లీనమయ్యెనో అతీతకి (అపవాదరీతిగ) వ్యతిరేకముగ తిరిగి మహాంధకారమును భేదించి తేజోరాశి (మహాశక్తి) ఆవిర్భవించును. ఏల, ఎట్లు, ఆవిర్భవించు ననుప్రశ్నకు సమాధానము లేదు.* అది పరమేశ్వరుని లీల. అట్లు సర్గమున ఆవిర్భవించిన మహాతేజమునందు ఒక బిందు మాత్ర స్వరూపము, మనము చూచుచున్న సూర్యగోళము. సూర్యుడు ప్రకాశించుచున్నాడనగా — ప్రతి సెకండునకు 40 లక్షల టన్నుల బరువు తగ్గిపోవుచున్నాడు. ఇట్లు ద్రవ్యము నశించి దానివలన అపారశక్తి యుద్భవించుచు అనంతకోటి జీవరాసులకు ఆహారపదార్థముల ఉత్పత్తికి అవసరమైన శక్తియు, విద్యుత్ (Electricity) మొదలగు శక్తులకు మూలమును అగుచున్నది.

పరమాణువు యించుమించుగ ఖాళీగానున్నదని శాస్త్రజ్ఞులు చెప్పుదురు. పరమాణు గర్భమునందున్నదే బ్రహ్మాండమునందున్నది. బ్రహ్మాండమునందున్న శక్తియే పిండమునందున్నది. బ్రహ్మాండమునందలి మూలశక్తియే పిండమున కుండలినీశక్తిగా నున్నది. శ్రీ జ్ఞానేశ్వరులు శివశక్తులను గురించి చెప్పిన వాక్యములు జ్ఞప్తికి వచ్చును. వారిట్లు చెప్పిరి: "తన్నివాసంబు నెకట విశాల విశ్వంబు సహిత మల్పంబై కానవచ్చుచుండ వారలు సర్వకాలంబులం

---

* జగదుత్పత్తికి మూలకారణము పరమాణువులను సిద్ధాంతమును శ్రీ శంకరాచార్యులవారు అంగీకరింపలేదు. వ్యావహారిక జగత్సంబంధముగ సర్గప్రళయములను అంగీకరించిరి.

పరమాణువునందు మిక్కిలి సుఖంబుండును." (అను. 1-11) గ్రహములు సూర్యుని చుట్టును తిరుగుచుండునట్లు వృత్తీయ ఎలెక్ట్రానులు పరమాణుకేంద్రము చుట్టూ తిరుగుచుండునట. ఈ వాక్యములు విన్నప్పుడు ఈశ్వర విలాసము ఆశ్చర్యమును గొలుపును.

శక్తి శబ్దరూపిణి. శబ్దము (ధ్వని) విద్యుద్రూపమున మారుటయు, తిరిగి శబ్దరూపమును పొందుటయు గ్రామఫోను ఫిల్మ్ మొదలగు వాటివలన మనకు అనుభవమునున్న విషయమే. ఇది విజ్ఞానము (Science) యొక్క ఫలితము. శబ్దము అక్షరరూపము. మనపూర్వులు శబ్దజాలమునుండి బీజాక్షరములను మంత్రములను కనిపెట్టిరి (ఉద్ధారణ చేసిరి). అట్టి మంత్రములనుండి శక్తిని పొందిరి. శక్తి మంత్రరూపిణి. ఇట్లు పాశ్చాత్యులు శక్తిని భౌతికమార్గమున సాధింపగ భారతీయులు పిండమును శోధించి వివిధ సాధనములచే శక్తిని ఆవిష్కరింపజేసి మహిమలను మోక్షరూపమగు నిరతిశయ శాంతిని పొందగలిగిరి.

మానవుని శరీరమునందు ప్రపంచమునందు గల సకల విధశక్తు లున్నవి. ఆ శక్తులకు కేంద్రము కుండలినీశక్తి. మానవ శరీరమందు ఇనుమే గాక, అయస్కాంతము, మొదలగు లోహములు కూడ కలవు. రాగిని బంగారుగా మార్చు శక్తియు కలదని యిటీవల ప్రత్యక్షముగా చూచిన వారు కలరు. వాటిని తపస్సువలనను, మంత్రోపాసనా విధానము వలనను, ఆవిష్కరింపజేసికొనవచ్చును. వాటిని ఆవిష్కరింపజేయు సంకల్పము ఎంతమాత్రము లేకున్నను

సిద్ధపురుషుని సాధనమార్గమున వాటంతట అవి బహిర్గతము లగును. ఉదాహరణమునకు :—

శ్రీ రమణమహర్షి శిష్యుడును, గొప్ప తపశ్శాలియు, గణేశుని అవతారమని చెప్పబడు కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని తిరువణ్ణామలై గుహలో తపమాచరించుచుండ ఉపాసనాదేవతాశక్తిని ఆయన శరీరము భరింపలేక పోవుట వలననో, మరేకారణమువలననో కపాలభేదనమైనది. అప్పుడు దాదాపు ఆయన మృత్యుముఖమున నున్నట్టి స్థితిలో శ్రీ రమణమహర్షి కపాలములను అతికించి బ్రతికించిరి. అప్పటినుండి గణపతి మునిని పాదుకలుధరింపక భూమిపై అడుగిడరాదని మహర్షి చెప్పిరి.

శ్రీ గణపతి కలకత్తా సమీపమునందలి ఖడ్గపురమునుండి స్వగ్రామమగు కలువరాయికి వచ్చినపుడు ఒక కార్యార్థము అర్ధణా రాగినాణ్యమును (పూర్వము రూపాయి పరిణామము కల దానిని) చేతిలో పట్టుకొనియుండిరి. చేతిలోని నరములు లాగుటచే, చెమటపట్టి బాధగా నున్నందున, రాగినాణెమును కుమారుని చేతికిచ్చి గోడపై పెట్టుమనిరి. తరువాత దానిని చూడగా అది బంగారు నాణ్యమై యుండెను. ('నాయన.' పుట. 701) ఈ సంగతి ఖడ్గపురమునకు గణపతి పోయినపుడు అక్కడి శిష్యుల కెట్లో తెలిసి అదేవిధమగు రాగినాణ్యమును గురువుచేతి నుంచిరి. కొంచెము సేపటికి చెమటపట్టి చెమటవలన ఆ నాణ్యము (డబ్బు) తొలుత బూడిదరంగుగను పిమ్మట పసుపురంగుగను మారి బంగారమైనది. ఇదియంతయు స్వల్పకాలమున జరిగి

నది. గణపతిమునిగారు ఆ బంగారు అర్ధణాను విసిరి మెచ్చటనో పారవేచిరి.

అనేక శతాబ్దములనుండి మన దేశమునను పశ్చిమ దేశములయందును, భౌతిక శాస్త్రవేత్తలు (Scientists) స్వర్ణ సిద్ధికి అనేక పరిశోధనలుచేసి విఫలులైరి. స్వర్ణార్జన తలంపు లేక యే కొందరు దేవతోపాసకులు ఇట్టి సిద్ధిని పొందగలిగిరి. శ్రీ గణపతిముని గారు రేణుకా దేవి ఉపాసకులు, వారి ఉపాసన సిద్ధించినదని వారికి తెలియకయే వారి యిచ్ఛ లేకయే స్వర్ణసిద్ధి వారికి కలిగెను. దానివలన వారికి ధనమార్జింపవలయునను కాంక్ష లేదు. ధన మార్జింపను లేదు.

భౌతిక శాస్త్రజ్ఞుడు నిర్ణయించిన ఆవర్తసంవిభాగము లోని క్రమసంఖ్యలో బంగారము పరమాణు కేంద్రకములోని ధన విద్యుదావేశము నికరము 79 గా నుండుటచే ప్రథమ వర్గములోను, పాదరసములో ధనవిద్యుదావేశము 80 లో ఉండుటచేత దీనిని ద్వితీయవర్గములోను చేర్చియున్నారు. పాదరసముయొక్క కేంద్రములో ఒక్క ఎలెక్ట్రానును చేర్చినయెడల పాదరసము బంగారమగును. భౌతిక విజ్ఞాన వేత్తలు చాలకాలమునుండియు శ్రమపడుచున్నను ఫలితము లభింపలేదు. తామ్రము, స్వర్ణము ఒకే వర్గమునకు చెందిన వైనను తామ్రముయొక్క విద్యుదావేశము (పరమాణు క్రమాంకము) 29. దాని పరమాణుభారము 63-57 స్వర్ణము 79. అని పైన చెప్పితిని. స్వర్ణముయొక్క భారము 197-20, అందువలన తామ్రము బంగారముకాదని భౌతికవిజ్ఞానుల అభిప్రాయము.

వేమ(న) యోగి రసవాదమునుగుఱించి చెప్పిన పద్యమును వినుము :—

"తల్లి చన్ను పాలు తనుజంపు పాలును
రుద్రవీర్యమందు భద్రపరచి
దాని పాదుము చేసి తామ్రంబుపై జల్లు
విశ్వదాభిరామ వినుర వేమ."

ఈ యంశ మింతటితో విరమించి గణపతిమునిగారిని గుఱించిన మఱియొక సంఘటనను వినిపింతును.

ఖడ్గపురమునందే జరిగిన మఱియొక వింత యేమన :— గణపతిగారి శరీరమునుండి విద్యుత్తరంగములు వెడలుటను శిష్యులు కనుగొనిరి. వారు దానిని పరీక్షించుటకు అచ్చట నున్న బీగము నొకదానిని గణపతిగారి శిరమునకు అడుగున్నర యెత్తున రెండు మూడు నిముసములు పట్టుకొనిన పిదప విద్యుత్ప్రయోగముచే బీగ మాకర్షణశక్తియుతమైన ట్లాయెను. గుండుసూదులను సమీపమునందుంచగా ఆ బీగ మాకర్షించినది అప్పుడు వారి శిష్యులకు వా రిట్లు చెప్పిరి :—

"నాయందు చాలాకాలముక్రిందటనే యుత్పన్నమైనట్టి దివ్యశరీరమునొక్క శక్తివ్యాపారము నన్ను కేంద్రముగాగొని భ్రమణముగుచున్న సుడివలె నున్నది. ఆ శరీరమిపుడు దేవకార్యమునకు సుఘటితమైయున్నది."

(నాయన. పుట. 707)

ఈ రెండు సంఘటనలు 1935 సంవత్సరం సెప్టంబర్ నెలలో జరిగినపుడు వారి శిష్యులు చూచినవారు గొప్ప విద్యాధికులు అనేకులు యిప్పటికి గలరు. శ్రీ గణపతిముని

గారు 25-7-1936 తేదిన భౌతిక దేహమునువీడి దివ్యదేహ ధారులైరని చరిత్రయందున్నది.

మన దేశమునందలి తత్త్వవేత్తలు కేవలతత్త్వవేత్తలే గాక మహాకవులుకూడ అగుటచేత ఆ మహాశక్తినే జగత్ప్రసూతిగను, భార్యగను, జీవకోటికన్న జగదంబగను, సకలజీవులను పోషించు జగన్మాతగను, పరమాద్భుతరీతుల వర్ణించియున్నారు. శక్తిని స్త్రీరూపిణి యనుటకు కారణము కూడ నదియే.

ఒక స్త్రీ తన భర్తకు భోగదాయిని యగును. భర్త భౌతిక దేహము సంపూర్ణముగ నాశము నొందకుండ అతని లోని కొంత భాగమును (అంశమును) తన గర్భమునందు దాచి భర్తకు పుత్రరూపమగు నూతన శరీరమును ప్రసాదించుచున్నది. వాడు పెద్దవాడు కాగానే, ఆ శక్తియే మఱియొక స్త్రీరూపమున భార్యయై వానికి భోగదాయిని యగుచున్నది. ఈ విధముగ యీ గొలుసు సాగిపోవు చున్నది. పురుషుడు పుత్రరూపముననున్నప్పుడు త్యాగమును, పతిరూపముననున్నపుడు భోగమును స్త్రీరూపమున శక్తియే ప్రసాదించుచున్నది. మానవునకు ఇట్టి అనుభవమువలన కలిగిన వివేకబుద్ధిని భూతకాలమున ప్రసరింపజేసి శక్తితత్త్వమును తెలిసికొని భోగమోక్షములను ప్రసాదించునది శక్తియే యని మనవారు శక్తి నారాధించిరి.

పర్యవసానమేమన :— ఆధ్యాత్మిక ఆది భౌతిక విజ్ఞానముల మధ్యగల అంతరము నశించి రెండును పర్యవసానమున నొక్కటియే యను నిర్ణయమునకు రాగలరు.

(౧౭) సింహావలోకనము - సంగ్రహ పరిశీలనము

జిజ్ఞాసువు :- అయ్యా! శ్రీ జ్ఞానేశ్వర, శ్రీ అరవింద, శ్రీ సమర్థుల, శివ - శక్తి స్వరూపవిచారమును సింహావలోకనము చేసిన బాగుండును, అనుగ్రహింపుడు.

వేదాంతి :- నీ వన్నట్లే వారి శివ - శక్తి తత్త్వములను సంగ్రహముగ సింహావలోకన న్యాయమున పరిశీలించుటయేగాక, నీ కిదివరకు చెప్పని నూతనాంశములను బోధ ధృఢమగుటకుగాను చెప్పి అంతటితో శివ శక్తుల విచారమును ముగింతును.

—: శ్రీ జ్ఞానేశ్వరుల శివ శక్తి తత్త్వపరిశీలనము :—

శ్రీ జ్ఞానేశ్వరులును, శ్రీ విద్యారణ్యస్వాములవారును సమకాలీనులు. స్వాములవారికంటెను శ్రీ జ్ఞానేశ్వరులు వయస్సున చిన్నవారని చెప్పవచ్చును. జ్ఞానేశ్వరులవారి కాలమునకు అద్వైతమునందు శాఖ లేర్పడియుండెను. శ్రీ శంకరుల మాయావాదమును త్రోసిపుచ్చినవారిలో శ్రీ జ్ఞానేశ్వరులే ప్రథములు కారు. వీరికంటెను సుమారు రెండున్నర శతాబ్దములకు ముందేయుండిన యాదవప్రకాశులును, సుమారు నాలుగున్నర శతాబ్దములకు ముందే మహారాష్ట్రమున జన్మించియుండిన భాస్కరరాయలను నామాంతరముగల శ్రీ భాస్కరాచార్యులును, మరికొందరును మాయావాదమును త్రోసిపుచ్చిరి. వీరు బ్రహ్మపరిణామవాదులు.

భాస్కరాచార్యులవారు శ్రీవిద్యోపాసకులు 'లలితా సహస్రనామము' లకును 'బ్రహ్మసూత్రము' లకును వీరు భాష్యములు రచియించిరి. వీరిమతమున అచిత్తునకు (జడమునకు)ను బ్రహ్మమునకును. భేదమును అభేదమును, స్వాభావికమనియు; చిత్తునకు బ్రహ్మమునకు అభేదము స్వాభావికమనియు; భేదము ఉన్నట్లు కనబడినను అట్టి భేదము ఔపాధికమనియు చెప్పిరి. కొందఱు పండితులు చెప్పినట్లు వల్లభాచార్యులవారు క్రీ. శ. 1041 నాటివారను వాదము సరియైనదయినచో వీరును శ్రీ జ్ఞానేశ్వరులకంటెను పూర్వికులే. శ్రీ వల్లభాచార్యులు శుద్ధాద్వైతమును స్థాపించి జగత్తు మాయావిలాసము కాదనియు, పరబ్రహ్మముయొక్క లీలయనియు చెప్పిన సంగతి ఇదివఱకే తెలిపితిని.

<u>న్యాయదర్శనము</u>: జగత్తు సృష్టింపబడినదని చెప్పిన దార్శనికులనేకులు గలరు. న్యాయదర్శనము నిరవయవ పదార్థములు సృష్టింపబడినవి కావనియు, సావయవ జగత్తు మాత్రమే సృష్టింపబడినదనియు, సర్వజ్ఞుడగు సృష్టికర్త యొకడు కలడనియు చెప్పినది.

<u>వైశేషికదర్శనము</u>: కూడ వైవిధముగ సృష్టి నంగీకరించినది కాని, సృష్టికర్త ఒకడు కలడని తొలుత అంగీకరింపక తరువాత ప్రశస్తపాదులవారి కాలమున అంగీకరించినది.

<u>సాంఖ్యదర్శనము</u>: పురుషుడు ప్రకృతి అను ద్వైత సిద్ధాంతము నామోదించి, సృష్టి ప్రకృతివలన కలిగినదని,

లేదా సృష్టి ప్రకృతియొక్క పరిణామమని సృష్టివాదము సంగీకరించినది.

<u>పాతంజలయోగదర్శనము</u>: ఈ యంశమున సంపూర్తిముగ సాంఖ్యదర్శనము ననుసరించినది.

<u>పూర్వమీమాంసాదర్శనము</u>: సృష్టివాదము సంగీకరించినది. శ్రీమద్రామానుజాచార్యులు ప్రకృతి వికాసము - సంకోచము, సృష్టి - ప్రళయములని సృష్టివాదమును సమర్థించిరి.

<u>శ్రీమధ్వాచార్యులు</u>: సృష్టివాదులే.

<u>శ్రీనింబార్కాచార్యులు</u>: బ్రహ్మపరిణామవాది. వారిమతము ద్వైతాద్వైతము.

<u>శ్రీకృష్ణచైతన్యులవారు</u>: అచింత్య భేదాభేదవాదులు. వీరును శ్రీ నింబార్కులవలె బ్రహ్మపరిణామరూపమగు సృష్టివాదమును అంగీకరించిరి.

<u>శైవులు</u>: సృష్టి శివ - శక్తుల పరిణామమని సృష్టివాదము నంగీకరించిరి.

<u>శాక్తేయులు</u>: శక్తి పరిణామవాదులు. సృష్టి నంగీకరించిరి.

శ్రీ విద్యాతత్త్వము అద్వైతమే. ఈ తత్త్వము ననుసరించి శివుడు నిర్గుణ చైతన్యము. మాయయందు అంత

లీనమైయున్న విమర్శరూప* శక్తిని గురించి (తృతీయభాగ
మున) తెలిపియుంటిని. శ్రీ విద్యాతత్త్వములోను, కాశ్మీర
శైవములోను, జ్ఞానేశ్వరుల వారిమతమునకు దగ్గర సంబంధ
మున్నది. అదియుగాక, శ్రీ జ్ఞానేశ్వరులు యోగవాసిష్ఠము
చదువు తెలిపిన అజాతివాదమును తెలిసికొనియుంటిరి. ఈ విధ
ముగా శ్రీ జ్ఞానేశ్వరుల కాలమునాటికి వ్యాప్తియందున్న
వివిధ సిద్ధాంతములను ఆయన తన మనస్సునందుంచుకొని
వారి సిద్ధాంతమును రూపొందించియుందురని మన మూహింప
వచ్చును.

శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పిన శివ-శక్తి స్వరూపతత్త్వము
ను ఎట్టిదని నిరూపించి చెప్పుట మిక్కిలి కష్టమైన కార్యము.
శ్రీ జ్ఞానేశ్వరులు, వారి వాదము సరియైనదని నిరూపించుటకు
అసమాన ప్రజ్ఞతో విశేష ప్రయాసతో అనేక ఉపమానము
లను చూపి బోధించిరి. నేను ఇదివరలో ఉదాహరించిన వారి
వాక్యముల అర్థమును మరల పరిశీలించుట ప్రస్తుత
కర్తవ్యము.

అద్వితీయమగు ఆత్మ శుద్ధ జ్ఞానస్వరూపము. ఆత్మ
తన్ను తాను చూడజాలదు. ఆత్మకు తన్ను తా నాలోకింప
వలయునను సంకల్పము కలిగెను. ఆ సంకల్పమే దర్పణమై
అందు ప్రతిఫలించిన ప్రతిబింబముద్వారా ఆత్మ తన్ను తాను
చూడగలిగెను. తన్ను తా నాలోకించుట (స్వసంవేద్యత్వము)

* "విమర్శ అనగా పరబ్రహ్మముయొక్క సహజ పరిస్ఫురణ
మని భాస్కరరాయలు నిర్వచించెను" అందురు. అవిద్య యని వేదాంతు
లందురు.

యేది కలదో అదియే విమర్శరూపమైయున్నది. ప్రకాశరూపమే సత్యజ్ఞానమైయున్నది. సత్యజ్ఞానమనగా : సత్యము + జ్ఞానము = సత్యజ్ఞానము. ఈ సత్యజ్ఞానములయందు సత్యమనునది త్రికాలాబాధితమగు శివుడు. జ్ఞానము విమర్శరూపమగుటవలన శక్తి. సన్మాత్రమునందున్న స్వసంవేద్యత్వమే విలాసము.* నామరూపాత్మక ప్రపంచమంతయు జ్ఞానవిలాసమే. అదియంతయు ఆత్మయొక్క లీలయే.♦ అన్యమేమియును లేదు. సూర్యుడు ప్రకాశించుచున్నాడు. ఇచట 'సూర్యుడు' సత్ పదార్థము. ఆయన ప్రకాశము 'చిత్తు' (జ్ఞానము) జ్ఞానమే విశ్వాకారమున నున్నది. ఇది సంగ్రహముగా శ్రీ జ్ఞానేశ్వరుల సిద్ధాంతము.

నామరూపములు ఎచటనుండి వచ్చెను? అను నీ ప్రశ్నకు శ్రీ జ్ఞానేశ్వరుల సమాధానము యిట్లున్నది :—

"రూపాభావంబున భాసమానుండై యొకండు పతిని, స్వామునుబగు మనోహరాకృతిం గూడఁ నొక్కటఁ బరిశీలించు న ద్వైతి తా లజ్జాశీలయై విశ్వాధిక నామరూపంబులని యెడు భూషావిశేషంబులచేతఁ బ్రభు నలంకృతునిఁ గావించె."

(అను. 1-30)

---

* విలాసము = క్రీడ, ఆహ్లాదము, లీల.

♦ "లీల" అనగా ఏమి? శ్రీ శంకరాచార్యులవారు యిట్లు చెప్పిరి :—

"లీలలు అన్యప్రయోజనకరములగు వ్యాపారములు కావచ్చును. లేక, తనయొక్క హర్షమువలన కలుగుచున్నవి కావచ్చును. లేక, తన స్వాభావికములగు నవరసాంగీకార సమయమందలి ఉచితభంగివిశేషములు కావచ్చును." (అలికాత్రికతీ భాష్యము. 71)

నామరూపరహితంబగు సత్పదార్థమునందు జ్ఞానశక్తి తన సామర్థ్యముచే నామరూపాత్మక ప్రపంచమును సృష్టించినదను తాత్పర్యాంశము — తన భర్త (శివుడు) దిగంబరుడై యుండుట చూచి భార్యయగు శక్తి (జ్ఞానము) మనోహరంబగు తన యాకృతిని పరిశీలించి సిగ్గుచెందినదై పతిని వస్త్రభూషణాదులచే అలంకరింప జేసినదని కావ్యశ్లోకరీతిలో రూపకల్పనముచేసి చెప్పిరి. ఈ విధముగ చెప్పిన అర్థమునే వేరొకవిధముగ నిట్లు చెప్పిరి:— "స్థితియునుం డయ్యు నత్యంత సూక్ష్మాకారంబున వర్తించుటం జేసి యద్దేవుండు దృగ్గోచరుండు కానేరకుండు, మఱియు నద్దేవి కటాక్షోపలబ్ధిచే నతండు విశ్వాకారంబున ప్రకాశించుచున్నవాడు." (అను. 1-35)

మఱియొకవిధమైన అర్థమునుకూడ చెప్పవచ్చును. ఎట్లన:— దిగంబరుడైన శివుడే మన యనుభవమున గాఢనిద్ర. శక్తి జ్ఞానరూపిణి, (చిదాభాససంబంధముగు జ్ఞానము,) అని చెప్పిరికదా? గాఢనిద్రయందు జ్ఞానము కలుగగనే స్వప్నమో, జాగ్రత్తమో, కలుగును. జాగ్రత్త కలుగుట యనగా నామరూప ప్రపంచము గోచరమగుట. అట్లు గోచరమైన నామరూపములే వస్త్రభూషణాదులు. అట్లు సుషుప్తికి (శివునకు) వస్త్రభూషణాదుల నలంకరించుటయే శివుడు విశ్వాకారమును ధరించుట. అట్లు కాదేని యీ క్రిందివిధముననైనను అర్థము చెప్పవచ్చును. ఇచట మనము గమనింపవలసిన యంశమేమన "మాయా ప్రభావమున మనము పరబ్రహ్మమునే జగద్రూపమున చూచుచున్నాము"

అని శ్రీ శంకరులవారు చెప్పిన వాక్యమునందలి యర్థమునకును, "ఆ దేవి కటాక్షోపలబ్ధిచే నతండు విశ్వాకారమున ప్రకాశించుచున్నాడు" అని శ్రీ జ్ఞానదేవులు చెప్పిన పై వాక్యములయందలి అర్థమునకును భేదమించుకయు గోచరించదు.

శైవతత్త్వమునందు శివుడును శక్తియును కలసియే జగద్రూపమును పొందిరని యున్నది. క్షీరసాగర తీరమున శివుడు పార్వతీదేవి చెవిలో చెప్పిన రహస్యమును మత్స్యేంద్రనాథులు విని దానిని లోకమున ప్రచారములోనికి తెచ్చిరని గదా శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పిరి. కనుక, వారి మతము శివశక్తులయొక్క మేళనమే యను తత్త్వము ఆ కథయందే గర్భితమైయున్నది.

సృష్టియే జరుగలేదని, ఆత్మయొక్క లీలయే జగద్రూపమున నున్నదని చెప్పుటవలన యీ మతమును అజాతవాదమనిరి. జ్ఞానమే (ఆత్మవిలాసమే) జ్ఞేయరూపమున నున్నందున దృష్టిసృష్టివాదమనియు చెప్పిరి. జ్ఞానము సత్పదార్థమునకంటె భిన్నము కానందున విశ్వము సద్రూపమే (శివస్వరూపమే) గాని వేఱు కాదనిరి.

జిజ్ఞాసువు :- అయ్యా! శివశక్తులయందు విశ్వాకారమున నున్నది శివుడేయైనచో శక్తియొక్క యునికికి చోటెచ్చట?

వేదాంతి :- శ్రీ జ్ఞానేశ్వరు లిట్లు చెప్పిరి :—

(1) శ్లో॥ నిర్గుణం నిర్వికారం చ సత్తామాత్ర స్వరూపకమ్,
యత్తత్ప్రకృతియోగేన విశ్వరూపేణ భాసతే.
(అమృ. 1-35)

"వి. దుం॥ ఏ పరమాత్మస్వరూపము గుణత్రయ రహితమై నామరూపాత్మక దృశ్యవికారశూన్యమై కేవలము సద్రూపమై భాసించుచున్నదో, అట్టి పరమాత్మస్వరూపము ప్రకృతియనెడి స్వతంత్రశక్తి నాశ్రయించి తానే ప్రపంచాకారమున భాసించుచున్నది." (వి. దుం. పుట. 98)

(2) "కనుకనే బాహ్యదృష్టి ననుసరించి జగద్విలాసము గోచరించుచున్నప్పటికిని జగద్రూపమున పరమాత్మయైన తానే ప్రకాశించుచున్నాడు. ఈ కారణమువలన చిచ్ఛక్తివిలాసము ననుసరించి ప్రపంచాకృతిని నానాత్వము గోచరించుచున్నది. ఒకడైన తానే గాని వేరు కాదు."

(వి. దుం. పుట. 94)

(3) శ్లో॥ "సర్వశూన్యస్య నిష్కర్షో యః పుమాన్ పరయాకృతః,
భర్తృసత్తా విశేషేణ శక్తిర్భార్యా వినిర్మితా."
(అమృ. 1-27)

"వి. దుం॥ సద్రూపుడైన పరమాత్మ సర్వద్వంద్వ విముక్తుడై తనంతట తాను నిర్వికారుడైయున్నను శక్తి స్వరూపమైన ప్రకృతిచేత, పురుషుడను పేర పిలువబడుచున్నాడు. పురుషసత్తాను ఆశ్రయించియే విశేషప్రకాశమున భార్యారూపమైన శక్తి నిర్మింపబడినది. కనుక, ఈ సత్తా స్ఫూర్తుల తాదాత్మ్యము ననుసరించియే బాహ్యమున

ప్రకృతి పురుషద్వంద్వ మాశ్రయింపబడు నవకాశము కలిగిన దని నిర్ణయము." (వి. దం. పుట. 86)

(4) "అందువలన సన్మాత్రమైన ఆత్మ సర్వశక్తి సమన్వితమై పురుషుడని చెప్పబడుచున్నది. అది శక్తి సంపన్నమైనదగుటచేత నాశరహితమై స్వయంప్రకాశమై యున్నది." (వి. దం. పుట. 86)

ఏకారణముచేతనైననేమి నామరూపాత్మక జగద్రూప మున గోచరించుచున్నది సన్మాత్రుడైన శివుడేయనియు, శక్తియని పిలువబడునది శివునకు సృష్టికార్యమున జగద్రూప మును పొందుటయందు, లేదా, తోచుటయందు శివునకు సహాయకారియనియు పై నాలుగంశములయందలి సారాం శము. అయినను, శక్తియు జగద్రూపమున నున్నదను నర్థమిచ్చు వాక్యములు సహితము లేకపోలేదు.

శ్రీ జ్ఞానేశ్వరులు సత్తా స్ఫూర్తులనే శివశక్తు లని చెప్పిరి. ఇచట సత్త వేఱు, స్ఫూర్తి వేఱు, అను ద్వైత భావము గోచరించుచున్నది. శ్రీ జ్ఞానేశ్వరులు ద్వైతి కారు.

ఇంతవఱకు చేసిన వివేచన వలన తెలిసిన సారాంశ మేమన — పరమాత్మ సద్రూపుడని (అనగా కలిమి మాత్రమే స్వరూపముగా కలవాడని) అతడే శివుడని, అతడు తన శక్తితో కలసినపుడు పురుషుడని పిలువబడుచున్నాడని, సద్రూపుని పురుషుడని వ్యవహరించినపుడు అతని స్ఫూర్తి ప్రకృతియని పిలువబడునని, ఆ ప్రకృతియే జ్ఞానమని (వృత్తి జ్ఞానమని) శివునియొక్క భార్యగా చెప్పబడినదని, ఇట్టి

భార్యా భర్తలు వారిలో వారు అన్యోన్య ప్రేమ చూపుట వలన ప్రపంచమును సంతానము కలిగినదని, లేదా ఆ దంపతులే ప్రపంచాకృతిగా పరిణమించిన వారని తేలినది.

ఇందునుగూర్చి నా యభిప్రాయ మేమన ?:— ఏది నిత్యసత్యమై త్రికాలాబాధితమై మార్పులేనిదై, నామరూపరహితమైనదై, ఆదిమధ్యాంత శూన్యమైనదై యున్నదో అదియే సద్రూపమని చెప్పబడును. అట్టి సద్రూపము కేవల ప్రజ్ఞాన ఘనమై (చిద్రూపమై) యుండవలయునే గాని, జడమై తన్ను తా నెఱుంగుటకు అన్యసహాయ మపేక్షించునదియై యుండరాదు. సత్తును జడమని చెప్పితిమేని అట్టి సత్పదార్థమొకటి కలదని లోకమున ప్రతీతియే యుండదు. అట్టి సచ్చిద్రూపమైన ఏకవస్తువునుండి సత్తు + చిత్తు అని సద్రూపమునుండి చిద్రూపమును వేఱుచేయుటకు వీలు లేదు. లోకమున వేఱువేఱుగు రెండు భిన్నవస్తువులు ఒకానొక సమయమున ఒకటిగా కలసియుండెనేని వాటిని కొంతకాలమునకు (ఒకానొకసమయమున) ఏదేని సాధనములతో వేఱుచేయవచ్చునేమోగాని అఖండాద్వితీయ వస్తువునందు విలాసమాత్రముగనైనను వేఱుపాటు చెప్పకూడదు. నేను చెప్పిన యీసిద్ధాంతమును "విజయదుందుభి" అంగీకరించి యీ క్రింది వాక్యములు చెప్పక తప్పినదికాదు. అవి యేవనగా :—

"ప్రకృతి పురుష భావకల్పన మిథ్యామాత్రమగుటచేత నది మిషచే వర్తించుచున్నది గాని వేరుకాదు".

(వి. దుం. పుట. 89)

"వాస్తవమునకు ప్రకృతి పురుషు లిద్దరు లేనేలేరు. ఉన్నట్లుతోచిన నా రెండును ఒకటియే కాని రెండు లేవు".

(వి. దుం. పుట. 87)

"ఏది ప్రకృతిశబ్దముచేత చెప్పబడుచున్నదో అది పురుషుడే కాని వేరు కాదు". (వి. దుం. పుట. 83)

"కావున నాయందు శక్తియను సంభావన కూడ నౌపచారిక మేకాని వాస్తవము కానేరదు. వాస్తవమును విచారింపగా ఏకాత్ముడనైన నేనే సర్వత్ర ప్రకాశింపుచున్నాను" (వి. దుం. పుట. 80) శ్రీజ్ఞానేశ్వరు లిట్లు చెప్పిరి :- "ఇవ్విధంబున సంపూర్ణ విశ్వంబునుం గేవల జ్ఞానపదార్థస్వందనంబై వర్తింపుచుండ నయ్యజ్ఞానంబును గూర్చి సిద్ధాంతముం జేయఁ బ్రబలాసంగత విషయంబై యొప్పుచుండదె" (అను. 7-277) ఇచట ప్రపంచాకృతిగ భాసించునది శక్తియను అర్థమిచ్చుచున్నది. మఱి "నయ్యజ్ఞానము" అనునది మాయను గూర్చి చెప్పబడినదని గ్రహింపవలయును.

ఇంకొక విషయ మేమన :—

విశుద్ధ జ్ఞానముయొక్క లీలయే శివశక్తు లైనవని శ్రీజ్ఞానేశ్వరుల సిద్ధాంతము. అనగా : శివశక్తులకంటె పరము నందు విశుద్ధజ్ఞానమనబడు పరబ్రహ్మమున్నట్లును, శివశక్తులు ఒకానొక సమయమున (నిర్వికల్ప సమాధియందు) ఆత్మానుభూతియందు (విశుద్ధజ్ఞానమునందు) లయమగుదురనియు, శ్రీజ్ఞానేశ్వరుల భావము.

ఇంతవఱకు మనము చర్చించినదానినిబట్టి విశ్వాకారమున నున్నవాడు శివుఁడనిగాని శక్తియనిగాని చెప్పవచ్చును. లేదా, శివశక్తు లిరువురు జగదాకారమున నున్నారని చెప్పినను తప్పుకాదు. ఇట్లు చెప్పుటకు వారి వాక్యములయందు ఆధారములున్నవి. కొన్నింటిని మాత్రమే చెప్పితిని. నీ ప్రశ్నకు అంతమాత్రము సమాధానము చాలు ననుకొందును.

శ్రీజ్ఞానేశ్వరులు లోకవ్యవహారములయందును శాస్త్రములయందును గల ద్వంద్వముల నంగీకరింపలేదు. ఎట్లన :— రాత్రింబవళ్లు, సుఖదుఃఖములు, జ్ఞానాజ్ఞానంబులు, నిద్రాజాగరణములు, అను మొదలగు ద్వంద్వంబులయందు రెండు లేవనియు, ఉన్నది ఒకటియే యనియు చెప్పిరి. వాక్యముల సారాంశ మిట్లుండును :—

‘రాత్రి నశించుచు దివారూపంబును బొందు’ (అను. 1-46) ‘సుఖము నశించుచు దుఃఖరూపంబుగ పరిణమించు, అజ్ఞానము నశించుచు వివేకరూపంబున శేషించియుండు.’ (అను. 3-26), ‘నిద్ర అంతమొందుచు జాగ్రద్రూపమున శేషించు’. పై సిద్ధాంతమును పెద్ద లనేకులు అంగీకరింపలేదు.

శివుడు కనబడునపుడు శక్తియు, శక్తి గోచరించునపుడు శివుడును, కనబడరు. దీనిని శ్రీ జ్ఞానేశ్వరులు వారి కావ్యభాషలో నిట్లు చెప్పిరి :— శివుని శక్తియు, శక్తిని శివుడును ఒకరి నొకరు మ్రింగి తిరిగి యుద్గిరించుకొనుచుందురు. (అను. 1-3) దీనిభావమే పైన చెప్పిన జాగరణ సుషుప్తులు మొదలగునవి.

జిజ్ఞాసువు :- లోకమున చిజ్జడము లనుద్వయము తోచుచున్నవికదా? శివ శక్తులలో చిత్ ఎవరు? జడ మెవరు?

వేదాంతి :- వేదాంతము ననుసరించి ప్రకృతి జడము, పురుషుడు చైతన్యము. జడమనునది మిథ్య. పురుషుడు సత్యము. శ్రీ జ్ఞానేశ్వరుల మతమున "ఒకటైన పరమాత్మ చిజ్జడములుగ భాసించుచున్నది" అనిరి.

(వి. ము. పుట. 102)

"పరమాత్మయందు చిజ్జడములు వేరువేరుగా నున్నవని జల్పవాదము చేయ తగదు" (వి. ము. పుట. 103) అని చెప్పిరి.

జిజ్ఞాసువు :- శ్రీ జ్ఞానేశ్వరుల తత్త్వము ననుసరించి జగత్తు సత్యమా? మిథ్యయా?

వేదాంతి :- శ్రీ జ్ఞానేశ్వరుల విషయమున నిది చాల చిక్కైన ప్రశ్న. వారి యీక్రింది వాక్యములవలన జగత్తు సత్యమో, మిథ్యమో మన మూహింపవలయును.—

"కావున యీ కల్పింపబడిన ప్రపంచము అధిష్ఠానమైన చైతన్యసత్తా లేక సిద్ధి లేదు. అట్టిదైన ఆరోపిత జగత్తును చూచి యిదియే సత్యమని నమ్మి అధిష్ఠానమును మరచుట భ్రాంతియే కాని వేరు కాదు" (వి. ము. పుట. 90).

"ఎచ్చట ప్రకృతి పురుషు లనుభేదము లేక ఒకటైన పరమాత్మయే యుండెనో అచట సృష్టి విలాసరచన యను

నది లేనే లేదు. కనుక జగత్తు మిథ్యయని పెద్దలు వచించిరి."

(వి. దుం. పుట. 95)

"ప్రకృతి పురుషు లనుమిష చేత అద్వైతాత్మమే నిరూపింపబడుచున్నది. ఈ కారణము ననుసరించి స్వరూపము సచ్చిదానందమని పిలువబడుచున్నది. దీనియందు జగన్మిథ్యాత్వ మనాయాసముగనే సిద్ధించుచున్నది".

(వి. దుం. పుట. 121)

"తనయందు కల్పిత సాక్షిత్వ మంగీకరించినంత మాత్రమున జగత్తు సత్యమగుటకు వీలు లేదు".

(వి. దుం. పుట. 134)

ఇచట గమనింపవలసిన యంశ మొకటి కలదు. ఏమన :- శ్రీ జ్ఞానేశ్వరుల గ్రంథ వ్యాఖ్యానమునందు (విజయ దుందుభి యందు) ప్రపంచము మిథ్యయని పలుమార్లు చెప్పబడియున్నది. ఇచట మిథ్యాశబ్దమున కర్థము ప్రపంచము వంధ్యాపుత్రునివలె లేనే లేదనిరి. శ్రీ శంకరులు ప్రపంచము మిథ్యయనుట యందు పై అర్థమునకు విరుద్ధము. ఎట్లనగా:- "సదసద్విలక్షణత్వం మిథ్యాత్వం" ఉన్నది లేనిది అని చెప్పుటకు వీలు లేనిది గనుక (అనిర్వచనీయ మగుటచే) మాయను దాని కార్యమగు జగత్తును మిథ్యయని. మిథ్యకు శ్రీ శంకరుల నిర్వచనము. ఈ యంశము విపులముగా యిది వఱలో చెప్పియున్నాను.* శ్రీ జ్ఞానేశ్వర విరచిత "అమృ

*బ్రహ్మజిజ్ఞాస 1 భాగము. [illegible]వ ప్రకరణము. జగత్తు మిథ్య అను 4వ అధ్యాయము.

తానుభవ" వ్యాఖ్యాతలచే గ్రంథారంభమున "మాయావాద ఖండనేన అజాత సిద్ధాంత ఉత్కృష్ట రీత్యా ప్రతిపాదితోస్తి" అని ఉపోద్ఘాతమున వ్రాయబడినది. అని శ్రీ కలగ అంజనేయశాస్త్రిగారు వ్రాసియున్నారు.

మూలగ్రంథమగు అమృతానుభవమునందు మాయావాద ఖండనము చేయ(లే)క పోవుటయేగాక తుదకు వారిచే మాయావాదమే పరోక్షమున అంగీకరింపబడినది.

శ్రీ జ్ఞానేశ్వరుల దర్శనమునను పరిశీలించిన, వీరి వాదమునకు జగన్మిథ్యాత్వ వాదము సరిపడదని నాయభిప్రాయము. సత్యమైన విశుద్ధ జ్ఞానము యొక్క స్పందనమే జగద్రూపమున నున్నదనిరి. సత్యమైన వస్తువుయొక్క స్పందనముగాని, విలాసముగాని సత్యమే కావలయును గాని మిథ్య కాజాలదు. నా యభిప్రాయమును దృఢపరచు శ్రీ అరవిందుల వాక్యము లివి:—

"నా ఆత్మయు పరమాత్మయు సత్యమైనపుడు, వీని నుండి జనించు నాతలంపులు, భావములు మిగత నా అన్ని శక్తులు అసత్యములు కానేరవు. అటులనే ఆత్మను ధరించి అందులో నివసించు నాశరీరము నిజమే కాని, శూన్యము కానేరదు. సారములేని వట్టిడొల్ల కానేరదు" (జ. తి. ప. పుట. 39) అని స్పష్టముగ చెప్పిరి. శ్రీ అరవిందుల వాక్యములు సూటిగా జగన్మిథ్యావాదమును ఖండించుచున్నవి. మఱియు,

శ్రీ అరవిందు లిట్లు చెప్పిరి :- "జగత్తు భ్రాంతికాదు.

ఆధారరహితమైన క్షణభంగురమైన గోచరముకాదు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" నీవు సత్యమే. నేను సత్యమే. దృగ్గోచరమైన దంతయు సత్యమే. పరమసత్య మెంతటి సత్యమో ఇది అంతటి సత్యము బ్రహ్మమే సర్వము అయినాడు. అందుచే సర్వము సత్యమే" అని తెల్పిరి.

(అరవిందుల సాధన సమన్వయము. పుటలు7-8)

శ్రీ జ్ఞానేశ్వరులు సద్రూపుడగు శివుడు విశ్వాకారమున నున్నాడనినందున జగత్తు సత్యమే గాని, మిథ్యకాదు, భ్రాంతికాదు అని చెప్పినను తప్పుకాదు. కాని వ్యాఖ్యాతలు జగత్తు మిథ్య యని అనేక పర్యాయములు స్పష్టముగ చెప్పిరి.

"విశ్వంబనియెడు విశాలగృహంబున వాసంబుండు వార లయ్యిరువురు మాత్ర మనంజెల్లు." (అను. 1-13)

శ్రీ జ్ఞానేశ్వరుల వర్ణనమును సూక్ష్మముగ పరిశీలనము చేసినప్పుడు విశ్వాకారమున నున్నది శివశక్తు లిరువురని సిద్ధాంత మగుచున్నది. కొన్ని యంశములయందు శ్రీ జ్ఞానేశ్వరుల మూలగ్రంథముతో (అనుభవామృతముతో) విజయదుందుభి వ్యాఖ్యానమునకు సమన్వయము కుదురుటలేదు. అవి రెండును భిన్నమార్గముల నడచినవి. ఉదాహరణమునకు :—

"నిరుపాధికంబును విశ్వంబున కాదికారణంబునై దీపించు నద్వైత దేవస్వరూపంబున కిమ్మాడ్కి భక్తియుక్తంబుగ వందనము గావించువాడ." (అను. 1-1)

నిరుపాధికులగు శివశక్తులను మిథ్య యనరాదు. వారు నిత్యులే. ఒకప్పుడు విశుద్ధజ్ఞానమునందు లీనమైనను, మరల మరల అందుండి వెడలుచున్నారు. వారిరువురు కారు, ఒక్కరే. ఆ ఒక్కరు విశుద్ధజ్ఞానమునకంటె భిన్నులు కారు. ఇట్లుండ జగదాకారమున నున్నది శివుడైనను శక్తియైనను విశ్వము మిథ్య యెట్లగును? కనుక జగత్తు మిథ్య కాదని చెప్పుటకు మూలగ్రంథమందు కొన్ని వాక్యము లున్నవి. వ్యాఖ్యానమునందు అనేకచోట్ల విశ్వము మిథ్య యనియే యున్నది. జగత్తు సత్యమనుట నా యభిప్రాయము కాదు. జగత్తు సత్యమను అర్థమిచ్చు వాక్యములు శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పియున్నారను నా యభిప్రాయమును మాత్రమే వ్యక్త పరచితిని.

జిజ్ఞాసువు :- జ్ఞానము (శక్తి) విశ్వాకారమును పొందినదని చెప్పుటకంటె ఆత్మయే (శివుడే) విశ్వాకారమును చెందెనని చెప్పిన శివునకు వికారము సంభవింపదా?

వేదాంతి :- శ్రీ జ్ఞానేశ్వరు లిట్లు సమాధానము చెప్పిరి :—

"ఆత్మయే తత్స్వరూపస్థితి చెడని రీతిగా ద్రష్టృ దృశ్య త్వములను సమస్తము కలిగించె" నని చెప్పిరి. (అను. 7-255-256) ఆత్మకు అట్టి పరిణామము వలన వికారము సంభవింపదని శుద్ధాద్వైతమతస్థాపకులగు వల్లభాచార్యులవారును చెప్పియున్నారు. వారేగాక ఆత్మ అవికృత పరిణామవాదమును అంగీకరించినవారు మరికొందరు గలరు. కాని ఇచట

ఒకవిషయము జ్ఞప్తియం దుంచుకొనవలెను. శ్రీ జ్ఞానేశ్వరుల వాదము బ్రహ్మ పరిణామవాదము కాదు. అదియే పైన చెప్పిన వారితత్త్వమునకు, జ్ఞానేశ్వరులవారి తత్త్వమునకు గల భేదము.

అటు మాయ నంగీకరింపక, పరబ్రహ్మమే జగమును సృష్టించెనని చెప్పిన యెదుర్కొనవలసిన చిక్కులను తప్పించుకొనలేక, ఈ రెండింటికంటె భిన్నమగు మూడవ మార్గము ప్రాచీన వేదాంత శాస్త్రములయందు చెప్పియుండ నందున తమ ప్రతిభ నుపయోగించి శ్రీ జ్ఞానేశ్వరులు యీ నవీన మార్గమును కనుగొనిరని తోచుచున్నది. కాని యీ మార్గమునందున్న సంశయమేమన: శుద్ధజ్ఞానస్వరూపమగు ఆత్మను సూర్యునితో పోల్చి "సూర్యుడు ఆతని కిరణజాలము" అని రెండుగా చెప్పి (అను. 1-24; 25) సూర్యుడే శుద్ధబ్రహ్మము, అతని వెలుగే జగత్తుగా (శక్తిగా) చెప్పినప్పుడు శివ శక్తులను ఈ ద్వంద్వమును ఇచట కొనిరా నవసరమేమి? అను సంశయమును తొలగించుకొనవలసి యున్నది. ఈ యంశమున జ్ఞానేశ్వరులవారు యోగవాసిష్ఠకారుల మతమునే కొంతవఱకు అనుసరించిరి. యోగవాసిష్ఠమున ఇట్లున్నది :—

శ్లో॥ తస్యైవ బ్రహ్మ భావస్య తేనైవం బ్రహ్మణాత్మనా,
స్వచ్ఛ మైక్యం స్వభావస్య స్వస్వభావ మనుజ్ఝతా.

శ్లో॥ ఇదం జాగ్ర దదశ్చం స్వప్నః సుషుప్తం తుర్య మిత్యపి
కృతం నామ స్వయం చిత్వా ద్బృంహిత్వా వాతేతి చాత్మని.

(యో, వా. 6-167-16, 17)

తా॥ సర్వశక్తివంతమగు బ్రహ్మము (ఆత్మ) తన పరమార్థస్వరూపమును పరిత్యజింపకయే 'ఇది జాగ్రత' 'ఇది స్వప్నము' 'ఇది సుషుప్తి' 'ఇది తురీయము' 'ఇది బ్రహ్మము' 'ఇది ఆత్మ' అను నీ ప్రకారములు స్వయముగా గావించెను.

"ఆత్మయొక్క స్పందమే శివశక్తు లనుదనియు, వారిరువురు తప్ప జగత్రయమునందు అన్యులు లేరనియు," చెప్పిన శ్రీ జ్ఞానేశ్వరుల సిద్ధాంతము, యోగవాసిష్ఠకారులు "చిదాకాశరూపుడగు శివుని స్పందశక్తియే (మనస్సే) జగత్రయమని" రనియు, ఇదివఱలో చెప్పియుంటిని. (యో. వా. 6-84-6) అందు చెప్పిన రెండు శ్లోకముల అర్థము కూడ పై సిద్ధాంతమునే ధృవపరచుచున్నవి. వీ రిరువుర మతములయందును జ్ఞానమే జ్ఞేయరూపమున నున్నందున జ్ఞాత లేదు. ఈ సందర్భమున 'యోగవాసిష్ఠము' జ్ఞానేశ్వరులవారికి వత్తాసి (ఉపాశ్రయము)గా నిలిచినదని చెప్ప వచ్చును. యోగవాసిష్ఠము ప్రాచీన వేదాంతమునకు సంబంధించినది కాదని జ్ఞప్తియుం దుంచుకొనవలయును.

బౌద్ధమతము భారతదేశమున బాగుగా వృద్ధినొందిన పిమ్మట రచియింపబడిన నవీన వేదాంతమును బోధించు ఉపనిషత్తులయందు అజాతవాదము అచ్చటచ్చట సూక్ష్మముగ చెప్పబడియున్నది. 108 ఉపనిషత్తులయందు మొదటి నుండి వరుసక్రమముగ లెక్కించిన 64 వ ఉపనిషత్తుగా కూర్చబడిన మహోపనిషత్తు నందు చతుర్థాధ్యాయమున 120 నుండి 123 శ్లోకములవఱకు అజాతవాదము చెప్పబడి

యున్నది. ఈ యుపనిషత్తునందు చెప్పబడిన తత్త్వము యోగవాసిష్ఠము నందలి తత్త్వముతో సరిపోవుచున్నది.

ఈ వాదమును బ్రహ్మసూత్రకారులు సూత్రముల యందును, సూత్రభాష్యమున శ్రీ శంకరులును బౌద్ధుల విజ్ఞానవాదమును విమర్శించుటచే యీ వాదమును గూడ విమర్శించినట్లు తెలియవలయును. వెనుక (తృతీయభాగము నందు నాలుగవ ప్రకరణమునందలి (౧౯) అధ్యాయమున) యీ మతమును తెలిపియుంటిని. ఇందువలన జ్ఞానదేవుల యొక్కయు యోగవాసిష్ఠకారుల యొక్కయు తాత్త్వికాంశములు చాలవరకు ఒకరీతిగనే యున్నవనియు, ఇరువురును, దృష్టిసృష్టివాదులగుటవలన అజాతవాదులనియు తెలిసినది.*

—: శ్రీఅరవిందుల శివశక్తి - తత్త్వపరిశీలనము :—

శ్రీ అరవిందులు, శ్రీ శంకరులు చెప్పిన మాయను విమర్శించినారు. విమర్శయందలి ముఖ్యాంశ మేమన :— మాయ నంగీకరించి "బ్రహ్మమునందు మఱియొక ఏకమును సనాతనమును అనిర్వచనీయమును నగు వస్తువు నెలకొల్పబడినది. ఏకత్వమును రక్షింపబడలేదు" అని చెప్పిరి. (మాయ)♦ వీరు చెప్పిన దేమి? ఏ యనిర్వచనీయ పర

* ఈ దృష్టిసృష్టి వాదమును శ్రీ శంకర శ్రీ జ్ఞానదేవుల అనంతరము క్రీ. శ. 1564 న నుండిన ప్రకాశానందులవారు పోషించిరట.

♦ శ్రీ అరవిందులు రచియించిన 'ధర్మము జాతీయత' అను పేరుగల గ్రంథమునకు 'వ్యాఖ్యావళి' అను ఆంధ్రానువాదమున 'మాయ' అను వ్యాసమునందుండి ఉదాహరించితిని.

బ్రహ్మమునొక్క స్వరూపమును - క్రియయును - పురుష ప్రకృతులు గాని, ఆ పరబ్రహ్మమే జగమునొక్క అనశ్వరమును, అద్వితీయమును అగు మూలసత్యము. మఱియు "ఆత్మ లేక పురుషుడు ఈ ప్రకృతియొక్క క్రీడకు అధ్యక్షుడు, మఱియు సాక్షి" అని చెప్పిరి. ఈ వాక్యములయందు ప్రకృతికిని దానియొక్క క్రీడకును సాక్షియైన పురుషుడు ఆ రెంటికంటె భిన్నుడై యుండవలెను. అట్లుండక పోయిన పురుషుడు సాక్షి కానేరడు. ఇచ్చట శ్రీ అరవిందులచే ఏకత్వము రక్షింపబడలేదు. వారి తత్త్వము ద్వైతమునకు దారితీసినది. మాయను పరబ్రహ్మమునొక్క స్వరూపమనిన, పరబ్రహ్మమే యనినట్లగును. అది క్రియ, శక్తి యనిరి. పరబ్రహ్మము క్రియారహితము. అనంతాఖండ వస్తువునందు క్రియ యెట్లు కలుగును? కలుగదు. పరబ్రహ్మమునొక్క సామర్థ్యమే అయినశక్తి యనిన శ్రీ శంకరులు చెప్పినదియు అదియే కదా?

శ్రీ శంకరులు మాయను గుఱించి చెప్పిన వాక్యములు ఇదివఱలో చెప్పియుంటిని.* అందులోనుండి కొంత భాగము తిరుగ జ్ఞాప్తికి తెచ్చుచున్నాను. "ఈశ్వరుని మాయ యనియు, 'శక్తి' యనియు, లేక ప్రకృతియనియు చెప్పుచున్నారు." అని కదా శ్రీ శంకరులు చెప్పినది? దానికంటె శ్రీ అరవిందులు భిన్నముగా చెప్పినదేమి?

శ్రీ శంకరులవారు మాయయొక్క నిర్వచనమును

* ఈ ప్రకరణమునందలి 5 వ అధ్యాయమున చెప్పియున్నాను.

ఏవిధముగా చెప్పిరో ఆవిధముగా శ్రీ జ్ఞానదేవ, శ్రీ అరవిందులు తమ విమర్శయందు వాహరింపక కొంత దాచిపెట్టి, అందులో కొంతభాగమును మాత్రమే వారి బుద్ధికి తోచిన అర్థముతో అనువదించి విమర్శించిరి. శ్రీ శంకరులు చెప్పిన దానికంటె తాము చెప్పునది సర్వోత్కృష్టమని చెప్పిరి.

శ్రీ అరవిందుల తత్త్వమును సూక్ష్మముగ పరిశీలించిన శ్రీ వల్లభాచార్యుల శుద్ధాద్వైతము, శ్రీ నింబార్కుల ద్వైతాద్వైతమును, స్మృతికి వచ్చును.* ఆ రెంటితో అరవిందుల తత్త్వమునకు చాలవఱకు సామ్యమున్నది. వల్లభాచార్యులు మాయ నంగీకరింపరు. కాని, శ్రీ శంకరుల అర్థముతో కాదు. మాయ జగత్కారణముకాదు. సర్వశక్తి యగు యీశ్వరునకు జగన్నిర్మాణకార్యమునందు, ఇతరుల సహాయ మవసరము లేదు. బ్రహ్మమే జగద్రూపమున పరిణమించెను. ఈశ్వరుడు (పరబ్రహ్మము) ఎట్లు నిత్యుడో జీవ, జగత్తులు అట్లే నిత్యములు.

శ్రీ అరవిందుల పరమసత్యము స్థితి - గతి కలదని చెప్పిరని చెప్పియుంటిని. శ్రీ వల్లభులు సహితము బ్రహ్మము నందు పరస్పర విరుద్ధగుణము లుండవచ్చునని చెప్పిరి.

నింబార్కాచార్యులవారు — బ్రహ్మము, జీవుడు, ప్రకృతి, అను మూడు రూపములుగా బ్రహ్మమే యున్నా డనిరి. వీరిది అవికృత బ్రహ్మపరిణామవాదము.

---

* శుద్ధాద్వైతవాదమును, ద్వైతాద్వైతవాదమును యీ గ్రంథము యొక్క తృతీయభాగమున రెండవ ప్రకరణమున 6 - 7 అధ్యాయము లందు చెప్పియున్నాను.

శ్రీ అరవిందులవలెనే, శ్రీ వల్లభులు, శ్రీ నింబార్కులు శివ - శక్తుల (తొలుత) అంగీకరించి ఆపిదప రెండును మిథ్యయే యని అనవలసిన అవసరము వారికి లేకపోయినది.

శ్రీ శంకరులు మాయ నంగీకరించుటవలన బ్రహ్మము యొక్క అద్వైత స్థితికి భంగము కలిగినదని చెప్పిన శ్రీ అరవిందులు, ఎంతో సామర్థ్యమును ప్రకటించి చెప్పినను వారు (శ్రీ అరవిందులు) శివ శక్తుల నంగీకరించుటవలన బ్రహ్మము యొక్క ఏకత్వమునకు భంగము కలుగుచున్నది. శ్రీ శంకరుల మాయానిర్వచనమునం దట్టి దోషము కలుగదు.

శ్రీ అరవిందులు తాము చెప్పు పరమసత్తు స్థితిరూపమైనదని చెప్పుచు, అంతటితో ఆగక పరమసత్తకంటె పరమునందు దివ్యసత్తు అనునది దొకటి కలదనియు, దాని ఒక పార్శ్వము, లేక, ఒక అంతస్సు మాత్రమే పరమసత్తు యగు స్థితియనియు, చెప్పుటచేత పరమసత్తు అను నామము స్థితిగల బ్రహ్మమునకు సార్థకము కాకపోవును. పరమసత్తు - దివ్యసత్తు యొక్క ఒక పార్శ్వమునిగాని, ఒక అంతస్థని గాని చెప్పుటవలన పరమసత్తియు దివ్యసత్తయు రెండును సావయవములని చెప్పవలసి వచ్చును. అప్పుడు ఆ రెండింటిలో దేనికిని అఖండత్వము - అద్వితీయత్వము చెప్పుటకు వీలు లేదు. అట్టిచో 'గతిక' స్థానమెచ్చట? శ్రీ అరవిందులు ఇన్ని దోషముల నెదుర్కొని నిలుచుట అసాధ్యము. శ్రీ అరవిందులు చెప్పిన దివ్యసత్తి శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పిన శివ - శక్తులకు మూలస్థానం విశుద్ధజ్ఞానమైనను, శ్రీ సమర్థులు శ్రీ శంకరులు చెప్పిన నిర్గుణబ్రహ్మమైనను కావలెను. వేఱు మార్గము లేదు.

శ్రీ శంకరులు జగత్తును వ్యావహారిక సత్యమనిరి. శ్రీ అరవిందులు సహితము "బ్రహ్మముయొక్క దేశకాలాతీతమైన దశయందు దాని కస్తిత్వము లేదనిరి." మఱియు "యథార్థమునకు సర్వమును దేశకాలాతీతమైన దశయందు జగము మిథ్య. కాని మనము దేశకాలాతీతులము కాము. మనము జగమును మిథ్య యనుట కధికారులము కాము." అని చెప్పిరి. (మాయ)

శ్రీ శంకరుల మాయావాదముపై దండయాత్ర జరిపిన ఆచార్యులందఱి వాదమునకంటె శ్రీ అరవిందుల యీ వాక్యములు సమంజసమైయున్నవి. శ్రీ అరవిందులు పరమసత్తను గుఱించి చెప్పుచు — "దేనిని తెలిసికొనిన సర్వము తెలిసి, సర్వము బ్రహ్మమగునో అదియే పరమసత్త (Supreme Reality) కాని మాయావాదం ప్రకారం దేనిని తెలిసికొనిన, అన్నియు భ్రమాత్మకమగునో అదియే పరమసత్తగా నిరూపింపబడుచున్నది." అనిరి.

శ్రీ శంకరులు చెప్పినదానిలో తప్పేమియు లేదు. దేనిని (పరమసత్తను) తెలిసికొనిన దానికంటె అన్యమయినది వేఱొకటి లేనందున, ఉన్నదను భావము భ్రమాత్మకమని అర్థము. పరమసత్తను తెలిసికొనిన, 'అన్నియు' అను అనుభూతి లేదు. కనుక శ్రీ శంకర, శ్రీ అరవిందుల భావమొక్కటే.

దివ్యసత్త ఒకటి కలదని చెప్పుట అరవిందదర్శనము నందలి అపూర్వత.

మానవుని మేధాశక్తి సామర్థ్యములపై పరమసత్యమాధారపడదు. శ్రీ శంకరులు చెప్పినదానినే శ్రీ అర

విందులు శ్రీ జ్ఞానేశ్వరులు ఒక చేత స్వీకరించుచు వేఱొక చేత త్రోసివేసిరి. ఇదను ముముక్షువుయొక్క గమ్యస్థాన మొక్కటే.

—: శ్రీ సమర్థుల శివ - శక్తి తత్త్వ పరిశీలనము :—

సృష్టియొక్క రహస్యమును ఎవ్వరు నెఱుగరని వేదమునందు చెప్పిన విధమును కొలది మార్పుతో శ్రీ సమర్థులును ఇట్లు చెప్పిరి:— "వీని నన్నింటిని సృష్టిగావించిన వాఁడే సర్వకర్తయగు పరమేశ్వరుఁడు. వాస్తవముగ నాతఁడు నిరాకారుఁడు. వాని కళా లీలాకౌతుకములను బ్రహ్మ విష్ణు మహేశ్వరాది దేవతలైనను నెఱుఁగరు." (దా. బో. 8-1-24) ఈ విధముగ చెప్పియును బ్రహ్మము నందు మూలమాయ కలిగిన దనిరి. శ్రీ శంకరులవలెనే బ్రహ్మము నిర్గుణమనియును, శుద్ధజ్ఞానమనియును చెప్పిరి. మాయావిద్యల నంగీకరించిరి. శ్రీ శంకరులు చెప్పిన మాయ అనిర్వచనీయము. సమర్థులవారు చెప్పిన మాయ అట్టిది కాదు. అది బ్రహ్మమునందు పుట్టినది. అందే లయమగునది. అంతమాత్రమున వారి మతము ద్వైతమని చెప్పకూడదు. ఏలయన? మూలమాయ నిత్యముకాదు. బ్రహ్మమువలె ఆద్యంతరహితముకాదు. నిత్యమైనది బ్రహ్మమే. కనుక వారి మతము ఒకవిధముగ అద్వైతమే. శ్రీ సమర్థులు శాక్తేయులు.

ఇదివఱలో సమర్థులవారి వాక్యముల కొన్నింటి నుదాహరించియుంటిని. వాటిలో యీ క్రింది వాక్యముల గమనింపవలయును.

"నిరాకారస్వరూపమునందు మూలమాయ కలుగుచున్నది." (దా. బో. 8-3-27) అని బ్రహ్మమునందు మూలమాయ కలిగినట్లు స్పష్టముగ చెప్పిరి. మూలమాయ యెట్లైనను బ్రహ్మమునం దొకటి కలిగినదను వాదమును వేదాంతు లంగీకరింపరు. అట్లంగీకరించిన బ్రహ్మము కారణము, మూలమాయ కార్యము, అగుచున్నవి. బ్రహ్మము దేనికిగాని కారణముగాదు, కార్యమునుగాదు. ఆత్మ కార్యకారణబద్ధము కాదని శ్రుతులు చెప్పెను. పరబ్రహ్మము నందు మాయ లయమైపోయినదని సమర్థులవారు చెప్పిరి. అదియు వేదాంతులకు సమ్మతముకాదు.

బ్రహ్మముయొక్క స్వరూపమును వివరించుచు నిత్యముక్తము 'పరమార్థక్రియయు' అన్నారు. పరమార్థక్రియ యననేమో, దాని భావమేమో, ఎచ్చటను వివరింపలేదు. క్రియారహితమగు బ్రహ్మమునందు పరమార్థక్రియ యెట్లుండును?

నిర్గుణబ్రహ్మమునందు గుణసహితమగు మూలమాయ యెట్లు కలిగినది? నిర్గుణబ్రహ్మగర్భమున సగుణమున్నచో పరబ్రహ్మము నిర్గుణ మెట్లగును? ఈ ప్రశ్నకు దాసబోధయందు సమాధానము లేదు.

సమర్థులవారు తాము చెప్పిన మాయ శ్రీ శంకరులు చెప్పిన మాయకంటె భిన్నమైనదని తెలియజేయుటకు 'మాయ' అను శబ్దము నుపయోగింపక మాయకు 'మూల' అను విశేషణముచేర్చి 'మూలమాయ' అనిరి. అదిగాక గుణమాయ యని మఱొక మాయను చెప్పిరిగదా?

'మూలమాయ' యనుటకు అదియును ఒక కారణము. మూలమాయనుండి చైతన్యము, జడము, రెండును కలిగినవి.

అనగా: మూలమాయయే చైతన్యముగాను, జడ జగత్తుగాను విభక్తమైనది. శుద్ధజ్ఞానము వేఱు, చైతన్యము వేఱు - అని వారిభావమనుటకు ఇదియొక నిదర్శనము. ఈ చైతన్య - జడములే శివుడు - శక్తి. ఈ మతమునందు దేహమువలెనే దేహియు పుట్టినవాడే. దేహి దేహములు రెండును మాయా సంభవములే. అట్టి భావము యోగవాసిష్ఠమునందుగాని శ్రీ జ్ఞానేశ్వరుల రచనలయందుగాని కనబడదు. గీతయొక్క 7-వ అధ్యాయమునందు చెప్పిన, పరా అపరా ప్రకృతులు అవి కావా? అనిన అట్టివి కావు. భగవద్గీత ననుసరించి ప్రకృతియొక్క అవ్యక్తస్థితి, 'పర' యనియు, వ్యక్తస్థితి 'అపర' యనియు శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పిరి గాని శ్రీ సమర్థులవలె చెప్పలేదు. అదియునుగాక, శ్రీ సమర్థులు చెప్పిన శివుడు - శక్తి అను ద్వంద్వమునందు రెండును ఒకటి కావని అవి అత్యంత భిన్నములని (దా. బో. 13-10-7) చెప్పుటవలన కూడ శ్రీ జ్ఞానేశ్వరుల శివ - శక్తి తత్త్వములతో వీటిని పోల్చుటకు వీలులేదు. శ్రీ సమర్థులు చెప్పిన శివ శక్తులు యీ క్రింది ఉపమానముతో పోల్చి చెప్పవచ్చును. ఎట్లన: భూమివంటిది శుద్ధజ్ఞానము (బ్రహ్మము) భూమిని భేదించుకొని వెడలిన బీజముయొక్క అంకురము వంటిది మూలమాయ. అంకురమున కంటుకొని యుండు రెండు దళముల వంటివి శివుడు - శక్తి. ఇట్లుగాక, మూలము, స్కంధము, రెండు కొమ్మలు గల వృక్షములతో కూడ పోల్చవచ్చును.

మూలము బ్రహ్మము, స్కంధము మూలమాయ, రెండు శాఖలు శివుడు - శక్తి. ఇట్లివియు సరిపోవును. పర్యవసానమున మనస్సు, ప్రాణము అనుభవించే వీరి మతమున శివుడు - శక్తి.

శ్రీ సమర్థులు జ్ఞానము (చైతన్యము) శుద్ధజ్ఞానము అను జ్ఞానద్వయమును అంగీకరించిరి. వీరి మతమున శుద్ధజ్ఞానమును, అంతఃకరణమును రెండును విభువులు. 'విభువు' అనగా: సర్వవ్యాపకము. రెండు వస్తువులు సర్వవ్యాపకము కాజాలవు. వీరిది అజాతివాదము కాదు, సృష్టివాదము. సమర్థుల వారిట్లు చెప్పిరి :—

"పరమాత్ముడు సృష్టి యొనరించినటుల నొక శిల్పి సుందరమందిరము నిర్మించె ననుకొనుడు. కాని యా మందిర నిర్మాత స్వయముగా మందిరము కాగలడా? అటులే జగత్తును నిర్మించిన పరమాత్ముడు జగత్తునకంటెను వేఱుగా నున్నాడు. కొందరు మూర్ఖులీ యంశమును తెలియంగక 'జగమే జగదీశ్వరుడ' అని యనుకొందురు. జగదీశ్వరుడు వేఱుగా నున్నాడు. జగద్రచనము వాని కళ. అతడన్నింటిలో నున్నాడు. కాని అన్నింటికంటెను వేఱుగా నుండి అన్నింటిలో నున్నాడు." (దా. బో. 8-1-39, 40, 41).

ఈ వాక్యములు శ్రీ జ్ఞానేశ్వరుల మతమును మనస్సునందుంచుకొని దానిని నిరసించుచు చెప్పియుందురని భావింపవచ్చును. అజాతవాదమునకు యిది విరుద్ధము. వీరి వాదము తర్కమునకు నిలువదు.

శివ శక్తి లిరువురునందును ఏ ఒక్కరు పరబ్రహ్మము కారు. శ్రీ శంకరుల అద్వైతమున ఆత్మయు బ్రహ్మమును ఒక్కటే. అవిద్యానాశయందునను, సంయక్ జ్ఞానము కలిగిన తరువాతను కూడ ఆత్మ బ్రహ్మమేగాని అన్యము కాదు. ఆత్మ బ్రహ్మమునకంటె వేఱై యుండి బ్రహ్మముగా మారదు. మారుటనకు రెండు వస్తువులుండి ఒకటి మఱియొకటిగా మారవలయును గదా! 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ' అను శ్రుతి ననుసరించి బ్రహ్మ మొక్కటే. 'తత్త్వమసి' మొదలగు మహావాక్యములు శ్రీ శంకరుల అద్వైతమునకే సరిపడును గాని ఇతరులకు సరిపడవు. 'తత్త్వమసి' అది నీవైతివి - అను మహావాక్యము ఔపచారికమే గాని పరమార్థము కాదు. అవిద్యవలన, 'నేను బ్రహ్మమును కాను' అనువానికి గురువు (శ్రుతి) ఆత్మానాత్మ విచారము చేసి 'నేతి' 'నేతి' వాక్యములచే అనాత్మను నిషేధించి, నిషేధావధియగు ఆత్మను గుఱించి చెప్పి 'అయమాత్మా బ్రహ్మ' ఈ ఆత్మయే బ్రహ్మమని బోధించినదే గాని వేఱుకాదు. శ్రీ సమర్థుల దర్శనమునందు; ఆత్మ అనగా — అంతఃకరణము. అది బ్రహ్మ మెట్లగును? సమస్తమును మూలమాయలో కలియుగా - మూలమాయ బ్రహ్మమునందు లయించుచున్నందున [illegible] మిగిలినది బ్రహ్మమే కనుక అదియే నీవను అర్థములో చెప్పియుందురా? అనిన అదియును సరిపడదు. శ్రీ సమర్థులు చెప్పిన శివ శక్తి లిరువురయందును ఏ ఒక్కరు పరబ్రహ్మము కారను జ్ఞానము కలిగిన పిమ్మట 'తత్త్వమసి' లోని త్వం శబ్దము దేని నుద్దేశించి చెప్పబడినది?

జగత్తు బ్రహ్మమునకంటె వేఱైనయెడల అది ద్వైత మగును. జగత్తు వేఱు బ్రహ్మము వేఱు అని చెప్పిన బ్రహ్మమునకు పరిచ్ఛిన్నత కలుగును. పరిచ్ఛిన్న మగునది (హద్దులు కలది) ఏదియు నిత్యము కాదు.

దాసబోధ 8-వ దశకము 2-వ సమాసమున నిర్గుణ బ్రహ్మమునందు మూలమాయ యెట్లు కలిగెనని శ్రోతలు అనేకవిధములగు ప్రశ్నపరంపరలను గురిపించినట్లు చెప్పుకొని వాటికి సమాధానము మూడవ సమాసమున చెప్పిరి. కాని వారు వేసికొన్న ప్రశ్నలకే వారు సరియగు సమాధానము చెప్పలేక పోయిరి. ఎంత ప్రయత్నించినను నిర్గుణమునందు గుణసహితమగు మూలమాయ యెట్లు కలిగినదో తృప్తికర మగు సమాధాన మివ్వలేక తిరిగి శంకరాద్వైతములోనికి ప్రవేశించి రజ్జు సర్పము మొదలగు దృష్టాంతములను గైకొనిరి.

—: యోగవాసిష్ఠము - అజాతవాదము :—

జిజ్ఞాసువు :- అయ్యా! దృశ్యజగత్తు తొలుత ఏవిధముగా కలిగినది. జగత్తు పుట్టనేలేదని గౌడపాదాచార్యులవారనిరికదా అది ఎట్లు?*

వేదాంతి :- జగత్తు పుట్టనే లేదని వసిష్ఠమహర్షి శ్రీరామచంద్రున కుపదేశించినట్లు యోగవాసిష్ఠ నిర్వాణ ప్రకరణమునందలి 190 వ సర్గమున కలదు. అచ్చట మహర్షి

* శ్రీ గౌడపాదుల అజాతివాదమును గురించి యీ గ్రంథమున 1- 36 న వ్రాసితిని.

నొక్కయు శ్రీరామచంద్రుని యొక్కయు సంవాదమున యీ యంశము వివరింపబడినది. ఆ సంవాదము యొక్క సారాంశము జగత్తు పుట్టలే దనుటయే.

జిజ్ఞాసువు :- జగత్తు పుట్టనిదై కుందేటి కొమ్మువలె అభావమైనయెడల కనబడుచున్న జగత్తు కేవల భ్రమమాత్రమే యనవలసి వచ్చును. అప్పుడు యీ భ్రాంతి ఎచ్చటనుండి వచ్చినది? — అను ప్రశ్న కలుగుచున్నది. దాని కేమి సమాధానము?

వేదాంతి :- స్వప్నపదార్థములు, ఎండమావుల యందలి జలము, ఇద్దరు చంద్రులు, ఆకాశమునందు నీలిమ, ఇవి వాస్తవములు కాకున్నను, కనబడుచున్నవి. అట్లే జగత్తు పుట్టకపోయినను కనబడుచునే యున్న దనిరి.

జిజ్ఞాసువు :- దృష్టాంతములు చెప్పి యెదుట కనబడు జగత్తు పుట్టలేదని మీరు చెప్పితిరో ఆ దృష్టాంతములు సంతృప్తికరములు కావు.

వేదాంతి :- అట్లైన వినుము. కారణమునుండి కార్యము జనించును గాని వేఱొక విధముగా కలుగదని నీ వంగీకరించెదవు గదా! సృష్ట్యాదియందు సర్వకారణములు శమించియుండుటవలన జగదుత్పత్తికి కారణము లేక యుండుటచే జగత్తు పుట్టనే లేదనిరి.

జిజ్ఞాసువు :- మహాప్రళయము సంభవించినపుడు పరబ్రహ్మము మాత్రమే శేషించియుండును. అట్టి బ్రహ్మమే జగదుత్పత్తికి కారణమని ఏల చెప్పరాదు?

వేదాంతి :- పరబ్రహ్మము జగత్తునకు కారణమని చెప్పుట తప్పు. ఏలయందువా? కారణమునందుండునదియే కార్యమునందుండును. కారణమునందు లేనిది కార్యమునందుండదు. ఘటమునందు పటము (వస్త్రము) లేదు. కనుక ఘటమునందుండి వస్త్ర మెన్నడును పుట్టజాలదు. ఉప్పుకల్లునందు ఉప్పుదనము తప్ప యితరమేది లేనియట్లు బ్రహ్మము కేవల చిద్రూపమే (జ్ఞానస్వరూపమే) కాని అన్యము కాదు. కనుక బ్రహ్మమునుండి జడజగత్తు పుట్టజాలదు.

జిజ్ఞాసువు :- మహాప్రళయమున జగత్తు బ్రహ్మమునందు సూక్ష్మరూపముననుండి తిరిగి బ్రహ్మమునందుండియే స్థూలరూపమును పొందుచున్నదని చెప్పిన తప్పేమి? శాస్త్రములు సయితమీవిధముగా చెప్పుచున్నవి కదా?

వేదాంతి :- మహాప్రళయకాలమున కేవల పరబ్రహ్మమునందు జగత్తు బీజరూపముననుండెనని సృష్టియొక్క బీజసత్తను (బ్రహ్మమునందు) చూచినవాడెవడు?

జిజ్ఞాసువు :- ముక్తపురుషులు బ్రహ్మమునం దైక్యమైయుందురు. వారు సృష్టి బీజమును తెలిసికొనియుందురు కదా?

వేదాంతి :- ముక్తపురుషులకు పునర్జన్మము లేదు. వారు బ్రహ్మమునం దైక్యమైరి. కనుక వారివలన ఆ విషయమును మన మెఱుగజాలము. కనుక జగత్తు మహాప్రళయమున బ్రహ్మమునం దుండెననుట సరికాదు. 'అట్లు కాదు బ్రహ్మమే జగత్తునకు బీజము' అని చెప్పితివేని కుండయందు మట్టితప్ప అన్యమేమియును లేదుకదా? ఆ విధము

గనే ముల్లోకములు (దృశ్యజగత్త్రితయము) జ్ఞానమాత్ర స్వరూపమే యని నీ వంగీకరించినట్లే కదా? ఇదియే దృష్టి సృష్టి సిద్ధాంతము. (వాదము)

జిజ్ఞాసువు :- అయ్యా! జగత్తు మొదటినుండియు లేనిదై, బ్రహ్మము మాత్రమే యుండునదైన జగత్తు కలదను భ్రాంతి యేకారణమువలన కలిగినది?

వేదాంతి :- కారణాభావముచే జగత్తు పుట్టలేదని నీ వంగీకరించితివి. ఇప్పుడు జ్ఞేయరూపముగు జగత్తుస్వరూపమేమను ప్రశ్నయే నీకు కలిగినది. ఉన్నది ఒక్క బ్రహ్మమే. ఆ బ్రహ్మమే నిజమాయాప్రభావమున జ్ఞాతృ - జ్ఞాన - జ్ఞేయ రూపమున కనబడుచున్నది.

జిజ్ఞాసువు :- శుద్ధ చైతన్య స్వరూపమగు బ్రహ్మసత్తు ఎక్కడ? జడజగత్తు ఎక్కడ? బ్రహ్మము జగద్రూపముగ కనబడుచున్నదనిన, కట్టెలు అగ్నిని కాల్చుచున్న వన్నట్లు, విపరీతముగా నున్నది. కేవల బ్రహ్మమాత్రమే యున్నందున జగద్భ్రమ కలుగుటకు అవకాశమే లేదుగదా?

వేదాంతి :- కారణాభావమువలన జగత్తు పుట్టనే లేదు. కనుక భ్రమ యనునది కూడ లేదు. శ్రీరామచంద్రుడు వసిష్ఠ మహర్షిని ఇట్లు ప్రశ్నించెను. "బ్రహ్మమునందు మనస్సు ఏ కారణమున, ఏ రూపమున స్థితి కలిగియున్నది?" (యో. వా. 4-21-2). ఈ ప్రశ్న సామాన్యమయినది కాదు. సృష్టిని గురించిన సమస్త సంశయములు నిందే యిమిడియున్నవి. ఇక్కడ మన స్సనునదే మాయ యని జగత్తని చెప్పవచ్చును. వసిష్ఠ మహర్షి ఆ ప్రశ్నకు

వెంటనే సమాధానమివ్వక సిద్ధాంతమును గురించి చెప్పు నపుడు (నిర్వాణప్రకరణమున) సమాధానము చెప్పెదనని (యో. వా. 5-14-12) చెప్పి, సిద్ధాంతమును గురించి చెప్పు నపుడు 'మనస్సు కలుగనే లేదని' సమాధాన మిచ్చిరి. మనస్సు కలుగలేదనినను జగత్తు పుట్టలేదనినను ఒక్క-టియే. ఆ విధముగా యోగవాసిష్ఠమున అజాతవాదము చెప్పబడెను.

జిజ్ఞాసువు :- అయ్యా! మీరు ఎంత చెప్పినను 'కారణాభావము వలన జగత్తు పుట్టలేదని' పుట్టని జగత్తు ఉండుట గాని దానికి నాశనము గాని లేదని చెప్పుచున్నారు. 'కారణాభావ' మను ఆధారము తప్ప వేఱొక ఆధార మేదియు మీ వాదమును బలపరుప లేదే?

వేదాంతి :- నేను నీకు పైన చెప్పినదంతయు శ్రీ వసిష్ఠ శ్రీరామ సంవాదమునందలి సారాంశము మాత్రమే గాని నా మతము కాదు. నేను శ్రీ శంకరులవారు చెప్పిన అజాతవాదమును అంగీకరింతును. కాని యోగవాసిష్ఠకర్త యొక్క-దృష్టి సృష్టి వాదమును అంగీకరింపను. జ్ఞేయమగు వస్తువు సత్తకలది కాకపోయిన అనిర్వచనీయమైనదైనను కావలెను. జ్ఞానముకంటె భిన్నమగు నేదేని యొక పదార్థము లేనిదే దానిని జ్ఞేయమనజాలము. నేను, కేవల దృష్టియే సృష్టి, (దృశ్యము) అను వాదమును అంగీకరింపను. ఈ త్రిపుటి అనిర్వచనీయ మాయాశక్తి పరిణామమని నమ్ముదును.

——: యోగవాసిష్ఠమునందలి శివ - శక్తులు :——

యోగవాసిష్ఠమున శివ శక్తులను గుఱించి యిట్లున్నది:— చిదాకాశమే శివుడు. (పరబ్రహ్మము) చిదాకాశమే చిత్తు. చిత్తుయొక్క శక్తి చిచ్ఛక్తి. విషయాభిముఖమైన చిత్తు చిత్తము. అదే మనస్సు. ఈ విధముగ జ్ఞానమును రెండు విధముల అంగీకరించిరి. మాయావిద్యలను యీ మత మంగీకరించెను. ఈ అంశమున తప్ప తక్కిన అంశములలో చాలవఱకు శ్రీ జ్ఞానేశ్వరులవారు యీ మతముతో నేకీభవించిరి.

శ్రీ జ్ఞానేశ్వరులు ఆత్మస్పందనమే శివ శక్తు లనిరి. యోగవాసిష్ఠకారులు ఆత్మయే శివుడు. ఆయన స్పందనమే శక్తి యనిరి. శివుడు భైరవుడనినప్పుడు శక్తిని కాళియని చెప్పిరి. కామేశ్వరీ కామేశ్వరుల స్వరూప వర్ణనమున కామేశ్వరుడు ప్రకాశమాత్ర స్వరూపుడనియు, ఆయనయందంతర్లీనమైయుండిన విమర్శయే పరాశక్తి యనియు చెప్పియుంటిని. ఈ యంశమున రెండు మతములును ఒక్కటియే, యని విదితమగును. మఱియు చిత్ శక్తియే స్పంద జడభావమున నున్నప్పుడు క్రియ (శక్తి) యనియు, స్వాభావిక చిన్మాత్ర రూపమున నున్నపుడు శివుడనియు యోగవాసిష్ఠ మతము. ఇచ్చట అద్వైతమునకు హాని కలుగదు.

శ్లో. మాయైషా సాహ్య విద్యైషా భావనైషా భయావహా,
సంవిద స్స్పందనం యత్తత్క్రియేతి విదు ర్బుధాః.

(యో. వా. 4-21-37)

"చైతన్యము (జ్ఞానము) దృశ్యమగుటచే బంధహేతువగు కర్మయని బుద్ధిమంతులు వచింతురు. మఱియు నదియే మాయయు, అవిద్యయు, భయప్రదమగు భావనయు నగును".

—: శ్రీ శంకరుల అజాతవాదము :—

శ్రీ శంకరుల మతమున పరబ్రహ్మము పరిపూర్ణము, నిర్గుణము, నిర్విశేషము, అనంతము, అఖండము. ఈ యంశము అద్వైతులలో అన్ని శాఖలవారును చాలవఱకు అంగీకరించిరి. నిర్గుణబ్రహ్మము సృష్టి చేయవలెనని గాని తానే జగద్రూపమును పొందవలయునని గాని సంకల్పించెననిన అది సరియైన మతము కాదు. నిర్గుణునకు సంకల్పమెట్లు కలుగును? సంకల్పము శరీరధారికేగాని శరీరములేని వానికి కలుగదు. సంకల్ప వికల్పములు మనోధర్మములు. మనస్సునప్పుడు శరీరము కలిగియుండవలెను. శరీరము పరిచ్ఛిన్నమైనదే. శరీరధారి పుట్టినవాడుగనే యుండవలయును. జన్మము కలవారికి మరణము తప్పదు. జనన మరణములు కలవాడు మనవంటివాడే యగును, గాని నిత్య సత్యమగు పరబ్రహ్మము కాజాలడు. "స ఐక్షత" "సోఽకామయత" ఇట్టి సంకల్పములు పూర్ణకామునకు (పరిపూర్ణునకు) ఎట్లుకలుగును? మన లోకానుభవమును బట్టి అపరిపూర్ణునకే (ఏదియో ఒక కొఱత కలవానికే) సంకల్పము, కోరిక కలుగును. కోరిక గలవాడు బ్రహ్మమెట్లగును? "నేనుతప్ప అన్యులెవ్వరును లేరు" అని బ్రహ్మము తలంచెనట. సృష్టికి పూర్వము సజాతీయ స్వగత భేద రహితమగు ఆ స్థితియందు, లేక ఆ వస్తువునందు "నేను" అను భావమెట్లుకలుగును? "ఇతరు లెవ్వరు లేరే" అని

యెట్లు తలచును? కనుక పరబ్రహ్మము తన సంకల్పమున నామరూపాత్మక జగత్తును సృష్టించెనను వాదము తర్కమునకు నిలువదు.

ఇంకొక వాదమున్నది. అదియేదన - పరబ్రహ్మము తానే జగద్రూపమున పరిణమించెను అనునది. అదియును తర్కమునకు నిలువదు. నిర్వికార పరబ్రహ్మము జగద్రూపుడాయెననిన ఆయనకు వికారము సంభవించును. వికారము* గల వస్తువునకు నాశనమున్నది. వికారమున్నప్పుడే సమస్త హేయ గుణము లుండును. నిర్గుణునియందు యిట్టి దోష మారోపింపరాదు. పరబ్రహ్మమునకు పరిణామ మంగీకరించిన, మఱియొక్క గొప్ప దోషమును ఎదుర్కొనవలసి వచ్చును. ఏమనగా — పాలు పెరుగైన తరువాత పాలు లేకపోవును. అట్లే పరబ్రహ్మము జగదాకారముగ పరిణమించి యుండిన, నిర్గుణ పరబ్రహ్మ వస్తువు లేకపోవలసివచ్చును. అట్లై యుండిన జగదుత్పత్తికి పూర్వము పరబ్రహ్మమను వస్తువొకటి యుండెననియు, అది నిర్గుణమై యుండి జగదాకారమున పరిణమించెననియు, యెఱిగిన వారెవ్వరు? పరిణామమునకు ముందున్నదానిని అట్లుండెనని, యే యనుభవము చేత చెప్పగలుగుదురు? అట్లుగాక పరబ్రహ్మమే తనలో కొంత భాగము జగద్రూపమున పరిణమించి కొంతభాగము పరిణమింపక యెప్పటివలెనే యున్నదనిన పరబ్రహ్మము సావయవియని అంగీకరించినట్లగును. అవయవియగు వస్తువేదియు నిత్యము కాదు. కనుక బ్రహ్మ పరిణామవాదము అసంగతము.

---

* వికారమనగా వేదాంత పరిభాషయందు మార్పు.

 [redacted]

ఒకవేళ యోగవాసిష్ఠకారులును శ్రీ జ్ఞానదేవులును యువివఱలో చెప్పినట్లు బ్రహ్మము ఆయన నిర్వికారతకు భంగము రాకుండు విధమున సమస్త నామరూపములును పొందుచున్నదని అంగీకరించినమీద నామరూపాత్మక జగత్తు బ్రహ్మమునందు బీజరూపమున (సూక్ష్మమున) ఉండినదనియు అదియే స్థూలరూపమున వ్యక్తమైనదనియు సంశయింప వలసి వచ్చును. అట్లంగీకరించిన బ్రహ్మము నిర్గుణము, నిర్విశేషము, నిర్లేపము అను శ్రుతి వాక్యములు అర్థశూన్యములగును. అదిగాక, జగత్తునకు పర(నిర్గుణ)బ్రహ్మము కారణమని జగత్తు కార్యమని చెప్పవలసి వచ్చును. అట్లంటి మీద బీజము వృక్షమైనట్లు బ్రహ్మమే జగత్తుగ అయినదని అంగీకరింపవలసి వచ్చును. అట్లైన జగత్తు బ్రహ్మమువలె నిత్య సత్యమైనదనియు నిర్వికారమైనదనియు చెప్పవలయును గదా? (శ్రీ అరవిందులు మొదలగువారు కొందఱు అట్లే చెప్పిరి). ఈ రెండును అసంగతములే. ఈ వాదము శ్రుతులకే గాక మన నిత్యానుభవమునకును విరుద్ధమగును. ఏలయన? జగద్బ్రహ్మలు (కారణకార్యములు) రెండును సత్యమైనను కావలెను. అసత్యమైనను కావలయును. కార్యకారణములు రెండును సత్యమే అయిన "అసత్య"మను వాక్యమే మనము వినియుండము. ఆ రెండును అసత్యమే అయిన "సత్య" శబ్దము శ్రవణగోచరమై యుండదు. జగత్తు పుట్టినదనిన ఇట్టి చిక్కు లనేకములు కలుగును. ఈ చిక్కులను విడదీయుటకు ఎవ్వరికిని సాధ్యపడదు. మన అనుభవమున కారణములేని కార్యము యొప్పగదు. కనుక జగదుత్పత్తికి కారణము లేనందున జగత్తు పుట్టనేలేదనిరి. అదియే "అజాత

వాదము". అని యిదివఱకే చెప్పియుంటిని. ఏవో కొన్ని యుక్తులు కూర్చుకొని జగత్తు పుట్టనేలేదని కనపడుచున్న జగత్తు మాటయేమిటి? లోకమున అందరికి పిచ్చిపట్టలేదు కదా! ఈ సమస్య యెట్లు పరిష్కారమగును? ఈ సమస్యను శ్రుతులును, శ్రీ శంకరులును సులభముగ పరిష్కరించిరి. ఎట్లనగా:—

పరబ్రహ్మము కంటెను వేఱనిగాని అది పరబ్రహ్మమే యనిగాని అనుటకు వీలులేనిదై ఉండునది, లేనిది, అని చెప్పుటకు వీలులేక (ఆకారణమున) అనిర్వచనీయమని చెప్పబడు పరబ్రహ్మము యొక్క శక్తియగు మాయయే అద్దమునందు నగరము కనపడునట్లు బ్రహ్మమునందే నామ రూపాత్మక జగద్రూపమును కనబడ జేయుచున్నది. వాస్తవముగ జగత్తు బ్రహ్మమునందే కనబడుచున్నను మాయా ప్రభావమున బయట నున్నట్లు కనబడుచున్నది. స్వప్నమున స్వప్నానుభవము పొందు పురుషుడు స్వప్న ప్రపంచము తన యందే యున్నను అది తనయందున్నట్లు యెంతమాత్రము తెలిసికొనలేక బయట ఉన్నట్లు తెలిసికొనుచున్నాడు. దీనికి కారణము అవిద్యయే. బయట జాగ్రదవస్థయందు కనపడు ప్రపంచమునకు మాయ కారణమైనట్లు స్వప్న ప్రపంచమునకు మాయ యొక్క అంశమగు అవిద్య కారణమైయున్నది. జగత్తు కనపడలేదని చెప్పుటలేదు. జగత్తు అసలే లేదని చెప్పరు. మాయవలెనే జగత్తు స్థితియు అనిర్వచనీయము. మసక చీకటియందు త్రాడును చూచి పామనుకొను విధమున అవిద్యావశమున బ్రహ్మమునే జగద్రూపమున చూచు

చున్నాము. వెలుతురు వచ్చినంతట త్రాడు పాముగా కనబడక త్రాడుగనే కనబడునట్లు అవిద్య నశింపగనే జగత్తు బ్రహ్మముగ తోచును. అంత పర్యంతము జగత్తు కనబడును. అనగా: జగత్తు వ్యావహారిక సత్యమే. ఇదియే శాంకర తత్త్వము (మతము).

అద్వైతులలో కొందఱు మాయను శ్రీ శంకరులు చెప్పిన నిర్వచనమును కొంత మార్చిరి. వేదాంతపంచదశి యందలి అద్వైత ప్రకరణమున నిట్లున్నది:—“ బ్రహ్మము నందుండు మాయాశక్తి బ్రహ్మమును ఆధారము చేసికొని జగత్కల్పనము చేసియున్నది. మాయాశక్తి తనకాధారమగు బ్రహ్మమునకంటెను, తన కార్యమగు జగత్తునకంటెను, వేఱైనది. ఇందులకు దృష్టాంతము—“ మట్టియందు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధము లనుధర్మము లున్నవి. ఆ మట్టియందొకశక్తి గలదు. ఆశక్తియొక్క కార్యము కుండ. శక్తి కుండకంటెను, మట్టికంటెను విలక్షణముగా నున్నది. ఎట్లన? కుండయందున్న లావు, గుండ్రము మొదలగు గుణములు శక్తియందు లేవు. కనుక శక్తి మట్టియును కాదు, కుండయును కాదు. ఈ రెండింటికంటె భిన్నమైనందున శక్తి అనిర్వచనీయము”! (వే. పం. 13వ ప్ర.)

శ్రీ శంకరులు చెప్పిన మాయయొక్క నిర్వచనమును యిదివఱలో 5వ అధ్యాయమున చెప్పియుంటిని. అదియే సరియైనది. పైన చెప్పిన పంచదశియందలి నిర్వచనము సరియైనది కాదు. ఏలయన? పంచదశియందే ఇందులకు భిన్న

ముగ 2-51, 52, 53 నందును 3-78 నందును చెప్పబడినది.*

శ్రుతులు సృష్టిక్రమమును చెప్పినవి గదా, అవి అబద్ధములా? అను సంశయము కలుగవచ్చును. శ్రుతులు ముముక్షువునకు బ్రహ్మబోధ చేయుటకు, బ్రహ్మాత్మైక్యమును అవగాహన చేసికొనుటకు సహాయకారిగా ఉండునని సృష్టిక్రమము చెప్పినట్లు పెద్దల అభిప్రాయము. అయినను "సృష్టికర్త సంకల్పించెను. "నేను అనేకమగుదును" అను నీ మొదలగు సంకల్పములు చేసినట్లు చెప్పు వాక్యములు, శ్రుతులు నిర్గుణ బ్రహ్మము నుద్దేశించి చెప్పినవి కావు. మాయా సంబంధమగు సగుణ బ్రహ్మము (ఈశ్వరు) నుద్దేశించి చెప్పినవి. ఈ అంశ మిదివరకే చెప్పియుంటిని. కనుక, శ్రీ శంకరుల మతమునకు కొట్టురాదు.

దృష్టి సృష్టివాదము బౌద్ధుల విజ్ఞానవాదమును ఖండించు సందర్భమున శ్రీ శంకరులు వారి భాష్యమున యేమి చెప్పిరో (బ్ర. సూ. 2-2-28) ఆ వాక్యములనె లోకమాన్య బాల గంగాధర తిలక్ మహాశయులు తమ గీతారహస్యమునందలి అధ్యాత్మ ప్రకరణమున పుట 304 నందు ఇట్లుదాహరించిరి :—

* పంచదశి పదునైదు ప్రకరణములను శ్రీ విద్యారణ్యులు వ్రాయలేదనియూ, అందు కొంత భాగము, బహుశః మొదటి ఆరు ప్రకరణములు, మాత్రమే వ్రాసిరనియూ, మిక్కిన భాగము నితరులు పూర్తి చేసిరనియూ పండితులయందు ఒక వాదమున్నట్లు నేను వినియుంటిని. కనుక 13వ ప్రకరణమునందలి శక్తి నిర్వచన వాక్యములు శ్రీ విద్యారణ్యులవి కావని అనుమానింప వలసియున్నది.

"జ్ఞానవ్యతిరిక్తమగు వస్తువే లేనియెడల కేవల జ్ఞానమే స్తంభము, గోడ, బల్ల మొదలగు రూపములతో కాన్పించుచు నేని ఒక జ్ఞానమే వివిధములగు భిన్నరూపముల నేల గోచరించుచున్నది? అని ప్రశ్నించిరి. అదిగాక మన నిత్యానుభవమునందు జ్ఞాన మొక్కటే వివిధరూపముల నున్న యెడల "నేనే స్తంభముగా నున్నాను. నేనే గోడగా నున్నా"నని సర్వజ్ఞానములు వస్తుచ్ఛబ్ద పూర్వకముగనే యుండవలసి వచ్చును. కాని యట్లుగాక నేను వేఱగుటచే నాకంటె స్తంభమును, గోవు మొదలగు పదార్థములు వేర్వేరుగ నున్నవని యుండుటకును బ్రతీతి యుండుటచే, ద్రష్టయొక్క మనస్సునం గలుగు సర్వజ్ఞానములకు నాధారభూతమగు బాహ్యసృష్టి యుండి తీరవలయును, బాహ్యమగు నేదైన నొక స్వతంత్ర వస్తువుండవలయును" అని శంకరుల వారు సిద్ధాంతీకరించి యున్నారు." (గీ. ర. పుట. 302) శ్రీ లోకమాన్య తిలక్ గారి యొక్క సిద్ధాంతము కూడ యిదియే. ఇంతకంటెను అధికముగ యీవిషయమున నేను చెప్పవలసిన దేమియు లేదు.*

—: అనుభవ విచారము :—

జిజ్ఞాసువు :- శ్రీ జ్ఞానదేవులు, శ్రీ అరవిందులు, శ్రీ సమర్థులు, యోగ వాసిష్ఠకారులు వీరియొక్క శాస్త్రీయ సిద్ధాంతములయందు కొన్ని భేదాభిప్రాయము లున్నవి.

*ఇంకను విస్తరించి తెలిసికొనఁ గోరువారు ఈగ్రంథము 3_4_24 "అద్వైతి విజ్ఞాన వాది సంవాదమును" చదువఁగలరని మనవి.

ఐనను వీరి అనుభవము కూడ భిన్నముగా నుండునా? లేక ఒకవిధముగనే యుండునా ఆనతిండు.?

వేదాంతి :- అనుభవమును గురించి అడిగితివి. బ్రహ్మ వస్తువే అనుభవము. వ్యావహారిక జగత్సంబంధమైన అనుభవము ఆయా వ్యక్తులనుబట్టి భిన్నభిన్నములుగా నుండును. వారివారి అనుభవములు (అంతఃకరణ వృత్తులు) యిట్టివని చెప్పుట కష్టము. అలౌకికమగు పారమార్థిక విషయమున ఏమతమునకు, ఏ సంప్రదాయమునకు సంబంధించిన వారైనను, వారి శాస్త్రీయ సిద్ధాంతము ఎట్టిదైనను బ్రహ్మానుభవమును పొందియుండిన ముక్తపురుషుల అనుభవమునందు భేదముండదు. వారి అనుభవము ఒక్కరీతిగనే యుండునని నా యభిప్రాయము. అనుభవజ్ఞులగు మహనీయులు వ్రాసిన గ్రంథములయందలి వారి వాక్యములనుబట్టి వారి అనుభవమును మన మూహింపవచ్చును. నీవు నన్నడిగిన పై నలువురు వ్రాసిన గ్రంథములను బట్టి వారి శాస్త్రీయ వాక్యములయందు భేదము కనపడుచున్నను, అంతటి పరమార్థము ఒక్క రీతిగా నున్నట్లు నాకిద్ధమైనందున వారి అనుభవమునందు తరతమ భేదముండునని తలచితిని. అనగా :— జ్ఞాన భూమికలు నీకు తెలియునుగదా?

శ్రీ జ్ఞానేశ్వర సంప్రదాయమునకు చెందిన పెద్దలు తాము మాత్రము అద్వైతులము కామనియు, అరూప బ్రహ్మవాదులమనియు, తమ సిద్ధాంతము 'ఆత్మానుభూతి' యనియు, చెప్పుదురు. అరూప బ్రహ్మమునే నివృత్తియోగిక బ్రహ్మమని యందురు. ఈ విషయమై ముందు అచల వాద

మును గుఱించి చెప్పు సందర్భమున చెప్పుదును. పై నలువురయందును శ్రీ సమర్థులవారు వ్రాసిన కొన్ని వాక్యముల వలన వారికి పరిపూర్ణానుభవము కలదా యను సంశయము కలుగుచున్నది. దానిని వేఱొకచోట చర్చింతును.

మన అనుభవమునుబట్టి శ్రీ శంకరాదుల తత్త్వములను విచారింతము. మనకు గాఢ నిద్ర కలుగుచున్నది. దానిని శ్రీ శంకరులు అవిద్యయనియు, అజ్ఞానమనియు వచించిరి. ఆ శబ్దముల ఉచ్చరించుటకు శ్రీ జ్ఞానేశ్వరుల కిష్టము లేదు. వారి తత్త్వము ననుసరించి సుషుప్తియే శివుడనుకొందము. సుషుప్తియందే స్వప్నము (జ్ఞానము) కలుగుచున్నది. అదియే జాగ్రద్రూప మగుచున్నది. శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పిన దేమి? శివునియందంతర్లీనమై యున్న విమర్శశక్తియే జ్ఞానము. "చిద్రూపిణియగు శక్తి తన పతియగు శివునకు భూషణాంబరముల ధరింప జేసినది" అనగా నామరూపములు లేని శివుని యందు నామరూపములు కల్పించినదని యర్థము. జగత్తు గోడ లేని చిత్తరువు వంటిదిగా కనపడును. శివశక్తుల యందు నే యొకరినైనను చూడవలయు నన్న, ఒకరిని మూసివేసి ననే గాని యింకొకరిని చూడ లేమనిరి. స్వప్న జాగారముల యందేదియున్నను శక్తిని చూచుచున్నామని భావింపవలయును. ఆస్థితియందు సుషుప్తి రూపుడగు శివుడు గోచరింపడు. శివుని (సుషుప్తిని) చూచుచుండగ జ్ఞాన రూపిణియగు శక్తి కనపడ దనిరి. శక్తి శివునియందు ప్రేమ చూపినపుడు ఆయన యందు లీనమగు ననగా — అప్పుడు శివుడు (సుషుప్తి) మాత్రమే గోచరించును. మనము లోకమున వస్తువును

చూచుట లేదు. వస్తువు యొక్క గుణములు మాత్రమే తెలిసి కొనుచున్నాము. వస్తువే శివుడు. నామరూపాది గుణములే శక్తి. శివ శక్తు లిరువురు మేల్కొనియుందు రేని అప్పుడు వారిరువురు లేనివారే (అను. 1-14) యనిరి. అనగా: అదియే తురీయావస్థ (సమాధి). ఆస్థితియందు శుద్ధ జ్ఞాన రూపమగు ఆత్మయే మిగులునని భావము. అదియే అనుభవము.

శ్రీ జ్ఞానేశ్వరుల వారి అనుభవము వారి యీ క్రింది వాక్యములవలన తెలిసికొనవచ్చును.

"మఱియు న య్యాత్మ నైజస్థితి ద్రష్టయు, దృశ్యం బును నను నయ్యుభయ విషయంబులు వినష్టంబై పునరుత్ప న్నంబగు నమ్మార్గంబునం జెల్లం దుచుండునని సారాంశం బగు" (అను. 7-185). వీరు చెప్పిన ఆస్థానము చిదాకాశమే; అదే పరబ్రహ్మము.

వీరు స్వాభావిక భక్తి రహస్యమును గుఱించి అనుభవామృతము (అమృతానుభవము) తొమ్మిదవ ప్రకరణమున నిట్లు చెప్పిరి:—

"తరు వనునది ఫల పత్ర సుమాద్యాకారంబునం బెంపొందుచుండినను నందుఁ దరు పదార్థంబు గాక అన్యం బెద్దియు గాన రాకుండు". (అను. 9-43)

ఈ భావమునే వేఱొక విధముగ మఱియొక చోట నిట్లు చెప్పిరి:—ఒక పర్వతమువంటి యొక శిల గలదు.

దానియందు ఒక శిల్పి గొప్ప దేవాలయమును నిర్మించెను. ఒకే ఱాతియందు ప్రాకార, గోపుర, కళ్యాణమండప గర్భాలయాదులనే గాక ద్వారపాలకులను, గర్భ గుడి యందలి దేవతా విగ్రహమును పూజారిని, పూజా ద్రవ్యాదులనుకూడ ఆ యేకశిలయందే నిర్మించెను. దేవాలయమునందలి ప్రాకారములకు ఒక్కొక్కదానికి ఒక్కొక్క నామము ఒక్కొక్క రూపము గలదు. ఈ నామరూపములన్నియు వ్యావహారికమేగాని వాస్తవముగ అచ్చట ఉన్న సమస్తమును ఒక్క శిలయే. ఆశిల తప్ప అన్యమేమియును లేదు. "ఇతడు దేవుడు", "ఇతడు అర్చకుడు", "ఇవి పూజా ద్రవ్యములు" అని చూచువారు చెప్పుకొందురేగాని, "ఇది శిల", "ఇదియు శిలయే", "అదియు శిలయే" అని చెప్పుకొనరు. ఇది అనుభవ సిద్ధమే కదా? సర్వము బ్రహ్మమయముగా చూచు ముక్తపురుషుడు దేవాలయాదులన్నియు శిలయే యని చూచినట్లు ప్రపంచమును బ్రహ్మముగా చూచును. శ్రీ జ్ఞానదేవులు తమ అనుభవ మిట్టిదని చెప్పిరి. ఇట్టి అనుభవమునే శ్రీ శంకరాచార్యులవారు బాహ్య సమాధియనియు మునుపు చెప్పిన చిదాకాశమును నిర్వికల్ప సమాధి యనియును చెప్పిరి. ఈ విషయమును నే నిదివఱలో చెప్పియుంటిని.* అయినను ఇచట కొన్ని వాక్యములు చెప్పెదను.

* ఈ గ్రంథముయొక్క ద్వితీయభాగము ప్రథమ ప్రకరణమున (౩౫) సమాధి అను అధ్యాయమున యీ విషయము చెప్పియుంటిని.

శ్లో॥ దేహాభిమానే గళితే విజ్ఞాతే పరమాత్మని,
యత్ర యత్ర మనో యాతి తత్ర తత్ర సమాధయః. (దృ. వి. 32)

తా. దేహాభిమానము నశించి సర్వము బ్రహ్మమే యను దృఢ నిశ్చయము కలిగిన పిమ్మట మనస్సు ఎచ్చటెచ్చటికి పోవునో అచ్చటచ్చట అప్రయత్నముగ సమాధి యగుచుండును.

ఇదియే బాహ్యసమాధి. సర్వమును బ్రహ్మముగా చూచుట దీని లక్షణము. అంతర సమాధి (నిర్వికల్ప సమాధి) శ్రవణ, మనన, నిధిధ్యాసలచేత సిద్ధించునది ఇదియే చిదాకాశము.

శ్రీ జ్ఞానేశ్వరులు సమస్తము సత్పదార్థముగు ఆత్మయే యనిరి. అదియే పరిమళమును నాసికయు దాని యనుభవమును అనిచెప్పిరి. అట్లే పంచేంద్రియ వృత్తులు యింద్రియములు. ఇంద్రియముల చేత తెలియబడు విషయములు సమస్తమును ఆత్మయే యనిరి. (అను. 9. ప్రకరణము).

వెనుక మనము విజ్ఞానవేత్తలు (Scientists) చెప్పిన విషయములు స్మరించితిమి. ఆవిధముగ చూచినను విశ్వమున కనబడుచుండు నానావిధ నామరూపాత్మక ద్రవ్యరాశి యంతయు ఛేదించిన అణువులగుననియు, అణువులు సయితము విభాజ్యమై పరమాణువు లగుననియు, అప్పుడు నామరూపముల ప్రసక్తియే లేక శక్తిమాత్రమే యుండుననియు తెలిసికొని ఆశక్తిసహితము అంతర్ధానమగునని చెప్పిరి. భారతీయ తత్త్వవేత్తలు "శక్తి అంతర్ధాన మయినదని" చెప్పుటకు మారుగ శక్తి శివునియందు లీనమగు"నని చెప్పుదురు.

ముముక్షువు పై వాదముల అన్నింటియొక్క పర్యవసానమునందు భేద మణుమాత్రమైనను లేదని నిశ్చయించుకొని సమస్తమును శక్తి (అణు సముదాయ) రూపమే, లేక పరమాత్మయే యిందులో 'నేను', 'నీవు', 'నాది', 'నీది' అనునది కేవల మిథ్యా విషయమే అను నిశ్చయము నకు రావలెను. కేవలము నిశ్చయమునకు వచ్చుటే గాదు, ప్రతిక్షణమునందు యీ భావమును మరువక జ్ఞప్తియం దుంచుకొనవలెను. శత్రువులు, మిత్రులు ఉదాసీనులు భార్యా పుత్రాదులు సర్వులు యేక వస్తువుయొక్క భిన్న రూపములే యని శ్రీ జ్ఞానదేవులు చెప్పిన దేవాలయ స్వరూపమువలె దేవుడు సర్వతము నావలనె వ్యక్తైక సర్వదార్థమే యను భావము బుద్ధియందు పూర్ణముగ నిండి ప్రతిరక్త బిందువు నందును, దేహము నందలి ప్రతి అణువునందును ఆ భావము వ్యాపించువరకు భావన చేయవలయును. అట్టివారికి శత్రు మిత్ర ఉదాసీనాది భావము లేశమైనను కలుగజాలదు. విశ్వ మంతయు శివశక్తి స్వరూపమే యనియు, శివ శక్తు లిరువు రుగా తోచు పరమాత్మయే యను భావన కలుగుటయే బంధవిచ్ఛేదనము.

—: అఖండాకారవృత్తి - అఖండైకరసము :—

శ్రీ జ్ఞానేశ్వరులు ముక్తికిని ఆత్మానుభూతికిని భేదము కలదనిరి. అఖండాకార వృత్తి రూప జ్ఞానానుభవమును ముక్తియనియు, అఖండైకరసానుభవమును ఆత్మానుభూతి యనియు, శ్రీ జ్ఞానేశ్వరుల యొక్కయు, వారి అనుయాయుల యొక్కయు తాత్పర్యమై యున్నది. అఖండాకార వృత్తి

యొక్క అనుభవము ఇట్టిదనియు, అఖండైక రసానుభవము ఇట్టిదనియు ముందు వివరించెదను. శ్రీ జ్ఞానేశ్వరు లిట్లు చెప్పిరి :—

"మఱియు ముక్తి విషయంబు మనోహరంబై యొప్పుచుండినను నాత్మానుభూతి యనునది మిగుల నిర్మలంబై యత్యంత మధురంబై వెలయుచుండుటం జేసి శాశ్వత ముక్తి విషయం బేనియుఁ దదీయంబగు మాధుర్యంబును గ్రోలుచుండుటకునై తీవ్రాభిలాషంబుఁ గల్గియుండెడిని". (అను. 10-20) అభిలాష కలవాడు ముక్తుడు కాడు. అభిలాష యనగా కోరిక లేక కామము. కోరిక చేత కట్టబడినవాడు బద్ధుడు. బద్ధుడు ముక్తు డెట్లగును?

శ్రీ జ్ఞానేశ్వరులు ముక్తి సహితము బంధమే అనిరి. ముక్తి బంధమైనట్లయిన దానిని "బంధము" అనక "ముక్తి" యని యేల అనవలెను? ముక్తి అనగా - విడుపు. విడుపు బంధ మెట్లగును?

శివ సూత్రముల యందు "జ్ఞానం బంధః" "జ్ఞానము కూడ బంధమే" అని ఉన్నది. కనుక, జ్ఞానము వలన లభించిన ముక్తి బంధమని వారి భావమై యుండును. కాని "జ్ఞానం బంధః" అను సూత్రమునకు జ్ఞానేశ్వరులవారు చెప్పిన అర్థము సరికాదని వీరశైవులు యీ క్రింది వివరించిన అర్థమును చెప్పెదరు. "సిద్ధాంతశిఖామణి" యందిట్లున్నది :—

శ్లో॥ పరస్పర సమాపేక్ష భావాభావ వివేచనం
జ్ఞానం బ్రహ్మణి యన్నాస్తి జ్ఞానశూన్యస్థలం విదుః, (20-54)

తా, ఒండొంటి యపేక్షతోఁ గూడిన, ఉన్నది - లేదు - అనెడి భావాభావముల భేద జ్ఞానము పరబ్రహ్మ స్వరూపుడైన యే శివయోగియందుండదో, అట్టివాని భేద జ్ఞానశూన్యతను ప్రతిపాదించు స్థలమును “జ్ఞానశూన్య స్థల” మందురు. “జ్ఞానం బంధః” అనెడి శివ సూత్రమందలి జ్ఞాన పదమునకు భేదజ్ఞానమని తెలియునట్లు యిక్కడను జ్ఞాన శూన్య స్థలమనెడి పదమునకు భేదజ్ఞాన శూన్య స్థలమని తెలియవలయును”.

శ్రీ జ్ఞానదేవులు ముక్తికంటెను ఆత్మానుభూతి గొప్పదని చెప్పుట ప్రరోచన వాక్యములని చెప్పవచ్చును.

శ్రీ జ్ఞానేశ్వరుల అనుయాయులు శ్రీ శంకరానుచరులకు అఖండాకార వృత్తివఱకే వారి యనుభవమనియు, ఆపైన నుండు అఖండైక రసానుభవము వారికి (అద్వైతులకు) లేదు” అనియు చెప్పుదురు. ఇట్లు చెప్పుట పొరపాటు. అన్వయవ్యతిరేకముల చేత ఆత్మానాత్మజ్ఞానము కలుగుచుండగ తత్త్వమస్యాది మహావాక్య శ్రవణమువలన సర్వ సంసారబంధ నివర్తకమయిన అఖండైక రస ప్రత్యగభిన్న పరమాత్మ స్వరూప జ్ఞానము కలుగుననియు, అట్టి అనుభవమే అఖండైక రసానుభవమనియు అద్వైతానుభవము పొందిన పెద్దలు చెప్పియున్నారు. అఖండాకారమగు వివేకము (సంయక్ జ్ఞానము) బుద్ధివృత్తిగా కనుక అట్టిది అఖండైక రసమునకంటె తక్కువ స్థితి యని అంగీకరించినను, అఖండాకార వృత్తి సిద్ధించిన అతనికి ఆ యనుభవము అంతటితో ఆగక ఆవెంటనే వృత్తి(బుద్ధి) కూడ నశించి నిర్వికల్ప సమాధి

సిద్ధించును. బుద్ధి వృత్తి నశించినపుడు మిగిలియుండునది ప్రత్యగాత్మయే. అదియే అఖండైకరసము.

ఒకసంప్రదాయమునకు చెందినవారు తమ సంప్రదాయమునకు చెందిన సిద్ధాంతమే యితర సంప్రదాయములకు చెందినవారి సిద్ధాంతములకంటె శ్రేష్ఠమని చెప్పుకొనుట లోకమున పరిపాటి యైయున్నది. ఉదాహరణమునకు :— ఆగ్రాలో — దయాళ్ భాగ్ - రాధాస్వామి సత్సంగమునకు చెందినవారు తమకు మాత్రమే సద్గురువు లభించెననియు, శ్రీ జ్ఞానేశ్వరులకును వారి సంప్రదాయమునకు చెందినవారికిని సద్గురువు లభింపని కారణమున వారికి యథార్థజ్ఞానము కలుగలేదనియు చెప్పిరి. వారి వాక్యము లివి :—

“వేలకొలది బ్రహ్మలు వేలకొలది గోరఖులు వేలకొలది నాథులు వేలకొలది ప్రవక్తలు తృష్ణాగ్నిలో బడి దహించుకొని పోవుచున్నారు, ఏలయన వారికి సద్గురువు లభించలేదు.* (సారబచన్ II పుట 156)

---

*‘సారబచన్’ II 156వ పుట, పాదభూమిక (Foot Note) యందు యీ క్రింది వాక్యములు వ్రాసియున్నవి :—

“1. గోరఖనాథు 15వ శతాబ్దములో జీవించియున్న యొక సుప్రసిద్ధ సన్న్యాసి.

2. గోరఖనాథుని గురువగు మత్స్యేంద్రనాథుడుకూడ నొక సుప్రసిద్ధ సన్న్యాసి. ఆయన అనుయాయులను ‘నాథుల’ని పేర్కొందురు” అని యున్నందున “నాథులు” జ్ఞానేశ్వరులవారి గురువులే యనుటకు సంశయము లేదు.

ఎంత ఆశ్చర్యమో చూడుడు. వేలకొలది బ్రహ్మలకు సయితము సద్గురువు లభింపలేదట. నాథుల సంగతి చెప్పవలసిన దేమున్నది. ఇచట "నాథులు" అనగా: శ్రీ జ్ఞానదేవుని గురు పరంపరకు చెందినవా రనుట విదితమే గదా? బ్రహ్మలకు సద్గురువు లభింపలేదని వీరి కెట్లు తెలిసినదో?

ఈ సందర్భమున యోగవాసిష్ఠమునందలి యీ శ్లోకము స్మృతికివచ్చుచున్నది.

శ్లో. మోక్షేతు నాన్యథా ప్రాప్తిరితి భావిత చేతసః,
స్వాం దృష్టిం ప్రతిబింబంతి స్థితాః స్వ నియమభ్రమైః.
(యో. వా. 4.21, 25)

తా. భిన్న భిన్న మతములవారు తాము చెప్పునట్టి యుపాయముచేతనే తప్ప మఱియొకరు చెప్పు నుపాయము చేత మోక్షము కలుగనేరదని నిశ్చయించి తాము కల్పించుకొన్న నియమమను భ్రమచే నితరులు చెప్పిన యుపాయములను త్రోసివేసి తమ సిద్ధాంతమే శ్రేష్ఠమని లోకులకు బోధించుచుందురు.

జిజ్ఞాసువు :- అయ్యా! అఖండాకారవృత్తి యనగా నెట్టిది? అఖండైకరసమనగా నెట్టిది? ఈ యనుభవముల తారతమ్యమేమి?

వేదాంతి :- నీ ప్రశ్నమునకు సమాధాన మిదివఱకే చెప్పితిని. అయినను బోధదార్ఢ్యము కొఱకు మఱల చెప్పెదను:—శ్రవణ, మనన, నిధి ధ్యాసల వలన బ్రహ్మజ్ఞాన రూపమైన చరమవృత్తి కలుగును. బ్రహ్మజ్ఞానమనగా :—

అఖండాకార బుద్ధి వృత్తియే గాని (పర)బ్రహ్మస్వరూప జ్ఞానము కాదు. ఉప్పుకల్లునందు ఉప్పదనముతప్ప అన్యరసము లేనట్లు (పర)బ్రహ్మస్వరూప జ్ఞానమునందు జ్ఞానముతప్ప వృత్తులేవియు లేవు. అందువలన (పర)బ్రహ్మస్వరూప జ్ఞానముకంటె (పర)బ్రహ్మజ్ఞానము తక్కువ. బ్రహ్మజ్ఞానమే పైన చెప్పిన అఖండాకారమగు వివేకము లేక, జ్ఞానము ఇది కలుగగనే యిది యితరవృత్తుల నన్నింటిని (ద్వైతమును) నశింపజేసి ఇదియును నశించును. ఎట్లన :— అగ్ని కర్పూరమును నశింపజేసి తానును నశించున ట్లని అర్థము. ఇట్లు బ్రహ్మజ్ఞానము (సంయక్ జ్ఞానము) ద్వైతమును నశింపజేయగా మిగిలియుండునది అద్వితీయాఖండ పరబ్రహ్మమే. ఆబ్రహ్మమునే ప్రత్యగాత్మయని యందురు. అఖండాకార వృత్తిని పొందిన పెద్దలు తప్పక అఖండైకరసానుభూతిని పొందుదురు, అద్వైతులకు అఖండైక రసానుభవము లేదనుట తప్పు.

జిజ్ఞాసువు :- ప్రత్యగాత్మ యంటిరిగదా ? ఆ శబ్దార్థమును వివరింపుడు.

వేదాంతి :- ఇదివరకు జ్ఞానయోగమును చెప్పినపుడు* యీ యర్థమును చెప్పియుంటిని. ఇప్పుడు నీవడిగిన ప్రశ్నమునకు సూటిగా సమాధానము చెప్పెదను. పెద్దలు ప్రత్యగాత్మనే అఖండైకరసమందురు. ప్రత్యగాత్మ యనగా "ప్రతీపం దేహేంద్రియాది వైలక్షణ్యం అంచతీతి ప్రత్యక్ "

* ఈ గ్రంథముయొక్క ద్వితీయ భాగము I ౨౫, ౨౬ అధ్యాయములు చిత్తగింపుడు.

అని వ్యుత్పత్తి. కనుక జడమైన దేహేంద్రియాదుల కంటెను భిన్నమై (అజడమై)నందున విలక్షణ వస్తువు "ప్రత్యక్" అనబడును. భేదరహితమై స్వయంప్రకాశరూపుడైన ఆత్మనే ప్రత్యగాత్మ అందురు. ప్రత్యగాత్మ నిత్యనిర్వికారమైన చైతన్యమే, (జ్ఞానమే), స్వభావముగాగలిగి సమస్త దేహాదులయందు ఒక్కడే సర్వదా ప్రకాశించుచున్నాడు. ఇతని ప్రకాశమునకు సంకోచమనునది లేదు. కనుక, ప్రత్యగాత్మ యందు జ్ఞానప్రత్యక్త్వములకు భేదము లేదు. అనగా: ఏది జ్ఞానమో అదియే ప్రత్యక్త్వము. ఏది ప్రత్యక్త్వమో అదియే జ్ఞానము. ఇచట వ్యభిచారము కలుగదు*. అనగా: జ్ఞానమును విడిచి ప్రత్యక్త్వముగాని, ప్రత్యక్త్వమును విడిచి జ్ఞానముగాని ప్రకాశించుట లేదని తాత్పర్యము.

బుద్ధి జడమైనది. అగ్నియందుంచబడిన యినుపకడ్డీకి అగ్ని ధర్మములు కలుగునట్లు జ్ఞానస్వరూపుడగు ప్రత్యగాత్మ సాన్నిధ్యముచే బుద్ధికి జ్ఞాన-ప్రత్యక్త్వములు కలుగుచున్నవి. అవి ఆగంతుకములు. ఇచట అవి బుద్ధియొక్క ధర్మములు (బుద్ధియొక్క స్వరూపము కాదని అర్థము) ఇచట బుద్ధి ధర్మియనియు జ్ఞాన-ప్రత్యక్త్వములు బుద్ధియొక్క ధర్మములనియు చెప్పుటచేత ధర్మి ధర్మ భేదము కలుగుచున్నది. ఇట్టి భేదము ప్రత్యగాత్మయందు లేదు.

బుద్ధికి ప్రత్యక్త్వము యేలాగున చెప్పవచ్చుననగా - బుద్ధి జడమైనను దేహేంద్రియాదులలో కొన్నింటికంటె అంత

---

*"వ్యభిచారము" = ఒకటి యున్నపుడు మఱియొకటి లేకపోవుట యని వేదాంత పరిభాష.

తరమై యున్నందునను, ఆత్మప్రతిబింబమగు చిదాభాసుడు బుద్ధియందే యున్నందునను దేహేంద్రియాది సంఘాతమున కంటె బుద్ధికి ప్రత్యక్త్వము చెప్పవచ్చును. బుద్ధి ఘటాది విషయాదుల ప్రకాశింపచేయుచున్న వృత్తులను పుట్టించుటచే బుద్ధికి జ్ఞాతృత్వము కలుగుచున్నది. ఈవిధముగ బుద్ధికి ప్రత్యక్త్వము, జ్ఞాతృత్వము కలిగినది. కాని బుద్ధికిగల యీ జ్ఞాతృత్వము ఔపాధికము. ప్రత్యగాత్మకుగల జ్ఞాతృత్వము నిరుపాధికము. ఈ రెండింటి భేదమును తెలియచేయుటకు శ్రీ సురేశ్వరాచార్యులు చక్కని యీ క్రింది దృష్టాంతమును చెప్పియున్నారు.

"తిష్ఠతి" = నిలిచియున్నది, అను వ్యవహారము "పర్వతములు నిలిచియున్నవి" "వృక్షములు నిలిచి యున్నవి" అనునపుడు అవి సర్వకాలముల యందును నిలిచియే యున్నవి. నిలిచియుండుట వాటి స్వభావము. ఒకప్పుడును అవి నడచుటలేదు. వృక్షములయందు ఉపయోగించిన "తిష్ఠతి" (నిలిచియున్నవి) అను వ్యవహారము అవి యొకప్పుడు నిలిచియుండును మఱియొకప్పుడు నడచుచుండును; నిలిచియుండుట వాటి స్వభావము కాదు. కనుక "ప్రత్యగాత్మ తెలిసికొనుచున్నాడు" అనునప్పుడు జ్ఞాన క్రియను (ఉపాధిని) బట్టి ప్రవర్తించినదికాదు. ఇచట "జ్ఞా" ధాత్వర్థమే వివక్షితము. బుద్ధియందు జ్ఞాతృత్వము జ్ఞానక్రియాకర్తృత్వము.

అఖండాకారవృత్తియనిన బుద్ధికలదని భావింపవలెను. వృత్తి బుద్ధి స్వరూపమేకదా? ఇచట బుద్ధి ఆత్మ

రూపమును పొందుచున్నది. కనుక "నేను బ్రహ్మమే అయి యున్నాను" అను తలంపు కలుగుచున్నది. ఆ అనుభవము కలిగినపిమ్మట యెట్టి ప్రయత్నము లేకయే ఆతలంపు సయితము నశించి అఖండైకరసానుభవమును ప్రత్యగాత్మ శోభించుచున్నది.

అద్వైతులు ఒకకథ చెప్పుదురు:—ఆటవికు డొకడు చెట్లో పసిపాపడగు ఒక రాజపుత్రుని దొంగలించుకొని పోయి వానిని పెంచి పెద్దవానినిగ చేసెను. ఆరాజకుమారుడు తాను ఆటవికుడననియే తలచెను. రాజపుత్రుని దొంగలించి తెచ్చిన ఆటవికునకు మరణకాల మాసన్నము కాగా, రాజువద్దకుపోయి బాలునిచూపి "యితడు మీకుమారుడు పసిపాపడై యుండు సమయమున నేను ఇతనిని దొంగిలించితిని. అని కొన్ని నిదర్శనములు చూపెను. ఆ నిదర్శనములు చూచి రాజు వాని మాటలను నమ్మెను. రాజకుమారుడు తాను ఆటవికుడను కానని రాజపుత్రుడనని అమితానందము నొందెను. కొంత కాల మట్లు తలంచెను. కాని అతని జీవిత కాలమంతయు "నేను రాజపుత్రుడను" "నేను రాజపుత్రుడను" అని జపముచేయలేదు. అట్లే "తత్త్వమసి" అదినేనై యున్నాను. అను బుద్ధివృత్తి నిరంతరము అట్లే యుండదు. "తత్త్వమసి" "తత్త్వమసి" అని ముముక్షువు జపము చేయుచుండడుగదా? కొంత అనుభవము కలిగిన పిమ్మట 'తత్త్వమసి' అను భావనకూడ మరచి కేవల స్వస్వరూపమునందే నిలిచియుండును. అదియే ప్రత్యగభిన్న బ్రహ్మస్వరూపమగు తురీయాతీత మనియు, అఖండైకరసమనియు అస్పర్శయోగమనియు చెప్పుదురు. అఖండాకార వృత్తిగల

వానికే అఖండైక రసానుభవము సిద్ధించును. అది సహజమై యుండును. ఆస్థితియందు సాధన యేమియు లేదు యోగి తురీయమును పొందిన తరువాత పొందదగిన దేదియు నుండదు.

తురీయమును శుద్ధతుర్యమని మిశ్రతుర్యమని కొందఱు చెప్పుదురు. ఇందులో శుద్ధతుర్యమే తురీయాతీతమని చెప్ప వచ్చును. ఈవిషయమై ముందు మఱియొక సందర్భమున చెప్పెదను.

“తుర్యావస్థ నొందిన శివయోగికిఁ ప్రమాణమును లేదు తెలియఁదగినదియు లేదు. తెలియఁదగిన సాధనమును లేదు.” అనివీరశైవ సిద్ధాంతము (సి. శి. 20-21)

తురీయాతీత మొకటి కలదు గదా, దానిని పొంద వలదా? యనిన తురీయ తురీయాతీతములకు భేదము లేదు. అయినను కొందఱు ఒక ఆక్షేపణ చేయుదురు. అఖండాకార వృత్తియందు సజాతీయ విజాతీయ భేదము నశించియుండినను స్వగతభేదము నశించియుండదు. కనుక ముక్తియు ఒకవిధ మగు బంధమే యగును. స్వగతభేదమనునది సాకార సావ యవ పదార్థమునకే కలదుగాని నిరాకార నిరవయవ వస్తువు నందు లేదని నాసమాధానము. ఘటాకాశ మహాకాశము లకు స్వగతభేదము కలదా? కనుక యీ ఆక్షేపణ సమంజస మైనది కాదు. సర్వసంసారబంధనివర్తకమైన అఖండైకరస ప్రత్యగభిన్న పరబ్రహ్మస్వరూపానుభవము తత్త్వమస్యాది మహావాక్య శ్రవణము వలననే కలుగును. కనుక ఆత్మైక్య బోధకలిగిన పిదప సమస్తభేదములు నశించును. శ్రీ జ్ఞానేశ్వ రులు మొదలగు అధ్యాత్మ జ్ఞాన సంపన్నులగు మహాత్ములు

శాస్త్రీయ సిద్ధాంతములకు సంబంధించిన కొన్ని యంశముల యందు పరస్పర మేకీభవింపకున్నను, వారు వచించురీతిని వారు అనుభవము పొందియుండిరేని అందఱి యొక్క అనుభవము ఒక్కటిగనే యుండును. భేదముండదని నావిశ్వాసము. కనుక మనమును వారి అనుభవమును మాత్రమే మనమునం దుంచుకొని అట్టి అనుభవమును పొందిన మహాత్ములు మనకు ప్రసాదించిన అమృతమును మనము పానము చేయుదము గాక. మనకు మార్గమును సుగమము చేసిన శ్రీ జ్ఞానదేవాదులకు భక్తిపూర్వకముగ ప్రణామములాచరించి యింతటితో యీప్రసక్తి విరమించి ముందునకు సాగి పోవుదము గాక.—

శ్లో॥ నమశ్శివాభ్యాం పశుపాలకాభ్యాం
జగత్త్రయీరక్షణబద్ధహృద్భ్యాం
సమస్త దేవాసుర పూజితాభ్యాం
నమోనమ శ్శంకర పార్వతీభ్యాం

ఇది పరమేశ్వరానుగ్రహమువలన మఱ్ఱిబోయిన రామ
సుబ్బయ్యచే రచియింపబడిన "బ్రహ్మజిజ్ఞాస"
చతుర్థభాగమందలి "శివుడు - శక్తి" అను
మొదటి ప్రకరణము, సంపూర్ణము.
ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

బ్రహ్మ జిజ్ఞాస

చతుర్థ భాగము

రెండవ ప్రకరణము : అచలబోధ

"నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
విశ్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం
భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి"

(౧) ఆరంభము

జిజ్ఞాసువు :- అయ్యా! మీ అనుగ్రహమున శ్రీ జ్ఞానదేవ మహారాజుగారియొక్కయు, శ్రీ అరవిందులయొక్కయు, శ్రీ సమర్థరామదాస స్వామివారియొక్కయు శివ - శక్తుల తత్త్వ మిట్టిదని వింటిని. శ్రీ శివరామ దీక్షితుల అచలబోధ యెట్టిదో అనుగ్రహించి తెలుపుడు.

వేదాంతి :- దీక్షితులవారి* అచల బోధను తెలిసికొనుటకు ముందు వినవలసినదంతయు వినియున్నావు. ఇప్పుడు అచలబోధ వినుటవలన అది ప్రస్థానత్రయమునకు సమ్మతమో, కాదో, గ్రహింపగలవు.

---

* ఈ గ్రంథమున "దీక్షితులు" లేక "దీక్షితులవారు" అనిన, అచల వేదాంతమత స్థాపకులగు శ్రీ రామడుగు శివరామ దీక్షితులని పాఠకమహాశయులు తెలిసికొనవలెనని మనవి.

(౨) దీక్షితులవారి కాలము - అచలబోధకు చెందిన సారస్వతము

దీక్షితులవారు "బృహద్వాశిష్ఠ సిద్ధాంతము" "శివరామ దీక్షితీయము" అను గ్రంథమును వ్రాసియున్నారు. వీరు తెలంగాణాలోని నల్లగొండజిల్లా నారాయణపురం కాపురస్థులు. బ్రాహ్మణకులజులు. "బృహద్వాశిష్ఠ సిద్ధాంత"* గ్రంథముయొక్క రెండవ సంపుటమున పేరి భక్తులు వీరి చరిత్రమును గద్య పద్యములతో వ్రాసి అచ్చువేయించియున్నారు. అది ఒక కట్టుకథవలె తోచుచున్నది. వీరి "చిత్రపటమును" గ్రంథాదియందు ముద్రించిరి. అది వీరి ఛాయాచిత్రము గాని, వీరి కాలమున లిఖింపబడినదిగాని కాదు. అది కేవలము ఊహాచిత్రమై యుండవచ్చును. ఆ చిత్రము కందిమల్లాయపల్లె వీరబ్రహ్మస్వాములవారి చిత్రమును పోలియున్నది. వీరబ్రహ్మస్వాములవారి చిత్రపటమని ప్రచారములో ఉన్నదిసహితము చిత్రకారుని ఊహాచిత్రమే.

దీక్షితులవారేకాలము వారైనది స్పష్టముగ తెలి

---

* బృహద్వాసిష్ఠమని వ్రాయునపుడు "వసిష్ఠ" నామమున మధ్యమ వర్ణము (సి) అనిగాని (శి) అనిగాని వ్రాయవచ్చునని శ్రీ కొన్నెంకంటి సుందరరామ శర్మగారు చెప్పియున్నారు. అయినను వారు ముఖ్యముగా పుంలింగమున "వసిష్ఠ"యని (సి) వర్ణమును, వాశిష్ఠము అను గ్రంథనామమున 'శి' వర్ణమును వ్రాసియున్నారు. అంత్యవర్ణమును 'ష్ఠ' అని వ్రాయవలయునేగాని 'ష్ట' అని వ్రాయకూడదు. శ్రీ శివరామ దీక్షితులవారి గ్రంథనామమున దానిని ముద్రించినవారు "బృహద్వాశిష్ట" అని వ్రాసియున్నారు. పుంలింగమగునపుడు కూడ 'వశిష్ట' అని వ్రాసియున్నారు. నేను సాధ్యమయినంతవరకు 'ష్ఠ' అని దిద్దికొని వ్రాసితిని.

యకపోయినను యీ క్రింది ఆధారముల బట్టి యిప్పటికి సుమారు రెండువందల సంవత్సరముల నాటి వారని యూహింపవచ్చును.—దీక్షితులవారి శిష్యులు కంబాలూరి అప్పారావుగారు. వీరి శిష్యులు పరశురామ సీతారామస్వామిగారు. వీరి శిష్యులు భాగవతుల కృష్ణదాసుగారు. వీరు తాము రచియించిన కందపద్యములయందు

భాగవత వంశభవుడను
భాగవతోత్తముల పాదపద్మంబులకున్
బాగిలి మ్రొక్కెడువాడను
భాగుగ నను జనులు కృష్ణభట్టందురిలన్. (కం. 21)

అని వ్రాసికొనియున్నను కృష్ణభట్లను పేరు వాడుకలో లేదు. వారి సంప్రదాయమునకు సంబంధించిన వారందఱు "కృష్ణదాసు" గారని పిలుచుచుండుటచే నేనును కృష్ణదాసుగారనియే యంటిని. కృష్ణదాసుగారు "శుద్ధ నిర్గుణతత్త్వ కందార్థసమువులు" అను గ్రంథమును శా. శ. 1765వ సంవత్సరమునందును, "తురాతురోపాధిద్వయ దోషరహిత పరమతత్త్వ కందములు" అను గ్రంథమును, శా. శ. 1784వ సంవత్సరమునందును రచియించినట్లు ఆగ్రంథములయందు చెప్పియున్నారు.

అనంతోపనిషత్తు* అచలబోధకు మూలగ్రంథమని

---

* అనంతోపనిషత్తు 1925వ సంవత్సరమున, బొగ్గరం - అత్తి నారాయణయ్యగారిచే - "అచల యోగులకు" అరణబూడిన వాక్యము నాప - మునుసామయ్యగారి యొక్కయు స్వానుభవానుగుణముగ ప్రతిపద టీకా తాత్పర్యము రచియింపబడినట్లును. "అచలయోగి" పత్తి త్యాగరాయసెట్టిగారు ముద్రించి ప్రకటించినట్లును కలదు. అనంతోపనిషత్తు ప్రతినే నే నా గ్రంథమున ఉదాహరించితిని.

యందురు. అదియును దీక్షితులవారు రచియించిన "బృహదాశ్విష సిద్ధాంతము"* కృష్ణదాసుగారిచే రచియింపబడిన పైన చెప్పిన కందార్థములు, కందములు - బాలారామ్ అను వారు రచియించిన "ద్విపదార్థపదములు", యీ సంప్రదాయమునకు చెందినవారు కొందఱు రచియించిన కీర్తనలు, మొదలగు గ్రంథముల వలన దీక్షితులవారి మతమిట్టిదని తెలియును.

జిజ్ఞాసువు :- అనంతోపనిషత్తు అష్టోత్తరశతోపనిషత్తులలోని దేనా ?

వేదాంతి :- కాదు. ఆగ్రంథమునకు టీక వ్రాసినవారు "'మహానారాయణోపనిషత్తు' యొక్క యంతర్భాగ

---

* బృహదాశ్విష సిద్ధాంత మను గ్రంథము పూర్వభాగమనియు, ఉత్తరభాగమనియు రెండు భాగములుగ నున్నది. పూర్వభాగమున 11 ప్రకరణములున్నవి. ఉత్తరభాగమున 6 ప్రకరణములున్నవి. ఉత్తర భాగమునందలి ప్రకరణములు అధ్యాయములుగ విభజింపబడినవి. ఇందు 1 నుండి 5 ప్రకరణములవఱకు ఒక్కొక్క ప్రకరణము నాలుగేసి అధ్యాయములుగను, 6వ ప్రకరణము మాత్రము 12 అధ్యాయములుగను విభజింపబడినది.

బ్రహ్మజిజ్ఞాసయందు బృహదాశ్విష సిద్ధాంతమునందలి వాక్యములనుదాహరించినపుడు పూర్వభాగమునకు "పూ" అనియు ఉత్తర భాగమునకు "ఉ" అనియును, ప్రకరణమునకు "ప్ర" అనియు, అధ్యాయమునకు "అ" అనియును సంకేతాక్షరములను, వాటిని సూచించు సంఖ్యలను నిడితిని. కొన్నిచోట్ల యుదాహరించిన వాక్యములకు ఆ యా పుటల సంఖ్య నిడితిని. ఆచట పుట అనుటకు మారుగ "పు" అను సంకేతాక్షరము నుంచియున్నాను.

మనునదియే ప్రస్తావంబున నుండెను ఈ యనంతోపనిషత్తు” అని వ్రాసిరి. ‘త్రిపాద్విభూతి మహానారాయణోపనిషత్తు’ అష్టోత్తరశతోపనిషత్తుల లోనిదే. కాని, అందులో యీ అనంతోపనిషత్తు లేదు. త్రిపాద్విభూతి మహానారాయణోపనిషత్తు నందు “త్వమేవ తురీయాతీతః త్వమేవ అనంతోపనిష ద్విమృగ్యః” (నీవే తురీయాతీతుడవు నీవే అనంతోపనిషత్తు చేత వెదుకబడువాడవు) అను వాక్యమున్నది. ఆయర్థము నాధారముగాగైకొని యెవరో అనంతోపనిషత్తను పేర మూడు మంత్రములును ముప్పదిమూడు శ్లోకములును గల గ్రంథమును రచియించి యుందురు.

(౩) దీక్షితులవారి గురు శిష్య పరంపర

దీక్షితులవారు, వారి గురు శిష్య పరంపరను గురించియు, వారి సంప్రదాయ రహస్యమును గురించియు వారిచే రచియింపబడిన బృహద్వాసిష్ఠసిద్ధాంతి మను గ్రంథమున నిట్లు చెప్పిరి:—

“శ్రీ కృష్ణస్వామికి తగ్గ గురువు సాందీపుడే*గాని, మరి వాకరు లేరు. సాందీపునకు వశిష్ఠునకు చాలా యెక్కువ తక్కువ వున్నది. గురుభావం శ్రీకృష్ణస్వామి అయిన శిష్యుడు యెరుగు. శిష్యునియొక్క ప్రభావం శ్రీధరస్వామి యెరుగు. యీ ముగ్గురు యొక్క ప్రభావం యీపుస్తకం వ్రాసినవారు యెరుగు .... .

* శ్రీకృష్ణ భగవానుని గురువు సాందీపుడని ఆచల వేదాంతుల గ్రంథములయందు కలదు. శ్రీమద్భాగవతాది పురాణములయందు “సాందీపని” అని యున్నది. “సాందీపుడు” అనిలేదు.

ఈ పుస్తకంచూచి చదువుకొన్నవారికి నలుగురి ప్రభావం .... తెలుస్తుంది. శ్రీఘ్రంగా భ్రాంతిలేనివాడు అయ్యి .... వుంటాడు. యీ అభిప్రాయం గురుముఖంగా విచారించినవారికి యే సిద్ధాంతం వుండదు. జ్ఞాన కర్మలయొక్క భ్రాంతి పుట్టదు. .... యింత కన్న యెక్కువ వున్నదని ఆశపుట్టదు. యీ శరీరమందు .... శరీరం లేనిది సూచన అయితే సర్వం శరీరం పాయ ".

(బృ. ఉ. ప్ర. 6-అ12)

"భగవద్గీత గుహ్యమైతే జ్ఞానేశ్వరులవారికే తెలుసు. శ్రీ భాగవతం యొక్క రహస్యము శ్రీధరస్వాములవారికే తెలుసు. శ్రీ శుకులు శ్రీధరస్వాములవంటివారు కారు. పృథ్వియందు శ్రీ కృష్ణస్వామియొక్క నిజ స్వరూపం శ్రీధరస్వామికే గాని మరి వొకరు యెరిగేటందుకు తోచదు ".

(బృ. ఉ. ప్ర. 6-అ12)

పై వాక్యములవలన ద్వాపర యుగాంతమున నున్న సాందీపని నుండి శ్రీకృష్ణభగవానునకును, వారి నుండి శ్రీ జ్ఞానేశ్వరులకును, వారినుండి శ్రీధరస్వామిగారికిని, వారి నుండి దీక్షితులవారికిని యీ సంప్రదాయ సిద్ధాంత (జ్ఞాన)ము ప్రాప్తించినట్లు చెప్పకొనిరని మన మూహింపవచ్చును. కాని, శ్రీ జ్ఞానేశ్వరుల సంప్రదాయ గురు పరంపరయు, దీక్షితులవారి గురు పరంపరయు, వేఱువేఱని శ్రీ జ్ఞానేశ్వరులచే చెప్పబడిన వారిగురుపరంపర వలన విదితమైనది.

శ్రీ జ్ఞానేశ్వరులకును దీక్షితులవారికిని మధ్య శ్రీధరస్వాములవారి పేరు వినబడుచున్నది. ఈ శ్రీధరస్వాములవారెవ్వరై నదియు తెలియదు. శ్రీమద్భాగవత, శ్రీవిష్ణుపురాణ, శ్రీభగవద్గీత

లకు వ్యాఖ్యలు రచియించిన సుప్రసిద్ధ శ్రీధరస్వామివారు అద్వైతులను విషయము లోకవిదితమే. వీరు 'అచల' సంప్రదాయమునకు చెందినవారు కారు. శ్రీధరస్వాముల వారు గీతకు "సుబోధిని" అను వ్యాఖ్యను రచియించి యున్నారు. అందులో కొన్ని ముఖ్యాంశములను చెప్పిన వ్యాఖ్యానము జ్ఞానేశ్వరులు గీతకు రచియించిన వ్యాఖ్యానమునకంటె భిన్నమైనది. ఇందువలన కూడా పై శ్రీధరస్వామి వారును, దీక్షితులవారు చెప్పు శ్రీధరస్వామి వారును భిన్నులని తోచుచున్నది. భగవద్గీతకును, సంస్కృత భాగవత, విష్ణుపురాణములకును వ్యాఖ్యానములు రచియించిన శ్రీధర స్వాములవారు క్రీ. శ. 10-వ శతాబ్దమునాటివారని పండితుల అభిప్రాయము. శ్రీధరస్వామివారు భాగవతమును తెనిగించిన బమ్మెర పోతనగారికంటె పూర్వులనుట నిర్వివాదము. పోతనగారి ఆంధ్రభాగవతమున శ్రీధరస్వాములవారు భాగవతపురాణమునకువ్రాసిన "భావార్థదీపిక" అను వ్యాఖ్యానములోని అంశములను కొన్నింటిని పోతనగారు తెనిగించియున్నట్లు పండితు లంగీకరించియున్నారు. పోతనగారి దిప్పటికి సుమారు ఆఱువందలసంవత్సరముల క్రిందటివారు. కనుక శివరామదీక్షితులవారి గురువు యీ శ్రీధరస్వాములవారు కారు. మహారాష్ట్రదేశమున* "శ్రీధరకవి" యను పేరు

---

* మహారాష్ట్రమునందు 1. శ్రీసమర్థ రామదాసస్వామి, 2. జయరామస్వామి, 3. రంగనాథస్వామి, 4. ఆనందమూర్తి, 5. కేశవస్వామి అను వారైదుగురు సుప్రసిద్ధ సాధుపురుషులు. వీరు భిన్నభిన్న కాలములకు చెందినవారైనను వీరిని ఆ ప్రాంతీయులు "రామదాస పంచాయతన" మని పిలుతురు. పైన పేర్కొనిన యేవురలో 3-వ వారగు రంగనాథ

శ్రీసమర్థ రామదాసస్వామి వారి జీవితచరిత్రమునందు వినబడుచున్నది. బహుశః ఆ శ్రీధర కవియే దీక్షితులవారు చెప్పు శ్రీధరస్వాములై యుండవచ్చును.

వీరిని గుఱించి విజ్ఞానసర్వస్వమున నిట్లున్నది:—
"పదునెనిమిదవశతాబ్దివాడగు మహీపతి మహాఋషులయు, భక్తజనులయు జీవితచరిత్రలను రచియించెను. ఇవి విస్తృతముగ ప్రజాదరణమును ఆర్జించినవి. ఇతని సమకాలికుడగు శ్రీధరుడు తాను రచియించిన రామవిజయ, పాండవప్రవాస, హరివిజయములచే క్రమముగ రామాయణ, మహాభారత, భాగవత కథలకు విపుల ప్రచారము కలిగించెను. అతని 'శివలీలామృత్' శైవులకు మాననీయగ్రంథము."

(వి. స. 6 వ సం. పుట. 340)

ఈ సంప్రదాయమునకు చెందిన గురువు వలననే యీ బోధ లభ్యమగును గాని యీ సంప్రదాయ గ్రంథములు చదివినంతమాత్రమున తెలియదని అచలవాదు లందురు. ఇట్టి వాక్యములు మనదేశమున ప్రతి సంప్రదాయమునకు చెందినవారును చెప్పుచుండుట పరిపాటియైనది. వీరి గ్రంథమున కొన్ని సంకేతాక్షరముల నుంచిరి. ఉదాహరణమునకు, దీక్షితులవారు వారి సంప్రదాయమును గుఱించి చెప్పిన పై వాక్యములలో '౦౦౦' మూడు సున్న లుంచియున్నారు. దాని

స్వామి అన్నగారి కుమారుడు శ్రీధరకవి. వీరినే 'శ్రీధరస్వామి' యని దీక్షితులవా రనియుండవచ్చును. వీరు కొన్ని గ్రంథములు రచియించిరి. శ్రీ రంగనాథస్వామి క్రీ. శ. 1684 లో సమాధి చెందిరి. దీక్షితుంవారి కాలము వీరికాలముతో నించుమించు సరిపోవును.

అర్థము వారికే తెలియవలెను. ఇతరులు వాని కేయర్థము నైనను చెప్పవచ్చును. నాకు తోచిన అర్థమును ఈ క్రింద వివరింతును.

దీక్షితులవారి పై వాక్యములయందు మూడుసున్నలు (000) మూడుచోట్లను, (0000) నాలుగుసున్నలు ఒకచోటను వ్రాసియున్నారు. సున్న (0) దీనికి గణిత శాస్త్రమునందు అర్థమున్నది. అర్థము లేదు. అందు సున్న ఉండుస్థలము, సందర్భములనుబట్టి దానికిలువ స్వరూపము మారుచుండును. గణిత శాస్త్రముమాట అటుంచి లోకవ్యవహారమునందు సున్న (0) కు శూన్యమని అర్థము. "పరీక్షలలో ఫలానా వారి అబ్బాయికి ఎన్ని మార్కులు వచ్చిన"వని ఉపాధ్యాయుని మన మడిగిన మార్కులు ఏమీ రాలేదని అర్థము నిచ్చునట్లు 'సున్నవచ్చినది' అని ఉపాధ్యాయు డనును. ఇచట సున్న ('0') శూన్యార్థబోధకము.

సున్న (0) అనగా — పూర్ణబిందువు. పూర్ణమునకు సూచకము (హద్దులు లేనిది) ఏలయన — పూర్ణబిందువు ఆద్యంతరహితము. అనగా — దానికి ఆది యెచటనో అంతము అచటనే. అవి రెండును కలిసిపోయియుండుటచే ఆద్యంతములు తెలిసికొనుట కష్టము. కనుక బిందువు (0) ను ఆద్యంతరహితమనిరి. కాని అది ఆద్యంతరహితమగు బ్రహ్మమునకు చిహ్నము (సూచకము) కాదు. ఆద్యంతరహిత వస్తువును మానవు డూహింపజాలడు. కనుకనే బ్రహ్మము మనోవాక్కుల కందని దనిరి.

బిందువు, లేక సున్న (0) బ్రహ్మాండమునకు చిహ్న

ముగా ఉపయోగింపవచ్చును. బ్రహ్మముయొక్క అండము (గ్రుడ్డు) వర్తులాకారము. బ్రహ్మాండము (విశ్వము) వర్తులాకారముగా నున్నది. కనుక దానిలోని భూమి, సూర్యుడు, నక్షత్రములు, గ్రహములు అన్నియు వర్తులాకారము (౦) గా ఉన్నవి. విశ్వము వ్యావహారికి సత్యమే అయినను, పరమార్థ దృష్టితో సున్న (౦) శూన్యమే (లేనిదే) కనుక ఆవిధముగా '౦' కు అర్థము చెప్పవచ్చును.

దీక్షితులవారి గ్రంథము నేను చదివియున్నాను కనుక ౦౦౦ సున్నలు — స్థూల, సూక్ష్మ, కారణశరీరములని; నాలుగవ (౦) సున్న మహాకారణశరీరమైన ఆత్మ యని (ఇది వారి అభిప్రాయము) అదియు శూన్యమే యని వారి భావమై యున్నట్లు వారి గ్రంథమును చదివిన విదితమగును.

శ్రీ శివరామదీక్షితుల అచలబోధను ఉపదేశించుచున్నామని చెప్పెడివారిలో ప్రసిద్ధికెక్కినవారు కీర్తిశేషులు శ్రీ పోకల శేషాచలంనాయుడుగారు. వీరికి శిష్యులనేకులు కలరు. శ్రీ నాయుడుగారు శివరామదీక్షితుల 'బృహద్వాశిష్ఠసిద్ధాంత' మను గ్రంథమును సంగ్రహించి "శివరామదీక్షితీయమను అచలగ్రంథము" అనుపేర 1888 వ సంవత్సరమున ముద్రించిరి. వీరి శిష్యులు కొందఱు కొన్ని 'అచల' గ్రంథములను రచియించిరి. వీరిశిష్యులలో ఒకరగు పోలకం, నరసింహం శెట్టిగారు "శ్రీకృష్ణరుక్మిణీసంవాద మను సుజ్ఞానశాస్త్రము" అను గ్రంథమును గద్యపద్యాత్మకముగ రచియించిరి. ఇది కొంత వ్యాప్తిగల గ్రంథము. ఇందు సాంఖ్య, తారక, అమనస్క, అచలములను నాలుగును నాలుగా

శ్వాసములయందు క్రమమున రచియించిరి. ఇందలి అచల బోధకును దీక్షితులవారి గ్రంథమునందలి అచలబోధకును అచ్చటచ్చట భేదమున్నది. వీరి గ్రంథమునందు వీరి గురు శిష్య పరంపరను గురించి యీ క్రింది విధముగ వ్రాసిరి :—

శ్రీ శేషాచలంనాయుడుగారిగురువు కోటప్ప దేవర గారు. వీరి గురువు మహేశ్వరుడుగారు. వారి గురువు రామ కృష్ణుడుగారు. వారి గురువు శివరామదీక్షితులవారు. శ్రీరామ కృష్ణుడు శివరామదీక్షితులవారి శిష్యులు కాకపూర్వము శ్రీ పోతులూరి వీరబ్రహ్మముగారి శిష్యపరంపరకు చెందినట్లు చెప్పియున్నారు.

(౪) అచలవాదులలో రెండుశాఖలు

ఆంధ్రప్రదేశమునందచ్చటచ్చట పలువురు గురువులు శిష్యులను చేర్చుకొని అచలబోధను చేయుచున్నామని చెప్పు కొనుచున్నారు. వీరు భిన్నభిన్న గురుపరంపరకు చెందిన వారైనను మూలమున అందఱును శివరామదీక్షితులవారి పీఠమునకు చెందినవారమే యనియు, అచలబోధయే తమ మతమనియు చెప్పుకొనుచు, అచలబోధకుచెందిన గ్రంథము లనే ప్రమాణముగా గైకొని చదివి మననము చేయు చున్నారు. వీ రందరిని రెండు తెగలుగ భావింపవచ్చును. ఇందులో ఒకరు మితవాదులు, వేఱొకరు అతివాదులు.

(1) మితవాదుల వాదము :— మరణానంతరము శరీరమునందేమియు మిగులదని, పునర్జన్మము లేదని, పరలోక గమనమనునది లేదని చెప్పు వర్గము. వీరిని మితవాదు లనవచ్చును.

(2) అతివాదుల వాదమును వినుము :— బ్రహ్మవాదులు (వేదాంతులు) పరబ్రహ్మము నిర్గుణము నిర్విశేషము శుద్ధచైతన్యస్వరూపమని చెప్పుదురు. ఇది ఉపనిషత్తుల మతము. అచలవాదులు యిందులకు వ్యతిరేకముగా చెప్పుదురు. ఎట్లన :— బ్రహ్మము, మాయ, ప్రకృతి, అవ్యక్త, సత్తు, చిత్తు, త్రిగుణాత్మిక, పరాప్రకృతి, చైతన్యము, శుద్ధచైతన్యము, ఎఱుక, జ్ఞానము, అక్షరము, ఆత్మ, ప్రత్యగాత్మ, జీవుడు, దేహము, అక్షరము, అపరాప్రకృతి అని చెప్పబడునవి చలము; ఇవి చలించునట్టివి. ఇదే లేని యెఱుక, క్షణభంగురమైనది. ఇందులో నేదైనను యెఱుకయే.

దీనికంటె వేఱైనది - అచలము, పరిపూర్ణము, కేవలాత్మ, బయలు అను నామములచే వ్యవహరింపబడునది. ఇదియే బట్టబయలు లేక పరబ్రహ్మము. ఇది సర్వవ్యాపి. చైతన్యము కాదు. ఇది తన్ను తానెఱుగదు. ప్రపంచమును ఎఱుగదు. దేనినైనను యెఱుగుటకు దీనికి యెఱుక లేదు. ఇది నిత్యము, నాశరహితము.

అచలము, మాయ (చలము) కాదు; చలము, అచలము కాదు. ఈ రెండింటికి ఐక్యము లేదు. మాయ అచలమునకు పుట్టలేదు. కాని అచలమునందే ఉన్నది :—

బ్రహ్మము అనబడు మాయ బ్రహ్మాండ రూపమున పరిణమించినది. అదే శరీరము — అందులోని యెఱుక (జ్ఞానము)గా పరిణమించినది.

మఱియొకవిధముగాకూడ చెప్పియున్నారు. మాయ దేహీ దేహముగా మారినది. దేహీ (మొలక) తానున్నట్లు బ్రహ్మాండములున్నట్లు తానే కల్పించుకొన్నది గాని ప్రపంచ మనునది పుట్టనేలేదు. — జనన మరణ భ్రాంతి అచలబోధ వలన తొలగిపోవును.

మితవాదులు, అతివాదులు అను నీ సంకేతనామములు బోధ సౌలభ్యము కొఱకు నే నేర్పర్చుకొన్న వేగాని వీటికి ప్రత్యేకమైన అర్థ మేమియు లేదు. ఈ యిరుపక్షములవారికిని శ్రీ దీక్షితులును, వారి శిష్యవర్గము వారును వ్రాసిన గ్రంథములే ప్రమాణము. "బృహద్వాసిష్ఠ సిద్ధాంతము" నందలి దీక్షితులవారి వాక్యములకు వీ రిరువురు భిన్నార్థమును చెప్పెదరు.

(౨౧) అచలబోధ తెలిసికొనుటకు అనధికారులు - అధికారులు

అచలబోధను తెలిసికొనుటకు అనర్హు లిట్టివారని, అర్హు లిట్టివారని దీక్షితులవారు తెలియజేసిరి. దీనినిబట్టి వారి బోధ యిట్టిదని మనము కొంతవఱకు ఊహింప వచ్చును. వా రిట్లు చెప్పిరి :—

అనధికారులు :— (1) మూలంలేని యీ గుర్తెరిగే శరీరం అయివున్న పతితులకు చెప్పవద్దన్నారు. (2) శాస్త్రాలు నిబద్ధే అని నమ్మియున్నవారికి చెప్పవద్దన్నారు. (3) యెదురు బడి వాదించేవారికి చెప్పవద్దన్నారు. (4) గురుసేవ చెయ్యని వారికి చెప్పవద్దన్నారు. (5) నేను యేది అంటే అదే అనే

మూర్ఖులకు చెప్పవద్దన్నారు. (6) స్త్రీభ్రాంతి యున్నవారికి చెప్ప వద్దన్నారు. (7) జ్ఞానభ్రాంతి యున్నవారికి చెప్పవద్దన్నారు. (8) భక్తిభ్రాంతి యున్నవారికి చెప్పవద్దన్నారు. (9) వైరాగ్యం గొడ్డదనే మూర్ఖులకు చెప్పవద్దన్నారు. (10) మొద్దుబుద్ధి గల వారికి చెప్పవద్దన్నారు. (11) అది నేను కావలెనని భ్రాంతివున్న వారికి చెప్పవద్దన్నారు. (12) అది నేను అయితినని అనుభవం కావలెనని భ్రాంతివున్నవారికి చెప్పవద్దన్నారు. (13) నేను అని వాదించేవారికి చెప్పవద్దన్నారు. (14) శ్రవణభ్రాంతి వున్నవారికి చెప్పవద్దన్నారు. (15) ధ్యానభ్రాంతి వున్నవారికి చెప్పవద్దన్నారు. (16) మననభ్రాంతి వున్నవారికి చెప్పవద్దన్నారు. (17) ద్వైత భ్రాంతి వున్నవారికి చెప్పవద్దన్నారు. (18) అద్వైతభ్రాంతి వున్నవారికి చెప్పవద్దన్నారు. (19) విశిష్టాద్వైతభ్రాంతి వున్న వారికి చెప్పవద్దన్నారు. (20) మతాంతరభ్రాంతి వున్నవారికి చెప్పవద్దన్నారు.

అధికారులు :— (1) సూచన చేయగనే కనుక్కొనే వారికి చెప్పమన్నారు. (2) స్త్రీలేగాని, పురుషులేకాని భ్రాంతి రహితము కావలెనని మిక్కిలి యిచ్ఛవున్నవారికి చెప్ప మన్నారు." (బృ. పూ. ప్ర.)

అచలబోధను తెలిసికొనుటకు దీక్షితులవారు పైన చెప్పిన యిరువది అనర్హతలయందు యేవొక్కటి యున్నను అట్టివాడు అనర్హుడని తాత్పర్యము. 1, 4, 5, 6, 10, 20 సంఖ్యలయందు చెప్పిన అనర్హతలు తప్ప తక్కిన సంఖ్యల యందు చెప్పబడిన అనర్హతే లనునవి దీక్షితులవారి దృష్టిలో మాత్రమే అనర్హతలుగాని అందులో కొన్ని అద్వైతమును

తెలిసికొనగోరు జిజ్ఞాసువులకును, కొన్ని ద్వైతమును తెలిసి కొనగోరువారికిని, కొన్ని విశిష్టాద్వైతమును తెలుసుకొనగోరు వారికిని అవశ్యముగ ఉండవలసిన అర్హతలు. వీటియందు కొన్ని కొందఱకు సరిపడకపోయినను ముఖ్యముగ భక్తి, జ్ఞానము, వైరాగ్యము, శ్రవణము, ధ్యానము అను నైదును వేదాంతులయందలి అన్ని శాఖలకును (దీక్షితులవారికి తప్ప) అవసరమే. అవి లేనివారికి పరమార్థజ్ఞానము పట్టుబడదు. భక్త్యాదులున్నవారు అచలబోధ కనర్హులని దీక్షితులవారు చెప్పిరి. ఇందువలన అచలబోధకు విరుద్ధము వేదాంతము. వేదాంతమునకు విరుద్ధము అచలబోధ. ఈవిధముగా అచల బోధ స్వరూపమును స్థాలీపులాకన్యాయముగ మనము తెలుసుకొన వచ్చును.

(౬) మంత్రత్రయము

దీక్షితులవారు మూడు మంత్రములను చెప్పిరి. వారి బోధయంతయు ముక్కాలిపీటమువలె మూడు మంత్రముల పైన నిలిచియున్నది. క్రింద చెప్పబోవు మూడు మంత్రము లకు విపులమగు వ్యాఖ్యానమే 'బృహద్వాశిష్ఠ సిద్ధాంత' గ్రంథమంతయు నని చెప్పవచ్చును. అందు మొదటి మంత్రము :—

(1) "ఈ మూలంలేని గుర్తరిగే శరీరం యేమీలేదు" కొన్నిచోట్ల "మూలములేని గుర్తరిగే శరీరం యేమీలేదు" అని కూడా కలదు. ఇందులో పదునాఱక్షరము లున్నందున దీనిని షోడశాక్షరీ మంత్రమందురు. దీనికి సంస్కృతము

"మూలాభావ మిదం జ్ఞాతం శరీరం నాస్తికేవలమ్" అని యున్నది. కొందఱు దీనినే "మూలాభావ మిదం జ్ఞాతం శరీరం న కిమస్తితే" అని చెప్పుదురు.

(2) "కలదోచిన శరీరము యేలాగో అలాగే" ఇది పంచదశీమంత్రమట.

(3) "ఈ ఉత్త బట్టబయలు యేమీ లేదు" ఇది ద్వాదశాక్షరీమంత్రమట.

అనంతోపనిషత్తునందు యీ మంత్రములును వాటి అర్థమును యీ క్రింది విధముగా వ్రాయబడినది :—

(1) "మూలా భావ మిదం జ్ఞాతం శరీరం కిము నాస్తిహి."

టీ॥ "మూలం = జ్ఞాతకును శరీరాదులకును కారణమగుమాయ, అభావం = మిథ్య (అనగా లేనిది), ఇదంజ్ఞాతం = ఈ గుర్తెఱుంగు నెఱుకయును, శరీరం = నశించునట్టి శరీరమును, కిమునాస్తిహి = ఎప్పుడును లేదుగదా! (అనగా ఏమియును లేదు)" (ఇది షోడశాక్షరీమంత్రము).

తా॥ "మూలము లేని గుర్తేఁగే శరీరం ఏమి లేదు. అనఁగా : జ్ఞాతకు శరీరాదులకు కారణమగు మాయ లేనిదగుటచేత, కార్యములగు శరీరాదులును వానిని గుర్తెఱుఁగు నట్టి ఎఱుకయును ఎప్పుడును లేనివని భావము."

(2) మం॥ "స్వప్నే ప్రతీయమానాని రూపాణి యథాతథా."

టీ॥ "స్వప్నే = స్వప్నమునందు, ప్రతీయమానాని = తోఁచునట్టి, రూపాణి = రూపములు, యథాతథా = ఏలాగో ఆలాగే.

తా॥ కలదోఁచిన శరీరము ఎలాగో ఆలాగే. అనగా: కలలో దోఁచిన రూపములు జాగ్రత్తయందున యేలాగున లేకపోవుచున్నవో ఆలాగుననే స్వానుభవమునందు మాయయను, బ్రహ్మము, లేకపోవుచున్నదని భావము. దీనికి ముఖ్యాభిప్రాయము ఏమనఁగా: అది నామరూపము క్రియారహితమగు నవాఙ్మానస గోచరమగుటచే బ్రహ్మమనుటకు వీలు లేదని తాత్పర్యము." పై మంత్రమున పదునైదక్షరము లున్నందున 'పంచదశి' మంత్రమందురు.

(3) మం॥ "అయం వ్యర్థః బాహ్యః కోఽపి నభవతి."

టీ॥ "అయం = ఈప్రపంచము, వ్యర్థః = నిరర్థకము, బాహ్యః = బట్టబయలు, కోఽపినభవతి = ఏమియును లేదు."

తా॥ "ఉత్తదీ బట్టబయలు ఏమీ లేదు. అనగా; అయ్యది అవాఙ్మానసగోచరమగుటవలన మాయ యనిగాని బ్రహ్మమనిగాని బయలనిగాని నిర్దేశించుటకు వీలు లేదని భావము." పై మంత్రమును పంద్రెండక్షరము లున్నందున 'ద్వాదశాక్షరి' మంత్రమందురు.

ఈ మూడును మంత్రములని చెప్పుటకంటె సూత్రములని చెప్పిన బాగుండునేమో. ఈ మంత్రములు శివపంచాక్షరి, వాసుదేవ ద్వాదశాక్షరి, నారాయణ అష్టాక్షరీ, మంత్రములవలె జపముచేయతగినవి కావు.

'విజయదుందుభి' లో పై మూడు మంత్రములు.

శ్రీ జ్ఞానదేవులు 'అమృతానుభవము' ను మహారాష్ట్ర భాషయందు రచియించిరని చెప్పియుంటిని. ఆ గ్రంథమునకు 'విజయదుందుభి' అను ఆంధ్ర వ్యాఖ్యానమును రచియించిన శ్రీ స్వామ్యమృతానందతీర్థ కలగ ఆంజనేయశాస్త్రిగారు రచియించిన ఉపోద్ఘాతమునందు, ఈ క్రిందివిధముగ నున్నది.

"శ్రీ. జీవన్ముక్త యతీంద్రులవారు పదబోధిని యను వ్యాఖ్యానముపేర గీర్వాణభాషానువాదము గావించి పండిత లోకమున కందజేసిరి."

"మరియు నీ మహారాష్ట్రభాషయందున్న విషయముల నెఱుకపరచుటకై అల్పజ్ఞానముకల ముముక్షువుల హితమును గోరి శ్రీ శివకళ్యాణనామక విద్వద్వరేణ్యులు నా మూల గ్రంథమును సమన్వయపరచి స్వల్ప టీకను వ్రాసియున్నారు. ఈ విషయము ముందు చెప్పబోవు ప్రస్తావనయందు పాఠకులు గ్రహింపగలరు. సంస్కృతానువాదకులు శ్రీ జ్ఞానేశ్వరులచే రచియింపబడిన మూలగ్రంథమును టీకాకారులయొక్క టీకను గూడ గీర్వాణభాష ననువదించియున్నారు."

శ్రీ కలగ ఆంజనేయశాస్త్రి పైన చెప్పిన గీర్వాణ భాషావాదము ననుసరించి 'విజయదుందుభి' నామ కాంధ్రానువాదమును గావించిరి. కాని, నాకు విజయదుందుభి యందు మొదటి మూడు ప్రకరణములు గల ప్రథమసంపుటము ఒకటిమాత్రము లభించినది. మిగత గ్రంథముకొఱకు ప్రయత్నించితిని. కాని, ముద్రింపబడినదో, లేదో నాకు తెలియదు. నాకు లభింపలేదు.

పైన చెప్పిన విజయదుందుభియందలి మూడవ ప్రకరణమునందు 182, 186, 187 పుటలయందు అనంతోపనిషత్తునందు పైన చెప్పిన మూడు మంత్రములున్నవి. అవి సంస్కృతమున మాత్రమే కలవు. వాటిని విజయదుందుభి ఆంధ్రీకరింపలేదు. అదియునుగాక, విజయదుందుభియందు వాటిని మంత్రములని పేర్కొనక '<u>వాక్యములు</u>' అని మాత్రమే చెప్పినది.

శ్రీ జ్ఞానేశ్వరులవారు ఇట్లు చెప్పిరి :—

శ్లో॥ జ్ఞానాంతరేణ శ్లాఘాచే ద్వ్యర్థం జ్ఞానస్యకం తదా,
స్వావిర్భావంతు దీపేన కోమన్యేత వినార్థమమ్. (3-19)

వచనము :— "అంతియుగాక ఆత్మయొక్క మాహాత్మ్యంబున కన్యజ్ఞానం బాధారంబగుచో దద్జ్ఞాన పూర్ణత్వంబు నిరర్థకంబగు కాంతిప్రసారంబునందు దీపంబున కన్య దీపసహాయంబును స్వాతిత్వంబును గోల్పోవుటయు కాదె."

(అను. 3-20)

పై శ్లోకమునకు విజయదుందుభి వ్యాఖ్యానమునందు యీ క్రింది విధమున చెప్పబడినది —

"ఆత్మానాత్మ విచారోఽయం ముధైవ క్రియతో బుధైః" అనియును, "<u>అయం వృక్షో బాహ్యః కోఽపి న భవతి</u>" అనియును పలికినారు. అనగా బాహ్యజగత్తు సత్యముగనుండి అది తనను బాధించుచున్నపుడు దాని బాధనుండి తొలంగుటకు తగిన ప్రయత్నము కర్తృత్వ

వశమున జేయవలయును గాని అసలే జగత్తు లేకనే ఉన్నట్లు తోచి లేనిదగుచుండగా అనగా "నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః" అనునట్లు లేనిది విచారించినను విచారింపక పోయినను, లేనిదగుచుండగా, ఉన్నది విచారించినను విచారింపక పోయినను ఉన్నదే యగుచుండగా నాత్మానాత్మ విచారము పండితులచేత వ్యర్థముగనే చేయబడుచున్నదనియును, బాహ్యమందు ప్రపంచము లేనే లేనప్పు డీ విచారమంతయు వ్యర్థమేననియును ఈ పరమ రహస్యమును శ్రీ సద్గురు ముఖంబున నెరింగి తూష్ణీం భావ స్థితినున్నవాడే యోగియని తాత్పర్యము — వాస్తవము నెరింగినయెడల నీ యెరుంగుటను లేనిదే యగుచున్నది. ఇదియే విద్యారహస్యము. మరియు మూలాభావ మిదం జ్ఞాతం శరీరం నాస్తి కేవలమ్ అను వాక్య మీ భావమునే బలపరుచుచున్నది. ఇట్లు బలపరచుటకు ముఖ్యకారణము లేని జగత్తు స్వప్నమునందువలె తోచి లేకపోవుటచేతనే పెద్దలు స్వానుభూతిని స్వప్నే ప్రతీయ మానాని రూపాణి యథా తథా అని నుడివినారు."

(విజయదుందుభి. 186, 187)

పై వాక్యములను పరిశీలింపగా జగత్తు మిథ్యయగుట వలన ఆత్మానాత్మవిచారము వ్యర్థమేయని వారి సిద్ధాంత మని తేలినది. జగత్తు మిథ్యయను సిద్ధాంతము వేదాంతుల కంగీకారమే. కాని ఆత్మానాత్మవిచారము వ్యర్థముకాదు. అవశ్యముగ చేయవలసినదే. అది వ్యర్థమనిన శ్రీజ్ఞానదేవులు

గ్రంథ మేల వ్రాయవలయును? దానిని కొందఱు సంస్కృతములోని కేల అనువదింపవయును? కొందఱు టీక లేల వ్రాయవలయును? వారందఱు వ్యర్థముగనే ప్రయాసపడిరని యెఱిగియు శ్రీ ఆంజనేయ శర్మగారు విజయదుందుభియను వ్యాఖ్యాన మేల చేయవలయును? వీరి కార్యములు అర్థరహితములు కదా? భ్రాంతివశమున త్రాటియందు తోచిన సర్పము యథార్థముగ లేనిదైనను భయము కలిగించుటచే దీపము తెచ్చిచూచి 'ఇది సర్పము కాదు. త్రాడు' అను నిశ్చయము కలుగునంతవఱకు దీపకాంతి అవసరమైనట్లు జగత్తు తోచనంతవఱకు ఆత్మానాత్మ విచార మవసర మే.

శ్లో॥ నాసతో విద్యతే భావో నా భావో విద్యతే సతః,
ఉభయోరపి దృష్టోఽంత స్త్వనయో స్తత్త్వ దర్శిభిః. (గీత. 2-16)

తా॥ నశించెడి స్వభావముగలది ఉండుట లేదు. నిత్యమైన ఆత్మకు లేకపోవుట లేదు. తత్త్వదర్శనులు (బ్రహ్మవస్తువు నెఱిగిన వారు) 'ఇది ఆత్మ' 'ఇది అనాత్మ' అని యీ సదసత్తుల నిర్ణయము చూచెదరు. అని తాత్పర్యము.

శ్రీ జ్ఞానేశ్వర విరచితమగు మూల గ్రంథమునకు సంస్కృతానువాదమగు పై (అమృతానుభవము. 3-19.) శ్లోకమునకును, తెనుగున గద్యానువాదము (వచనానువాదము) నందలి అనుభవామృతము (అను. 3-20) గద్యమునకును అర్థము సరిపడుచున్నది. కాని, దాని వ్యాఖ్యానము (విజయదుందుభి)లోని అర్థమునకును, మూలమునందలి అర్థమునకును, ఏవిధమగు సంబంధము లేదు. వ్యాఖ్యయందలి వివరణము మూలమునందు బీజమాత్రముగనైనను లేదు.

కనుక పై మూడు వాక్యములు శ్రీ జ్ఞానేశ్వరులవారు రచియించిన మఱే గ్రంథమునందైన నుండినసేతప్ప, లేనియెడల పై మూడు వాక్యములు వ్యాఖ్యాతలు అనంతోపనిషత్తు నుండి గ్రహించిరని చెప్పవచ్చును. అట్లుగాక శ్రీ జ్ఞానేశ్వర విరచితమగు నితర గ్రంథమునందుండిన వ్యాఖ్యాత(లు) ఆ గ్రంథనామము నుదాహరించియుండవచ్చునుగదా ? కనుక పై మూడువాక్యములుగాని వాటి అర్థముగాని శ్రీ జ్ఞానేశ్వరుల అభిప్రాయమని చెప్పుటకు సాక్షాదాధార మేదియు కానరాదు.

పై వాక్యత్రయమును గుఱించి విపులముగా పరిశీలించినగాని వీరితత్త్వ స్వరూపము పూర్ణముగా తెలియదు. మొదట షోడశాక్షరీమంత్రార్థమును పరిశీలింతము. —

(౧) షోడశాక్షరీమంత్రము

ఈ మూలం లేని గుర్తెఱిగే శరీరం ఏమీ లేదు.

(బృ. పూ. ప్ర. 1)

మూలాభావ మిదంజాతం శరీరం కిము నాస్తిహి.

(బృ. పూ. ప్ర. 5)

అచలవేదాంతులయందు రెండుశాఖలు కలవని చెప్పియుంటిని. అందు మితవాదులును, అతివాదులును పై మంత్రములకు పరస్పర భిన్నములగు అర్థములను ఈ క్రింది విధముగ చెప్పుదురు :—

మితవాదులు :— మూలము లేకుండుట, ఎఱుగుట, ఏమియు లేకపోవుట — అను మూడును శరీరమునకు విశేషణములు. శరీరమునకు మూలము లేదు. మన శరీరములకు

మన తలిదండ్రులు మూలము. అనగా: ఎవరి శరీరమునకు వారి తలిదండ్రులు మూలము. వారికి వారి తలిదండ్రులు మూలము. ఈవిధముగా శరీరమునకు ఆది లేదు. శ్రీ కృష్ణదాసుగారి కందార్థము యీ యర్థమునే చెప్పును.

కం. దా. ॥ తనమూలము తలిదండ్రులు — తనవలెనే వారివారి తలిదండ్రులకున్ — తనవలెనె గాని యన్యము — గనజననస్థానమొకటి — గలదాన తరమా — బ్రహ్మాదుల కదిదెలియ తరమా .... (75) దీక్షితులవారు కూడ యీ విధముగనే చెప్పియున్నారు. "కలలో శరీరమునకు మూలము లేదు. అలాగుననే యీ శరీరమునకున్నూ మూలము లేదు. ఈ శరీరమునకు తలిదండ్రులే మూలము. వారివారికి వారివారి తలిదండ్రులే మూలము. ఇందులో ఆలోచన యేమియు లేదు." (బృ. పూ. ప్ర. 10) కనుక, శరీరమునకు మూలము లేదు. 'ఇది భూమి' 'ఇది జలము' అని యెఱుగునట్టిది శరీరమే. ఎఱుగునట్టి శక్తి శరీరమునకే కలదు, కాని, ఎఱుక శరీరమునకంటె విలక్షణమైనది కాదు. (భిన్నమైనది కాదు) బెల్లము తీపు వలె రెండును ఒకటిగనే యున్నవి. ఉన్నట్లుండి ఒకప్పుడు శరీరము లేకపోవుచున్నది. అందువలన యిదియేమియూ లేదు. శరీరము నశించినపిమ్మట శరీరి స్వర్గమునకు పోవునని మఱల జన్మించునని చెప్పుట సరికాదు. శరీరనాశముతో సర్వము నశించును. ఇంకేమియు మిగులదు.

అతివాదులు :— పై మంత్రమునకు యీ క్రింది విధముగా అర్థము చెప్పుదురు :— గుర్తెఱిగే శరీరము ఎఱుక. ఆ యెఱుకకు మూలము లేదు. అది మాయ. మూలమాయ

అదే. మాయ అనగా 'లేనిది' అని అర్థము. పట్టిచూచిన అది పట్టునకు చిక్కదు. కనుక, దానిని లేదనవలసి వచ్చినది. అదే మనస్సు 'ప్రజ్ఞానం లాంఛనమ్ ధియో' అని నానార్థరత్నమాలయం దున్నది. కనుక ప్రజ్ఞానమన్నను, గుర్తన్నను, లాంఛనమన్నను, బుద్ధి అన్నను గుర్తే. అదే మెఱుక. మెఱుకయే శరీరము. దానికే మూలము లేదు.

అచలబోధయం దీ మంత్రము చాల ముఖ్యమైనది. దీక్షితులవారు రచియించిన 'బృహద్వాశిష్ఠ సిద్ధాంతము' నందు యీ మంత్రము (షోడశాక్షరి) 470 మార్లకంటె యెక్కువగనే ఆ వర్తనము చేయబడినది. అదిగాక ఈ మంత్రముతోనే ఆ గ్రంథ మారంభింపబడినది. ఈ మంత్రమును గుఱించి దీక్షితులవా రిట్లు చెప్పిరి:—

"మూలంలేని యీ గుర్తెరిగే శరీరం యేమీ లేదు. మూడుకాలాలయందు మూడువేళ్ళకు, కాలానికి వెయ్యిచొప్పున ప్రతిదినమూ జపముచేయవలె. చేస్తే కృతకృత్యుడగుచాడు." (బృ. పూ. ప్ర. 7.) "సర్వకాలం మూలంలేని యీ గుర్తెరిగే శరీరం ఏమీలేదు. అని నిద్రవచ్చినదాక మరణంవచ్చినదాక రెప్పపాటులో సగకాలమైనా మరువకవున్నవాడే బంధమోక్ష రహితుడు." (బృ. ఉ. ప్ర. 6)

ఈ విషయమై దీక్షితులవారు, వారిగ్రంథమున అచ్చటచ్చట చెప్పిన వాక్యములను ఒకచోట చేర్చి చెప్పెదను. అందువలన మితవాదులు, అతివాదులును అను ఈ రెండు పక్షములయందు షోడశాక్షరి మంత్రమునకు యెవరుచెప్పిన అర్థము సరియైనదో తెలిసికొనుటకు వీలగును.

(1) "దేహి దేహములు రెండూ దేహమే."
(బృ. ఉ. ప్ర. 3 అ. 3)

(2) "ఇదే మూలమాయ ఇదే గుర్తెరిగే శరీరం."
(బృ. ఉ. ప్ర. 5 అ. 1)

(3) "చూచే శరీరం ఇది లేకుంటే చూడంది యేది వున్నది?" (బృ. ఉ. ప్ర. 57)

(4) "మూలంలేని శరీరం తనకు తానేవచ్చి తనకు తానే ఏమీలేదు." (బృ. ఉ. ప్ర. 6 అ. 4)

(5) "ఈ శరీరానకు మూలం యేమీలేదు. వున్నది అని అందరు గడ్డితిన్నారు తించూవున్నారు."
(బృ. ఉ. ప్ర. 6 అ. 6)

(6) "ఈ శరీరానకు మూలం పలానిది అని యెవ్వరూ గెలవలేరు." (బృ. ఉ. ప్ర. 6 అ. 4)

(7) "కలలోవచ్చిన శరీరానకు కూడా మూలం లేదని చెప్పిరి." (బృ. ఉ. ప్ర. 6 అ. 6)

(8) "శరీరమువలన గుర్తెరగడము ఖర్మాలు పుడుచావి." (బృ. ఉ. ప్ర. 6 అ. 6)

(9) "ఇంతేకాని విచారిస్తే యీ శరీరముయొక్క రాకడకు మూలం యేమీలేదు. వునికికీ మూలంలేదు. పోకడకు మూలం యేమీలేదు." (బృ. ఉ. ప్ర. 6 అ. 8)

(10) "ఈ దేహాలకు మూలం యేమీలేదు."
(బృ. ఉ. ప్ర. 6 అ. 9)

(11) "విచారిస్తే యీ శరీరానకు మూలం యేమీ లేకపోయినా." (బృ. ఉ. ప్ర. 6 అ. 12)

(12) "ఈ దేహాలకు దేహాలే మూలం."

(బృ. ఉ. ప్ర. 6 అ. 10)

(13) "శరీరం జడముకాదు."

(బృ. ఉ. ప్ర. 6 అ. 12)

(14) "శరీరం పుట్టకమునుపు శరీరం యేమీలేదు. చచ్చినతరువాత యీ శరీరం యేమీలేదు. వున్నది కాసంతసేపు మందికూతలువిని అనేకభ్రమలుచాత అనేకమంది యున్నట్లు తానువుండి కొనకు తానేమిలేదు. యీలాగే అనేకమందివుండి మళ్ళా యేమీలేదు. చచ్చినవారు మళ్ళీ పుడుచారు అనేటందుకు యేమీలేదు. కనుక యిది మళ్ళా పుడుచుంది అని యేలాగు అనె?" (బృ. పూ. ప్ర. 1)

(15) "ఇరవై అయిదోది అయిన యెరుక అనే అహంకారమే ఆత్మ. ఆత్మ అనే శరీరం ఆత్మ శరీరములు అహంకారం." (బృ. పూ. ప్ర. 3)

(16) "అహంకారము శరీరము వక్కటే. శరీరం వేరే అన్నది అహంకారమే. తాను వేరు అయితే జంధ్యాలు తానే వేసుకోవలె. శరీరానికి యేల వెయ్యవలె? తానే లింగం కట్టుకోవలె. శరీరానికి యేల కట్టవలె? తానే జపము చెయ్యవలె, శరీరం యేల చేస్తుంది? తాను చక్రాంకితం వేసుకోవలె. శరీరానకు యేల వెయ్యవలె? (భుజములకు యేల వెయ్యవలెను) తానే బొట్టుపెట్టుకోవలె, గాని శరీరానకు యేల పెట్టవలె? అందుకే

తాను వేరు అని వాదించేది తత్త్వవాదము. అదే మాయా వాదము." (బృ. పూ. ప్ర. 3)

ఇందులో 1, 3 నుండి 12 ను సంఖ్యవఱకు గల వాక్యములయందు షోడశాక్షరి మంత్రమునందున్న 'గుర్తెరిగే' అను పదము తొలగించినందునను, మితవాదులు చెప్పినట్లు శరీరమే గుర్తెరుగునను టవలనను, 14-వ అంశముచే పునర్జన్మ సిద్ధాంతమును త్రోసివేయుట వలనను, అహంకారము శరీరము ఒకటేనని 15, 16 అంశములు చెప్పుట వలనను, మితవాదులు తమ వాదమే సరియైన దందురు.

జిజ్ఞాసువు :- మంత్రశాస్త్రవిదులు (శ్రీవిద్యోపాసకులు) చెప్పిన రాజరాజేశ్వరీ (షోడశాక్షరీ) మంత్రమునకును దీక్షితులవారి షోడశాక్షరికిని సామ్యము కలదా?

వేదాంతి :- రెంటియందును మాయనుగుఱించి చెప్పినట్లున్నను రెండింటియొక్క తాత్పర్యములు వేఱు. దీక్షితుల వారును, వారి శిష్యపరంపరకు చెందినవారును 'ఎఱుక' అనగా: ఏమని చెప్పిరో యింకను విచారించవలసియున్నది.

(ర) ఎఱుక - మఱపు

(1) "శరీరం జన్యం గుర్తెరిగే జ్ఞానం." (బృ. పూ. ప్ర. 1)

"ఎఱుకే జ్ఞానం." (బృ. పూ. ప్ర. 3)

"ఈ జ్ఞానమే దండిమాయ. అవిద్యయని యెవరు యెరుగుదురో వారు ఏమిచేస్తారు." (బృ. ఉ. ప్ర. 4 అ. 2)

"అహంకారము శరీరము వాక్కుటే."

(బృ. పూ. ప్ర. 3)

"అహంకారం యెరుక వక్కటే. యెరుకే చిద్రూపము, యెరుకే శ్రీమన్నారాయణరూపము." (బృ. పూ. ప్ర. 3)

"అహామే దేహాము." (బృ. పూ. ప్ర 3)

"ఆత్మానాత్మ అనే అడవిలో వుండెనా, నరడవి తప్పదు." (బృ. ఉ. ప్ర. 6 అ. 9)

"ఈ దేహానికి ఆధారము లేదు. దేహామునకు జీవుడు అన్యము గాదు. జీవునకు నామరూపములు లేవు. జీవుడు జీవుడనే పేరేగాని వెతికితే వేరేలేదు." (బృ. పూ. ప్ర. 6)

"శిలాప్రతిమవత్! అని దేహి దేహానకు అవినాభావ సంబంధము వుండి చెప్పినారు. గనుక దేహానకు విశిష్టం తప్పదు. దేహానకు వుపద్రవం వస్తే యేద్చేది దేహి గనుక యీ దేహికి సుఖదుఃఖాలు లేవని శాస్త్రం చెప్పుతూవున్నది. అది పెద్ద అబద్ధం. శాస్త్రిలు అబద్ధమే. దేహి నిబద్ధ, దేహాము అబద్ధం. అని శంకరాచార్యస్వాములవారు శ్రుతిమూలంగా చెప్పినారు. సుఖదుఃఖాలు దేహాము వున్నంతసేపేకాని దేహి లేకుంటే దేహామునకు లేవు. సుషుప్తియందు దేహి లేకపోయినదా. సుఖము అనుభవించ లేదా? దేహాము వుండగానే సుఖదుఃఖములు సిద్ధం, దేహి నిబద్ధి అయితే, దేహామున్నదని నిర్ణయం గనుక దేహి దేహాములు రెండు దేహామే. దేహాము వున్నాదని భ్రాంతి ఉన్నంతసేపు జనన మరణ భ్రాంతి తప్పదు." (బృ. ఉ. ప్ర. 3 అ. 3)

కృష్ణదాసుగారు యిట్లన్నారు :—

క॥ మానసము దేహి జీవుం
డానందము సత్తు చిత్తు అహము జగదధి
ష్ఠానంబు సాక్షి సత్య
జ్ఞానముద్రష్టనిన నీవె సత్యముసుజ్ఞా.
(కందము. 88)

"మూలం లేని గుర్తెరిగే శరీరం జీవుడు."
(బృ. ఉ. ప్ర. 6 అ. 10)

"అద్వైతమువలె దేహం అబద్ధం దేహి నిబద్ధి అన్నట్లు కాదు. సార్వకాలము దేహమునకు దేహికి వేరు యెన్నటికి లేదు. గుడమధురములవత్." (బృ. ఉ. ప్ర. 6 అ 12)

"నాశరీరము నేను ఒకటేగాని రెండుగా నాకు తెలియదు."
(బృ. పూ. ప్ర. 10)

జిజ్ఞాసువు :- 'శిలాప్రతిమవత్' ఒకశిల్పి ఒకఱాయిని తెచ్చి ప్రతిమను చెక్కినపుడు ఆ ప్రతిమ (విగ్రహమున) కున్న దానిని యే శిలయందు చెక్కబడెనో ఆ శిలకును అభేదమైనట్లుగను; 'గుడామధురవత్' బెల్లము తీపు ఈ రెండింటికి అభేదమైనట్లుగను దేహి దేహములు రెండును ఒకటియేయైన అచలవాదులలో మితవాదపక్షము వారి వాదమునకే ఈ వాక్యములు సూటిగా సరిపోవుచున్నవని వారందురు.

వేదాంతి :- అచల వేదాంతులయందు మితవాదుల

వాదమునకును చార్వాక సిద్ధాంతమునకును ఒక్క విషయమున మాత్రమే భేదమున్నట్లు తోచును. చార్వాకులు శాశ్వతమైన దేదియు లేదందురు. శూన్యము కలదందురు. మితవాదులు బట్టబయలు కలదందురు. తుదకు అదియును శూన్యమై కడపట మహాశూన్యమై పోవునందురు. 'నేను నా దేహము ఒక్కటే' అనిన దీక్షితులవారి సిద్ధాంతమును చార్వాకముతో పోల్చుదురన్న భయము దీక్షితులవారికి లేకపోలేదు. కనుక వారొకచోట "అందరు పరిపూర్ణులే గాని మూలంలేని యీ గుర్తెరిగే శరీరం నేను అని నమ్మియున్నారు. గనుక వారికంటె నీచులు లేరు. వారికంటె పాపాత్ములు లేరు." (బృ. ఉ. ప్ర. 6 అ. 3) అని అన్నారు. అది అట్లుండ ఎఱుక యొక్క ఉత్పత్తిని గురించి దీక్షితులవారును కృష్ణదాసు గారును చెప్పిన దానిని వినిపింతును.

(2) "ఎఱుకయొక్క యుత్పత్తిని బ్రహ్మదు లెఱుగరు."
(కందా. 65)

"వంధ్యాపుత్రునివలె గగన కుసుమమువలె యెఱుక కలిగినది." (కందా. 66)

"నారికేళ ఫలములోనికి నీరు వచ్చినట్లు ఎఱుక వచ్చి, కరిమ్రింగిన వెలగపండులోని గుజ్జు కనబడక పోయినట్లు ఎఱుక కనబడక పోయినది." (కందా. 68)

"శరీరము ఎఱుక ఒకదాని నొకటి సృజించినవి."
(కందా. 85)

ఇందులో ముందు పుట్టినది శరీరమా? ఎఱుకా? ఈ ప్రశ్నకు సమాధానము లేదు.

"పిండ బ్రహ్మాండములు రెండును ఆ రెంటిలోని రెండుహాములు ఈ ఖండములు నాల్గుజేరి అఖండమగు ఎఱుక."

(56 వ కందార్థము)

"అన్నపు సూక్ష్మాంశము మనసెన్నగ నీరంబు ప్రాణమెఱుగుము యీ రెండెన్నడు కలియవా నాడే సున్నసుమీ యెఱుకమాట - సుగుణసంపన్నా - కలసుచె యెఱుక సుమి యింతకన్నా - వున్న దేఱుక మూలమన్నది వినలేదు."

(కందా. 83 ; 152)

జిజ్ఞాసువు :- వంధ్యాపుత్రుడు గగనకుసుమము, త్రికాలమందు లేనివేగదా? ఎఱుక అట్టిదైనచో ఈ వాక్యములు చెప్పినవా రెవరు? నారికేళ ఫలములోనికి నీరు ఎట్లు వచ్చినదో నాలుగవ తరగతి చదువు బాలుడు చెప్పగలడు. కరిమింగిన వెలగపండులోని గుజ్జు యేనుగు జఠరాగ్నిచే కరిగిపోయినది. కరిగర్భమున వెలగపండు పెద్దదైనది. దాని రంధ్రములనుండి ద్రవముగా మారిన గుజ్జు బయటకు అనగా పండునుండి గజగర్భమునందలి జఠరాగ్నిలో కలసిపోయినది. టెంక గుజ్జుకంటెను గట్టిదికనుక అది అట్లే నిలిచినది. ఎఱుకయొక్క యుత్పత్తి బ్రహ్మదు లెఱుగరని చెప్పుచూ యెఱుక అన్నోదకములవల్ల కలిగినదనుట స్వవచన వ్యాఘాతముకాదా?

వేదాంతి :- వీటిని గుఱించి ముందు ప్రత్యేకముగా వివరింతును.

(3) "విను మితరులు యెఱుకను సాక్ష్యని పల్కిరి. నేను

సాక్షినహమని నీతో వినజెప్పితి నింతియె వేఱనకూడదు రెంటి నొక్కటని తెలిసికోరా - మాటల భేదమని కనుక్కోరా."

(కందా. 61)

జిజ్ఞాసువు :- అయ్యా! ఊరగాడిద, ఉచ్చైశ్శ్రవము ఒక్కటియేయైన సాక్షియు అహమును ఒక్కటియే యన వచ్చును. మీరేమందురు?

వేదాంతి :- సాక్షియు అహమును రెండును ఒకటియే యని ప్రస్థానత్రయములయందు యే శాస్త్రమును అంగీకరింపదు. కాని 'అహము' రెండువిధములు. దేహము నేనను అహము ఒకటి. నేను దేహమునుగాను 'పరబ్రహ్మమును' అను అహము రెండవది. మొదటి అహము బంధ హేతువు తుచ్ఛము. రెండవది మోక్ష హేతువు. ఈ విషయమై విపులముగ ముందు చర్చింతును. ప్రస్తుతము ఎఱుకకు స్థానమేది యని అచలవాదులు చెప్పిరో దానిని చెప్పెదను వినుము.

(4) కృష్ణదాసుగారు ఎఱుక హృదయపద్మమున నున్నట్లు శ్రుతులు చెప్పినది సరికాదనిరి (కందా. 62). ఈ వాక్యము వలన కృష్ణదాసుగార్కి శ్రుతులయందు గౌరవము లేదని విదితమైనది. కనుక వీరి వాదము శ్రుతి విరుద్ధము. ఎఱుక శరీరమునందున్నచోటును యిట్లు చెప్పిరి :—

"కంటిలోనిపాప గుర్తెరిగే ఆత్మ."

(బృ. ఉ. ప్ర. 6 అ. 12)

"కంటిలోని పాపయనే ఆత్మలేనిది."

(బృ. ఉ. ప్ర. 1 అ. 2)

దీనినే కృష్ణదాసుగారు అలంకారముగా యిట్లు చెప్పిరి :—

కందార్థము ॥ తొంగ్రలు తొమ్మిది గలమే - న్మగ్రికి యొక రెంటిలోన మగ్రలు నాల్గున్ - డెగ్రది తెల్లది నల్లది కగ్రెది దానగ్రమందు గలదొక్క తూటూ - అది యెరుకానె పులుగుండె చోటూ —" (కందా. 103)

ఈ విధముగ కంటిలోని పాపను ఎఱుకన్నారు. ఇదియే 'ఆపోజ్యోతి' యుట. (కందము. 72, 102)

పురుషునియొక్క బిందువే యెఱుకయని రక్త శుక్లములే జీవమని దీక్షితులవారి మతము. వారిట్లు చెప్పిరి :—

"శిష్యుడు :— అయ్యా! ఎఱుక బిందువు ఒకటేనా? ఏమైన భేదముగలదా"?

గురువు :— "ఎఱుకకు - బిందువుకు ఎంతమాత్రము భేదములేదు. ఎరుకే గుణమాయెను. బిందువు రసమాయెను. రసమే బిందువాయెను. బిందువే రసమాయెను. గనుక ఈ శంక చేయవలసినదిగాదు. ఎరుకను విడవవలెను. ఎరుకకు మరపు గలదు. గనుక ఎరుక నిత్యముగాదనుట." (బృ. పూ. ప్ర. 10)

ఎఱుక మరపుల స్వరూప నిర్వచనము కృష్ణదాసుగారు యీ విధముగ చెప్పిరి.

"ఎరుకనగా యెరిగేటిది - మరుపనగా యెరుక తనను మరచుట మీరెం - న్నెరుగనిదె బయలివి .... (కందా. 147)

ఈ రెండింటినే యింకొకవిధముగా చెప్పిరి.

క॥ ఎరుకన మరపనరానిది -
పరిపూర్ణం బీశ్వరుండనబడు నెరుకెఱుకన్
మరచిన జీవుండనబడు
నెరుకచలము నెరుగనరుగు నెరుక మరపులున్.

(కందము. 233)

"స్వప్నావస్థ గురుడు మేలుకొలుపుతే అదే జాగ్రత్త. అదే ప్రబోధ. ఇంతేగాని నాలుగు అవస్థలు లేవు. ఇంతేగాని యీ శరీరం వొక్కటే. నాలుగు శరీరాలు అనుట అబద్ధం."

(బ్ర. ఉ. ప్ర. 3 అ. 1)

"మహాకారణదేహ శరీరత్రయం అజ్ఞానం అనే మర్యాదా. సర్వం గుర్తెరిగే శరీరమే అని వేదశాస్త్రిలకు అభిమానం." (బ్ర. ఉ. ప్ర. 4 అ. 1)

"దేహములు రెండు లేవు. మూడు లేవు. ఈ దేహము పోతే సూక్ష్మదేహము లేదు." (బ్ర. పూ. ప్ర. 6)

కం॥ "నేనన నాలవ దేహము
మేనన నాలోని మూడు మేనులు సుమ్మీ
నేను మేననున దొక్కటే
కానిది తన మూల మరయ గనరాదుసుమీ."

(కందము. 230)

అన్నారు కృష్ణదాసుగారు.

"అన్నమయకోశమన్న యెరుకే." (బ్ర. పూ. ప్ర. 9)

పర్యవసానమేమనః—— ఈ షోడశాతురీ మంత్రార్థము

నందు చెప్పిన యెఱుకకు మూలము లేదు. శ్రీ జ్ఞానేశ్వరుల శక్తికి మూలమున్నది. శ్రీ అరవిందుల జ్ఞానమునకు మూలమున్నది. యోగవాసిష్ఠకారుల చిత్తమునకు మూలమున్నది. సమర్థుల మూలమాయకు మూలమున్నది. కాబట్టి శ్రీ జ్ఞానదేవాదుల మతములతో దీనికి సామ్యము కుదరదు.

జిజ్ఞాసువు :- కృష్ణదాసుగారు శ్రుతులను ప్రత్యక్షముగ తిరస్కరించిరి. కనుక వీరిమతము ఉపనిషత్తుల నంగీకరింపదని విదితమైనది. ఎఱుక అనగా ఏదని మీ అభిప్రాయము?

వేదాంతి :- నాకంటె చక్కగా చెప్పగల మహనీయులు ఎఱుకయనగా యేది యని చెప్పిరో, దానినే చెప్పెదను వినుము. ఎఱుకను గుఱించి శ్రీ వివేకానందస్వాముల వారు ఒక యుపన్యాసమునందు యిట్లు చెప్పిరి :—

"ఆత్మ యనునది యొకశక్తి కాదు. భావము కూడ కాదు. అది భావములయొక్క నిర్మాత, భావముకాదు; శరీరములయొక్క నిర్మాత, శరీరము కాదు. ఇదెట్లు? శరీరము ఆత్మకాదని మన మెఱుగుదుము. ఏలకాదు. దానికి ఎఱుక (తెలివి) లేదు గనుక. శవమునకు ఎఱుక లేదు. కసాయి అంగడిలోని మాంసమునకు ఎఱుక లేదు. ఎఱుక అనగా నేమి? ప్రతిక్రియా (Reaction) శక్తి. దీనిని ఇంక కొంత లోతునకు దిగి విచారింతము. ఇచ్చట నొక కుండ కలదు. దానిని నేను చూచుచున్నాను. ఎట్లు? కుండనుండి వెలుతురు కిరణములువచ్చి నా కండ్లలో ప్రవేశించును.

కంటిపాప పొర (Retina)పై నొక ఆకృతిని కల్పించును. ఈ ఆకృతి మెదడునకు గొనిపోబడును. అప్పటికిని కండదృష్టి గోచరముకాదు. ఆ గొంపోవు వానిని శారీరశాస్త్రజ్ఞులు స్పర్శనాడులు (Sensory nerves) అందురు. మెదడులోని ఇంద్రియ కేంద్రము ఆ ఆకృతిని మనస్సునకు నివేదించును. మనస్సు ప్రతీకార మొనర్చును. వెంటనే కండ తళుక్కన గోచరించును. ఇంతకన్న సాధారణమగు మఱొక ఉదాహరణము గైకొందము. మీ ముక్కుపై నొక దోమ వ్రాలి దోమలు కల్పించు మనోజ్ఞానుభూతిని కల్పించుచున్నది. కాని మనస్సున నా మాటలలో వ్యగ్రమై యుండుటచేత, ఆ దోమ సంగతియే మీకు తెలియలేదు. ఇప్పుడేమి జరిగినది? మీ శరీరములో నొక చోట దోమ కుట్టినది. అచ్చట కొన్ని స్పర్శనాడులు కలవు. ఆ అనుభూతి నవి మెదడునకు చేర్చినవి. కాని అది మెదడులోనే నిలిచిపోయినది. మీ మనస్సు అన్యత్ర నిలిచియుండుటచే అది ప్రతీకార మొనర్పలేదు. కావున దోమ ఉనికి మీకు ఎఱుక పడలేదు. ఒక క్రొత్త అనుభూతి కలిగినపుడు, మనస్సు ప్రతిక్రియ చేయనిచో, ఆ అనుభూతి మన ఎఱుకకు రాదు. ప్రతీకారము కల్గిన పిదపనే మన మనుభవింతుము, చూతుము, విందుము."*

పూర్వానుభూత విషయము స్మృతిరూపమున తిరిగి అనుభవమునకు రాకుండుటే మరపు. కాని స్థూల సూక్ష్మ

* 'జ్ఞానయోగము' అమృతత్వము అను ఉపన్యాసము నుండి శ్రీ తత్త్వానంద స్వాములవారి అనువాదము.

కారణ శరీరములు మరపు అని కృష్ణదాసుగారు చెప్పినది సరికాదు. ఏలయన, స్థూల సూక్ష్మ శరీరములయందు జాగ్రత్ స్వప్నములయందు మూర్ఛాది దేహజనిత వ్యాధులు లేనియెడల యెఱుక గలదు.

(౯) జ్ఞానముయొక్క వివిధ స్వరూపవిచారము

వివేకానందస్వాములవారి పై వాక్యములవలన ఎఱుక అనగా యెట్టిదో అనుభవపూర్వకముగ విదితమైనది. ఎఱుకను జ్ఞానమని చెప్పిరిగదా! జ్ఞాన మనేకవిధములు. అందులో యెఱుక యేది. అని విచారింతము.

(1) పరబ్రహ్మము శుద్ధ జ్ఞానస్వరూపము. ఉప్పు కల్లునందు ఉప్పుదనము తప్ప వేఱొక రసము లేనియట్లు, ఆయనయందు జ్ఞానము తప్ప వే ఱేదియును లేదు. సర్వ వ్యాపి. వ్యాపక చైతన్యమందురు.

(2) వృత్తిజ్ఞానము :— దీనిని గుఱించి యిదివఱలో చెప్పియుంటిని. కనుక, ఇచ్చట చెప్పనవసరము లేదు.*

(3) సాక్షిజ్ఞానము :— జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయములు (ద్రష్ట, దర్శన, దృశ్యము) లను త్రిపుటియందు ఒకదానిని మఱియొకటి స్వతంత్రముగ నెఱుగజాలదు. ఎట్లన :— ద్రష్ట యొక్క స్వరూపమును దర్శన దృశ్యములుగాని, దర్శన స్వరూపమును ద్రష్టృ దృశ్యములుగాని, దృశ్యము యొక్క

* వెనుక 54 వ పుట క్రింద (Foot Note) లో కలదు, చిత్తగింపుడు.

స్వరూపమును ద్రష్ట్ర దర్శనములుగాని, స్వయముగా తెలిసి కొనజాలవు. ఏలయనగా, ఇవి జడములు. చిదాత్మ (సాక్షి చైతన్యము)చే, త్రిపుటి యెఱుగబడుచున్నది. ఈ త్రిపుటి ఉన్నపుడు దాని యునికియు, అది లేనప్పుడు దాని లేమియు, యెఱుగువాడు చిదాత్మ. జనన మరణములు గల ద్రష్ట తన లేమిని ఎఱుగజాలదు. వృత్తి జ్ఞానము ఘటాకారమును పొంది, దానిని మాని కుడ్యాకారమును పొందినప్పుడు ఘటాకార మెవ్వనిచే నెఱుంగబడును?

ఒకవృత్తి పుట్టి అది నశించి వేఱొకవృత్తి పుట్టుటకు ముందు త్రిపుటి లేదు. అనగా: రెండు వృత్తులకు మధ్య నుండు వ్యవధిని (చిదాకాశమును) ఆ సమయమున నశించి యున్న ద్రష్ట, దర్శన, దృశ్యము, లెఱుగ లేవుకదా? అట్టి చిదాకాశమును ఎఱుగువా డెవ్వడు? చిదాత్మ (సాక్షి)యే గదా? చిదాకాశమును చిదాకాశమే యెఱుగుచున్నది. చిదాత్మయే చిదాకాశము.

(4) సంయక్ జ్ఞానము :— అంతఃకరణము నానావిధ వృత్తిరూపముగ పరిణమించును. ఆ వృత్తులయందు చిదాత్మ ప్రతిఫలించును. ఆ కారణమున వృత్తులు జ్ఞానము లన బడును. ఈ జ్ఞానములు చిదాత్మయందు క్వాచిత్కములై కలుగుచుండును. వేదాంత మహావాక్యముల శ్రవణమువలన అంతఃకరణమునందు ఒకవృత్తి (అఖండాకార వృత్తి) చిదాత్మ ప్రతిబింబముకలదై పుట్టును. దీనినే సంయక్ జ్ఞాన మందురు. ఈ సంయక్ జ్ఞానమువలననే అవిద్య (అజ్ఞానము) నివర్తించును. (నై. సి. 3. 2)

(5) సంశయజ్ఞానము :— ఇదికూడ ఒక విధముగ భ్రమమే యైయున్నది. ఎట్లన — ఏక విశేష్యమునందు రెండు విశేషణములయొక్క జ్ఞానము సంశయ మనబడును. ఉదాహరణమునకు :— మనము త్రోవను నడచునప్పుడు మనక చీకటిలో త్రాడు కనబడినపుడు, ఆ త్రాడునే సమీపమునుండిగాక కొంతదూరమునుండి చూచిన అది 'త్రాడై యుండునా, పామైయుండునా?' అని తలతుము. ఇట్టి అనిశ్చయజ్ఞానమును సంశయజ్ఞానమందురు.

(6) భ్రాంతిజ్ఞానము :— ఆత్రాటినే మసక చీకటిలో చూచి పామని భ్రమపడి భయముచే ముందునకు పోలేక నిలిచిపోవుదుము. ఇచ్చట కలిగిన జ్ఞానమే మిథ్యాజ్ఞానము, లేక, భ్రాంతి జ్ఞానమనియు, భ్రమయనియు అందురు. ఈ భ్రాంతిని నివర్తింపచేయునది సంయక్ జ్ఞానము.

(7) స్మృతి - విస్మృతులు :— మన మొకప్పుడు ఒక అశ్వమును చూచియుందుము. దాని రూపాదులు (సంస్కారములు) మన మానసమునందుండును. ఏదేని మఱియొక యశ్వమును చూచినప్పుడుగాని, అశ్వకథనము విన్నప్పుడుగాని మనము యిదివఱలో చూచిన అశ్వము జ్ఞప్తికి వచ్చును. దీనిని స్మృతి అందురు. అనగా : పూర్వానుభూత విషయాకారమును పొందిన అంతఃకరణవృత్తి. ఇది యింద్రియ సంబంధము వలన కలిగినదిగాక సంస్కార సంబంధము వలన కలిగినది.* ఒకప్పుడు మనము పూర్వము

* స్మృతి, సంశయ, జ్ఞానముల విచారము, ఈ గ్రంథముయొక్క ప్రథమభాగము ౭౭ వ అధ్యాయమున చేయబడినది.

చూచిన అశ్వమే కనబడినయెడల దానిని మన మిదివఱకు చూచితిమను జ్ఞానము మనకు కలుగును. దానికి 'ప్రత్యభిజ్ఞ' అని యందురు. అనగా పూర్వము చూడబడిన అశ్వమే యిది యని గుర్తింతుము. అట్లు గుర్తింపలేక పోయెనయెడల దానిని 'విస్మృతి' యందురు. ఇదే మఱపు. మఱపనగా శరీరముకాదు. జ్ఞప్తికి రాకపోవుటయే మఱపు. శ్రీ వివేకానందస్వాములవా రిట్లు చెప్పిరి :—

"నేను మీవైపు చూచునప్పుడు నామనస్సులో నొక తరంగము కలుగును. అది నామనస్సున లోతునకు మునిగిపోయి క్రమేణ సూక్ష్మత రాకృతిని దాల్చి పడియుండును. కాని నాశము పొందదు. తిరిగి యదెన్నడో స్మృతి (జ్ఞప్తి) రూపమున దలచూపుటకు సిద్ధముగనుండును." (జ్ఞానయోగము – విశ్వతత్త్వదర్పణము పిండాండము) అట్లు స్మృతిరూపమున తలయెత్తక పోవుటయే విస్మృతి. అనగా : మఱపు.

ఇంతవఱకును మనము విచారించిన దానిని బట్టి జ్ఞానము ఏడువిధములని పెద్దల నిర్ణయము. దీక్షితులవారి మతమున యెఱుక, యెఱుక లేకుండుట అనునవి రెండే. వేదాంతులు సయితము ఉపాధి భేదమునుబట్టి బోధకొఱకు జ్ఞానము ఏడువిధములని ఆవిధముగా చెప్పవలసి వచ్చినది. ఇది వ్యావహారిక మే గాని, పారమార్థికముగ జ్ఞానమంతయు ఒక్కటే.

ఎఱుక, శరీరము ఒక్కటేనని దీక్షితులవారి మతము. ఎఱుక యెఱుగునట్టి స్వభావముగలది. శరీరము ఎఱుగబడు

నట్టి స్వభావముగలది. రెండును పరస్పర విరుద్ధ ధర్మములు గలవి ఒక్కటిగా నెట్లు రూపొందును? రెండును ప్రకృతి సంభవము లేగదా? అనవచ్చును. వారు చెప్పెడి యెఱుక మాయికమే గాని, జ్ఞానము కేవలము మాయికము కాదు. చిదాభాసుడు లేని అంతఃకరణము తెలిసికొనజాలదని వేదాంతుల మతము. "ఒక్క అద్వైతులే గదా చిదాభాసుని అంగీకరించుచున్నారు. తక్కిన వేదాంతు లెవ్వరును అంగీకరింపరే?" అని ప్రశ్నింపవచ్చును. ఇందుకు సమాధానమిది :—

(౧౦) ఎఱుక - జీవుడుకాదు

శ్రీమద్రామానుజాచార్యుల విశిష్టాద్వైతము, శ్రీమధ్వాచార్యులవారి ద్వైతము, శ్రీనింబార్కాచార్యులవారి ద్వైతాద్వైతము, శ్రీవల్లభాచార్యులవారి శుద్ధాద్వైతము, శ్రీకృష్ణచైతన్యుల అచింత్య భేదాభేదమతము, నీలకంఠ శివాచార్యులవారి శైవమతము, శ్రీపతిపండితుల వీరశైవము, శాక్తము యీ మతములన్నియు ఏకగ్రీవముగ జీవుడు అణుస్వరూపుడనియు, నిత్యుడనియు, పరమేశ్వరాంశమనియు, జ్ఞానస్వరూపుడనియు చెప్పిరిగదా? ఇందులో కొందఱి మతము ననుసరించి పరమేశ్వరునివలె జీవుడు సచ్చిదానందములు పూర్ణముగ గలవాడు గాకపోయినను, కొంతవఱకైనను సచ్చిదానంద స్వరూపుడనియే అంగీకరించి, జీవుడు అణువు కాకపోయినను భ్రాంతిచే తాను అణువనుకొనిరి. జీవుడు హృదయమున నుండుననియు, ఇంటిలోని దీపము యింటిలో నొక్కచోట నున్నను యింటినంతయు ప్రకాశింప

జేయునట్లు శరీరమంతేయు ప్రకాశింపజేయుననియు అంటూ చెప్పిరి. జీవుడు స్వరూపతః జ్ఞానస్వరూపుడనియు, అతని స్వరూపజ్ఞానము ధర్మభూతజ్ఞానమనియు, అతనియందుండి దేహమంతటను వ్యాపించిన జీవుని జ్ఞానము ధర్మభూతజ్ఞానమనియు చెప్పిరని చెప్పియుంటిని. దీక్షితులవారు చెప్పిన జ్ఞానమున (ఎఱుక)కు వీటిలో దేనితోను పోలిక లేదు. దీక్షితులవారు చెప్పు యెఱుకను వారు చెప్పిన విధమును మార్పక అంగీకరించువారు హిందూమత తత్త్వశాఖలయందే యొక్కరును లేరనియే చెప్పవచ్చును. జీవుడు వేఱు, దేహము వేఱని వైదిక మతశాఖలన్నియు ఆమోదించినవి. దేహమునకు జీవుడు అన్యము కాదని దీక్షితులవారి మతము. అహంకారము, యెఱుక ఒక్కటేనని దీక్షితులవారన్నారు. అహంకారమనగా నేమి?

(౧౧) అహంకారము - ఎఱుక

దీక్షితులవారు చెప్పిన అహంకారము యెట్టిదో తెలిసికొనుట దుస్తరము. ఒకచోట 'అవును' అన్న దానినే మఱియొకచోట 'కాదు' అనుట దీక్షితులవారికి పరిపాటియైనది. "అహంకారమే దేవుడు. అహంకారము లేకుంటే పరబ్రహ్మన్ని ఎవడు ఎరుగు? అహంకారమే పరబ్రహ్మస్వరూపం. అహంకారం వుంటే అన్నియున్నవి. అహంకారమే లేకుంటే దానితోనే పోయెను. అందరూ అహంకారస్వరూపులే. అందరూ అహంకారము వలనే పుట్టినారు. నేను తురకవాణ్ణి అని అహంకారమునకే యెరుక. అహంకారమే తురకది." (బృ. పూ. ప్ర. 3) అదేపుటలో కొన్ని పంక్తుల

క్రింద "అహంకారము శరీరము ఒక్కటే. శరీరం వేరే అన్నది అహంకారమే." ఇంకొక చోట ఇట్లు చెప్పిరి :—

"అహంకారము దేహమువలననే కలిగినది. సందేహములేదు. అహంకారము వలననే ఆశాపాశములు సంభవించినవి. అహంకారము లేకపోతే నరకములేదు. అహంకారము ఆవల యీవల దిరుగదు. తిరుగుచున్నదా దేహములు తిరుగవలె. దేహము తిరుగక అహంకారము తిరుగుచున్నదా అంటే అహంకారమునకు కాళ్లు గలవా ? అహంకారము సూక్ష్మమైనది. అహంకారము అహంకారమును పుట్టించుచున్నది. అహంకారమునకు రూపములేదు. పేరులేదని గ్రంథములలో వ్రాయుచున్నారు. అహంకారమే శరీరము. అహంకారమునకే అన్ని పేర్లు. అహంకారము లోపల వెలుపల నిండి సంపూర్ణమై ఉన్నదని అన్నారు. శరీరములయందే కనబడుచున్నదిగాని శరీరములేని ఆకాశమునకు అహంకారము కనబడలేదు. వాయువునందు కనబడలేదు. అగ్నియందు కనబడలేదు. జలమందు కనబడలేదు. భూమియందు కనబడలేదు. భూతములయందు అహంకారము లేకుంటే భూతములవల్ల గలిగిన శరీరమునకు మాత్రము మేలాగున గలుగుననే పశుమందు కలుగుటకు కారణము గలదు. ఆ కారణమేలాగంటే దేహమునకు బాధగలిగితే యావద్దేహమునకు గలుగవలెగదా. అలాగున కనబడలేదు. దేహమునందు గల గోళ్ళకున్నూ రోమములకున్నూ ఎంత కొట్టినా, గిల్లినా, కరచినా బాధ కలుగనేరదుగదా. అలాగుననే దేహములందు అహంకారము కనపడుచున్నదిగాని మహాభూతములందు కనుబడలేదు. అహంకారము అన్ని కులములయందు కలదు. అహంకారములేని కులములేదు. అహంకారములేని కులము మహోత్తమము.

అహంకారములేని వారలకు బాధలేదు. "ఏబాధకైనా అహంకారమే మూలము." (బృ. పూ. ప్ర. 3)

"ఈ అహంకారము శరీరమువలన కలిగినది. శరీరము లేకపోతే అహంకారములేదు. శరీరమునకు మూలము అహంకారము. శరీరమును విడిచి అహంకారము ఉండునా? అహంకారమునకు శరీరమునకు భేదములేదు. అహంకారమే జీవుడు."

(బృ. పూ. ప్ర. 35)

"ఎరుక అఖండమైన పక్షమున కాలికి తేలుకుట్టితే కంటికి నీరుగారినట్లు వొకరికి తేలుకుట్టితే అందరికి బాధకలుగవలయును గదా? ఒకరు ముక్తులైతే అందరు ముక్తులు కావలెను. అందరు ముక్తులైతే నరకమునకు యెవ్వరులేరు. అట్లనుటకు చెల్లదు."

(బృ. పూ. ప్ర. 10)

ఇందుకు విరుద్ధముగా వారే ఇంకొకచోట అందరి యందున్న అహంకారము ఒక్కటేనని యీ క్రింది వాక్యములను చెప్పిరి —

"నీవనగా యెవరు? నేనగా యెవరు? నీవు నేను అహంకారమేగదా. అహంకారమే నీవాయెను, నీవే నేనాయను, నే నే నీవాయను. నేను నీవనే భేదములేదు. నీవని ప్రస్తాపించినపుడు భేదబుద్ధి తోచుచుండును. ఒక అహంకారమే అన్ని దేహాములలోను యున్నది. దానిని నీవు నేనని యనిన దోషమే. నీవు లేదు. నేనూలేదు. నీవు నేను లేకపోతే రూపములు భేదమై యుండవలదా యని యందురేమో." అనుదానికి యీ క్రింది ఉదాహరణమును ఇచ్చిరి :—

"ఒక కుక్క గాజుయిండ్లలోనుండి యే మల్లారములో యే గాజులలో చూచినను తాను ప్రతిఫలించి మొరుగుచుండును. అలాగే తాను అన్ని శరీరములలోను 'ఉండి తనకు తానే అన్యముగా తోచుకొని భ్రాంతిచేత తిరుగుటేగాని తెలుసుకొంటే తనకు అన్యమైన వస్తువు ఒకటీలేదు." (బృ. పూ. ప్ర. 6)

ఎఱుకతో సంభాషణ జరిగినట్లు వ్రాసిరి. అందు నెఱుక యిట్లు ప్రశ్నింపబడెను.

"ప్రశ్న :— నీవు ఎక్కడ వున్నావు?"

ఎఱుక చెప్పిన ఉత్తరము :— "ఉ॥ నే నంతట నిండి యున్నాను." (బృ. పూ. ప్ర. 88) దీనిని బలపరచుచు మఱి యొకచోట "ఒక అహంకారమే అన్ని దేహములలోను యున్నది." (బృ. పూ. ప్ర. 6) ఎఱుక అఖండమని కృష్ణదాసుగారు చెప్పిన కందార్థము(56)ను ఉదాహరించియుంటిని. ఈ విధముగా ఒకచోట వారు చెప్పిన వాక్యములను మఱి యొకచోట వారే ఖండించిరి. అహంకారమును గుఱించి వేదాంతుల అభిప్రాయమును తెలిపెదను.

అహంకారము ఆత్మ ధర్మముకాదు. ఆత్మ ధర్మమైన యెడల అహంకారము మోక్షదశయందును సుషుప్తి యందును మూర్ఛయందును ఆత్మను వదలక యుండవల యును. అట్లుండుటలేదు. అందుచేత అహంకారము ఆత్మ యనిగాని, ఆత్మయొక్క ధర్మమనిగాని అనరాదు. అహంకారము ఆత్మా - నాత్మ గ్రంథి. అనగా :— ఆత్మయందు అనాత్మ ధర్మమును, అనాత్మయందు ఆత్మ ధర్మమును ఆరోపించునట్టిది. ఇదియే సంసారమునకు మూలము. ఆత్మను

ఆత్మగను, అనాత్మను అనాత్మగను దర్శించుటే అహంకార నాశనము.

అచలబోధయందు మెలుకతప్ప ఆత్మయనునది లేదు. దీక్షితులవారి మతము ననుసరించి మెలుక - శరీరము రెండును ఒక్కటియే యైనందున ఒకదాని ధర్మము మఱి యొకదానియం దారోపింపబడుట లేదు. ఎలుకకు శరీరమును, శరీరమునకు ఎలుకయు, చెట్టునకు విత్తును, విత్తునకు చెట్టును పుట్టినట్లు పుట్టినవని వారు చెప్పియున్నందున, ఆ రెండిటికి ఒకదానికొకటి కార్యకారణసంబంధమేర్పడినందున యిచట ఆరోపణకు అవకాశమే లేదు. కనుక, గ్రంథి పుట్టుటకు అవకాశమే లేదు. అచ్చముగా వేదాంతులు చెప్పునట్టి అహంకారమును అచలవాదులు చెప్పునట్టి అహంకారము (ఎలుకయు)ను ఒకటి కావు. సుషుప్తియందు మెలుక అహం కారములు రెండును లేవు. కనుక రెండును ఒక్కటియే యని సాధించినను ముక్తావస్థయందు అహంకారము (గ్రంథి) లేదు. దీక్షితులవారికిని వారి గురువులవారికిని అహంకారము లేదని వారే చెప్పుదురు. అది నిజమేయని మన మనుకొన్నను వారికి మెలుక కలదు. ఎలుకతోనే గదా గ్రంథముల రచి యించి శిష్యులకు బోధించిరి. కనుక అహంకారమును మెలుకయు ఒకటి కావు. రెండును ఒక్కటియే యైనచో ఉండిన రెండును ఉండవలెను, లేకున్నచో రెండును లేకపో వలెను.

దీక్షితులవారు పైన చెప్పిన వాక్యములయందు పరస్పర విరుద్ధమైనవి కొన్ని గలవు. వాటిని చెప్పెదను :— ఎలుక అన్నిచోట్లను కలదట. అహంకార మట్టిది కాదట.

అహంకారము మహాభూతములయందు లేదట. శరీరము నందు మాత్రమే గలదట. మఱియు 'అహంకారమే యెఱుక' 'అహంకారము శరీరము వొక్కటే' (బృ. పూ. ప్ర. 22). 'అహంకారము యెరుక వక్కటే' బృ. పూ. ప్ర. 25) వారి గ్రంథమునందే అనేకచోట్ల వారు చెప్పిన వాక్యములకు యీ వాక్యములు విరుద్ధము. "భూతములయందు అహంకారము లేకుంటే భూతములవల్ల కలిగిన శరీరములకు మాత్రము యేలాగున కలుగు"నని ప్రశ్నించుకొన్నారు. ఈ ప్రశ్నకు వారికి తగు సమాధానము చిక్కలేదు. శరీరమునకు బాధ కలిగినను శరీరముతో పుట్టిన గోళ్లకు వెంట్రుకలకు బాధ లేనట్లని సమాధానపడినారు.

జిజ్ఞాసువు :- అహంకారము లేకపోయిన లోకవ్యవహారము జరుపుటెట్లు?

వేదాంతి :- అహంకారము మూడు విధములని 'యోగవాసిష్ఠము' చెప్పినది.

(1) జగత్తునకు కారణరూపుడగు పరమాత్ముడును, ఆయన కార్యరూపమని భావించు దృశ్యజగత్తును, నాకంటె అన్యముకాదను అహంకారము

(2) దృశ్యరూపమగు జడజగత్తును నేనుకాను. పరము సూక్ష్మమును దృగ్రూపమును నగు సాక్షిని నేనను అహంకారము.

(3) శరీరమే నేనను అహంకారము.

ఈ మూటియందు మొదటి రెండును మోక్షమును

కలుగజేయును. మూడవది పురుషుని సంసారమున బంధించును కనుక విడువదగినది.

(యో. వా. స్థితి. 38-49 నుండి 52 వఱకు)

ముక్తపురుషునియందు మొదటి రెండు శుభాహంకారములు కూడ నుండవని పెద్దలందురు. అయినచో భోజనపానాదు లెట్లుజరుగు నను ప్రశ్నమునకు సమాధానము — సర్వభూతహృదయాంతర్వర్తియైన యీశ్వరుడే ముక్తపురుని సర్వవ్యవహారములు జరుపుచుండును. అచలబోధయందన్నచో సర్వజీవహృదయాంతర్వర్తియై వాటిని నడుపు యీశ్వరు డొకడు లేడు. కనుక వారిమతము ననుసరించి ముక్తపురుషులకు అహంకారము లేకపోయినచో లోకవ్యవహార మెట్లు జరుగునో వారు తెలుపలేదు.

(౧౨) ఎఱుక - సాక్షి

సాక్షిని గుఱించి యిదివఱలో చెప్పియుంటిని.* ఇచట మఱికొన్ని విషయములు చెప్పవలసిన ఆవశ్యకత కలిగినది. దీక్షితులవారును, కృష్ణదాసుగారును చెప్పిన యెఱుక, వేదాంతులు చెప్పునట్టి సాక్షి కాదు, వేదాంతము ననుసరించి

---

* ఈ గ్రంథము ప్రథమభాగమునందలి రెండవ ప్రకరణమున ౩౧, ౩౨, ౩౩, ౩౪, ౩౫ అధ్యాయములయందు సాక్షిని గుఱించిన వివరము కలదు. ఈ ప్రకరణమునందే (౯)వ అధ్యాయమునను చెప్పియున్నాను. ఈ అధ్యాయమున ఎఱుక సాక్షి కాదని ఉపనిషత్తులయందుండియు శ్రీ జ్ఞానేశ్వరులవారి గ్రంథములనుండియు అనేక ప్రమాణముల చూపుచున్నాను.

సాక్షి చైతన్యము పరమాత్మ. జననమరణములు లేనివాడు. జ్ఞానస్వరూపుడు. ఈ విషయము పంచదశియందలి నాటక దీపప్రకరణమున చక్కగా వివరించిరి. వేదాంతులు చెప్పు ప్రమగాని, అచలవేదాంతులు చెప్పునట్టి యెఱుకగాని సాక్షియని శ్రుతు లంగీకరింపవు. ఏలయన?

శ్లో॥ బహిరంత ర్విభాగోఽయం దేహాపేక్షో న సాక్షిణి,
విషయా బాహ్యదేశస్థా దేహస్యాంత రహంకృతి.

(వే. పం. 10-16)

తా॥ సాక్షికి దేహములోపలయనియు, వెలుపల యనియు, భేదము లేదు. దేహాపేక్షయును లేదు. అహంకార మన్నదో అది దేహములోపలనుండు వృత్తి. దీనికి దేహాపేక్ష కలదు. —

శబ్దాదులు బాహ్యవిషయములు, సుఖదుఃఖాదులు ఆంతరములు. "ఎచట బహిరింద్రియములుగాని అంతరింద్రియములుగాని ప్రవేశింపవో అచట సాక్షి (పరమాత్మ) సహజ ప్రకాశముతో వెలుగొందుచున్నాడు." (వే. పం. 22-20)

"బుద్ధి తన పరిణామముచే యే దేశమును యే వస్తువును కల్పించుచున్నదో, అనగా: ఆ యా రూపమున పరిణమించుచున్నదో ఆ యా ఆకారమును సాక్షి ప్రకాశింప జేయుచున్నాడు." (వే. పం. 22-23) ఇట్లు చెప్పుటవలన సాక్షికి కర్తృత్వము కలుగదు. కొంద ఱిట్లందురు. "సాక్ష్యముండిననేగదా సాక్షియుండును." 'సాక్షి' అన్నపుడు 'సాక్ష్యము' అపేక్షింపబడుచున్నది. కనుక సాక్షి మాయికము. మాయికమయినదంతయు నశించునుగదా? కనుక,

సాక్షి నిత్యు డెట్లగును? అని ఆక్షేపింతురు. వారికి నా సమాధానమిది :— పరమాత్మ త్రిపుటిని ప్రకాశింపజేయు నపుడు ఆయనకు 'సాక్షి' అను నామము కల్పింపబడినది. త్రిపుటి (సాక్ష్యము) లేని సమయమున ఆత్మకు సాక్షియను వ్యావహారిక నామ ముండదు. 'సాక్షి' యను నామము నిత్యము కాదేగాని సాక్షి జ్ఞానము నిత్యసత్యముగు చిదాత్మయే. ఒకవ్యక్తి న్యాయాధికారిగా ఉద్యోగమునందున్నపుడు 'న్యాయాధిపతి' (జడ్జి) అని పిలువబడును. ఆ యుద్యోగమునుండి ఆ వ్యక్తి విరమించిన పిమ్మట ఆ వ్యక్తి స్వంత పేరున పిలువబడును. ఉద్యోగ విరమణముతో వ్యక్తి నశించదుగదా? అట్లే సాక్షికి సాక్ష్యము లేకపోయినను నాశము లేదు.

జిజ్ఞాసువు :- అయ్యా! ఎఱుక, అహంకారము, సాక్షి యనునవి ఒకటియే యనుటకును సాక్షి నశించుననుటకును శాస్త్రప్రమాణ మేమైన కలదా?

వేదాంతి :— అట్టి శాస్త్రప్రమాణ మేదియును లేదు. సాక్షి మాయికమని, మాయికమైనది సర్వము నశించునని దీక్షితులవారి భావము. సాక్షి మాయికమనుటకు కారణము పైన వివరించితిని. ఇంకొక కారణ మేమన పురాణముల యందు, యే యే పురాణములు యే యే దేవతాపరముగ చెప్పబడినవో ఆ యా పురాణములయందు ఆ యా దేవతలనే పరతత్త్వమందురు. దేవియే పరతత్త్వమని చెప్పునట్టి పురాణములు, శాస్త్రములు, దేవిని సాక్షియనియు, శివుడే పరతత్త్వమని చెప్పిన పురాణములు, శాస్త్రములు శివుడే

సాక్షియనియు, విష్ణువే పరతత్త్వమని చెప్పిన పురాణములు, శాస్త్రములు విష్ణువే సాక్షియనియు చెప్పినవి. దేవీ, శివ, కేశవులు మాయికులేగదా ? కనుక, సాక్షి మాయికుడే (నశించువాడే) అని దీక్షితులవారి అభిప్రాయమైయుండినచో అట్టి అభిప్రాయము సరియైనది కాదు. ఏలయన :— దేవీ, శివ, కేశవాదుల పారమ్యమును చెప్పిన శాస్త్రములు ఆ యా దేవతలు నాశరహితులు (నిత్యులు) అను భావముతో వారిని 'సాక్షి' యని చెప్పిరేగాని, వారు మాయికులు, నశించువారను భావముతో కాదు. పరతత్త్వమని చెప్పినప్పుడే వారికి నాశనము లేదని వారి భక్తుల అభిప్రాయముకదా ? దీక్షితులవారు యిట్టి వాక్యముల నాధారముగాగొని సాక్షి నశించువాడనిన వారివాదము గ్రాహ్యము కాదు. అది శాస్త్రవిరుద్ధము. సాక్షి నశించుననిన, సాక్షియొక్క నాశమును యెఱుగునట్టి మఱియొక సాక్షి యుండవలయును. అతడును సాక్షియే గనుక అతడును నశించువాడే యనవలయును. అతని నాశ మెఱుగుటకు మఱియొక సాక్షి కావలసివచ్చును. ఇట్లైన అనవస్థాదోషము సంభవించును. కనుక సాక్షికి నిత్యత్వ మంగీకరింపక తప్పదు. సర్వప్రపంచము లయమైనను సాక్షి నిత్యుడై యుండును. అట్లుండనిచో ప్రపంచము లయమైనదను సంగతియే మనకు తెలియుటకు వీలులేదు. విద్యారణ్యస్వాములవారు యిట్లు చెప్పిరి :—

శ్లో॥ మనోజృంభణరాహిత్యే యథా సాక్షీ నిరాకులః,
మాయాజృంభణతః పూర్వం సత్తథైవ నిరాకులమ్.

(వే. పం. 2-46)

తా॥ మాయ విజృంభించి ప్రపంచరూపమున పరిణ

మింపక పూర్వము సత్పదార్థమగు బ్రహ్మ మెట్లు నిరాకులమైయుండెనో అట్లే మనోవిజృంభణము లేని సమయమున సాక్షి స్వస్వరూపముతో నిర్మలుడై యుండును.

ఈ యర్థమే మహాభారతమునం దిట్లు చెప్పబడెను :—

క॥ భూతము లన్నియు నడఁగిన
నా తఱిఁ దనుఁదాన కనుచు నంజన రహిత
త్వాతిశయ మొనఁగ వెలిఁగెడు
నా తెలివాతత్వమునకు నమరు మహేశా. (మ. భా. ఆ. న. 4-194)

ఇంతకంటెను అధికముగ చెప్పవలసిన దేమున్నది? దీక్షితులవారును కృష్ణదాసుగారును ఈ విషయమై చెప్పిన వాక్యముల నిట నుదాహరింతును.

"గుర్తెరిగేదాని ప్రథావాన్ని గుర్తెరుగుటే గురుద్రోహం." (బృ. ఉ. ప్ర. 4 అ. 1) అనగా :— ఎఱుకను మెఱిగే సాక్షి ఒకడున్నాడంటే గురుద్రోహమట. కృష్ణదాసుగారి వాక్యములు యిదివఱలో చెప్పితిని. మఱియును వారి వాక్యములు కొన్ని యిచట చెప్పెదను.

"ఎరుకే కోశము లైదెరు - గెరుకే భూతముల నెరుగు నెరుగును సర్వం - బెరుకే యెరుక నెరుంగును - యెరుకను గుర్తెరుగ వేరె - యెరుకా వున్నాదా - వున్నదంటె - నరకామె కాదా." (కందా. 165)

దీక్షితులవారు యెఱుకే సాక్షి అన్నారు. ఎఱుకకు రాకడ పోకడ కలదన్నారు. అనగా: పుట్టుట గిట్టుట యని

యర్థము. సరికదా! ఎఱుక లేకపోయినదని చెప్పిన, దాని లేమిని గుర్తించినవా రెవ్వరు? ఎఱుక ఉన్నప్పుడు యెఱుకను బయలును యెఱుకయే యెఱుగుచున్నదన్నారు. ఎఱుక లేనప్పుడు బయలును లేదు యెఱుకయు లేదన్నారు. "చలనము కలిగితేనే అచలమున్నదిగాని చలనము లేకపోతే అచలమేలాగున కలదు." (బృ. పూ. ప్ర. 10) దీక్షితులవారన్నారు. ఇంతేకదా! ఈ రెండింటికంటె మూడవది లేదు కదా? ఎఱుకను పరిపూర్ణ మెఱుగదు. (కందా. 122) బయలు తన్ను తా నెఱుగదు. (కందా. 39) ఎఱుక వీరి మతమున నిత్యముకాదు. దాని అనిత్యతను యెఱిగినవా రెవ్వరు? కనుక అద్వైతులు చెప్పిన సాక్షి నంగీకరింప వలయును. సాక్షి నంగీకరించిన, వీరి అచలవేదాంతము శంకరాద్వైతమగునని వీరి భయము. ఇదిగాక దీక్షితుల వారి మతమున మఱియొక చిక్కు కలదు. ఏమన ఎఱుక బయలు నెఱిగి తాను లేకపోవునట. ఎఱిగిన యెఱుక నశించిన బయలున్నదని యెట్లు తెలిసిది? నశించిన యెఱుక చెప్ప లేదుకదా? బయలున్నదని యెవరు చెప్పిరి? ఇంకొక చిక్కు కూడ కలదు. ఏమన: చలనము (ఎఱుక) లేకపోయిన అచలము కూడ లేదట. అట్లైన యెఱుక నశియించినపుడు బయలు నశించును, యెఱుక పుట్టినపుడు బయలును పుట్టుచున్నది అని చెప్పవలసి వచ్చును. అట్లైన బయలుకూడ అసత్యమే యగును.

జిజ్ఞాసువు :- అయ్యా! ఇచ్చట నాకొక సంశయము కలుగుచున్నది. శ్రీవిద్యయందు శుక్లబిందురూపశివుని (ఆత్మ) యందు అంతర్లీనమైయున్న విమర్శరూపరక్తబిందువగు శక్తి బయలువెడలి శివునకు దర్పణమువంటిదై నదని చెప్పియుంటిరి. ఆ శక్తియే సాక్షి యనియు చెప్పితిరి. దీక్షితులవారు చెప్పిన 'మూలములేని గుర్తెరిగే శరీర' మే విమర్శరూపశక్తి (జ్ఞానదేవి) అయినచో యెటుకను సాక్షి యనిన తప్పేమి ?

వేదాంతి :- శ్రీవిద్య వేఱు. దీక్షితులవారిబోధ వేఱు. రెండును ఒకటికావు. దీక్షితులవారు అఖండము ప్రతిఫలించదన్నారు. రూపమున్నదానికే ప్రతిబింబముండును గాని రూపరహితమగు శివునకు (ఆత్మకు) ప్రతిబింబము ఉండదన్నారు. ఈ రెండంశములు శ్రీవిద్యకు విరుద్ధము. శ్రీవిద్యననుసరించి కేవలము శక్తివలన ప్రపంచోత్పత్తి కానేరదు. శివుడు 'అ' కారము, శక్తి 'హ' కారము. కనుక వీరిరువురవలనను ప్రపంచోత్పత్తి కలుగనేరదు. మూడవదియగు మిశ్రబిందువు 'అహం' వలన ప్రపంచోత్పత్తి జరిగినది. 'అహం' సాక్షి యని శ్రీవిద్యోపాసకులు చెప్పరు. 'హ' కార రూపిణియగు శక్తినే సాక్షి యని శ్రీవిద్యయందు చెప్పిరి. కనుక దీక్షితులవారి మతమును శ్రీవిద్యయు భిన్నములు. శ్రీవిద్యయందు శక్తి (సర్వసాక్షి) నిత్య. దీక్షితుల మతమున అనిత్య మిథ్య.

పర్యవసానమేమన దీక్షితులవారు చెప్పిన యెఱుక వేఱు, ఉపనిషత్తులయందును, వేదాంత ప్రకరణ గ్రంథములయందును చెప్పిన సాక్షి వేఱు. రెండును ఒకటియే యన్న

మతము శ్రుతులకు విరుద్ధము. ఆ శ్రుతిమంత్రములను ముందు రాబోవు హృదయవిద్యను గురించి చెప్పు సందర్భమున వివరింతును.

ఈవిధముగా సాక్షియొక్క నిత్యత్వము స్థిరపడినను, "సాక్షియే ఆత్మయని, అదియే జ్ఞానమని, దానినే నాలుగవ శరీరమని" దీక్షితులవారు చెప్పిరి. సాక్షిని గురించి శ్రీ జ్ఞానేశ్వరుల సంప్రదాయమువారి అభిప్రాయము తెలిపి, పిమ్మట నాలుగవశరీరమనగా నెట్టిదో పరిశీలింతును.

సాక్షి నిత్యుడని శ్రీ జ్ఞానదేవులవారు చెప్పినదానిని సంగ్రహముగ యీ క్రింద నుదాహరింతును :—

శ్లో॥ "యస్యాదర్శనలోభేన ద్రష్టృత్వం ప్రతిపద్యతే
అదృష్ట్వా తాం స్వయం తేన ద్రష్టృత్వ మపిహీయతే."

(అమృ. 1-33)

పై శ్లోకమునకు ఆంధ్రానువాదము.

"అంతియగాక యద్దేవుండు దేవీదర్శనోత్సాహంబున ద్రష్టత్వంబుఁ గావించుకొని తద్దర్శనాభావంబునఁ దన్ను దూరస్థుం జేసికొనియె." (అను. 1-33)

సర్వము నేనై యుంటినను అనుభవమునందు ద్రష్ట లేడు. కనుక, కల్పితమైన దృశ్యము అదృశ్యమయినంతనే దాని నాధారముగా గైకొని చెప్పబడిన ద్రష్టయు లేకపోవుట వలన దర్శనము లేనిదే యగుటచే సాక్షిత్వము లేదు. కాని తాను లేకపోవుట యనునది లేదు. దీక్షితులవారి యీ క్రింది వాక్యములు పై వాక్యములకు విరుద్ధములు.

"నీవు లేకపోతే నేను సూచన చేసినది లేకపోదుగదా."

(బృ. ఉ. పు. 9)

"తాను లేకపోవడమే విచారనకు ఫలం."

(బృ. ఉ. పు. 10)

'తాను లేనివాడనని' 'నేను లేనని' చెప్పిన శ్రీ శివరామదీక్షితుల వాక్యములు జ్ఞానేశ్వరస్వాముల వారి అమృతానుభవ వ్యాఖ్యానమున ఏవిధముగ ఖండింపబడినవో గమనింతము :—

"భ్రాంతిజ్ఞానము ననుసరించి దృశ్యప్రపంచము సత్యమని భావించి దాని ననుసరించిన మాత్రముచేతనే జగత్తు నపేక్షించి పరమాత్మయందు ద్రష్టృభావమేర్పడినది. వాస్తవమును విచారించగా జగత్తంతయు మిథ్యయని తెలియుటచేత జగత్తు ననుసరించి యేర్పడిన తనయందలి కల్పితద్రష్టృత్వము కూడ మిథ్యాభూతమే యగుచున్నది. కాని తానుమాత్రము మిథ్యకాక సర్వదా ఏకాకారమున ప్రకాశించుచు తనయందాగంతుకముగ దోచిన మిథ్యాభూత దృగ్దృశ్యపుజంటను ప్రకాశింపజేయుచు తద్వారా తాను సర్వద్రష్టయై వెలుంగుచున్నాడు. అట్టియెడ తనయందలి సాక్షిత్వ మెన్నటికి నపవిత్రము కానేరదు. తనయందు కల్పిత సాక్షిత్వము నంగీకరించినంత మాత్రమున జగత్తు సత్యమనుటకు వీలు లేదు. తనయందు యదార్థదృష్టిని తా ననుమాట లేదని చెప్పినంతమాత్రమున తానే లేడని శూన్యవాదము నంగీక

గింపవలసిన పని లేదు. తా నెన్నడు శూన్యుడు కాజాలడు. కనుకనే పెద్దలు 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య' యని పలికిరి."

(అమృ. 2-15. విజయదుందుభి. పుట. 134)

జిజ్ఞాసువు :- అచలవాదులు శరీరములు నాలుగందురు కదా, దానినిగురించి దయయుంచి వివరింపుడు.

(౧౩) శరీరములు మూడా? నాలుగా?

శరీరములు మూడని ప్రాచీన వేదాంత శాస్త్రముల యందును, మహాభారతాది ప్రాచీన గ్రంథములయందును చెప్పిరి. తరువాత కొందఱు శరీరములు నాలుగని చెప్పిరి. నాలుగుశరీరము లనువారు ఆత్మను నాలుగవశరీరమందురు. ఆత్మ (శుద్ధజ్ఞానము) శరీరము కాదనుటకు దశోపనిషత్తుల లోనిదగు మాండూక్యోపనిషత్తునందిట్లున్నది:—

మం॥ "నాంతః ప్రజ్ఞం న బహిఃప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞమ్. అదృష్ట మవ్యవహార్య మగ్రాహ్య మలక్షణ మచింత్య మవ్యపదేశ్య మేకాత్మప్రత్యయ సారం ప్రపంచోపశమం శాంతం శివ మద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః."*

(మాం. 7)

తా॥ (1) నాంతః ప్రజ్ఞం = సూక్ష్మశరీరముగాని, స్వప్నావస్థగాని కాదు. (2) న బహిఃప్రజ్ఞం = స్థూలశరీరము

* ఈ గ్రంథము ప్రథమభాగము 2-వ ప్రకరణమునందలి (౨౮) తురీయమను అధ్యాయమునందు యీ మంత్రమును దీనియొక్క తాత్పర్యమును చెప్పియుండితిమి. సందర్భమునుబట్టి యిచ్చట చెప్పవలసివచ్చినది.

గాని, జాగ్రదవస్థగాని కాదు. (3) నో భయతః ప్రజ్ఞం = స్వప్నజాగరములుగాని, ఆ రెండింటియొక్క సంధిగాని, ఆ రెండింటి సంయోగమువలన కలిగిన మఱియొక యవస్థగాని కాదు. (4) న ప్రజ్ఞానఘనం = సుషుప్త్యవస్థగాని, కారణ శరీరముగాని కాదు. (5) న ప్రజ్ఞం = ఒక్క సమయముననే సర్వవిషయ ప్రజ్ఞాత కాదు. (6) నా ప్రజ్ఞం = అచేతనమగు జడము కాదు. (7) అదృష్టం = పంచేంద్రియములచే కనబడు నది కాదు. (8) అవ్యవహార్యం = వ్యవహారసంబంధము లేనిది. (9) అగ్రాహ్యం = మనోబుద్ధులచే గ్రహింపరానిది. (10) అలక్షణం = ప్రత్యక్షాది ప్రమాణములచే తెలియుటకు సాధ్యము కానిది. (11) అచింత్యం = చింతించుటకు శక్యము కానిది. (12) అవ్యపదేశ్యం = ఉపదేశించుటకు సాధ్యము కానిది. (13) ఏకాత్మ - ప్రత్యయ - సారం = ఒక్కటియగు శుద్ధ చైతన్యస్వరూపమగు ఆత్మ తప్ప అన్యమిశ్రితము కానిది. (14) ప్రపంచోపశమం = ప్రపంచము దాని సంబంధ మేమియు లేనిది. (15) శాంతం = ఇచ్ఛా రాగ ద్వేషాదిరహితమైనది. (16) శివమ్ = పరమానందబోధ స్వరూపమును మంగళ రూపమును అయినది. (17) అద్వైతం = అద్వితీయమైనది. (అనగా ఆత్మ తప్ప అన్యమేమియు లేదని తాత్పర్యము). చతుర్థం అనుటచే నాలుగవపాదమగు తురీయమే ఆత్మ యని తెలిసికొనవలెను. ఆత్మ మాత్ర కాదు. అమాత్ర యనిరి.

పై మంత్రమునందు 1 నుండి 12 వఱకును గల ఆత్మ విశేషములు నేతి, నేతి, అను నిషేధ పద్ధతిలో చెప్పబడినవి. కేవల నిషేధపద్ధతిని చూపి అంతటితో విరమించిన ఆత్మ శూన్యమను భావము కలుగునేమో యని అట్లు కలుగకుండు

ట్లకై శ్రుతి 13 నుండి 17 వఱకు ఆత్మయొక్క స్వరూపమును చెప్పినట్లు భావింపవలయును. ఈ మంత్రములోని ప్రతి వాక్యము మాయగాని, మాయయొక్క కార్యజాతముగాని ఆత్మగాదని శ్రుతి స్పష్టపరచినది. ఇచ్చట చెప్పబడిన ఆత్మ ఉపనిషత్ప్రతిపాదితమైన పరబ్రహ్మమే. మంత్రమునందలి 17-వ వాక్యము 'అద్వైతం = ఇదితప్ప మఱియొకటి లేదని' దృఢపరచినది. దీనికంటె మఱియొకటి యున్నయెడల శ్రుతి 'అద్వైతం' అని చెప్పియుండదు — ఇంతకంటెను విశదముగా చెప్పవలసిన పనియుండదు.

దీక్షితులవారిట్లు చెప్పిరి:— "అవిద్య యని పేరు కలిగినటువంటి చైతన్యాన్ని గూర్చి యీ గుర్తెరిగే చైతన్యం.... 'మహాకారణదేహ శరీరత్రయం' అజ్ఞానం అనే మర్యాద సర్వం గుర్తెరిగే శరీరమే అని వేదశాస్త్రిలకు అభిమానం." (బృ. ఉ. ప్ర. 4 అ. 1) దీక్షితులవారి పై వాక్యములు గమనింతము. 'అవిద్య చైతన్య' మట. మహాకారణ శరీరత్రయం అజ్ఞాన మట. 'మహాకారణదేహాశరీరత్రయం' అనగా: అర్థమేమో భగవంతునికే యెఱుక. మహాకారణదేహము, దానికంటె వేఱగు శరీరత్రయముచేరి అజ్ఞానమని అర్థమగుచున్నదా?

నాలుగవదేహ మేది? దీక్షితులవారు దానికి ఆత్మ అన్నారు. జ్ఞాన మన్నారు. ఎఱుక అన్నారు. సాక్షి అన్నారు. అహంకార మన్నారు. దేహ మన్నారు. వారి మతమున యీ యీఱును ఒకటే అన్నారు. శ్రుతి 'నా ప్రజ్ఞం' అనుట వలనను, 'ప్రపంచోపశమం' అనుటవలనను, దీక్షితుల

వారును కృష్ణదాసుగారును నాలుగవ శరీరమును గురించి చెప్పిన వాక్యము లేవియు ఆత్మకు సంబంధించవని శ్రుతి త్రోసి వేసినది. దీనినిబట్టి ఆత్మ దేహము కాదని విదితమైనది. దేహమనగానే దేహి యొకడుండవలయు ననియును, శరీర మనగానే శరీరి యొకడుండవలయు ననియును, క్షేత్ర మనిన క్షేత్రి, లేక, క్షేత్రజ్ఞుడు (క్షేత్రమునకు స్వామి) యొకడుండ వలయుననియు స్ఫురించును. ఆత్మను నాలవ శరీరమని చెప్పితి మేని దానికి శరీరి యొకడుండవలయును. ఈ ప్రశ్నకు దీక్షి తులవారు చెప్పిన సమాధాన మేమి? ఉన్నది శరీర మేగాని శరీరి లేడన్నారు. నాలుగవ దేహమే గుర్తెరిగే దన్నారు. ఇంకొకచోట శరీరములు నాలుగు లేవన్నారు. "మూలంలేని గుర్తెరిగే శరీరము వొక్కటే గాని రెండో శరీరము లేదు. వున్నంతసేపూ స్వప్నావస్థే గాని రెండో అవస్థ లేదు. ఒక్కటే దేహం ఒక్కటే అవస్థ నాలుగు దేహాలు నాలుగవస్థలు లేవు."

(బృ. ఉ. ప్ర. 6 అ. 9)

అని అన్నారుకదా, ఎటుక నాలుగవ దేహమని యేల అనవలె, అనునదే ప్రశ్న. అది అట్లుండనిమ్ము. మహాకారణశరీర మనువాక్యము కొన్ని గ్రంథములయందు కనబడుచున్నది. వ్యష్టి కారణ శరీరముల సమష్టిరూపమును (ఈశ్వరోపాధిని) మహాకారణ శరీరమని చెప్పిన యుక్తముగ నుండును. పైంగలోపనిషత్తునందు మూలప్రకృతియందు ప్రతిఫలించిన బ్రహ్మచైతన్యమును సాక్షియని చెప్పియున్నం దున* గుణసామ్యస్థితిని మహాకారణ శరీరమని కొంద

---

* "సదేవ సౌమ్యేద మగ్ర ఆసీత్, తం నిత్య ముక్త మవిక్రియం

అందురు. అదియే యీశ్వరోపాధి యగు మహాకారణ శరీరమని చెప్పిన ఆక్షేపింపను. శరీరము, (దేహము) అని పిలువబడునది యెంత పెద్దదైనను, ఎంత చిన్నదైనను, ఎంతటి శక్తివంతమైనదైనను, అది పరిచ్ఛిన్నమైనదే. (మేరగలదే) పరిచ్ఛిన్నమైనది పుట్టినదే. పుట్టినది యెప్పుడో ఒకప్పుడు గిట్టక తప్పదు. ఆత్మ పుట్టునది కాదు, గిట్టునది కాదు. నిత్యము. ఆత్మ శరీరాదులకు అధిష్ఠానము.

పైన చెప్పినట్లు మాండూక్యశ్రుతియందు ఆత్మను 'చతుర్థం' అని చెప్పియున్నందున, చతుర్థమనగా నాలుగవది అని అర్థము. అనగా: తురీయము. ఆత్మ అన్నను తురీయమన్నను ఒక్కటియే.

కొందఱు వేదాంతు లి ట్లందురు:— సర్వమును ఆత్మగా చూచుటయే తురీయము. ఇదియే యీశ్వరోపాధి. ఇదియే నిజమైన జాగ్రత. ఆ జాగ్రతయే బ్రాహ్మీస్థితి. వీరు తురీయమునందు (1) శుద్ధతుర్యము (2) మిశ్రతుర్యము అని భేదమును చెప్పుదురు. (1) శుద్ధతుర్యమన:— బుద్ధి ప్రపంచమును చూచుటను మాని అంతర్ముఖమై ఆత్మనే

సత్యజ్ఞానాఽనందం పరిపూర్ణం సనాతనమేకమేవాఽద్వితీయం బ్రహ్మ, తస్మిన్ స్వరుతశక్తికా స్థాణు స్ఫటికాగౌ జలరూప్య పురుష రేఖాదివ ల్లోహిత శుక్ల కృష్ణ గుణమయీ గుణసామ్యాఽనిర్వాచ్యా మూలప్రకృతి రాసీత్, తత్ప్రతిబింబితం యత్తత్సాక్షి చైతన్యమాసీత్." (పైంగలోపనిషత్తు)

పైన చెప్పిన సాక్షి శ్రీవిద్య (శాక్తము)నందు శుక్ల, రక్త, మిశ్ర బిందువులయందు రెండవదియగు రక్తబిందువు ఈ గ్రంథముయొక్క తృతీయభాగము పుట 363 "కామకలాస్వరూపము"ను చిత్తగింపుడు.

చూచిన సమయమున జగత్తు తోచదు. అప్పుడు బుద్ధి ఆత్మాకారమును పొందును. ఆ బుద్ధియే ఆ స్థితియందుండి జారి ప్రపంచాభిముఖమై ప్రపంచమును చూచుచున్నను, ప్రపంచమును ఆత్మకంటె అన్యముగా భావింపదు. ఎట్లనగా: స్వర్ణనిర్మిత కంకణమును, దానిని కంకణమని భావింపక కేవల స్వర్ణమాత్రముగ భావించిన, ట్లని తెలియవలెను. ఇట్లు కేవలాత్మాకార బుద్ధ్యవస్థను శుద్ధతుర్యం బందురు. (2) ఏ తుర్యమునందు జగత్తు స్ఫురద్రూపమై ఆ జగత్తు ఆత్మయని తెలియబడునో ఆ బుద్ధ్యవస్థను మిశ్రతుర్యమని యందురు.

మాండుక్యశ్రుతియొక్క తాత్పర్యము తురీయమగు ఆత్మ కేవల బ్రహ్మమేగాని అదిఒక అవస్థకాదు. ఈశ్రుతియే కదా 'అయ మాత్మా బ్రహ్మ' అని వచించినది.

ఆత్మయందు అధ్యాసవలన స్థూల, సూక్ష్మ శరీరములు కల్పింపబడినవి. దీనికి కారణము, కారణ శరీర మగు అవిద్య. దేహత్రయముయొక్క వివరమిది :—

౧. స్థూలశరీరము :— 1. చర్మము, 2. మాంసము, 3. రక్తము, 4. నరములు, 5. మజ్జ, 6. మేధస్సు, 7. వీర్యము. ఈ సప్త ధాతువులతో కూడి స్తంభాకారముగ కంటికి కగపడుచు పంచీకృత పంచభూత సమ్మేళనము వలన ఏర్పడినది.

౨. సూక్ష్మశరీరము :— 1. కర్మేంద్రియ పంచకము, 2. జ్ఞానేంద్రియ పంచకము, 3. ప్రాణ పంచకము, 4. సూక్ష్మ భూత పంచకము, 5. అంతఃకరణ చతుష్టయము, 6. అవిద్య,

7. కామము, 8. కర్మము. ఈ యెనిమిదింటిని పుర్యష్టక మందురు. అనగా: ఎనిమిది పురములని అర్థము. దీనిని యెనిమిది పురులుగల త్రాడువంటిదని మన మూహించుకొనిన సరిపోవును.

3. కారణశరీరము:— పైన చెప్పిన పుర్యష్టకమునందు 6-వది యగు అవిద్య. పుర్యష్టకమనబడు సూక్ష్మ శరీరము చిదాభాసునితో చేరి జీవుడని పిలువబడును. సూక్ష్మ శరీరమునందలి పుర్యష్టకమునందు 6, 7, 8 సంఖ్యలు గల అవిద్య, కామ, కర్మములు మూడును నశించిన సూక్ష్మ దేహము భగ్నమగును. సూక్ష్మ శరీరములోనిదగు కారణ శరీరమగు అవిద్య నశించిన దాని కార్యమగు సంసారము నశించును. విద్యచేత అవిద్య నశించును. దానితో జీవుడు శివుడగును. ఇదియే త్రిపురసంహారము.—

దీక్షితులవారొకచో నిట్లు చెప్పిరి:— "అవస్థలు లేవు, శరీరాలు లేవు, మూడు నాల్గులు పంచెందు యేమీలేవు." (బృ. పూ. ప్ర. 9) ఈ వాక్యములు యిదివఱకు చెప్పినవే. మరల చెప్పితిని.

జిజ్ఞాసువు:- అయ్యా! శరీరములు నాలుగు గలవని యెట్లు ప్రచారములోనికి వచ్చినది?

వేదాంతి:- ఈ విషయము చాల లోతైనది. విస్తరించి చెప్పినగాని చక్కగా బోధపడదు. విస్తరించి చెప్పుటకిచ్చట అవకాశము లేదు. కాని, కొంతవఱకు మాత్రము చెప్పెదను. వినుము:—

సాంఖ్యులమతము ననుసరించి మూలప్రకృతిని వదలిన దానివలన కలిగిన తత్త్వములు 23 అగును. వాటి వివర మిది :— పృథివ్యాది భూతములు 5. తన్మాత్రలు 5. ఇంద్రియములు 10. మనస్సు, బుద్ధి, అహంకారము చేరి 23. ప్రకృతిని కలుపుకొన్న 24. పురుషుడు యిరువది అయిదవ వాడు. ఇది సాంఖ్యుల పద్ధతి. ఈ వివరమంతయు యిదివఱకు చెప్పినదే* (వేదాంతులు వీనిలో చిత్తమును కలుపుకొన్న ప్రకృతి 25 వది. అప్పుడు పురుషుడు యిరువది ఆఱవవాడు. సాంఖ్యుల మతానుసారము పురుషుడు (జీవుడు) స్థూలశరీరమును వదలి లింగశరీరముతో వెడలిపోవుటయే మరణము. మృతుని శరీరమందు (మృతకళేబరమున) బుద్ధి, అహంకారము, మనస్సు, దశేంద్రియములు ఉండవు. కనుక, ఆ పదుమూడే లింగశరీరమని కొందఱుసాంఖ్యు లందురు.

మఱికొందఱు సాంఖ్యు లిట్లందురు :— దేహము నుండి నిర్గమించిన పై పదుమూడు తత్త్వములు నిలుచుటకు ఆధార ముండవలయును కదా? ఒక గోడయో, కాగితమో, లేనిదే చిత్తరువు ఉండజాలనట్లు పదుమూడు తత్త్వములకు ఆధారముగ సూక్ష్మభూతములు, (తన్మాత్రలు) అయిదును కలవందురు. వీటితో చేరి పదునెనిమిది తత్త్వములు గలది లింగశరీరము. ముఖ్యముగ సుప్రసిద్ధ సాంఖ్యకారికలయందు లింగమనగా : పదునెనిమిది తత్త్వములని కలదు. కాని, పైన చెప్పిన 13 తత్త్వములే లింగశరీరమని చెప్పునట్టి

---

* ఈ గ్రంథముయొక్క ప్రథమభాగమున ౧-౯౬ కాపిల సాంఖ్యమను అధ్యాయమున సాంఖ్యదర్శనమున చెప్పియున్నాను.

సాంఖ్యులు సూక్ష్మభూతములైదును కలసి ఒక ప్రత్యేక శరీరమని అందురు. దానిని వారు 'అంతరాభవ' మనియు 'గంధర్వ' మనియు పిలుతురు. ఈ అంతరాభవమే పై 13 తత్త్వములు నిలుచుట కాధారమనియు, ఇది స్థూలశరీరము నకును లింగశరీరమునకును మధ్య కలదనియు, మరణము వలన లింగశరీరమును, అంతరాభవము కలసియే స్థూల శరీరమునుండి నిర్గమించుననియు, చెప్పుదురు. గంధర్వశరీర మును అంగీకరించు సాంఖ్యుల మతానుసారము శరీరములు మూడని తేలినది. గంధర్వశరీరమును అంగీకరింపని సాంఖ్యుల మతానుసారము శరీరములు రెండే. సాంఖ్యులు వేదాంతుల కారణశరీరమును అంగీకరింపరు. వేదాంతుల సూక్ష్మశరీరమునందే సూక్ష్మభూతపంచకము (కొందఱు సాంఖ్యుల గంధర్వదేహము) చేరియున్నందున, వేదాంతులు అంతరాభవ (గంధర్వ) దేహమును ప్రత్యేకించి అంగీక రింపరు. కాని, సాంఖ్యుల ప్రభావమునకు వశులైన కొందఱు వేదాంతులు సాంఖ్యుల గంధర్వశరీరముతో వారి స్థూల సూక్ష్మకారణశరీరములు కలుపుకొని శరీరములు నాలుగని చెప్పియుండవచ్చును. మొదట నెవరో తెలియక చెప్పి యుండిన, వారి ననుసరించి కొందఱు ఆవిధముగా చెప్పుటచే శరీరములు నాలుగని వాడుకలోనికి వచ్చియుండవచ్చును.

ఇంకొక విషయము చెప్పవలసియున్నది. పుర్యష్టకము ను గుఱించివి వరించియుంటిని.* అందులో పంచప్రాణములు,

---

* పుర్యష్టకమును గుఱించి నేను పైన చెప్పిన విధముగనే పైంగలోపనిషత్తునందును శ్రీశంకరుల వివేకచూడామణియందును చెప్ప బడియున్నది.

అవిద్య, కామ, కర్మములు కలవు. వీటిని సాంఖ్యులు లింగ దేహమున గైకొనక పోవుటకు కారణమేమనగా — బుద్ధి యందున్న భావన యను దానిలోనే కామ, కర్మములు కలిసి యున్నవని, బుద్ధిని చెప్పియున్నందున వాటిని ప్రత్యే కించి చెప్ప నవసరము లేదని, వారు భావించిరి. అవిద్య కారణమైనను సాంఖ్యుల ప్రకృతి అవిద్య కాదు. సాంఖ్యుల ప్రకృతి సర్వవ్యాపకము. కనుక, దానిని లింగమునందు చేర్ప లేదు. సాంఖ్యుల ప్రాణ పంచకము వేదాంతుల ప్రాణము భిన్నములు. ఇప్పుడు నీకు వేదాంతుల సూక్ష్మ శరీరమునకును సాంఖ్యుల లింగశరీరమునకును భేదము బోధ పడియుండును. సారాంశమేమన: వేదాంతుల మతము ననుసరించి శరీరములు మూడు. సాంఖ్యులు అంతరాభవ మును వదలిన వారి మతమున శరీరములు రెండే.

మఱియొక విషయమేమన :— శాక్తేయులు (శ్రీవిద్యో పాసకులు)ను చాలవఱకు వారి ననుసరించిన శ్రీజ్ఞానేశ్వర శ్రీసమర్థరామదాసస్వామి వంటి పెద్దలును శరీరములు నాలు గని చెప్పిరి. స్థూల సూక్ష్మ కారణ శరీరములను గుఱించి సామాన్యముగ భిన్నాభిప్రాయములు లేవనియే చెప్ప వచ్చును. నాలుగవదియగు మహాకారణశరీరమును గుఱిం చియే ప్రస్తుతము వివాదము. నేను వెనుక (నాలుగవశరీర మును గుఱించి) చెప్పిన విషయమును ఇచట జ్ఞప్తికి తెచ్చు కొనవలయును. అచట (శ్రీవిద్యయందు) శుక్ల, రక్త, మిశ్ర, సంవి ద్బిందువు లను నాలుగు బిందువులు చెప్పియుంటిని. అందులో రక్తబిందువే నాలుగవ శరీరమనియు, శుక్లబిందువు యొక్క ప్రతిబింబముతో చేరి అదియే సాక్షి యనియు చెప్పి

యుంటిని. మఱియు యీ సాక్షియే యీశ్వరుడు కూటస్థుడు అనియును చెప్పియుంటిని. వారి తత్త్వము ననుసరించి యిదియే తురీయ మనబడు నాలుగవ శరీరము. దానివలన నేర్పడిన మిశ్రబిందువు మహత్తత్వము. ఇది మూడవ శరీరము. శుక్ల, రక్త, మిశ్ర బిందువుల కాంతిచే నేర్పడిన సంవిద్బిందువు అహంకారము. ఇది రెండవశరీరము. స్థూల శరీరమే ఒకటవ (మొదటి) శరీరము. అనగా: స్థూలశరీరము నుండి లెక్కించిన 'హం' అనబడు రక్తబిందువే నాలుగవ శరీరము.

మఱియు, శ్రీవిద్యాసంప్రదాయమునందు శక్తివాగ్రూపిణి (నాదరూపిణి) అని చెప్పిరి. ఆ శక్తి మానవశరీరమున పరా, పశ్యంతి, మధ్యమా, వైఖరీ అని నాలుగు విధములుగా ఉన్నదందురు. వెనుక (తృ. భా. 371 నుండి 374 పుటల వఱకు) యీ విషయము చెప్పియుంటిని. ఈ పరాదినామములు నాలుగును వాక్కు యే యే స్థానముల యందుండునో ఆ యా స్థలములయొక్క నామములేగాని వాక్కుయొక్క నామములు కావనియు చెప్పియుంటిని. కనుక ఆపరాది స్థానములే నాలుగు శరీరములని కొందఱు పొరపాటున భావించుట కవకాశమున్నది.

శైవమతమునందు చెప్పిన ముప్పదియాఱు తత్త్వములలో శక్తితత్త్వము రెండవది. మాయాతత్త్వము ఆఱవది. ప్రకృతి, మహత్తు, బుద్ధి, అహంకారము అను తత్త్వములు క్రమముగా 12, 13, 14, 15 తత్త్వములుగా శైవమునందు గుర్తింపబడినవి. ఈ క్రింది నాలుగు తత్త్వములకంటె శక్తి

తత్త్వము అతీతమైనది. ఈ శక్తితత్త్వము దీక్షితులవారి మెఱుక కాదు. శైవతత్త్వములను పృథ్వీతత్త్వమునుండి లెక్కించుచు పోయిన అహంకారము 22-వ తత్త్వమగును. ప్రకృతి 25-వ తత్త్వము. ఈ విధముగా చూచిన అహంకారము, ప్రకృతి అను నీ తత్త్వములకంటె పరమునందు శక్తి, మాయా, తత్త్వములు కలవు. కనుక 25-వ తత్త్వము దీక్షితులవారు చెప్పు మెఱుక యని అంగీకరించిన 26-వది బయలు కాదు.

దీక్షితులవారు అహంకారమే (ఎఱుకే) నాలుగవ శరీరమనిరి. మఱియొకచోట "అజ్ఞానమే కారణశరీరము. అది రహితము కాకనే అనేక నరకములలో ప్రవేశించుట కలుగును." (బృ. పూ. ప్ర. 3) అనిరి. అజ్ఞానమన్నను అవిద్యయన్నను ఒక్కటేకదా? ఇంకొకచోట యిట్లనిరి. "అవిద్య అనే పేరు కలిగినటువంటి చైతన్యాన్ని గూర్చి యీగుర్తెరిగే చైత్యం...." (బృ. ఉ. ప్ర. 4 అ. 1). చైతన్యమనగా జ్ఞానమని దీక్షితులవారేగాక లోకమందఱు అంగీకరించినదే. అవిద్యను చైతన్యమనిరి. అవిద్య అంటె అజ్ఞానమే కదా? అవిద్యను చైతన్యమనిన అజ్ఞానమును జ్ఞానమనినట్లే కదా? ఇంతకంటె వింత యేమి కలదు? ఇంకొకచోట ని ట్లనిరి. "ఆత్మ అన్న బ్రహ్మ యన్న యిరవై అయిదో దానికి సంజ్ఞ." (బృ. ఉ. ప్ర. 6 అ. 12) దీక్షితులవారు యిట్లు చెప్పిరి. "ఇరవై అయిదోది అయిన మెరుక అనే అహంకారమే ఆత్మ. ఆత్మ అనే శరీరము అహంకారము. ఈ అహంకారం అయివున్న యిరవై అయిదోది అయిన మెరుక అనే అహంకారం లేకపోతేసరి." (బృ. ఉ. ప్ర. అ. 3). ఈ

మాటలకేమైన అర్థమున్నదా? అహంకారము యిరవై అయినవది అట. ఆవిధముగా చూచిన ప్రకృతి యిరువది ఆఱవది అనవలెనుగదా? అట్లయిన బయలు యిరువది యేడవది అనవలసివచ్చునుగదా? "తత్వాతీతం యిరవై ఆరోది" (బృ. ఉ. ప్ర. 6 అ. 7) అని వారే అన్నారు. ఒక లక్ష్యము లేదు. ఎక్కడ యేది తోచిన అక్కడ దానిని చెప్పిరి.

మహాభారతము హిందువులైన ప్రతివానికి శిరసావహింప దగిన పంచమవేదము. అందులో దేహికి నాలుగు దేహము లున్నట్లు యెచ్చటను చెప్పియుండలేదు. భీష్ముడు ధర్మరాజు నకు స్వప్నాద్యవస్థల తెలఁగెఱిగించుచు నిట్లు చెప్పిరి :—

తె॥ తెలియ మేల్కని యుండుట కలలు నిద్ర
యనునవస్థాత్రయంబును నవులఁ బెట్టఁ
జాలు విజ్ఞాన నిర్మల సత్య బోధ
రూప నిర్భరానంద స్వరూపుఁడనఘ. (శాంతి. 4-327)

తా॥ తెలియ మేల్కని యుండుట = జాగ్రదవస్థ; కలలు = స్వప్నావస్థ; నిద్ర = సుషుప్త్యవస్థ; అను నీ మూ డవస్థలను సమాధినిష్ఠుడైనట్టి బ్రహ్మవేత్త ఆవల పెట్టు చున్నాడని తాత్పర్యము. ఇచ్చట బ్రహ్మమునకును, బ్రహ్మ విదునకును అభేదమును చెప్పుటకై — విజ్ఞానియు, మలిన రహిత శాశ్వతజ్ఞానరూపుడును, ఆనందరూపుడును అని ఆత్మ స్వరూపము వివరింపబడినది.

ఇందులో గమనింపవలసినది యేమన 'నిర్మల సత్య బోధరూపుడు' తురీయుడగు ఆత్మ. రాకడ పోకడ కలిగ

నట్టిది వృత్తి జ్ఞానము. అది శ్రీదీక్షితుల పరిభాషలో ఎఱుక అనవచ్చునేమో? ఆత్మను నాశరహితమైన జ్ఞానమనియు చెప్పియున్నందున నిత్యజ్ఞానము పరబ్రహ్మమేగాని వేఱు గాదు. అట్టి సచ్చిదానందస్వరూపమును (శాశ్వతజ్ఞానమును) నాలుగవ దేహ మనుటకంటె ఉపనిషన్మతమునకు విరుద్ధ మేమున్నది?

దీక్షితుల వారిట్లు చెప్పిరి. "శంకరాచార్యులు దేహాది పదార్థములను గుర్తెరిగే క్షేత్రజ్ఞ స్వరూపమనే పరాప్రకృతిని ఆత్మ అని అబద్ధమాడి, ఈ ఆత్మే బ్రహ్మస్వరూపమని అన్నాడు. శృతి 'అయి మాత్మా బ్రహ్మ' అనే అబద్ధాల శృతి ముందర బెట్టినాడు." (బృ. ఉ. ప్ర. 6 అ. 4)

ఏవిధముగ చూచినను మాండూక్యోపనిషత్తునందలి 7-వ మంత్రము దీక్షితులవారికి కొరకరాని కొయ్యయైనందున దానిపై పట్టరాని ఆగ్రహము కలిగి ఆ శ్రుతికి "అపద్ధాలశ్రుతి' యని బిరుదమును ప్రసాదించిరి. పరాప్రకృతి ప్రస్తావన తెచ్చిరి. భగవద్గీతయందు పరా - అపరా ప్రకృతుల గుఱించిన విచారమున్నది. ఆ విషయమును చర్చింతము.

(౧౪) ప్రకృతిద్వయము

దీక్షితుల వారిట్లు చెప్పిరి. "ఈ యెఱుకయే పరా ప్రకృతి స్వరూపం కనుక సార్వకాలం లేని పరాప్రకృతి స్వరూపమే. ఎరుక మరపులను యెరిగె యెరుక నరకము. సంశయమే నరకము." (బృ. ఉ. ప్ర. 2 అ. 2)

పరాప్రకృతి విషయమైన విచారము ప్రస్తుతము చేయుట యుక్తము.

భగవానుడు గీత ఆఱధ్యాయములు చెప్పిన పిమ్మట, ఏడవ అధ్యాయమును ప్రారంభించుచు, ఓ అర్జునా! దేని నెఱిగిన పిమ్మట మోక్షవిషయమై తెలియదగిన దేదియు మిగిలియుండదో, అట్టి విజ్ఞానముతో కూడిన జ్ఞానమును నీ కుపదేశించెదనని తన విభూతులగు పరా, అపరా ప్రకృతులను తెలిపి, పిమ్మట తన స్వరూప మిట్టిదని తెలుపదలచెను. గీతాకారుడు యేడవ అధ్యాయమునకు 'విజ్ఞానయోగ మని' పేరు పెట్టెను. విజ్ఞాన మనగా: పరబ్రహ్మమునుండి నామ రూపాత్మక మగు స్థూల సూక్ష్మ సృష్టి యెట్లు కలిగెనని తెలిసికొనుట. కొందఱు 'విజ్ఞాన' శబ్దమునకు పరబ్రహ్మము యొక్క సంపూర్ణ జ్ఞానమనియు, మఱికొందఱు అనుభవ ముతో కూడిన బ్రహ్మజ్ఞాన మనియు, అర్థమును చెప్పుదురు. ఇచ్చట నేను మొదట చెప్పిన అర్థమే యుక్తమైయున్నది. తన ప్రకృతులను గుఱించి భగవంతు డిట్లు చెప్పెను:—

శ్లో॥ భూమి రాపో உనలో వాయుః ఖం మనో బుద్ధి రేవ చ
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా. (గీత. 7-4)

శ్లో॥ అపరేయ మిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరాం,
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్.
(గీత. 7-5)

తా॥ భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము యీ ఎనిమిదియు నా (భగవంతుని) యొక్క అపరా ప్రకృతి.

పైన చెప్పిన అపరా ప్రకృతి గాక యింతకంటెను వేఱుగ 'పర' అను రెండవ ప్రకృతి కలదు. అదియే యీ చరాచర జగత్తును ధరించునట్టిదియై జీవభూతమైయున్నది.

నాలుగవ శ్లోకమునందు అపరా ప్రకృతిని గుఱించి చెప్పినపుడు పైననుండి అహంకార మాదిగా భూమి పర్యంతము చెప్పక క్రిందనుండి మొదట పృథ్వీ భూతముతో ఆరంభించి అహంకారపర్యంతమును చెప్పి అంతటితో ముగించి 'ఇది అపరా ప్రకృతి' అని చెప్పి, తరువాత 5-వ శ్లోకమునందు పరాప్రకృతిని గుఱించి చెప్పుట వలన అహంకారమునకంటెను, పైనున్న అవ్యక్త ప్రకృతి (మూలప్రకృతి)యే పరాప్రకృతి యని జ్ఞానేశ్వరులు అభిప్రాయ పడియుండురు. వారు 5-వ శ్లోకముయొక్క అర్థమును ఈ క్రింది విధముగ వ్రాసిరి.

"అర్జునా! ఈ ఎనిమిది విభేదములయొక్క సామ్యావస్థను నా పరమ ప్రకృతిగా తెలిసికొనుము. దానినే 'జీవము' అందురు. ఇదియే నిర్జీవ శరీరమును సజీవముగా చేయును. శరీరమునకు ఇదియే చలనాదికము ఇచ్చును. ఇదియే మనస్సునకు శోకాది వికారములను భాసింప జేయును. బుద్ధికి ఈ మాయయొక్క సహవాసఫలమే జ్ఞాతృత్వము. దీనినుండి ఉత్పన్నమైన అహంభావమే ఈ ప్రపంచము యొక్క అస్తిత్వమును పుట్టించుచున్నది."

(ఆంధ్ర జ్ఞానేశ్వరి, గీత. 7-5).

గీతకు మహాత్ము లనేకులు భాష్యములు వ్యాఖ్యానములు టీకలు రచియించిరి. అపరాప్రకృతిని గుఱించి చెప్పిన

4-వ శ్లోకమునకు నే నెఱిగినంతవఱకు భిన్నార్థములను ఎవ్వరును చెప్పియుండలేదు. అందులో వివాదాంశ మేమియును లేదు. అహంకారమాది దేహాంత పర్యంతమైన సంఘాత మే అపరాప్రకృతి యనునది నిర్వివాదము.

పరాప్రకృతిని గుఱించి వ్యాఖ్యాతలు భిన్నాభిప్రాయములను వెలిబుచ్చిరి. ఇచ్చట ఒక ముఖ్య విషయము జ్ఞప్తియం దుంచుకొనవలయును. పై రెండు శ్లోకములకు అర్థము చెప్పునప్పుడు వ్యాఖ్యాతలు గీతయొక్క 13-వ అధ్యాయము నందలి 'ఇదంశరీరం' అను శ్లోకమునుండి ఆఱు శ్లోకముల తాత్పర్యమును, గీతయొక్క 15-వ అధ్యాయము నందలి 16, 17, 18 శ్లోకార్థములను స్మరింతురు. 13, 15 అధ్యాయముల యందలి పై శ్లోకముల వ్యాఖ్యానమునందు పైన చెప్పిన 7-వ అధ్యాయము నందలి 4, 5 శ్లోకములను స్మరింతురు. కారణ మేమన — ఒక అంశమునే (ఒక అర్థమునే) వేఱువేఱు సందర్భములయందు భగవంతు డుపదేశించెను. గీతయొక్క 7-వ అధ్యాయము నందలి 4, 5 శ్లోకములకు పూర్ణమగు తాత్పర్యమును నిర్ణయింపవలయునన్న యీ యంశమును గుఱించి వేఱువేఱు సందర్భములయందు చెప్పిన తాత్పర్యములను మనస్సునం దుంచుకొనియే నిర్ణయింపవలయును. అట్లు కాదేని శ్రీ జ్ఞానేశ్వరులవారు చెప్పినట్లు మూలప్రకృతియే పరాప్రకృతి అని పొరపడుట కవకాశమున్నది.

ఇప్పుడు 'పరా, అపరా' శబ్దములయొక్క అర్థ మేమి? పరా = శ్రేష్ఠము, లేక, ఉత్కృష్టము అనియు అపరా

అనగా కనిష్టము, లేక నికృష్టము అనియు అర్థము. పైన చెప్పిన అష్టవిధ ప్రకృతులు నశించునట్టివి. నిరంతరము మార్పు చెందునట్టివి. కనుక నికృష్టము. పరాప్రకృతి నాశ రహితమైనది. కనుక ఉత్కృష్టము. అందువలన వాటి కాపేర్లు సార్థకమైనవి. ఒకటి సత్యము. వేఱొకటి అసత్యము. ఇవి రెండును ఒకటి కావు. రెండును వేఱు వేఱని వాటి నామములే చెప్పుచున్నవి. అపరా ప్రకృతిలో చెప్పబడిన పంచభూతములు సూక్ష్మములైనవని తెలియవలయును. ఇవియే క్రమముగ స్థూలభూతములైనవి. అపరా ప్రకృతిలో అహంకారము చేరియున్నది. అహంకార మనగా ఏమి? ఈ ప్రశ్నకు యిదివఱలో సమాధానము చెప్పియే యుంటిని. మఱల చెప్పెదను. మానవుడు 'నేను' నేను అని వ్యవహరించుచున్నాడు. 'నేను' అన్నప్పుడు అష్టవిధప్రకృతియే (ఒక్క అపరా ప్రకృతియే) సమస్త బ్రహ్మాండరూపమును ధరించియున్న సంగతిని తెలియక సమస్త స్థావర జంగమాత్మక ప్రపంచము తనకంటె వేఱైనదని, యీ సమస్తమునకంటె తాను వేఱని మనుజునియందు యే భావము కలదో అదియే అహంకారము. ఇంకొక విధముగా చెప్పవలెననిన: ఆత్మానాత్మల గ్రంథియే అహంకారము. ఎట్లు చెప్పినను భావ మొక్కటే. ఆశ్చర్య మేమనగా:— దీక్షితులవారు అహంకారమే ఎఱుక అని చెప్పిన వారి వాక్యములను ఉదాహరించి యుంటిని. మఱియు "ఈ యెరుకే పరా ప్రకృతి స్వరూపం గనుక సార్వకాలం లేని పరాప్రకృతి స్వరూపమే." (బృ. ఉ. ప్ర. 2 అ. 2) అన్నారు. అహంకారము అపరాప్రకృతిలోనిదే గదా? అపరాప్రకృతిలోనిదగు అహం

కారమునే ఎఱుక అని చెప్పుచు, ఈ ఎఱుకయే పరా ప్రకృతి యనుట అర్థశూన్యము. ఇది శ్రీ జ్ఞానేశ్వరులవారి మతమునకు సరిపోవునా? శ్రీ జ్ఞానేశ్వరులు పరాప్రకృతిని గుఱించి వ్రాసిన తాత్పర్యమున —

"దీనినుండి (పరాప్రకృతినుండి) ఉత్పన్నమైన అహం భావమే యీ ప్రపంచముయొక్క అస్థిత్వమును పుట్టించుచున్నది." అని వ్రాసిరి. అహంకారము అపరాప్రకృతి లోనిదిగ 4-వ శ్లోకమున స్పష్టపరుపబడియుండగా పరా ప్రకృతినుండి యెట్లు అహంభావము కలుగును? అహం కారము - అహంభావము భిన్నములని శ్రీ జ్ఞానేశ్వరులుగాని దీక్షితులవారుగాని యెచ్చటను చెప్పలేదే?

పరాప్రకృతిని గుఱించి చెప్పిన 5-వ శ్లోకమునకు భాష్యకారులు భిన్నార్థములను చెప్పిరని చెప్పియుంటిని. శ్రీ శంకరులవారు పరాప్రకృతిని ఆత్మ యనిరి. శ్రీమద్రామానుజాచార్యులవారు జీవుడు (జీవాత్మ) యనిరి. శ్రీమధ్వాచార్యులవారు లక్ష్మి యనిరి. శ్రీధరస్వాములవారు శ్రీశంకర మతము ననుసరించిరి. ప్రస్తుతాంశమేమన :— పరా ప్రకృతి దీక్షితులవారు చెప్పు ఎఱుక యగునా, కాదా? యనునదే — అదియునుగాక, ఎఱుకయు దేహమును ఒక్కటే నన్నారు.

గీతాచార్యులు అపరాప్రకృతిని గుఱించి చెప్పినప్పుడు అష్టవిధ ప్రకృతులను చెప్పి అవి యేమూలప్రకృతి నుండి జన్మించెనో ఆ ప్రకృతిని యేల చెప్పలేదు? అపరా ప్రకృతి యందు దానిని చేర్పక పోవుటయే అది పరాప్రకృతి యని

గీతాచార్యులవారి అభిప్రాయము కాదా? అను ప్రశ్న కలుగుచున్నది. ఈ ప్రశ్నకు ఇచ్చట కొంత మాత్రమే సమాధానము చెప్పి, క్షేత్రవిచారమునందు పూర్తి సమాధానము చెప్పెదను.

ఒక కుటుంబమునందు తల్లియొక్క సంతానమును చెప్పినప్పుడు తల్లినిసహితము చెప్పినట్లే, అష్టవిధ ప్రకృతులను చెప్పినప్పుడు వాటి తల్లియగు అవ్యక్త ప్రకృతిని చెప్పినట్లే యగునని వ్యాఖ్యాతల అభిప్రాయము. జ్ఞానేశ్వరుల అభిప్రాయమే గీతాచార్యుల అభిప్రాయమై యున్నయెడల మొదట తల్లిని చెప్పి పిమ్మట దాని పిల్లలను చెప్పునట్టి లోకాచారము ననుసరించి మొదట పరాప్రకృతిని చెప్పి పిమ్మట అపరాప్రకృతిని చెప్పియుండును. శ్రీ జ్ఞానేశ్వరుల వాద మంగీకరించుటకు గల చిక్కేమనగా :— ప్రకృతి యొక్క సామ్యావస్థ సుషుప్తి వంటిది. ఇదిగాక, ప్రకృతి జడమైనది; దాని సంతానమును జడమే. ప్రకృతియు దాని సంతానమును జడమైనచో నీ రెంటిని తెలిసికొను చైతన్యమెచ్చటనుండి వచ్చినది? అవ్యక్త ప్రకృతియే చైతన్యమనిన అందులకు శ్రుతి ప్రమాణము లేదు. లేకపోవుగాక అనుభవ మున్నదిగదా యనిన అవ్యక్తము మఱియొక దానిని వ్యక్తీకరించుట యెట్లు? 'ఎఱుక' వ్యక్త మగుచున్నది గదా? వ్యక్తమగు దానిని అవ్యక్త మనవచ్చునా? భగవంతుడు 'నా విభూతులు రెండు' అని చెప్పుటవలననే అవి రెండును భిన్నమైనవని స్పష్టమగుచున్నది అందులో ఒకటి జడము; వేఱొకటి అజడము (అచైతన్యము). ఇవి రెండును పరస్పర భిన్నములు. 5-వ శ్లోకమునందు ఇతను =

ఈ ప్రకృతికంటె (అపరాప్రకృతికంటె) ; అన్యాం = ఇతర మైన ; మే = నాయొక్క ; ప్రకృతిం = ప్రకృతిని ; విద్ధి = తెలియుము ; రెండు ప్రకృతులు ఒక్కటి కావనుటకు ఇంతకంటె విశదముగ చెప్పవలయునా ? 5 - వ శ్లోకము యొక్క రెండవ పాదమున పరాప్రకృతికి విశేషణములు చెప్పుచు 'జీవభూతమైనది' 'జగత్తును ధరించునది' అను రెండు విశేషణములను చెప్పిరి. ధరించునది ధరింపబడునది వేఱు వేఱై యుండవలయుననుట లోకానుభవసిద్ధమేగదా ? ఎవడైనను వాని భుజములమీద వాడు కూర్చుండగలడా ? గీతయొక్క 6 - వ శ్లోకమునందు 'ఏతద్యోనీని భూతాని సర్వాణీ త్యుపధారయ' అని 'సమస్త భూతములును ఈ రెండు ప్రకృతులే కారణములుగా కలిగియున్నవి' అని చెప్పబడినది.

శ్రీధరస్వాములవారు 4-వ శ్లోకమునకు వ్రాసిన వ్యాఖ్యానమునందు కొంతభాగమును యీ క్రింద తెలియ చేయుదును.

వ్యా॥ "మనశ్శబ్దేన మనసైవ ఉన్నేయ మవ్యక్తరూపం ప్రధానం ఇత్యనేన ప్రకారేణ ప్రకృతిః మాయాఖ్యాశక్తి రష్టధా భిన్నా విభాగంప్రాప్తా."

తా॥ మనశ్శబ్దముచేత, మనస్సుచేతనే తెలిసికొన దగిన అవ్యక్తరూపమైన ప్రధానమని యీ ప్రకారముచేత మాయ యనియు, ప్రకృతి యనియు పేర్లుగల నాయొక్క శక్తి యెనిమిది విధములుగా విభజింపబడినది.

5-వ శ్లోకమునకు శ్రీధరస్వాములవారు వ్రాసిన వ్యాఖ్యను గమనింపుము ___

వ్యా॥ "అపరేతి అష్టధోక్తాయా ప్రకృతిరియం అపరా నికృష్టా జడత్వా త్పరార్థత్వాచ్చ, ఇతః స కాశా త్పరాం ప్రకృష్టా మన్యాం జీవస్వరూపాం మే ప్రకృతిం విద్ధి జానీహి పరత్వే హేతుః యయా చేతనయా క్షేత్రజ్ఞ రూపయా స్వకర్మద్వారే ణేదం జగద్ధార్యతే."

తా॥ ఎనిమిది విధములుగా చెప్పబడిన అపరా ప్రకృతి జడమగు పదార్థము అగుటవలన నికృష్ట (కనిష్ట) మైనది. దీనికంటె నుత్కృష్టమైనది జీవరూపమైన నా వేఱొక ప్రకృతిని తెలిసికొనుము. పరత్వ హేతువుచేత చైతన్యము క్షేత్రజ్ఞరూపము నగు తన కర్మద్వారా యీ జగత్తు ధరింపబడుచున్నది.

అని వ్రాసిరి. ఈ కారణమువలన యీ శ్రీధర స్వాములవారు అద్వైతులని అచలవాదులుకారనిస్పష్ట మైనది.

భగవద్గీత అద్వైతమును బోధించుచున్నదని పెద్ద లందురు. పరా అపరా ప్రకృతులను గుఱించి శాంకర భాష్యమును సమర్థించు కొన్ని గీతా శ్లోకముల నిట నుదాహ రింతును.

శ్లో॥ ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి,
వికారాంశ్చ గుణాశ్చైవ విద్ధి ప్రకృతి సంభవాన్. (గీ. 13-19)

తా॥ ప్రకృతియు పురుషుడును అనాదులని తెలిసి కొనుము. వికారములు గుణములు ప్రకృతినుండి పుట్టినవని తెలిసికొనుము.

శ్లో॥ కార్యకారణ కర్తృత్వే హేతుః ప్రకృతి రుచ్యతే,
పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే. (గీ.13-20)

తా॥ కార్యము (దేహము) కారణము (ఇంద్రియములు) అను నీ రెంటియొక్క కర్తృత్వమునకు ప్రకృతి కారణమని చెప్పుచున్నారు. మఱియు, సుఖదుఃఖముల నుపయోగించుటకు పురుషుడు కర్త కాకపోయినను కారణమని చెప్పుచున్నారు.

శ్లో॥ ఉపద్రష్టాఽనుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః,
పరమాత్మేతి చాప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః. (గీ. 13-22)

తా॥ ఉపద్రష్ట అనగా : ప్రకృతియొక్క గుణములను దగ్గరనుండి చూచువాడు. (యజ్ఞము చేయునపుడు ఋత్విగ్యజమానులు చేయువానిలోని గుణదోషములను చూచువాడు (Spectator). అనుమోదించునట్టియు, భరించునట్టియు, నియామకుడైనట్టియు పరమాత్మ యని చెప్పబడిన పురుషుడు (క్షేత్రజ్ఞుడు) ఈ దేహమునందు ఉత్కృష్టుడైనవాడు.

ఇందలి సారాంశమేమన :— అపరాప్రకృతి జడమని జీవరహితమని పరాప్రకృతి చేత ధరింపబడుచున్నదని పరాప్రకృతి అపరాప్రకృతిచేత ధరింపబడునది కాదని అపరాప్రకృతియందే అహంకారాది యిరువదినాలుగు తత్త్వములు ఇమిడియున్నవని* ఇరువదియైదవ తత్త్వమగు ఆత్మయే పరాప్రకృతి యని శ్రీధరస్వాములవారి మతము. ఇదియే శ్రీ శంకరులవారి మతము.

పర్యవసానమేమన :— శివ శక్తుల వలె పరా

* శ్రీధరస్వాములవారు వారి వ్యాఖ్యానమునందు అష్టప్రకృతులయందు యిరువదినాలుగు తత్త్వములు ఇమిడియున్నట్లు వ్రాసియున్నారు. గ్రంథవిస్తరణభీతిచే ఇచ్చట దానిని వ్రాయక వదలితిని.

అపరా ప్రకృతులు ఒకరిపై మఱియొకరు ఆధారపడియుండ లేదని. అనగా: పరస్పరము శేష శేషి భావము లేదని రెండును ఒక్కటి కాదని, రెంటిలో ఒకటి (అపరా) మఱి యొకటి దానిపై (పరాప్రకృతిపై) మాత్రమే ఆధారపడి యున్నది గాని అపరా ప్రకృతిపై పరాప్రకృతి ఆధారపడి యుండలేదని స్పష్టమైనందున శ్రీ జ్ఞానేశ్వరుల శివ శక్తులే పరా అపరా ప్రకృతులని చెప్పకూడదని విదితమైనది.

శ్రీధరస్వాములవారును శ్రీ జ్ఞానేశ్వరులును శరీరము జడమని అంగీకరించిరి. దీక్షితులవారు "శరీరం జడము కాదు. అన్ని శరీరాలు గుర్తెరిగే ప్రవర్తిస్తాయి." (బృ. ఉ. ప్ర. 6 అ. 12) అనిరి గదా? ఇందుకు విరుద్ధముగా శరీరము జడమే అని వేఱొక్కచోట చెప్పియున్నారు ... "వేదమనగా గ్రంథాలు. జడం మాయ. అవిద్య యని వున్నది. ఆ శాస్త్రాల లోనే ప్రకృతులు రెండు అని వున్నవి. చైతన్యం పరాప్రకృతి జడం అపరాప్రకృతి వున్నది కనుక యిది వింతకాదు."

(బృ. ఉ. ప్ర. 4 అ. 1)

"ఈ రెండు జడాజడములు" (బృ. పూ. ప్ర. 3) శరీరము జడముకాదని పైన చెప్పిరి. ఇచ్చట 'జడ' మనిరి. ఇందులో ఏది సత్యము. ఇంకను యీ విషయమును పూర్తిగా అవగాహన చేసికొనుటకు గీతయందలి క్షేత్ర - క్షేత్రజ్ఞ విచారమును పరిశీలింపవలయును.

(౧౫) క్షేత్రము - క్షేత్రజ్ఞుడు

క్షేత్రస్వరూపము గీతయం దిట్లు చెప్పబడినది :—

శ్లో॥ ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే,
ఏత ద్యోవేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః. (గీ. 13-1)

తా॥ ఓ అర్జునా! ఈ శరీరము క్షేత్రమనియు, దీని నెఱుగువాడు క్షేత్రజ్ఞుడనియు, క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగము నెఱిగిన పెద్దలు చెప్పుదురు.

పై శ్లోకమున క్షేత్రమని* చెప్పినదానియొక్క పూర్ణ రూపము యీ క్రింది రెండు శ్లోకములయందు చెప్ప బడినది.

శ్లో॥ మహాభూతాన్యహంకారో బుద్ధి రవ్యక్త మేవ చ,
ఇంద్రియాణి దశైకం చ పంచ చేంద్రియ గోచరాః. (గీ. 13-5)

శ్లో॥ ఇచ్ఛా ద్వేష స్సుఖం దుఃఖం సంఘాత శ్చేతనా ధృతిః,
ఏతత్ క్షేత్రం సమాసేన సవికార ముదాహృతమ్. (గీ. 13-6)

తా॥ పృథివ్యాది భూతములును, అహంకారమును, బుద్ధియు, అవ్యక్తము, (మాయ, లేక మూలప్రకృతి శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పిన పరాప్రకృతి), జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు పదియును, మనస్సును, శబ్దాది విషయ పంచకమును, (ఇవి సాంఖ్యుల 24 తత్త్వములు), కోరికయు, ద్వేషమును, సుఖమును, దుఃఖమును, దేహేంద్రియాది సంఘాతమును, చేతన (మనోవృత్తి), ధైర్యము, (వీటిని

---

* పై శ్లోకమున 'శరీర' మని గాని 'దేహ' మని గాని చెప్పక క్షేత్రమని చెప్పుటవలన సజీవమైన శరీరమే క్షేత్రశబ్దము చేత పిలువ బడునని భావమైయుండును. 'క్షేత్రము' అనగా: చేను. కర్మఫలము నొసంగునది యని భావము.

వైశేషికులు ఆత్మ గుణములని చెప్పిరి), ఇదియంతయు సవికారము. ఇది క్షేత్రమని సంగ్రహముగా చెప్పబడెను.

శ్రీ జ్ఞానేశ్వర స్వాములు 'మహాభూతాన్యహంకారో బుద్ధిరవ్యక్త' అను శ్లోకముయొక్క వ్యాఖ్యానమునందు అవ్యక్త శబ్దమునకు యీ క్రింది విధముగ అర్థమును వ్రాసిరి.

"ఇక అవ్యక్త ప్రకృతి లక్షణములను వినుము. సాంఖ్యశాస్త్రముల ప్రకారము ప్రకృతియొక్క రెండు భేదములను 7-వ అధ్యాయములో చూపియే యున్నాను. వానిలో రెండవది యగు పరాప్రకృతి యేదైతే జీవదశ (జ్ఞానదేవి) అని చెప్పబడినదో, దానికే యిచ్చట రెండవ పేరు అవ్యక్తము." (ఆంధ్ర జ్ఞానేశ్వరి. 13-5)

పైన చెప్పిన పరాప్రకృతిని అవ్యక్తమని గీత చెప్పిన కారణమున శ్రీ జ్ఞానేశ్వరులు యిచట చిక్కులో పడిరి. ఈ చిక్కును విడిపించుకొనుటకు సాధ్యపడదు. గీతాచార్యులే స్వయముగా క్షేత్రమునందలి వివిధ తత్త్వముల విడివిడిగా చెప్పుచూ, అందులో 'అవ్యక్త ప్రకృతిని' ఒకటిగా పేర్కొనినందున, శ్రీ జ్ఞానేశ్వరులు క్షేత్రమును (అపరా ప్రకృతిని) ధరించునట్టిదియు, జ్ఞానదేవియు, అని ఏ అవ్యక్తమనబడు పరాప్రకృతిని గురించి చెప్పియుండిరో, ఆ అవ్యక్త ప్రకృతిని సహితము గీతాచార్యులు (లేక భగవానుడు) క్షేత్రమున (అపరా ప్రకృతియందు) చేర్చబడియుండుటచేత —క్షేత్రవాసి, క్షేత్రజ్ఞుడు, క్షేత్ర, ఆత్మ అను నతడు క్షేత్రమునకంటె వేరైనవాడును, క్షేత్రమును (అపరాప్రకృతిని) ధరించు

వాడును, అగు, ఆత్మయని నిశ్చయింపబడినందున, ఇందుకు విరుద్ధముగ పూర్వము 5-వ శ్లోకమునకు తాము (శ్రీ జ్ఞానేశ్వరులు) చెప్పిన వ్యాఖ్యానమును నిలుపుకొనుటకు సాధ్యము కాదని, శ్రీ జ్ఞానేశ్వరులు వారి వాదమును విరమించుకొని గీత ననుసరించిరని తోచుచున్నది.

శ్రీ జ్ఞానేశ్వరులు గీతయొక్క 7-వ అధ్యాయము నిచ్చట (13-వ అధ్యాయమున) స్మరించిరి. ఈ యధ్యాయమున క్షేత్రమని చెప్పినదే 7-వ అధ్యాయమునందలి అపరా ప్రకృతి అనినపుడు సమష్టి శరీరములను, క్షేత్రమనినపుడు వ్యష్టి శరీరమును గురించి చెప్పిరని తాత్పర్యము. గీతాచార్యులు గీతయొక్క 7-వ అధ్యాయమున బ్రహ్మాండమును గురించియు, 13-వ అధ్యాయమున పిండమును గురించియు తెలిపిరి. క్షేత్రమునందు 'అవ్యక్తము' చేర్చుటవలన అష్టవిధప్రకృతులయందే (అపరాప్రకృతియందే) అవ్యక్తమనబడు మూలప్రకృతి (లేక మాయ) చేర్చబడినదని వ్యాఖ్యానము చేసిన శ్రీ శంకరాదుల మతమునే జ్ఞానదేవులు కూడ యిచ్చట అంగీకరించక తప్పలేదు. పరాప్రకృతి అవ్యక్తనామక ప్రకృతి కాదని, శ్రీ శంకరులును, శ్రీధర స్వాములవారును, చెప్పిన ఆత్మయే యని యిచ్చట స్పష్టముగ ఋజువైనది. ఇచ్చట క్షేత్రజ్ఞుడని యెవ్వనిని చెప్పిరో ఆ క్షేత్రజ్ఞుడే ఆత్మయని పరాప్రకృతి యని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. గీత క్షేత్రమునందే అవ్యక్తమును (మూలప్రకృతిని) చేర్చినందున 7-వ అధ్యాయమునందలి 5-వ శ్లోకమునందు చెప్పిన పరాప్రకృతి అవ్యక్త ప్రకృతికంటె

భిన్నమైన ఆత్మ అని గీతయే అంగీకరించుటవలన జ్ఞానేశ్వర స్వాములవారు, వారి వ్యాఖ్యానమునందుగల యీ వైరుధ్యమును తొలగించుటకు ప్రయత్నించలేదు.

క్షేత్రమును గుఱించిన వివరమునందు "సంఘాతశ్చేతనాధృతిః" అను వాక్యముల అర్థమును విచారింతము. చార్వాకాది మతములయందు నాలుగు భూతములయొక్క కలయిక వలన 'ఆత్మ' అను జ్ఞాన ముత్పన్నమగు చున్నదనియు, శరీర నాశముతో ఆ యా భూతాంశములు ఆ యా మూలభూతములయందు కలియగా ఆత్మ అనునది లేకపోవుననియు చెప్పుదురు. ఇతరులవిషయ మట్లుండ భాగవతుల కృష్ణదాసుగారు. ఎఱుక యుత్పత్తినిగుఱించి చెప్పిన వాక్యములను యిదివఱలో యుదాహరించియుంటిని. అన్నము సూక్ష్మాంశము మనస్సనియు, జలము సూక్ష్మాంశము ప్రాణమనియు, మనఃప్రాణసంయోగమువలన ఎఱుక యుద్భవించినదనిరి. ఇట్టి మతములు (అభిప్రాయములు) లోకమున కొన్ని కలవని భగవాను డెఱుగును కనుక వాటిని ఖండించుటకై సంఘాతము (పెక్కింటి కలయిక) ఆత్మ (క్షేత్రజ్ఞుడు) కాడని తెలియజేయుటకుగాను, మహాభూతాదులైన 24 తత్త్వములును, ఇచ్ఛాద్వేషాదులును, యివియన్నియు కలియుటవలన కలిగిన శక్తియును, (సంఘాతమును) క్షేత్రమునందే చేర్పబడి క్షేత్రస్వామిని (ఆత్మ లేక పరాప్రకృతిని) వేఱుగా ఉంచెను.

ఇక 'చేతన' అనగా : విచారింతము. 'చేతన' అనగా : చైతన్యముకాదు, చైతన్యమనగా శుద్ధ జ్ఞానము.

చేతన ప్రాణాదుల స్పందము. అనేకులు ఇచట చేతన యనగా చైతన్యమని పొరపడిరని శ్రీ లోకమాన్య బాల గంగాధరతిలక్ గారు చెప్పిరి.

ఇవి యేవియు ఆత్మకాదు. "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత." ఓ అర్జునా! సమస్త క్షేత్రముల యందున్న క్షేత్రవేత్తను (క్షేత్రిని) నన్నుగా తెలియుము. అని క్షేత్రములకంటె తాను భిన్నుడనని తెలియజేసెను. దీనివలన ఒక్క ఆత్మయే సర్వక్షేత్రముల (దేహముల) యందు కలదనియు, ఆత్మ లనేకములుకావనియు, చెప్పు అద్వైతమత మీ గీతామతమని స్పష్టమైనది.

(౧౬) క్షరాక్షర విచారము

క్షరాక్షరముల గురించి గీత యిట్లు చెప్పినది :—

శ్లో॥ ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ,
క్షర స్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే. (గీ. 15-16)

తా॥ లోకమునందు క్షరుడని అక్షరుడని ఏ రిద్దరు పురుషులు కలరు. అందు క్షరు డనగా : సమస్త శరీరములే స్వరూపముగా కలవాడు. కూటస్థ అక్షరుడనగా : అవ్యక్త ప్రకృతి అని పెద్దలు చెప్పుదురు.

ఈ శ్లోకమునకు భాష్యకారులు భిన్నార్థములు చెప్పిరి. పై శ్లోకమునందు అక్షరు డనగా : మూల ప్రకృతి (అవ్యక్త ప్రకృతి) అని అద్వైతుల మతము. ఇచ్చట అద్వైతులతో దక్షితులవారు కొంతవఱకు ఏకీభవించిరి. 'అక్షర' శబ్దము

పరబ్రహ్మవాచకముగా ఉపనిషత్తులయందును, భగవద్గీతయందనేక స్థలములయందు చెప్పియున్నను, ఇచ్చట 'కూటస్థ అక్షర' మని చెప్పియున్నందున కూటస్థవిశేషణము చేత మూలప్రకృతినే చెప్పిరనియు, క్షరము (శరీరముల) వలె క్షణభంగురముగాక మాయ (కూటస్థ అక్షరము) జ్ఞానోదయ పర్యంతము యెన్నిజన్మములకైనను నశింపక యుండునను కారణమున కూటస్థవిశేషణముతో 'అక్షర' శబ్దము వాడబడెననియు, అద్వైతుల మతము. ఇదియే యిచట సరియైన యర్థము.

అవ్యక్తమగు మూలప్రకృతి కూటస్థ అక్షరము. అవ్యక్తమునుండి వ్యక్తమైన నామరూపములు నిరంతరము మార్పుచెందుచుండును. కావున నామరూపములు మాత్రము 'క్షర' శబ్దముచేత నిచ్చట చెప్పబడెనని తాత్పర్యము.

సారాంశమేమన - వ్యక్తము, అవ్యక్తమునగు ఒక ప్రకృతియే క్షరము, అక్షరము అని పై శ్లోకమున చెప్పబడి యీ రెండింటికంటెను పరమునందున్న పరమాత్మ లేక పురుషోత్తముని గురించి తరువాత రెండు శ్లోకముల యందును చెప్పబడెను. ఆ పరమాత్మయే క్షేత్రజ్ఞుడు.

దీక్షితులవారి వాక్యము లివి :—

"దేహాంతరోపాధి, యీ దేహమును గుర్తెరిగే నేను అనే ఉపాధి. యీ రెండు అయివున్న దింట్లో ఒకటి అయివున్న వాఁడే పతితుడు. యీ రెండూ దోష స్వరూపములు. గనుక యీ

రెండు ప్రకృతి ద్వయం. యీ రెండూ సగుణ నిర్గుణాలు. ఈ రెండూ విద్యా విద్యలు. యీ రెండూ సదసత్తులు. యీ రెండు జడాజడములు, ఈ రెండు సుఖదుఃఖములు, జ్ఞానకర్మాలు, యీ రెండు స్త్రీ పురుషులు, యీ రెండే సకల యోగాలు సకల యాత్రలు సకల చదువులు సకల నీమాలు బ్రహ్మ హత్యాది మహాపాతకాలు. మేడిపండువంటి దేహము. వేపకాయవంటి క్షేత్రజ్ఞ స్వరూపం." (బృ. పూ. ప్ర. 3)

పై వాక్యముల అర్థమేమో కొంత పరిశీలింతము. దేహము క్షరము, నేను అక్షరము అన్నారు. వేఱొక స్థలమున 'నేను నా దేహము నొక్కటే' అన్నారు. కనుక క్షరాక్షరములు రెండని పేరేగాని రెండును ఒక్కటియే యని అనేక పర్యాయములు స్పష్టపరచి యున్నారు. "ఈ రెండు అయివున్న దీంట్లో ఒకటి అయివున్నవాడే పతితుడు" అన్నారు. అంటే, దేహాత్మవాదులైన చార్వాకాదులను పతితులన్నారు. ఇచ్చట వారి ప్రసక్తి వీరికెందుకు? వీరి మతముకూడ అట్టిదేనని పాఠకులు అనుకొనరాదని హెచ్చరిక. చార్వాకు లేమన్నారు — శరీరమునకంటె భిన్నమైన ఆత్మ లేదన్నారు. దీక్షితులవారు శరీరము ఆత్మ రెండు ఒకటే గాని రెండు కాదన్నారు. ఇదేకదా భేదము. ఇందులో మాటభేదమే గాని దాని అర్థమునందు భేదమే మున్నది?

'క్షరోపాధి' 'అక్షరోపాధి' అన్నారు. ఉపాధి అను పదమునకు అర్థము తెలియకనే దీక్షితులవారు వారి గ్రంథమున అనేక చోట్ల ఉపాధి శబ్దమును వాడిరి. 'క్షరోపాధి'

అనినపుడు క్షరము ఉపాధి గాగల వస్తువు (ఉపేతము) ఒకటి ఉండవలెనుగదా? 'అక్షరోపాధి' అనినపుడు అక్షరము ఉపాధిగాగల ఉపేతము ఒకటి ఉండవలయునుగదా? ఉదాహరణమునకు ఘటాకాశమన్నపుడు ఘటము ఉపాధిగాగల ఆకాశము అని అర్థము. ఇచ్చట ఘటము ఉపాధి. ఘటాకాశము ఉపేతము. అట్లే క్షరము, అక్షరము అను ఉపాధి ద్వయమునకు ఉపేతభూతమగు వస్తువు (వస్తువులు) ఉండవలయునుగదా? అది (అవి) యేది? లేక యేవి?

దీక్షితులవారు తమ గ్రంథమున 'నేను నా దేహము ఒకటే' 'గుడామధురములవత్' అని అనేకపర్యాయములు చెప్పియున్నారు. ఇచ్చట 'దేహము క్షరోపాది' యట, తాను 'అక్షరోపాది' యట. ఎంత విచిత్రములైన వాక్యములివి. క్షరమైన శరీరము ఉపాధియని, అక్షరమైన తాను ఉపేతమని చెప్పియుండరాదా! అట్లనియుండిన వీరికి ఉపాధి శబ్దమునకు అర్థము తెలిసియున్నదని భావింపవచ్చును. కాని, అట్లనినచో 'గుడామధురములవత్' అను మూలసిద్ధాంతమునకు భంగము వాటిల్లును. అక్షరము నిర్గుణమట. శాక్తేయులు శక్తియే సగుణయు, నిర్గుణయునందురు. వారి మతమున రెండును నిత్యములేగాని మిథ్యకావు. దీక్షితుల వారు, వారి ననుకరించుచు వారికి విరుద్ధముగ సగుణనిర్గుణములు రెండును మిథ్య యనిరి.

పర్యవసాన మేమన:— దేహి దేహములు రెండును ప్రకృతియే యను మతము గీతకు సమ్మతము కాదని స్పష్టమైనది.

శ్లో॥ "కర్పూరం తస్యగంధం చ గుడత్వం మాధురీం తథా
న వివేక్తుం కదా శక్యం కర్తురాయాస ఏవసః."
(అమృ. 1-23)

"శర్కరామాధుర్యంబు లంగాని కర్పూర పరిమళంబు
లంగాని విభాగింప నెవ్వారికి సాధ్యంబగు ?" (అను. 1-23)

శ్రీ జ్ఞానేశ్వరులు యీ యర్థమునే 42 శ్లోకము (వచనమున) చెప్పియున్నారు. శ్రీ జ్ఞానేశ్వరులు యిదివరలో చెప్పిన దేమనగా:— సత్తాస్ఫూర్తులయందు సత్ = శివుడు; స్ఫూర్తి శక్తి; అనగా: చిత్ శక్తి. ఇచట పరశివుడు (పరబ్రహ్మము) ఆయనయందున్న విమర్శరూపశక్తి, వీ రిరువురు శివ శక్తులు.

దీక్షితులవారి మతమున శివుడు బట్టబయలు (అచలము) బయలుతో నేవిధమైన సంబంధము లేనిది యెఱుక. ఇచ్చట ఎఱుక బయలుయొక్క శక్తి కాదు. వీరిమతమున, ఎఱుకే దేహి దేహముతైనది. కనక దేహి దేహములు శివ శక్తులు కారు.

దీక్షితులవారు శ్రీ జ్ఞానేశ్వరుల భావమునే గైకొని 'నేను నా శరీరం ఒకటేగాని రెండుకా'దని చెప్పియుండవచ్చునని అతివాదుల వాదము. దీక్షితులవారి ఈ క్రింది వాక్యములు అట్టి భావమునకు విరుద్ధముగ అర్థమిచ్చుచుండుటవలన అది సరికాదని మితవాద పక్షమువారు తమ వాదమునకు ఆధారముగ దీక్షితులవారి యీ క్రింది వాక్యముల నుదాహరింతురు. —

దీక్షితులవారి ఈ క్రింది వాక్యములను గమనింపుము :

"యెరుకకు దేహమునకు భేదమని కొందరందురు. యెరుకకు దేహమునకు భేదమైతే సుఖదుఃఖములు యెరుకకే గాని, శరీరమునకు లేకపోవలె. అందుకు శరీరమునే సుఖదుఃఖము లనుసరించియున్నవి. యెరుకకు దేహమునకు భేదమైతే సుఖదుఃఖములు శరీరమునకు లేకుండా యేలాగు నుండవలెననగా? పుట్టవంటిది దేహము, పుట్టలోని పామువంటిది యెరుక. ఇల్లువంటిది దేహము. ఇంటిలోని మనిషివంటిది యెరుక. రాయివంటిది దేహము. రాతిలోని కప్పవంటిది యెరుక. కట్టెవంటిది దేహము. కట్టెలోని పురుగువంటిది యెరుక గావలెగదా? ఈలాగున యెరుకకు దేహమునకు భేదమైతే దేహమునకు బాధ లేకపోవును. ఎరుకకు బాధ లేకపోవలెను. ఎలాగననగా పుట్టమీద కొట్టితే పుట్ట తనకు సుఖమని దుఃఖమని చెప్పుకొనజాలదుకదా? పుట్టలోపల గల పాము ఎక్కడనుండునో తెలియదుకదా? అలాగే యెరుకకు సుఖదుఃఖములు లేకపోవును. దేహమునకు లేకపోవును. ఇండ్ల తలుపులు వేసికొని పడుకొంటే వానకు యిండ్లు తడసినాగాని మనుష్యులకు ఏబాధా లేనట్టుగా దేహమునకు యెరుకకు వేరైతే ఆలాగున బాధలేకపోవును. రాతికి దెబ్బతగిలినాకాని రాతిలో కప్పకు యేలాగున బాధలేదో ఆలాగే శరీరమునకు బాధలేకపోవును కనుక యెరుకకు దేహమునకు అభేదముగా కనబడుచున్నది.

అభేద లక్షణము యేలాగననగా: పాము పాము కూసము ఒకటైనట్టుగా నీళ్లు పాలు ఒకటైనట్టుగా, కాయ విత్తు ఒకటైనట్టుగా, పుష్పము పరిమళము ఒకటైనట్టుగా, నూనె నువ్వులు ఒకటైనట్టుగా, అగ్ని కాష్టము ఒకటైనట్టుగా, యెరుక దేహము ఒకటైయున్నది. అందువల్లనే సుఖదుఃఖములు శరీరమునకు

యెరుకకు కూడ కలుగుచున్నది. శరీరము విడచి యెరుక యుండదు. యెరుకను విడిచి శరీరముండదు."

(బృ. పూ. ప్ర. 6)

ఈ యంశమును ధృఢపరచుటకు గురుశిష్యసంవాద రూపమున యీ క్రింది విధమున చెప్పిరి :—

(1) *"శిష్యుడు :— అయ్యా! ఎరుకకు దేహామునకు అభేద మని చెప్పితిరిగదా? అభేదమైతే దేహముతోగూడ, యెరుక నశించవలెనుగదా? ప్రేతశరీరమునందు యెరుక కనబడదు. అప్పుడు యెరుక యేమాయెను? యెక్కడికి లేచిపోయెను?

గురువు :— మృత్యుకాలమందు యెరుక యెక్కడికి లేచి పోయినదని చెప్పను? యెరుక లేవనులేదు, మరియొకచోటికి పోనూలేదు. దేహములోనే లయమగుచున్నది. ఆ దేహము మృతదేహామునకు తగినట్లుగానే యున్నది.

(2) శిష్యుడు :— మృతదేహములో యెరుక గలదని పైన చెప్పితిరిగదా? అప్పుడేల పిలిచితే పలుకడు.

గురువు :— సుషుప్తి నొందిన వానిని పిలిచితే యేలాగున పలుకడో ఆలాగున పలుకడు.

(3) శిష్యుడు :— నిదురబోయిన వానిని నొకసారి పిలిచితే పలుకకున్నను మరియొకసారి పిలిచితే పలుకుచుండలేదా?

గురువు :— చెవిటివానిని పిలిచితే పలుకనట్టుగా.

* 1 నుండి 15 వఱకు వేసిన వరుస సంఖ్యలు రచనా సౌలభ్యము కొఱకు నేను వేసికొన్నవే గాని "బృహద్వాసిష్ఠ సిద్ధాంత"మున లేవు.

(4) శిష్యుడు :— చెవులకు చెవుడైతే కనులు చూచుచుండ లేదా ?

గురువు :— కనులు గలవు కనుక చూచుచున్నాడు.

(5) శిష్యుడు :— కనులులేక చూడనప్పటికిని చెవిలేక వినబడ నప్పటికిని క్షుత్పిపాసాదిబాధలకు పరితపించుచుండవలెనుగదా ?

గురువు :— తనలో తాను పరితపించుచునే యుండును, గాని మానుకొనడు, నిర్మలుడు గానేరడు.

(6) శిష్యుడు :— ప్రేతశరీరమున కేమయిన బాధకలదా ?

గురువు :— ఏమి గలుగునోయీ ! ఇది యేమిశంక.

(7) శిష్యుడు :— పునర్జన్మమునకు యేది లేచిపోవునో ? అది యేమిటిదో ?

గురువు :— లేచిపొయ్యే దొకటి గలదా ?

(8) శిష్యుడు :— అలాగ అయితే పునర్జన్మ దేనికి ?

గురువు :— శరీరమునకు.

(9) శిష్యుడు :— శరీరము మృతమాయెకదా ?

గురువు :— కాలేదు.

(10) శిష్యుడు :— దహనాదిక్రియలు దేనినిగూర్చి చేయు చున్నారు ?

గురువు :— శరీరమునకు.

(11) శిష్యుడు :— శరీరము మృతి నొందలేదంటిరి కదా ?

గురువు :— సూక్ష్మశరీరమునకు.

(12) శిష్యుడు :— రెండు శరీరములు గలవా ?

గురువు :— కలవు.

(13) శిష్యుడు :— అది యేలాగున ?

గురువు :— పామున్ను పాము కుబుసమువలెను."

(బృ. పూ. పు. 147, 148)

"ఎరుక దేహామైయున్నది. ఎరుక దేహామైయుంటే దేహాము నశించునుగదా ? దేహాము నశించినపిమ్మట ఎఱుక లేదుగదా యని యందురేమొ. ఆమాట నిజమేకాని దేహాము నశించలేదు. దేహాము నశించకపోతే మరణమే యని యందురేమొ. మరణమనగా పాము కూసము విడిచినట్లుగా అరటిచెట్టు పొర లూడిపోయినట్లుగా వుల్లిపాయపొట్టు వూడినట్టుగాను శరీరము గురూపదేశము వలనగాని పోనేరదు ...."

"ఎరుక ఎపుడు లేదో అపుడే శరీరము లేదు. శరీరమెపుడు లేదో యెరుకపుడే లేదు. ఎరుకను విడచి శరీరము వుండదు. ఎరుకను విడచి ప్రేతశరీర ముండలేదా ? యనిన యీ శరీరము ఎంత జాగ్రతగా నున్నదో అక్కడ యెరుక అంత లక్షణముగానే వుంటున్నది, గాని ఎరుకకు వేరే జాగ్రత్త లేదు."

(బృ. పూ. పు. 163)

(14) శిష్యుడు :— శరీరములేక ఎముకలు గనబడుచుండును గదా ? ఎముకలయందు ఎరుక గలదా లేదా ?

గురువు :— ఎరుక గలదు.

(15) శిష్యుడు :— ఎరుక గలిగితే ఏల మాట్లాడదు? సుఖ దుఃఖములు దాని కేల తెలియవు?

గురువు :— అయితే ఈలాగున అడిగితిరిగదా? శరీర మంతట ఎరుక గలదా లేదా?

శిష్యుడు :— గలదు.

గురువు :— గలిగితే గోళ్ళకు సుఖదుఃఖములు ఎందుకు లేదు? రోమములకు ఎందుకులేదు ....?

గురువు :— వినరోయీ నఖారోమదంతములకు ఘాతము వలన సుఖదుఃఖములు ఎందువలన గలుగవని యడిగితిరి గదా? ఎక్కడెక్కడ రక్తశుక్లములు గలుగునో అక్కడ గలుగును గాని అవి లేనిచోట గలుగవు. అయితే రక్తశుక్లములే జీవమా యని అందురేమో? అందున కలిసియే యున్నవి. అవివేక యుత్పత్తి యెక్కడ యున్నది, బిందువునందు ఎరుక కలదా లేదా? యని యడిగినయెడల బిందువందు ఎరుక లేకపోతే అది యేలాగున వృద్ధియగును. గనుక బింబువందు యెరుక గలదు. బిందుమూలమే జగత్తైయున్నది. ఆ బిందువే యెరుక మరపులై యున్నది. ఆ బిందువే స్త్రీపురుషులై యున్నారు."

(బృ. పూ. ప్ర. 10)

(14)-వ అంశమున దీక్షితులవారు ఎముకలయందు ఎఱుక కలదనిరి. ఎఱుక గలిగితే యేల మాట్లాడదని శిష్యుడు ప్రశ్నించినట్లు వ్రాసిరి. దీక్షితులవారు సమాధానము చెప్పుటకు (వారికి) అలవిగాని ప్రశ్నను వారే వేసికొనిరి. సూటిగా సమాధానము చెప్పలేక పోయిరి. డొంకతిరుగుడు మార్గమును

అనుసరించి సమాధానము చెప్ప ప్రయత్నించి "అయితే నఖాదంతములకు సుఖదుఃఖములు యెందుకు లేవు?" అని యెదురుప్రశ్న వేసిరి. అక్కడ దీక్షితుల వారికి వచ్చిన చిక్కులివి :—

బెల్లము దానితీపు ఒకటే అయినట్లు శరీరము యెఱుక ఒక్కటియేయైన నీకు కడుపులో నొప్పికలిగిన, వైద్యునియొద్దకు వెళ్లి 'నొప్పి యెందుకు కలిగిన' దని సలహా పొందవలసిన అవసర మేమి? చేతిపైన కఱ్ఱదెబ్బ తగిలినపుడు చేతి యెముక విరిగినదా? లేదా? అని తెలిసికొనుటకు ఎక్సరే ఫోటో తీయించుకొనవలసిన అవసర మేమి? ఎముకల యందును యెఱుక కలదంటిరికదా? అది విరిగినసంగతి దానికేల తెలియదు. శరీరసంబంధమైన అనేక వ్యాధులు బాధలు ప్రతిశరీరి యెఱుగవచ్చునుగదా? రోగనివారణకు వైద్యునిసలహా అడుగవచ్చునుగాని, శరీరమునకు కలిగిన వ్యాధి శరీరమునకే తెలియనిపక్షమున వైద్యున కెట్లు తెలియును? శరీరము యెఱుక ఒక్కటైయుండగా వైద్యు డెందుకు? — రెండవది :—

బ్రహ్మచైతన్యము సర్వత్ర (జడద్రవ్యమునందును) కలదు. కాని ఒకశిల మఱియొక దానిని తెలిసికొనజాలదు. శిలయందు బ్రహ్మ చైతన్యము కలదుగదా? యేల తెలిసి కొనలేదు? అనగా కేవల వ్యాపక చైతన్యము [బ్రహ్మ చైతన్యము] పదార్థముల ఎఱుగజాలదు. చిదాభాస సహిత మైన బుద్ధి వృత్తియే ఎఱుగుచున్నది. శిలయందు అట్టి బుద్ధి వృత్తి లేదు. అటులనే నఖములయందును దంతములయందును శల్యములయందును యితర జడపదార్థములయందును వృత్తి

చైతన్యము లేదు. కనుక అవి తెలిసికొనజాలవు. దీక్షితులవారి మతమున ఉన్నది ఒక యెఱుక యేగాని అద్వైతులవలె వ్యాపక చైతన్యము (పరబ్రహ్మ స్వరూపమైన జ్ఞానము) వృత్తి చైతన్యము (చిదాభాసుని సంబంధమైన జ్ఞానము) అను రెండు జ్ఞానములు లేవు. రెండు జ్ఞానములు యెవరి మతమున అంగీకరింపబడునో అట్టివారి మతమున పదార్థముల నెఱుగునట్టి జ్ఞానసంబంధముగల మనస్సునకే సుఖదుఃఖాదుల అనుభవము కలుగును. కేవలవ్యాపక చైతన్యమాత్ర మున్నచోట అట్టి అనుభవము లేదు. ఇట్టి వేదాంత జ్ఞానము దీక్షితులవారికి లేదు. కనుకనే సూటియైన సమాధానము చెప్పలేక "ఎక్కడెక్కడ రక్తశుక్లములుండునో అక్కడక్కడ సుఖదుఃఖము లుండును" అని దీక్షితులవారు చెప్పిరి. ఇదియు సరికాదు. దేహమునకుగాని రక్తశుక్లములకుగాని సుఖదుఃఖములు తెలియవు. సుఖదుఃఖములు మనోధర్మములు. శస్త్రచికిత్స చేయించుకొనువానికి క్లోరోఫారమును యిచ్చి కత్తి నుపయోగింతురు. వాని శరీరమందు రక్తమాంసములున్నవి, శుక్లమున్నది. కాని వానికి నొప్పి తెలియదు. కారణమేమన సుఖదుఃఖముల నెఱుగు మనస్సు అప్పుడు ఆత్మయందు లీనమైయున్నది. మనస్సు లేనపుడు చిదాభాసుడు ఉండడు. కనుక సుఖదుఃఖములు తెలియుట లేదు.

జిజ్ఞాసువు :- అయ్యా! ఎఱుక మృతదేహములో నుండునని దీక్షితులవారు చెప్పిరిగదా! దాని భావమేమి? అదిగాక 'గురు శిష్య సంవాదము' న శిష్యుడు 'రెండు శరీరములు కలవా?' అని ప్రశ్నింపగా 'కలవని' — పాము,

పాము కుబుసమువలెనని చెప్పిరిగదా? దాని భావమేమి?

వేదాంతి :- అచలవాదులయందలి మితవాదుల అభిప్రాయము మృతుని శరీరమునుండి గాలి (ప్రాణము) పోవును గదా? అదియే పాము కుబుసమును (శరీరమును) విడిచి పోవుట యని అర్థము చెప్పుదురు. దీక్షితులవారు చెప్పిన యీ దృష్టాంతము సరియైనది కాదు. పాము కుబుసమును విడుచునట్లని చెప్పిన యీ దృష్టాంతము ద్రాష్టాంతికము నందు యెట్లు సమన్వయింపనగును? దీక్షితులవారి మతము ననుసరించి యేది స్థూలశరీరమును విడుచుచున్నది? జీవుడా? దీక్షితులవారు జీవుడు లేడు పొమ్మన్నారు. శ్రీమద్రామానుజాచార్యులు మొదలు తదనంతరము వచ్చిన మతాచార్యులు అణుప్రమాణముగల జీవుడు సూక్ష్మదేహముతో కూడ స్థూలదేహమును విడిచి పోవుటే మరణమన్నారు. వారందఱి మతములయందును అద్వైతులతో కూడ జీవునకు స్థూలశరీరమునకు గల సంబంధము కత్తి దాని ఒరకుగల సంబంధము వంటిదని చెప్పియుండిరి. పాము దాని కుబుసము వంటిదని యెవ్వరును యింతవఱకు చెప్పియుండలేదు; పూర్వులు చెప్పకపోయిననేమి? ఎవరు చెప్పినను చెప్పిన వాక్యము సరియైనదైనచో గ్రాహ్యమేకదా? అనిన దీక్షితులవారు చెప్పిన దృష్టాంతము (దానికి ద్రాష్టాంతికమేలేదు) అర్థరహితము. జీవునకు స్థూలశరీరము భోగసాధనము. ధర్మసాధనము. సర్పమునకు దాని కూర్పాస మట్టిది కాదు. కుబుస మూడిపోయిన పాము మరణింపదు. మనుష్యునకు యీ జన్మమునందే ఒకకాలమున లేని దంతములు మొదలగు అవయవములు తరువాత ఒకయవస్థయందు పుట్టును, కొంత

కాలముండి అవి ఊడిపోవును. పాముకుబుస మట్టెది. అరటి చెట్టుపౌర లూడుట ఉల్లిపొట్టూడుట, ఇట్టివి అర్థరహితవాక్యములు కాని వానికి అర్థము వేలోకవిధముగా చెప్పవచ్చును.

ఈ యంశము యోగవాసిష్ఠమునం దిట్లున్నది :—

శ్లో॥ స్థూలదృష్టి దశాం త్వేతా మవలంబ్య మహామునే
పుంసో మనః శరీరం చ కాయా ద్వావితి కథ్యతే.

(యో. వా. 4-11-22)

తా॥ స్థూలదృష్టి చేత రెండు శరీరములు గలవని చెప్పబడుచున్నది. ఒకటి మనస్సు రెండవది పాంచభౌతిక మగు స్థూలశరీరము.

శ్లో॥ మనో మనన నిర్మాణ మాత్ర మేతజ్జగత్త్రయమ్,
నసన్నాస దివస్ఫార ముదతం తేతరన్మతే.

(యో. వా. 4-11-23)

తా॥ సూక్ష్మదృష్టితో చూచిన స్ఫురణమాత్రమును అనిర్వచనీయమునగు మనస్సే మూడులోకములను నిర్మించి యున్నది. ఇంతకంటె వేఱు లేదు.

అని చెప్పబడినందున దేహము ఒకటే అనగా మనస్సే. అదియే తనకు స్థూలశరీరమును నిర్మించుకొన్నదని తాత్పర్యము. బహుశః దీక్షితులవారు యీ యర్థముతో శరీరములు రెండని చెప్పియుండవచ్చునా - యనిన యోగవాసిష్ఠకారుల మతము ననుసరించి మనస్సు పరమాత్మని శక్తి. అది చిదాకాశముననుండి వెలువడిన చిత్ శక్తి. దీక్షితులవారి యెఱుక (మనస్సు) అన్నముయొక్క సూక్ష్మాంశమువలన కలిగినది.

ప్రాణి మనస్సుచేతనే కర్మ చేయుచున్నాడు. కర్మ వలన జనించు వాసనావిశేషములు మనస్సునందు గూడు కట్టుకొనియుండి మరణానంతరము మనస్సు తనయందు గూడుకట్టుకొనియుండు సంస్కారములను (వాసనలను) సామగ్రితో పునర్జన్మకు యోగ్యమగు స్థూలదేహమును నిర్మించుచున్నది. కాని స్థూలదేహము పాముచే విడువబడిన పొరవంటిది కాదు. ఈ వాక్యములు దీక్షితులవారి సిద్ధాంత మునకే విరుద్ధము. వారు యిదివరలో చెప్పినదేమి? దేహి దేహములగురించి వారు చెప్పిన వాక్యముల నుదాహరించి యుంటిని. అయినను మరల చెప్పెను. —

"శిలాప్రతిమవత్! అని దేహి దేహానికి అవినాభావ సంబంధము వుండి చెప్పినారు." (బృ. ఉ. పు. 36) "గుడా మధురములవత్." (బృ. ఉ. పు. 147) అని చెప్పియున్నం దున శిలను వదలి శిలయందలి శిల్పము అనగా శిల్పిచే చేయ బడిన ప్రతిమ పాముచే వదలబడిన దాని కుబుసమువలె వేఱుగా ఉండగలదా? బెల్లమును వదలి దానియందున్న తీపు వేఱుగా ఉండగలదా? పాము దాని కుబుసమును విడిచి యుండునట్లు దేహి దాని దేహమును వదలియుండునని యెట్లు చెప్పగలిగిరి? వారి గ్రథమున ఇట్టి పరస్పర విరుద్ధ మగు అర్థమునిచ్చు వాక్యములు యెన్నియోని గలవు.

గురుశిష్య సంవాదరూపమున దీక్షితులవారు వ్రాసి నటు పైన చెప్పిన 15 అంశములను విని వాటి అర్థమును గ్రహించిన వారికి దీక్షితులవారి యోగ్యత యెంతమాత్ర మైనది స్పష్టముగా తెలియగలదు.

కర్మఫలము అనుభవించుటకు స్థూల దేహమే స్థానము. కనుక దీక్షితులవారు పాము, పాముయొక్క కుబుసము అని చెప్పిన దృష్టాంతము ఇచ్చట సరిపడదని విస్తరించి చెప్ప వలసి వచ్చినది. పాము దానికుబుసమును విడుచుట అను దృష్టాంతము శ్రీ శంకరులవారు బ్రహ్మసూత్రభాష్యమున ఒకచోట ఉపయోగించిరి. అచట పాముచే విడువబడిన కుబుసమునందు పామునకు ఆత్మబుద్ధి యెట్లు లేదో, అనగా: నాదను భ్రాంతి యెట్లు లేదో, జీవన్ముక్తులకు దేహమునందు ఆత్మబుద్ధి లేదని చెప్పిరి. (బ్ర. సూ. 1-1-4; బృహదా. 6-4-7) అచ్చట ఆ దృష్టాంతము యుక్తమైనది.

జిజ్ఞాసువు :- దీక్షితులవారు శిష్యుని (7-వ) ప్రశ్నమునకు సమాధానముగా 'లేచిపోవున దొకటి కలదా?' అని యెదురుప్రశ్న వేసిరి. లేచిపోవుట లేదని అర్థముగదా? దేహమునుండి లేచిపోవున దొకటి లేదు కనుక జన్మాంతరము స్వర్గనరకములు లేకపోయెను. కర్మఫలము అనుభవించుట యెట్లు?

వేదాంతి :- అచలవాదులయందు మితవాదు లిట్లు చెప్పుదురు:— "కర్మయనగా - మనము చేయు వ్యాపారము, పని. దానివలన మనము అన్నము సంపాదించుకొని భుజింతుము. అన్నసారము వీర్యము, మనస్సు. మనస్సు ప్రేరేపింపగా పురుషుడు భార్యతో రమించును. అప్పుడు వాని వీర్యము (అనగా వాని సూక్ష్మశరీరము) భార్య గర్భమున ప్రవేశించి స్థూలత్వమును పొందును. అనగా స్థూల దేహమై గర్భమునుండి జన్మించును. ఈవిధముగా పురుషుడు

వాని భార్యగర్భమునందు వాడే తిరుగ పుత్రుడై పుట్టుచున్నాడు. ఇదియే పునర్జన్మము. కర్మవల్ల జన్మము కలుగునను శాస్త్రవాక్యములయొక్క తాత్పర్య మిదియే. దీక్షితులవారు బిందువే (వీర్యమే) సూక్ష్మశరీరమని చెప్పియున్నారు. బిందువునందు మెఱుక కలదని చెప్పిరిగదా? శాస్త్రములను అడవిలో పడినవారు యీ యథార్థము తెలియక జనన మరణ భ్రాంతికి లోనైయున్నారట. అట్టి భ్రాంతి లేకుండ జేసినవాడు సద్గురువట.

పై యర్థమును ధృఢపరచునట్టి దీక్షితులవారి మఱికొన్ని వాక్యము లివి :—

(౧౮) పరలోకము - పునర్జన్మములు లేవా ?

"దేహమునకు నియమములేదు. నిలుపులేదు. అండలేదు, దేహమునకు జీవుడు లేడు. పరమాత్మ లేడు. బ్రహ్మ లేడు. దేహమునకు తలవ్రాత లేదు తలతిక్క లేదు. దేహమునకు తలలోక రెండును లేవు." (బృ. పూ. పు. 78)

"గు .... శరీరముపుట్టిన తర్వాత వున్నట్లువుండి సమస్తమైన వ్యవహారాలుచేసి వెంటనే నిద్రపేరుచెప్పి యేమి లేక పోతుంది. యీ మూడు నాలుగు ఘడియలు వొకవేళ రెండు ఝాములు మూలంలేని యీ గుర్తెరిగే శరీరం యేమీ లేదు. ప్రతిదినమందు యీ శరీరము యెప్పుడు మేలుకొంటే అప్పుడే కల. కొన్నాళ్లు యీలాగు ప్రతిదినము సుషుప్తి యేమీ లేక పోయినట్లు యేమీ లేదు. అది మరణం అన్నారు. శరీరం పుట్టకమునుపు యేమీ లేదు. కొనకు యేమీ లేదు. ఇది లెస్సా బట్టబయలు వుండనేవున్నది." (బృ. ఉ. పు. 132, 133)

"యీ శరీరంతోటి పుట్టె కల. యీ శరీరం యేమీ లేకుంటే మంది సుషుప్తి అన్నారు. లేకుంటే మరణం అన్నారు. యింతేకాని మూలంలేని యీ గుర్తెరిగే శరీరం వున్నంతసేపు నానాకూతలు మనము కూస్తాము. మనతోకూడా వచ్చినవారు కూస్తారు." (బృ. ఉ. ప్ర. 132)

ఈ వాక్యములయొక్క తాత్పర్యము మితవాదులు యీ క్రింది విధముగ చెప్పుదురు.

"నిద్రించినపుడు (సుషుప్తిలో) యెఱుక లేదు. ఎఱుక లేదు కనుక దేహము లేదు. ఇదే మరణము. తిరిగి మేల్కొన్నప్పుడు ఎఱుక, శరీరము కలుగుచున్నది. ఇదే జననము. ఈ విధముగా జరుగుచుండుటే జనన మరణ ప్రవాహము. స్థూలశరీరనాశనరూపమగు మరణముతో తిరిగి పుట్టక పోవడమే జన్మరాహిత్యము. ఇంతకంటె వేఱైన జనన మరణములు కలవని తలచుటే భ్రాంతి. అదే "జనన మరణ భ్రాంతి" "జన్మభ్రాంతి లేకుండాచేసినవాడు గురువు" (బృ. ఉ. పు. 73) 'అని దీక్షితులవారు చెప్పిన వాక్యమునకు తాత్పర్యమిదే' అని అందురు. స్వర్గ నరకాదులు లేవనుటకు మితవాదులు దీక్షితులవారి యీ క్రింది వాక్యముల నుదాహరింతురు :—

"శరీరములో కొంత నిబద్ధి, కొంత అబద్ధం, అని చెప్పినా ఆ గురువు పుత్ర మిత్ర కళత్రాదులతోటి నిర్మూలమై పోచాడు; అని భరద్వాజులువారు పలికినారు. యేమని అంటే శృతి॥ సమోలోవ్రపరి శిష్యతి యో దృత మభివతతి । తస్మాత్

హామ్యనృతః వక్తః॥ అని ప్రకాశోపనిషత్తుయందు వున్నది.* ”
(బృ. ఉ. పు. 115)

“ యేమీ లేని యీ గుర్తెరిగే శరీరములో కొంత నిబద్ధ కొంత అబద్ధం అని కుక్కలవలె మొరిగిందాకా యేమి? గాడిదల వలె కూచిందాకా యేమి? నక్కలవలె వెళ్ళిందాకా యేమి? మనుష్యులు మూలంలేని గుర్తెరిగే శరీరాల్లో కొంత నిబద్ధి కొంత అబద్ధం అని అనుకోగా విని, ఛీ! వారివలె మనము మాట్లాడవద్దు.” (బృ. ఉ. పు. 123)

“ శరీరం పుట్టక మునుపు యేమీ లేదు. చచ్చినతరువాత యీ శరీరం యేమీ లేదు. వున్నది కాసంత సేపు మంది కూతలు విని అనేక భ్రమలుచేత అనేకమంది యున్నట్లు తాను వుండి కొనకు తానేమి లేదు. యిలాగే అనేకమంది వుండి మళ్ళా యేమీ లేదు. చచ్చినవారు మళ్ళి పుడుచారు అనేటందుకు యేమీ లేదు గనుక యిది మళ్ళా పుడుచుంది అని యేలాగు అనె?”
(బృ. పూ. పు. 11)

“ అందరికి యీ మూలంలేని గుర్తెరిగే శరీరమే ప్రతి దినమందు యేమీలేదు. కొనుట యేమీలేదు. ఏమీలేని అపకీర్తి సుషుప్తి అని కల్పించినారు. కొనకు మరణం అని కల్పించినారు. తల్లికి అలవాటయిన పిల్లకు తల్లి కొనకు చస్తే, ఆపిల్ల అమ్మా, అమ్మా యని యాదిచేస్తే నీళ్లకుపోయింది, వస్తుందని పొరు

* ‘ ప్రకాశోపనిషత్తు ’ అనునది అష్టోత్తరశతోపనిషత్తులలో లేదు.

గింటివారన్నట్లు, మూలంలేని యీ గుర్తెరిగే శరీరం స్వర్గానికి పోయింది అని కల్పించినారు."

(బృ. ఉ. పు. 21, 22)

జిజ్ఞాసువు :- ఈమతము శుద్ధనాస్తికము కాదందురా ?

వేదాంతి :- దీక్షితులవారు యీ సందర్భమునకాక వేఱొక సందర్భమునందు చెప్పిన యీ క్రింద యుదాహరించినవారి వాక్యములవలన అతివాదులు తమ మతమును సమర్థించుకొందురు.

"అయితే మరణమగు వారందరు యీలాగుననే జన్మరహితులగుచున్నారా ? యని శంక రాగా, అందరి కాలాగున జన్మరహితముకాదు. అట్లైన అందరు ముక్తులగుచున్నారని శంక రాగలదు. ఆలాగున ఒప్పుకొనిన, గురుశిష్య న్యాయము లేకపోవుచున్నది. పాప పుణ్యములు లేకపోవుచున్నవి. ఈ విపరీతార్థములన్నియు కలుగుచున్నవి. ఇది ముక్తులైనవారు ఒప్పుకొందురు." (బృ. పూ. పు. 43)

"…. సద్గురువు దొరికినయెడల దుర్భ్రమలను విడిపించి జనన మరణ ప్రవాహరూపమైన సంసారసాగరమును దాటించును. అనగా సంసారమునుండి విముక్తుడగును. సంసారమునుండి విముక్తుడనగా ఈ సంసారమును విడవడముకాదు, జనన మరణ ప్రవాహమైన సంసారము విడుచుట."

(బృ. పూ. పు. 79)

జిజ్ఞాసువు :- పాప పుణ్యములు కలవని దీక్షితులవారు

వొప్పుకొన్నారుగదా? పుణ్య పాపముల ఫలము స్వర్గమో నరకమో యని మితవాదు లేల అంగీకరింపరు?

మితవాదు లిట్లందురు:— సద్గురువు దొరికినయెడల దుర్భ్రమలను విడిపించుననగా — పాప పుణ్యముల ఫలము నరకము - స్వర్గము - అనియు, పునర్జన్మ గలదనియు నమ్మకము యేదికలదో అదియే దుర్భ్రమ. దానిని విడిపించిన సంసారమునుండి విముక్తి కలిగినట్లె అందురు.

దీక్షితులవారు వారిగ్రంథమున స్వప్నజాగరములు రెండును ఒకటే కలయని అనేక సందర్భములయందు చెప్పియున్నారు. వారి మతమున కల మెలకువలకు భేదము లేదు. అందువలన కలలో పాపము చేసినవారికి శిక్ష లేనట్లే జాగ్రత్తయందును పాపముచేసినవారికి శిక్ష లేదని, (కర్మఫలానుభవము లేదని,) స్వర్గ నరకములు భ్రాంతియని చెప్పుదురు. ఇందు కాధారముగా దీక్షితులవారి యీ క్రింది వాక్యములను మితవాదులు ఉదాహరింతురు.—

"స్వప్నములో వచ్చిన శరీరం పుణ్యపాపములు చేసిందా? లేదా? అని వ్రాసుకొన్నవారు యెవరు? ముందర విమర్శించేవాడు యెవ్వడు? అదివేరే ఇదివేరే కాదు. వాక్కే వ్యాపారము; వునికి వాక్కేతీరే కొనకు యేమీలేదు. యీలాగున అన్ని శరీరాలకు సమానమే. పుట్టనివి మళ్ళా పుట్టవు. కలలో మర్యాద యెవరు చేసినారు. ఎవ్వరూలేరు. కల యెవరి స్వాధీనములేదు. అందుకే యీ జగత్తుకు దిక్కులేదు. యెవ్వరికి యేలాగు అను

కూలమైతే అలాగే వారివారి సమ్మతమే సమ్మతము. యే మర్యాద నిలువదు. ఆదరంలేనిది గనుక న్యాయం నమ్మరాదు, అన్యాయం నమ్మరాదు. ధర్మం నమ్మరాదు. అధర్మం నమ్మరాదు. కీర్తి నమ్మరాదు. అపకీర్తి నమ్మరాదు. యీ శరీరంనకు యేమి వుంది అని యెవ్వరు విచారించరు. తనకు తానే పుట్టి తనకు తానే యేమిలేదు." (బృ. ఉ. పు. 68)

దీక్షితులవారు నరకం ఉన్నట్లు అర్థమిచ్చే వాక్యములు 'నరక' శబ్దమును వాడిరి. 'నరక' శబ్దము పాపాత్ములు పోవు నరకలోకమును గురించి చెప్పబడినదని అతివాదుల వాదము. "అది సరికాదు; నరకలోకమనునది లేదు, కంటికి కనబడు శరీరమునే దీక్షితులవారు 'నరక' మన్నార"ని మితవాదుల వాదము. ఇందుకు వారు దీక్షితుల వారి యీ క్రింది వాక్యములే ప్రమాణములని చూపుదురు.

"జీవులకు జీవులే భక్షణ గాని, యింకేమి సందేహము లేదు. ఈ జీవులు నరక మనుభవించుచున్నారు. ఒకరిని ఒకరు అనుభవించుచున్నారు." (బృ. పూ. పు. 76)

దేహము నరకము గనుక ఒక దేహమును యింకొక దేహమును తినుటయే నరకమును అనుభవించుటయుట.

"మూలంలేని యీ గుర్తెరిగే శరీరం చేసిన మర్యాద నమ్మెనా సంకెళ్ళు తగిలినట్టే. మోక్షభ్రాంతి అయినా తగిలి శాస్త్రవాసనచేత, లోకాంతరగతమై తగిలి దానంతవాడై శరీరమనే నరకాన్ని విడువక మునిగి తేలేది." (బృ. పూ. పు. 59)

"అహంకారము నరకము." (బృ. పూ. పు. 35)

మితవాదుల మతమున పాప పుణ్యములు స్వర్గ నరకములు ఇహాపరములు ధర్మాధర్మములు అను యీద్వంద్వము లన్నియు ఎఱుక, దేహము, అనునవి రెండేగాని శాస్త్రముల యందు చెప్పిన పుణ్యాపాపములు, స్వర్గనరకములు, యిహపరములు, ధర్మాధర్మములు ప్రత్యేకముగా లేవని చెప్పుదురు. శాలారాంసింగుగారు వ్రాసిన యీ క్రింది ద్విపదార్థ దరువులను ప్రమాణములని చూపుదురు.

"ఇదియే మేనెరుకలు యివియె సదసత్తు
లివియే యాత్మానాత్మ లివియెరుకమరపు
లివికారణము కార్యమిదె జీవజగము
లివియే ప్రకృతి పురుషులు – యిహపరము లివియే –
యివియే సద్గురు శిష్యులు – యివియే సగుణ – నిర్గుణ
మివియే ప్రత్యక్పరమాత్మ – లివియే భావాభావము
లివె బంధమోక్ష మరయ ॥ లివి ॥" (ద్విపదార్థ. 28)

"యివి క్షేత్ర క్షేత్రజ్ఞులివె చిజ్జడంబు
లివి యవిద్యావిద్య లివె సుఖదుఃఖ
మివియె జ్ఞానాజ్ఞాన మివె పాపపుణ్య
మివియే సాకారరూపము – నిరాకారమివియే ధర్మా
ధర్మము –

లివియే దృక్కు- దృశ్యము లివియే జ్ఞానకర్మము -
లివియే నీవును నేను యెరుగజెప్పితిగదా ॥ యివియే ॥ ”
(29)

ఈ ద్విపదార్థ దరువులు 'నరక'ము యీ శరీరమే యని దీక్షితులవారు చెప్పిన అర్థమును దృఢపరచుచున్నవని మితవాదుల వాదము.

(౧౯) దేహి - దేహములు భిన్నములు

దేహి దేహములు యివి రెండును భిన్నములు. దేహినే ఆత్మయని, జీవాత్మయని, పురుషుడని, శరీరి యని వేఱు వేఱు నామములతో పిలుతురు. ఎవరే నామముతో పిలిచినను దేహి దేహములయందు ప్రకృతి సంబంధమైనది దేహము మాత్రమే యనియు, దేహి ప్రకృతి సంబంధమైన వాడు కాడనియు, వేదాంతులు ఏకకంఠమున చెప్పిరి. ఇందున భేదాభిప్రాయములు లేవు. హిందూమతమునందలి విశేషమిదియే. హిందుమతమునందేగాక క్రైస్తవులును మఱి కొన్ని యితర మతములవారును, శరీరము వేఱు, శరీరి వేఱు అను సిద్ధాంతమును అంగీకరించిరి. శరీరము ప్రకృతి సంబంధము, శరీరి ప్రకృతికి అతీతుడు. అనగా ప్రకృతికంటె భిన్నుడు, అని అంగీకరించిరి.

శాక్తతంత్రములు శ్రుతులకు భిన్నముగా చెప్పనంతవఱకు వాటియందు చెప్పబడిన సిద్ధాంతము ప్రమాణముగా గైకొనవచ్చును. శ్రుతివిరుద్ధమగు తంత్రజ్ఞానము గ్రాహ్యము కాదు. ఇచట శ్రుతులనగా — ప్రాచీనశ్రుతులు (దశోపని

షత్తులు) నవీనములగు శక్త్యుపనిషత్తులు కావు. చైతన్యమును జడమును రెండును శక్తియేయను శక్త్యాద్వైతము నుండియే కాలక్రమమున దేహి, దేహములు ఒక్కటియే యను సిద్ధాంతమును — శరీరములు నాలుగను సిద్ధాంతమును ప్రచారములోనికివచ్చి బలపడినందున తుదకు యీ సిద్ధాంతము నాధారముగా గైకొనియే శాక్తేయులయందలి కౌలశాఖకు చెందినవారు, దేవికి (శక్తికి) జంతుబలి యిష్టమనితలచి ఆవిధముగ జంతుబలిని సమర్థించు శాస్త్రములు, ఆచారములు ఆచరణ(మున)కు వచ్చియుండవచ్చును. జంతువులలో ఉత్తమోత్తముడు నరుడు, కనుక నరబలియు ఆవిధముగా ఆచరణలోనికి వచ్చియుండవచ్చునని యూహింపవచ్చును.

ఆత్మస్వరూపమును గుఱించి శ్రుతులు చెప్పినదే ప్రమాణము. ఈశావాస్యశ్రుతి 4 నుండి 8-వ మంత్రము వఱకును కేనోపనిషత్తు ప్రథమఖండము 2-వ మంత్రమునుండి 8-వ మంత్రమువఱకును ఆత్మస్వరూప మిట్టిదని చెప్పబడెను.*

మం॥ నజాయతే మ్రియతే వా విపశ్చి
న్నాయం కుతశ్చి న్న బభూవ కశ్చిత్,
అజో నిత్య శ్శాశ్వతోఽయం పురాణో
నహన్యతే హన్యమానే శరీరే. (కఠ. 1-2-18)

* గ్రంథవిస్తరభీతిచే వాటినిట నుదాహరింపలేదు. కఠోపనిషత్తునందలి మంత్రములు కొన్ని 3 వ ప్రకరణము (4) అధ్యాయమునందు చెప్పబడును కనుక నిచట చెప్పలేదు,

తా॥ ఆత్మ జననము మరణము లేనిది. అది దేని వలనను పుట్టినదికాదు. అజము, నిత్యము. శాశ్వతము. సనాతనము. శరీరము చంపబడినను ఆత్మ చంపబడదు.

మం॥ అణోరణీయాన్ మహతో మహీయా
నాత్మాఽస్య జంతోర్నిహితో గుహాయామ్,
తమక్రతుః పశ్యతి వీతశోకో
ధాతుః ప్రసాదాన్మహిమానమాత్మనః. (కఠ. 1-2-20)

తా॥ ప్రాణుల హృదయగుహాయందుండు ఆత్మ అణువుకంటెను అణువై యున్నది. మహత్తునకంటెను మహత్తైయున్నది. కోరికలు విడిచిన శోకరహితులకు పరమేశ్వరానుగ్రహమువలన ఆత్మయొక్క మహిమ తెలియును. అనగా: ఆత్మదర్శనము కలుగును.

వెనుక కఠోపనిషత్తునందలి (1-3-1) మంత్రమును ఇదివరకే యుదాహరించియుంటిని.

శ్రుతులు దేహియొక్క స్థానమును యిట్లు చెప్పినవి:

మం॥ అంగుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి. (కఠ. 2-1-12)

తా॥ అంగుష్ఠమాత్రుడైన పురుషుడు శరీరములో హృదయమధ్యమందు నివసించుచున్నాడు.

శ్రుతి ఆత్మను రథికునితోను శరీరము రథముతోను పోల్చి చెప్పుటతో తృప్తిచెందక శరీరమును పురముగను అందున్నవానిని పురుషునిగను యిట్లు వర్ణించినది:—

మం॥ పురమేకాదశద్వారమజస్యావక్రచేతసః,
అనుష్ఠాయ న శోచతి విముక్తశ్చ విముచ్యతే, ఏతద్వైతత్.
(కఠ. 2-2-1)

తా॥ శరీరమొక పురము. దీనికి పదునొకండు ద్వారములున్నవి. ఈ పురము పుట్టుక లేని బ్రహ్మముదై యున్నది. అట్టి పురమునందున్న బ్రహ్మము నారాధించిన వాడు దుఃఖమును విడిచినవాడై అజ్ఞానబంధమునుండి విముక్తుడై స్వతంత్రుడగుచున్నాడు. ఇదియే అది.

ఇచ్చట పదునొకండు ద్వారము లనగా తలలో సప్త రంధ్రములు (కన్నులు రెండు, చెవులు రెండు, ముక్కు-రంధ్రములు రెండు, నోరు) నడినెత్తిన సూక్ష్మమైన బ్రహ్మ రంధ్ర మొకటి కలదు. దేహమునందు నాభి మొదలు మూడు రంధ్రములు కలసి పదునొకండు రంధ్రములు. ఈ రంధ్ర ములే ద్వారములు. (ఇంద్రియములు.) ఈ పురమునందుండు వాడే పురుషుడు. (రాజు.)

రథము, రథస్థుడైన రథి ఇద్దరు ఒక్కటియేయైన — పురము, పురమునకు స్వామి (పురాధిపతి) ఒక్కటియే యైన — దేహి దేహములు ఒక్కటియే అనవచ్చును. ఇందువలన దేహి దేహములు 'బెల్లము, తీపు' వలె ఒకటే యను వాదము మెవరిదైనను ప్రాచీన శ్రుతులకు సమ్మతము కాదని స్పష్టమైనది.

మం॥ తస్మై సహోవాచ, ఇహైవాంతః శరీరే సోమ్య,
స పురుషో యస్మిన్నేతాః షోడశకలాః ప్రభవంతీతి.

(ప్రశ్న. 6-2)

తా॥ ఎవనియందు ఈ పదునారు కళలు ఉత్పన్న మగునో ఆ పురుషుడు ఈ శరీరమునందే యున్నాడు.

అని పిప్పలాదఋషి సుకేశునకు చెప్పినట్లు కలదు.

శౌనకుండను గృహస్థుడు అంగిరసుడను ఋషికడకు వెళ్ళి ఓ భగవానుడా! 'విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి' దేనిని తెలిసికొనుటవలన సర్వమును తెలిసికొనినట్లగునో అట్టి జ్ఞానమును తెలుపుమని ప్రార్థించెను. అంగీరసఋషి యీ క్రింది విషయమును బోధించెను.

మం॥ సత్యేన లభ్య స్తపసా హ్యేష ఆత్మా
సమ్యక్ జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యమ్,
అంతః శరీరే జ్యోతిర్మయోహిశుభ్రో
యం పశ్యంతి యతయః క్షీణదోషాః. (ముం. 3-1-5)

తా॥ సత్యము, తపస్సు, సమ్యక్ జ్ఞానము, నిత్యముగు బ్రహ్మచర్యము, ఇవి ఆత్మజ్ఞానమార్గములు. దోషరహితులగు యతులు జ్యోతిర్మయాత్మను శరీరము (హృదయము) నందే జూతురు.

మం॥ "... పశ్య త్స్విహైవ నిహితం గుహాయాం"
(ముం. 3-1-7)

తా॥ దివ్యదృష్టిగల జ్ఞానులకు ఆత్మ వారి హృదయ గుహాయందే గోచరమగును.

మం॥ "తస్యైష ఏవ శారీర ఆత్మా"

మొదటి ఆనందమయ పురుషుని ఆత్మయే ఈ శరీరము నందు ఆత్మయైయున్నది. (తైత్తిరీయ బ-6 అనువాకం)

ఐతరేయోపనిషత్తునందు పరమాత్మ ఈ శరీరము నందెట్లు ప్రవేశించెనను విషయము వివరించుచు —

మం॥ స ఏతమేవ సీమానం విదార్యైతయా ద్వారా ప్రాపద్యత,
సైషా విదృతి ర్నామద్వా స్తదేత న్నానందనమ్.
తస్య త్రయ ఆవసథా స్త్రయః స్వప్నా అయ
మావసథోఽయ మావసథోఽయ మావసథ ఇతి.

(ఐత. 1-3-12)

తా॥ ఆత్మ శిరోమధ్యభాగమును భేదించుకొని శరీరమునందు ప్రవేశించెను. దీనినే దశమద్వారమని చెప్పుదురు. ఈ ద్వారమునకే 'విదృతి' యనియు నామము. ఇది ఆనందనిలయము. దీని స్థానములు మూడు. స్వప్నావస్థలు మూడు. ఇట్లు మూడు తెరగులై యున్నది. (జాగ్రత్త, స్వప్నము, సుషుప్తి, అను మూడవస్థలయందును క్రమముగ కుడికన్ను, మనస్సు, హృదయములని.)

మం॥ సవా ఏష ఆత్మా హృది తస్యైత దేవ నిరుక్తగ్ం హృద్యయ మితి తస్మా ద్ధృదయ మహరహర్వా ఏవం విత్స్వర్గం లోకమేతి. (ఛాందో. 8.3-3)

తా॥ అట్టి ఈ ఆత్మ హృదయమునందున్నాడు. 'హృది అయం' = హృదయమునందు ఆత్మ యున్నదని అర్థము. ఇట్లు తెలిసినవాడు అనుదినము స్వర్గమునకు పోవును,

పాపరహితమగు ఆత్మ హృదయమునందుండుటచేతనే హృదయమునకు 'హృదయ' మను పేరుగలిగినది.

మం॥ యో విజ్ఞానే తిష్ఠ న్విజ్ఞానా దంతరోఽయం విజ్ఞానం న వేద యస్య విజ్ఞానగ్ం శరీరం యో విజ్ఞాన మంతరో యమయ

త్యేష త ఆత్మాంతర్యామ్యమృతః.*

(బృహదారణ్య. అ. 5-7-22)

తా॥ ఎవడు విజ్ఞానము (బుద్ధి) యొక్క లోపల వెలుపల నున్నాడో, ఎవనిని విజ్ఞానము తెలియజాలదో, ఎవనికి విజ్ఞానము శరీరమో, ఎవడు అంతర్యామియైయుండి విజ్ఞానమును నియమించునో అతడే నీ ఆత్మ. అతడే అంతర్యామి. అతడే అమృతము.

అని యజ్ఞవల్క్యమహర్షి, ఉద్దాలకమహర్షికి ఉపదేశించెను.

ఉపనిషత్తులు ఇట్లు చెప్పినవి:— ఇందులోని ప్రతి మంత్రార్థము దీక్షితులవారి మతమునకు భిన్నముగనే యున్నది. దేహి దేహములు ఒక్కటేయను వాదమును భగవద్గీతకు యెట్లు విరుద్ధమో చూతము: శ్రీజ్ఞానేశ్వరులును శ్రీదీక్షితులును గౌరవించిన గీతయందలి కొన్ని శ్లోకముల నుదాహరింతును :—

శ్లో॥ దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాంతర ప్రాప్తి ర్ధీర స్తత్ర న ముహ్యతి. (గీత. 2-13)

---

* బృహదారణ్యకోపనిషత్తునందు మొదటి రెండధ్యాయములు అశ్వమేధయాగమును గురించి చెప్పిన కారణమున కొన్ని ప్రతులయందు మొదటి రెండధ్యాయములు వదలి మూడవ అధ్యాయముతో శ్రుతి ప్రారంభించి మూడవ అధ్యాయమునకు ప్రథమాధ్యాయమని పేరిడి యున్నారు. కొన్ని ప్రతులయందు మూడవ అధ్యాయమునకు మూడవ అధ్యాయమనియే పేరిడియున్నారు. నేను రెండవ పద్ధతి ననుసరించితిని.

తా॥ ఆత్మకు యీ స్థూలదేహమునందు బాల్యము, యౌవనము, ముసలితనమును ఏప్రకారముకలుగునో మఱియొక దేహము ప్రాప్తించుటయు అట్లేయగును.

శ్లో॥ అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తా శ్శరీరిణః,
అవినాశినోఽ ప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత.
(గీత. 2-18)

తా॥ నాశము లేనిదియు, ప్రత్యక్షాది ప్రమాణములచేత గోచరము కానిదియునగు ఆత్మ (శరీరి) ఎల్లప్పుడు ఏకరూపమైనది. దేహములు నాశనము కలవి అని తత్త్వజ్ఞులచేత చెప్పబడినది. కనుక యుద్ధము చేయుము.

శ్లో॥ వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽపరాణి,
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ. (గీత. 2-22)

తా॥ "ఏవిధమున ప్రజలు ప్రాత వస్త్రములను విడిచి క్రొత్త వస్తువులను ధరింతురో, ఆవిధముగనే చైతన్యాధిపతి అయిన జీవాత్మ ఒక శరీరము విడిచి మరియొక శరీరమును ధరించును." (ఆంధ్రజ్ఞానేశ్వరి)

జిజ్ఞాసువు :- దీక్షితులవారు "శరీరములో కొంత నిబద్ధి. కొంత అబద్ధం, కుక్కలవలె మొరిగిందా కాదేమి? గాడిదలవలె కూచిందా కాదేమి ..." అని యీ విధముగా చెప్పిరే, వారు దీనికేమి సమాధాన మివ్వగలరు? అదిగాక, దేహాన్ని విడిచి ఎటుక వుండదని చెప్పిరిగదా? గీత అట్టి సిద్ధాంతమును ఖండించుచున్నదిగదా?

వేదాంతి :- ఇంతే కాదు యీ యర్థమునిచ్చు శ్లోకములు గీతయందు అనేకములు గలవు. ఈ క్రింది శ్లోకమునకు శ్రీజ్ఞానేశ్వరుల వ్యాఖ్యను చూడుడు.

శ్లో॥ శరీరం య దవాప్నోతి యచ్చాప్యుత్క్రామ తీశ్వరః,
గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్.

(గీత. 15-8)

తా॥ "జీవాత్మ ఒకటికంటె ఎక్కువ శరీరములలో సంచరించునపుడు తానే కర్తగాను, భోక్తగాను కనబడును. తానుకూడ యట్లే యనుకొనును. అర్జునా! ఒకపురుషుడు రాజకీయ విలాసములతో సంపన్నుడై యొకస్థానమున నివాసము చేయునపుడు మిక్కిలి ధనవంతుడుగాను విలాసపురుషుడుగాను కనబడును. అట్లే జీవాత్మ శరీరము నాశ్రయించినపుడు అతనికి 'నేనేకర్త' ననెడి భావన మిక్కిలి బలము కలిగినదగును. మరియు నింద్రియములయొక్క గంతు లారంభించును. లేక జీవాత్మ శరీరమును విడిచినప్పుడు ఇంద్రియములయొక్క సరంజామా యావత్తును తనతో తీసికొని పోవును. అతిథి కవమాన మయినప్పుడు అతిథి గృహస్థుని యొక్క యావత్తు పుణ్యసంపత్తిని హరించినట్లు, బొమ్మల నాడించువాడు వాటి నాడించు త్రాళ్ళను తనతోకూడ తీసికొని వెళ్ళినట్లు, వాయువు, ఫలములయొక్కయు పుష్పముల యొక్కయు పరిమళము దోచుకొనిపోయినట్లు, అర్జునా! శరీరము విడిచిపోవునపుడు దానిప్రభువగు జీవాత్మకూడ మనము, శ్రోత్రము మొదలైన షడింద్రియములను తనతో కూడ తీసికొనిపోవును." (ఆంధ్రజ్ఞానేశ్వరి)

గీతయొక్క 2-22; 15-8; శ్లోకముల తాత్పర్యము ఎవరో వ్రాసినదికాదు. శ్రీజ్ఞానేశ్వరులవారు వ్రాసిన తాత్పర్యమునకు సరియైన అనువాదము.

జిజ్ఞాసువు :- అయ్యా! దీక్షితులవారు యిదివఱలో చెప్పినట్లు — "అద్వైతమువలె దేహం అబద్ధం దేహీ నిబద్ధి అన్నట్లుకాదు" అన్నారుకదా? పై శ్లోకములు భగవద్వాక్యములేకదా? పై రెండు శ్లోకముల తాత్పర్యము శ్రీజ్ఞానేశ్వరులవారు చెప్పినదేకదా? అట్లుండియు దీక్షితులవారు అద్వైతుల తిరస్కరించుటయేల? అదిగాక "మృత్యుకాలమునందు ఎరుక లేవనూ లేదు, మరియొక చోటికి పోవనూ లేదు, దేహములోనే లయమగుచున్న" దనిరి. ఈ వాక్యములు శ్రీజ్ఞానేశ్వరులవారి మతమునకు విరుద్ధముకదా?

వేదాంతి :- విరుద్ధమే. దీక్షితులవారు "దేహమునకు జీవుడు లేడు" (బ్ర. పూ. పు. 78) అని చెప్పిరి. దేహమునకు ప్రభువు కలడని పై శ్లోకమునందు గలదు. అది అట్లుండనిమ్ము. ప్రస్తుత చర్చనీయాంశమేమన; దశోపనిషత్తులయందును భగవద్గీతయందును దేహీ దేహములు 'బెల్లము తీపు' వలె ఒకటికాదనియు, దేహీ నిత్యమనియు, దేహము అనిత్యమనియు రుజువైనది. ఇక బ్రహ్మసూత్రములయందు దేహీ దేహములను గుఱించి చెప్పిన విషయము ఇదివఱకే విపులముగా చెప్పియుంటిని.* కనుక నిచ్చట చెప్పుట

* బ్రహ్మజిజ్ఞాస ప్రథమభాగమున 3-వ ప్రకరణమునందు మరణానంతరము జీవుని అస్తిత్వము, పునర్జన్మ సిద్ధాంతము, పంచాగ్ని విద్య, బ్రహ్మోపాసకులు మరణానంతరము పోవు దేవయానము, బ్రహ్మలోకము,

అనావశ్యకము. ఇంతటితో, ప్రస్థానత్రయములకు "దేహి దేహములు రెండును ఒక్కటియే" యను దీక్షితులవారి వాదము సమ్మతముకాదని సిద్ధాంతమైనది. పంచమవేదమని ప్రసిద్ధికెక్కిన మహాభారతముయొక్క అభిప్రాయము కూడ యిదియే యనుటకు యీ క్రింది ప్రమాణములను చూపుచున్నాను.

భీష్ముడు ధర్మజునకు ఆత్మవిద్యాప్రకార ముపదేశించుచు —

(1) క॥ వికృతులు మహదాదికస
ప్తకము భయవిధేంద్రియములు పదియు విషయపం
చకమును మనస్సును గూడఁగ
వికారషోడశక మిది వివేకాఢ్యర్థీ. (శాంతి 4-273)

(2) క॥ ఈ స్వరము దేహతత్వ
భాసిత మిది దేహియైన పరమాత్మునివి
న్యాసమునకుఁ గానొదవి యుపా
సించుం గరణరూపమై యాకర్తకా. (శాంతి. 4-274)

(3) తే॥ పుత్రవినుము నవద్వారపురము
నందచింత్య సంవ్యాపకుఁడై శయించు
నీ సమస్తభావంబుల నెనసి యట్టు
లగుటఁ బురుషుండు నాజను నవ్విభుండు.

(శాంతి. 4-275)

పుణ్యాత్ములుపోవు పితృయానము, మూడవమార్గము జీవుల ఉత్క్రాంతి, బ్రహ్మవేత్తలకు ఉత్క్రాంతి లేకపోవుట అధికారపురుషుల జన్మము పొందలగు విషయములు చెప్పియుంటిని.

(4) క॥ అమరుం డవ్యయుఁ డజరుం
డమేయుఁ డమలస్వభావుఁ డప్పురుషుఁడు దే
హమున మహీజమునం దన
లము గతిసుండు మథనలక్ష్యుం డగుచున్. (శాంతి. 4-275)

ఈ మొత్తము పద్యములయొక భావమేమన, ప్రకృతియు దానినుండి కలిగిన మహాదాదులును కలసి దేహము. ఇది అనిత్యము. దేహి ప్రకృతిసంబంధమైనవాడు కాడు, నిత్యుడు.

దీక్షితులవారిమతము ననుసరించి ప్రకృతియందలి సత్త్వగుణమువలన పుట్టినది యొకటియని, అదియే దేహి యని చెప్పబడిన యీ మతము సరియైనది కాదని మహాభారతాదులనుండి అనేకప్రమాణములు చూపితిని. ఇప్పుడు దేహము దేహి వేఱగు ననుటకు శాస్త్రప్రమాణములను చూపింతును. పరకాయప్రవేశవిద్య మనదేశమున పూర్వకాలమున నుండెననుటకు పురాణములయందును చరిత్రగ్రంథములయందును గలదు. అందుకు దృష్టాంతముగా యీ క్రింది యితిహాసములను వివరింతును :—

శ్రీ శంకరభగవత్పాదులు గోకర్ణేశ్వరుని సేవించి, మూకాంబికాదేవి నారాధించి ఆ క్షేత్రమునకు సమీపమున ఉన్న బలిపురమను పేరుగల అగ్రహారమునకు పోయిరి. ఆ గ్రామమున ప్రభాకరుడను బ్రాహ్మణు డుండెను. ఆయన ఏకైకపుత్రుడు పదమూడు సంవత్సరముల వయస్సుగల వాడు జడుడై యుండెను. ఆ బాలుడు పాఠశాలకు పోడు. ఒక అక్షరమైనను వ్రాయడు. ఎవరితోను మాటలాడడు.

తోడిబాలురు తిట్టినను కొట్టినను సహించునేగాని ప్రతీకార మును తలంపడు. ఒకప్పుడు భుజించును మఱియొకప్పుడు భోజనము లేకయే యుండును.

ప్రభాకరునకు శంకరుల ఆగమనవార్త తెలిసి కుమారుని వెంటనిడుకొని శ్రీశంకరులను దర్శించి ఆ బాలుని వృత్తాంత మెఱిగించి ఉపనయనమును మాత్రమే చేయించితినని చెప్పి కుమారుని శ్రీశంకరులపాదములకడ నుంచెను. బాలుడు శ్రీశంకరుల పాదములు పట్టుకొని విడువకుండెను. శ్రీశంకరులు ఆ బాలు నిట్లు ప్రశ్నించిరి.

"నీ వెవడవు, జడునివలె నిట్లు ప్రవర్తించుచున్నావు?" — అందుకా బాలు డిట్లు చెప్పెను.

"నేను జడుడను కాను. నా సాన్నిధ్యమున జడము చలనమగుచున్నది. నాకు షడూర్ములు షడ్భావవికారములు లేవు. సర్వాతీతమగు 'సత్' పదవాచ్యుడను నేనై యున్నాను. — అని పండ్రెండు శ్లోకములలో పరమాత్మ తత్త్వమునుగూర్చి, అరచేతిలోని ఆమలకము (ఉసిరికపండు) వలె స్పష్టముగా తెలియబడునట్లు ఆశువుగా చెప్పెను. ఆశ్లోకములకు హస్తామలకములని ఆబాలునకు 'హస్తామలకాచార్యు' లని శ్రీశంకరులు నామకరణమిడిరి. అచటనున్న వారి ఆశ్చర్యమునకు మేర లేదు. అంత శ్రీశంకరులు ప్రభాకరునితో "నీ కుమారుడు సమస్తము నెఱిగినవాడు. ఇతనితో నీకు ప్రయోజనమేమియు నుండదు. నా వెంట కొనిపోయెదను." అని ప్రభాకరుని సమ్మతితో హస్తామలకుని శ్రీశంకరులు తమ వెంట గొనిపోయిరి.

శ్రీశంకరులు ఒకానొకనాడు శిష్యుల ప్రార్థనవలన హస్తామలకాచార్యుల పూర్వవృత్తాంత దివ్యదృష్టితో కనుగొనియుండిరి. కనుక ఇట్లు చెప్పిరి :—

ఒకప్పుడు యమునాతీరమున ఒక సిద్ధపురుషుడు నివసించుచుండెను. అచటికి స్నానార్థమైవచ్చిన యాత్రికులలో యీ బాలుని తల్లిదండ్రులుకూడ ఉండిరి. ఈతని తల్లి రెండేండ్ల ప్రాయముగల యితనిని ఆ సిద్ధపురుషునియెదుట కూర్చుండబెట్టి స్వామీ! ఈ బాలుని ఒకక్షణము చూచుచుండుడు స్నానముచేసివచ్చెద నని ఆ సిద్ధుని అనుజ్ఞగొని స్నానమునకు పోయెను. విధివశమున ఆ బాలుడు యిటునటు తిరుగుచుపోయి నదిలోపడి మరణించెను. ఆ బాలుని తలిదండ్రులు బాలుని మృతదేహము సిద్ధునియెదటనుంచి అనేకవిధముల విలపించిరి. ఆ మహాత్ముడు వారిరోదనమును విని మిక్కిలి దుఃఖించి చేయునదిలేక యోగమహిమచే తన శరీరమునువదలి బాలునిశరీరమున ప్రవేశించెను. బాలునకు చైతన్యము కలుగగనే అతని తలిదండ్రులు కుమారుడు బ్రతికెనని సంతోషముతో బాలునెత్తుకొని వారిగ్రామమును చేరుకొనిరి. ఆ సిద్ధపురుషుడే హస్తామలకుడు. అందువలన యితడు గురూపదేశములేకయే శ్రుతులుచదువకయే పరతత్త్వమును తెలిసికొనియున్నాడు. ఇతనికి తెలియనిది లేదు. అని శంకరులవారు చెప్పిరి.

(శం. వి. 13 వ సర్గము. 35 నుండి 38)

చచ్చినవారియందు పరకాయప్రవేశవిద్యద్వారా ప్రవేశించుట యట్లుండ బ్రతికియున్న మానవునియందు మర

ణించిన మానవుని జీవాత్మ ప్రవేశించుటయు, ఆ జీవుడు పూర్వదేహమున ఆర్జించిన శక్తులను, కొన్ని మహిమలను, భవిష్యత్తును చెప్పుట మొదలగు విద్యలను ప్రదర్శించి ధనమార్జించి కొందఱు పుణ్యకర్మముల నాచరించి స్వర్గమునకు సోపానములు కట్టుచున్నారు. కొందఱు క్షుద్రవిద్యల నార్జించి వానిచే ధనమును యశమును సంపాదించి పాపకర్మముల చేయుచు అధోగతిపా లగుచున్నారు. ఒకానొక వ్యక్తి బ్రహ్మవిద్యను తెలిసికొను వాంఛ కలిగి కొంత తెలిసికొని సర్వసంశయ నివృత్తి చెందనివాడై మరణించిన పిమ్మట సంకల్పబలమున స్వర్గాదిలోకములకు పోవక గంధర్వశరీరముతో తిరుగుచు బ్రతికియున్నవారి శరీరమునం దావేశించి కోర్కెను తీర్చుకొనిపోయినట్లు ఉపనిషత్తులయందు కలదు. బృహదారణ్యకోపనిషత్తునందలి పంచమాధ్యాయమున యాజ్ఞవల్క్యమునికిని భుజ్యునకును జరిగిన సంవాదమునందిట్టి కథ కలదు.

మద్రదేశమున కపిగోత్రియగు పతంజలుని బిడ్డ ఒంటిపై అంగీరస ధన్వుడను గంధర్వుడావేశించి భుజ్యునితో ఆత్మవిద్యనుగుఱించి సంభాషించినట్లు కలదు. మఱియు, యాజ్ఞవల్క్య ఉద్దాలక సంవాదమునందును యీకథ కొంత మార్పుతో చెప్పబడినది. —

ఇది యిట్లుండ బ్రతికియున్న మానవుడొకడు తన శరీరమునువదలి వేఱొక వ్యక్తి శరీరమున ప్రవేశించి సంభాషించినట్లు మహాభారతమునందు యీ క్రింది ప్రమాణమును చూడవచ్చును.

దేవశర్మయను మునికి రుచియను నామధేయముగల సర్వాంగసుందరి యగు భార్య యుండెను. దేవేంద్రుడు ఆమెయం దనురక్తుడై సమయమునకు వేచియుండెను. దేవశర్మ కీవిషయము తెలియును. ఒకసమయమున దేవశర్మ ఆశ్రమమునువదలి పోవలసివచ్చెను. అపు డతడు ఏకాంతమున తనశిష్యుడగు 'విపులు' డను నాతని పిలిచి 'ఇంద్రుని పాపసంకల్పము చెప్పి జాగ్రత్తగా నుండుమని' పోయెను. విపులుడు కర్తవ్యమేమని ఆలోచించి నిజశరీరమును వదలి గురుపత్నియగు రుచిశరీరమునందు ప్రవేశించెను.

ఆ॥ "పవను డాకసమునఁ బరఁగు విధంబున
నమ్మృగాక్షితనువునందుఁ గలయ
విపులు డాత్మ దగఁ బ్రవేశించె నవ్వధూ
రత్నమునకు నెఱుఁగ రాక యుండ."

(అనుశాసనికపర్వము. 22-94)

వ॥ "ఇట్లుప్రవేశించి యయ్యోగివరునాత్మ యన్నాతి చైతన్యంబు జడంబుగాఁ జేసికొనియుండె నట్టి యెడం బురందరుం డతిసుందరంబగు నాకారంబునదాల్చి యచ్చటికివచ్చి విపులుని శరీరంబుసూచి నిద్రితునింగాఁ దలంచుచు"

రుచిముఖమునుండి విపులునివలన చీవాట్లుతిని వెడలి పోయినట్లు కలదు. 'బెల్లము తీపు' వలె దేహి దేహములు విడదీయరానివైనచో యిట్లు చేయుటకు సాధ్యమగునా? ఇది పరకాయప్రవేశవిద్య.

యోగమార్గమున తనువునువదలి మఱియొకరియందు ప్రవేశించినట్లు మహాభారతమునందుండియే మఱికొన్ని ప్రమాణములు చూడవచ్చును.

జపసిద్ధినొందిన కౌశికుండను మునికిని, ఆ ఫలమును కౌశికుని వలన గ్రైకొనిన ఇక్ష్వాకు మహారాజునకును, బ్రహ్మ దేవుడు ప్రత్యక్షముకాగా, వారు యోగబలమున శరీరము నుండి బ్రహ్మరంధ్ర ద్వారమున నిర్గమించి చతుర్ముఖుని యందు ప్రవేశించిన ట్లున్నది. ఆసందర్భమునందలి వాక్యము లివి :—

"వ॥ అప్పుడు తదీయ బ్రహ్మరంధ్రోద్గతుండును మహాజ్యోతిర్జ్వాలాకృతియుం బ్రాదేశమాత్రుండును నగు పురుషు నెదుర్కొని పరమేష్ఠి సమాధానంబున వచ్చితే యని పలికె నెండియు" ...... (మ. భా. శాంతి. 4-166)

తే॥ బ్రహ్మ రంధ్ర నిర్గతుఁడైన బ్రాహ్మణుండు
బ్రహ్మ వదనంబు సొచ్చె భూపతియు నట్లు
వెడలి తద్వక్త్రి మెప్పటి వికసనంబుఁ
బొంద నందుఁబ్రవేశించె భూపవర్య.

(మ. భా. శాంతి. 4-169)

'గుడామధురవత్' (బెల్లము దాని తీపు) 'శిలా ప్రతిమవత్' (శిల దానియందు శిల్పము) లవలె దేహి దేహములు విడదీయరానివని దీక్షితులవారు చెప్పినదానికి పై వాక్యములు విరుద్ధములుకదా?

అదిగాక, సత్యవంతుని దేహమునుండి వెడలిన ఆతని జీవుని సావిత్రి చూచినట్లు మహాభారత ఆరణ్యపర్వమున ఇట్లున్నది.

ఆ॥ "ధరణినాథతనయు తమపున బ్రాదేశ
పరిమితాత్ముఁడగుచుఁ బ్రజ్వరిల్లు

జీవు వెడలఁగిరిచి చెచ్చెర నతి దీర్ఘ
భయదపాశనికరబద్ధుఁజేసి." (ఆరణ్య. 7-219)

"కృతాంతుండు సత్యవంతు నపగత ప్రాణుంజేసి"

గూటినుండి పక్షి వెడలినట్లు దేహమునుండి వెడలుట, తిరిగి దేహమున ప్రవేశించెనట. విదురుని ఆత్మ అతని దేహమునుండి వెడలి యుధిష్ఠిరుని దేహమునందు ప్రవేశించి నట్లు మహాభారతమునందలి ఆశ్రమవాస పర్వమున చెప్ప బడినది. ఇట్టి కథ లనేకములు గలవు.

దేహి దేహము వేఱని చెప్పుటకు ఇట్టివి అనేక ప్రమాణములు చూపవచ్చును. దీక్షితులవారు "మృత్యు కాలమునందు యెరుక యెక్కడికి లేచిపోయినదని చెప్పెను? యెరుక లేవనూలేదు. మరియొకచోటికి పోవనూలేదు." (బృ. పూ. పు. 147, 148) "ఎరుకను విడచి శరీరము వుండదు. శరీరమును విడచి ఎఱుక యుండదు." (బృ. పూ. పు. 163) అని చెప్పినందులకు యింత విస్తరించి చెప్పవలసి వచ్చెను. దీక్షితులవారి మతము పై శాస్త్రప్రమాణముల వలన హిందూమతమునకు విరుద్ధమైనదని స్పష్టమైనది.

---

(౨౦) ప్రకృతియే పురుషుడను మతము

మహాభారతము అనేక దర్శనములకు నిలయమైనను దేహి దేహములు ఒక్కటియే (ప్రకృతియే) అను మతము మహాభారతకర్తకు గాని, శ్రీకృష్ణభగవానునకు గాని సమ్మతము కాదు. మహాభారత సంగ్రామానంతరము

శ్రీకృష్ణార్జునులు ఇంద్రప్రస్థపురమునందున్న సమయమున భగవానుడు అర్జునుని ప్రార్థనమును మన్నించి మఱియొక సారి గీతాసారమును ఉపదేశించెను. మహాభారత అశ్వమేధ పర్వమునందుగల యీ యుపదేశమును 'అనుగీత' లందురు. అనుగీతలందు సత్త్వస్థుడైన పురుషుని కనుగొనుటయే ప్రాముఖ్యముగాని తక్కిన యే మార్గము వలనను పురుషుని కనుగొన జాలరని చెప్పు సందర్భమున దేహి దేహములు ప్రకృతియే యను మతప్రసక్తి వచ్చెను. అం దిట్లున్నది :—

శ్లో॥ క్షమా ధృతి రహింసా చ సమతా సత్య మార్జవమ్,
జ్ఞానం త్యాగోఽథ సన్న్యాసః సాత్త్వికం వ్రత మిష్యతే.
(అధ్యా. 51-8)

శ్లో॥ ఏతే నైవాను మానేన మన్యంతేఽ వైథ మనీషిణః,
సత్త్వంచ పురుష శ్చైవ తత్ర నాస్తి విచారణా.
(అధ్యా. 51-9)

శ్లో॥ ఆహు రేకే మహాత్మానో యే జ్ఞానేషు ప్రతిష్ఠితాః,
క్షేత్రజ్ఞ సత్త్వయోరైక్యం ఇత్యేతన్నోప పద్యతే.
(అధ్యా. 51-10)

శ్లో॥ పృథగ్భూతం తతో నిత్యం ఇత్యేత దవిచారితమ్,
పృథగ్భావశ్చ విజ్ఞేయః సహజశ్చాపి తత్త్వతః.
(అధ్యా. 51-11)

శ్లో॥ తథా చైకత్వనానాత్వం ఇష్యతే విదుషాం నయః,
మశకో దుంబల స్త్వైక్యం పృథక్త్వ మపి దృశ్యతే.
(అధ్యా. 51-12)

శ్లో॥ మత్స్యోదకే యథైవ స్యాత్ అప్రయోగ స్తథా తయోః,
సంబంధ స్తోయబిందూనాం పర్ణేః కోకనదస్యచ.
(అధ్యా. 51-13)

ఈ శ్లోకార్థములను తిక్కన సోమయాజిగారు యిట్లనువదించిరి.

సీ॥ ఇట్లగు టెట్లనియెదరేని సత్త్వంబు
సంతోషమును నహింసయును ధృతియు
క్షమయు నార్జవమును సన్న్యాసమును
బరిత్యాగంబు విజ్ఞాన యోగదశయు
సాత్త్వికంబులు గాన తత్త్వవిజ్ఞుల
యనుమానమునఁ బురుషాధిగమముఁ
బడయుట యొప్పెడు పదమంద్రు సత్త్వంబుఁ
బురుషుండు నొకఁడను బుద్ధిఁగొంద

తే॥ రార్యులాఁదుదు రట్లెల యగు నుదంబ
రమున మశకమ్ము వారి మీనమ్ము వసించి
నట్లు సత్త్వంబునం దంతరాత్ముఁ డుండుఁ
గాక యనియెడివారు పెక్కండ్రుగలరు. (అశ్వ. 2-186)

తా॥ సత్త్వము, సంతోషము, అహింస మొదలగు సత్త్వగుణములను పోషించు అనుష్ఠానముల వలన దేహస్థుడైన పురుషుని అనుమానమువలన తెలిసికొను మార్గము లభించునందురు. సత్త్వగుణమే పురుషుడనువారు కొందఱు గలరు. అట్లెలయగు? మేడిపండునందు మశకము (దోమయు)ను, నీటియందు చేపయు, ఉన్నట్లు సత్త్వంబున పురుషుడుండునను వారు అనేకులు కలరు.

సత్త్వగుణమే పురుషుడనుట అవిచారమూలమని ('తత్రనాస్తి విచారణా' యని) త్రోసివేయబడినది. మేడి పండునకు అందలి దోమకు సంబంధము లేదు. దోమ మేడి పండునకు కలిగినది కాదు. బయటినుండి వచ్చినది. చేపకు నీటికి జన్యజనక భావము లేదు. చేపను నీటినుండి వేఱుచేయ వచ్చును. ఈ రెండు దృష్టాంతముల వలన దేహి ప్రకృతి సంబంధమైనవాడు కాడని రూఢియైనది — ఇంకను యిట్లున్నది :—

"వ॥ ... యోగిజనానుభావ్యంబైన నెల వెఱింగించెదనని పలికి యోగులు దానవాత్మదర్శనానందంబు నొందుదు రవధానంబున నాకర్ణింపుమని యిట్లనియె.

(అశ్వ. 1-206)

ఆ॥ అనఘ ముంజగర్భమగు నిషీక విదర్శ
నంబు గాఁగఁ గనుఁ గొనంగ వలయుఁ
దనువు ముంజ మాత్మ దదిషీక నిష్కర్ష
విధము సుమ్ము యోగవిదుని వరవు.
(అశ్వ. 1-207)

క॥ తనువు వలన నిష్కర్షం
బొనర్చి జీవాత్మఁ గాంచు యోగి వరుండ
య్యను వొదవి యట్లు దన్నుం
గనినప్పుడు జనన మరణ గతులం దొలఁగున్. (అశ్వ. 1-208)

తా॥ ముంజగడ్డి గర్భమునందు నిషీకము (= పుల్లు) గడ్డి మొదట (మూలమునం దంటక) వేఱై యుండును. శరీరము ముంజ, జీవాత్మ నిషీకము అని యెఱుగవలయును. నిషీకమునకు ప్రక్కనున్న గడ్డిపోచలను తీసివేసిన, నిషీకము

దానినంటక (ముంజతో సంబంధము లేక) దానిలోనే యున్నదని తెలియబడును. ఇట్లే యోగవిదుడు పంచకోశముల నుండి ఆత్మను వేఱుచేసి చూచినప్పుడు తన్ను తాను చూచినవాడై జననమరణముల గతినుండి విముక్తుడగునని తాత్పర్యము. ఇది శ్రీకృష్ణభగవానుల మతము.

ఇచ్చట యీ క్రింది యంశమును గమనింపవలసి యుండును.

ప్రకృతినుండియే దేహి దేహములు కలిగినవని చెప్పువారియందు భేదాభిప్రాయములున్నవి. ఎట్లన :—

(1) ఒండుసీటిని ఒకపాత్రలోవేసి అందులో చిల్లగింజను చాదివేసిన ఒండుమట్టి వేఱుగను. శుద్ధజలము వేఱుగను యేర్పడునట్లు పరబ్రహ్మమునుండి కలిగిన మూలమాయ యందలి సూక్ష్మభాగము ఎఱుక లేక దేహి (చైతన్యము)గ యేర్పడినది. ఇది శుభ్రమగు నీటివంటిది. మూలమాయ యందలి స్థూలభాగము త్రిగుణాత్మక ప్రకృతిగను రూపొందినది. ఇదే దేహము. ఇది ఒండుమట్టి వంటిది. ఈ విధముగ దేహి దేహములు మూలమాయ నుండి కలిగినవని చెప్పునట్టి మతము.

(2) త్రిగుణాత్మక ప్రకృతి (లేక సాంఖ్యుల పరిభాషలో మూలప్రకృతి) అనబడు అవ్యక్తప్రకృతి దేహిగను, అట్టి అవ్యక్తప్రకృతినుండి కలిగిన మహదాదుల సమ్మేళనము వలన యేర్పడినది దేహముగను, ఈవిధముగ ఒకప్రకృతియే దేహి దేహము లనియు చెప్పెడి మతము

(3) త్రిగుణాత్మక ప్రకృతియొక్క సత్త్వరజస్తమోగుణములయందు సత్త్వగుణము జ్ఞానరూపమనియు, అదియే దేహి యనియు, తక్కిన రజస్తమోగుణములు దేహముగా రూపొందినవనియు, చెప్పునట్టి మతము.

(4) త్రిగుణాత్మక ప్రకృతియందలి సత్త్వగుణమునకు జ్ఞానము పుట్టినదనియు, అదియే దేహి యనియు, రజస్తమోగుణములకు దేహము కలిగినదనియు, చెప్పునట్టి మతము.

(5) జడప్రకృతి సంబంధమగు నాలుగు భూతముల పరస్పర సంబంధము వలన దేహమేర్పడినదనియు, దేహముయొక్క గుణమే జ్ఞానము. దానినే అజ్ఞులు దేహి యనుచున్నారనునట్టి మతము.

ఈ అయిదు మతములు పర్యవసానమున ఒకటియే. అనగా: జడద్రవ్యమే దేహి దేహము లయినదను భౌతిక మతము. కాని వాటియొక్క ఆరంభ స్వరూపమును పరిశీలించిన అన్నియు పరస్పర భిన్నమతములే. ఒకదానికిని మఱియొకదానికిని మధ్య చాలదూర మున్నది. ఇందులో మొదటిది సమర్థుల మతము. రెండవది శ్రీ జ్ఞానేశ్వరుల మతము. మూడవది అనుగీతలయందు నుదాహరింపబడిన మతము. నాలుగవది శ్రీ దీక్షితులు శ్రీ కృష్ణదాసుగారు చెప్పిన మతము. అయిదవది చార్వాకుల మతము.

ఇప్పుడు అనుగీతల యందలి ప్రస్తుతాంశమును చర్చింతము. మహాభారతకారుని అభిప్రాయము శ్రీకృష్ణభగవానుని మనమే యని స్పష్టమయినది. మఱియు మహాభారతాంతర్గత అనుశాసనిక పర్వము నందలి హరసనత్కుమార సంవాదము

నంను దేహి (పురుషుడు) దేహము భిన్నములని యెంత స్పష్ట పరుపబడెనో యీ క్రింది సనత్కుమారమహర్షి వాక్యముల వలన తెలియవచ్చును.

క॥ జలమున మీను నుదుంబర
ఫలమున మశకములుఁ బోలె బ్రకృతిం దాని
మ్ముల నునికి దెలిసి వేర్పా
టల వఱచిన పురుషుఁ డవ్యయత్వముఁ బొందుఁ.

(తిక్క-న. అను. 4-232)

ఇందువలన మహాభారతకర్తకు సహితము దేహి దేహములు 'బెల్లము తీపు' వలె 'శిలాప్రతిమ' వలె విడదీయుటకు సాధ్యము కానివను అచలవాదము సమ్మత మైనది కాదని విదితమైనది. కాని, దేహి దేహములు ప్రకృతి సంబంధమైనవను వారు కొలదిగా ఆ కాలమునందును గల రనియు, అది తప్పనువారు పెక్కు-ండ్రు కలరనియు, స్పష్ట మైనది.

లోకవ్యవహారములయందు సహితము కొన్ని సమయ ములయందు యిరువురు న్యాయాధిపతుల తీర్పులు పరస్పర విరుద్ధముగా నుండును. న్యాయాధిపతు లిరువురు సమానులే ? ఎవరిది ప్రామాణ్యము ఎవరిది అప్రామాణ్య మనుసంశయము కలుగును. అట్టి సందర్భముల యందు న్యాయస్థానమునందలి న్యాయాధిపతులందఱును వివాదాంశమును విని తీర్పు చెప్పు దురు. అధికసంఖ్యాకుల తీర్పు సరియైనదిగా పరిగణింపబడును. సత్త్వమే పురుషు డనువారు కొందఱుమాత్రమే యనియు,

సత్త్వమునందు సత్త్వమునకంటె భిన్నుడగుపురుషు డుండు ననువారు పెక్కండ్రు కలరనియు చెప్పుటవలన అధిక సంఖ్యాకులవాక్యమే గ్రాహ్యము. శ్రీకృష్ణభగవానుని అభిప్రాయము కూడ నిదియే.

దీక్షితులవారు సహితము ముంజ నిషీక దృష్టాంతమును గైకొనిరి. కాని, వారి భావము వేఱు. ముంజకు కలిగిన దే నిషీకము. ఆలాగే దేహమునకే దేహి కలిగినట్లని వారి భావము. సత్త్వగుణము పురుషుడను పొరపాటును కొందఱికి కలిగియుండుటకు భగవద్గీత యందలి యీ క్రింది శ్లోకములను చక్కగా అర్థము చేసికొనక పోవుట యని నా అభిప్రాయము.

శ్లో॥ సత్త్వా త్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవచ,
ప్రమాద మోహౌ తమసో భవతో ౽జ్ఞానమేవ చ.

(గీత. 14-17)

తా॥ సత్త్వగుణము వలన జ్ఞానము పుట్టుచున్నది. రజోగుణము వలన లోభము పుట్టుచున్నది. తమోగుణము వలన ప్రమాద, మోహ, అజ్ఞానములు పుట్టుచున్నవి.

భాగవతుల కృష్ణదాసుగారు పై శ్లోకమును ఆధారముగా గైకొని యిట్లు చెప్పిరి :—

క॥ "జ్ఞానము సత్వగుణమను
దానికి జన్మించెననుచు దామోదరుడా
మేనత్త కొడుకుతోనవె
జ్ఞానమునకు జన్మమొకటి కలిగెగదోయీ."

(కందము. 125)

క॥ పుట్టింది గిట్టు జ్ఞానము
పుట్టెననుచు కృష్ణమూర్తి పురుహూతజుడా
నట్టి తనముద్దు మరదికి
గట్టిగ వినజెప్పె నిందు కలతేమోయీ.

(కందము. 126)

ఈ పద్యద్వయము వలన కృష్ణదాసుగారి భావమిది :— గీతయొక్క 14-17 వ శ్లోకమునందలి 'సత్త్వాత్సం జాయతే జ్ఞానం' అను శ్లోకమున సత్త్వగుణమునకు జ్ఞానము కలిగినది. జ్ఞాన మనగా : ఎఱుక. అది పుట్టినది. దానినే 'ప్రజ్ఞానం బ్రహ్మ' అని శ్రుతులు చెప్పినవి. కనుక, బ్రహ్మమునకు చావు పుట్టువులు కలవనిరి. ఈ మాట విన్నంత మాత్రమున "అయ్యో మేము బ్రహ్మము నిత్యసత్యమైన దని శ్రుతులు చెప్పగా నమ్మియుంటిమే అట్టి బ్రహ్మమునకు జనన మరణములు గీత అంగీకరించెనే" యని అద్వైతులు కలత చెందినట్లు భావించి 'ఇందు కలతేమోయి' అన్నారు. కృష్ణదాసుగారు చెప్పిన అర్థము అచ్చట సరిపోదు. ఎట్లనగా :—

గీతయందలి 'సత్త్వాత్సంజాయతే జ్ఞానం' సత్త్వ గుణము వృద్ధిలోనికి వచ్చిన కాలమున మానవునకు భ్రాంతి రహితమగు బ్రహ్మజ్ఞానము (సంయక్ జ్ఞానము) కలుగును. అట్టి జ్ఞానము కలిగినప్పుడు నామరూపములను ముసుగుక్రింద నామరూపరహితమగు, అద్వితీయబ్రహ్మమును చూడగల యోగ్యత, వివేకము (జ్ఞానము) కలుగునని అర్థము. అది యెట్టిదనగా :—

శ్లో॥ యదా భూతపృథగ్భావ మేకస్థ మనుపశ్యతి,
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా. (గీత. 13-30)

తా॥ భిన్నభిన్న రూపములుగ నుండు సమస్త భూతముల యందును ఒక్కటియైన ఆత్మ (పరమాత్మ) ఎవడు చూచునో, ఆ ఆత్మ వలననే యీ సమస్త ప్రపంచము పుట్టినట్లు యెవడు తెలిసికొనునో ఆ మానవునకుగల <u>అట్టి వివేక మే సత్వగుణము వృద్ధిలోనికి వచ్చినప్పుడు కలుగు జ్ఞానము.</u>

ఇచట యింకొక విషయము చెప్పవలసి యున్నది. శివసూత్రముల యందలి 'జ్ఞానం బంధః' అను సూత్రమునకును, భగవద్గీత 14-17 వ శ్లోకమునందలి 'సత్త్వాత్సంజాయతే జ్ఞానం' అను భగవద్వాక్యమునకును, శ్రీజ్ఞానేశ్వరులు, వారి సిద్ధాంతమునకు సరిపోవునట్టి అర్థమును యీ క్రింది విధముగ చెప్పిరి :—

"మఱియు శివసూత్రంబులయందు నా సదాశివుండును జ్ఞానంబును గూర్చి వివరించుచు నదియు నొక్క బంధనవిధంబని వర్ణించి యున్నాడు." (అను. 3-16)

"కాని, యివ్విషయంబు శివప్రోక్తంబో శ్రీవల్లభోక్తంబో యగుటంజేసియో మన మంగీకరించెద మనుట మాత్ర మర్థంబు గానేరకుండు. వా రివ్విధంబున వాకొనకున్నను మనకయ్యది యవగతంబై యుండెడిదే."

(అను. 3-17)

ఈ విషయమే సంస్కృతానువాదమున నిట్లున్నది.

శ్లో॥ శివ సూత్రే శివేనోక్తం జ్ఞానం బంధో హి కేవలః,
సత్త్వేన జ్ఞాన బంధస్స్యాద్వక్తేతి గరుడధ్వజః.
(అమృతానుభవము. 3-16)

అజ్ఞానమును నివర్తింపజేయునట్టి సంయక్ జ్ఞానమును అనగా: అహం బ్రహ్మాస్మీత్యాకారమైన యొప్పు అఖండాకార వృత్తి రూప జ్ఞానముకూడ బంధమేనని శ్రీజ్ఞానేశ్వరుల అనుయాయులు అర్థము చెప్పుచున్నారు. ఆ అర్థము సరికాదని దానిని ఖండించుచు 'జ్ఞానం బంధః' అనగా:— భేద జ్ఞానము బంధమని అభేద జ్ఞానము బంధవిచ్ఛేదకమని చెప్పుచు సూత్రమునందు చెప్పిన 'జ్ఞాన' శబ్దమున కర్థము భేదజ్ఞానమేకాని అభేదజ్ఞానము కాదని అభేదజ్ఞానము బంధవిముక్తిని కలిగించునని పెద్దలు కొందఱు అర్థము చెప్పి యున్నారు. ఈ యంశమును యిదివఱలో విశదీకరించి యుంటిని.* కనుక నిచ్చట చెప్పవలసి అవసరముండదు.

'సత్త్వాం త్సంజాయతే జ్ఞానం' (గీత. 14-17) లో చెప్పబడిన జ్ఞానము అఖండాకార వృత్తి జ్ఞానమే కనుక అట్టి సాత్త్విక జ్ఞానము సహితము బంధహేతువేయని శ్రీజ్ఞానేశ్వరుల తాత్పర్యము. పైన చెప్పబడిన (అను. 3-17) లో శివ, శ్రీవల్లభుల వచనము లొకటియే యని వారు చెప్పిరి.

---

* ఈ భాగము మొదటి ప్రకరణమునందలి (౧౪) అధ్యాయమున అఖండాకారవృత్తి అఖండైక రసము అను శీర్షికక్రింద 'జ్ఞానం బంధః' అను సూత్రార్థమును వివరించి యున్నాను.

శ్రీజ్ఞానేశ్వరులు చెప్పిన అర్థముతో దీక్షితులవారి యొక్కయు, కృష్ణదాసుగారి యొక్కయు, వచనములకు సామ్యము కుదురదు. ఎట్లన 'సత్త్వాత్సంజాయతే జ్ఞానం' అనగా సత్త్వాత్ = సత్త్వగుణము వలన, జ్ఞానం = జ్ఞానము, సంజాయతే = పుట్టుచున్నది. సత్త్వగుణము వలన (ఇది పంచమీవిభక్తి) శ్రీరాముని వలన సుగ్రీవుడు రాజ్యలాభము నొందెను. అన్నట్లు సత్త్వగుణము వలన అంతఃకరణము (మనస్సు) నిర్మలమై ఆత్మాకారమును పొందుచున్నదనియు దీనివలన ఆత్మసాక్షాత్కారము కలుగుననియు అర్థము.

ఇందులకు పోతనగారి భాగవతమునం దిట్లున్నది :—

"విక్రియాశూన్యమై విషయత్వమును లేని
దగుచు నాత్మాకారమై తనర్చు
అంతః కరణము ... ... అని యున్నది.

(భా. 10 పూ. పద్యము. 554)

గీతయొక్క 14-17 శ్లోకము తరువాతి శ్లోకమున 'ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థా' అని యున్నందున సత్త్వగుణము వృద్ధిలోనికి వచ్చినవాడు మరణానంతరము బ్రహ్మవిష్ణ్వాది స్థానముల బొందుచున్నాడని యర్థము. శ్రీకృష్ణదాసు సత్త్వగుణమునకు (షష్ఠీవిభక్తి) అని చెప్పియున్నారు. కృష్ణదాసుగారి పద్యములయందు సత్త్వగుణమునకు ఎఱుక (జీవుడు)ను, రజో తమోగుణములను క్రమమున ప్రాణము, శరీరము (మరపు) కలిగినందున మొత్తము దేహి దేహములు ప్రకృతి సంభవములే (భౌతికములే) అను చార్వాక వాదమును ధృడపరుప బడినది. ఇప్పుడు శ్రీజ్ఞానేశ్వలయొక్కయు,

శ్రీదీక్షిత, శ్రీకృష్ణదాసుగార్లయొక్క వాదమునందు గల భేదము స్పష్టపరచితిని.

మఱియు పైన చెప్పిన గీతయొక్క 13-30; 14-17 శ్లోకముల యందలి యర్థమునే గీత 18-20 శ్లోకమున ధృడ పరిచినది. ఎట్లనగా :—

శ్లో॥ సర్వభూతేషు యేనైకం భావమవ్యయ మీక్షతే,
అవిభక్తం విభక్తేషు తజ్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్. (గీత. 18-20)

తా॥ (మానవుడు) ఏజ్ఞానముచేత భిన్నభిన్నములైన సర్వభూతములయందును, అఖండమైనదియు, నాశరహిత మైనదియు. ఏకమైనదియు నైన పరమాత్మ స్వరూపమును (ఎవడు) చూచుచున్నాడో (వాని) అజ్ఞానము సత్త్వగుణము వలన కలిగినదిగా తెలియుము.

గీత, తరువాత చెప్పిన రెండు శ్లోకములయందును (13-21, 22) రాజస తామస జ్ఞానముల స్వరూప మిట్టిదని వివరింపబడినది. రాజసజ్ఞానము వలన సర్వభూతములయందు భేదభావము కలుగుచున్నది. తామసజ్ఞానము వలన జీవుడు దేహమే యను విపరీత జ్ఞానము కలుగునని తాత్పర్యము. అంతియే కాని వృక్షమునకు ఫలము పుట్టునట్లును, గోవు నందు వత్సము కలుగునట్లును, సత్త్వగుణమునకు జ్ఞానము (బ్రహ్మము) పుట్టినదను అర్థము విపరీతార్థము. అట్టి విపరీతార్థము పై (గీత. 18-20) శ్లోకముచేత ఖండింపబడినది.

కృష్ణదాసుగారు :—

కందా॥ అన్నము శుక్లంబగు రస
మున్నతిగా రక్తమగును నొకచో రెండుఁ
పన్నగ గలసినమేనని
యెన్నబడుఁ యెముక గల్గి యిదె మాయసుమ్మీ
మూలములేనిదిదె నీవుసుమ్మీ — (152)

అన్నపు సూక్ష్మాంశము ... అను 83 వ కందార్థము నందలి అర్థమును పై కందార్థమునందు చెప్పిన అర్థమును ఒక్కటే.

ఛాందోగ్యోపనిషత్తు (6-2-6) మంత్రమునందు యీ యంశము కలదు. దానిని సంగ్రహించి చెప్పెదను.

శ్రుతియందు త్రివృత్కరణము (అనగా : భూ, జలాగ్నులను మూడు భూతములు) వలన సృష్టిజరిగినట్లు చెప్పబడెను. కనుక, పై మూడు భూతములను మథించిన పెరుగును మథింపగా వెన్నవచ్చినట్లు అన్నము కలిగినదనియు, అన్నము జఠరమునందు చొచ్చి జీర్ణమై అందలి అన్నిభాగములయొక్క స్థూల, మధ్యమ, సూక్ష్మాంశముల వలన క్రమముగ ఎముకలు, మజ్జ, వాక్కు అను మూడును; జలభాగము యొక్క స్థూల మధ్యమ, సూక్ష్మాంశముల నుండి క్రమమున మూత్ర, రక్త, ప్రాణములను మూడును; పృథ్వీభాగము యొక్క స్థూల, మధ్యమ, సూక్ష్మాంశముల నుండి పురీషము, మాంసము, మనస్సులను మూడును; పుట్టుచున్నవని చెప్పబడినది. కాని మనోప్రాణసంయోగము వలన ఎముక, లేక, జీవుడు, లేక, ఆత్మ అను వస్తువు కలిగినట్లు చెప్పియుండ లేదు.

ఆత్మ జడమను వాదము శ్రీశంకర శ్రీరామానుజ శ్రీవల్లభాచార్యాదులగు మహనీయులందఱు పెక్కువిధముల ఖండించియున్నారు. అద్వైతులు ఈ మతమును చక్కని హేతువులు చూపి ఖండించియున్నారు. అందులో ఒకటి యిం దుదాహరింతును. శ్రీ సురేశ్వరాచార్యులవారు నైష్కర్మ్యసిద్ధియం దిట్లు చెప్పిరి:—

శ్లో॥ బుసవ్రీహి పలలాంశై ర్బీజ మేకం త్రిధా యథా,
బుద్ధి మాంస పురీషాంశై రన్నం తద్వ దవస్థితమ్.

(నై. 2. ౧౪-౨౪)

తా॥ వడ్లగింజ ఒకటియేయైనను కాడ (చెత్త) పొట్టు, గింజ (బియ్యము) అను మూడు భాగములుగ నెట్లున్నదో అన్నము కూడ అట్లే అసార (స్థూల) మైన భాగము పురీషమనియు, కొంచెము సారమైన (మధ్యమ) భాగము మాంసమనియు, మిక్కిలి సారమైన (సూక్ష్మ) భాగము బుద్ధియనియు, మూడు విధములుగా ఏర్పడియున్నది.

పై ఛాందోగ్యశ్రుతి ననుసరించియే సురేశ్వరాచార్యులవారు పై విధముగ చెప్పిరి.— అన్నపరిణామమైన పురీషమునందు నేనను బుద్ధి నీకు కలుగ లేదు. పురీషమును విసర్జించి దానియందు అనురాగము లేక వెడలిపోవుచున్నావు. అదేవిధముగా అన్నపరిణామమైన దేహము (మాంసము) నందును, నేనను బుద్ధిని విడిచి పురీషమునందు వలెనే అనురాగమును వదలవలయును. అట్లే అన్నపరిణామమేయగు బుద్ధియందును ఆత్మభావమును చేయక (పురీషమునందు వలెనే) రాగమును వదలి ఆత్మ కాదని మహాత్ములుందురని భావము.

మన నిత్యానుభవమును చూచినను, అన్నము నీవు (ఎఱుక లేక ఆత్మ) కావు. అట్లే జలము సహితము ఎఱుక కాదు. జలాన్నముల రెండింటిని ఒక పాత్రలో నిడిన నెఱుక కాదు. అన్నోదకములయొక్క స్థూల పరిణామములగు మల మూత్రముల మిశ్రమము నీవు (ఎఱుక) కాదు. అట్లే అన్నోదకముల మధ్యమ పరిణామమగు మాంసశోణితములు నీవు (ఎఱుక) కాదు. ఇట్లుండగా, సూక్ష్మ పరిణామముల కలయిక నీ వెట్లగుదువు? మల మూత్రములను వదులునపుడు "అయ్యో! నేను నాయందు కొంత భాగమును వదులుచున్నానే" అని దుఃఖింపవు. మల మూత్రముల యందు లేని ఆత్మాభిమానము (నేనను భావము) మనఃప్రాణ సంయోగమున నెట్లు కలిగెను? అదిగాక పురీషమునందు కొందఱకు ఒకప్పుడు ఏలిక పాములు (Pin worms)ను, మఱి యొకప్పుడు నులిపురుగులను తెల్లని సన్నని పురుగులు (round worms) పడును. అవి స్వదేహమునం దుద్భవించినను వాటి యందు ఆత్మభావన (నేనను భావము) లేదేమి? సారాంశ మేమన: ఆత్మ పుట్టినది కాదు. అది జడము కాదు. కృష్ణదాసుగారి 'పిండబ్రహ్మాండము' లను (కందార్థమును ఈ ప్రకరణము 2-వ అధ్యాయములో చూడుడు) కందార్థము జడాద్వైతమునే దృఢపరచుచున్నది.

పై చాంధోగ్యశ్రుతి వాక్యములయొక్క తాత్పర్య మేమన :— అన్నోదకముల వలన మనస్సును ప్రాణమును కలుగుననుట నిజమే. కలుగుననగా :— మనః ప్రాణములకు శక్తిని సమకూర్చును. మనః ప్రాణముల సంయోగము వలన 'చలనాత్మక శక్తి' కలుగును. అది ఆత్మ కాదు,

జీవుడు కాడు. (ఈ విషయమై తెలియగోరువారు బ్రహ్మ సూత్రములు 2-4-21, 22, 2-3-1 నుండి 8 వఱకు సూత్రములకు శాంకర భాష్యమునుగాని బ్రహ్మసూత్రార్థ చంద్రిక గాని చూడుడు.)

మఱియు, ఆత్మయందే ప్రాణము పుట్టినదని శ్రుతులు చెప్పినవి. (ప్రశ్న. 3-3;) నీటివలన ప్రాణము పుట్టినదనగా: నీటిచే ప్రాణము పోషింపబడినదని అర్థము. ఎవ రెట్లు చెప్పినను జడద్రవ్యము నుండి చైతన్యము పుట్టదు.

శ్రీ లోకమాన్యతిలక్ గారు చేతన యనగా: "జడ దేహమునందు గన్పట్టెడి ప్రాణములయొక్క సంచలనాత్మక క్రియ, చేష్ట, లేక బ్రతికియుండుట యను వ్యాపారము మాత్రమే యిచ్చో నుద్దేశింపబడినది. ఏచిచ్ఛక్తిచే జడ పదార్థములందు సైతము చలనాదిక్రియ (అనగా వ్యాపారము) కలుగునో అదియే చైతన్యము" అని చెప్పిరి. (గీతా రహస్యము, పుట. 192 లేక, 6-వ ప్రకరణము).

రైలు యింజనులో నిప్పు నీరు కలయికవలన ఆవిరి పుట్టి ఆవిరి ఇంజనును నడుపుచున్నట్లు జడ ద్రవ్యమునుండి చైతన్యము పుట్టునని కృష్ణదాసుగారి అభిప్రాయమై యుండవచ్చును. వారికాలములోనే మన ప్రాంతమునకు రైలువచ్చి యుండెను. ఇట్టి మతమునకు లోకమాన్య శ్రీ బాలగంగాధర తిలక్ మహాశయులు జడాద్వైతమని పేరుపెట్టిరి.

హెకిల్ (ERNST HECKLE) అను పాశ్చాత్య పండితుడు జడద్రవ్యముయొక్క సంయోగముచే చైతన్యముత్పన్నమైనదని వ్రాసెనట.

"ఇట్లుత్పన్నమైన ఈ చైతన్యమే ఆత్మయనియు, ఆత్మ మనస్సు అను నీ రెండును శరీరమునందు మెదడువంటి దనియు ఆత్మవంటి ప్రత్యేక శాశ్వత పదార్థము ఏదియు లేదనియు, అతని మతము."

హెకిల్ గారి వాదమును యూరపు ఖండమునందలి తత్త్వవేత్త లంగీకరింపలేదని కూడ తిలక్ మహాశయులు వ్రాసిరి. జడాద్వైతమును విమర్శించుచు లోకమాన్యులు:

"జడప్రకృతి యందుండి చైతన్యము పుట్టుటకు వీలు లేకపోవుటయే గాక యెవడైనను తన భుజములమీదఁ దా నెట్లుల ఆసీనుడు కాలేడో, యటులే ప్రకృతి నెఱుంగు నది, లేక చూచునది, ప్రకృతికంటె వేఱగు పదార్థమైననే కాని 'నేను దీని నెఱుంగుచున్నాను' అను సంభాషణమే ప్రచారములో నుండ నేరదు. సృష్టి వ్యవహారమును చూచితి మేని ఎఱుగువాడొకడును ఎఱుంగబడునది తద్భిన్నమగు మఱియొకటియు యనునది అందరికి అనుభవసిద్ధమే" అని వ్రాసిరి. (గీతారహస్యము, ఏడవ ప్రకరణము)

దీక్షితులవారు యిట్లన్నారు: "గుర్తెరిగే క్షేత్రజ్ఞ స్వరూపమే పరబ్రహ్మం అయితే క్షేత్ర మెందుకు? (బృ. ఉ. పు. 79) అని ప్రశ్నించిరి. ఇందుకు నా సమాధానము:— గాఢాంధకారమున మనకు కన్నులున్నను పదార్థముల రూపమును చూడలేము, దీపము వెలిగించగనే సమస్తమును చూచుచున్నాముగదా? రూపములను చూచినది దీపమా? లేక కన్నులా? కన్నులే చూచినవనిన దీపములేని సమయ మున యేల చూడలేదు? దీపమే చూచిన దనినచో వస్తు

రూపములను దీపమున్నను కన్నులు లేకున్నచో మన మెఱుఁగఁజాలముగదా? క్షేత్రజ్ఞునకు క్షేత్రము సహకారి మాత్రమే. లోకమునందు ద్రష్టత్వ - దృశ్యత్వములు రెండును ఒక పదార్థమునకు ధర్మములు కాజాలవు. ఇది మన నిత్యానుభవము. ద్రష్టత్వమనగా: చూచునట్టి స్వభావము. దృశ్యత్వమనగా: చూడబడునట్టి స్వభావము. అందువలననే ఆత్మానాత్మలయొక్క స్వరూపజ్ఞానమే సర్వవేదాంతసారము."

ఎలుక (ఆత్మ)ను లింగమని దీక్షితులవారును కృష్ణదాసుగారును చెప్పిరి. (కందము. 231) మహాభారతమునందు తత్త్వశాస్త్రమునకు చెందిన భిన్నభిన్న సంప్రదాయములను చెప్పియుండినను ప్రకృతియే. దేహి దేహమను మతమును మహాభారతము అంగీకరింపకుండుటయేగాక, తీవ్రముగా నిరసించినది. ఉద్యోగపర్వము నందలి సనత్సుజాతీయమునందు సనత్సుజాతమహర్షి ధృతరాష్ట్రునకు తత్త్వోపదేశము చేయుచు ఆత్మనుగుఱించి యిట్లు చెప్పిరి :—

"శ్లో॥ కో హ్యేనమంతు రాత్మానం బ్రాహ్మణో మంతు మర్హతి,
నిర్లింగ మచలం శుద్ధం సర్వద్వంద్వ వివర్జితమ్."

(స. అ. 2 శ్లో. 32)

తా॥ బ్రహ్మవిదుడైన బ్రాహ్మణుడు ఆత్మను నిర్లింగము [స్త్రీ పురుష నపుంసక లింగభేదము లేనిది] అచలము (= ఎట్టి వికారములేక క్రియా కర్తృత్వములేక చలింపక యుండునట్టిది) శుద్ధం (= అవిద్యాది దోషములు లేనిది) సర్వద్వంద్వవివర్జితమ్ = సమస్త శీతోష్ణ సుఖదుఃఖాదులు లేనిది. అని మననము చేయుటకు అర్హుడగుచున్నాడు.

ఆత్మను పై విధముగ మననము చేయక అన్యథా చేయువానిని గుఱించి యిట్లు చెప్పిరి :—

శ్లో॥ "యోఽన్యథా సంత మాత్మాన మన్యథా ప్రతిపద్యతే,
కిం తేన నకృతం పాపం చోరే ణాత్మాపహారిణా."

(సనత్సు. 2-33)

తా॥ ఎవడైనను ఆత్మను అన్యథా అనగా: పైన చెప్పిన నిర్లింగము, అచలము, శుద్ధము, సర్వద్వంద్వ వివర్జిత మను లక్షణములను విరుద్ధముగా (ఆత్మను) ప్రకృతియని, లింగమని, ప్రాణమని, యింద్రియములని, దేహాది సంఘాత మని భావించినవాడు ఆత్మను అపహరించిన దొంగ అగు చున్నాడు. అట్టివాడు యీ లోకమున చేయని పాప మేమున్నది? అనగా: అన్ని పాపములు చేసిన పాపాత్ముడే యని తాత్పర్యము. ఈ వాక్యములతో దీక్షితులవారి మతము సూర్యోదయముతో తమస్సు అదృశ్యమగునట్లు స్వరూపమును కోల్పోయినది.

దీక్షితులవారు చెప్పిన మూడు మంత్రములలో మొదటిదగు షోడశాక్షరీ మంత్రమును, దానియొక్క తాత్పర్యమును, ఆ సిద్ధాంతము వేదాంతశాస్త్రములకు యేవిధముగా విరుద్ధమో శాస్త్రప్రమాణములను చూపి చెప్పితిని. ఇంతటితో ప్రస్తుతము యీ యీ యంశమును విరమించి దీక్షితులవారి రెండవమంత్రార్థమును గుఱించి చర్చింతము.

(౨౧) రెండవ మంత్రము - పంచదశి

"కలదోచిన శరీరము యేలాగో అలాగే" (బృ. పూ. పు. 66) ఇందుకు సంస్కృతమున "స్వప్నే ప్రతీయ మానాని రూపాణి యదా తదా" సంస్కృతాంధ్రముల రెండింటి యందును పదునైదు పదునైదు అక్షరములున్నవి గాన పంచదశి యని పేరు. పంచదశి షోడశిని సమర్థించునదే గాని, దీనికి ప్రత్యేకముగ విలువలేదు. దీక్షితులవారే ఒకచోట "కలదోచిన శరీరము యేలాగో అలాగే మూలములేని యీ గురుతెరిగే శరీర మేమిలేదు. ఇది సర్వాబద్ధము" (బృ. పూ. పు. 66) అని రెండింటిని కలిపి చెప్పిరి. రెండు మంత్రములు ప్రత్యేకముగు అర్థమును సాధించునవని యన్నచో షోడషాక్షరీ పిండమును గుఱించి చెప్పినదనియు, పంచదశి బ్రహ్మాండమును గుఱించి చెప్పినదనియు భావించుట యుక్తము. ఈ మంత్రమువలన దీక్షితులవారు సాధించినది యేమనగా:—స్వప్నము, జాగరము రెండును స్వప్నమే. రెండవది నిద్ర. ఇది అవస్థకాదు. ఎఱుక లేకపోవుటయే. వా రిట్లనిరి:—

"అనగా కల కలయనగా తనమట్టుకే కలగాని, ఇతరులకు కలగాదుగదా? తానేతప్ప ఎవరులేరు. తనకే ఈ జగత్తు తోచుచున్నది. జాగ్రత యంతయు దట్టమైన కల. స్వప్నము సామాన్యమైన కల. రెండే దృష్టాంతములు. యేదేది యనగా కల వకటి, నిదుర వకటి. నిదుర సత్యము, కల అసత్యము. సర్వము కలవంటిదేగాని నిక్కముగాదు సర్వార్థములు మన స్వంభవములని భాగవతమునందును గలదు. ఇది నిజము."

(బృ. పూ. పు. 167)

పంచదశి మంత్రముయొక్క తాత్పర్యమే పై వాక్యములు. దీక్షితులవారు ద్వివిధ సత్తల నంగీకరించు మతమునకు చెందినవారు. కొందఱు పెద్దలు ద్వివిధ సత్తలను మాత్రమే అంగీకరించి వ్యావహారిక సత్తను త్రోసివేసిన విషయము ఇదివఱకే చెప్పియుంటిని. ఈ మతము ననుసరించువారు కొద్దిమంది మాత్రమే. ఇది మన అనుభవమునకు సరిపడదు. అదిగాక శ్రుతి యీ సిద్ధాంతమును అంగీకరింపలేదు.

ఈ విషయమై బృహదారణ్యక శ్రుతి (4-3-14) యందలి జనక యాజ్ఞవల్క్య సంవాదమునందు స్పష్టపరుపబడినది. అందు యాజ్ఞవల్క్యమహర్షి జనకరాజునకు "జాగ్రదవస్థయందు పురుషుడు దేనిని చూచుచున్నాడో దానిని స్వప్నమునందు చూచును. కావున స్వప్నజాగరములు ఒకటియే యందురు. కాని, అట్లుకాదు. ఏలయన? స్వప్నమునందు పురుషుడు స్వయంజ్యోతి" అని బోధించెను.

అదిగాక, జాగ్రతయందు పురుషుడు చేయు కర్మలు అతనిని బంధించుచున్నవి. అనగా: అచట చేయు పుణ్యపాప కర్మలయొక్క ఫల మనుభవించుచున్నాడు. స్వప్నమునందు పురుషుడు చేయు కర్మలు వానిని బంధింపవు. అనగా: స్వప్నమునందలి కర్మలకు ఫలానుభవము లేదు. దీక్షితుల వారు స్వప్నజాగరములు సమములని చెప్పు సిద్ధాంతమును వృథపరుచుకొనుటకై స్వప్నమున పురుషుడు చేసిన కర్మలకు ఫలము లేనట్లే జాగ్రత్తయందును పుణ్య పాప కర్మలకు

ఫలము అనుభవించుట లేదనిరి. ఇది చాల ప్రమాదమైన సిద్ధాంతము.

బృహదారణ్యక శ్రుతియందు "తృతీయ గ్ం స్వప్న స్థానం తస్మి న్సంధ్యే" స్వప్నము ఇహాపరలోకములకు సంధి స్థానమని వర్ణించినది. (6-3-9) అనగా: జాగరణ సుషుప్త్యవస్థల మధ్య కలదని, ఆ పురుషుడు (తైజసుడు) సంధియందుండి ఒక్కొక్కసారి రెంటిని (నిద్ర మెలకువలను) చూచునని చెప్పినది. స్వప్నమునందు పురుషుండు 'హిత' అను నాడి యందుండునట. (6-3-20) చేప యెట్లు నది యొక్క రెండు దరులమధ్య ఇటు నటు సంచరించునో అట్లే పురుషుడు జాగ్రత్త - సుషుప్త్యవస్థల మధ్య స్వేచ్ఛగా సంచరించును. (6-3-18)

మఱియు సుషుప్తిని గుఱించి బృహదారణ్యక శ్రుతి యందు గార్గ్య బాలాకికిని, కాశిరాజగు అజాతశత్రువునకును జరిగిన సంవాదమునందు కలదు. (4-1-16, 17, 18, 19) మఱియు 4-1-9 నుండి 32 వఱకును చెప్పబడినది.

శ్రుతి యాజ్ఞవల్క్యమహర్షి (బృహదారణ్యక శ్రుతి. 6-3-14 మంత్రమున) ద్వివిధ సత్తల వాదమునూ అనువదించి అది సరికాదని ఆ సిద్ధాంతమును త్రోసి వేసియున్నారు. మన అనుభవమునందు జాగ్రతయందు పురుషుడు (విశ్వుడు) యితర సహాయము నపేక్షించి ప్రవర్తించుచున్నాడు. అనగా: వెలుతురు లేనిదే అతని నేత్రము పనిచేయుట లేదు. అట్లె తక్కిన యింద్రియ వ్యాపారములు కూడ సాధనాపేక్షితములని యూహించుకొనవలయును.

సుషుప్తిని గుఱించి విచారింతము. గాఢనిద్రయందు మాయా (అవిద్యా) కల్పితమగు నానాత్వము నశించి అవిద్య మాత్రమే మిగిలియున్నది. బృహదారణ్యకశ్రుతి 6-3-21 మంత్రమునుండి 32 వ మంత్రము వఱకు సుషుప్తిని గుఱించి చెప్పినది. దీక్షితులవారి మతమున యెఱుక ఉండుట యెఱుక లేకుండుట అను యీ రెండింటియందు ఎఱుక లేకుండుట అనుదానినే లోకులు నిద్ర, మరణము, మూర్ఛ అనిరని చెప్పియున్నారు. ఈ యంశము యిదివఱకే (౧౮ వ అధ్యాయమున) పెక్కురీతుల చర్చించితిని. కనుక యిచ్చట విస్తరించి చెప్పవలసిన ఆవశ్యకత యుండదు. 'నిద్ర' అనగా:— యెఱుక లేకపోవుట అని దీక్షితులవారు అనేక పర్యాయములు వారి గ్రంథమునందు చెప్పియున్నారు. కాని ఒక్క పర్యాయము మాత్రమే "గు" సుషుప్తియందు యెరుక లయమైతే పిలిచితే పలుకుచున్నాడు గనుక ఎరుక కలదనే తెలియవలయును."

(బృ. పూ. ప్ర. 141)

ఈ వాక్యములను ప్రమాణముగా గైకొనినవారి సిద్ధాంతమంతయు గందరగోళమై పోవును. ఏలయన? ఎఱుక నిత్యమైనదగును. వారి మతమున యెఱుక అసత్యము. మాయ. కల అసత్యము. 'నిదుర సత్యము' అన్నారుగదా? మఱియు, "నిదురలో యెరుక ప్రకాశించదు. అందువలన ఎరుకకు హాని గలదు. ఏవిధముగ జూచినను ఎరుకకు హానిగానే యున్నది. ఇటువంటి యెరుకను నిత్యమనరాదు." (బృ. పూ. పు. 161) అనేక పర్యాయములు చెప్పినదానికి విరుద్ధముగ ఒకపర్యాయము చెప్పుట దీక్షితులవారికి పరిపాటి. ఇట్టి

సందర్భములయందు యేది వారి మతమని తలంపవలెను? దీక్షితులవారు ఒక్క పర్యాయము చెప్పినది పొరపాటున చెప్పియుందురా? ఒక నిశ్చయజ్ఞానము లేక చెప్పియుందురా? అను సంశయము వారి గ్రంథము చదివినవారికి తప్పక కలుగును. వారి వాక్యములు అటుంచి శ్రుతి యీ యంశమును (నిద్ర) గురించి యేమి చెప్పినదో విచారింతము:—

"యద్వై తన్న పశ్యతి పశ్యన్వై తన్న పశ్యతి, నహి ద్రష్టుర్దృష్టే ర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాత్, నతు తద్ద్వితీయ మస్తి తతోఽన్య ద్విభక్తం యత్పశ్యేత్." (బృహదారణ్యక. 6-3-23)

తా॥ ఆ స్థితియందు ఆ పురుషుడు చూచుట లేదనరాదు. చూచు సామర్థ్యముండియు అతడేమియు చూచుట లేదు. ఆతని (ద్రష్ట) యొక్క దృష్టికి (జ్ఞానమునకు) నష్టమెప్పుడును కలుగదు. ఏలయన అతడు అవినాశియగుటవలన. అతడు చూచుటకు అచట అన్యపదార్థము (దృశ్యము) లేకపోవుటవలననే అతడు చూడలేదు.

కనుక జాగరణ స్వప్న సుషుప్తు లను మూడవస్థలయందుండు సాక్షియగు పురుషుడు ఒక్కడే అతడు అజుడు, అవినాశి. అవస్థలు మారుచున్నను వాటికి సాక్షియై మార్పు లేకయున్నాడు. మహాభారత శాంతిపర్వమునందు భీష్ముడు ధర్మరాజునకు స్వప్నాద్యవస్థల తెలంగెటిగించుచు నిట్లనెను:—

తే॥ తెలివు మేల్కని యుండుట కలలు నిద్ర
యను నవస్థాత్రయంబును నవలఁ బెట్టఁ
జాలు విజ్ఞాన నిర్మల సత్యబోధ
రూప నిర్భరానంద స్వరూపుఁడనఘ. (శాంతి. 4-327)

తా॥ మేలుకొనియుండుట = జాగ్రదవస్థ; కలలు = స్వప్నావస్థ; నిద్ర = సుషుప్త్యవస్థ. ఈ మూడవస్థలను సచ్చిదానంద స్వరూపుడగు (ఆత్మ) పురుషుడు ఆవల పెట్టుచున్నాడు. అనగా: సమాధియందు యీ మూడవస్థలు లేవు. అదియే ఆవల పెట్టుట. సమాధినుండి లేచిన పిమ్మట మూడవస్థలు అతని యెదుట వచ్చుచు, పోవుచున్నను తాను సాక్షియై వాటికంటెను భిన్నుడై యున్నాడు.

దీక్షితులవారు 'నిదుర సత్యమని, కల అసత్య' మని చెప్పియున్న యంశమును ఇంకను కొంత చర్చింతము. వారిమతమున జాగరణ స్వప్నములు కలసి రెండును కల. కల అసత్యమనిన అది లేకపోవుట అనునదే సత్యము. ఈ సత్యాసత్యములు కానిది బట్టబయలు. ఇది వారిమతము.

నిదుర సత్యమను విషయము బృహదారణ్యకశ్రుతి 6-3-32 మంత్రమునందు చెప్పినదాని సారాంశమిది:— స్వచ్ఛమగు నీటియందు తన ఛాయను చూచినపుడు తానొక్కడే కనబడునట్లు సుషుప్తియందు తానే యున్నాడు. కనుక సుషుప్తియే బ్రహ్మలోకమని పురుషుని పరమగతి యని అతని అధికమగు సంపత్తు అని అన్నింటికంటె శ్రేష్ఠమగు లోకమని ఆనందమయమని యాజ్ఞవల్క్యమహర్షి జనక రాజునకు బోధించెను

దీని సారాంశమేమని:— బ్రహ్మలోకమునకు సత్యలోకమను నామాంతరము గలదు. కనుక నిద్ర సత్యమని చెప్పబడినది. ఇచ్చట నింకొక అంశము గమనింపవలెను. బ్రహ్మవిదులు తురీయమగు ఆత్మనే సత్యమని చెప్పియుండిరి,

ఇచ్చట సుషుప్త్యవస్థనే సత్యమనినప్పుడు, తురీయమగు ఆత్మ (బ్రహ్మము)ను 'సత్యస్య సత్యం' సత్యమునందలి సత్యమనియు పరమసత్యమనియు వచించిరి. తదితరమగు విచారమునందు ఆత్మ (బ్రహ్మము)ను సత్యమని, నిద్ర అసత్యమనియు చెప్పిరి.

పైన నుదాహరింపబడిన మహాభారతమునందలి పద్యమున మూడవస్థలను ఆవలపెట్టిన సత్యజ్ఞానానంద స్వరూపుడగు పురుషుని (ఆత్మను)ను గుఱించి చెప్పబడెను.

"మూలంలేని యీ గుర్తెరిగే శరీరం వున్నంతసేపు కలే. గురు మూలంగా కలలో వచ్చిన శరీరాలు యెరుకతోటి వుండగానే యేమీలేదు. అని తనకు తానే యేలాగు ధృడమో, ఆలాగే గురు మూలంగా, మూలంలేని యీ గుర్తెరిగే శరీరము యేమీలేదని తాత్పర్యమాయెనా, అదే మేలుకొనుట. ఇంతేకాని వొక్కటైనా అవస్థలేదు. స్వప్నావస్థ గురువు మేలుకొలిపితే అదే జాగ్రత. ఇంతేకాని నాలుగవస్థలు లేవు. ఈ శరీరము వొక్కటే. నాలుగు శరీరములు అనుట అబద్ధము." (బృ. ఉ. పు. 105)

"శిష్యా విను :— యీ సంసారము నీయొక్క సంకల్పము వలననే కలిగినది. ఈ సంసారమే బంధమోక్షములు అయింది. ఇదే యింద్రాదిదేవతలున్ను, త్రిమూర్తులున్ను, అష్టాంగయోగములున్ను, అష్టసిద్ధులున్ను, అష్టైశ్వర్యములున్ను, సంకల్పమువల్లనే కలిగినవి. ఈ సంకల్పమే మూలబీజం. ఇదే మూలమాయ. ఇదే గుర్తెరిగే శరీరం. దీనినుండే నానామతాలు నానాఅవుతారాలు అయినవి. ఇట్టి సంకల్పమునకు మొదలు

పుత్పత్తి లేకనే తనకు తానే కలిగి తనకు తానే వుండి తనకు తానే యేమీ లేకపోచుంది. ఈ సంకల్పమే యిచ్ఛ శృ॥ ఇచ్ఛామాత్ర ప్రభోస్సృష్టిః అని వున్నది. కనుక యీ యిచ్ఛకు మూలంలేదు. తల్లి తండ్రి భార్యా బిడ్డలు యీ సంకల్పము వల్లనే పుట్టిరి." (బృ. ఉ. పు. 46)

అద్వైతులు జగత్తు వ్యావహారికసత్యమని స్వప్నము ప్రాతిభాసిక సత్యమని, బ్రహ్మము పారమార్థిక సత్యమని అందురు. కాని జాగ్రత్తయు బ్రహ్మజ్ఞానము సిద్ధించిన వారికి స్వప్నతుల్యమే. స్వప్నతుల్యమే గాని స్వప్నము గాదు.*

దీని భావమేమనగా:— జాగ్రదవస్థయందు జ్ఞానాభ్యాసము చేసి ముక్తిని బొందవచ్చును. స్వప్న మట్టిది కాదు. వాత పిత్త శ్లేష్మముల దోషముల చేతను, సత్త్వాది గుణవికారములను జాగ్రదవస్థయం దనుభవించిన విషయ వాసనా విశేషముల వలనను పూర్వజన్మవాసనల వలనను స్వప్నము కలుగును. అందువలన స్వప్నజాగరములు రెండును ఒకటి కానేరవు. స్వప్నజాగారములు రెండును ఒకటియే యను సిద్ధాంతమును యోగవాసిష్ఠము ఒకవిధముగా అంగీకరించినది. అం దిట్లున్నది:—

శ్లో॥ యథా దృశ్యం జగచ్చేతి నిత్య మేకార్థతాంగతా
ఉభౌశబ్దౌ తథే మైత జాగ్రత్స్వప్నాత్మకౌ స్మృతౌ.

---

* "శ్రీ శంకరాచార్యులవారు జీవితము నిజముగా నొక స్వప్నమనికాని మనజ్ఞానమొక స్వప్నదృశ్యమనికాని యూత డెచ్చటను చెప్పియుండలేదు." (భా. త. 5-వ సంపుటము. పుట. 134) అని డా॥ సర్వేపల్లి రాధాకృష్ణపండితులు చెప్పిరి.

తా॥ దృశ్యము, జగత్తు, అను శబ్దద్వయము వేఱు వేఱుగా వినబడుచున్నను వాటి యర్థమొక్కటే యైనట్లుగా జాగ్రత్స్వప్నము లను శబ్దములు రెండును ఒకే అర్థమును కలవియై యున్నవి, అని చెప్పిరి. ఆ గ్రంథమునందే వేఱొక చోట యిట్లు చెప్పబడినది :—

ప్రతిజీవునియొక్క జాగ్రత్ప్రపంచము ఒకేవిధముగ ఉన్నది. ప్రతి జీవునియొక్క స్వప్నప్రపంచ మట్లు లేదు. ఒక్కొక్కరి స్వప్నప్రపంచము ఒక్కొక్కవిధముగా ఉన్నది. కనుక జాగ్రత్స్వప్నములు రెండును ఒకటి కావని సంశయింపవలదు. ప్రథమజీవుడగు హిరణ్యగర్భునియొక్క స్వప్నమే మన జాగ్రదవస్థ అని వారి ప్రశ్నకు వారే ఆ విధముగా సమాధానము చెప్పుకొని తృప్తిపడిరి. హిరణ్యగర్భుని స్వప్నము మన జాగ్రద్దశ అనినపుడు మన జాగ్రత్త మన స్వప్నము కాదని అర్థమగుచున్నది. ఇది చాల సూక్ష్మమగు విషయము. దీనిని తేలికగా అర్థము చేసికొనరాదు. ఈయంశమును యోగవాసిష్ఠము యేభావముతో చెప్పినదో దీక్షితులవారు అట్టిభావముతో చెప్పియుండలేదని వారి వాక్యములవలన తెలియగలదు. ఇదివఱలో ఆ వాక్యముల నుదాహరించియుంటిని (అ. ౧౮ లో చూడుడు). కొన్ని వాక్యముల నిచట స్మృతికి తెచ్చెదను. "స్వప్నములో వచ్చిన శరీరము పుణ్యపాపములు చేసిందా లేదా అని వ్రాసుకొన్నవారు యెవరు?" (బృ. ఉ. పు. 68) ఇట్టి వాక్యములు అనర్థదాయకములు. హేయమైనవి. ఈ వాక్యములను గర్హింతును.

జిజ్ఞాసువు :- అయ్యా! నా సంకల్పము వలననే ప్రపంచము కలిగినదని దీక్షితులవారనిరిగదా! ఈ యంశము నాకు బోధపడలేదో, లేక వారు చెప్పినది సరికాదో, నాకు తెలియకున్నది? నావలన నా తల్లితండ్రులు ఎట్లు కలుగుదురు? నా సంకల్పము వలన వారు కలిగిన వారికి నేను తల్లిని తండ్రిని కావలెనుకదా? పోనీ, నా సంకల్పము వలననే కలిగిరని తలంచినను వారిప్పుడు లేరు. వారు స్వర్గస్థులైరి. వారు మరణించవలెనని నే నెప్పుడును సంకల్పించలేదే, మఱి వారెట్లు మరణించిరి? నా చిన్నతనమున నేను ఎన్నియో మారులు రాజు కావలెనని కోరుచుంటిని. నా సంకల్పము వలన నే నొక్కసారియైనను రాజును కాలేదే? నాకు, నావారికి రోగములు రావలెనని యెప్పుడును నేను సంకల్పించలేదే, మాకు రోగములు వచ్చుటకు కారణమేమి? నేనుతప్ప అన్యులెవ్వరును లేరనియేగదా దీక్షితులవారు చెప్పిరి. నేను సంకల్పింపక రోగములు వచ్చుటకు అవకాశమే (కారణమే) లేదే. ఇటీవల ఒక సంఘటన జరిగినట్లు పత్రికలయందు చదివితిని. ఒక కుటుంబమువారు మేడపై కిటికీవద్ద కూర్చుండి 'టీ' త్రాగుచుండిరట. వీథిలో జన సమూహమును చెదరగొట్టుటకు పోలీసువారు తుపాకులు కాల్చగా, తుపాకి గుండ్లు టీ త్రాగువారికి తగిలి వారు మరణించిరట. వారు తా మట్లు మరణింపవలయునని సంకల్పించుకొనలేదుగదా? ఇదియాతయు నా సంకల్పమే యందురేని త్రోవను పోవునపుడు పరధ్యానమున నడువగా కాలిలో ముల్లువిఱిగినది. అది నా సంకల్పము లేకయే అట్లు జరిగెను. దుఃఖము కలుగునట్లెవ్వరును సంకల్పింపరు. కాని

దుఃఖము కలుగుచున్నది. దీనికి దీక్షితులవారి సమాధాన మెట్లు చెప్పిరి ?

వేదాంతి :- దీక్షితులవారి మతమునందలి గొప్ప దోషమిదియే. ఇదివఱలో నేను నీకు బౌద్ధమతమును గూర్చి చెప్పియుంటిని. అందు విజ్ఞానవాదులు (యోగాచారుల) మతమును బ్రహ్మసూత్రభాష్యమున శ్రీశంకరులవారు ఖండించిరి. ఆ ఖండనమును నా వాక్యముతో 'విజ్ఞానవాది - అద్వైతవాది' యిరువుర సంవాదరూపమున చెప్పియుంటిని.* దాని నిచ్చట స్మరింపుము. అదియే నీ ప్రశ్నకు ప్రత్యుత్తరము.

అదిగాక యోగవాసిష్ఠమువంటి కొన్ని వేదాంత గ్రంథములయందు ఏకజీవవాదము కలదు. అదియును అద్వైతమే. వారి మతమున జీవుడొక్కడే. ఆ జీవుడే జగత్తు ఉన్నట్లు బ్రహ్మాది దేవతలున్నట్లు భావించుకొనును. అతడొక్కడే నిజమైన జీవుడు. లోకములోని వారందఱు ప్రాతిభాసిక జీవులు. ప్రాతిభాసిక జీవులనగా అతని స్వప్న లోకమున కల్పించుకొన్న మనుష్యులు మొదలగు జీవుల వంటివారు. ఆ జీవుడు హిరణ్యగర్భుడనియు అతని స్వప్నము లేక మానసిక కల్పనయే మన జాగ్రదవస్థయందలి వ్యావహారిక ప్రపంచమనియు, అతని స్వప్నప్రపంచమునందు మన మందఱము ప్రాతిభాసికజీవులనియు, చెప్పుదురు. ప్రతి వాడును నా సంకల్పమువలననే సృష్టిస్థితిలయములు కలుగు

---

* బ్రహ్మజిజ్ఞాస తృ. భా. నాలుగవ ప్ర. ౨౪ వ అధ్యాయము "అద్వైతి - విజ్ఞానవాదుల సంవాదము."

చున్నవని తలంచిన అది బుద్ధిహీనతయే. అదియే వాస్తవమైనయెడల ప్రపంచము వెంటనే లయము కావలయునని కోరుకొనును. మఱియొకడు ప్రపంచ మెల్లప్పుడు నిట్లే యుండవలయునని కోరును. ఈ రెండింటిలో నేది జరుగును? యేది జరుగదు? ఇట్లున్నచో ప్రపంచము ఎట్లుండునో యెవ్వడును ఊహింపజాలడు.

జిజ్ఞాసువు :- 'ప్రతివాడును' అని మీ రనుచున్నారు. ఉన్నది నే నొక్కడనేగదా?

వేదాంతి :- అట్లే అనుకొందము. ఉన్నది నీ వొక్కడవే అయినను నీవు అనుకొనునట్లు జరుగుట లేదని నీకు తెలిసినదే కదా? దీక్షితులవారు చెప్పిన సిద్ధాంతము కొన్ని నవీన వేదాంత గ్రంథములయం దున్నదే కదా? దానికి సమాధాన మేమి? అని అడుగవచ్చును. దాని సమాధాన మిది :— ఎవని చిత్తము వాసనారహితమును శుద్ధమునై యుండునో అట్టివాని సంకల్పము నెఱవేఱును. నీవు అలమైనట్లు అమలిన చిత్త మేరీతిగ భావించునో ఆరీతిగా అగును. కాని మలిన చిత్తులగువారు తలంచిన అట్లు కాదు. నే నొక్కడనే జీవుడను. తక్కిన వారందఱు ప్రాతిభాసకులేగదా? అనగా — నాచేత కల్పింపబడినవారేగదా? అనిన; ప్రతివాడును తనకంటె అన్యులందఱును ప్రాతిభాసికులనియే తలంచుచున్నాడు. నీ చిత్తము మలినరహితముగ చేసికొని చూచినచో సర్వము నీవే. నీకంటె అన్యము లేదు. నీ చిత్తము శుద్ధముకానంతవఱకు నీవును అనేకులును ఉన్నారు. మలినరహితమగు శుద్ధ మానసము హిరణ్యగర్భుని మాన

సము వంటిది. అత డేమితలచిన అది జరుగునని మనము శాస్త్రములయందు చదివియున్నాము. అమలిన చిత్త మెట్లు భావించిన అట్లే జరుగునని యోగవాసిష్ఠము చెప్పినది.

ఈ విషయ మింతటితో విరమించి దీక్షితులవారు చెప్పిన మూడవ మంత్రమును గుఱించి విచారింతము.

(౨౨) మూడవ మంత్రము - ద్వాదశాక్షరి

దీక్షితులవారు ద్వాదశాక్షరీ మంత్రము నిట్లు చెప్పిరి :—

*(1) "ఈ ఉత్త బట్టబయలు యేమీలేదు."

దీనికి సంస్కృతము —

"అయం వ్యర్థో బాహ్యః కోపినభవతి." మఱియొక చోట దీక్షితులవారే యి ట్లన్నారు. "ద్వాదశాక్షరీ అభావం శివం అశివం నలిప్యతే' ఇదే గురువాక్యం. ఈ గురువాక్యం సార్వకాలం స్మరిస్తూ యుండవలయును" అని వ్రాసియున్నారు. (బృ. పూ. పు. 121)

రెండింటిలోను పండ్రెండు పండ్రెండు అక్షరము లున్నందున వీటికి ద్వాదశాక్షరి యని పేరిడిరి. ఇది బట్ట బయలును గుఱించి తెలుపును. బట్టబయలనగా నేమో దీక్షితులవారు వారి గ్రంథమున అచ్చటచ్చట వ్రాసిన వాక్యములను ఒకచోట చేర్చి చెప్పెదను.

---

* (1) ఈ సంఖ్యలు దీక్షితులవారు వేసినవికావు. బోధనాసౌలభ్యముకొఱకు 1 నుండి 12 వఱకు నేనే వేసితిని.

(2) "ఈ బయలు పుట్టదు. పుట్టించదు. రక్షించదు. చంపదు. దీనిని యెవ్వరు యెరుగరు. అందరు యెరుగుదురు. ఎఱిగిన యెరుగరు. ఎఱుగకున్నను యెరుగరు. చెప్పిన యెరుగరు. చెప్పకున్నను యెరుగరు. ఎవ్వరికి యీ జోలి పట్టదు. ఇది యెవ్వరు విన్నను యేమో నందురు, గాని నిజమని అనరు."

(బృ. పూ. పు. 46)

(3) "ఏమి ఉన్నది? 'అతి రహస్యం బట్టబయలు' అందురు గాని ఆ బట్టబయ లెటువంటిదో యెరుగరు."

(బృ. పూ. పు. 46)

(4) .... "అచలానకు యే జోలి లేదు, మధ్యను వచ్చి మధ్యను పోయేది యీ గుర్తెరిగే శరీరమే అచలానకు చంచలమైన శరీరానకు కొంచమైనా సంబంధం లేదు. సమస్తమైన మహత్తుల యీ గుర్తెరిగే శరీరానివే గాని పుట్టని చావని అచలానకు వొక్కటైనా మహత్తు లేదు. అచలం గనుక రాకడా లేదు పోకడా లేదు. సార్వకాలం ఒక్కతీరే. యీ గుర్తెరిగే శరీరంతో యీ షత్తు సంబంధం లేదు. దాని కదే! దీని కిదే! సంబంధం లేనిదే సంబంధం వున్నదని మూలంలేని గుర్తెరిగే శరీరమే అన్నది." (బృ. పూ. పు. 53, 54)

(5) "ఎరుక మరుపులు కానిది, సదసత్తులు కానిది, రూపారూపములు గానిది, జ్ఞానా జ్ఞానములు గానిది, గుణా గుణములు లేనిది, కోరికలు లేనిది, చలా చలము గానిది, సంకల్ప వికల్పములు లేనిది, సాక్షి గానిది, బ్రహ్మ గానిది, విష్ణువు గానిది, శివుడు గానిది, ప్రకృతి గానిది, ఆకాశము గానిది." ....

(బృ. పూ. పు. 72)

"అచలమనే పరిపూర్ణానకు యెరుకలేదు. మరుపులేదు." (బృ. ఉ. పు. 37) "సార్వకాలం జీవజగద్భావంలేంది ఏదో, వాసనాత్రయంలేంది యేదో, శ్రవణ మనన నిదిధ్యాసలు యెఱుగంది యేదో, జాగ్ర స్వప్న సుషుప్తి తుర్యావస్థలు వున్నదని యెరుగంది యేదో, సగుణ నిర్గుణాలుగాంది ఏదో, నేనుగాంది ఏదో, నేను నీవు అనే జ్ఞానరహితమైంది ఏదో .... అది తానని యెరుక లేని స్వరూపం." (బృ. పూ. పు. 101)

(6) "ఈ ఉత్త బట్టబయలు తనకు తానే స్వతఃసిద్ధమై చలించకయున్నది. ప్రపంచం పుట్టనే లేదు. యిది నిజగురుపదేశం. ఈ వుత్త బట్టబయలే పరిపూర్ణం. యీ వుత్త బట్టబయలు నిజగురువు చెప్పక కానరాదు."

"శృతి ఆచార్యవాక్ స్వరూపాక్ వేదః"

"అని వున్నది కనుక శృతి॥ 'ఖం బ్రహ్మ' అని శిద్ధాంత వాక్యం వుండనే వున్నది. వున్నా భ్రాంతి వాక్యం మొదటిది కాదు. మొదలు యేది వున్నదో అదే చెప్పినాడు." (బృ. ఉ. పు. 1) పుట్టని ప్రపంచముయొక్క జోలే కూడదు. యీ వుత్త బట్టబయలు వలన మాయ పుట్టనే లేదు. గనుక యీ వుత్త బట్టబయలు మాత్రమే వున్నది. యీ వుత్త బట్టబయలు అత్యంత విలక్షణము. యీ వుత్త బట్టబయలు వలన క్షరమనే చైతన్య స్వరూపిణి అనే మాయ పుట్టనేలేదు. గనుక యేమీలేదు. యీ వుత్త బట్టబయలుకు పరా ఏమీ లేదు. లేకుంటే శరీరం అనే క్షరం యేమీ లేదు. యీ వుత్త బట్టబయలే వున్నది. యీ వుత్త బట్టబయలు పుట్టదు. పుట్టించదు. అందుకే ప్రపంచం పుట్టనే లేదు. చావదు. యీ వుత్త బట్టబయలు మాట్లాడదు.

యీ వుత్త బట్టబయలునకు వొక్కటైనా భ్రాంతి లేదు. బాధ లేదు. జన్మం లేదు." (బృ. ఉ. పు. 2)

(7) "ఈ ఉత్త బట్టబయలుకు జ్ఞానం లేదు. యీ వుత్త బట్టబయలుకు అహంకారం యెన్నడూ యేమీ లేదు. కనుక లేని మాయ యీ యెరుకలేని చైతన్య స్వరూపిని. లేని మాయను లేదని కన్నవారికి యేమీ లేదు. యీ వుత్త బట్టబయలు చెడి యెన్నడూ శరీరాకారం కాలేదు. వెనుకటికి కాలేదు. యిప్పటికి కాలేదు. ముందరా కాబోదు. సార్వకాలం రెండో ప్రకారం గాక వొక్కతీరుగానే యున్నది. ప్రపంచానకు ఈ వుత్త బట్టబయలు కారణం కాదు. తానే పుట్టని చావనిది. ప్రపంచాన్ని యెలాగు పుట్టించె, ప్రపంచంయొక్క జోలే లేదు."

(బృ. పూ. పు. 120, 121)

(8) .... "యేమి అడిగినా చెప్పనిది. తాను వున్నానని యెరుగనిది శరీరాలు లేవు అని యెరుగంది .... గురు సూచన లేని వారికి కనుక్కోరానిది." (బృ. ఉ. పు. 6)

(9) .... శివ శక్త్యోపాధి ద్వయ దోష రహితమైంది. క్షేత్ర క్షేత్రజ్ఞోపాధి ద్వయ దోషరహిత మైంది, తిననిది. లిప్తము గానిది. ఆత్మ బ్రహ్మం అనే గుర్తెరిగే చైతన్యానిని యెరుగనిది. ఈ శరీరమందే శరీరం లేక వున్నది."

(బృ. ఉ. పు. 7)

(10) "ఈ పరిపూర్ణమునకు కోపములు తాపములు లేవు. ఈ భూమకు యేమీ లేదని చెప్పుచునే యున్నాము."

(బృ. పూ. పు. 78)

(11) "అదే తత్వాతీతం. జగత్తు తత్వ స్వరూపమే. తత్వాతీతం మహాగుహ్యం. అందుకే ద్వైతా ద్వైత రహితమైన పరమత తత్వం అనే సౌజ్ఞ. తత్వాతీతం ఇరవై ఆరోది."

(బృ. ఉ. పు. 101)

(12) "మహాకారణాతీతమే తుర్యాతీతం. యీ తుర్యాతీతం బోధించే ఆచార్యుడు దొరికితే నిజం. అద్వైతం మిథ్యాజ్ఞాన స్వరూపం." (బృ. ఉ. పు. 36)

పరబ్రహ్మమును తెలిసికొనుటకు నిషేధ పద్ధతి ఒక్కటే మార్గమని కొందఱును, విధివాక్యములచేతను బోధింపవచ్చునని కొందఱును పూర్వాచార్యులు చెప్పిరి. నిషేధ పద్ధతి అనగా: నేతి, నేతి (న + ఇతి, న + ఇతి) ఇది కాదు, ఇది కాదు, అని అనాత్మ పదార్థముల నన్నింటిని నిషేధించి, నిషేధించుటకు సాధ్యపడని వస్తువే బ్రహ్మమని (ఆత్మయని) నిశ్చయించుట. అనగా:— ఆత్మ దేహము కాదు. ఇంద్రియములు కాదు. మనస్సు కాదు. బుద్ధి కాదు. అహంకారము కాదు. అవ్యక్త ప్రకృతి కాదు. అని యీ విధముగా వాటివాటి స్వరూప స్వభావాదులను చక్కగా విచారించి యిందులో ఒక్కటియైనను నిత్యసత్యమైన వస్తువు కాదని యీ సమస్తమును జడములేనని నిషేధించి ఏజ్ఞానముచే యీ సమస్తము నిషేధింపబడెనో ఆ ప్రజ్ఞానమే ఆత్మయని, అదియే బ్రహ్మమని నిశ్చయించుట. ఇది నిషేధ పద్ధతి. విధి అనగా:— ఆ పరమసత్య మిట్టిదే అని నిరూపించి చెప్పుట — 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ' సత్యమే బ్రహ్మము, జ్ఞానమే బ్రహ్మము, అనంతం (ఆనందము)

బ్రహ్మము, అని నిరూపించి చెప్పుట. ఈ రెండు పద్ధతులను దీక్షితులవారు అచలమును (బట్టబయలును) బోధించుటకు అవలంబించిరి. ఉదాహరణమునకు — నిషేధ పద్ధతి యేదన? 5-వ అంశమునందు చెప్పినరీతిగ 'ఎరుక మరుపులు కానిది. సదసత్తులు కానిది' అని యీవిధముగ చెప్పినట్టిది. దీక్షితులవారి వాక్యములయందు విధివాక్యము లేవనగా 10, 12 లో 'అది భూమ' 'తుర్యాతీతము' అనునట్టివి. అనగా: బట్టబయలు భూమ, తుర్యాతీతము అని చెప్పిరి. కనుక ఉపనిషత్తులయందు, భూమ అని దేనిని చెప్పిరో దానిని తెలిసికొన్న బట్టబయలును తెలిసికొన్నట్లగును గదా?

ఉపనిషత్తులయందు ప్రతిపాదింపబడిన నిర్గుణ బ్రహ్మము మనోవాక్కుల కందనిదని చెప్పిరి.

పరమసత్యమైన వస్తువు మనోవాక్కుల కందనిచో దానిని ఎట్లు తెలిసికొనగలిగిరి? దానిని ఇంతవఱకు ఎవ్వరును తెలిసికొని యుండలేదా? ఉపనిషత్తులే, 'బ్రహ్మము తెలిసికొనుటకు సాధ్యము కానిదని' చెప్పుచు బ్రహ్మ మిట్టిదని అనేక విధముల బోధించెను. పెద్ద లనేకులు తెలిసికొనిరి. తెలిసికొనిరనగా నెట్లు?

(౨౩) ఉపనిషత్తులు - బ్రహ్మము

మానవునకు గల యింద్రియములు అంతఃకరణము పరిచ్ఛిన్నములైనవి. జ్ఞానేంద్రియములు పంచభూతముల యందు ఆ యా భూతముయొక్క సత్త్వగుణమునందలి ప్రత్యేక అర్ధభాగములనుండి కలిగినవి. ఏ భూతముయొక్క

సాత్త్వికాంశమునుండి యే యింద్రియము కలిగినదో ఆ యింద్రియము ఆ భూతగుణమును మాత్రమే తెలిసికొనగలదు, అది మఱియొక భూతగుణమును యెఱుగజాలదు. మనస్సందమా, అది పంచభూతములయందుండు సత్త్వగుణముయొక్క సమష్టి అర్ధభాగమువలన యేర్పడినది. కనుక అది భూతపంచకసంబంధమగు గుణములను మాత్రమే యెఱుగగలదు. ఇంద్రియములకు మనస్సునకుగల భేద మిదియే. అయితే, బ్రహ్మ మె ట్లెఱుగబడును? అతీంద్రియజ్ఞానము వలననే యెఱుగబడును. ప్రకృతికంటె పరమునందున్న సత్యవస్తువును ప్రకృతిగాని దాని వికారములుగాని యెఱుగజాలవు. ప్రకృతి ఆవరణమును భేదించినవారే యెఱుగగలిగిరి, ఒకఋషి యిట్లు చెప్పెను.

"యది మన్యసే సు వేదేతి దభ్ర మేవాపి నూనం త్వం వేత్థ బ్రహ్మణో రూపమ్, యదస్య త్వం యదస్య చ దేవేష్వథ ను మీమాంస్య మేవ తే మన్యే విదితమ్." (కేన. 9)

తా॥ ఎవడు నేను బ్రహ్మమును చక్కగా తెలిసికొంటినని చెప్పునో అతడు బ్రహ్మముయొక్క అల్పాంశమును మాత్రమే యెఱుగును. బ్రహ్మస్వరూపజ్ఞానవిషయమున దేవతలైనను మాకు తెలియు నన్నచో వారికి ఇంకను తెలియవలసియే యున్నది. అని అర్థము.

ఋషు లనేకులు, వారందఱు ఏకదేశమునకు చెందినవారుగాని, ఏకకాలమునకు చెందినవారుగాని, కారు. భిన్నదేశములకు భిన్నకాలములకు చెందినవారు. ఐనను, వారు ఒక్కలక్ష్యమునే సాధింప ప్రయత్నించిరి. పరమసత్యమైన వస్తు వేదైనకలదా? దానిని తెలిసికొనవలయుననియే వారి

కృషి. వారి కృషి ఫలించినది. వారు కనుగొన్న పరమ సత్యమునకు వారికి తోచిన పేరు పెట్టిరి. ఒక ఋషి ఆ వస్తువును 'ఆత్మ - బ్రహ్మము' అనియు (బృహదా. 4-4-17, 18) ఇంకొకరు 'ఆత్మ' (మాండూక్య. 7) అనియు, మఱియొకరు 'అక్షరము' 'పురుషుడు' (ముండక. 1-2-13) అనియు, వేఱొకరు 'విజ్ఞానాత్మ' (ప్రశ్న. 9) అనియును; సత్తు అని కొందఱు (ఛాందో. 6-2-1) ఒకరు అది అసత్తు (తైత్తిరీయ. 2-7) అనియును చెప్పిరి. దానినే 'భూమ' అని సనత్సుజాతమహర్షి చెప్పిరి. ఇట్లు వారి వారికి తోచిన పేర్లతో పిలిచిరి. ఋషి ప్రయోగించిన నామము యే భావముతో ప్రయోగించెనో అచటి పూర్వాపర సందర్భముల బట్టి దాని యర్థమిది యని చెప్పవలెనే గాని కేవల శబ్దమాత్రము చేతనే అర్థమును నిర్ణయించరాదు. వస్తువును ఆ ఋషి 'సత్తు'అనియెను కనుక అది సత్తుగాదు. అది 'అసత్తు' అని చెప్పుట పొరపాటు. అట్టివారికి వేదాంతము (ఉపనిషత్తుల యందలి జ్ఞానము) తెలియదని చెప్పవలసి వచ్చును. దీక్షితులవారు, వారు చెప్పినట్టి బట్టబయలు బ్రహ్మము కాదనిరి. ఆత్మ కాదనిరి. సదసత్తులు కాదనిరి. ఋషులు చెప్పినవన్నియును కావని త్రోసివేసిరి. కాని, 'భూమ' అని అంగీకరించిరి. ఇది సంతోషించవలసిన విషయము. 'భూమ' అనగా నేమి? దానిని గుఱించి విచారించుట యుక్తము.

(౨౪) భూమ

దీక్షితుల వారిట్లు చెప్పిరి. " ఈ వుత్త బట్టబయలునకు జన్మము లేదు. మరణం లేదు. భూమ అంటే గుర్తురుగ

నిది. విననిది. చూడనిది. భూమ అనే పేరు.

*శృతి యత్ర నాన్యత్ పశ్యతి నాన్య ఛృణోతి‡ నాన్యత్వ జానాతి స భూమ." (బృ. పూ. పు. 170)

ఈ 'భూమ' శబ్ద మెక్కడిది? ఇది ఛాందోగ్యోపనిషత్తునందలి 7-వ ప్రపాఠకమునం దున్నది. ఒకప్పుడు సనత్కుమారమహర్షి కడకు జ్ఞానార్థియై నారదమహర్షి పోయి 'ఆత్మవిద్య నెఱిగింపుము' అని ప్రార్థించెను. అది విని సనత్కుమారమహర్షి 'ఆత్మవిషయమై నీవేమి తెలిసికొని యుంటివో చెప్పుము. ఆ పై విషయమును ఎఱిగింతు' ననెను. అంత నారదమహర్షి తాను ఋగ్వేదాది సమస్త గ్రంథములు చదివితి ననియు, సకల విద్యల నెఱింగితిననియు చెప్పెను. అందులకు సనత్కుమారమహర్షి అవి యన్నియు శబ్దమాత్రములే యని చెప్పి నారదమహర్షికి — నామము, వాక్కు, మనస్సు, సంకల్పము, చిత్తము, ధ్యానము, విజ్ఞానము, బలము, అన్నము, జలము, తేజస్సు, ఆకాశము, స్మరణము, ఆశ, ప్రాణము, సత్యము, విజ్ఞానము, మతి, శ్రద్ధ, నిష్ఠ, కృతి, వీటిలో ఒక్కొక్కదానిని బ్రహ్మభావనతో ఉపాసింపుమని శాఖాచంద్రన్యాయమున బోధించి కడపట అన్నింటికంటెను గొప్పది సుఖమని తెలిపి ఆ భూమ (సుఖ) స్వరూపమును యీ క్రింది విధమున బోధించెను.

---

* 'శృతి' అనునది వారి గ్రంథమున వ్రాసియున్నట్లే నేనును వ్రాసితిని.

‡ 'నాన్య చ్ఛృణోతి' అని యుండవలయును. 'ఛృణోతి' అనుట పొరపాటు. ఇట్టివి ఎన్నియో పాఠకులే గ్రహింతురు.

మం॥ యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖ మస్తి భూమైవ సుఖం; భూమా త్వేవ విజిజ్ఞాసితవ్య ఇతి భూమానం భగవో విజిజ్ఞాస ఇతి. (ఛాం. 7-23-1)

తా॥ ఏది నిరతిశయమై అల్పము కానట్టిదైన సుఖము గలదో అది భూమ. అది అత్యంత వ్యాపకమై తెలిసికొనదగియున్నదని చెప్పగ నారదమహర్షి భగవంతుడా! ఆ భూమతత్త్వమును నా కుపదేశింపు మనెను. అంత నారదమహర్షికి సనత్కుమారమహర్షి యిట్లుపదేశించెను :—

మం॥ యత్ర నాన్య త్పశ్యతి నాన్య చ్ఛృణోతి నాన్య ద్విజానాతి స భూమాఽథ య త్రాన్య త్పశ్య త్యన్య చ్ఛృణో త్యన్య ద్విజానాతి తదల్పం యో వై భూమా తదమృత మథ యదల్పం తన్మర్త్యం స భగవః కస్మిన్ప్రతిష్ఠిత ఇతి స్వే మహిమ్ని యది వా న మహిమ్నీతి. (ఛాం. 7-24-1)

తా॥ ఏ స్థితియందు (ఏ తత్త్వమునందు) మఱియొక సాధనముచేత చూడదగినది మఱియొకటి లేదో, తెలిసికొనదగినదిగాని వినదగినదిగాని మఱియొకటి లేదో, అది భూమ. ఎచట (ఏ స్థితియందు) రెండవదానిని (మఱియొక సాధనముచే) చూడదగినది, వినదగినది, కలదో అది అల్పము, (భూమ కాదు.). భూమ మమృతము, నశింపనిది — మర్త్యము అల్పము నశించును. ఇట్లు సనత్కుమారమహర్షి భూమ స్వరూపమును వివరింపగ 'ఓ భగవంతుడా! ఆ భూమ దేనియందు ప్రతిష్ఠితమై యున్నది' అని నారదమహర్షి అడిగెను. 'భూమ తనయందే తాను ప్రతిష్ఠితమై యున్నది'

అని సనత్కుమారమహర్షి బోధించెను.

దీనియొక్క వివర మేమనగా : చూచునది, చూచువాడు, చూచునట్టి సాధనము (చూపు) అను యీ మూడును త్రిపుటి. ఈ త్రిపుటి యెచ్చట లేదో అదియే భూమ. తెలిసికొనదగినది, వినదగినది అనునవి దేనియందు కలదో అది భూమ కాదు. అది అల్పము. ఇంద్రియగోచర విషయము లన్నియు త్రిపుటీనిబద్ధములు. త్రిపుటి అనిత్యము. కనుక అది అల్పము. భూమ అనగా గొప్పది. (అల్పము కానిది.)

తరువాత 2-వ మంత్రమునందు గోవులు, అశ్వములు మొదలగునవి వాటి యజమానుని ఆశ్రయించుకొని యుండును. ఆ ప్రకారము భూమ దేనినీ ఆధారము చేసికొని యుండలేదు.

ఆ భూమ, క్రింద మీద వెనుక ముందు దక్షిణమున ఉత్తరమునను అంతట నున్నది. అదే అంతయునై యున్నది. ఆ భూమ నేనే, సర్వత్ర యున్నాను. ఇది అంతయు నేనే.

నేనే సర్వమునై యున్నాను. ఇచ్చట అహ మనిన భూమయే. (ఛాం. 7.25-1) ఈ భూమ బ్రహ్మమే. అదియే ఆత్మ అని యీ క్రిది మంత్రమున వివరింపబడినది.

మం॥ అథాత ఆత్మాదేశ ఏ వాఽఽత్మైవా ధస్తా దాత్మో పరిష్టా దాత్మా పశ్చా దాత్మా పురస్తా దాత్మ దక్షిణత ఆత్మో త్తరత ఆత్మై వేదగ్ం సర్వమితి సవా ఏష ఏవం పశ్యన్నేవం మన్వాన ఏవం విజాన న్నాత్మరతి రాత్మ క్రీడ ఆత్మ మిథున ఆత్మానందః ససర్వాడ్భవతి తస్య సర్వేషు లోకేషు కామ చారో భవతి అథ యేఽన్యథాఽతో విదు రన్యరాజాన

భూమకు యేమి లేదని చెప్పుచునే యున్నారు." (బృ. పూ. పు. 170) అని చెప్పిరిగదా! శ్రుతియందు "యత్ర నాన్య త్పశ్యతి నాన్య చ్ఛృణోతి నాన్య ద్విజానాతి స భూమా." ఎచ్చట చూచుటకు, వినుటకు, తెలిసికొనుటకు యేమియు లేదో అదియే భూమ యని చెప్పిన శ్రుతివాక్యముల అర్థమునకు దీక్షితులవారి వాక్యములు యెంత విరుద్ధములో చూడుడు. ఛాందోగ్యము 7-25-3 మంత్రమును దీక్షితుల వారు చదివియుండిన నిట్లు వ్రాసియుండరు. భూమను గుఱించి యెవరో తెలియనివారు చెప్పిన వాక్యములను బట్టి అట్లు వ్రాసిరి, కాని శ్రుతియందలి ఆ భాగమును వారు స్వయముగా చదువలేదనవచ్చును. సారాంశ మేమన :— తెలిసికొనునట్టిది, వినునట్టిది, చూచునట్టిది భూమయే.

పేరులేనిదానిని ఏమని పిలువవలయును. దానికి (బ్రహ్మమునకు) పేరు పెట్టినదెవ్వరు? దానికి తల్లిదండ్రులు ఉన్నారా? అది అజము - అట్లయిన బ్రహ్మము, ఆత్మ, భూమ, సత్తు, ఆనందము, చిత్తు మొదలగు నామములతో ఋషులేల పిలుతురు? బోధకొఱకు యేదో ఒక నామమున పిలువవలయునుగదా! 'నాయ మాత్మా ప్రవచనేనలభ్యో' (కఠ. 1-2-23) ఆత్మ వేదపాఠమువలన లభ్యపడునది కాదు. 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ ఆనంద బ్రహ్మణో విద్వాన్' (తైత్తిరీయ. 2-4) ఎచట మనస్సు గాని వాక్కుగాని ప్రవేశింపలేక వెనుకకు మరలుచున్నవో అదియే ఆత్మ, ఆనందము, బ్రహ్మము అని చెప్పిన శ్రుతులు అంతటితో మౌనము వహించి ఊరకుండక భూమాది నామముల బోధించుటకు కారణమేమి? లోకవ్యవహారము

నందున్న అనుభవమును పురస్కరించుకొని దానికి విరుద్ధ పద్ధతిని (నిషేధ పద్ధతిని) ఆత్మకు పేర్లు పెట్టిరి. ఉదాహరణమునకు — జగత్తు దుఃఖస్వరూపము. ఆత్మయందు దుఃఖము లేదు గనుక ఆత్మ సుఖ స్వరూపము, లేక ఆనంద రూపమనిరి. అంతే గాని దానికి ఆనందమను నామము సహితము కల్పితమే. ఇట్లే 'బ్రహ్మ' (బృహదారణ్యక. 5-1-2) అనగా — సుఖము (ఆనందము) బ్రహ్మమని అర్థము. పరిమిత (పరిచ్ఛిన్న) పదార్థము అల్పము. ఆత్మ అపరిచ్ఛిన్నము గనుక అల్పమునకు వ్యతిరేకమగును.

శాక్తమార్గీయుల ననుసరించి తురీయ, భూమ, చిచ్ఛక్తి, సాక్షి, ప్రజ్ఞానఘనము, చైతన్యరూప, బ్రహ్మ, ఆత్మ, గోవింద, విష్ణు, శబ్దములు శక్తి పరములు. ఇవన్నియు లలితా నామములు. ఏకార్థమును బోధించును. లలితా సహస్రనామముల యందు (667 సంఖ్య గలది) "భూమ రూపాయై నమోనమః" అని లలితయు, భూమయు, ఆత్మయే యని యున్నది. లలితా సహస్రనామముల యందు పైన చెప్పిన నామములన్నియు లలితాపరమున కలవు. ఏది ఆత్మయో అదియే భూమ యని ఛాందోగ్య శ్రుతి యందే కలదు. దానిని దీక్షితులవారు చూచియుండరు. దీక్షితులవారి మతము ననుసరించి మూలములేని గుర్తెరిగే శరీరము — లేదా ఎఱుక అను అర్థము స్పష్టమేకదా! (బృ. ఉ. పు. 36) శాక్తమునందు 'భూమ' కూడ లలితా దేవియే యని లలితాసహస్రనామముల యందున్న సంగతి దీక్షితులవా రెఱుగరు. ఎఱిగియుండిన భూమ అనగా

మూలములేని యీ గుర్తెరిగే శరీరమా? అని బాధపడి యుందురు. దీక్షితులవారి యీ క్రింది వాక్యముల వలన భూమయే ఆనందమని శ్రుతి చెప్పిన వాక్యమును చదివి యుండరని యూహింపవచ్చును. "విషయానందమునే ఆనంద మనవలె గాని బ్రహ్మానందము లేనే లేదు." (బృ. పూ. పు. 131, 132) "శరీరము వలన సచ్చిదానందం పుట్టినది. సచ్చిదా నందమే అనాత్మ, ఆత్మ సచ్చిదానందమే."

(బృ. పూ. పు. 129)

దీక్షితులవారు చెప్పిన బట్టబయలును గుఱించి యొక పద్ధతిలో విచారింతము —

(౨౫) బ్రహ్మము త్రివిధమా?

బ్రహ్మము సగుణమనియు, నిర్గుణ మనియు, నిష్ప్రతి యోగిక మనియు త్రివిధమని కొందఱందురు. మాయోపాధి గల బ్రహ్మము సగుణ మనియు, నిర్మాయిక స్వరూపమగు బ్రహ్మము నిర్గుణ మనియు, యీ రెండింటి కంటెను విలక్షణ మగు (అతీతమగు) బ్రహ్మ తత్త్వము నిష్ప్రతియోగిక బ్రహ్మమనియు చెప్పుదురు.

మఱికొంద ఱిట్లు చెప్పుదురు. మాయోపాధికమగు బ్రహ్మ చైతన్యము సగుణము. దేహాది సంఘాతమునకు అధిష్ఠానమగు ఆత్మ, సగుణ నిర్గుణము. మాయాసంబంధ మెంతమాత్రములేని బ్రహ్మ చైతన్యము శుద్ధ నిర్గుణము. శుద్ధ నిర్గుణమనునది నిర్గుణమే. ఈ మూడువిధములయందు కడపటి శుద్ధ నిర్గుణమును అచలవేదాంతులు బట్టబయలని

అందు లేమో ? కృష్ణదాసుగారు వ్రాసిన కందార్థములకు "శుద్ధ నిర్గుణ తత్త్వ కందార్థము" లనియు, కందములకు "క్షరాక్షరోపాధిద్వయ దోష రహిత పరమ తత్త్వ కంద ములు" అనియు, పేర్లు పెట్టిరి. కాని దీక్షితులవారు బట్ట బయలు నిర్గుణమని కొన్నిచోట్ల చెప్పిరి. "ఈ ఉత్త బట్ట బయలే త్రిగుణం" (బృ. పూ. పు. 122) "ఈ ఉత్త బట్ట బయలే నిరంజనం నిర్గుణం" (బృ. ఉ. పు. 3) పై వాక్యము లకు విరుద్ధముగ "సగుణ నిర్గుణాలు కాంది యేదో" (బృ. పూ. పు. 101) అని చెప్పిరి. ఇందులో యేవి గ్రాహ్యమో యేది అగ్రాహ్యమో తెలియదు.

దీక్షితులవారు బ్రహ్మమనగా — బయలు కాదని పలుమారు చెప్పిరి. వారికి ప్రమాణ గ్రంథమగు అనంతో పనిషత్తు 'బ్రహ్మము' 'బయలు' అను శబ్దద్వయము సమానార్థములుగా ప్రయోగించినది.

"…. మచలం సర్వదా భాతి పూర్ణం నిర్వర్ణం నిరా మయం నిర్దేశ రహితం నిత్యం బాహ్యం బ్రహ్మేతి నిశ్చితం." (7)

ఇచ్చట అచలము, బాహ్యం = బయలు, బ్రహ్మము యీ మూడును సమానార్థకములే. ఇట్టి ఆధారములు మఱి కొన్ని అనంతోపనిషత్తు నందు కలవు.

దశోపనిషత్తులును వాటి ననుసరించి వ్రాయబడిన ప్రకరణ గ్రంథములును పూర్వ (ప్రాచీన) వేదాంత గ్రంథములనియు, తరువాత వెలువడిన ఉపనిషత్తులును వాటి ననుసరించి వ్రాయబడిన ప్రకరణ గ్రంథములను

ఉత్తర (నవీన) వేదాంత (గంథ)ము లనియు, చెప్పుదురు. కొందఱు ఇంకొక విధముగ చెప్పుదురు. బౌద్ధమతము పుట్టుటకు పూర్వమున్న వేదాంత గ్రంథములు పూర్వ (ప్రాచీన) వేదాంత గ్రంథము లనియు, బౌద్ధమతానంతరము వెలువడిన ఉపనిషత్తులు మొదలగు వేదాంత గ్రంథములను ఉత్తర (నవీన) వేదాంత గ్రంథములనియు చెప్పుదురు. నాకు తెలిసినంతవఱకు నిష్ప్రతియోగిక బ్రహ్మమును గుఱించి పూర్వ వేదాంత గ్రంథములయందు చెప్పబడలేదు. పూర్వ వేదాంత గ్రంథములకు గల గౌరవము ఉత్తర వేదాంత గ్రంథములకు లేదు. కనుకనే ప్రస్థానత్రయముల యందు దశోపనిషత్తులను మాత్రమే చేర్చిరి. బ్రహ్మ సూత్రములను, భగవద్గీతను, సహితము దశోపనిషత్తులతో సమానముగ గౌరవించి మతాచార్యులు భాష్యములు రచియించిరి.

పారమార్థికముగ బ్రహ్మమునందు సగుణ నిర్గుణాది భేదము లేకున్నను వ్యావహారికముగ బోధకొఱకట్టి భేదము శాస్త్రములయందు చెప్పబడినది. ఇచ్చట ఒక ప్రశ్న కలుగుచున్నది. గుణము సగుణునకు గలదా? లేక నిర్గుణునకు గలదా? సగుణుడనగా: గుణము కలవాడు. గుణము మొదలేగల సగుణునకు మఱియొక గుణము కలుగదు. నిర్గుణునకు గుణము కలదనుట బాలభాషణము. నిర్గుణుడు సగుణుడు కాడు. సగుణుడైనచో నిర్గుణు డెట్లగును? నిర్గుణుడే సగుణుడాయెనన్న అతడేల తననిర్గుణత్వమును కోల్పోయెను? ఒకసారి నిర్గుణత్వము కోల్పోయెనేని తరువాత నిర్గుణుడను వాడే లేడుగదా? ఆత్మ నిర్గుణుడు. నిర్లేపుడు, నిరంజనుడు

గనుక తాత్కాలికముగనైనను నిర్గుణుని గుణము లెట్లుంట గలవు ? దీనికి సమాధానమిది :—

ఒక స్ఫటికపు ముక్కను ఎండలోనుంచి దానిసమీపమున జపాకుసుమము (మంకెన పువ్వు) నుంచినచో స్ఫటికము దాని సహజమగు స్వచ్ఛతను పోగొట్టుకొనకనే మన నేత్రములకు ఎఱ్ఱగ కనిపించును. మంకెన పువ్వును స్ఫటికము నుండి దూరముగ చేసిన స్ఫటికము ఎప్పటియట్లె స్వచ్ఛముగ కనబడును. కాని స్ఫటికము జపాకుసుమ సాన్నిధ్యమున తన స్వాభావిక స్వచ్ఛతను కోల్పోయి రక్తవర్ణముగ మాఱలేదు. మంకెన పువ్వును దూరము చేసినపుడు రక్తవర్ణమును వదలి పూర్వప్రకృతిగ స్వచ్ఛతను పొందలేదు. స్ఫటికము రెండు సమయములందును యెప్పటియట్లే స్వచ్ఛముగనే యున్నది. (దీనిని జపాస్ఫటిక న్యాయమందురు.) అదేవిధముగ బ్రహ్మమునందు ఆయనకంటె భిన్నమును, అభిన్నమును అని చెప్పుటకు వీలులేని అనిర్వచనీయమగు మాయాప్రభావముచే సహజముగ నిర్గుణుడగు బ్రహ్మము సగుణుడుగ తోచుటేగాని సగుణు డెన్నడును కాలేదు. జీవుడు సంసారదశయందున్నప్పుడు బ్రహ్మము సగుణుడుగను, జీవుడు ముక్తావస్థయందుండునపుడు బ్రహ్మము నిర్గుణుడుగను తోచుచున్నాడు. సగుణబ్రహ్మప్రాప్తివలన నిర్గుణబ్రహ్మప్రాప్తియు, నిర్గుణబ్రహ్మానుభవమువలన సంసారమునుండి జీవుడు ముక్తుడై మోక్షదశ నందుటయు, ఫలము.

శ్రీ శంకరాచార్యులవారు నిర్గుణబ్రహ్మమునందే శ్రుతుల తాత్పర్యమని భాష్యముల రచియించిరి. శ్రీమ

శ్రీరామానుజాచార్యులవారు 'నిర్గుణబ్రహ్మ' శబ్దమునకు వేఱొక విధమగు అర్థమును చెప్పిరి. ఎట్లనగా :—

లోకమున నిర్గుణవస్తు వొక్కటియు లేదు. అట్లుండు టకును వీలు లేదు. ఒకవేళ నిర్గుణవస్తువు ఒక్కటి ఉన్నట్లు మన మంగీకరించితిమేని దాని యునికి నెఱుగుట యెట్లు? నిర్గుణము నెఱుగుటకు ప్రమాణము లేవి? శ్రుతియే ప్రమాణ మనిన శ్రుతులయందు చెప్పబడిన నిర్గుణ బ్రహ్మ శబ్దమునకు బ్రహ్మము గుణములు లేనివా డని అర్థముకాదు. గుణములు లేవనగా : ప్రకృతి సంబంధమైన హేయగుణములు లేనివా డనియే గాని, అనంత కళ్యాణ గుణములు లేనివాడని కాదు. ఆయన అప్రాకృతములైన అనంత కల్యాణ గుణములు కలవాడు.

కొందఱు దేవీభక్తులు. దేవిని పరదేవత అందురు. అనగా : దేవికంటె అతీతమగు పరతత్త్వమొకటి కలదని వా రంగీకరింపరు. దేవీ భాగవతమునందు దేవి తానే సగు ణయు, నిర్గుణయు నని చెప్పినట్లున్నది. అనగా : ప్రకృతి (దేవి) యందు గుణములు వ్యక్తముగాక అవ్యక్తస్థితియం దుండునప్పుడు దేవి నిర్గుణ యనియు, గుణములు వ్యక్తమైన స్థితియందు సగుణ యనియు తాత్పర్యము. శబ్దమును బట్టి గాక మన మనేక పర్యాయములు ఆ శబ్దములు ప్రయో గించినవారి భావ మేమైయుండునా? యని విచారించి శబ్ద మునకు అర్థమును చెప్పవలసియుండును. ఈ విషయ మిట్లుండ నిండు. దీక్షితులవారు శరీరమును, ఎఱుకను యీ రెండింటిని క్రమముగ సగుణ, నిర్గుణము లనియు ఈ సగుణ నిర్గుణములు

కానిది 'ఏమీ లేని ఉత్త బట్టబయ' లనియు చెప్పిరి. శ్రీవిద్యా విశారదులు చెప్పునట్టి సగుణ నిర్గుణములను దీక్షితులవారు చెప్పి వాటితో పోల్చవచ్చునా యని విచారించినచో రెండింటికిని సామ్యము కుదురదు. శ్రీవిద్యోపాసకులు చెప్పునట్టి నిర్గుణ తత్త్వము నిత్యమైనది. దీక్షితులవారు చెప్పునట్టి ఎలుక (గుర్తు) క్షణభంగురమైనది.

సగుణ నిర్గుణములు కానిదని చెప్పబడు నివృత్తి యోగిక బ్రహ్మమునుగుఱించి ఋభుగీత*యం దిట్లున్నది :—

శ్లో॥ సగుణం నిర్గుణం తాభ్యా మన్యన్నివృత్తియోగికమ్,
బ్రహ్మైతం త్రివిధం లింగై ర్వేదాంతేషు హి విశ్రుతమ్.
(ఋ. గీ. 1-72)

తా॥ బ్రహ్మము సగుణమనియు, నిర్గుణమనియు, ఆ రెండింటికంటె అన్యము నివృత్తియోగిక మనియు ఇట్లు త్రివిధముగా వేదాంతములయందు వినబడుచున్నదిగదా?

శ్లో॥ తత్రాద్యం హేయగుణకం సోపాధిత్వాన్ముముక్షుభిః,
'తత్త్వమస్యా'ది వాచ్యత్వాత్ జ్ఞేయం హేయతయాగ్రతః.
(ఋ. గీ. 1-73)

---

* ఋభుగీత (వరాహభగవానుని శిష్యుడను ఋభుమహర్షికి) ఋభుమహర్షి వారి శిష్యుడగు నిదాఘునికిని చెప్పెనని దక్షిణామూర్తి బ్రహ్మదేవునకు ఉపదేశించినట్లు ఆ గ్రంథమున కలదు. ఇది నాలుగధ్యాయములు కలిగి అందులో 347 శ్లోకములున్నవి. గ్రంథకర్త (శేక సంకలనకర్త) తేజోబిందూపనిషత్తునుండి సుమారు 145 మంత్రములను, మాండూక్యశ్రుతి నుండి 3 మంత్రములను, ఇతర ఉపనిషత్తుల నుండి కొన్ని మంత్రములను, (శ్లోకములను,) మాండుక్యకారికల నుండి కొన్ని శ్లోకములను గైకొని ఋభుగీతను రచియించిరి.

తా॥ అందు మొదటిదగు సగుణ బ్రహ్మము మాయోపాధిసహితమైనదియు, 'తత్త్వమస్యాది' మహావాక్యముల యొక్క వాచ్యార్థమగుట వలనను* హేయగుణకము (వర్జింపదగిన స్వభావముకలది)గా తెలియనగును.

"మఱియు ఆ సగుణ బ్రహ్మము, జీవేశ్వర విభాగము చేత ద్వివిధంబగును. అందు జీవేశ్వరు లిరువురును త్రివిధవంతు లగుదురు. కనుక హేయ గుణము." (బు. గీ. 1-74)

శ్లో॥ ఉపాదేయం ద్వితీయం స్యా న్నిర్గుణం మోక్షకాంక్షిభిః,
తత్త్వమస్యాది లక్ష్యత్వాత్ జ్ఞేయం చాత్మతయాఽతతః.
(బు. గీ. 1-75)

తా॥ రెండవది యగు నిర్గుణ బ్రహ్మము తత్త్వమస్యాది మహావాక్యములయొక్క లక్ష్యార్థమగుటవలన ముముక్షువులచే ఉపాదేయము (గ్రహింపదగినది) అగును. కనుక ఆత్మభావముగా నెఱుగదగినది యగును.

శ్లో॥ హేయోపాదేయ శూన్యం తృతీయం ప్రకృతం యతః,
ముక్తైః ప్రాప్యమత శ్శుద్ధ మపి జ్ఞేయం ముముక్షుభిః.
(బు. గీ. 1-77)

తా॥ మూడవదియగు నిష్ప్రతియోగిక బ్రహ్మము హేయోపాదేయ గుణములు రెండును లేనిదియును, ముక్తులచే పొందదగినదియును నై యున్నది.

---

* ఈ గ్రంథముయొక్క ప్రథమభాగము రెండవ ప్రకరణమున ౪౨, ౪౩ అధ్యాయముల యందు 'తత్త్వమసి' మహావాక్యవిచారమనియు, మహావాక్య విచారణమనియు రెండధ్యాయములు చెప్పితిని. అందు వాచ్యార్థము లక్ష్యార్థముల వివరము కలదు.

ముక్తులచే పొందదగిన దనగా : ముముక్షువులు పొంద సాధ్యము కానిదని అర్థము. అట్లయినచో నిష్ప్రతియోగిక బ్రహ్మప్రసక్తి యేల? యన ముముక్షువులు (మోక్షాపేక్ష గలవారు) అట్టిదొకటి గలదని అనామమైనను తెలియగదగి యున్నది. ఆ నామము వినుట తప్ప అన్యఫలము లేదని తాత్పర్యము.

ఇట్టి నిష్ప్రతియోగిక బ్రహ్మమును గురించి మరియు నిట్లున్నది. 'ఇది' యనుటచేనైనను, 'నే' ననుటచే నైనను, 'తా' ననుటచే నైనను, యీ బ్రహ్మమునకు వేద్యత్వము లేదు. (తెలియబడెడి స్వభావము లేదు) అట్లైన శ్రుతి ప్రోక్తమగుట వలన నొకానొక విధమగు వేద్యత్వము గలదు. కనుక నాస్తికము కాదు. (ఋ. గీ. 1-77)

తేజోబిందూపనిషత్తు పంచమాధ్యాయమున సుమారు అఱువది మంత్రములయందు అరూప బ్రహ్మబోధ కొఱకు సర్వము మిథ్యయని చెప్పబడినది. ఆ మంత్రములనే ఋభుగీతాకారుడు ఉన్నవి యున్నట్లుగా ఋభుగీత ప్రథమాధ్యాయమున గ్రహించెను. అచట నిర్గుణ బ్రహ్మమునకు స్వరూప బ్రహ్మమనియు నిష్ప్రతియోగిక బ్రహ్మమును అరూప బ్రహ్మమనియు నామముల నుపయోగించినట్లు భావింపవచ్చును. నిర్గుణ బ్రహ్మమును సప్రతియోగిక బ్రహ్మమనియు, అందురు.

జిజ్ఞాసువు :- స్వామీ! సప్రతియోగిక (నిర్గుణ) బ్రహ్మమును నిర్మలాంతఃకరణము చేతను తత్త్వమస్యాది మహావాక్య శ్రవణముచేతను మనన నిధిధ్యాసలవలనను తెలియగ

వచ్చును. అరూప (నివృత్తి యోగిక) బ్రహ్మమును తెలిసికొనుట యెట్లు?

వేదాంతి :- ఈ ప్రశ్నము నే నిదాఘునిచే ఋభుమహర్షి అడుగబడినవాడై శిష్యునకిచ్చిన సమాధానము నే నేను నీకు తెలిపెదను.

శ్లో॥ లక్ష్య లక్షణ హీనత్వా ద్యుక్త్యా నివృత్తియోగికమ్,
నమంతవ్యం యథా యోగ్యం లౌకికైస్త్వం వినిశ్చను.

(ఋ. గీ. 2-22)

తా॥ నిర్గుణాతీతమునకు లక్ష్య లక్షణములు లేనందున యుక్తిచేనైనను నివృత్తి యోగికమని తలంపదగదు. (అయినను) లౌకికులచే నెట్లు వ్యవహార యోగ్యమో, (అట్లు) నీవును నిశ్చయించుకొనుము.'' అనగా — నివృత్తి యోగిక బ్రహ్మము ఏవిధముగను తెలియబడదని, అట్టి ప్రయత్నము గాని దానిని గుఱించిన చర్చ (విచారము) గాని నిష్ప్రయోజనమని తాత్పర్యము. ముక్తి కలుగుట యెట్లనగా?

శ్లో॥ ద్వైతా చిద్రూప కార్యస్యా ద్వైత చిద్రూప కారణాత్,
నివృత్తి స్స్యాద్యథా దీపా త్తమసోనత్వరూపతః.

(ఋ. గీ. 4-61)

తా॥ అజ్ఞాన కార్యమైన ద్వైతము అంధకారము వంటిది. అద్వైత చిద్రూప కారణ జ్ఞానము దీపము వంటిది. కనుక సరూప బ్రహ్మజ్ఞానము చేత మాయారూపబంధము నశించి ముక్తికలుగును గాని అరూప బ్రహ్మము వలన ముక్తి కలుగదు.

శ్లో॥ చిద్రూప బ్రహ్మతాదాత్మ్యం జీవస్య హి వివక్షితః,
నారూప వాక్య దూరత్వాత్త న్నా ద్వైత మనూపిణామ్.

(బృ. గీ. 4-63)

తా॥ "అద్వైత వేదాంతమునందు జీవునకు చిద్రూప బ్రహ్మముతో తాదాత్మ్యము చెప్పబడినది. అరూప బ్రహ్మమన్ననో విషయ వాక్యములకు దూరమగుట వలన జీవునకు అరూప బ్రహ్మముతో తాదాత్మ్యము చెప్పబడ లేదు. కనుక అరూప బ్రహ్మవాదులను అద్వైతులని చెప్పుట కూడ తగదు."

"మోక్షాతీతదశయందు మాత్రమే అరూప బ్రహ్మత్వము సిద్ధించును. అట్లయినను అరూప బ్రహ్మమునకు ద్వంద్వహీనిత్వంబగుట వలన అద్వైత భావము చెప్పుటకు వీలు లేదు." (బృ. గీ. 4-64) "అదియుగాక వాచ్యవాచక రహితమైనదనియు లక్ష్యలక్షణములు లేనట్టియు అరూప బ్రహ్మమందు అద్వైతమను శబ్దము ప్రయోగించుటకు వీలు లేదు. (బృ. గీ. 4-65)

శ్లో॥ అరూప వస్తునః ప్రశ్నః ప్రతిషిద్ధ శ్శ్రుతౌయతః,
యాజ్ఞవల్క్యేన గార్గ్యై తన్నత్వం ప్రష్టు మిహార్హసి.

(బృ. గీ. 4-71)

తా॥ "మరియు ఏ కారణమున శ్రుతియందు యాజ్ఞవల్క్యునిచే గార్గి కొఱకు అరూప వస్తువునకు ప్రశ్నము నిషేధింపబడెనో ఆ కారణమున, దీనిని గుఱించి ప్రశ్న చేయుటకు తగవు."

ఇచ్చట ఒక విషయము చెప్పవలసి యున్నది. ఏమనగా :— బృహదారణ్యక శ్రుతి తృతీయాధ్యాయము నందలి ఆఱవ బ్రాహ్మణము నందు వచక్నుని బిడ్డయగు గార్గి యను నామెను యాజ్ఞవల్క్య మహర్షి కిని జరిగిన సంవాదమునందు గార్గి, యాజ్ఞవల్క్యమహర్షిని 'బ్రహ్మ లోకము దేనియందు ఓతప్రోతమై యున్నది?' అని ప్రశ్నించెను. అందుకు మహర్షి 'ఆ ప్రశ్నమును అడుగవద్దు. నీ తల పగిలిపోవును' అని చెప్పెను. అంతటితో గార్గి మిన్నకుండెను.

ఇచట విచారింపవలసిన విషయ మేమన — యాజ్ఞవల్క్యమహర్షి ఏ బ్రహ్మమును గుఱించి అడుగవద్దని గార్గిని మందలించెను? ఇదియే ముఖ్యమైన ప్రశ్న. ఇందులకు నా సమాధాన మేమన — బ్రహ్మలోకము (హిరణ్యగర్భుని లోకము) సగుణబ్రహ్మోపాసకులు మరణానంతరము అర్చిరాది మార్గమున (దేవయానమున) చేరు ముక్తిస్థానమది. దానికి సత్యలోకమని మఱియొక నామము. దీనికంటె పరమునందున్న పరమసత్యమగు నిర్గుణ బ్రహ్మమునందు సత్యలోకము ఓతప్రోతమైయున్నదని చెప్పరాదు. నిర్గుణ బ్రహ్మము దేనికిని, కారణముగాని, కార్యముగాని, కాకపోవుటవలనను, నిర్లిప్తమగుటవలనను, "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" అని (తైత్తిరీయ. అ. 2-4-8) శ్రుతి చెప్పియున్నందువలనను, మనోవాక్కుల కందరానిదానిని గుఱించి ప్రశ్నించుట తప్పని మహర్షి గార్గిని మందలించెను.

ఋభుగీతయందు చెప్పబడిన నివృత్తి యోగిక

బ్రహ్మము, తేజోబిందూపనిషత్తునందు చెప్పబడిన అరూప బ్రహ్మము, ఈ రెండును ఒక్కటేయనియు, గార్గికి యాజ్ఞవల్క్యులు చెప్పుటకు నిరాకరించినది అదియే యనియు కొందఱు నవీన వేదాంతులు చెప్పుదురు. అట్లు చెప్పుట వలన వారికి కలుగు ప్రయోజన మేమనః— నివృత్తియోగిక బ్రహ్మమును ప్రాచీన శ్రుతులలో (దశోపనిషత్తులలో) బీజరూపమున చెప్పబడి యున్నదని నిరూపించుటకే. కాని, అది సరికాదు. మహర్షి, బ్రహ్మలోకము నిర్గుణ బ్రహ్మమునందు ఓతప్రోతమైయున్నదని చెప్పిన పిమ్మట కూడ గార్గి "నిర్గుణ బ్రహ్మము దేనియందు ఓతప్రోతమై యున్న" దని అడిగియుండిన, మహర్షి గార్గికి చెప్పుటకు నిరాకరించిన వస్తువు నివృత్తియోగిక బ్రహ్మమే యని యంగీకరింపవచ్చును. అట్లడుగ లేదు గనుక మహర్షి అడుగవద్దని చెప్పినది నిర్గుణ బ్రహ్మమునే యని యాజ్ఞవల్క్యుల యొక్కయు, ఋభుగీతాచార్యుల యొక్కయు అభిప్రాయమై యున్నదనుట యుక్తము. ముముక్షువునకు కావలసినది ముక్తియే గనుక ముక్తి అరూప బ్రహ్మజ్ఞానమువలన సిద్ధింపదు. మోక్షకాముడు చేయతగినది యేమనః—

శ్లో॥ తస్మాత్తురీయం సద్బ్రహ్మ యోగవృత్త్యైవలక్షితైః,
సచ్చిదానంద పూర్ణైస్త్వం మదుక్తం విద్ధి ముక్తయే.

(ఋ. గీ. 4-72)

తా॥ అందువలన, అరూప బ్రహ్మజ్ఞానము వలన మోక్షము సిద్ధింపదు. కనుక నాచే చెప్పబడిన తురీయ

రూపమగు* సత్యమైన బ్రహ్మమునే యోగవృత్తితోను సచ్చిదానంద పూర్వకములైన లక్షణములచేతను మోక్షము కొఱకు నీ వెఱుంగదగును.

శ్లో॥ స ఆత్మా సహి విజ్ఞేయః సర్వైరపి ముముక్షుభిః,
తుర్యాత్మ జ్ఞాన హీనానాం నముక్తి స్స్యాత్ కదాచన.
(బు. గీ. 4_47)

తా॥ "అది ఆత్మ, అదియే సమస్త ముముక్షువుల చేతను తెలియదగిన పదార్థము. తుర్యాత్మ జ్ఞానహీనులకు ఎప్పటికిని ముక్తి సిద్ధింపదు. వీరశైవులుకూడ తురీయ మునే యెఱుగవలయునని చెప్పిరి.

శ్లో॥ జాగ్రత్స్వప్న సుషుప్త్యాఖ్యైః పరావస్థా ముపేయుషః,
కిం వా ప్రమాణం కిం జ్ఞేయం కిం వా జ్ఞానస్య సాధనమ్.
(సి. శి. 20, 21)

తా॥ "జాగ్రత్స్వప్న సుషుప్తు లనెడి మూడవస్థలను మీఱి తుర్యావస్థనొందిన శివయోగికి ప్రమాణమును లేదు. తెలియఁదగినదియు లేదు. తెలియదగిన సాధనము లేదు." (ఈ శ్లోక తాత్పర్యమును యిదివఱలో చెప్పియుంటిని.)

శ్లో॥ తుర్యాతీతపదం యత్తు దూరం వాఙ్మనసాధ్వనః,
అనుప్రవిశ్య తద్యోగీ న భూయో విశ్వ మీక్షతే. (సి. శి. 20_22)

---

* తురీయమును గుఱించి బ్రహ్మజిజ్ఞాస ప్రథమభాగము ౨_౨౪ వ అధ్యాయమునందును, తుర్యాతీతము సత్తాసామాన్యమును గురించి ౪౬ వ అధ్యాయమునందును వ్రాసియున్నందున నిచ్చట ఇంతటితో విరమించితిని.

తా॥ తుర్యాతీత పదమనునది అవాఙ్మనసగోచరము. అది స్తుతిధ్యానములకు దూరమైనది. శివయోగి దానియందు ప్రవేశించి తిరిగి జగత్తును చూడడు. కనుక తురీయమే జ్ఞేయము. తురీయము నెఱుగుటయే తురీయాతీతస్థితి సిద్ధించుట. తురీయాతీతము సిద్ధించుటకు వేఱు సాధనముగాని బోధగాని లేదు.

జిజ్ఞాసువు :- స్వామీ! అరూప బ్రహ్మమును తెలిసికొనుటవలన ప్రయోజన మేమియు లేనప్పుడు అట్టిది తెలిసికొనవలయునను ప్రయత్నమేల ?

వేదాంతి :- తత్త్వమస్యాది మహావాక్య విచారము చేతను నిధిధ్యాసవలనను సజాతీయ విజాతీయ భేదము మాత్రమే నశించుననియు, స్వగతభేదము నశింపదనియు, అరూప బ్రహ్మజ్ఞానమువలన స్వగతభేదము కూడ నశించుననియు కొందఱు చెప్పుదురు. కాని యిది సరియైన అభిప్రాయము కాదు. ఏలయన అరూప బ్రహ్మము యేవిధముగను యెఱుగబడదు. అది 'అఖండైకరసాతీతము' 'మోక్షాతీతము' యెఱుగబడని దానివలన ఫలమేమి కలుగును ? ఫలము శూన్యమేగాక దుష్ఫలము లభించుట కవకాశమున్నదని నిదాఘుని వాక్యముల అర్థము. (ఋ. గీ. 1-63 నుండి 69). నిదాఘుని వాక్యములను ఋభుమహర్షి అంగీకరించెను. (ఋ. గీ. 1-71) కాని నిర్గుణ బ్రహ్మమును పొందుటవలన సజాతీయ విజాతీయభేదము నశించుననియు స్వగతభేదము నశింపదనియు నిష్ప్రతియోగిక బ్రహ్మానుభవమువలన స్వగతభేదము నశించుననియు అదియే నిష్ప్రతి

యోగిక బ్రహ్మానుభవమునకు ఫలమనియు చెప్పబడెను. (బ్ర. గీ. 1-78). అది కేవలము ఉపశమన వాక్యము మాత్రమేకాని యథార్థము కాదు. ఏలయన: మహర్షి నిర్గుణ బ్రహ్మ స్వరూపమును చెప్పుచు,

శ్లో॥ ఆనందోఽసి పరోఽసి త్వమేక ఏవాద్వితీయకః,
చిద్ఘనానంద రూపోఽసి పరిపూర్ణ స్వరూపకః. (బ్ర. గీ. 2-12)

తా॥ "మరియు, నీవు ఆనందరూపుడవు. పరుడవు. సజాతీయ విజాతీయ స్వగత భేదములు లేనివాడవు. జ్ఞానానంద స్వరూపుడవు. అద్వితీయుడవు, పరిపూర్ణస్వరూపుడవు" అని చెప్పిరి. సర్వవేదాంత శాస్త్రములు నిట్లే చెప్పినవి.

జ్ఞాని తన స్వరూపమును తాను తెలిసికొని తాను అద్వితీయ నిర్గుణ బ్రహ్మ స్వరూపుడనని యెఱిగినప్పుడే స్వగత భేదము నశించుచున్నది. అట్టియెడ అరూప బ్రహ్మము (నిష్క్రియ యోగిక బ్రహ్మము)తో ఫలము లేదని నా యభిప్రాయము. దీనిని వివరించి చెప్పెదను. మనుష్యునకు శిరస్సువలె బాహువులుగాని తదితర అవయవములుగాని లేవు. హస్తములున్నట్లు పాదములు లేవు. పాదములవలె ఉదరము లేదు. కాని యివన్నియు ఒక శరీరమునకు సంబంధించినవి. అట్లే చెట్టునందు ఆకులు, పువ్వులు, ఫలములు, కొమ్మలు వేఱు వేఱు రూపములతో నున్నను అవి యన్నియు చేరి ఒక వృక్షమే. ఒక శరీరమునందు అవయవములయందున్న యీ భేదము స్వగత భేదము. స్వగత భేదమనునది సాకార, సగుణ వస్తువునందే కలదు. అఖండము, అద్వితీయ వస్తువునందు స్వగత భేదము లేదు. నిర్గుణ బ్రహ్మ భావనయందే యీ

భేదత్రయము నశించుచుండగా నిష్ప్రతియోగిక బ్రహ్మ ప్రసక్తితో అవసరము లేదు.

బంధమోక్షములు రెండును వ్యావహారిక సత్యమే గాని పారమార్థిక సత్యములు కావు. పదుగురు స్నేహితులు నదిని దాటి యిందులో యెవ్వరైన నదిలో పోయిరేమోనని వారిలో ఒకడు తన్ను తప్ప తక్కిన వారిని లెక్కించి దశముడు (పదియవవాడు) యేటి పాలైపోయెనని అందఱు విలపించుచుండ, మార్గమున పోవువాడొక డావృత్తాంతము వారివలన విని తొమ్మండ్రుగురను లెక్కించినవాడే దశము డని చెప్పి చూపినపుడు వారు భ్రాంతి రహితులై మహా నందము ననుభవించుచు "దశముడున్నాడు, దశము డున్నాడు" అని బిగ్గఱగ చెప్పుకొనుచు పోయిరి. కాని, వారు బ్రతికియున్నంతకాలము 'దశముడున్నాడు' అని అఱచుచుందురా? అట్లే ఆత్మానాత్మ వివేకమువలన అవిద్య నశించును. తత్త్వమస్యాది మహావాక్యవివేకము వలన బ్రహ్మాత్మైక్యము సిద్ధించును. ఆ స్థితిలో స్వస్వ రూపము నెఱిగి 'అహంబ్రహ్మాస్మి' నేనే బ్రహ్మమునై యున్నాను. నేను సచ్చిదానంద స్వరూపుడనయితిని. నేను ముక్తుడను. నా కిప్పుడు బంధము లేదు. పూర్వము నేను బద్ధుడ ననుకొంటిని కాని నిజముగా నా కెప్పుడును బంధము లేదు, అని నిశ్చయించును. ఆ తరువాత 'అహం బ్రహ్మాస్మి' అని గాని 'అయామాత్మా బ్రహ్మ' అని గాని బ్రతికియున్నంతకాలము జపించుచుండునా? అట్లుండడు. అతనికి మహావాక్యములతోను వాటి అర్థముతోను అవ

సరము తీరిపోయినది. ఋభుగీతను ముగించుచు, ఆ గీతాచార్యు డిట్లు చెప్పెను :—

శ్లో॥ ఏవం శ్రుత్వా నిదాఘస్య ఋభువక్త్రా ద్యథార్థతః,
బ్రహ్మైవాహ మితి జ్ఞాత్వా కృత కృత్యోఽభవద్విధే.
(ఋ. గీ. 4-89)

తా॥ ఋభుమహర్షి వలన యథార్థమును విన్న నిదాఘుడు 'నేను బ్రహ్మమే' అని యెఱిగి కృతకృత్యుడాయెను. పర్యవసాన మేమనగా :— అరూప బ్రహ్మము వల్ల అజ్ఞాన నివృత్తి కలుగదు. కనుక జిజ్ఞాసువు అరూప బ్రహ్మ విచారము చేయుటవలన ప్రయోజనము లేదు.

జిజ్ఞాసువు :- దీక్షితులవారు చెప్పిన 'ఉత్త బట్ట బయలు' ఈ అరూపబ్రహ్మ (నిష్ప్రతియోగిక బ్రహ్మ)మైనదాని నెఱుగుటవలన ఫలమేమియు కలుగదుగదా ?

వేదాంతి :- వారు చెప్పిన ఉత్త బట్ట బయలు యెట్టిదో వారి వాక్యముల ఉదాహరించి చెప్పెదను. అది వినిన పిమ్మట నీవే నిశ్చయించుకొనుము.

(౨౬) దీక్షితులవారి శూన్యవాదము

దీక్షితులవారి గ్రంథమును పరిశీలించిన, అందు వారొక చోట చెప్పినదానిని వేఱొక చోట నిరాకరించినట్టి స్వవచనవ్యాఘాతములు అనేకములు గలవు. ఒక చోట 'యీ ఉత్త బట్టబయలు అచలము' అని చెప్పి ఆ అచలమునే మఱియొక చోట 'చలాచలములు కానిది' అనిరి.

లకు ముక్తులు గనపడరు. కనుక ముక్తులకందరు ముక్తులే, *అముక్తుల కందరు ముక్తులే గావున యిదే సిద్ధాంతముగాను, సాధారణముగా నిరాక్షేపముగా నందరికి తోచదు."

(బృ. పూ. పు. 43)

"రజ్జుభ్రాంతి కలిగినంతసేపు సర్పభ్రాంతి తోచదు, సర్పభ్రాంతి కలిగినంత సేపు రజ్జుభ్రాంతి తోచదు." దీక్షితుల వారి యీ వాక్యములు అర్థశూన్యములు. ఏలయన? రజ్జువును రజ్జువునుగా చూచుట భ్రాంతి కాదు. అది వ్యావహారిక సత్యము. అది ప్రమాజ్ఞానము, భ్రాంతిజ్ఞానము కాదు. దీక్షితులు అంతటితో ఆగక — 'సర్పభ్రాంతి కలిగినంత సేపు రజ్జువను జ్ఞానము కలుగదు' అనవలెను. గాని 'రజ్జుభ్రాంతి తోచదట.' దీక్షితులవారి యీ వాక్యముల కర్థమేమైన కలదా? మఱియు వారి వాక్యములయందు 'ప్రకృతియే అచలమై' అని ఉన్నది. అనేక పర్యాయములు 'ఇది అది కాదు, అది యిది కాదు' అని చెప్పిన వాక్యములు మఱచిరి కాబోలు.

శ్రీ దీక్షితుల పై వాక్యములయందు అచలమునకు నాశనము నంగీకరించిరి. లేదా అచలము శూన్యముగ పరిణమించుట యను పరిణామము నంగీకరించిరి. దీక్షితుల వారి మతము వారిబోధను 'అచలబోధ' యనిరి. 'అచలాద్వైత' మనిరి. 'అచల వేదాంత' మని ప్రచారము చేసి

---

* అముక్తులకందరు ముక్తులే అని యున్నది. అది అచ్చుతప్పు కావచ్చును. "అముక్తుల కంద రముక్తులే అని యుండవలెను."

కొనిరి. వారి గ్రంథమునందు 'రాకడ పోకడ లేక యెప్పటికిని నిలిచియుండునది అచల' మనిరి. దానినే పరిపూర్ణ మనిరి. వారు చెప్పిన యీ వాక్యములను వారే పైన చెప్పిన వాక్యములతో ఖండించిరి. తత్త్వములను ఎఱుకతో ప్రారంభించి, మహాశూన్యముతో అంతము నొందించిరి. తుదకు మహాశూన్యము సహితము అగోచరమై పోవునట. ఆహా! ఎవరికి అగోచరమగునో? ఈవిధముగా చూచిన బట్టబయలు లేదు, ఎఱుక లేదు. సర్వము మహాశూన్యము. కాని దీక్షితులవారు మహాశూన్యమని చెప్పిరే అది యెట్టిది? శూన్యమనునది ఒకటి యుండుట కలదా? శూన్యము నశించి మహాశూన్యమగుట యెట్లు? శూన్యమనగా — ఏమియు లేనిదనిగదా? ఉన్నదానికి నాశనము కలదనిన అర్థమున్నది. కాని, లేనిది నశించుట లోకమున నెచ్చటను వినలేదు, కనలేదు. 'వంధ్యాపుత్రుడు మరణించెను' 'శుక్తి రజతము భస్మమయ్యెను' అను వాక్యములవలె వ్యర్థభాషణములు కదా? ఈ మార్పునంతయు చూచు సాక్షి ఒకడుండవలయునుకదా? అట్టివాడు లేకపోయినచో యిది తెలియుటెట్లు? సాక్షి నంగీకరించిన అతడు నాశరహితుడు, నిత్యుడు, మార్పులేనివాడని అంగీకరించినట్లే కదా? నిత్యుడగు సాక్షి ఒకడుండగ, శూన్యమనుమాటకు అర్థమేమున్నది? సాక్షి నశించెనని చెప్పిన అట్టి సాక్షి నాశము నెఱుగుట కింకొక సాక్షి ఉండవలయునుగదా! ఇది ముక్తులైనవారికే వర్తించునట. బంధముక్తులు లేరని 'ముక్తి' అను వారు మూర్ఖులని వేనోళ్ల చాటిన దీక్షితులవారు 'ముక్తులైనవారు'

అని అనుట వింతగదా! ముక్తి యెవరికి? నిత్యుడగు వానికే గదా ముక్తి? బంధమున నున్న వారైనను ఒకానొక కాలమున ముక్తులైన శూన్య మగుదురా?

శూన్యమతము జ్ఞానేశ్వర స్వాములవారికి సమ్మతము కాదు. వారి వాక్యముల నిచట నుదాహరింతును.

“మఱియు నీయాత్మ స్థితి రహితంబై విరాజిల్లు నన్నచో దత్స్థిత్యభావంబు నేనియుఁ దెలియంగల నరుం డెవ్వండగు.” (అను. 4-26).

“ఇట్లగుచో శూన్యవాదంబున కాధారంబెద్ది యగు? అయ్యది సత్పదార్థవిషయంబునఁ గేవల మసంబద్ధంబగు దోషారోపణంబ యనంజెల్లు.” (అను. 4-27).

ఈవిధముగా పదునైదు ఛందములతో శూన్యవాదమును శ్రీ జ్ఞానేశ్వరులు ఖండించిరి.

“దీక్షితులవారు చెప్పిన బట్టబయలు అరూపబ్రహ్మమేనా? అని నీ వడిగితివి. ఇప్పుడు వారి బట్టబయలు నేదో నీవే నిశ్చయించుకొనుము. దీక్షితులవారు బట్టబయలును అరూపబ్రహ్మమనిగాని, నిష్ప్రతియోగిక బ్రహ్మమనిగాని వారెచ్చటను చెప్పియుండ లేదు.

జిజ్ఞాసువు :- శశవిషాణము, వంధ్యాపుత్రుడు అనునవి శబ్దమాత్రమేగాని భావ పదార్థములు కావను భావము మనకు కలుగుచున్నది కదా? అట్లే శూన్య విషయమున గూడ నేల యూహింపరాదు?

వేదాంతి :- అట్లూహించియే యెవరెట్టి భావము కల వారో వారట్టి దానినే పొందుదురని తేజో బిందూపని షత్తునం దిట్లు చెప్పబడినది :—

మం॥ భావవృత్త్యాహి భావత్వం, శూన్యవృత్త్యాహి శూన్యతా,
బ్రహ్మవృత్త్యాహి పూర్ణత్వం తయాపూర్ణత్వమభ్యసేత్.

(1-42)

తా. ఏవృత్తి నభ్యసించినవాడు దానిని పొందు చున్నాడు. శూన్యవృత్తి వలన శూన్యమే యగును. బ్రహ్మ వృత్తి నభ్యసించుటవలన బ్రహ్మమే (పూర్ణత్వమే) యగును, కనుక పూర్ణత్వ మభ్యసింపుమని శ్రుతి తాత్పర్యము. మఱియు, ఆ శ్రుతియే యిట్లు చెప్పినది.—

మం॥ భావితం తీవ్రవేగేన యద్వస్తు నిశ్చయాత్మకమ్,
దృశ్యం హ్యదృశ్యతాం నీత్వా బ్రహ్మాకారేణ చింతయేత్.

(1-50)

ఈ మంత్రమునే శ్రీ శంకరులు "అపరోక్షానుభూతి యందు

శ్లో॥ భావితం తీవ్రవేగేన యద్వస్తు నిశ్చయాత్మనా,
పుమాం స్తద్ధి భవే చ్ఛీఘ్రం జ్ఞేయం భ్రమరకీటవత్. (140)

భ్రమరకీటన్యాయము ననుసరించి యెవడు దేనిని తీవ్రముగ భావించుచున్నాడో వాడదియే యగుచున్నాడని భావము. — కనుక దీక్షితులవారి శూన్యమును తలంపరా దని శ్రుతి తాత్పర్యము. దీక్షితులవారి శూన్యము బౌద్ధుల శూన్యము కాదు.

(౨౭) ఎఱుకకు బయలునకు సంబంధము లేదట

దీక్షితులవారు చెప్పిన బట్టబయలు ఏమీ లేనిదని ఉత్తదని అన్నారు. ఏమీ లేనిది అంటే యేమి? దానికి ఏ విశేషములు లేవనియేనా? "ఉత్తది" అన్నను అదియే అర్థమగును కదా! అద్వైతులు బ్రహ్మము నిర్విశేషమని చెప్పిరి. ఆ వాక్యములనే వీరీరీతిగా చెప్పిరని మనమూహించిన సరిపోవునా? ఉత్త బట్టబయలునకు జ్ఞానము లేదు. అది తనకు తానెఱుగదు. ప్రపంచమును అనగా: 'ఈ మూలము లేని గుర్తెరిగే శరీరమును" ఎఱుగదు. ఎఱుకే ఎఱుకను బయలును ఎఱుగుచున్నది. ఎఱుక బయలు నెఱిగి యేమీ లేకపోవుచున్నది. అని వీరి సిద్ధాంతము. ఇందులో గల సంశయమిది:- బయలు నెఱిగిన యెఱుక వెంటనే యేమీ లేక పోవునట కదా! అట్లయిన బయలు కలదని ప్రతీతి యెట్లు కలిగినది? చూచిన యెఱుక వెంటనే నశించెను. ఉన్న బయలు తన ఉనికియే యెఱుగదు ఈ యంశము లోకమున కెట్లు తెలిసినది?

బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి (ముండక 3-2-9) "బ్రహ్మైవస బ్రహ్మవిదో" అని శ్రుతి. అనగా:- బ్రహ్మము నెఱిగినవాడు బ్రహ్మమే అని తాత్పర్యము. పరిపూర్ణమును యెఱుక యెఱిగిన దన్నచో యెఱుక పరిపూర్ణమే కావలెను. ఏలయన పరిపూర్ణము పరిపూర్ణముచే కాక మఱియొక దానిచే యెఱుగబడిన యెడల పరిపూర్ణము దృశ్యమగును. ఏది దృశ్యమగునో అది నశించును. పరిపూర్ణమునకు నాశము లేదు. కనుక, దాని నదే యెఱుగవలయును. అట్లుగాక పరిపూర్ణము

వెలుగబడినదన్న దాని నెఱింగిన ద్రష్ట మఱియొక డున్నాడని అంగీకరింపవలసి వచ్చును. అట్లైన వెలుగబడిన వస్తువు పరిపూర్ణము కాదు. అది పరిమితమైనదే. పరిపూర్ణమును (బయలును) వెలుక వెలిగినదన్న యిట్టి చిక్కులు అనేకములు కలుగును. ఆత్మ తనను తా నెలుగ లేదని జ్ఞానేశ్వరులవారి సిద్ధాంతము. అయినను ఆత్మ శుద్ధ జ్ఞాన స్వరూప మే యని అంగీకరించిరి. కనుక జ్ఞానేశ్వరులు చెప్పిన ఆత్మకును, దీక్షితుల వారు చెప్పిన బయలునకును సామ్యము లేదు. రెండును ఒకటి కావు.

వెలుక బట్టబయలునకు పుట్ట లేదట. బట్టబయలు పుట్టించను లేదట. వెలుక యెట్లో వచ్చినదన్నారు. దాని రాకడ యెవరికి తెలియదన్నారు. బట్టబయలునకు వెలుకకు నెట్టి సంబంధము లేదన్నారు. అంటే - వెలుక బయలు యొక్క అంశమని గాని, దాని ఛాయ అనిగాని కాదనియే వారి సిద్ధాంతము. "వెలుక కానిది బట్టబయలు". "బట్ట బయలు కానిది వెలుక" అన్నారు. సరే, దీక్షితుల వారి మతానుసారము సర్వత్ర బట్టబయలే యున్నది కదా! వెలుక యెచ్చటినుండి వచ్చినను బట్టబయలు నుండే రావలెను కదా? బయలు లేనిచోటు లేదు. అది అఖండము. అఖండము కనుక అద్వితీయము. కనుక వెలుక వచ్చినదంటే దానినుండియే రావలెను. అచలమునకు పుట్టిన వెలుక అచలము యొక్క బిడ్డయే. లేదా, దాని అంశమే. అంశమని అన్నయెడల పరిపూర్ణమునకు పరిచ్ఛిన్నత వచ్చునేమో యని సంశయింపవలదు. అట్లు రాదు. ఘటము నందున్న ఆకాశము మహాకాశము యొక్క అంశమే కదా?

పరిపూర్ణము యొక్క అంశమే. ఎఱుక (ఆత్మ) అని చెప్పిన సరిపోవును. ఆ విధముగా చెప్పిన అది శ్రుతి స్మృతులకు సమ్మతమే. అది అద్వైతమే అగును. ఏమైనను బట్టబయలు నుండి యెఱుక పుట్టినదని వారంగీకరింపక తప్పదు. కాని దీక్షితులవారు "ఎఱుక పుట్టనేలేదు పుట్టని యీ ప్రపంచము జోడే కూడదు" అన్నాడు. ఎఱుక పుట్టలేదనిన పరిపూర్ణము కలదని యెఱిగినవా రెవరు? ఈ ప్రశ్నకు సమాధానము కలదా? దీక్షితులవారి అనుయాయు లెవరైన నిందులకు సమాధానము చెప్పగలరా? ఇట్టి చిక్కులు లేకుండుటకై శ్రీశంకరులు మాయ బ్రహ్మమునకంటె భిన్నమనిగాని అభిన్నమనిగాని చెప్పుటకు వీలులేని దనిరి.

అచలవేదాంతులకు పరమ ప్రమాణమని చెప్పబడు చున్న 'అనంతోపనిషత్తు' నందు :—

శ్లో॥ బాహ్యామధ్యేచ జాతంతు బాహ్యామధ్యేచ నశ్యతి
సముద్రే మత్స్య కూర్మాద్యాః యథా చరతి జంతవః
తథా చరతి బాహ్యాశ్చ మధ్యే సర్వ చరాచరమ్
సర్వం బాహ్యాగతం నిత్యం అచలం చావ్యయం సదా. (19)

తా॥ సముద్రమునందు పుట్టిన జలచరములు అందే నివసించి అందే నాశమొందునట్లు బయలు మధ్యమునందుఁ బుట్టిన సమస్త చరాచరంబులును ఆ బాహ్యామధ్యమందే నివసించుచు అందే లయించుచున్నవి. ఆ బాహ్యా యొక్కటియే నశింపక స్థిరముగానున్నదని నిశ్చయింపవలెను.

శ్లో॥ యదేవ జాత మిత్యుక్తం తదైవ నశ్యతి ధ్రువు
తస్యాపి కారణం నాస్తి సత్యం సత్యం పునః పునః. (21)

తా॥ ఈవిధముగఁ జెప్పబడిన ప్రపంచాదులు దేని యందుఁ బుట్టుచుండునో దానియందే లీనమగుచుండును. దానికి (బయలునకు) గారణమనునది లేదు. ఇదియే సర్వ విధములచేతను సత్యమని యెఱుంగుము.

సమర్థులవారు చెప్పినట్లు యెఱుక (ప్రపంచము) బయలునకే కలిగినదను వాదమునే పై శ్లోకములు దృఢ పరచినవి. బయలునకు మూలము లేదుగాని జగత్తునకుఁ ఎఱుకకు మూలము బయలని దృఢపడినది. దీక్షితులవారు అనంతోపనిషత్తునకు విరుద్ధముగా నిట్లనిరి :—

"ఈ ఉత్త బట్టబయలందు యేమియు పుట్టలేదు. పుట్టిన దనుటకు యేలాగున నోరాడును." (బృ. పూ. పు. 45)

"యీ వుత్త బట్టబయలు చెడి యెన్నడు శరీరాకారం కాలేదు, వెనుకటికి కాలేదు. యిప్పటికి కాలేదు. ముందరా కాబోదు. సార్వకాలం రొండోప్రకారంకాక వొక్కతీరుగనే యున్నది. పప్రపంచానకు ఈ ఉత్త బట్టబయలు కారణం కాదు. తానే పుట్టని చావనిది. ప్రపంచాన్ని యేలాగున పుట్టించె."

(బృ. పూ. పు. 121)

"యీ శరీరం జోలి యీ బట్టబయలుకు పట్టను. బట్ట బయలు జోలి యీ గుర్తెరిగే శరీరానికి పట్టదు."

(బృ. ఉ. పు. 88)

దీక్షితులవారి యీ వాక్యములు అనంతోపనిషత్తునకే గాక శ్రీజ్ఞానదేవ, సమర్థరామదాసస్వాములవారి సిద్ధాంతములకు సంయితము విరుద్ధమని యింకను చెప్పవలయునా ?

నిర్గుణబ్రహ్మము నుండి సగుణజగత్తు కలిగిన దని చెప్పినను, నిర్గుణ బ్రహ్మము జగద్రూపమున పరిణమించిన దనినను, లేదా, ఆత్మయొక్క లీలావిలాసమే జగద్రూపమున అయినదనినను, ఇట్టి సిద్ధాంతములు తర్కము నెదుట నిలువజాలవని (వెనుక ప్ర. 1-19 వ అధ్యాయమున శ్రీశంకరుల అజాతవాదమును గుఱించి చెప్పిన సందర్భమున) విశదీకరించియుంటిని. అచ్చట ఏ కారణముల చూపి పై సిద్ధాంతములు తర్కహత మగుచున్నవని చెప్పియుంటినో ఆ కారణములు శ్రీ శంకరాద్వైతులు చెప్పియున్నవే. ఆ కారణములను పరిహరించుట కష్టమని దీక్షితులవారో వారి గురువులో యోచించి యెఱుకకు బయలునకు సంబంధము లేదని ఎఱుక (ప్రపంచము) బయలునుండి కలుగ లేదని క్రొత్త మార్గమును త్రొక్కిరి. ఈ మార్గము దోషము లేనిదని తలచియుందురు. ఈ యూహ శ్రీ జ్ఞానేశ్వరాదులకు తెలియదా ? తెలియదని తలంచినవారు వెఱ్ఱివారు. ఎఱుక యెచ్చటనుండి యెట్లు వచ్చినను సర్వవ్యాపియగు బయలు నుండియే రావలయును గాని వేఱు మార్గము లేదని బాలురైనను అర్థము చేసికొనగలరు. దీక్షితులవారి వాక్యములివి :— "నీవు అది యెన్నటికి కావు." (బృ. పూ. పు. 109) "దాని కదే దీని కిదే." (బృ. పూ. పు. 54) కనుక బయలు

యొఱుక కానపుడు ద్వైతమే సంభవించెను. దీక్షితులవారు తమ మతము "మహాద్వైతము" అని చెప్పుకొనియున్నారు. (బృ. ఉ. పు. 133)

దీక్షితులవారి మూడు మంత్రములను గుఱించి తగినంత చర్చ జరిపితిమి. అయినను వారి అచలబోధను పూర్ణముగ తెలిసికొనవలెనని వారికి వైదికమతముపైగల అభిప్రాయమును కూడ కొంత తెలిసికొనుట మంచిది.

(౨౮) దీక్షితులు చేసిన వేదనింద

ఒకచోట దీక్షితులవా రిట్లు వ్రాసిరి :—

"పురాణాలు అప్రమాణమే. పరమాత్మవలన అహంకారము పుట్టనే లేదు. పుట్టని అహంకారమువలన పుట్టినవి లేని తామస పురాణాలు అప్రమాణం. వేదములు వట్టి మాయ. మాటలు యేలాగున అబద్ధమో అలాగే అబద్ధం. యీ ఉత్త బట్టబయలే సత్యం. పుట్టలేని ప్రపంచమే అసత్యం. మతాలు అడవి త్రోవ. చీ తలచరాదు. (బృ. పూ. పు. 171)

"ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, తత్త్వమసీ బ్రహ్మ, అయమాత్మాబ్రహ్మ మని వేదవాక్యములు నాలుగు గలవనియు, అవి గురూపదేశముగ విచారించవలెనని చెప్పుచున్నారు. అదే ముందుగా విచారించెదము. ఆ మహావాక్యమునకు చిగురుకొమ్మ కాయలుగా ఎంత అర్థమున్నను క్రియాపర్యవసానము బ్రహ్మమే నీవు, నీవే బ్రహ్మమని చెప్పుచున్నది. ఇందుకే తామసము గలుగుచున్నది. ఇది విచారించినచో ఆకాశమును పిడికిట బట్టి పదే పదే పొడచినట్టుగాను ఆకలిగొని పొట్ట

దంచుకొన్నట్టుగాను గొంగడిలో అన్నము దిని దాహమై ఎండ మావులు జూచి పరుగులెత్తినట్టుగాను నున్నది. గాని సంతోష మేమియు కనపడలేదు." (బృ. పూ. పు. 132)

"శృతి॥ అయమాత్మా బ్రహ్మ అనే శృతి అబద్ధ మాడించి ఛీ ఛీ ఆలాగున అనరాదు. *వేదవాక్యం మహా ప్రమాణమైంది. యీ గుర్తెరిగే క్షేత్రజ్ఞస్వరూపమనే పరా ప్రకృతి అదిష్ఠానం గనుక యీ గుర్తెరిగే చైతన్యమనే చిత్ ప్రకృతి సాక్షిణీ గనుక ...." (బృ. ఉ. పు. 153)

"నగురోరధికం" అని శాస్త్రములయందు కలదు. శాస్త్రములు సిద్ధాంతములే. శాస్త్రదృష్టము కలుగవలెను. శాస్త్రదృష్టము లేని గురూపదేశము యెన్నడు చేయరాదు. (బృ. పూ. పు. 39) మఱియొక చోట ఆరూఢునకు శాస్త్రములతో పని లేదనియు, ఆ రురుక్షువునకు మాత్రమే శాస్త్రములతో అవసరమనియు, దీక్షితులవారు చెప్పియున్నారు. (బృ. పూ. పు. 140). ఇట్లు పరస్పర విరుద్ధాంశము లనేకములు గలవు.

(౨౯) మత నిరసన

మతమునందలి కర్మానుష్ఠానమును గుఱించి దీక్షితుల వారి అభిప్రాయము :—

* "ఛీఛీ ఆలాగున అనరాదు. వేదవాక్యం మహాప్రమాణమైంది." అను వాక్యములు వేదములను హేళనచేయుటయే గాని వేదములు ప్రమాణములని అంగీకరించుట కాదని స్పష్టమే. వేదశాస్త్రములను అప్రమాణములని అనరాని మాటలన్నియు అని తిరిగి పై విధముగా చెప్పిరి. కాన వేదప్రమాణ మంగీకరించిరని భావింపరాదు.

"నోట ప్రసంగాలు మొదలుపెట్టితే ఒడి చదువుకో తెస్సా: చదువు నేర్చుకోవయ్యా! నేర్చుకొని అనంతమైన వేదాలు చదువుకో: శాస్త్రాలు చదువుకో: యజ్ఞాలు చెయ్యి. చేయించు: మహాపెద్దలు అనిపించుకో: కుక్కలవలె మొరుగు. గాడ్దెలవలె కయ్యి. పందులవలె చూచింది అల్లా యెగబడి తిను. ఆవులవలె పుచ్చ త్రాగు. పేడ తిను. కాశీ రామేశ్వరం పో: తీర్థాలు చేస్తూవుండు. కొనకు కుక్కకు యేది గతో నీకూ అదే గతి. యీ భ్రాంతిలేని రాజమార్గం సాధనలుచేత సాధ్యంకానిది. విచారణచేత అతి సులభమైంది. (బృ. ఉ. పు. 137, 138)

భగవదవతారముల గురించి దీక్షితులవారి అభిప్రాయమిది:—

ఈ ఉత్త బట్టబయలు వలన భగవానులు పుట్టనేలేదు. పుట్టని చావని వాడని గీతల్లో వుండనే వున్నది. పుట్టని చావని వాడు అయోధ్యలో యేలాగు పుట్టె. పదహారువేల గోపికలు* అష్టభార్యలు అనే మాటకు మూలంలేదు. (బృ. పూ. పు. 169)

ధర్మశాస్త్రములయందు చెప్పిన ప్రాయశ్చిత్తములను గురించి దీక్షితులవారి అభిప్రాయము.

"తిన్నదల్లా అన్నమే: వెల్లిందల్లా పురీషమే కాని మనిషిది బ్రష్టుది. గోవులది, బర్రెలది, ఎడ్లది, దున్నపోతులది, మేక

* పదునారువేల క్షత్రియ కన్యలను భగవానుడు వివాహమాడి నట్లు పురాణములయందు చెప్పియుండగా దీక్షితులవారు పదహారువేల గోపికలని వ్రాసిరి. ఇది తప్పు.

లది, గొర్రెలది, పనికి వస్తుంది. గోవులది శ్రేష్ఠమని శాస్త్రం పేడ తినిపించింది. మూత్రపానం చేయించింది. చేయరానివి ఎన్ని వున్నాయో అన్నీ శాస్త్రాలచేత మూలంలేని యీ గుర్తరిగే శరీరమే చేసి చేయించింది. పుట్టని చావని బట్టబయలు ఏమీ చెప్పలేదు. ఏమి చెయ్యదు." (బృ. ఉ. పు. 99)

దీక్షితులవారు హిందూమతమును నిందించిన విధమును చెప్పితిని. శ్రీకృష్ణభగవానుడు యిందుకు విరుద్ధముగా భగవద్గీతయందు చెప్పిన వాక్యముల వివరింతును :—

శ్లో॥ సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత,
కుర్యా ద్విద్వాం స్తథాఽ సక్త శ్చికీర్షు ర్లోక సంగ్రహమ్.

(గీత. 3-25)

తా॥ అర్జునా! అనాత్మజ్ఞులు కర్మమునందే ఆసక్తులై ఏప్రకారముగా కర్మలను చేయుచున్నారో ఆ ప్రకారముగా జనులను దుర్మార్గప్రవర్తనమును నివారించుటకు యత్నించిన ఆత్మవేత్త సంగవర్జితుడై కర్మలను చేయవలయును.

శ్లో॥ న బుద్ధి భేదం జనయే దజ్ఞానాం కర్మసంగినాం,
జోషయే త్సర్వకర్మాణి విద్వాన్ యుక్త స్సమాచరన్.

(గీత. 3-26)

తా॥ ఆత్మవిదుడు, కర్మమం దాసక్తికలిగిన అవివేకులను వారి బుద్ధికి చలనము కలుగునట్లు (అనగా కర్మలను నాస్తికబుద్ధితో వదలుకొనునట్లు) చేయకూడదు. అట్లు చేసినయెడల కర్మలను వదలుటవలన పుణ్యఫలమును లేనివారై జ్ఞానహీను లగుటవలన తత్త్వజ్ఞానమునకు

దూరులై రెంటికిని చెడినవా రగుదురు. విద్వాంసుడు సయితము కర్మలయం దాసక్తికలవానివలె కర్మలను చేయుచు వారివలన కర్మములను చేయింపవలయును.

ఈ విధముగా భగవద్గీతకు దీక్షితులమతము ప్రత్యక్ష విరుద్ధము. సమాజమునకు నాశము చేకూర్చునదియని అర్థమగుచున్నది.

(౩౦) రాజయోగ నిరసన

రాజయోగమును గుఱించి దీక్షితులవారి అభిప్రాయము యీ క్రింద కనబరచిన విధముగా నున్నది :—

"యోగాభ్యాసం చేసెనా గుర్రెరిగే దొమ్మరివానివలె సాధించి వొక్కనాడు పడి చస్తాడు." (బృ. పూ. పు. 58)

"రాజయోగసమాధి లేక హఠయోగము సిద్ధించదు. హఠయోగములేక రాజయోగము సిద్ధించదు. అని వేదాంత వార్తికము మొదలైన గ్రంథములయందు చెప్పబడుచున్నది. రాజయోగమనగా సంసారమున నుండి దారాపుత్రాదుల సంరక్షణ చేయుచు ఎరుకను మరువక ఎరుకే నిత్యమని తలచుచూ దేహాశక్తి వదిలి మనోలయము చేయుచుండుట రాజయోగమని చెప్పుదురు." (బృ. పూ. పు. 130)

"అనగా ఈ సుఖదుఃఖములు యెటులైనను దప్పవు గాని, పైనుండి యోగాభ్యాసము వలన కలిగే ఆయాసములను ఎందుకు పొందవలెను. యోగాభ్యాసమువలన ఆయాసము గలుగునా యనిన యెడల గలుగును. ఎలాగున అనగా,

"ఆహారనియమమువలన క్షుద్బాధ మొదటి ఆయాసము. ఇచ్ఛావిహారముగా దిరుగుచుండేవానికి దేహము నిక్కబెట్టి కదలక కూర్చుండుట వలన దేహాయాసము కలుగును. కనులు, ముక్కు మొదలైనవి మూసికొనుట వలన కనులకు విరోధము. కనుక యోగాభ్యాసము వలన దుఃఖములు కలుగును కదా? ఆనందము గలుగుననుటకు ఆ యానందము అతనికేమి దృష్టమో కాని ప్రపంచమునకు ఏమియు కనపడదు. ఆనందపరుడని యందురు. విషయానందమునే ఆనందమనవలె గాని బ్రహ్మానందము లేనేలేదు. ఎందుచేతననగా బ్రహ్మమునకు రూపమైనా కలదని ప్రతిపాదించితే ఆ రూపమైనా చూచి ఆనందపడుచున్నారని అనవచ్చును." (బృ. పూ. పు. 131, 132)

"యోగసాధనములు రోగాస్పదములు."

(బృ. పూ. పు. 154)

(౩౧) శ్రీ శంకరాచార్యాదుల నిందించుట

శ్రీ శంకరాచార్యుల యందును, అద్వైతము నందును దీక్షితులవారికి గల ద్వేషము, నిరసన యీ క్రింద వివరించితిని :—

"శంకరాచార్యులవారికి అహంభావము లేదు. శివోహమ్మనుట వాచ్యార్థము." (బృ. పూ. పు. 18)

"శంకరాచార్యులవారేగదా అద్వైత స్థాపన చేసినది. వారికి అహంకారము వదలలేదు." (బృ. పూ. పు. 33)

ప్రథమమున అద్వైతస్థాపన చేసినవారు శ్రీ శంకరాచార్యులవారు కారు. వారికంటె పూర్వమే ప్రసిద్ధిగాంచిన ప్రస్థానత్రయములకు, శ్రీ శంకరులు అద్వైతపరముగు భాష్యములను రచియించి, అద్వైత మొక్కటే సంసారమునుండి తరించుటకు తరణోపాయమని ప్రచారము చేసిరి. ఈ సందర్భమున శ్రీ వివేకానందస్వాములవారి వాక్యములను యీ క్రింద నుదాహరింతును.

"శంకరాచార్యులవారు అద్వైత సిద్ధాంతమునకు మూలకర్త యని మీరు తలంపకూడదు. ఏది శంకరాచార్యులు పుట్టుటకు పూర్వము యుగాంతరములనుండి వచ్చుచున్నదో దాని తుదిప్రతినిధులలో ఈయన ఒకరు."

(వి. సం. గ్రం. వేదాంతము. 6-430)

ఈ సత్యము సామాన్య వేదాంతికి సయితము తెలిసియుండగా దీక్షితులవారికి తెలియక పోవుట దురదృష్టకరము.

గురుశిష్యసంవాద రూపమున వా రిట్లు చెప్పిరి:—

"గురువు — ఓయి శిష్యుడా! నేను బ్రహ్మను, నేనే శివుడను, నేనే విష్ణువును, నేనే జగత్తును, నేనే గురువును, నేనే శిష్యుడను. అన్నియు నేనే అని యనుట ఎటువంటిది. కనుక నే ఆత్మస్తుతి యనిపించుకొనెను. ఆత్మస్తుతి యనగా ఇంతకన్నను వేరుగలదా? నేను శివుడను, నేనే దేవుడను, నేను బ్రహ్మను అని యనుట ఆత్మస్తుతి గాదా! అది అహంవృత్తి గాదా! తానే బ్రహ్మదేవుడా? సకల జగత్తును తానే కల్పన జేయుచున్నాడా? తానే విష్ణువా? అందరిని తానే పోషించు

చున్నాడా? తానే శివుడా? అందరిని తానే లయము చేయు చున్నాడా? అందరిని తానే లయము చేయువాడైతే తన మనో లయమునకు ఇన్ని అగచాట్లు ఎందుకు? తానే బ్రహ్మమని అంటున్నారుగదా? బ్రహ్మము నిర్వికారుడుగదా? నిర్వికారునకు నే ననువృత్తి లేదుగదా? అయితే నే ననేవృత్తి బ్రహ్మమైన తనకు ఏలాగున గలిగెను? ఈ మొదలైన సందేహములచేతనే వేదాంతము ఆత్మస్తుతి యని చెప్పుచున్నాను........"

(బృ. పూ. పు. 134)

మహావాక్యముల అర్థమును గురించి దీక్షితులవారి వాక్యములు ఇదివఱకే (3వ అధ్యాయమున) చెప్పి యుంటిని. వానిని పై వాక్యములతో కలుపుకొని విచా రించిన యెడల పూర్వ మొకనికి రామాయణమంతయు వినిన పిమ్మట సీతకు రాము డేమికావలయు" నన్న సంశ యము కలిగెనట. ఆవిధముగనే దీక్షితులవారి వాక్యముల వలన వీరికి అద్వైత (వేదాంతము) తెలియునా? తెలియదా? అను సంశయము కలుగుచున్నది. శ్రీ శంకరుల వారు 'శివోహం' అనుట అహంకారము కాదు. ఏల యన:— 'కాలటి' అను గ్రామమున నంబుద్రీ బ్రాహ్మణకుటుంబ మున 'శివగురు' వను తండ్రికి 'సతి' అను తల్లికి జన్మించి శంకరాచార్యులను నామధేయము గల నేను (వ్యక్తిని) మాత్రమే శివుడను, ఇతరులు అనగా — ప్రపంచము నందున్న యెవరును శివుడు కాడు" అని శ్రీ శంకరులు చెప్పి యుండిన అది అహంకార మనబడును. కాని, శంకరులవా రిట్లు ఎచ్చటను చెప్పియుండ లేదు. వారు చెప్పిన దాని

తాత్పర్య మేమనగా :— 'అహం' శబ్దవాచ్యుడైన జీవుడే శివుడు. ఉపాధి భేదము తప్ప స్వరూప భేదము లేదు. అట్లే ఆత్మకును పరబ్రహ్మమునకు భేదము లేదనిరి. ఇది శంకరుల వారి కల్పన కాదు. శ్రుతి ప్రసిద్ధమగు విషయము. 'నేనే మనువును' 'నేనే సూర్యుడను' అని వామదేవమహర్షి ప్రతిపాదించెను. ఈ విషయము బృహదారణ్యక శ్రుతి ప్రథమాధ్యాయము 4-వ బ్రాహ్మణమునందలి 10-వ మంత్రార్థమును చూచిన బోధపడును. శ్రీ జ్ఞానేశ్వరుల మతము సయితము సర్వము ఆత్మయే యని కదా?

'శివోఽహం' అన్నది ఒక్క శంకరుల వారేనా? 'అహంబ్రహ్మాస్మి' నేనే బ్రహ్మమును — అను మొదలగు మహావాక్యములు శంకరులవారు కల్పించినవి కావు. అవి శ్రుతివాక్యములు. అవి శ్రీ శంకరులకేగాక మతాచార్యుల యందనేకులకు ప్రమాణము లే. బ్రహ్మసూత్రములకు శివాద్వైతపరమగు భాష్యమును రచియించిన శ్రీకంఠాచార్యుల వారు మహావాక్యములు బ్రహ్మోపాసనకు సాధనములని అంగీకరించియున్నారు. ఉపనిషత్తులయందలి 'అహంగ్రహోపాసన'ను గురించి దీక్షితులవారు వినియుండరు. 'యద్భావం తద్భవతి' ఎవడు యేభావముతో యెల్లప్పుడు గాఢముగా (తీవ్రవేగముతో) దేనిని తలంచునో అతడు అదియే (ఉపాస్య వస్తువే) అగుచున్నాడని పెద్దలన్నట్లు పై యుపాసనవలన పాపవిముక్తియు జన్మరాహిత్యమును కలుగును. దీక్షితుల వారికి యీ విషయము తెలిసియుండదు. తెలిసియుండె నేని సుప్రసిద్ధులగు శ్రీ శంకరాచార్యులను వదలి ఒక్క శంకరులవారినే యుక్తాయుక్త విచక్షణలేక యేల విమర్శింతురు?

శ్రీకంఠ శ్రీరామానుజులిరువురును మోక్షదశయందును అహంకారముండు ననిరి. అహంకారము - ప్రాకృతము, దివ్యము (అప్రాకృతము) అని రెండువిధములు. ప్రాకృతాహంకారము దేహాదుల నాధారముగా చేసికొని యుండును. పరమేశ్వరుడను నేనే అనిగాని లేక నేను పరమేశ్వరుని అంశమనిగాని మోక్షదశయందుండు అహంకారము దివ్యము. ఈ అప్రాకృతాహంకారమునకు నాశనములేదు. ఇది ముక్తిప్రపదమని పై ఆచార్యుల అభిప్రాయము. ఈ యర్థము నెఱుంగక దీక్షితులవారు మఱియు నిట్లనిరి:—

"శంకరాచార్యులు దేహాది పదార్థాలను గుర్తెరిగే క్షేత్రజ్ఞ స్వరూపమనే పరాప్రకృతిని ఆత్మ అని అబద్ధమాడి యీ ఆత్మ బ్రహ్మ స్వరూపమని అన్నాడు. శ్రుతి 'అయమాత్మా బ్రహ్మ మనే అబద్ధాల శ్రుతిని ముందర బెట్టినాడు' జ్ఞాన స్వరూపం నిబద్ధి ఖర్మాలు అబద్ధం అని యెందుకు మొరగవలె? — గుర్తెరిగే చైతన్యము నిర్గుణం శరీరాలు సగుణం అని యెందుక కుయ్యవలె?" (బృ. ఉ. పు. 79)

"ఇటువంటి అప్రమాణంవలన యేమి లాభమోగాని బహు శ్రమపడ్డారు. దీనినుంచి ప్రజలకు సుఖము లేకపోయె. తనకు మహాపాపం ఘటించె. జగత్తుకు కారణం వున్నదని అబద్ధం ఆడి అందరినీ అడవిలో కలిపిరి, సంకర్లు చేసిరి. సంకర్లు నొకటే అని గుర్తెరిగే చైతన్యం నిబద్ధ అని దేహాదులు యేమీలేవని సంకర్లు చేసిరి, గుర్తెరిగే చైతన్యం ఒకటే అని నమ్మినవారికి నరకము తప్పకపోయె. స్వర్గం యిటువంటిదే

శరీరాలు కల్ల వాక్కే. శభాష శంకరాచార్యులవారు జ్ఞానం నిబద్ధి కర్మాలు అబద్ధం అంటే గుర్తెరిగే జ్ఞానం వున్నంతసేపు కర్మాలు వదలనే వదలవు." (బృ. ఉ. పు. 80)

"యింతేకాని శరీరంలేని గురుసాంప్రదాయం వున్నదని యెరుగక అద్వైతమనే అడవిలో పులిని దొరికించుకొన్నట్టు దొరికించుకొని గుర్తెరిగే సచ్చిదానందం, నేను అనుకొంచూ మనుపటికంటె రాగద్వేషాలు అధికమై అడవిపట్టె. శరీరమనే గుహలో పెద్దపులివలె, గుర్తెరిగే శరీరం నేను అని తెస్నా గుర్తెరిగి ఆవులు రాంగానే ఆవులను గుర్తెరిగి కదలక మెదలక గుండుక్రింద నతికి తప్పున పశువులను దొరికించుకొని పలహారం చేస్తూ వున్నట్లు యీ శరీరంలో గుర్తెరిగే చైతన్యం నేను అని నిశ్చయం గలవారు ప్రజలను క్లేశపెడుచారు. చైతన్యం చెయ్యదు. చేయించదు అనుకొంచూ సర్వము గుర్తెరిగిన తర్వాత చేస్తూ వుంచాడు, మధ్యమధ్య నాకు కర్తృత్వం లేదు అని అనుకొంచూ శంకరాచార్యులవారి సిద్ధాంతం దొడ్డది అని అనుకొంచూ నరకమనే శరీరంలో గుర్తెరిగే చైతన్య నేను అనుకొని పుట్టలో పాముపలె వాక్కెపెట్టెలో పాముపలె బుస్సూబుస్సూ మని అనుకొంచూ కాలం గడిపేవారేగాని నిజం విచారించిన పెద్దలు లేరు." (బృ. ఉ. పు. 98)

(౩౨) సీతాదేవిని నిందించుట

.... "రావణాసురుడు సన్యాసివేషం వేసుకొని స్త్రీని దొంగలించుకొని పోయినాడు. మూఢులకు దొడ్డది సీత. భ్రాంతి రహితులకు యేమీలేదు. సీత మూఢురాలు. గనుక సన్యాసి అని భక్తిచాత వుంటే యెత్తుకపోయినాడు, సన్యాసము మొద్దులకు.

మొద్దుసన్యాసిని నమ్మరాదు. మనిషిని కుక్కనుచేసి రాత్రి దానితో సంసారముచేసి మళ్ళీ కుక్కను చేస్తాడష. సర్వాత్మన సన్యాసిని నమ్మరాదు. తమరు చెడి యితరుల చెరిచేవాండ్లు. ఛీ ఛీ. సన్యాసులను స్మరించరాదు. జగత్తునకు కారణం వున్న దన్న వారి పాపం రెండోవానికి లేదు." (బృ. ఉ. పు. 80, 81)

దీక్షితులవారికి సన్న్యాసులపై గల కోపము సీతమ్మ వారిపై చూపిరి. సన్న్యాసిని గౌరవించడమే అమ్మవారు చేసిన తప్పట. వాక్యములు ఒక వేదాంత సంప్రదాయము నకు చెందిన గురుపీఠము నధిష్ఠించి అచలమత స్థాపకులని ప్రసిద్ధికెక్కిన వ్యక్తి (దీక్షితులవారు) చెప్పవలసినవి కావు. మన దేశప్రజలు అనేక వేల సంవత్సరములనుండి సన్న్యాసు లను గౌరవించుట ఆచారమైయున్నది. సీతాదేవియే ప్రథమ మున సన్న్యాసిని గౌరవించు సంప్రదాయమును నెలకొల్పి యుండలేదు. సన్న్యాసి యోగ్యుడా? కాదా? అని తెలిసి కొనవలయునన్న అతనితో సంభాషించిన అనంతరమే గదా నిశ్చయము కలుగును. ఒక మూఢురాలగు స్త్రీ సుమారు సంవత్సరకాలము నిరాహారియై జలపానమైనను చేయక నిద్రలేక మహాపాపాత్ములమధ్య శీలసంరక్షణ చేసికొనుచు భర్తృ నామస్మరణముతో బ్రతికియుండగలదా? సర్వమును దహించు అగ్ని సహితము ఆమెనుగాని ఆమె ధరించిన వస్త్రమునుగాని దహించుటకు శక్తిలేక పోవుట, అగ్నిదేవుడే స్వయముగా రూపము గైకొని సీతమ్మను పరమపావని యని చెప్పుట, యివి సామాన్యులకు గాని మూఢులకు గాని సాధ్యమా? ఇట్టి అతిమానుషమైన కల్యాణగుణములు గల మహాతల్లి సీతాదేవి. సీత లోకమాత యని శ్రుతులు,

స్మృతులు, పురాణములు, కావ్యములు వాల్మీకివ్యాస కాళిదాసాది మహనీయులు చెప్పియుండగా వీరందరు మూఢులా? దీక్షితులవారు సీతాదేవి సమగ్రచరిత్రమును చదివియుండరు. శ్రీమద్రామాయణమునందలి ఉత్తరకాండ యందు 17-వ సర్గమున వేదవతి చరిత్రకలదు. ఆ కథను సంగ్రహించి చెప్పెదను —

కన్యయగు వేదవతి, భగవంతుడగు శ్రీమన్నారాయణుడు తనకు భర్త కావలెనని మహాతపమాచరించుచుండెను. ఎట్లో రావణుడామె ఆశ్రమమునకు వచ్చెను. ఆమె రావణున కాతిథ్యమిచ్చి తనవృత్తాంతము వాని కెఱిగించెను. రావణుడు వేదవతియొక్క నిరుపమాన సౌందర్యమును చూచి కామమోహితుడై తన్ను వివాహమాడుమని కోరెను. వేదవతి తాను భగవంతుడగు నారాయణునితప్ప అన్యుని వివాహమాడనని వానిని తిరస్కరించి అచటినుండి వెడలిపోవుచుండ రావణుడామెను పట్టుకొనబోయెను. వాని చేతికి వేదవతి కేశముల (జడల) చివఱ (కొన) భాగము చిక్కెను. వేదవతి తనచేతితో రావణుని హస్తము నందు చిక్కిన కేశములను ఖండించి రావణునితో "నిన్ను శపించి యిప్పుడే అంతమొందింపగలను తపోవ్యయమునకునను భీతిచే శపింపక వదలుచున్నాను. నేను నీ వినాశమునకు అయోనిజనై జన్మించి శ్రీమన్నారాయణుని వివాహమాడుదును" అని చెప్పి మహాగ్నిజ్వాలయందు ప్రవేశించి దగ్ధమయ్యెను.

కొంతకాలమునకు లంకానగర సమీపమున ఒక

పద్మమునందు వేదవతి జన్మించెను. విధివిలాసమున రావణుడా పద్మమును అందున్న సర్వశుభలక్షణసంపన్నయగు శిశువును చూచి ఆ పద్మమును లంకకు తెచ్చి తన సచివునకు చూపెను. వాడును ఆ శిశువును చూచి 'ఈమె నీ యింట నుండిన నీకు మృత్యువు తప్పదని' యనెను. రావణుడా శిశువును సముద్రమున పారవైచెను. ఆమె మహాద్భుత శక్తి సంపన్నురాలగుటచే సముద్రమును దాటి భారతభూమియందు భూమిలోపలనుండియే మిథిలానగర ప్రాంత ప్రదేశమందు చేరి, అందుండెను.

జనకరాజు భూమిని దున్నుచుండ నాగేటిచాలున ఆ శిశువు కనిపింపగా ఆమెకు సీత యను నామకరణమిడి పుత్రికగా పెంచెను.

వేదవతి మొదటిసంకల్పము సిద్ధింప రాముడై యవతరించిన శ్రీమన్నారాయణుని వివాహమాడెను. రెండవ సంకల్పము సిద్ధించుటకు సీతమ్మ లంకానగరమును చేరవలసియుండెను. విధివిలాసమున రావణుడే సీతమ్మను లంకానగరమునకు కొనిచని సర్వనాశము పొందెను. తొలుత వేదవతి అగ్నిప్రవేశము చేసెను. సీతారూపమున మరల అగ్నియందు ప్రవేశించెను.

సీతారాములు మానవవేషధారులై తమ పాత్రలను జగన్నాటకరంగమున చక్కగా అభినయించిరి. ఈ కథను నమ్మినవారు ధన్యులు - మాన్యులు. సీతాదేవి చరిత్రను పూర్ణముగ అర్థముచేసికొన్న వారికి ఆ కథయందలి గంభీరతము తత్త్వమును బోధపడును. సీతాదేవినిగురించి విపుల

ముగ చెప్పుట కిచట చోటులేనందున చింతిల్లుచు చెప్పుటకు మానుకొంటిని. దీక్షితులవారికి సీతారాములతత్త్వమిట్టిదని తెలిసికొనగలుగు శక్తి లేదు. పాపాత్ముడును, లోకకంటకుడును నగు రావణుని నిందింప లేదు. సరికదా — రావణుడు బయలును ఎఱిగియున్నట్లు వ్రాసిరి.

"శంకరాచార్యులవారి అద్వైతము, రామానుజాచార్యులు వారి విశిష్టాద్వైతం సర్వం వారితోటే పోయింది. వున్నది ద్వైతాద్వైత రహితమైన పరమతత్త్వం. దశముఖుడు వేరే అన్నట్టు. యెక్కడబడితే అక్కడ బట్టబయలు వున్నది. ఈ గుర్తెరిగేది లేకుంటే యేలాగున్నదో ఆలాగే వున్నది."

(బృ. ఉ. పు. 29)

ఎక్కడబడితే అక్కడ బట్టబయలున్నట్లు రావణునకు తెలియునని అర్థమగుచున్నది. నేను చెప్పిన అర్థమే సరియైనచో రావణుడు బట్టబయలును చూచినాడని ఆయన అచలవాది అని తలపవచ్చునా? మహాత్ములకు సైతము దుర్లభమగు తుర్యాతీతమును రావణుడు పొందినాడా? రావణుడు శివుని స్తుతించి ఆయనవలన చంద్రహాసమును పొందినందున వీరశైవులు రావణుని శివభక్తులలో చేర్చుకొనిన చేర్చుకొందురుగాక. కాని రావణుడు పరిపూర్ణ మోక్షమగునని, తత్త్వజ్ఞాని యని యెవరును చెప్పలేదు. శివుడు సతీదేవితో రావణుడు పాపాత్ముడని చెప్పినట్లు శివపురాణమున గల యీ క్రింది పద్యమువలన తెలియగలదు.

శా॥ "పాపాత్ముండగు పఙ్క్తి కంఠునకు బల్ భాగ్యంబు లర్పించి"

(ఆంధ్రశివపురాణము. సతీఖండము. 1 - 235)

రావణుడు పరిపూర్ణ మెటులగ డనుటకు దీక్షితులవారు వేఱొకచోట "అహంకారమును వదలకనేకదా రావణాసురుడు నశించి పోయెను." (బ్ర. పూ. పు. 19) అని చెప్పిరి. అహంకారము వదలనివాడు పరిపూర్ణ మెట్లగును? ఇట్టి పరస్పర విరుద్ధమగు వాక్యములు దీక్షితులవారి గ్రంథమున అనేకములు కలవు.

(౩౩) బ్రహ్మాదులకు అహంకారము కలదట

మన దేశమునందు గల సమస్త సంప్రదాయముల వారికిని గురువునందు భక్తి కలిగియుండుట అందఱు ఎఱిగిన విషయమే. దీక్షితులవారి సంప్రదాయమునకు చెందిన వారి యందు గురుభక్తి మెండు. ఏ సంప్రదాయమువారైనను తమ గురుపరంపరను బ్రహ్మదేవునుండిగాని, విష్ణుదేవునుండి గాని, శివునినుండిగాని, దేవినుండిగాని, దత్తాత్రేయులనుండి గాని వచ్చినవని చెప్పుదురు. బ్రహ్మాదులు గురువునకు గురువులు, ఆ యా సంప్రదాయము వారికి ఆది గురువులు. దీక్షితులవారు వారి గురుభక్తిని యీ విధముగ ప్రకటించిరి:—

"అహంకారము విష్ణువునకు గలదు. బ్రహ్మకు అంత కన్న గలదు. శివునికి చెప్ప శక్యము గాదు. ముప్పైమూడు కోట్ల దేవతలకున్నూ గలదు. గురువునకు మాత్రము లేదు."

(బ్ర. పూ. పు. 71)

"గురువుకన్నను దైవము హెచ్చని పలుకకూడదు. దైవమునకైన అహంకారము గలదు గాని గురువు కెన్నటికి అహంకారము గలుగదు." (బ్ర. పూ. పు. 20)

ఈ వాక్యములవలన త్రిమూర్తులు దేవతావ్యక్తులని దీక్షితులవారి నమ్మకమైనట్లు ధృఢపడినది మంచిదే. దీక్షితులవారి గురువునకంటె త్రిమూర్తులు తక్కువవారెట్లయిరి? త్రిమూర్తులు బయలును చూడలేదనియేనా? పురాణముల యందలి కొన్ని గాథల నాధారముగాగొని త్రిమూర్తులకు అహంకారము కలదని వారట్లు చెప్పియుందురు. అంతేకాని దీక్షితులవారికి త్రిమూర్తులతో సాక్షాత్పరిచయము లేదు కదా?

భాగవతము దీక్షితులవారికి సమ్మతమైన గ్రంథము కదా! అందు మహర్షి వాక్యములుగా నిట్లున్నది :—

క॥ సత్యము ప్రభువుల వచనము
నిత్యముఁ దద్వచన వీథి నిలుతురు పెద్దల్
సత్యాసత్యము గావున
సత్యమనుచుఁ జనరు వారి చరితమున నృపా!

(ద. పూ. 1109)

ఈ పద్యమునందలి భావ మేమనగా :— ప్రభువులగు బ్రహ్మాదులు యేది చెప్పుదురో అది అంతయు సత్యమే. అందులో లేశమయినను అసత్యము కలదని శంకింపరాదు. ప్రభువుల వాక్యములే ప్రమాణమని భక్తితో నడచుకొన వలయును. కాని, ప్రభువులు యిట్టి కార్యములు చేసిరని యితరులుకూడ అట్టి కార్యములు చేయరాదు. అనగా: ప్రభువుల వృత్తమును ఆదర్శముగాగొని నడచుకొనరాదు. ఏల? వారి చరిత్రము సత్యము - అసత్యము, కూడ. కనుక వారి చరిత్ర సత్యమే యని వారివలె మనమును నడుచు కొనుట తగదు. పెద్ద లట్లు నడువరు.

దీక్షితులవారి గురుపరంపర సాందీపని శ్రీకృష్ణుల నుండి వచ్చినట్లు చెప్పిరి. బ్రహ్మాదులకంటె సాందీపని గొప్పవారా? సాందీపనికి కోరికలు లేవా? ఎప్పుడో మృతి జెందిన అతని (సాందీపని) పుత్రుని గురుదక్షిణగా తెచ్చి యిమ్మని బలరామ శ్రీకృష్ణులను కోరలేదా? ఇది కోర్కె కాదా? దీనివలన అహంకార మమకారములు ఉన్నట్లే కదా? లేకపోయిన లోకమున నందఱు తండ్రులు తమ పుత్రులను కోలుపోలేదు. వారి పుత్రుల నందఱిని బ్రతికించి తెచ్చియిమ్మని సాందీపని యేల కోరలేదు? అందఱు తండ్రులు తనవలెనే పుత్రశోకమును అనుభవించినవారే గదా. ఇది మమకారము కాదా? మమకారము అహంకార వృక్షముయొక్క శాఖయేగదా? బ్రహ్మదేవుడు ఒక్క భూరేణువును గైకొని అందుండి కోటి సాందీపనులను సృష్టించలేడా? బ్రహ్మాదులకు గల అహంకారము వేఱు. అది వారికొక లీల, అవిద్యాదోషముగల మానవుల అహంకారము వేఱు. దీక్షితులవారు యీ మాత్రము తాత్త్వికాంశములను వదలి త్రిమూర్తుల గుఱించి తెలియక యిట్టి మాటలాడిన హిందూమతేతరులు వ్రేలెత్తి చూపి 'మీ దేవత లిట్టివారని మీరే చెప్పుచున్నారే' అని హేళన చేయుదురు. దీనివలన యింతకంటెను వేఱొక ఫలము సిద్ధింపదు.

త్రిమూర్తులలో ఒకరగు బ్రహ్మదేవుని ఒక దేవతా వ్యక్తిగా దీక్షితులవా రంగీకరించిరి. కనుక, బ్రహ్మదేవుని యొక్క యోగ్యత యెంతటిదని పురాణములు వచించెనో దీక్షితులవారు ఆ విషయమును తెలిసికొనవలసిన బాధ్యత

కలదు. బ్రహ్మదేవుని గుఱించి పద్మపురాణము ముఖ్యముగా చెప్పినది. అది యట్లుండ భాగవతపురాణమునందలి ద్వితీయ స్కంధమున 5-వ అధ్యాయమున బ్రహ్మదేవుడు నారద మహర్షికి తన్ను గుఱించి చెప్పిన వాక్యములయందు పోతన గారి పద్యమొకటి యుదాహరింతును :—

సీ॥ ఇది యంతయును నిక్కమే బొంకనుత్కంఠ
మతిఁ దద్గుణ ధ్యానమహిమఁజేసి
పరికింప నేనేమి పలికిన నదియెల్ల
సత్యంబయగు బుధ స్తుత్య! వినుము
ధీ యుక్త! మామకేంద్రియములు మఱచియుఁ
బొరయవ సత్యవిస్ఫురణ మెందు
నదిగాన మత్తనువామ్నాయ తుల్యంబు
నమరేంద్ర వందనీయంబునయ్యె.

(ద్వి. 104 పద్యము)

ఇందులో బ్రహ్మదేవుని మహిమయు, తరువాత పద్యములయందు విష్ణుదేవుని మహిమయు వర్ణింపబడినవి. దీక్షితులవారు భాగవతమును సాంగోపాంగముగా చదువలేదనియు, ఒకవేళ చదివినారని అంగీకరించినను, ఇట్టి ఘట్టములయందలి విషయము వారి బుద్ధికి గ్రాహ్యము కాలేదనియు, చెప్పుటకు అవకాశమున్నది. బ్రహ్మదేవుని పై వాక్యములయందలి ఒక వాక్యము "ధీ యుక్త మామకేంద్రియములు మఱచియుఁ బొరయ వసత్య విస్ఫురణ మెందు" అను వాక్యము నొక్క దాని నాధారముగా గైకొని పింగళి సూరనార్యులు 'కళాపూర్ణోదయము' ను రచియించిరి.

(౩౮) శ్రీ జ్ఞానదేవ - శ్రీ దీక్షితుల దర్శన సమీక్ష

జిజ్ఞాసువు :- అయ్యా! దీక్షితులవారి సంప్రదాయమునకు చెందినవారు తమ మతము శ్రీ జ్ఞానదేవులనుండి పరంపరగ వచ్చినదని చెప్పుదురే నేను విన్నంతవఱకు ఆ రెండు మతములకు భేదము కనబడుచున్నది. ఆ మతములు యే అంశములయందు పరస్పరము భేదించునో మఱియొక పర్యాయము సంగ్రహముగ ఆనతిండు.

వేదాంతి :- చక్కగా గమనించితివి. వాటి మధ్యగల వైరుధ్యములయందు ముఖ్యమయిన వాటిని వరుసక్రమమున తెలిపెదను వినుము.

(1) శ్రీ జ్ఞానేశ్వరులు 'అనుభవామృత' మను తమ గ్రంథమును ఆరంభించుటకు మంగళాచరణమునందు వారి గురుదేవులగు నివృత్తినాథ నామధేయ పరబ్రహ్మమునకు నమోవాకంబు లర్పించుచు చెప్పిన మొదటి పద్యమందు పరమేశ్వర తత్త్వమును గూర్చి 'ఆనంద పూర్ణంబును

ననాదియు నిత్యము' అని వర్ణించిరి. 2-వ పద్యమున 'నవ్విశుద్ధజ్ఞాన స్వరూపున కత్యంత భక్తి పూర్వకంబుగ ప్రణామంబు గావించెద.' 5-వ పద్యమున 'ఆది మధ్యాంత రూపుడును దద్విలయకరుండును నగు నవ్విశుద్ధ శంభు మూర్తికి నతిభక్తిమై నమస్కరించెద.' అనియును పరమేశ్వర తత్త్వమును 'ఆత్మ' అనియు 'శుద్ధజ్ఞాన' మనియు తమ గ్రంథమున అనేక పర్యాయములు చెప్పియున్నారు.

దృశ్య సంబంధములేని ఆత్మను శుద్ధజ్ఞానమనియు,

దృశ్య సంబంధముగల ఆత్మను (వృత్తి) జ్ఞానమనియును ద్వివిధముగ పేర్కొనిరి. ఆత్మ శుద్ధజ్ఞాన స్వరూపమయినను ద్రష్ట కాదనిరి. (అను. 7-86) ఏలయన తనకంటె అన్యమగు పదార్థమును చూచినపుడే చూచినవాడు ద్రష్ట యని పిలువ బడును. ఆత్మ అద్వితీయమైనందునను, ఆత్మకంటె అన్య వస్తువు లేనందునను, ఆత్మకు ద్రష్టత్వము సంభవింపదు. ద్రష్ట కానంతమాత్రమున ఆత్మ (విశుద్ధజ్ఞానము) జడము కాదనిరి. "సాజంబుగ జ్ఞానంబై కొమరొప్పుచుండుటం జేసి య య్యాత్మ స్వవిషయ పరిజ్ఞానంబుఁ గలుగకుండు," (అను. 6-88) అనియును, ఆత్మజ్ఞాన మాత్రమగు వస్తువు గనుక సూర్యునియందు రాత్రింబవళ్ళు లేనియట్లు ఆత్మ తన్ను తాను మరుచుట జ్ఞప్తికి తెచ్చుకొనుట యనునవి ఆత్మకు లేవు. (అను. 6-17) అనియును చెప్పిరి. పరమేశ్వర తత్త్వమును గురించి జ్ఞానేశ్వరులవారి సిద్ధాంత మది.

దీక్షితులవారి సిద్ధాంతము :—

ఏమీ లేని ఉత్త బట్టబయలే అచలము. దానికి జ్ఞానము లేదు. అది జ్ఞానము కాదు. దానికి ఎఱుక లేదు. అది తనను తా నెఱుగదు. ఈ మూలము లేని గుర్తెరిగే శరీరాన్ని యెఱుగదు. అది యెట్టివనగా నిద్ర, మరణము, మూర్ఛ వీటితో పోల్చదగిన దనిరి. దీనివలన పరిపూర్ణము (ఉత్త బట్టబయలు) జడము. కనుక పరమేశ్వర (పరబ్రహ్మ) తత్త్వమును గురించి దీక్షితులవారి దర్శనముతో శ్రీ జ్ఞానదేవుల దర్శనమునకు యేకభావము లేదు.

(2) మనయెదుట మనకు తోచుచున్న యీ విశ్వమును గుఱించి శ్రీ జ్ఞానేశ్వరులవారి అభిప్రాయమిది :— శుద్ధజ్ఞానముయొక్క స్పందనమే విశ్వము. శుద్ధజ్ఞానమగు ఆత్మ తన్ను తానాలోకించుటయే ఆత్మస్పందనము (అను. 7-162, 165 నుండి 170 మఱియు 171, 245 నుండి 250 వఱకు) విశ్వము శివశక్తుల వలన కలిగినట్లు చెప్పిరి. (1-6) "ఈ రీతిగ సమస్త వస్తు సముదాయంబునకును మూలకారణంబై కొమరొప్పు నవ్విశుద్ధజ్ఞానము" (అను. 7-125) అనిరి. కనుక విశ్వమునకు మూలము ఆత్మయే.

దీక్షితులవారిట్లు చెప్పిరి :—

"ఈ ఉత్త బట్టబయలువలన సత్తు పుట్టనేలేదు. అసత్తు పుట్టనేలేదు." (బృ. ఉ. పు. 8)

యెషువంటి గడ్డితినేవాడు అయినా యీ బట్టబయలువలన ఈ శరీరాలు పుట్టినవనడు. (బృ. ఉ. పు. 109)

శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పిన శివశక్తిద్వయమునే దీక్షితులవారు 'ఈ మూలములేని గుర్తెరిగే శరీరము యేమీలేదు' అనే యీ మంత్రమునందే యిమిడ్చి చెప్పియున్నారనిన, అది సరికాదు. ఏలయన ? జ్ఞానేశ్వరులవారు చెప్పిన శివశక్తులు నిత్యమైనవి. అవి రెండును ఆత్మయందే లయమగును. దీక్షితులవారు చెప్పిన 'గుర్తెరిగే శరీరము' వంధ్యాపుత్రునివంటి దని రజ్జువునందు తోచిన సర్పము వంటి దని చెప్పిరి. కనుక రెండును ఒకటికాదు. దీక్షితులవారు మాయ నంగీకరించిరి. "ఇదే మూలమాయ. ఇదే గుర్తెరిగే శరీరం" అనగా : "నేనే మాయను" అన్నారు. "ఈ ఉత్త బట్ట

బయలు వలన మాయ పుట్టనే లేదు." (బృ. ఉ. పు. 12). కనుక జగత్తును గురించిన విచారమునందు శ్రీ జ్ఞానేశ్వర, శ్రీ దీక్షిత మతములు రెండును పరస్పర విరుద్ధములు.

(3) శ్రీ జ్ఞానేశ్వరులవారు తత్త్వమస్యాది మహా వాక్యముల విషయమున చెప్పిన అభిప్రాయ మిది :— "శబ్దము ఆత్మ స్వరూపమును ప్రత్యక్షము చేయజాలక పోయినను కేవలము నిరుపయోగమైనది కాదు. తత్త్వమస్యాది మహావాక్యములు స్వరూపమును జ్ఞప్తికి తెచ్చిన జ్ఞాపక చిహ్నము లేగాక రూపరహిత వస్తు విశేషంబులను సహితము జ్ఞప్తికి తెచ్చిన జ్ఞాపక చిహ్నములని చెప్పక తప్పదు. రూపరహిత వస్తు విశేషంబులను సహితము ప్రతిబింబింప జేయు దర్పణము." ... (అను. 6-1)

దీక్షితులవారు యీ విషయమున నిందులకు భిన్నముగ చెప్పిన వాక్యములను వెనుక (౨౬ వ అధ్యాయమునందు) చెప్పియుంటిని. కనుక వాటిని ఇచ్చట స్మరింపవలెను. ఈ యంశమునందును యిరువురు నేకీభవింప లేదు.

(4) శ్రీ జ్ఞానేశ్వరులు జీవాత్మ పరమాత్మల ఐక్యతను అంగీకరించిరి. 'జ్ఞానేశ్వరి' అను గీతా వ్యాఖ్యానమున వా రిట్లు చెప్పిరి :— "వాస్తవదృష్టితో చూచినయెడల జీవుడే బ్రహ్మ ...... 'నేను ఆత్మను' అను అనుభవము

ఏ పురుషునికి కలుగునో వ్యర్థమైనట్టియు, మిథ్యయైనట్టియు విషయములను ఎవడు అంగీకరించడో అతడే శ్రేష్ఠుడైన ఆత్మజ్ఞుడు అని నేను చెప్పుచున్నాను." (ఆంధ్ర. జ్ఞా. 6-6). "మైల లేక కల్తీ పూర్తిగా తీసివేసిన తరువాత శుద్ధమైన బంగారు మిగిలినట్లు సంకల్ప వికల్పములు గోడవ తొలగినంతనే జీవుడు తానే పరమాత్మ అయి నిలిచిపోవుటకు ఆరంభించును. ఘటము పగిలిన తరువాత దానిలోనుండు ఆకాశము ఇతర ఆకాశముతో కలసిపోవుటకై స్థానాంతరమునకు పోవ నవసరము లేదు. అట్లే మిథ్య అగు దేహాభిమానము నశించినను పరమాత్మరూపము అగుటకు ఎట్టి క్రొత్త యత్నము చేయ నవసరము లేదు. ఏలన జీవుడు మొదటి నుండియే పరమాత్మతో పడుగుపేకలుగా నిండియున్నాడు."

(ఆంధ్ర. జ్ఞా. 6-7, 8)

ఈ వాక్యములు ఉపనిషత్తులకును, శాంకరమతమునకును సమ్మతమైనవని వేరుగా చెప్పవలసిన అవసరము లేదు. ఈవిధముగా జీవాత్మ పరమాత్మలయొక్క అభిన్నత్వమును తెలియజేయు వాక్యములు జ్ఞానేశ్వరులవారెన్నియో చెప్పియున్నారు.

ఈ యంశమును దీక్షితులవారు చెప్పిన దానిని వివరింతును.

"నీవు అది యెన్నటికి కావు. అది నీవు కావు. నీకు దానికి చాల యెక్కువ తక్కువ వున్నది. అది మొదలు కొన

లేనిది. వుత్పత్తి స్థితి లయములు లేనిది. నీకు వుత్పత్తి స్థితి లయము వున్నది. కనుకనే చాల యెక్కువ తక్కువ."

(బృ. పూ. పు. 109)

"..... మూలంలేని యీ గుర్తెరిగే శరీరానకు వున్న సామర్థ్యము పుట్టని చావని దానికి లేదు." (బృ. ఉ. పు. 64)

"అచలానకు చంచలమైన శరీరానకు కొంచమైనా సంబంధము లేదు. సమస్తమయిన మహత్తులు యీ గుర్తెరిగే శరీరానవేగాని పుట్టని చావని అచలానకు నొక్కటైనా మహత్తు లేదు. ..... దాని కదే! దేని కదే! సంబంధము లేనిదే సంబంధం వున్నదని మూలంలేని గుర్తెరిగే శరీరమే అన్నది.

(బృ. పూ. పు. 53-54)

ఒకచోట దీక్షితులవా రిట్లు చెప్పిరి :—

"భ్రాంతి రహితం అయ్యే యుక్తి అద్వైతంవలె గుర్తెరిగే చైతన్యం నీవు అన్నట్టు కాదు. చిత్తులో చిత్తు విశిష్టం అన్నట్టు కాదు. ద్వైతం వున్నది అన్నట్టు కాదు. అంతా చైతన్యమనే సమరసజ్ఞానం అన్నట్టు కాదు."

పై వాక్యములో అద్వైత విశిష్టాద్వైత ద్వైతములను నిరసించిరి. క్రింది (కడపటి) వాక్యము సూటిగా శ్రీ జ్ఞానేశ్వరమతమును నిరసించుచున్నది.

(5) శ్రీ జ్ఞానేశ్వరులు పాతంజల రాజయోగమును గురించి ప్రశంసించిరి. వారు గీతయందలి ఆఱవ యధ్యాయ

మునకు వ్రాసిన వ్యాఖ్యానమును చూచిన యే భాష్యకారులుగాని ఆ విధముగ ఆ యధ్యాయమునకు వ్యాఖ్యానము వ్రాసియుండలేదేమో అని తోచును. వారి వ్యాఖ్యానమునందలి వాక్యముల కొన్నింటిని నిచట ఉదాహరింతును :— "... ఇది తత్త్వనిర్ణయమునకు మూలస్థానము. క్షీరసాగర మథనము తరువాత సమస్త రత్నములకు సారమైన అమృత మెట్టిదో, గీతాతత్త్వజ్ఞానముయొక్క సారము వివేకసాగరముయొక్క అవలిఒడ్డు. సమస్త యోగసంపత్తులయొక్క తెరచిన ధనాగారము — అయిన ఈ ఆరవ అధ్యాయము అట్టిది అనవచ్చును. ఈ అధ్యాయములోనే మాయ స్తబ్ధమై నిలిచిపోయినది. వేదవాక్యము ఇచటనే ఆగిపోయినది. ఇక్కడనుండియే గీతారూపమైన తీగ ప్రాకినది. నేనుకూడ సాహిత్యము ఉట్టిపడునట్లు అలంకారిక భాషలో దీనిని చెప్పుదును. మీరు శ్రద్ధగా వినుడు."

(ఆం. జ్ఞా. అ. 6)

"ఓ పార్థా! ఇప్పుడు ఈ యోగాభ్యాసమునకు రాజమార్గము నీకు తెల్పెదను వినుము. ఈ మార్గములో అనేక స్థలములలో ప్రవృత్తిరూపమైన వృక్షముల కొమ్మలలో నివృత్తిరూపములైన పండ్లగుత్తులు వ్రేలాడుచుండును. శంకరుడు ఇప్పటికి ఈ మార్గములో నడచుచున్నాడు. ఇతర యోగులుకూడ మొదట మొదట వేరు వంకర మార్గములలో చిక్కుకొన్నారు. కాని అనుభవము వచ్చినతరువాత తుదకు వారు ఈ రాజమార్గమును స్వీకరించినారు. వారు అజ్ఞానజనితములగు ఇతర వంకర మార్గములను విడిచి ఆత్మబోధ

రూపమగు ఈ సరళ మార్గమున అడ్డంకులు లేక ముందుకు పోవుచుందురు. యోగులేగాక గొప్పగొప్ప ఋషులుకూడ ఈ మార్గముననే నడచుచు సాధకావస్థను దాటి సిద్ధావస్థ వరకు చేరుదురు. గొప్ప ఆత్మవేత్తలును ఈ మార్గముననే పోయి శ్రేష్ఠత్వమును పొందిరి. ఈ యోగమనెడు రాజ మార్గము దొరకిన తరువాత, ఆకలి దప్పులు మొదలైనవి అన్నియును నశించును." (ఆంధ్ర. జ్ఞా. 6-6)

మరియొకచోట వారిట్లనిరి. ... "ఇది వినుచు మధ్య అర్జునుడు ఇట్లనెను. ... మీరు చెప్పినదంతయు సత్యమే! ఇప్పుడు మీరు చూపిన సాధనవలన పరబ్రహ్మ ప్రాప్తి తప్పక కలుగును. దృఢనిశ్చయముతో ఈ యోగసాధన చేయువారు తప్పక పరబ్రహ్మమును ప్రాప్తించగలరు."

(ఆంధ్ర. జ్ఞా. 6-15)

శ్రీ జ్ఞానదేవులు లోకవిఖ్యాతిగాంచిన యోగీశ్వరులు. కనుక అందు వారి యనుభవమును చక్కగా వ్రాయగలిగిరి. అంతియేగాక యోగము వారి సంప్రదాయముయొక్క మూలసూత్రమని స్పష్టముగ నిట్లు వ్రాసిరి :—

"ఈ విధముగ యోగసాధన మూలమున పిండములో పిండమును గ్రహించుట 'నాథ' (జ్ఞానేశ్వరుని) సంప్రదాయముయొక్క మూలసూత్రము."

(ఆంధ్ర. జ్ఞా. 6-14)

దీక్షితులవారికి రాజయోగమును గురించి యెంతటి అసహ్యభావముండెనో యిదివఱకే (యీ ప్రకరణముననే

30 వ అధ్యాయములో) వివరించియుంటిని. అయినను వారి వాక్యములు మఱికొన్ని యిచట నుదాహరింతును :—

"యోగాభ్యాసం చేసేనా గుర్తెరిగే దొమ్మరివానివలె సాధించి వొక్కనాడు పడి వస్తాడు." (బృ. పూ. పు. 58)

"........ ఎటువలె ననగా బీజనాశమైతేగదా, వృక్షనాశ మగుచున్నది. అందుకే శరీర వృక్షమునకు సూక్ష్మశరీరమే బీజము. ఆ బీజమును నశింపజేయవలెను. ఆ బీజనాశమునకు యత్నమును చేయవలెనుగదా? ఆ యత్నమునకు యోగసాధనములు ముఖ్యములుగావు. యోగసాధనములు రోగాస్పదములు."

(బృ. పూ. పు. 154)

శ్రీ జ్ఞానేశ్వరులు తమ సంప్రదాయమునకు మూల పురుషుడు (మొదటి గురువు లేక సంప్రదాయాచార్యుడు) శివుడని చెప్పియున్న సంగతి తెలిసినదే. అట్టి శివుని గుఱించి దీక్షితులవారు చెప్పిన వాక్యములు విన్నవారికి ఆశ్చర్యమును కలిగించును. ఆ వాక్యములను యీ క్రింద వివరింతును :—

"వైకుంఠం దొరకక శివుడు స్వరూపమనే భ్రాంతిచేత సమాధి చేస్తూ యిప్పటికి వున్నాడష. ఆచార్యకటాక్షము గలిగి మూలంలేని యీ గుర్తెరిగే సచ్చిదానందమనే దేహభ్రాంతి తీసివేసి వైకుంఠం అరచేతిలో వున్నట్టు యెవ్వరైనా సూచన చేస్తారా అని చింతచాత కైలాసమనే లోకాంతర భ్రాంతిచేత వున్నాడు. యితర లోకాలవారికి వైకుంఠముయొక్క అపేక్ష కద్దు. వైకుంఠం వున్నది వున్నట్టు జాడ సూచన అయితే యిచ్ఛ

యెన్నటికీ పుట్టదు. వైకుంఠము పుట్టని చావనిది గనుక దానికి బదులు లేదు. యితర స్థానాలు యెక్కడ వుంటే అక్కడనే. సర్వత్ర లేవు. యీ వైకుంఠం అయితేనో సకల దేశాలయందు వున్నది." (బ్ర. ఉ. పు. 142, 143)

పై వాక్యములయందు 'వైకుంఠ' మనగా: ఏమీ లేని యీ ఉత్త బట్టబయులని దీక్షితులవారి పరిభాష. వారి వైకుంఠమన, విష్ణులోకముగాని, శ్రీమన్నారాయణుడు లక్ష్మీసహితుడై నివసించుచున్నట్లు ఆగమపురాణాది గ్రంథములయందు చెప్పబడిన లోకముగాని కాదు. శివుడంతటి వాడు యేమీలేని యీ ఉత్త బట్టబయలు తెలిసికొనలేక అవస్థలు పడుచున్నాడట. జ్ఞానేశ్వరులవారి నాథ సంప్రదాయమునకు ప్రథమాచార్యుడైన శివునకు బయలు తెలియదని చెప్పునట్టి దీక్షితులవారు తమది జ్ఞానేశ్వర సంప్రదాయమని చెప్పుట ఎంతటి అసత్యమో ఆలోచింపుడు. శ్రీజ్ఞానేశ్వరులు గీతావ్యాఖ్యానమున "శంకరుడు యిప్పటికి యీ మార్గములో నడచుచున్నాడు" అన్న వాక్యములు దీక్షితులవారు వినియుందురు. ఆ వాక్యములయందలి సరియైన యర్థమును గ్రహింపలేక విపరీతార్థమును గ్రహించిరని తోచుచున్నది.

శ్రీ జ్ఞానేశ్వరులు జన్మించిన మహారాష్ట్రమునందే జన్మించిన శ్రీ లోకమాన్య బాలగంగాధరతిలక్ మహాశయులు గొప్ప పండితులు, ఆత్మవేత్తలు. నాబోంట్ల కంటెను, దీక్షితులవారి కంటెను శ్రీ జ్ఞానేశ్వరులవారిని

గుఱించి శ్రీ లోకమాన్యతిలక్ గారికి ఎక్కువగా తెలియును. తిలక్ మహాశయులు తాము రచియించిన గీతారహస్యము నందలి 'విషయ ప్రవేశము' అను ప్రథమ ప్రకరణమున శ్రీ జ్ఞానేశ్వరులను గుఱించి యిట్లు వ్రాసియున్నారు:—

'భక్తాస్తే ఽతీవ మే ప్రియాః' 'నా భక్తులే నాకు మిక్కిలి ప్రీతిపాత్రు లగుచున్నారు' (గీత. 12-20) అని భగవంతు డర్జునున కుపదేశించిన కారణముననే యద్వైత పర్యవసాయియగు భక్తిమార్గమే గీతలలో ముఖ్య ప్రతిపాద్య విషయమగును. అనియు వారు యుక్తిగఁ జెప్పుదురు. శ్రీధర స్వాములవారు గీతకు (దమటీకలో గీతి. 18-78) నీ తాత్పర్యమునే వ్రాసిరి. ఐనను గీతల కీసంప్రదాయ సంబంధమగు 'జ్ఞానేశ్వరి' యను గ్రంథము మహారాష్ట్రభాషలో వ్రాయబడినను నుత్తమమగునదిగనే యున్నది. ఇందు గీతాష్టాదశాధ్యాయములలోను తొలి నాలుగధ్యాయములలోఁ గర్మము పిమ్మట నేడధ్యాయములలో జ్ఞానమును బ్రతిపాద్యము అని యున్నది. మఱియుఁ దమ టీక శాంకరభాష్య ప్రవేశమునకు మార్గదర్శక మగునట్లు రచియింపఁబడినదని జ్ఞానేశ్వరులుగారు తమ గ్రంథాంతమున స్వయముగా చెప్పియున్నారు. మఱియు గీతార్థము ననేక సరసదృష్టాంతములచే విస్తరింపఁజేసి వర్ణించు జ్ఞానేశ్వర మహారాజుగారి శైలి యలౌకిక మగుటయు గాక శ్రీ శంకరాచార్యులవారి కంటెను విశేషము భక్తిమార్గమును నిష్కామ కర్మమును సమర్థించి యుండుటం జేసి జ్ఞానేశ్వరి యను గ్రంథము గీతల మీఁద నొక స్వతంత్ర భాష్య గ్రంథముగ నంగీకరింపంబడఁ దగినది. జ్ఞానేశ్వర మహారాజు తాను యోగి గాన గీతా

షష్ఠాధ్యాయమునఁ బాతంజల యోగాభ్యాస విషయముగల శ్లోకములకు టీక విస్తరించి రచియించెను ఆఱవ అధ్యాయము సమాప్తియందు 'తస్మాద్యోగీ భవార్జున' 'కావున నో యర్జునా! యోగి వగుము.' (అనగా యోగాభ్యాసములో ప్రవణుడవు కమ్ము) (గీత. 6-46). అని భగవంతు డర్జునున కుపదేశము చేయుచు సర్వమోక్షమార్గములలోఁ బాతంజలయోగము సర్వోత్తమమని స్థాపించెనని జ్ఞానేశ్వరులు స్పష్టీకరించిరి."

దీక్షితులవారికి పాతంజల యోగమును గుఱించి జ్ఞానేశ్వరులవారి భావమేమో తెలియదనియు, దీక్షితులవారు 'జ్ఞానేశ్వరిని' చదివిగాని, వినిగాని యుండలేదనియు స్పష్టమైనది. ఏలయన! జ్ఞానేశ్వరులు దేనిని పూజించిరో దానినే దీక్షితులవారు నిందించిరి. పర్యవసానమేమన యోగవిషయమున దీక్షితులవారికి జ్ఞానేశ్వరులవారికి పరస్పర విరుద్ధాభిప్రాయము లున్నవి.

(6) శ్రీ జ్ఞానేశ్వరులు ఆత్మయే శివశక్తి ద్వయముగ భాసించెనని చెప్పిరి.

దీక్షితులవారు అందులకు విరుద్ధముగ 'మూలంలేని యీ గుర్తెరిగే శరీరం యేమీ లే'దనిరి. శరీరము ఎఱుక యివి రెండును, ఒకదానినొకటి సృజించినవని దీక్షితులవారి మతము. ఈ రెండును పరస్పర విరుద్ధాభిప్రాయములు.

---

(7) శ్రీ జ్ఞానేశ్వరులు యోగీశ్వరులే గాక మహాభక్తులు. వీరిది స్వాభావిక భక్తి. భక్తి యన్నను యోగ

మన్నను దీక్షితులవారికి గిట్టదు. కనుక యీ యంశమున సయితము యిరువుర మతములు భిన్నములు.

(8) శ్రీ జ్ఞానేశ్వరులు పరా - అపరా ప్రకృతులను గుఱించి చేసిన నిర్వచనమునకును దీక్షితులవారి మతమునకును భేదమున్నది. ఎట్లన :—

త్రిగుణాత్మక ప్రకృతియొక్క త్రిగుణముల సామ్యావస్థ, లేక, అవ్యక్తస్థితి 'పరా' అనియును; అది వ్యక్తమై మహదాది అష్టవిధ ప్రకృతులైనప్పుడు అష్టప్రకృతుల సమష్టి స్వరూపము 'అపరా' అనియును శ్రీ జ్ఞానేశ్వరుల మతము. పరా ప్రకృతియే 'జ్ఞానదేవి' యనిరి. ఇదియే నిర్జీవ శరీరమును సజీవముగా చేయును, అని శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పిరి.

జ్ఞానము (ఎఱుక) త్రిగుణములలో ఒక్కటియగు సత్త్వగుణము వలన జనించినదని దీక్షితులవారి మతము. కనుక యీ యంశమున సహితము ఇరువుర మతములు ఏకీభవింపవు.

(9) శ్రీ జ్ఞానేశ్వరులు (1) ఆత్మయొక్క స్వరూప జ్ఞానము (విశుద్ధజ్ఞానము)ను, (2) చిదాభాస సంబంధమగు (శివశక్తులయందు జ్ఞానశక్తి) జ్ఞానమును యిట్లు జ్ఞానద్వయమును అంగీకరించిరి.

దీక్షితులవారు ఎఱుకను మాత్రమే అంగీకరించిరి. రెండు జ్ఞానములు లేవనిరి. కృష్ణదాసుగారు యిట్లు చెప్పిరి.

కం॥ నేను గాకొకటి శుద్ధ
జ్ఞానము గలదనుచు బల్కు జ్ఞానులమాటల్
పూని వినదగదు శుద్ధ
జ్ఞానంబన నేనె నేను లేనిది యానే. (కం. 227)

(10) శ్రీ జ్ఞానేశ్వరులు, వారి సోదరు లిరువురును, సోదరియగు ముక్తాంబగారును సన్న్యసించిరి. దీక్షితులవారికి సన్న్యాసమన్న సరిపడదను సంగతి తెలిసినదే. సన్న్యాసిని గౌరవించినదని గదా జగదంబ యగు సీతను మూఢురాలని నిందించిరి, సీతమ్మను గౌరవించినవారందఱుకూడ మూఢులే యనిరి. కనుక దీక్షితులవారు జ్ఞానదేవుల సంప్రదాయము నకు చెందినవారని తలంచినవారు విచారము లేనివారు.

(11) శ్రీ జ్ఞానేశ్వరులవారికి, పూర్వుల యెడలను, పూర్వ సంప్రదాయముల యందును గౌరవము కలదు. దీనికి దృష్టాంతము :— అతి ప్రాచీన కాలమున క్షీరసాగరతీరము వద్ద శంకరుడు పార్వతీదేవి చెవియందు చెప్పిన రహస్యమును మొసలిగర్భమునందున్న మత్స్యేంద్రనాథులువిని ఆ రహస్య మును చౌరంగీనాథులకు చెప్పిరని, చౌరంగీనాథులవలన ఆ రహస్యము శ్రీ నివృత్తినాథులకు లభించెనని, చెప్పియున్నా రను యీ యంశ మిదివరకే చెప్పితిని. ఎక్కడ శివుడు? ఎక్కడ మత్స్యేంద్రనాథులు! వారు కొన్ని వేల సంవత్సరములు జీవించి యుండిరని నమ్మకము శ్రీ జ్ఞానేశ్వరులకుండియుండిన గదా వారిట్లు చెప్పియుందురు. యోగీశ్వరు లనేక సంవత్స రములు జీవింతురని పెద్దలు నమ్ముదురు.

దీక్షితులవారు ఇట్టి వాక్యములను నమ్మరు. వారొకచో నిట్లు చెప్పిరి: "ఎవరునూ సంవత్సరములు కన్నను ఎక్కువ బ్రతుకరు" (బృ. ఫ్రా. పు. 69) అనేకులు నూరు సంవత్సరములకంటె యెక్కువ కాలము జీవించినట్లు వార్తా పత్రికలయందు చదివియున్నాము * కొందఱిని చూచుచున్నాము.

శ్రీ జ్ఞానేశ్వర, శ్రీ శివరామ దీక్షితులవారి గురుపరంపరను గుఱించి యిదివఱలో తెలిపియుంటిని. ఈ రెండును భిన్నములని పై యిరువురు తమ గురుపరంపరను గుఱించి చెప్పుకొనిన వాక్యములనే యుదాహరించి యుంటిని. కనుక యీ యంశమునకు వేఱొక ప్రమాణము అవసరము లేదు.

* ఆంధ్రజ్యోతి 27-7-1969 తేదీన వెయిబడిన పత్రికలో ఇట్లున్నది: "న్యూఢిల్లీ జూలై 26 సోవియట్ యూనియన్‌లోని దాషేస్తాన్‌లో 3743 మందికి పైగా శతాధిక వృద్ధులున్నట్లు వెల్లడయినది. శతాధిక వృద్ధులలో స్త్రీ పురుషులు సమానముగా వున్నారట.

పర్వతశ్రేణులు అశేషంగావున్న శాడర్ గ్రామములో అఘరా అమరోవా, అనే పేరుగల వ్యక్తి వయస్సు 151 సంవత్సరములు. ఈయన ఒక సుప్రసిద్ధ రష్యన్ కవి. అదే గ్రామంలో 'డైలమ్‌బేబ' అనే మహిళ వయస్సు 123 సంవత్సరములు. ఆవిడ ఆరోగ్యస్థితి వైద్యులకు కూడ ఆశ్చర్యము కలిగిస్తున్నదట — ఇట్టివి అనేకములు పత్రికలయందు ప్రచురింపబడినవి. ఆంధ్రప్రదేశముననే శతాధిక వృద్ధులు కలరని 21-6-1973 వ తేది హైదరాబాదు రేడియోస్టేషన్ నుండి ప్రచారము చేయబడినది. దీక్షితులవారు ముందు వెనుకలు ఆలోచింపక వారికి తోచినదే నిజమను భావముతో చెప్పుచుందురనుటకు యిది దృష్టాంతముగా చూపితిని.

దీక్షితులవారు, శ్రీ జ్ఞానేశ్వరుల గురుపరంపరను గురించి తెలియకయో లేక తెలిసియు గొప్పవారిపేరును ఉపయోగించుకొనుటవలన తమ అచలబోధకు మంచి ప్రచారము లభించుననియో ఆవిధముగ చెప్పుకొని యుండురని తలంచుట తప్పుకాదు.

పర్యవసానమేమన — శ్రీ జ్ఞానేశ్వరుల దర్శనము ఆధునికులయందు శ్రీ అరవిందయోగి దర్శనముతో కొంత వఱకును, దీక్షితులవారి దర్శనమును హెకిల్ జడాద్వైతముతోను పోల్పవచ్చును. ఇంతవఱకు శ్రీ జ్ఞానదేవుల మతమునకు దీక్షితులవారి మతమునకు గల వైరుధ్యముల దెలిపితిని.

ఇప్పుడు శ్రీ సమర్థుల మతముతో దీక్షితులవారు యెంతవఱకు యేకీభవింపరో పరిశీలింతము.

(౩౫) శ్రీ దీక్షితుల - శ్రీ సమర్థుల తత్వభేదము

(1) శ్రీ సమర్థులు :- బ్రహ్మము శుద్ధజ్ఞాన స్వరూపము.

శ్రీ దీక్షితులు :- ఈ ఉత్త బట్టబయలునకు జ్ఞానము లేదు.

(2) శ్రీ సమర్థులు :- మూలమాయ బ్రహ్మమునందు కలిగి అందే లయమగుచున్నది.

శ్రీ దీక్షితులు :- మూలమాయ బయలునందు కలుగలేదు.

(3) శ్రీ సమర్థులు :- మూలప్రకృతియందు ఎఱుకకు అధిష్ఠానమున్నది. (దా. బో. 9-6-5)

శ్రీ దీక్షితులు :- (నీకు) ఎఱుకకు అధిష్ఠానము లేదు.
(బృ. ఉ. పు. 42)

(4) శ్రీ సమర్థులు :- ఎఱుక, లేక అంతఃకరణము విభువు. పంచభూతములయందు కలదు.
(దా. బో. 9-6-19, 20)

శ్రీ దీక్షితులు :- ఎఱుక విభువుకాడు. మహాభూతముల యందు కనబడదు. (బృ. పూ. పు. 32)*

(5) శ్రీ సమర్థులు :- నీవు నాలుగు దేహములకంటె వేఱుగా యున్నావు. నీవు జన్మకర్మలకు భిన్నుడవు.
(దా. బో. 5-6-56)

శ్రీ దీక్షితులు :- నేనన నాలవదేహము (కృష్ణదాసుగారి కండము 230) మహాకారణశరీరమే ఎఱుక. ఎఱుకే నేను - నీవు.

(6) శ్రీ సమర్థులు :- వేదశాస్త్రములు మిథ్యయని నుడువజాలము. (దా. బో. 7-7-33)

శ్రీ దీక్షితులు :- వేదములు వట్టి మాయ. మాటలు యేలాగున అపద్ధమో అలాగే అబద్ధము.
(బృ. పూ. పు. 171)

---

* "ఆకాశాదిక భూతానీకాత్మకమగుచు ఎఱుక యీ జగమయ్యెన్." (కండా. 38) లో ఎఱుకే ఆకాశాది భూతపంచకమైనదని కృష్ణదాసుగారు చెప్పియున్నారు. ఎఱుకే మహాభూతములైనప్పుడు భూతములయందు ఎఱుక లేకపోవుటయెట్లు? ఇవి పరస్పర విరుద్ధభాషణములు కావా?

(7) శ్రీ సమర్థులు :- "మహాత్ములు జనసముదాయమునకు జ్ఞానోపదేశము గావించిరి. సారాంశ మేమన అద్వైతజ్ఞానము సత్యము." (దా. బో. 7-7-35)

శ్రీ దీక్షితులు :- "అద్వైతము వాదము కొఱకే గాని భ్రాంతిరహితము కాదు." (బృ. ఉ. పు. 154)

(8) శ్రీ సమర్థులు :- "మహావాక్య వివరణము గావించుటయే జ్ఞానమునకు ముఖ్యలక్షణము. అట్టి ముఖ్య లక్షణము కతన మనము బ్రహ్మస్వరూపుల మగుదుమను సంగతి బోధపడును."

(దా. బో. 5-6-14)

శ్రీ దీక్షితులు :- మహావాక్యములు నీవే బ్రహ్మమని చెప్పుచున్నవి "ఇందుకే తామసము కలుగుచున్నది."

(బృ. పూ. పు. 132)

(9) శ్రీ సమర్థులు :- విగ్రహారాధనమును సమర్థించిరి.

శ్రీ దీక్షితులు :- విగ్రహారాధనమును ఖండించిరి.

(10) శ్రీ సమర్థులు :- జిజ్ఞాసువు (ముముక్షువు) బ్రహ్మవిద్యనుకోరి గురువును యెన్నుకొను విషయమై యిట్లు వ్రాసిరి :— నీచజాతి గురువు నేర్పరుచుకొనుట గూడ కళంకము. నీచజాతి గురుడు బ్రహ్మజ్ఞానుల సభలలో దొంగవలె దాగి యుండును (దా. బో. 5-2-58) బ్రహ్మసభయం దతని పాదతీర్థము నెవ్వరు పరిగ్రహింపరు. అతని

ప్రసాదము స్వీకరించినయెడల ప్రాయశ్చిత్తము గూడఁ జేసికొనవలయును. (దా. బో. 5-2-59) నీచుని గురువుగాఁ జేసికొనుటచే నిట్టి తగవు లెన్నియో తటస్థించును (దా. బో. 5-2-61)

శ్రీ దీక్షితులు :- "సకలజీవులు కలలో వస్తువులవలె పుట్టుచున్నారు కలలోవాటివలెనే లేకపోవుచున్నారు. కులములను యెవ్వరు చూచినారు? గోత్రములను యెవ్వరు చూచినారు? కులగోత్రములను అహంకారమే యేర్పరచినది." (బ్ర. పూ. పు. 48) "బ్రాహ్మణుడైనను విష్ణుభక్తిలేనివాడు కుక్కను వండుకొనితినే శ్వపచుడని చెప్పుచున్నారు. నారదుడు దాసీపుత్రుడట. అతను భగవద్భక్తివలన బ్రహ్మ ఋషి అయినాడట. విదురుడు శూద్రుడట. అతని యింట భగవంతుడు భోజనము చేసెనట. వాల్మీకి బోయవాడట. అతను మహాఋషియై రామాయణాది గ్రంథములు చేసెనట. .... ఈలాగున అనేక హీనకులములు ఘనకులము లాయెనట. ఈ కులములకు నిరుకులేదు. (బ్ర. పూ. పు. 49)

శ్రీ సమర్థులవారు రచియించిన 10-వ అంశమునందలి వాక్యములవలన వారుచెప్పిన తదితర వాక్యములయందలి రుచి కూడ పోయినది. కడివెడు ఆవుపాలయందు కొంచెము గోమూత్రము కలిపినయెడల ఆ పాలన్నియు విరిగి విషతుల్యమగునట. ఆరీతిగా శ్రీ సమర్థులవారు చేసిన. 10-వ అంశములోని వాక్యములవలన వారికి కులాభిమానము (ఆభిజాత్యము)

పోలేదని స్పష్టపడినది. "వర్ణాశ్రమధర్మ కర్మ సంకల్పో బంధః" అని శుకరహస్యోపనిషత్తు చెప్పినది. కనుక ఇదియును ఒక బంధమే.

"వర్ణాశ్రమాచారయుతా విమూఢాః
కర్మానుసారేణ ఫలం లభంతే,
వర్ణాదిధర్మంహి పరిత్యజంత
స్స్వానందతృప్తాః పురుషాభవంతి." (మైత్రేయోపనిషత్తు)

వర్ణాశ్రమానుసారము కర్మలు చేసిన వానికి ఆ కర్మానుసారము ఫలము లభించునేగాని వర్ణాశ్రమాచారముల ధర్మమును పరిత్యజించిన వారికి కలుగునట్టి పరమానంద ఫలము కలుగదు.

"కులగోత్రజాతి వర్ణాశ్రమరూపాణి షడ్భ్రమాః."

కులము, గోత్రము, జాతి, వర్ణము, ఆశ్రమము, రూపము, ఈయారును భ్రమలని ముద్గలోపనిషత్తు చెప్పినది. కనుక భ్రమయందుండు వారికి సత్యదర్శన మెట్లగును? ఆళ్వారుల చరిత్రములు చదివినవారు* శ్రీ సమర్థులను పూజింపరు.

శ్లో॥ "యశ్శూద్రదభగవద్భక్తం, నిషాదం శ్వపనం తథా,
వీక్షతే జాతి సామాన్యా త్సయాతి నరకం నరః."

తా॥ భగవద్భక్తుడు శూద్రుడైనను, శ్వపచుడైనను, నిషాదుడైనను, అతనిని జాతి సామాన్యదృష్టితో చూచిన వారు నరకమునకు బోవుదురు.

---

* ఆళ్వారులను విశిష్టాద్వైతులను కథించి యీ గ్రంథముయొక్క ద్వితీయభాగమున వ్రాసియున్నాను.

శ్లో॥ న శూద్రా భగవద్భక్తా విప్రా భాగవతాః స్మృతాః,
సర్వవర్ణేషు తే శూద్రా యేహ్యభక్తా జనార్దనే.

(ప్ర. ప. 84-13)

తా॥ జన్మమువలన శూద్రులైనను భగవద్భక్తులైన వారు శూద్రులు కారు. వారు విప్రులు, భాగవతోత్తములు భగవద్భక్తిలేనివారు ఏ వర్ణమునకు చెందినవారైనను శూద్రులుగనే లెక్కింపబడుదురు.

కుల మదము మదత్రయములలో ఒకటి. వీటినే గర్వత్రయ మందురు.†

శ్లో॥ "పూర్వదేహ పరిత్యాగే జాత్యాదీనాం ప్రమాణతః,
దేహాస్యైవతు జాత్యాది స్తస్యాప్యేవం హ్యనాత్మతా."

తా॥ దేహము నేనుకానని నిశ్చయము కలిగినపుడు, దానివెంటనే నేను బ్రాహ్మణకులమునకు చెందినవాడను, నేను యీ ఆశ్రమమునకు చెందినవాడను, అను అభిమానము సహితము పోవును. (ఉ. సా. 17-45) అని శ్రీ శంకరులు చెప్పిరి.

మఱియు శ్రీ శంకరులు "చండాలోస్తు సతు ద్విజోస్తు గురురి త్యేషా మనీషామమ" "సర్వసాక్షియగు చైతన్యమే నేను" అను నిశ్చయ మెవనికిగలదో, అట్టివాడు చండాలుడే యగుగాక, ద్విజుడే యగుగాక, అతడు నాకు

† ఈ గ్రంథముయొక్క ద్వితీయభాగమునందు "ముముక్షువులు పరిత్యజింపదగినవి" అను 4-వ అధ్యాయమున మదత్రయమును (కుల, ధన, విద్యా మదములను) విపులముగ వ్రాసియున్నాను.

గురువు. ఇది నా నిశ్చయమని కాశీకాపురియందు చెప్పిన సుప్రసిద్ధ 'మనీషాపంచకము' శ్రీ సమర్థులవారు చదువలేదా? చదివియుండినను శ్రీ శంకరుల గొప్పతనమును గౌరవించుట కిష్టపడలేదేమో?

శ్రుతి స్మృతి పురాణేతిహాసములనుండి ఇదివఱకే యిట్టి ప్రమాణములను అనేకములు చూపియున్నాను. ఇంకను యెన్నియేని ప్రమాణములను చూపవచ్చును. అవన్నియు నిచ్చట చెప్పుట అనవసరము.

పర్యవసానమేమనగా:— శ్రీ సమర్థ రామదాసస్వాములవారు మొదట బ్రహ్మచారి (గోసాయి)గా ఉండిరి. పిమ్మట సన్న్యసించిరని వింటిని. ఇట్లుండిన శూద్రుని గురువుగా గైకొనరాదని చెప్పుట వారికి తగదని, వారికి అప్పటికిని కులాభిమానము పోలేదని, కులాభిమానము పోగొట్టుకొనని వారికి ముక్తి లేదని, తిరిగి జన్మమున్నదని శాస్త్రములు ఘోషించుచున్నవి. ఇందుకు యొంతమాత్రము సంశయము లేదు. ఈ యంశమున శ్రీ సమర్థులవారికంటె శ్రీ దీక్షితులవారే విశాలహృదయమును వ్యక్తపరచిరి. ఇందుకు శ్రీ దీక్షితులకు ధన్యవాదము లర్పించుచున్నాను.

(౩౬) శ్రీ దీక్షితుల బోధ - ఇతర దర్శనము

జిజ్ఞాసువు:- అయ్యా! శ్రీ జ్ఞానదేవ, శ్రీ అరవింద, శ్రీ సమర్థుల దర్శనములతో దీక్షితులవారి బోధకు పొత్తు లేదని స్పష్టమయినది. శ్రీ శంకర, శ్రీ రామానుజ, శ్రీ మధ్వాచార్యాదుల మతములను దీక్షితులవారు తూలనాడిరి.

న్యాయవైశేషికాది దర్శనములతోగాని శైవశాక్తాది మత ములతోగాని సంబంధము (సమానత) ఉన్నట్లుకూడ నాకు తోచలేదు. అయినను మఱియొకసారి బోధించి సంశయము లేకుండ చేయుదురని ప్రార్థన.

వేదాంతి :- న్యాయ, వైశేషిక పూర్వమీమాంసా దర్శనములయందు ఆత్మలు జడము. అనగా: ఆత్మ జ్ఞాన స్వరూపము కాదు. ఆత్మ సుఖదుఃఖాది గుణములు కలది. ఆత్మలనేకములు. విభువులు (వ్యాపకములు). కనుక దీక్షి తులవారి బట్టబయలుతోను ఎఱుక (ఆత్మతోను) సమానత కుదురదు. న్యాయ వైశేషిక మీమాంసా దర్శనములయందు మనస్సు అణురూపము. అది కొంతవఱకు అనగా మోక్ష పర్యంతము నిత్యము. కాని అదియును జడమే. మనస్సం యోగమున ఆత్మయందు జ్ఞానక్రియలు కలుగును. దీక్షితుల వారి యెఱుక మిథ్య. వీరు, బట్టబయలు సంయోగమున యెఱుకయందు జ్ఞానము కలిగినదని చెప్పరు. కనుక నైయాయికుల మనస్సుతో దీక్షితులవారి ఎఱుకకు సామ్యము కుదురదు. న్యాయ వైశేషిక దర్శనములయందు దేహి దేహములు వేఱు. జగత్తు మిథ్య కాదు. దీక్షితుల వాదము ఇందుకు విరుద్ధము. ఆధునిక నైయాయికాదులు ఈశ్వరాస్తిత్వమును అంగీకరింతురు. దీక్షితులు అంగీక రింపరు. సాంఖ్య, యోగ, వేదాంత దర్శనములయందు ఆత్మ జ్ఞానస్వరూపము - ఇవి దీక్షితులవారి బోధకు ప్రత్యక్ష విరుద్ధము.

జిజ్ఞాసువు :- దీక్షితులవారి బోధ శాంకరమతముతో సరి

పోవక పోయినను యితర అద్వైతులతో నేకీభవించునా?

వేదాంతి :- ఏకీభవింపదు. శ్రీ శంకర శ్రీ విద్యారణ్యుల అద్వైతము ఆభాసవాదము. వారి దర్శనములు ఖండించుటయే ప్రధానాశయముగ దీక్షితులవారు, వారి బృహద్వాసిష్ఠ సిద్ధాంతము (శివరామదీక్షితీయము)ను రచియుంచిరి. శాంకరమార్గము గాక అద్వైతులలో తక్కినవి ప్రతిబింబ వాదము, అవచ్ఛేద వాదము. వాటితో కూడ దీక్షితులవారి బోధకు స్నేహము కుదురదు. అవచ్ఛేద ప్రతిబింబ వాదములను గురించి తొలుత కొంత చెప్పియుంటిని.*

ఇక అద్వైత శాఖలయందు మిగిలియున్నది అజాతవాదమును దృష్టి సృష్టి వాదము. దీక్షితులవారి వాదము సయితము అజాతవాదమే కాని శ్రీ జ్ఞానేశ్వరులయొక్కయు యోగవాసిష్ఠకారులయొక్కయు శ్రీ శంకరులయొక్కయు అజాతవాదములను గురించి ఇదివఱకే విస్తరించి చెప్పియుంటిని. అందులో దేనితోను దీక్షితులవారి అజాతవాదమునకు సామరస్యము కలుగదు.

(౩౭) బౌద్ధతత్వ - అచలబోధలకు గల సారూప్యత

బౌద్ధమతమును గురించి యిదివఱకే † చెప్పియుంటిని. దాని నిచట స్మరించుకొనవలెను. ప్రస్తుతము బౌద్ధమత

---

* బ్రహ్మజిజ్ఞాస ౧-౨-౮ జీవస్వరూపము భిన్నమతములు అను అధ్యాయమును సంగ్రహముగా చెప్పియున్నాను.

† ఈ గ్రంథముయొక్క తృతీయభాగమునందలి నాలుగవ ప్రకరణమున బౌద్ధమతమును గురించి వ్రాసియున్నాను.

అచలమతములకు గల సామాన్యతను గుఱించి విచారించు సందర్భమున బౌద్ధమతమును గుఱించి కొలది వాక్యములు మాత్రమే చెప్పెదను. బౌద్ధమతము ననుసరించి విశ్వమంతయు బౌద్ధుల తత్త్వత్రయముక్రింద చేరును. తత్త్వత్రయమనగా (౧) స్కంధములు (౨) ఆయతనములు (3) ధాతువులు — స్కంధము లైదు. అవి యివి:— (1) రూప (2) వేదన (3) సంజ్ఞ (4) సంస్కార (5) విజ్ఞానము — ఆయతనములు. ధాతువులను ఒకవిధముగా పంచస్కంధములలోనే చేర్చుకొనవచ్చును. మానవుడు పంచస్కంధ సముచ్చయము. పంచస్కంధములయందు అయిదవది విజ్ఞానము. అనగా: తెలిసికొను తెలివి, లేక యెఱుక. మరణకాలమున మానవుని దేహము నుండి నిర్గమించి జన్మాంతరము పొందునట్టిది విజ్ఞానమే. ఇది ప్రాచీన బౌద్ధ సిద్ధాంత సారాంశము. —

బుద్ధభగవానుని యనంతరము బౌద్ధము అనేక శాఖలైనది. అందు ముఖ్యమైనవి నాలుగు శాఖలు. అవేవన:— (1) వైభాషికులు (2) సౌత్రాంతికులు (3) యోగాచారులు (విజ్ఞానవాదులు) (4) మాధ్యమికులు (శూన్యవాదులు). ఇందు (1) వైభాషికులు ద్వైతులు. (2) సౌత్రాంతికులు ద్వైతాద్వైతులు. (3) యోగాచారుల మతమున విజ్ఞానమొక్కటియే ప్రపంచాకారముగను విజ్ఞానమునకే గోచరించుచున్నది అని చెప్పిరి కనుక. ఇది ఒకవిధమగు అద్వైతమే. విజ్ఞానమును ద్వివిధమని చెప్పిరి. (౧) వ్యక్తివిజ్ఞానము. పంచస్కంధముల నొక్కటిగా ప్రపంచాకారమును పొంది ప్రపంచమును చూచుచున్నది. (౨) ఆలయవిజ్ఞా

నము :— సర్వప్రపంచమునందున్న సమష్టి విజ్ఞానము లేక విజ్ఞానముల ఆలయము. దీనిని ఆలయ విజ్ఞానమందురు. ఆలయ విజ్ఞానమును సముద్రముతోను, వ్యక్తి విజ్ఞానమును తరంగముతోను, పోల్చుదురు. ఆలయ, వ్యక్తి విజ్ఞానముల కంటె పరమునందుండినది 'తథత.' ఇది అట్టి దిట్టిదని వర్ణింపరానిది. (4) మాధ్యమికులు — విజ్ఞాన మొక్కటియే కలదని విజ్ఞానవాదులనగా — వీరు అట్టి విజ్ఞానముకూడ లేనిదే యనిరి. ఇక ఉన్న దేమందురా? శూన్యమే. కనుక వీరికి శూన్యవాదులని పేరువచ్చినది. ఇది 'నవీన బౌద్ధము' లేక 'తదనంతర బౌద్ధము'. —

ఇప్పుడు బౌద్ధమతముతో నెంతవఱకు దీక్షితుల అచల బోధకు సారూప్యత సిద్ధించునో సంగ్రహముగ నీ క్రింద వివరింతును :—

(1) బౌద్ధు లిట్లు చెప్పిరి :— దేహము జన్మింపగా విజ్ఞానము ; విజ్ఞానము జన్మింపగా దేహము కలిగినది.

దీక్షితులవా రిట్లు చెప్పిరి :— ఎఱుక, దేహము ఒక దాని నొకటి సృజించుకొన్నవి.

అట్లయిన అన్యోన్యాశ్రయ దోషము కలుగును. కనుక యిరువురి వాదములు పరిహరింపదగినవి.

(2) మాధ్యమిక బౌద్ధులు సర్వము శూన్యమే యనిరి.

దీక్షితులవారు "అచలమే శూన్యమై శూన్యమే మహాశూన్యమై అగోచరమై నశించుచున్నది" అని చెప్పిరికదా?

ఈ యంశమున బౌద్ధులతో దీక్షితులవారు యేకీభవించిరి.

(3) బౌద్ధ విజ్ఞానవాదుల వ్యక్తి విజ్ఞానమును దీక్షితులవారి యెఱుకయు యించుమించుగా నొక్కటియే. వారి ఆలయ విజ్ఞానముతో కృష్ణదాసుగారి అఖండమైన యెఱుకను చాలవఱకు పోల్పవచ్చును.

(4) మాధ్యమికుల శూన్యముతో దీక్షితులవారి బట్టబయలును కొంతవఱకు పోల్చవచ్చును.

(5) బౌద్ధులును శ్రీ దీక్షితులును యిరువురు అసత్కార్యవాదులే — అనగా: శూన్యమునుండియే సమస్తము కలిగినదనువారు.

(6) బౌద్ధులు "తానున్నంతవఱకు దుఃఖమే, తాను లేకపోవుటయే నిర్వాణమనిరి — దీక్షితులవారును - ముక్తి అనునది లేదని, తాము లేకపోవుటయే విచారమునకు ఫలమని చెప్పిరి. ఈ యంశమునందు పూర్తిగా యిరువుర అభిప్రాయము యొక్కటే.

(7) విజ్ఞానమే విజ్ఞానమును అనుభవించుచున్నది (తెలిసికొనుచున్నది) అని బౌద్ధులును, ఎఱుకయే యెఱుక నెఱుగుచున్నదని దీక్షితులవారును చెప్పిరి.

(8) బౌద్ధులు, దీక్షితులవారు శ్రుతిప్రమాణ మంగీకరింపరు. హిందువులకు పూజనీయులగు త్రిమూర్తులను గౌరవింపరు. త్రిమూర్తులకంటె వారి గురువే అధికు డందురు.

(9) బౌద్ధులు శ్రీ దీక్షితులు నాలుగు భూతములనే అంగీకరించిరి. ఆకాశమును భూతముగ అంగీకరింపలేదు.

(10) "జ్ఞాత లేని జ్ఞేయము లేదు. జ్ఞేయము లేని జ్ఞాతయు ఉండదు" అను నీ తర్కముతో మాధ్యమికులు యోగాచారమతమును ఖండించిరి. ఎఱుక లేక పోయిన బయలుకూడ లేదని దీక్షితులవారును చెప్పిరిగదా?

(బృ. పూ. ప్ర. 10)

జిజ్ఞాసువు :- స్వామీ! దీక్షితులవారు ఎఱుక లేక పోతే బయలు లేదన్నారుకదా? ఎఱుక లేనిదే అని కొన్ని వందలమారులు చెప్పిరి, బయలు నిత్యమని రాకడ పోకడ లేక నిత్యమైయున్నదనిరి. ఇట్లు పిచ్చివాని చేతిలోని రాయి లక్ష్యము లేక ఎటుపోవునో తెలియనట్లు స్థిరముగా చెప్పిన వాక్యము (సిద్ధాంతము) యేదియు లేదుకదా? ఎఱుక బయలు యీ రెండు ఒకటి కాదని పలుమారు చెప్పిరి. దానికి కొట్టు ఎచ్చటనైన చెప్పిరా?

వేదాంతి :- చెప్పిరి. ఆ వాక్యములను వినిపింతును వినుము "గురువు :— ఓయీ! బట్టబయలని అనుట యెందుకనగా సూచనకు అనుటయే గాని యెరుక పోయిన పిమ్మట బయలు యెక్కడ గలదు. బయలని అనుకునే వారు ఎవరు గలరు. ఎరుకే బట్టబయలగును. యీ యెఱుక యీ బట్టబయలు రెండు సమానమే. ఎంతమాత్రము భేదము లేదు. ఎరుక వున్నంతసేపే పరమని యనవలసి వచ్చెను. గాని యెఱుక లేక పోతే పరమని యెవరందురు?" (బృ. పూ. పు. 162, 163)

ఇంతవఱకు బౌద్ధమతముతో అచలమతమునకు గల కొన్ని పోలికలను చెప్పితిని కాని బౌద్ధమునందున్న కొన్ని మంచిలక్షణములు అచల వేదాంతమున లేవు.

జిజ్ఞాసువు :- లేకపోయిననేమి? ఉన్నంతవఱకును రెండును ఒక్కటియే కదా? మీరు బౌద్ధమతము అవైదికము కాదంటిరి. దానియందు చాలవఱకు పూజ్యభావము చూపితిరి. అంతమాత్రము గౌరవమైనను అచల వేదాంతమునకు యివ్వవచ్చునా?

వేదాంతి :- బౌద్ధ విజ్ఞానవాదుల ఆలయ విజ్ఞానమును, తథతాయును, మాధ్యమికుల శూన్యమును, దర్శించుటకు ధర్మానుష్ఠానము అహింస, యోగాభ్యాసమును, ధ్యానమును మొదలగు సాధనలు అవసరము. అవి లేనిదే 'తథత' 'మహాశూన్యము' లెట్టివో సామాన్యులకు తెలియబడవు. అనుభవపూర్వకముగ అవి తెలిసిననే నిర్వాణము కలుగును. అప్పుడే 'నేను లేకపోయితిని' అను అనుభవము కలుగును.

బౌద్ధుల నిర్వాణము సామాన్యముగ అందఱికి లభ్యమగునది కాదు. నిర్వాణమును, పరినిర్వాణమును పొందగోరువారు వీతరాగులై సకలద్వంద్వములకు దూరమై యుండవలయును. వేదాంతులు జీవన్ముక్తిని సాధించుటకు యెంత సాధన, యెంత చిత్తశుద్ధి, యెట్టి కష్టముల కోర్చుకొనవలయునో, బౌద్ధుల నిర్వాణమునుగాని పరినిర్వాణమునుగాని (జన్మరాహిత్యమును) సాధించుటకు అంతటి సాధన, అంతటి చిత్తశుద్ధి, అంతటి సహనము కలిగియుండవలయును. కనుక

బౌద్ధులయందు గల మంచి లక్షణములు అచలమతమున లేవంటిని. కాని అచలవేదాంతులయందు ఎచ్చటనో యే కాలమునందో సకృత్తుగా ఒక మహాపురుషుడు బౌద్ధులు సాధించిన పరినిర్వాణమును సాధించియుండి యుండవచ్చును. ఇప్పటివఱకు అట్టివా రొక్కరును జన్మించియుండలేరని అన లేము. కాని అది దీక్షితులవారి అచలముకాదు. 'నూాల పల్లి' లో బుచ్చయ్యపంతులవారు అచలయోగులు.

జిజ్ఞాసువు :- దీక్షితులవారికి బౌద్ధమతమును గుఱించి తెలియదా ?

వేదాంతి :- ఈ క్రింది వారి వాక్యములను వినుము.

"యేమీలేదు అంటే బౌద్ధుడు." (బృ. పూ. పు. 102)

"శూన్యం అంటే యేమీ లేదనుట." (బృ. ఉ. పు. 9)

"శాస్త్రములులేక నడిచేవారు బౌద్ధులు."

(బృ. ఉ. పు. 37)

యోగాచారుల ఆలయ విజ్ఞానము, 'తథతా' యున్న వనిగాని, మాధ్యమికుల శూన్యమును గుఱించిగాని, దీక్షితులవారికి తెలియదు. అట్టి వివేకము లేకపోవుటకు కారణ మేమన :— బౌద్ధమతము ఎప్పుడో మనదేశమున అస్తమించి వజ్రయానాది నానా వికారములుబొంది వైదిక మత వేషమును ధరించినది. ఈ మధ్యకాలమున జ్ఞానేశ్వరుల సంప్రదాయమునందును సమస్థుల వారి సంప్రదాయము నందును ఎందరో గురువులు గడచిపోయిరి. వారిలో కొందఱు వంశపారంపర్యముగా బౌద్ధులుగానుండి యే కార

ణమువలననైననేమి ఆ మతమును వదలి వైదిక మతము నందు చేరియుందురు. అట్టి సందర్భములయందు వారు పూర్తిగా బౌద్ధమతమును మఱచిపోజాలరు. అందు వారు విజ్ఞానవాదులనుండి విజ్ఞానము (ఎఱుక, లేక, జ్ఞానము)ను గైకొని యుందురు. అట్టి విజ్ఞానము సయితము లేని దేయని మాధ్యమికులు చెప్పిరి కనుక యెఱుక లేని దే యని చెప్పుచూ, మాధ్యమికులు చెప్పిన శూన్యము (పరిపూర్ణము లేక బయలు)నే నాశనరహితమనియు, ఇదియును ఒక విధ మగు వేదాంత మే యనియు లోకులకు బోధించియుందురు. ఈ విధముగా బౌద్ధమతమును విడువ లేక, బౌద్ధమత విరోధు లగు హిందువుల వలనను, ముసల్మానుల వలనను బాధలు పడ లేక బౌద్ధమతమునే బౌద్ధులే వేదాంతమను పేర ప్రచార మునకు తెచ్చియుండవచ్చును. వైదిక సంప్రదాయోద్ధారకు లగు శ్రీ శంకరులనే 'ప్రచ్ఛన్న బౌద్ధుడని' అద్వైతేతరులు నిందించుటకు కారణము అద్వైతమునందు కొన్ని బౌద్ధమత లక్షణములున్నవనియే కదా? ఇట్లుండ బౌద్ధమత మిట్టిదని యెఱుగని శ్రీ దీక్షితులవంటి వారికి తమ మతమునకు బౌద్ధ మతముతో సంబంధమున్నదని తెలియదు. కాలము గడచు చున్నపుడు అనేక మతములయం దిట్టి మార్పులు కలుగు చుండుట సహజమే. బుద్ధభగవానుని బౌద్ధమతమునందు నాకు కొంత గౌరవమున్నదని వెనుక తెలిపియుంటిని. బుద్ధ భగవానునియందు (వ్యక్తియందు) నాకు చాల భక్తికలదు. బౌద్ధమతమును గుఱించి తెలిపిన సందర్భమున అది మన దేశమున నశింపలేదనియు, పేరు మార్చుకొని తత్త్వము నందు కొలది మార్పులతో 'అచల వేదాంత' మను పేర

ఆంధ్రప్రదేశమున కలదనియు తెలిపియుంటిని. బౌద్ధమత మున దోషములు కలవని నే నంగీకరింతును. కాని, బుద్ధ భగవాను డుపదేశించిన బోధ యెట్టిది? అని ప్రస్తుతము తెలిసికొనుట చాల కష్టము. బుద్ధభగవానుని అనంతరము బౌద్ధమున అనేక మార్పులు జరిగినవి.

బృహద్వాశిష్ఠ సిద్ధాంత గ్రంథము అచల వేదాంతుల యందు అతివాదుల వాదమును అధికముగను, మితవాదుల వాదమును కొంతవఱకును సమర్థించుచున్నందున చార్వాక మతముతో యీ మతము కలసి యిది దీక్షితులవారి మత ముగా రూపొందినది

అచలబోధ అనగా — శివరామ దీక్షితులవారిచే బృహద్వాసిష్ఠ సిద్ధాంతమునందు రచియింపబడినది మాత్రమే యని అనుకొనరాదు. దీక్షితులవారు జన్మించుటకు పూర్వమే ఆంధ్రప్రదేశమునందు అచలబోధ కలదు. దానికిని బృహ ద్వాసిష్ఠ సిద్ధాంతమునందు చెప్పబడిన అచలబోధకును భేద మున్నది. దృష్టి సృష్టి వాదము నే పూర్వులు స్వల్ప మార్పుతో గైకొని అచలబోధ యనిరి. వీరి శాస్త్రీయ సిద్ధాంతము యోగవాసిష్ఠము. వీరి అనుభవము (సాధన పద్ధతి) పాతంజల యోగపద్ధతి. ఈ రెండింటిలో అనుభవము, జ్ఞానము ఆర్జించినవారే అచలయోగులు. విజ్ఞానవాదులకు యోగాచారులను ప్రసిద్ధనామము కలుగుటకు వారికి పాతం జల యోగమునందు గొప్ప ప్రవేశముండుటయే కారణము. శ్రీ దీక్షితులకు యోగము సరిపడదు.

(౩౮) అచలవాదులు అద్వైతమార్గమున నడచినవిధము

దీక్షితులవారి శిష్యపరంపరకు చెందినవారమని చెప్పుకొనినవారిలో కృష్ణదాసుగారును, పోకల శేషాచలంనాయుడుగారును, విఖ్యాతులు. పోకల శేషాచలంనాయుడుగారు అద్వైతమును సమీపించినంతగా, కృష్ణదాసుగారు సమీపింపకపోయినను కొంతవఱకైన అద్వైతమార్గమును సమీపించిరని విదితమగుచున్నది. ఈ యంశమును విస్తరించి చెప్పక కృష్ణదాసుగారి వాక్యములను కొన్నింటిని ఈ క్రింద నుదాహరింతును. కృష్ణదాసుగారు యిట్లు చెప్పిరి :—

(1) కందా॥ రాకడ పోకడ లేకను — యేకస్థితి నుండునట్టి యీ బయలందుఁ — రాకడ పోకడ కలిగి యనేకముగా దోచు లేని యెఱుకా సుసీలా — ప్రతిమలోని పెరుమాళ్ల లీలా — లేక తోచిన యెఱుక లేనేలేదనుచునీ — కీ కీలుగురునీచే యెరుకైతే .... (70)

(2) కందా॥ వడగల్లుదకము లోపల — తనకై తావొచ్చి తనకు తానేగువిధం — బున పరిపూర్ణములోపల తన్కై తావొచ్చి యెరుక తనకై తాజనును — అచలమున్నదని తానెరిగిననూ — (71)

ఈ కందార్థముల తాత్పర్యము యీా క్రింది విధముగా చెప్పవచ్చును.

(1) బయలు కనబడుచున్నది. దానియందు (ఎఱుకను) ప్రపంచమును చూచుచున్నాము. ఎట్లనగా : మనము శిలతో చేసిన ఒక ప్రతిమనుగాని (లేదా నైసర్గికస్థితి ననుస

రించి ఒక శిల ప్రతిమాకారమును పొందియుండిన ఆ ప్రతిమనుగాని) చూతుము. అది శిలయే. అయినను చతుర్భుజములయందు శంఖచక్రాద్యాయుధములను ధరించినట్లున్న శిలామూర్తిని చూచి విష్ణువనుకొనుచున్నాము. ఇది, మందాంధకారమున త్రాటిని చూచి పాము అనుకొనునట్టి భ్రాంతిజ్ఞానము వంటిది కాదు. శిలయని తెలిసికూడ దానియందు విష్ణుభావన చేయుచున్నాము. వేదాంతులు చెప్పనదియు యిట్టిదియే. ఉన్నది పరబ్రహ్మమే. అనిర్వచనీయమాయాప్రభావమున, పరబ్రహ్మమునే ప్రపంచరూపమున చూచుచున్నాము. ఘటాకారముననున్న మృత్తికను ఘటముగను, కనకమును కంకణరూపముగను, చూచుచున్నట్లు బ్రహ్మమునే జగద్రూపమున చూచుచున్నామను అద్వైతుల మార్గమును కృష్ణదాసుగారు అనుసరించినట్లే కదా ?

(2) రెండవ కందార్థమునందలి భావమిది :— జలమును బయలుతో సామ్యము చేసి వడగండ్లను ఎఱుక (జగత్తు)తో పోల్చిరి. వడగండ్లు పూర్వము జలముగనే యుండెను. పిమ్మట కొంతసేపటికి జలముగనే మారినవి. మధ్యకాలమున జలము 'వడగండ్లు' అను నామరూపములతో వ్యవహరింపబడెను. ఇది అద్వైతులయందు బ్రహ్మపరిణామవాదుల మార్గమును సమీపించినది. ఇష్టముండియో, కాలు జారియో కృష్ణదాసుగారు అద్వైతమును సమీపించుటే కదా ?

ఇప్పుడు పోకల శేషాచలనాయుడుగారి మార్గమును విచారింతము. నాయుడుగారి శిష్యులగు పోలకం నరసింహులు శెట్టిగారు 'శ్రీకృష్ణరుక్మిణీసంవాదము' న శ్రీకృష్ణభగవానుడు రుక్మిణీదేవికి ఉపదేశించిన ఘట్టమున నిట్లు వ్రాసిరి:—

ఆ॥ నెలతవినుమ యింక నీ స్వస్వరూపంబు
బట్టబయలుగాని భ్రాంతిచేత
వెలయ దోచుచుండు విశ్వరూపంబైన
మాయనీవుగావు మధురవాణి. (5-177)

ఆ॥ ఎఱుక నేనటంచు నెన్నకు యెఱుకచే
నెఱిగి కేవలాత్మయే నటంచు
నెరుగు నెరుక నాకు గురుదక్షిణగ నిప్పు
డిమ్ము తడవులేక యిందువదన. (5-183)

ఈ పద్యములయందలి సారాంశ మేమి? 'అహం బ్రహ్మాస్మి' 'తత్త్వమసి' మొదలగు మహావాక్యముల అర్థములో పూర్తిగ అద్వైతులతో యేకీభవించిరి కదా? అంతమాత్రమే కాదు కొన్ని యంశములయందు జ్ఞానదేవుల యొక్కయు సమర్థులవారియొక్కయు తత్త్వములతో పోకల వారి అచలవేదాంతము యేకీభవించును.

శ్రీకృష్ణరుక్మిణీ సంవాదమను గ్రంథమును గుఱించి కొంత చెప్పవలసియున్నది:— శ్రీమద్భాగవత పురాణాను సారము శ్రీకృష్ణ బలరాములు కంసవధానంతరము సాందీపని వద్ద అఱువదినాలుగు విద్యల నభ్యసించిరి. భాగవత పురాణమును దీక్షితులవారు అంగీకరించియుండిరి. శ్రీకృష్ణభగవా

నుడు సాందీపని వద్ద బ్రహ్మవిద్యను (వేదాంతమును) అభ్యసించినట్లు భాగవతపురాణమున చెప్పబడి యుండలేదు. రుక్మిణీదేవిని భగవానుడు వివాహమాడిన తరువాత భగవానుడు సాందీపనిసన్నిధికి పోయి యీ అచలబోధను తెలిసికొనివచ్చి రుక్మిణీదేవికి బోధించెనట. ఈ యంశమును దీక్షితులవారును అంగీకరించిరి. కాని, ఈ కథ భాగవత పురాణమునందు లేదే? వీరి కాధార మేమి? శ్రీకృష్ణభగవానుడు బాల్యముననే (సాందీపనికడకు విద్యార్థియై పోవుటకుముందే) ఒక శరద్రాత్రియందు గోపికలకు తన నిజస్వరూపమును ఉపదేశించినట్లును, ఉద్ధవుని ముఖమున గోపికలకు పంపిన సందేశమునందును (భ్రమరగీతలయందును) వేదాంతసారమును ఉపదేశించియున్నట్లు కలదుకదా? భగవానుడు సర్వజ్ఞుడయ్యును కొందఱిని అనుగ్రహించుటకొఱకు (వారి పూర్వజన్మతపఃఫలమును వారికి ప్రసాదించుటకు) వారికి శిష్యుడయ్యెను. భగవానుడు ఉపమన్యుడను శైవునివలన శాంభవదీక్ష గైకొనినట్లు శివపురాణమున కలదు. మఱియు "దేవకీపుత్రుడగు కృష్ణుడు 'ఘోర' అను అంగిరస్సువలన బ్రహ్మవిద్య నెఱిఁగె" నని ఛాందోగ్యోపనిషత్తు తృతీయ ప్రపాఠకము 17-వ ఖండము 6-వ మంత్రమున చెప్పబడినది. సారాంశ మేమన శ్రీకృష్ణభగవానుడు సాందీపనివలన అచలబోధ నెఱిగెననుట పుక్కిటిపురాణము; దీని కాధారము లేదు.

ప్రస్తావవశమున వచ్చిన 'శ్రీకృష్ణరుక్మిణీ సంవాద' గ్రంథపసక్తిని వదలి ముఖ్యాంశమునకు మరలుదము :—

కృష్ణదాసుగారు, పోకలవారేగాక దీక్షితులవారును అద్వైతములోనికి జారిన సందర్భములు కలవని వారి ఈ క్రింది వాక్యముల వలన తెలియుచున్నది.

దీక్షితులవారు వారిగ్రంథమున కొన్నిచోట్ల సారులు శరీరము లేదన్నారు. ఆ యర్థమును దృఢపరచుటకు షోడశాక్షరి మంత్రమును కల్పించి రెప్పపాటుకాలమైనను దానిని మరువరాదన్నారు. ఆ మంత్రము "మూలంలేని యీ గుర్తెరిగే శరీరం యేమిలేదు" అనికదా? శరీరం ఉన్నదంటే నరకమన్నారు. శరీరంలో కొంత పరిశుద్ధి కొంత అబద్ధం అన్నవారు పుత్రమిత్రకళత్రాదులతో నిర్మాల్యమై పోతారు" అన్నారు. (౧౦ వ అధ్యాయములో యీ వాక్యముల) ఉదాహరించి యుంటిని. ఇందులకు విరుద్ధముగా శ్రీ దీక్షితులు అద్వైత ధోరణిని అవలంబించి యీ క్రింది వాక్యములను గమనింపవలయును.

"మూలంలేని యీ గుర్తెరిగే శరీరం వున్నదన్న సంగటమే, లేదన్న సంగటమే." (బృ ఉ. పు. 30) "ఛీ, అందుకే మూలంలేని గుర్తెరిగే శరీరం వున్నదన్న పాపమే లేదన్న పాపమే." (బృ ఉ. పు. 61, 62) ఈ వాక్యములు షోడశాక్షరీ పంచదశి మంత్రములను ఖండించుచున్నవి. అద్వైతుల మాయ అనిర్వచనీయమైనది. అది ఉన్నదీ కాదు, లేనిదీ కాదు. ఉన్నదన్నను తప్పే. లేదన్నను తప్పే. కనుక అనిర్వచనీయమనిరి. మాయయొక్క నిర్వచనమును గూర్చి (1-వ ప్ర: 5-వ అధ్యాయమునందు) చెప్పియుంటిని. అది

గాక, ఒకచోట నిట్లనిరి. "గురువు — ఓయీ! అవస్థాత్రయ భంగమయ్యే అచలము పొందెను." (బృ. పూ. ప్ర. 99) ఈ వాక్యము యొక్క అర్థమును గమనింతము. అవస్థాత్రయము నశింపగా ఆత్మసాక్షాత్కారమయ్యెను. అదియే తురీయమగు ఆత్మయని అదియే పరబ్రహ్మమని మాండూక్యోపనిషత్తు చెప్పినది. అవస్థాత్రయము పోయినను నాలుగవ శరీరమున్నదని దీక్షితులవారు అనేకపర్యాయములు చెప్పియు, తుదకు అవస్థాత్రయరహితమగు 'అచలమును' పొందెననగా అద్వైతులు చెప్పినదానిని అంగీకరించినట్లయినది. ఇంకొకవిషయ మేమన :— దీక్షితులవారు, వారి గ్రంథమునందంతటను ఉత్త బట్టబయలు సగుణ నిర్గుణములు కానిదని చెప్పియుండియు రెండుచోట్ల "ఈ ఉత్త బట్టబయలే నిర్గుణం" (బృ. పూ. పు. 122) "ఈ ఉత్త బట్టబయలే. నిరంజనం నిర్గుణం" (బృ. ఉ. పు. 3) ఈ వాక్యములను ఇదివఱకే ఉదాహరించియుంటిని. అద్వైతులు బ్రహ్మమును నిర్గుణమనిన దానినే దీక్షితులవారును ఆమోదించిరి కదా? ఇట్టివి మఱికొన్ని గలవు. ఎన్ని చూపినను సారాంశమొక్కటే.

పర్యవసాన మేమనగా :— శ్రీ దీక్షితులు, అద్వైతమును వారి అచలబోధకంటె తక్కువైనదను సిద్ధాంతమును స్థాపింపదలచి దానియందు కృతార్థులు కాలేకపోగా యేదో ఒకవిధముగ అప్పుడప్పుడు బుద్ధిపూర్వకముగనో తెలియకయో అద్వైతమునే ఆశ్రయించిరి.

(౩౯) దీక్షితుల మతము (బోధ)
అవైదికము - మాయావాదము

జిజ్ఞాసువు :- అయ్యా! దీక్షితులవారి మతమును 'అచలవేదాంత' మని చెప్పుచుంటిరి కదా? అది వేదాంతమేనా?

వేదాంతి :- వేదాంతమని నే ననుటలేదు. 'అచల వేదాంత' మనుచున్నాను. దీక్షితులవారు, వారి మతమును 'అచలబోధ' యనిరి. 'మహాద్వైత' మనిరి. వేదాంతము కాదనిరి. కాని, వారి "బృహద్వాశిష్ఠ సిద్ధాంత" మను 'శివరామదీక్షితీయ' గ్రంథమునందలి ప్రతి ప్రకరణాంతమందును "ఇతి శ్రీమద్గురు శివరామదీక్షితప్రభావే వేదాంత విచారణే" అని యున్నది. వేదాంతమునకును అచలబోధకును భేదము తెలియజేయుటకు అచలబోధను 'అచలవేదాంత' మని నే నంటిని. అంతియకాని వారి మతమునకు 'వేదాంత' మని నేను పేరుపెట్టలేదు. వారు వేదాంత మనిరి. కనుక, నేను 'అచలవేదాంత' మనవలసి వచ్చినది. ఒక వ్యక్తి తన పేరు 'జగదీశ్వరు' డని చెప్పుకొనిన లోకులందఱు ఆ నామముననే అతనిని చెప్పుదురుకదా? ఆవ్యక్తికి జగదీశ్వరత్వము కలదా, లేదా? అని విమర్శింపరు కదా? ఇది లోకాచారము. నేనును లోకాచారమును పాటించితిని.

దీక్షితులవారు రచించిన బృహద్వాశిష్ఠ సిద్ధాంత మను గ్రంథమును పోకల శేషాచలం నాయుడుగారు శోధించి అందలి విషయమును సంగ్రహించి (అందుండి కొన్ని

వాక్యములు తొలగించి) శివరామదీక్షితీయ మను పేర 'క్రౌన్ సైజు'లో 117 పుటలలో అచ్చువేయించిరి. ఈ యంశము తొలుత (రెండవ ప్రకరణము, 3-వ అధ్యాయములో) చెప్పియుంటిని. ఆపుస్తకము 1951వ సంవత్సరమున అయిదవ మారు (5 వ కూర్పు) అచ్చువేయబడినది. ఆ గ్రంథమున అచల బోధను గుఱించి దీక్షితులవారు వారి శిష్యులగు కంబాలూరు అప్పారావుగారికి యీ క్రింది విధముగా చెప్పినట్లు వ్రాయబడియున్నది :—

"యోరి యప్పయ్యా! ఈ యచలబోధనుం బట్టుటకు బ్రహ్మాదులకైన నలవికాదు. సద్గురు వాక్యముల నమ్మి సంశయము లేనివాడవుగమ్ము. సంశయములు తోచినయెడల నిన్ను రక్షించుటకు నెవరికి నలవికాదు. నీ సంశయమే జనన మరణంబులకుఁ గారణంబగును. నేను నీకు బోధించెడు నచలబోధ త్రిలోకంబులకును త్రిలోకవాసులకును, వేదంబులకును, ఉపనిషత్తులకును, శాస్త్రంబులకును, మిగుల విరుద్ధముగా నుండును."

అచలబోధ వేదశాస్త్రములకు విరుద్ధమని ఆ సంప్రదాయమునకు చెందినవారే చెప్పియుండగా అచలవాదులు కొందఱు అందుకు విరుద్ధముగా వైదికమని చెప్పుట తగదు. కాని, కృష్ణదాసుగారు "ఆగమ నిగమోపనిష త్సాగర మథితార్థ" మనియు, (కందా. 19) "సకల నిగమాగమాది ప్రకర మహానారికేళఫల సారము" (కందము 26) అనియు, వారి కందార్థములను కందములను పొగడుకొన్నను, ఆగ్రంథముల యందే శ్రుతులను అనేకచోట్ల నిందించియున్నారు.

అచలబోధను శివుడు నయిత మెఱుగడని దీక్షితుల

వారు యీ క్రింది వాక్యములను చెప్పియున్నారు.

"సకల దేశాలయందు సర్వకాలాలయందునూ, సమస్తమైన వస్తువులయందూ క్రియాశూన్యమై చలించక తనకు తానే స్వతస్సిద్ధమై యున్నది. అటువంటిదాన్ని మూడుకన్నులు వున్నవాడయినా సూచనచెయ్యలేడు.". (బృ పూ. పు. 125)

జిజ్ఞాసువు :- అచలబోధకు కర్త దీక్షితులవారేనా? వారికంటె పూర్వమున ఉండిన శ్రీధరస్వామి మొదలగు వారా?

వేదాంతి :- అచలబోధను 'బృహదాన్వాసిష్ఠసిద్ధాంతము'నందు చెప్పియున్న రీతిగా స్థాపించినవారు దీక్షితుల వారేనని నా అభిప్రాయము. అట్లు చెప్పుటకు యీ క్రింది ఆధారము లున్నవి.

కృష్ణదాసుగారు యిట్లు చెప్పిరి.

కందా. శ్రీమించు నచలబోధను
యేమహనీయుండు జేసి యెగడల్లెనోయీ
భూమిన్ సుజనులకొరకా
రామడుగన్వయజ శివరామదీక్షితులన్
తలచి అప్పారావ్ గుణతతులర." (కందా. 6)

అని చెప్పియున్నందున ఈ అచల మత స్థాపకులు దీక్షితుల వారే అనవచ్చును. కృష్ణదాసుగారు "కందార్థగురువుల"ను రచియించిన పిమ్మట సుమారు పంతొమ్మిది సంవత్సరములకు పరమతత్వకందములు" అను గ్రంథమును రచియించిరి. అందు "దత్తుని శ్రీధరమూర్తిని - నిక్షేపముగా దలంచి" (కందము.

15) అని దీక్షితులవారి గురువును శ్రీధరమూర్తియని పేర్కొనిరి. కాని, "శ్రీధరస్వామి" అని అనలేదు. శ్రీధరమూర్తియే శ్రీధరస్వామి యని మనమనుకొన్నను, మొదట కందార్థపదములు వ్రాసినప్పుడు లేని యీ శ్రీధరమూర్తి 19 సంవత్సరముల తరువాత కృష్ణదాసుగారికి ఎట్లు జ్ఞాపకమునకు వచ్చెనో తెలియదు. అది యట్లుండ, "రాదు పోదు శివరామ దీక్షితులు బోధపరచినా అచలమిది" అను కీర్తనలు విరివిగా ప్రచారములో ఉన్నవి. ఈ కారణములవలన అచలబోధ స్వరూపము పూర్వ మెట్లుండినను బృహద్వాసిష్ఠ సిద్ధాంత గ్రంథమున చెప్పబడిన అచలబోధకర్త దీక్షితులవారే అని నా యభిప్రాయము. దీక్షితులవారు వారి గురువునుండి గ్రహించిన బోధతో తమ అభిప్రాయములను కొన్నింటిని చేర్చి, గురువు చెప్పిన బోధయందు కొన్ని మార్పులు చేసి, బృహద్వాసిష్ఠ సిద్ధాంత గ్రంథమున చెప్పబడిన అచల వేదాంతరూపమును దీనికి కలిగించుటవలన దీక్షితులవారే అచలతత్త్వకర్తలను ఖ్యాతి (ప్రతీతి) కలిగియుండును. ఇందలి లోపములకు దీక్షితులవారి గురువులు బాధ్యులు కారని నా యభిప్రాయము.

దీక్షితులవారి గురు పరంపరకు చెందిన వారిలో కొందరు పెద్దలు అద్వైతమున యేవో కొన్ని చిన్న మార్పులను చేసి 'అచల' మని పేరిడియుందురు. వాచస్పతి మొదలగు పెద్దలు శ్రీ శంకరానుయాయులై యుండియు, మూల తత్త్వమునకు దెబ్బతగులని విధమున శంకరాద్వైతమును మార్పు చేసియుండిరి కదా! అట్లే దీక్షితులవారికంటె పూర్వ

మున అచలబోధ దీక్షితులవారు చెప్పిన విధముగా గాక సుతక్కొంతమార్పుతో ఉండవచ్చునని చెప్పియుంటిరిగదా? 'అచల' మనిన 'ఆత్మ' 'బ్రహ్మము' అను నామములకు పర్యాయపదమని వేదాంతులెల్లరు నెఱింగినదే. "అద్వైత సుధానిధి"* అను గ్రంథమున ఒక శ్లోక మిట్లున్నది:—

"శిలాభావం పరిత్యక్త్వా శివభావంచ కారయేత్
శివభావం పరిత్యక్త్వా ఆత్మభావంచ కారయేత్
ఆత్మభావం పరిత్యక్త్వా అచలభావంచ కారయేత్
ఏవం విజ్ఞానసంప్రాప్తే సద్యోముక్తిర్న సంశయః.".

దీని తాత్పర్యము సులభమే. శిలారూప శివలింగమును బ్రహ్మ భావనచే ఉపాసించువాడు బ్రహ్మమును సాకార సగుణమూర్తిగా భావించును. శిలారూపమున నున్న శివలింగమే శివుడని కొంతకాల మట్లు ఉపాసించినను, శివలింగమును(శిలాభావమును) వదలి శివభావమును చేయవలయును. ఇచట పూర్వమున్న సాకార సగుణములయందు సాకారమును వదలి సగుణమాత్రునిగా శివు నుపాసన చేయవలయును. అట్టి శివభావమును సయితము వదలి శివుని 'ఆత్మ'గా భావన చేయవలయును. ఇచట ఆత్మ అనగా జీవుడని అర్థము చేసికొనవలయును. అట్టి జీవ భావమును సయితము పరిత్యజించి 'అచల' భావము, అనగా నిర్గుణ బ్రహ్మ భావము చేయవలయును. అట్లు నిర్గుణ బ్రహ్మతత్త్వమును ఎఱింగినవానికి సద్యోముక్తి కలుగునని తాత్పర్యము.

* అద్వైతసుధానిధి అను గ్రంథము అద్వైతమును బోధించును అచలమును బోధింపదు.

ఇందు దోషమేమియును లేదు. ఇచట 'ఆత్మ' భావమును పరిత్యజింపుమనగా నిర్గుణభావమును కూడ పరిత్యజింపుమని యర్థముకాదు. ఎచటనో లభించు నిట్టి శ్లోకములకు విపరీతార్థమును చేసి అచలబోధ అద్వైతమునకన్న గొప్పదని, శ్రీ శంకరులు అచలబోధ నెఱుగరనుట మిక్కిలి సాహసము.

శ్రీ శంకరాచార్యులను వారి అనుయాయులను మాయావాదులని దీక్షితులవారు పెక్కు పర్యాయములు చెప్పిరి. మాయావాదు లెవరు, అను అంశమును విచారింతము. దీక్షితులవా రిట్లు చెప్పిరి.

"........ తానువేరే శరీరంవేరే అని వాదించేది తత్త్వవాదము. అదే మాయావాదము". (బృ. పూ. పు. 22)

శ్రీ శంకరులుగాని, వారి అనుయాయులుగాని, మాయావాదులు కారు. వారు బ్రహ్మవాదులు. బ్రహ్మమొక్కటే సత్యము, తక్కినదంతయు మిథ్యయనువారే బ్రహ్మవాదులు. శ్రీ శంకరులను, వారి అనుయాయులను 'మాయావాదు'లని శ్రీమద్రామానుజ, శ్రీ మధ్వ, శ్రీ జ్ఞానేశ్వరుల వంటివారు అనిరి. వా రట్లనుట ఉచితమా? కాదా? అను సంశ మెట్లున్నను, వారట్లనుటలో కొంత అర్థమున్నది. కాని దీక్షితులవా రట్లనుట అర్థరహితము. శ్రీ దీక్షితులు పూర్తిగ మాయావాదులై యుండియు, బ్రహ్మవాదులను మాయావాదులనుట సరికాదు. దీక్షితులవారే మాయావాదు లనుటకు హేతువును చూపుదును.

దీక్షితులవారును, కృష్ణదాసుగారును ఎఱుకను 'మాయ' యనిరి. వారి వాక్యములబట్టి ఎఱుకే నేను నీవు, ఎఱుకే బ్రహ్మాండములు, ఎఱుకే యెఱుకమరపులు; సమస్తమును యెఱుకయే. అదియే 'మూలమాయ', దాని నదియే యెఱుగును. బయలు నెఱుగునదియును అదియే. ఎఱుక లేకున్న బయలు లేదు. బయలు యొక్క కలిమి యెఱుకపై ఆధారపడియున్నది. అని చెప్పిరి.

ఇప్పుడు విచారింపుము. దీక్షితులవారిది మాయా వాదమా? శ్రీ శంకరులవారిది మాయావాదమా? ఎవరో అద్వైతమును మాయావాదమనిరని దీక్షితులవారును అనుటకు కారణము వారికి అద్వైతమునందు తగినంత జ్ఞానము లేకపోవుటయే కదా? ఇందుకు వారివాక్యముల కొన్నింటిని ఉదాహరింతును :—

"అద్వైతమంటే విశిష్టాద్వైతమే".

(బృ. ఉ. పు. 134)

"అగ్నిహోత్రాలు యెందుకు చేస్తారు. మాదిగవాండ్ల వలె, మాలవాండ్లవలె, మేము బ్రాహ్మణులమని అనుమానం యెందుకు వుండవలె? అందుకే మాయావాదుల మార్గం విచారించండి" (బృ. ఉ. పు. 135)

"అద్వైతమువలె దేహం అబద్ధం దేహినిబద్ధి అన్నట్లు కాదు" (బృ. ఉ. పు. 147)

"సర్వానర్థమూలం అద్వైతం గనుక వొకటి లేనిది వొకటి నిజం". (బృ. ఉ. పు. 35)

"అద్వైతం మిథ్యాజ్ఞాన స్వరూపం".

(బృ. ఉ. పు. 36)

ఇందుకు నా సమాధానము :— అగ్నిహోత్రములు అద్వైతులు మాత్రమే చేయుచున్నారా? దేహము అసత్యము, దేహిసత్యము అని అద్వైతులు మాత్రమే చెప్పుచున్నారా? వైదికమత సంప్రదాయములకు చెందిన ద్వైత - విశిష్టాద్వైతాది సమస్త శాఖలవారును అగ్నిహోత్రములు చేయుచుండ లేదా? దేహము అసత్యము - దేహిసత్యము అని సమస్త వైదికసంప్రదాయములకు చెందిన దర్శన కారులు ఏకకంఠముగ చెప్పుచుండుట లేదా? "అద్వైతమంటే విశిష్టాద్వైత" మట. అద్వైతమును గురించి సామాన్యముగ తెలిసినవారైనను ఇట్టిమాట లనరే. దీనిని బట్టి దీక్షితుల వారికి అద్వైతమునందు నిర్హేతుక ద్వేషము కలదని మంద బుద్ధులైనను తెలిసికొనగలరు.

పర్యవసాన మేమనగా :— దీక్షితులవారిదే మాయావాదము. అది అవైదికము. వైదిక శాఖ లన్నింటికిని విరుద్ధము. బౌద్ధ, చార్వాక, జడాద్వైతి, సమర్థ రామదాస స్వామి వారి మతములు కలసిన ఒక కలగూరగంప వంటిది.

(౪౦) గురువులు - శాస్త్రములు

గురుసహాయము లేనిదే బ్రహ్మవిద్య లభింప దని చెప్పుదురు. ఇది చాలవఱకు సత్యమే. కాని, గురువు లేకయే బ్రహ్మవిద్యను పొంది ముక్తులైన మహాత్ములు కలరు. గురు

వులకు గురువగు భగవంతుడు కలడు. వాని కరుణ కలిగిన మానవ గురువులతో పనిలేదు. భాగవతపురాణమునందలి అవధూత యదుసంవాదమును ఘట్టమున "తనకు (అవధూతకు) మానవులేగాక పశు, తేనెటీగలు మొదలగునవికూడ గురువులే" యని అవధూత యదురాజునకు చెప్పినట్లు కలదు. సత్యకామజాబాలుడు బ్రహ్మోపాసనమును ఋషభము, నీటికోడి, హంస, అగ్ని వీటినుండి వినెను. వాటిని ప్రేరేపించి వాటినుండి మానవభాషణముల వెలువరింప చేసిన వాడెవడు? అతడే గురువులకు గురువు. ఆధునికులయందు సుప్రసిద్ధ మహాపురుషులగు శ్రీ అరవింద యోగి, శ్రీ రమణ మహర్షి వంటి వారు గురువులేకయే బ్రహ్మవిదులైరి. ఆత్మచింత అధికముగ గలవాడు గురువులేకయే సంసారమునుండి తరింపగలడని దీక్షితులవారు అంగీకరించియున్నారు. వారి వాక్యముల నీ క్రింద నుదాహరించుచున్నాను :—

"…. శిష్యుని కొరతతీర్చక గురువు చనిపోయినా ఆ గురువునకు జన్మముకలదు. శిష్యునకు జన్మములేదు ………. గురువు చనిపోయెనేని మరిమరి విశేషముగా చింత కలుగుచున్నది. ఆచింతకు మితములేదు. ఆచింత యేచింత యనగా అది ఆత్మచింత. ఆచింత అధికమైన పరమార్థమును పొందించును. లోకమందు యెవరైన అరక్షణము ఆధ్యాస చేసినట్లాయనా అటువంటివానికి జన్మరహితమని శాస్త్ర పురాణాది గ్రంథములలో చెప్పుచున్నది. అది నిజమేకదా, అది నిజమైతే యెప్పుడు ఆత్మచింత గలవానికి జన్మరహితము కానేరదని యేలననుకోవలెను? వానికిన్ని జన్మరహితమే. గురూపదేశమైతేగాని

జనన మరణ రహితముగాదని అనుకోవలెనా? అనుకోవలసిన పనిలేదు. ఎందుకు యీ సందేహము గలుగును? ఈ సందేహమునకు అవకాశములేదు. (బృ. పూ. పు. 38)

"అధ్యాస చేసినట్లాయనా" అనినదాని కర్థము లేదు. "అభ్యాసము" అని యుండవలెను. ఎప్పుడును ఆత్మచింతగలవానికి గురువు సహాయము లేకయే జన్మరాహిత్యము కలుగునని దీక్షితులవా రంగీకరించిరి. నేను వారి వాక్యముతో నేకీభవించుచున్నాను.

ఎవరికి బ్రహ్మవేత్తయగు గురువు లభించునో అట్టివారు అదృష్టవంతులు. దురదృష్టవంతులు కొందఱు అజ్ఞానులను గురువులుగా పూజించుచున్నారు. 'యోగవాసిష్ఠము' నం దొకచోట చెప్పిన దేమనగా :—

శ్లో॥ తావత్తావ త్స్వకేనైవ చేతసా ప్రవిచార్యతే,
యావ ద్ధ్యాన ద్విచారాణాం సీమాన్తః సమవాప్యతే.
(యో. వా. 5-12-16)

తా॥ ఆత్మజ్ఞానము లభించునవఱకు స్వచిత్తముచే తత్త్వవిచారము లెస్సగ నొనర్చుచునే యుండవలయును.

శ్లో॥ న తద్గురో ర్న శాస్త్రార్థా న్న పుణ్యా త్ప్రాప్యతే పదమ్,
యత్సాధు సంగాభ్యుదితా ద్విచారవిశదాద్ధృదః.
(యో. వా. 5-12-17)

తా॥ సజ్జనసాంగత్యమువలన వృద్ధినొందినదియు, ఆత్మతత్త్వవిచారముచే విశాలమైనదియు నగు తన హృదయముచే లభించు నుత్తమ పథము గురువులచేతగాని, శాస్త్రార్థములచేగాని పుణ్యములు చేయుటచేగాని లభింపదు.

శ్లో॥ సుందర్యా నిజయాబుద్ధ్యా ప్రజ్ఞయేవవయస్యయా,
పదమాసాద్యతే రామ ననామక్రియయాన్యయా.

(యో. వా. 5-12-18)

తా॥ అట్టి బ్రహ్మపదము ఉత్తమశాస్త్రములు శోధించుటవలన కలిగిన వివేకముచే శోధితమై ఊహాపోహాకుశలమయినదియు అనురాగవతియగు సఖినిబోలిన నిర్మల బుద్ధిచే ప్రాప్తించును గాని అన్యమగు నెట్టి క్రియచేతను ప్రాప్తింపదు.

శ్లో॥ ప్రజ్ఞావా నసహాయోఽపి విశాస్త్రోఽప్యరిమర్దన,
ఉత్తరత్యేవ సంసారసాగరా ద్రామ పేలవాత్.

(యో. వా. 5-12-22)

తా॥ రామా! ప్రజ్ఞావంతుడసహాయుడైనను శాస్త్రశ్రవణము లేనివాడైనను జ్ఞానమాత్రముచే సంసారసాగరమును సులభముగ దాటగలడు.

మఱియు యోగవాసిష్ఠమునం దిట్లున్నది.

ఆత్మవిశ్రాంతి పొందనివానియందు గురుభావముంచువానికి నిరావరణ స్థలమునకు జాగిలమును (వేటకుక్కను) పిలుచుటవలన నెట్టి ఫలము కలుగునో అట్టి ఫలము కలుగునని చెప్పబడినది.—

నిజమైన ముముక్షువులు, జిజ్ఞాసువులు, మాయావుల చేతులలో పడి జీవితమును వ్యర్థము చేసికొనుచున్నారు. గురువుకొఱకు తొందరపడక సద్గురువు లభించునంతవఱకు పరమగురుడగు భగవంతుడే గురువని నమ్మికొని శాస్త్ర

ధ్యయనమును చేయుచు తమవంటి ముముక్షువుల సాంగత్యముతో సద్విచారము చేయుట యుక్తము.

కొందఱు గురువులమని చెప్పుకొని, ఒక్క-క్షణములో బ్రహ్మమును చూపగలమని వారి శిష్యుల మూలమున ప్రచారము చేసికొనుచుందురు. వర్తమాన కాలమున నిది జీవనోపాయమునకు ఒక వ్యాపారముగ నున్నది. ఈ ప్రసంగమును వదలి యీ యంశమున దీక్షితులవారు చెప్పిన దేమో దానిని వివరింతును.

"చెప్ప శక్యంగాని ప్రశ్నలకు ఎవ్వరూ భ్రాంతిలేకుండా చెప్పరు, యేభాష్యాలు భ్రాంతిలేకుండా చెప్పలేను. ఎషువంటి వారికీ చెప్పగానే భ్రాంతిపోవద్దా? నిప్పుదగ్గరకుపోతే చలి పోయినట్లు వుండవలె. భోచేస్తే ఆకలి తీరినట్లు యుండవలె. ప్రయాణం నుంచి యింటికివస్తే ఆయాసం పోయినట్లు వుండవలె. అన్నీ సరేగాని దాటించేవాడు ఘుట్టివాడు కావలె".

(బృ. పూ. పు. 60)

దీక్షితులవారు బయలును చూచిన తన శిష్యుడు చెప్పిన వాక్యములుగా యిట్లు చెప్పిరి. ఆ శిష్యుడు ప్రకృతి యుట.

ప్ర॥ గురుకటాక్షం చేత అనాయాసమాయ—వాక్క-భ్రాంతి పుట్టకపాయ. చేసినా—విడిచినా పూరకేవున్నా వాక్క-చే ప్రకారం అచలం చలించదు. గనుక దర్వాజా తీసినట్లు ఆయ*

(బృ. పూ. పు. 110)

---

* ప్రకృతి అను శిష్యురాలికిని ఆమె గురువునకు జరిగిన సంవాదము.

దీక్షితులవారి పై వాక్యములను వినినవారికి యెంతో ఆశకలిగి ఆలస్యమెంతమాత్రము చేయక అచలగురుని కటాక్షమును (ఉపదేశమును) పొందగోరుదురు. బంగారమును అమ్ముటకు వర్తకునికడకు మనము దానిని తీసికొని వెళ్లిన అది శుద్ధమైన బంగారమా? కాదా? యని అతడనేక విధముల పరీక్షించి చొక్కమైనదైన కొనును. బ్రహ్మసాక్షాత్కారమును పొందినవాని లక్షణములుకూడ అట్లే పరీక్షింపవలయును. అట్టివానియందు ముఖ్యముగా చూడవలసిన గుర్తు లేవనగా — విషయవాంఛలనుండి గురువు విరక్తుడాయెనా లేదా యని.

శ్లో॥ విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః,
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వానివర్తతే. (గీత. 2-59)

పరతత్త్వమును చూచినవానికి ఇంద్రియములు మనస్సు తమంత తామే వశమగును కనుక విషయాభిలాషయే యుండదు. అట్టి స్థితప్రజ్ఞునకు ఇంద్రియనిగ్రహమునకై ఉపాసనాది సాధనము లక్కర లేదు. అచలగురుడు పరమాత్మను చూపగనే నిప్పువద్దకుపోతే చలిపోవునట్లు మనోనిగ్రహమైన అంతకంటె కావలసిన దేమున్నది?

బయలును చూచిన ఒక అచలవాది ఒక కీర్తన యిట్లు పాడినాడు.

"ఆహాహా యిదియేమిచిత్రమో సద్గురుని మహిమ యూహింపరాకున్నదీ — వేదశాస్త్రపురాణములు యితిహాసములు అరకాసుకును కొరగాకపోయెను."

అతడన్నట్లు, తెరతీసిన కసబడునట్లు బ్రహ్మమును చూచిన వేదశాస్త్రాదులను బండ్లతో తోలుకొనిపోయి సము ద్రమున కర్పింపవలసినదేకదా? ఇన్ని శాస్త్రములు శోధించి తెలిసికొనదగిన వస్తువును అచలగురుడు చేతికందించిన వేవాదు లెందుకు? శ్రీదీక్షితులు తరువాత చెప్పిన వాక్యము లలో శిష్యుడు పండ్రెండేండ్లు గురుసేవ చేయవలెనట. దేనికి? చిత్తశుద్ధికొఱకా? చిత్తశుద్ధితో పనియేమి? గురుడు బయ లును చూపించుట, శిష్యుడు చూచుట. ఇంతటితో సమ స్తము ముగిసినది కదా?

దీక్షితులవారి యీ క్రింది వాక్యములను గమనిం పుము.

"శి॥ .... నాకు శీఘ్రముగా సూచచెయ్యండి".

"ఈ ఉపదేశమునకు మంత్రములేదు. తంత్రము లేదు. యోగములుగావు. ధారణములుగావు. క్షేత్రములుగావు. వ్రత ములుగావు. తపములుగావు. యజ్ఞములుగావు. మహాసూక్ష్మ సులభము. ఈ సులభము పదిరెండు సంవత్సరములు శోధించ వలెను. ఈ వాక్యము మరువక యుండవలెను. ఆ మరణాంతము యుండవలెను". (బృ. పూ. పు. 18)

"గురువు యెటువంటి వా డనగా ఓడనడుపుటయందు సారథిగా నగుచున్నాడు. గురువునకు పదిరెండు సంవత్సరములు సేవచేయవలెను. దీర్ఘకాలము గురుసేవచేతగాని భ్రాంతిరహితలు కారు. శిష్యుడు యేమైన తొందరపడనీగాక, గురువునకు సహ నము గలుగవలెను. మాటలవలననే బోధ చేయుచుండవలెను". (బృ. పూ. పు. 17)

"గురువుదగ్గరకు శిష్యుడు వెళ్లి, పదిరెండు సంవత్సరములు వారికి శుశ్రూష చేయవలెను. గురువుకు ప్రతిదినము, ప్రదక్షిణముచేసి దీర్ఘనమస్కారము పదిరెండుసార్లు చేయవలెను. గురువు భార్యకున్ను అదేవిధముగా నమస్కారము చేయవలెను. గురువు యెంగిలి తినవలెను". (బృ. పూ. పు. 37)

ఒక్క క్షణములో 'దర్వాజా తీసినట్లు'' అయితే పంద్రెండు సంవత్సరములు శోధించు టెందులకు? అంతే కాదు, ఆమరణాంతము (ఆమరణము) గురువాక్యము మరువక యుండవలయునట. ఇతరులకంటెను వీరి యాధిక్యమే మున్నది?

జిజ్ఞాసువు:- అయ్యా! ఒక ముముక్షువునకు సద్గురువు లభింపలేదు భగవంతునిపై భారమువైచి వేదాంత శాస్త్రాధ్యయనము చేయును. అతనికి విముక్తి కలుగదా?

వేదాంతి:- యోగవాసిష్ఠము గురువులతోను శాస్త్రములతోను అవసరములేదని చెప్పిన వాక్యములు ఇదివఱకే చెప్పియుంటిని కదా! మఱల యీ ప్రశ్న యెందుకు? అయినను చెప్పెదను వినుము:— జ్ఞానము విజ్ఞానము యీ రెండును ముక్తి హేతువు లేనని శాస్త్రములును, పెద్దలును చెప్పిరి. జ్ఞానమనగా:— ముముక్షువు శ్రద్ధాళుడై ముక్తిని కాంక్షించి వేదాంత శాస్త్రములు చదివి వాటికి సరియగు అర్థమును గ్రహించిన అతనికి కలుగు వివేకము, లేక అనుభవము, జ్ఞానమనబడును. బ్రహ్మ పరోక్షానుభవము విజ్ఞానమనబడును. పరబ్రహ్మమును గురించిన సంపూర్ణ జ్ఞానము కూడ విజ్ఞానమనబడు నందురు. భగవద్గీతకు వ్యాఖ్యానములు

రచియించిన వారందరు నిట్లే చెప్పిరి. కాని, లోకమాన్య శ్రీ బాలగంగాధర్ తిలక్ మహాశయులు 'విజ్ఞాన' శబ్దమునకు భిన్నార్థమును చెప్పిరి. దానిని (14వ అధ్యాయమున) చెప్పియుంటిని. భగవద్గీతకు వ్యాఖ్యానమును రచియించిన వారిలో శ్రీ విద్యారణ్యస్వాములవారి గురువగు శ్రీ శంకరానందస్వాములవారు గీతయొక్క 3-41వ శ్లోకవ్యాఖ్యానమున జ్ఞాన, విజ్ఞాన శబ్దములకున్న అర్థభేదమును యిట్లు వ్రాసిరి :-

"చంద్ర, సూర్యులవలె సామాన్యముగను విశేషముగను ప్రకాశించునవియునగు జ్ఞాన విజ్ఞానములను"

అనగా :- పున్నమనాడు చంద్రుని వెన్నెలయందు ప్రపంచమును చూచినట్లు జ్ఞానమువలన బ్రహ్మసాక్షాత్కారమగుననియు, విజ్ఞానమువలన మధ్యాహ్నకాలమున సూర్యుడు ప్రకాశించుచుండగా ప్రపంచమును చూచినట్లు స్పష్టముగా బ్రహ్మ సాక్షాత్కారమగుననియు తాత్పర్యము. ఇదిగాక గీతయొక్క 6-8 శ్లోకము వ్యాఖ్యానమున జ్ఞాన విజ్ఞానముల భేదమును యిట్లు వ్రాసిరి—

"ఇట్టి శ్రుతి స్మృతి వాక్యముల బలమువలన శాస్త్రములను బట్టి సూర్యగ్రహణమును నిర్ధారణ చేయునట్లు సమస్తమును బ్రహ్మమాత్రమే యని నిరర్గళముగా నిశ్చయించుటకు జ్ఞానమని పేరు ...... నేత్రములద్వారా రాహుగ్రస్త సూర్యబింబమును దర్శించునట్లు నిర్విశేషముగా సర్వత్ర సంపూర్ణమైయున్న బ్రహ్మమును సాక్షాత్తుగా ప్రత్యక్షము చేసికొనుటను విజ్ఞానమని పేరు." కావున జ్ఞానికిని ముక్తి కలుగునని తాత్పర్యము.

గురువు లేకున్నను వేదాంత శాస్త్రములను చదివి వాటియొక్క సరియైన అర్థమును గ్రహించుటవలన జ్ఞానము కలుగును. జ్ఞానమువలన మోక్షము కలుగునని నా నిశ్చయము. సద్గురువు లభించినవానికి ముక్తి సులభముగ లభించును.

(౪౧) గురువు - శిష్యునకు బయలు సూచనచేయుట

గురువు శిష్యునకు బయలును చూపునట, చర్మచక్షువునకు కాదట, మరి దేనికి? జ్ఞాన చక్షువునకట. జ్ఞానమే నీవనిరికదా? 'కంటిలో పాపనే నీవనిరి' కదా? (కందములు 72 ; 102) దీక్షితులవారు యీ యంశమున చెప్పిన వాక్యముల నిట నుదాహరింతును :—

"ఈ ఉత్త బట్టబయలు ఎవ రెరుగుదురు, కేవలాత్మ ఈ ఉత్తపరం ముంజేతి కంకణమువలె నగుపడుచున్నది".

(బృ. పూ. ప్ర. 10)

"పరిపూర్ణ మనగా యీ కనపడునదే పరిపూర్ణము. ఈ కనపడేది పరము కాదని యందురేమో యిది బట్టబయలు కాకపోతే దీనిని మాత్రము నిషేధింపబడుచున్నదా? ఇది సృష్టికి పూర్వము ఉండలేదా? (బృ. పూ ప్ర. 10)

ఈవిధముగా దీక్షితులవారు బయలు అపరోక్షమని చూపినట్లు చెప్పిరి. (సృష్టి జరుగ లేదని జెప్పియు "సృష్టికి పూర్వము" అని అనుట తప్పుకాదా?) కృష్ణదాసుగారును అట్లే చెప్పిరి. కృష్ణదాసుగారి వాక్యములు కొన్ని మాత్రమే ఉదాహరింతును :—

"కనబడెడు బయలులోపల" (కంద. 78) "కావున నద్దేవుణ్ణ యిదిగో — కనుగొనవోయి" (కంద. 110) "ఈ ఉత్త బట్టబయలు" (కంద. 135) "వేదనకుమున్న దదిగో" (కంద. 136) "కనవచ్చు బయలులేదని యనవచ్చునె" (కంద. 138) "పరిపూర్ణమిదిగో" (కంద. 226) "అవ్వీ యీ బయలున్నది" (కంద. 49) "జ్ఞాన కర్త స్వరూపము — గాని బయల్ నదిగో చూచి" (కంద. 51) "యీ బయలుండ జూచి" (కంద. 54) "చూపించరానిది — యప్పాయల్లదిగో చూడుమని నే నీకున్ — చెప్పి చూపిస్తి మరువకు" (కంద. 63) ఈ విధముగా వారు, ఎఱుక బయలును యెఱిగినట్లు చెప్పిరి. అట్లనిన యెఱుక ద్రష్టయు, బయలు (అచలము) దృశ్యమును, అని అంగీకరించినట్లయినది. దృశ్యమంతయు నశించునదే. చూచిన ఎఱుక కూడా నశించునని అనేకపర్యాయములు చెప్పియున్నారు. అట్లయిన నిత్యసత్యమగు వస్తువేది? అచలవాదులలో కొందఱు 'చూపిస్తి' అనుటకు — చూపును నీకిస్తిని — అని అర్థమును చెప్పెదరు. దీక్షితులవారు చెప్పిన మఱికొన్ని వాక్యములను కూడ చెప్పెదను.

(1) "ఈ శరీరము ఎటువంటిదంటే సర్వము శూన్యం యెటువంటిదో అటువంటిది. శరీరము లేకుంటే ఏలాగున వున్నదో ఆలాగే పరిపూర్ణం వున్నది." (బృ. పూ. ప్ర. 1) మఱియు గురుశిష్య సంవాదరూపమున యీ క్రింది వాక్యములు చెప్పిరి :—

(2) "గు॥ మూలంలేని గుర్తెరిగే శరీరం లేకుంటే యేలాగో ఆలాగే వ్యవహారం యిటువంటిది. వారు గుర్తెరిగే చైతన్యరహితులు." (బృ. పూ. ప్ర. 3 అ. 4)

(3) "ఈ శరీరం లేకుంటే ఏలాగు వున్నదో ఆలాగే పరిపూర్ణం వున్నది." (బృ. ఉ. ప్ర. 6 అ. 6)

(4) గు॥ సర్వం మూలంలేని యీ గుర్తెరిగే శరీరం మేమి యేలాగో ఆలాగే పుట్టని చావని అచలం తనకు తానే స్వతసిద్ధమైవుండె.

(5) ప్ర॥ సరే అసాధ్యమంటే భయమాయె. యేసాధన లేకనే పరిపూర్ణం స్వతసిద్ధమై వున్నది. ఏమి ఆశ్చర్యం యింతే కదా."

(6) "గు॥ ఎంత గట్టిదానవు." (బృ. పూ. ప్ర. 7)

పై చెప్పిన ఆఱంశములలో సారాంశమేమన మొదటి నాలుగంశములయందలి సారాంశము యెఱుక యొక్క లేమియే, బయలని చెప్పినట్లు అర్థమగుచున్నది. ఈ యంశ మును దృఢపరచు యీ క్రింది వాక్యముల గమనింపుము :—

"గు॥ ఆలాగే మూలంలేని గుర్తెరిగే శరీర మేమిలేదని నిశ్చయమంటే చాలు. పుట్టని చావని ది తనకుతానే స్వతఃసిద్ధమై వున్నది. కనుక ప్రయత్నం యేమీలేదు." (బృ. ఉ. ప్ర. 6 అ. 6) అంతేగాక "ఈ ఉత్త బట్టబయలును యెవరు గుర్తెరు గరు." (బృ. పూ. ప్ర. 6) అంతేకాని, యిచట అపరోక్షాను భవ మేమియును లేదు. ఇంతమాత్రము తెలిసికొనుటకు దీక్షితులువారు చెప్పినట్లు సాధనములతోగాని యోగాదు లతోగాని అవసరము లేదు. కనుకనే (5-వ అంశమున) ప్రకృతి అను శిష్యురాలు దీని అర్థము నెఱిగి గురువును ప్రశం సించి "యింతేకదా" అని గురువు చూపిన సూచనను చులు కన చేసి చెప్పినది. ఇట్లు సులభముగా తెలిసికొన్న శిష్యు

కాలిని (6-వ అంశమున) "ఎంతగట్టిదానవు" అని గురువు ప్రశంసించుట జరిగినది. (5-వ అంశమున) "అసాధ్యమంటే భయమాయె" అనుట అందులో అసాధ్యమేమియు లేదని అర్థము. ఇంతమాత్రమునకా శిష్యుడు గురువుదగ్గరకు వెళ్లి పదిరెండు సంవత్సరములు వారికి శుశ్రూష చేయుట, గురువునకు ప్రతిదినము ప్రదక్షిణముచేసి దీర్ఘనమస్కారములు పండ్రెండుసారులు చేయవలెనట. గురువుభార్యకు ఆవిధముగనే నమస్కారము చేయవలెనట. గురువు యెంగిలి తినవలయునట. (ఈ వాక్యములు వెనుకటి అధ్యాయమునందు చెప్పినవే). గురువునకు ఎంతమంచి లాభమో చూడుడు. జీతము బత్తెము లేని సేవకుడు, పండ్రెండేండ్లు సేవ చేయవలెననిన గురువునకు అదృష్టమే. గురువుయెంగిలిని శిష్యుడు తినవలయునని చెప్పిరిగాని గురుపత్ని యెంగిలి కూడ తినవలయునని యెందుకు చెప్పలేదో? ఈ పండ్రెండేండ్లు శిష్యునకేవిధముగా జీవితము గడవవలెను. వాని భార్య పుత్రుల గతియేమి? ఈ మధ్యకాలములో గురువో, శిష్యుడో మరణించిన శిష్యునిగతి అధోగతియేనా? బయలు చూపుటకు దీక్షితులవారు పెద్ద బేరమే చెప్పినారు. ఇప్పుడిట్టి శిష్యులున్నారా?

జిజ్ఞాసువు :- అయ్యో! కొందరు గురువులు శిష్యులమీద దయగలవారై పరతత్త్వమును పొందుటకు ఆటంకములగు బుద్ధిగతమాలిన్యములు మలినవాసనలు పోగొట్టుటకై తమ శక్తిని శిష్యునియందు మొదట ప్రవేశపెట్టి బుద్ధిగత మాలిన్యమును పోగొట్టి తత్త్వోపదేశము చేయుదురని వింటిని. దానినిగురించి చెప్పుడు.

వేదాంతి :- అట్టి ఆచారమున్నట్లు గ్రంథములయందు చదివియున్నాను. దానినే 'శక్తిపాత' మందురు. ఇది హస్తమస్తక సంయోగమున కలుగును. వీరశైవులు దీనిని 'మేధా దీక్ష' యందురు.

శ్లో॥ గురోరాలోకమాత్రేణ హస్తమస్తక యోగతః,
యః శివత్వ సమావేశో మేధాదీక్షేతి సామతా. (సి. శి. 6-13)

తా॥ శ్రీగురుని కృపాదృష్టిమాత్రమునకు హస్తమస్తకసంయోగమాత్రమునను (శిష్యుని తలపై గురుడు తనచేతి నుంచుటవలనను) ఎట్టి జ్ఞానక్రియారూపమైన శివతత్త్వ సమావేశము కలుగనో అదియే మేధాదీక్ష యనబడును.

ఆ గ్రంథమునందే 'దీక్షా పాదోదక స్థలము' నందు యిట్లు వ్రాసిరి :—

గురు హస్తమస్తక సంయోగరూపమైనట్టిగాని శిష్య మస్తకాఘ్రాణ రూపమైనట్టిగాని, దీక్షావిశేషముచే గురు శిష్యుల యైక్యము చెప్పబడును. అనగా : గురువు తన తపశ్శక్తిచే సంగ్రహించిన శివతేజస్సును తనచేయి శిష్యుని తలపై యుంచిగాని, శిష్యుని శిరము మూర్కొనిగాని శిష్యుని యందు సంక్రమింపజేయును. దీనికే శక్తిపాతమని పేరు.

శ్రీ సీతారామాంజనేయ సంవాద మను గ్రంథమున నిట్లున్నది :—

సీ॥ అని యిట్లుబోధించి యానందమయుఁడగు
శ్రీరాఘవుఁడు నిజ శ్రీపదార

పిండంబులకు భక్తి వందనంబులు సేయు
హనుమంతు గనుగొని యప్పుడతని
శిరమును పూర్వాద్రి శిఖరంబుపై స్వక
రార్క మండలము డాయంగఁ జేర్చి
తనరు నీహస్తమస్తకయోగమిప్పుడే
తెలివి యొసంగు నా తెలివినీవు
తే॥ తెలివి నీవని తెలుపగాఁ దెలియు నెద్ది
యదియె నీవను వెలుఁగుచే ననిలసుతుని
ధీగతాజ్ఞాన నిశాంధతిమిరమెల్ల
బాపి కేవల తత్త్వరూపంబు జూపె.

శ్రీరామచంద్రుడు ఆంజనేయుని శిరమున తన హస్తము నుంచుటను 'హస్తమస్తక సంయోగ' మందురు. ఆవిధముచే శ్రీరామచంద్రుడు తనయందున్న కొంత శక్తిని ఆంజనేయునకు సంక్రమింపజేసెననియు, అదే కార్యమున ఆత్మస్వరూప మిట్టిదని అనుభవపూర్వకముగ తెలిపెననియు భావింపవలయును. ఈ పద్యమునందు 'నీ హస్తమస్తక యోగ మిప్పుడే తెలివి యొసగు నా తెలివి నీవు' అనియు 'తెలివి నీవని తెలుపగా తెలియు నెద్ది యదియె నీవు' అనియును రెండుమారులు 'నీవు' 'నీవు' అని తెలిపియుండుట వలన మొదట చెప్పిన నీవు 'చిదాభాసుడగు జీవ స్వరూపమును వివరించెననియు, రెండవమారు చెప్పిన 'నీవు' చిదాభాసుని తెలిసికొను తెలివి (జ్ఞానము) సాక్షియగు ప్రత్యగాత్మ స్వరూపమును యిట్టిదని వివరించి చూపుటచే ఆంజనేయుని

బుద్ధిగతమైన అజ్ఞానాంధకారము నశియింపజేసి కేవల తత్త్వమును (కేవలాత్మను) దర్శింపజేసెననియు, ఆ తరువాత చెప్పిన పద్యమున చెప్పియున్నారు. ఆంజనేయులు ఉపదేశ మాత్రమున ప్రత్యగాత్మ సాక్షాత్కారమును పొందుట శ్రీరామచంద్రుని శక్తిపాతము వలననేయని యూహించుకొనవలయును. అంతేకాక, ఆంజనేయులు పరమానందము ననుభవించెననియు చెప్పబడెను.

శ్రీరామచంద్రునకు వసిష్ఠమహాముని యొనర్చిన శక్తిపాతమువలన చిత్తము వికసించి కొంతతడవు పరమానంద సముద్రమున నోలలాడెనని యోగవాసిష్ఠమున కలదు.
(నిర్వాణ ప్రకరణము)

శ్రీ దక్షిణామూర్తి తనచూపులతోను, మందస్మితముతోను మఱ్ఱిచెట్టుక్రింద కూర్చుండి తన్ను పరివేష్ఠించియుండు మునుల అజ్ఞానమును పోగొట్టినట్లు శ్రీ శంకరులు వ్రాసిరి.

శ్లో॥ "అద్రాక్ష మక్షీణ దయానిధాన
మాచార్య మాద్యం వటమూలభాగే
మౌనేన మందస్మితభూషితేన
మహర్షి లోకస్య తమోనుదం తం." (దక్షిణామూర్తిస్తోత్రం)

గుర్వనుగ్రహమును గుఱించి మఱియొక యితిహాసమును వినిపింతును. శ్రీ శంకరుల శిష్యులయందు 'గిరి' అను శిష్యుడుండెను. వారికి సర్వమును వారి గురుదేవుడే. గురుదేవుని వస్త్రము లుతుకుట, వారి పాదములొత్తుట, గురువు స్నానమునకు పోవునపుడు వెంటపోవుట, భోజనాది సౌకర్యములొనర్చుట - యిట్టి సేవయందే వారికి కాలమంతయు

గడచిపోవును. గ్రంథపఠనముగాని, సాధనముగాని వారికి ఇష్టము లేదు. అందువలన వారికి శాస్త్రపరిచయము లేదు.

ఒకదినమున శృంగేరి ఆశ్రమమునందు పద్మపాదాది శ్రీ శంకరశిష్యులు ఉపనిషత్పఠనమున కుపక్రమించి శాంతి మంత్రమును పఠించుట కుద్యుక్తులుకాగా, శ్రీ శంకరులు వారిని చూచి 'ఆగండి. గిరికూడా క్షణమాత్రమున రాగలడు' అని చెప్పిరి. శ్రీ పద్మపాదులు శ్రీ గురువాక్యములు విని 'గోడవలె జడుడును శాస్త్రమున కనధికారియు నగు వానికొఱకేల యెదురుచూచెదరు' అని గోడను చూపించిరి.

పద్మపాదుల వాక్యములకు శ్రీ శంకరులు హృదయమున నొచ్చుకొని, అతని గర్వమడంచుటకును, తన్నే నమ్ముకొని యున్న గిరియెడలగల కారుణ్యముచేతను, తన మనస్సునందే గిరికి పదునాలుగువిద్య లుపదేశించెను. (పదునాలుగు విద్యలు గిరికి లభించుగాక యని మనస్సున తలచెను.) గిరి ఆశ్చర్యముతో తిరిగివచ్చి ఉపనిషత్తులయందలి అర్థము స్పష్టపరచుచు, గురుదేవుని తోటకవృత్తక రూపమగు శ్లోకములచే స్తుతించెను. అంత శ్రీ శంకరులు గిరికి 'తోటకాచార్యులు' అను నామకరణ మొనర్చిరి. సోదర శిష్యులు (సతీర్థులు) అతనిని సమ్మానించిరి. (శ్రీ శంకరవిజయము 12వ సర్గము.) శ్రీ శంకరులు తదనంతరము బదరికాశ్రమము నందలి శ్రీ మఠమునకు తోటకాచార్యులవారిని ప్రథమాచార్యులుగా నియోగించిరి.

ఇదికూడ ఒకవిధముగా శక్తిపాతము గావించుటే.

శ్రీరామకృష్ణపరమహంసగారు శ్రీ వివేకానందస్వాములవారికి శక్తిపాతము కలిగించిరని శ్రీరామకృష్ణపరమహంస జీవిత చరిత్రయందు చదివియున్నాను. శ్రీ రమణమహర్షి వారి శిష్యులగు కావ్యకంఠ గణపతిముని గారికి యిట్లే శక్తిపాతము నిచ్చినట్లు 'నాయన' అను గ్రంథమున కలదు. ప్రస్తుత కాలమున నిట్టి గురువులున్నట్లు వినుచున్నాము.

జిజ్ఞాసువు :- దీక్షితులవారును కృష్ణదాసుగారును బయలు 'ముంజేతి కంకణమని' 'ఈ కనబడేదే' నని చెప్పిరి కదా? అట్లయిన ఒకరు మరియొకరికి చూపింపవలసిన అవసర మేమి?

వేదాంతి :- కృష్ణదాసుగారు ఇట్లు చెప్పిరి :—

కం॥ అయమాత్మ యనిన రీతిగ
నయముగ నీబట్టబయలు నదిగో యనుటల్
అయ మియమని యనుటల్
క్కైయయిన ననవలెనె నీదు కీడుడుగుటకై. (కంద. 40)

ఈ పద్యభావ మేమన :— మేము (అచలవేదాంతులము) 'అదిగో బయలు' 'ఇదిగో బయలు' అని అనేక పర్యాయములు చెప్పియుండుట యెట్టిదనగా — మాండూక్య శ్రుతి 'అయమాత్మా బ్రహ్మ' అనుటవంటిదే. రెండును అబద్ధమే. ఇది టక్కు. ఇది దబ్బర. అయినను నీ కీడును పోగొట్టుట కిట్టి అసత్య మాడితిమి. అనిరి. —

వీరే వీరి 101 వ కందార్థమున గురుకృప కలిగిన పరోక్షమైన బయలు అపరోక్షముగు ననిరి. ఇవి పరస్పర

(౪౨) శబ్దబ్రహ్మవాదము - స్ఫోటవాదము

జిజ్ఞాసువు :- స్వామీ! ఏ సాధనము లేకనే 'ఎలుక లేకపోవుటయే బయలు' అని చెప్పగా విన్న శిష్యునకు యెలుక నశించునా?

వేదాంతి :- వారు యెలుకను గురించి యింకొక విధముగ కూడ చెప్పిరి. దానిని నీకు వినిపింతును. అందువలన విషయము చక్కగా బోధపడును. అది యేమనగా — దీక్షితులవారు వాక్కును యెలుక అన్నారు. అనగా — మాటయే యెలుకయట. ఎలుక చేత బయలును తెలిసికొనిన యెలుక లేకపోవునట. వారి వాక్యములను వినుము — "మాయ సమస్త భాషారూపిణి, గాయత్రీ సావిత్రీ సచ్చిదానంద రూపిణీ అని ఉన్నది" (బృ. ఉ. పు. 35) ఇదేవిధముగా మఱియొకచోట (బృ. ఉ. ప్ర. 5 అ. 4) యిట్లే చెప్పియున్నారు. "అజ్ఞానమే కారణశరీరము" (బృ. పూ. ప్ర. 4 అ. 1) ఇప్పుడు ఆలోచింపుము. గురువాక్యమనే జ్ఞానము (మహా కారణశరీరము) చేత అజ్ఞానమను కారణశరీరము నశింపగా బయలును చూపి యెలుక నశించినదని చెప్పిన వాక్యము నీకు బోధపడియుండును. ఇచ్చట (గురు) వాక్యమే యెలుక. అనగా — మాటయే యెలుక. ఇది ఒకవిధమగు స్ఫోటవాదము. శబ్ద బ్రహ్మవాదమువంటి వాదము. భారతీయ దర్శనములయందు శబ్దబ్రహ్మవాదమను శబ్దాద్వైత వాద మొకటి కలదు. ఇది నైయ్యాకరణులచే ప్రాచీన కాలమునందే స్థాపింపబడినదందురు. పాణిని మహర్షి వ్యాకరణమును రచియించిరి. వారి వ్యాకరణమునకు శ్రీ కాత్యా

యనులు వార్తికమును వ్రాసిరి. దానికి శ్రీ పతంజలి భాష్యమును రచియించిరి. వీ రందఱు యీ మతమునకు చెందిన వారని అందురు. వీరిమతము సంగ్రహముగ యిట్లుండును :—

ఆద్యంతములు లేని శబ్దమే బ్రహ్మము. ఇదియే ప్రపంచముగా (నానాత్వముగ) మారినది. భర్తృహరి (క్రీ. శ. 600-650) యీ మతమునకు చెందినవారు. శబ్ద బ్రహ్మ తత్త్వముయొక్క ప్రథమరూపము, ప్రథమనామము 'ఓమ్' అను ప్రణవము.* ఆ ఓమ్ నుండియే జగత్తు ఆవిర్భవించినది. శబ్దతత్త్వమే అవిద్యాసంబంధములేని అనంతాత్మయై యుండియు అవిద్యతోకూడిన జీవాత్మగ కనబడును. శబ్ద శ్రవణమువలన భావముదయించుట వాస్తవమే కాని భావము బ్రహ్మము (ఆత్మ) కాదని వేదాంతుల సిద్ధాంతము.

జిజ్ఞాసువు :- స్ఫోటవాద మంటిరికదా? అది యెట్టిదో ఆనతిండు.

వేదాంతి :- అది మనకు ప్రస్తుతాంశము కాదు. ప్రస్తావనవశమున ఆమాట చెప్పితిని. అయినను దానిని గుఱించి సంగ్రహముగ చెప్పెదను. — నేనిదివఱలో శ్రీవిద్యను గుఱించి నీకు చెప్పినప్పుడు కామేశ్వరీ కామేశ్వర దంపతీద్వయమునుండి నామరూప శాఖలు యెట్లేర్పడినవో ఆవిధమును, పరా, పశ్యంతి, మధ్యమా, వైఖరీ అను చతు

* ప్రణవమును గుఱించి యీ గ్రంథముయొక్క ద్వితీయభాగమునందలి మొదటి ప్రకరణము "(౧౧) ప్రణవోపాసన" అను అధ్యాయమున చెప్పియున్నందున యిచట విస్తరించి చెప్పలేదు.

వ్యవహరింపబడుచున్నది. కాని స్ఫోటము అఖండమే కనుక నిత్యమైనదే యందురు.

దీక్షితులవారు ఒకప్పుడు పరావాక్కును మెఱుక యను నర్థమిచ్చు వాక్యములను, వేఱొకప్పుడు వైఖరీ వాక్కును మెఱుకయను నర్థమిచ్చు వాక్యములను చెప్పియున్నారు. దీక్షితులవారి మెఱుకకును స్ఫోటమునకును భేదమున్నది. అట్లే శబ్దబ్రహ్మవాదుల మతమునకును దీక్షితుల వారి మతమునకును భేదమున్నది. ఇంత యేలచెప్పవలసి వచ్చెననగా, ఈ యంశమున కృష్ణదాసుగారు చెప్పిన వాక్యముల కొన్నింటిని ఉదాహరించి వాటి అర్థమును పరిశీలించుటకుగాను. కృష్ణదాసుగారి వాక్యములివి :—

కం॥ "మాటలేనట్టి బయలున
మాటకలిగెననుట వినుట మాయగదయ్యా
మాట మాయైతె మానెను
మాటను మాట్లాడి మనము మానుదమవలన్.

(కందము 2)

కం॥ మాటసుమీ నే ననినను
మాట సుమీ మాయ యనిన మరిజీవశివుల్
మాటసుమీ బ్రహ్మ మనినను
మాటసుమీ మేను జగము మాటేసుమ్మీ."

(కందము 137)

ఈ పద్యతాత్పర్యము సులభమే. మాటయే మెఱుక యట. 'రామ' అను రెండు అక్షరముల నుచ్చరింతుము. అవి విందుము. తిరిగి అవి వినబడవు. అనగా — మాయా

మగును. కనుక, మాట యన్నను మాయ యన్నను ఎఱుక యన్నను ఒక్కటే యని వారి భావము. ఇందుకు ఏ సాధనల తోను పనిలేదు. కనుక, వీరి మతము స్ఫోటవాద, శబ్ద బ్రహ్మవాదములతో పూర్తిగ నేకీభవించకున్నను కొంత వఱకైన సంబంధ మున్నట్లు తోచును.

స్ఫోటవాదమును నైయాయికులు, సాంఖ్యులు, అద్వైతులు, ఖండించిరి. ఎట్లనగా :— పదములయందలి ఒక్కొక్క యక్షరమును ఉచ్చరించునపుడు అంతిమ వర్ణ మును ఉచ్చరింపగనే అర్థస్ఫూర్తి కలుగుచుండగా, స్ఫోట మను నొకదానిని తెచ్చిపెట్టుకొనవలసిన అవసరములేదని ఇతర దార్శనికులు స్ఫోటవాదమును ఖండించిరి — ప్రణవ మును పరా పరబ్రహ్మమునకు ప్రతీకముగా ఉపాసకులు గ్రహించుట వేదాంతులకు సమ్మతమే.

సృష్టిసిద్ధాంతమునందు శబ్దమునకు ప్రాముఖ్యత కలదు. స్ఫోటవాదమును వదలి మఱికొంత లోతునకుపోయి శబ్ద బ్రహ్మవాదమును గైకొని విచారించిన మఱికొన్ని విషయములు బోధపడును. వేదములకు భాష్యములు రచి యించిన సాయనాచార్యులవారు సృష్టికి (కల్పమునకు) వేదములే మూలము లనిరి. సాయన సిద్ధాంతమును మహాత్ము లనేకు లంగీకరించిరి శ్రీ వివేకానందస్వాములవారు ఒక ఉపన్యాసమునందు,* సాయన సిద్ధాంతమును చక్కగా సమర్థించుచు నిట్లు చెప్పిరి :—

* శ్రీ వివేకానంద సంపూర్ణ గ్రంథావళి - సంపుటము 1 భాగము 1 ప్రకరణము 1 ఖండము 9 = [స్థలము కలకత్తా, సంవత్సరము 1897, ఋగ్వేదము మొదలగు వానిని గురించిన యుపన్యాసము —]

"వేద మనగా అనాదిసత్యములయొక్క సమష్టి. ఆ సత్యములు వేదములకు గోచరించెను. అతీంద్రియ దృశ్యానుభూతిగలవారికి మాత్రమే అవి గోచరించును. మనబోటి సామాన్యులకు గోచరింపవు. కావుననే వేదములయందు ఋషినామమునకు 'మంత్రార్థద్రష్ట' అని యర్థముగాని యజ్ఞోపవీతమును దాల్చిన బ్రాహ్మణుడు, అని కాదు. సంఘమును కులములుగా విభజించినది అనంతరకాలమున. వేదము శబ్దాత్మకము. లేక 'భావా'త్మకము. భావముల రాశికే వేదము అని పేరు. ప్రాచీన ఆర్షభాషలో 'శబ్ద' మనగా అప్రకాశిత రూపమున నుండు సూక్ష్మభావము. అదియే పిదప స్థూలరూపమున ప్రకాశితమగునది. జగత్తునకు ప్రళయము వచ్చినపుడు భవిష్యత్సృష్టికి మూలములగు సూక్ష్మ బీజములు వేదరూపమున సంక్షిప్తము లగును. కావునే భగవంతుని మొదటి యవతారమగు మత్స్యావతారమున వేదములు దృష్టిగోచర మొనర్పబడినట్లు పురాణములలో చెప్పబడినది. ఈ యవతారమున వేదములు మొదట ప్రకాశితము లగుటతోడనే, తక్కిన సృష్టి వికాసము లన్నియు రూపొంద నారంభించినవి. అనగా — వేదములోని శబ్దముల (భావముల)లోనుండి విషయ ప్రపంచమంతయు స్థూల రూపమున గోచరింపసాగెను. ఏలన 'శబ్దము' ('భావము') లో సర్వస్థూలపదార్థములును సూక్ష్మ రూపమున ఇమిడియుండును. పూర్వకల్పములన్నింటియందు కూడ సృష్టి ఇట్లే ఉత్పత్తియైనది."

జిజ్ఞాసువు :- అయ్యా! పూర్వకల్పమున రూప

నామములు అన్నియు నశించెను గదా? శబ్దము (భావము) నశింపలేదా?

వేదాంతి :- ఈ ప్రశ్ననే శ్రీ వివేకానందస్వాముల వారిని, వారి శిష్యుడు మరియొక విధముగా ప్రశ్నించెను. అందులకు శ్రీ స్వాములవారు చెప్పిన సమాధానమును, నాకు తెలిసిన సమాధానముతో చేర్చి నీకు బోధపడునట్లు చెప్పెదను. సావధానుడవై వినుము :—

మొదట నీవు సృష్టిలోని విచిత్రమును చక్కగా అర్థము చేసికొనుము. సృష్టి రెండు విధములు (1) ఈశ్వర సృష్టి, (2) జీవ సృష్టి. మొదటిదగు ఈశ్వర సృష్టియే పంచమహాభూతములును వానికి సంబంధించిన నామరూపములుగల వస్తుజాలమును. కాని, ఈశ్వర సృష్టిని మనము ప్రత్యేకముగ చూడజాలము. నేను నీకు ఇదివఱలో చెప్పిన కొన్ని విషయముల నిచట స్మరించుకొనుము.*

అంతఃకరణమునందు ప్రతిఫలించిన కూటస్థ (ఆత్మ) ప్రతిబింబము చిదాభాసుడని చెప్పియుంటిని. వెలుతురు సహాయమున బాహ్య ప్రపంచమునందున్న ఘటమును (కుండను) చూచినయెడల దాని ఆకారము నేత్రేంద్రియము ద్వారా మనస్సు గ్రహించి బుద్ధి యెదుట నుంచును. బుద్ధి ఘటాకారమును పొందును. చిదాభాస సంబంధమగు జ్ఞానము బుద్ధివృత్తియం దుండుటవలన ఘటాకారమగు బుద్ధి

* బ్రహ్మజిజ్ఞాస ప్రథమభాగము రెండవ ప్రకరణము (౨౯) కూటస్థ చిదాభాసులు (౩౦) దృగ్దృశ్య వివేకము (౩౧) సాక్షి విచారము అను అధ్యాయములు.

వృత్తిని చూచి ఇది ఘటము అని తెలిసికొందుము. ఈ ఘటమే జీవసృష్టి. తెలిసికొంటివనగా — ఈ ఘటము నే నీవు తెలిసికొన్నది. భూమిపై నుండు స్థూల ఘటమును కాదు. కాని, ఈ రెండును కలిసియే నీకు ఘటాకారమున గోచరించును. అనగా — ఈశ్వర సృష్టియు, జీవ సృష్టియు ఒక్కటి కావలెను. (అనగా కలసి పోవలెనని అర్థము). అంతఃకరణమునందు జీవసృష్టియగు ఘటము కలుగకుండిన బాహ్యమునకున్న ఘటమును నీవు చూడజాలవు. దానికిని నీకును సంబంధము లేదు. జీవసృష్టియగు ఘటాకారము, ఘటనామము నీయందు నిలిచిపోయినవి.*

ఈశ్వర సృష్టికి సంబంధించినట్టియు, బాహ్యమున నున్నట్టియు, ఘటము పగిలిపోవును. అప్పుడు దానికి ఘట రూపముగాని ఘటనామముగాని లేదు. కాని, జీవసృష్టియగు నీయందలి ఘటాకారముగాని ఘటనామముగాని నాశ మొందదు. స్థూల రూపమున నేలపైనున్న ఘటము నశించి నపుడు నీయందున్న సూక్ష్మఘటమునకు నాశమేల ఘటిం

---

* శ్రీ విద్యారణ్యస్వాములవారు పంచదశి 4-27 నం దిట్లు చెప్పిరి.

శ్లో॥ బాఢం మానేతు యేనేన యోగత్స్యా ద్విషయాకృతిః,
భాష్యవార్తిక కారాభ్యా మయ మర్థ ఉదీరితః.

తా॥ "మనోవృత్తి ప్రమాణము. ఘటాదివిషయము ప్రమేయము. చిదాభాసునితో గూడిన మనోవృత్తియందు విషయాకార మేర్పడును. ప్రత్యక్షమున జూచు వస్తువుల యాకారము చిత్తమం దేర్పడుచున్నది. అదియే మనోమయ రూపమగునని భాష్యవార్తికకారు లిరువురును చెప్పిరి. (భాష్యకారులు శ్రీశంకరులు, వార్తికకారులు శ్రీసురేశ్వరులు).

పదు? ఆ సృష్టి వేఱు. ఈ సృష్టి వేఱు. ఈశ్వర సృష్టియగు స్థూలరూపము నశియించినను జీవ సృష్టియగు సూక్ష్మరూపము భావరూపమున సూక్ష్మాతి సూక్ష్మరూపమున, నీయందట్లే నిలిచియుండదు. నీవు కోరినప్పుడు అది నీయందు తిరిగి భావరూపమున ఘటాకారముగా గోచరించును. దాని వెంటనే 'ఘట' నామము అంటిపెట్టుకొని యుండును. ఈ ద్వివిధ సృష్టులను గూర్చి నీ వర్థము చేసికొంటివా? మొదటి ఘటము లేకపోయినను రెండవది కలదు. మొదట ఈశ్వర సృష్టియు, పిమ్మట జీవసృష్టియు, కలసి నీకు వస్తు (ఘట) జ్ఞానము కలిగించుచున్నది.

మం॥ ఈక్షణాది ప్రవేశాంతాః సృష్టిరీశేన కల్పితా,
జాగ్రదాది విమోక్షాంత సంసారో జీవకల్పితః.

(వరాహ - ద్వితీయ)

ఈశ్వరుడు సృష్టిచేయ సంకల్పించెను, అనునది మొదలు సృష్టి సమస్తమును కలిగిన పిదప ప్రాణులయందు జీవరూపమున ప్రవేశించెను. అనునంతవఱకు సృష్టి ఈశ్వర కల్పితము. జాగ్రదవస్థ మొదలు మోక్షపర్యంతముగల సృష్టి జీవకల్పితము.

బౌద్ధులలో విజ్ఞానశాఖవారును, శివరామదీక్షితులవారును బాహ్యసృష్టియే లేదందురు. అంతయు నీ మనోమయ సృష్టి యందురు. అందువలన వారి మతము (విజ్ఞానవాదుల మతము), బ్రహ్మసూత్రకారులును, భాష్యకారులును ఏవిధముగా ఖండించిరో (తృతీయ భాగమున) చెప్పియుంటిని. స్థూలఘటము నష్టమైనను ఘటనామము నష్టము

కాలేదు. కనుకనే శబ్దము నిత్యమని చెప్పిరి. ఇది ఒక వ్యక్తియందలి (వ్యష్టి) అనుభవమునకు సంబంధించినది. వ్యక్తులందఱి (సమష్టి) అనుభవము హిరణ్యగర్భుని అనుభవము గదా? ప్రళయకాలమున స్థూలపదార్థ సముదాయమంతయు నాశమొందగా వాని నామములు (శబ్దములు) మాత్రము నశింపక మిగిలియుండును. లోకమునందలి రూపములన్నియు స్థూలాకృతులను వదలి భావరూపమున హిరణ్యగర్భునియందుండును. సర్గారంభమున అవి తిరిగి స్థూలరూపమును పొందును. అప్పుడు స్థూలసృష్టి కలిగినదని అర్థము.

జిజ్ఞాసువు :- అట్లయిన మనయెదుట కనబడుచుండు స్థూలఘటము నాశమైనను, దాని సూక్ష్మరూపమగు భావము మనయందుండును కదా? మనము మఱల దానికి స్థూలరూపము కలుగునట్లు తలంచిన ఏల స్థూలఘటము సృష్టింపబడదు?

వేదాంతి :- నీవును నేనును సిద్ధసంకల్పులము కాము. సత్యసంకల్పుడగు బ్రహ్మదేవునకే ఆశక్తి కలదు. సత్యసంకల్పులగు కొందఱు మహర్షులకట్టి శక్తి కొంతవఱకు కలదని తెలియుచున్నది. ఇందులకు దృష్టాంతము — కురుక్షేత్రసంగ్రామమున మృతులైన భారతవీరులను చూడవలెనని కోర్కె కలదని, అట్టి వరమును అనుగ్రహింపుమని గాంధారి శ్రీకృష్ణద్వైపాయన మునీంద్రుని వేడుకొనగా — సత్యసంకల్పుడగు ఆ మహర్షి గంగానదీజలములనుండి యుద్ధమున మృతులైనవారి నందఱిని రమ్మని ఆజ్ఞాపింప వారు (పూర్వ స్థూలదేహములతో) వచ్చి ఒక్కదినమునుండి గంగా

జలముల మునిగి అదృశ్యులైరని మహాభారతమున చదివి యున్నాము కదా!

జిజ్ఞాసువు :- స్థూలరూప మెట్లు కలుగును?

వేదాంతి :- నీయందున్న భావమే స్థూలాకృతిని పొందును. శబ్దశక్తిని గురించి (మొదటి ప్రకరణమున) శ్రీజ్ఞానేశ్వరులు చెప్పిన వాక్యములను జ్ఞప్తికి తెచ్చుకొనుము.

సర్గారంభమున శబ్దముల సమూహమునకు మూలభూతమై శబ్దగర్భాత్మకమైయుండు ఓంకారము స్వయం వ్యక్తమునొంది దానినుండి ఒక్కొక్క శబ్దమును, దాని అర్థమగు స్థూలపదార్థమును వ్యక్తము కాజొచ్చును. ఇది బాహ్యప్రపంచ సృష్టివిధానము. అందువలననే సృష్టికి శబ్దరూపమగు (ఓంకారము) ఆది యని అందుండియే సమస్తము కలిగెనని సాయనాచార్యులవారి అభిప్రాయము. ఈ యర్థమును తెలియజేయునట్టి పద్యమొకటి భాగవతపురాణమునందు కలదు. వినుము :—

మ॥ జగదుత్పాదనబుద్ధి బ్రహ్మకు మదిన్ - సంధింప నూహించి యే
భగవంతుండు సరస్వతింబనుప, నా - పద్మాస్య దా నవ్విభున్
మగనింగా వరియించి తద్భవన సా - మ్రాజ్యస్థితిన్ సృష్టిపా
రగుఁ జేసెన్ మునుబ్రహ్మ నట్టిఘను నా - రంభింతు సేవింపఁగన్.

(ఆంధ్ర. భాగ. 2-67)

వేదములయందలి హిరణ్యగర్భుడు పురాణముల యందు చతుర్ముఖ బ్రహ్మదేవుడుగా పేర్కొనబడెను. అతని యందు సూక్ష్మరూపమున (భావరూపమున) నున్న జగత్తును స్థూలరూపమున వ్యక్తీకరించుటకు బ్రహ్మదేవునకు స్వయ

ముగా సామర్థ్యము లేనందున, సగుణబ్రహ్మము (గుణి) శబ్దబ్రహ్మమును, అనగా నాదమును (నామమును) తోడ్పడ జేయగా — నాదరూపిణియు, సకల విద్యాధిదేవతయు నగు సరస్వతి బ్రహ్మదేవుని భర్తగా వరియించినంత బ్రహ్మదేవునకు సృష్టి సామర్థ్యము కలిగినదని తాత్పర్యము. అనగా కారణరూప శబ్దబ్రహ్మమే కార్యరూప జగత్తుగా వ్యక్తమైనదని అర్థము.

జిజ్ఞాసువు :- అట్టి సమయమున (కాలమున) దీనిని అనుభవమునకు తెచ్చుకొన్న వారెవ్వరు? అది మనకెట్లు తెలియుచున్నది?

వేదాంతి :- ఇది చాల చిక్కైన ప్రశ్న. ఎంతో చెప్పినగాని బోధపడదు. ఇదివఱలో దీనిని గుఱించి వేఱొక విధముగా కొంత చెప్పియుంటిని.* ఇది అనుభవ విషయము. నిర్వికల్పసమాధియందున్న మహాత్ములు వారి అనుభవముచే దీనిని కనుగొనిరి. ఆ సమాధియందు కార్యకారణరూప మగు జగత్తుగాని, ఓంకారముగాని, మాయగాని, మాయాసంబంధమైన దేదియుగాని ఉండదు. కేవల చైతన్యము మాత్రమే యుండును. నిర్వికల్ప సమాధిని పొందిన మహాత్ములు ఆ దశకు పోవునపుడు మాయాసంబంధమైన మనఃకల్పల

* ఈ గ్రంథమునందలి తృతీయభాగము రెండవ ప్రకరణమున (౧౫) అధ్యాయమునందలి శక్త్యాద్వైతమున - నామ శాఖ - ను గుఱించి చెప్పియుంటిని. దాని చూచిన మఱికొంత చక్కగా బోధపడును. మఱియు మొదటి ప్రకరణమునందలి ౧౮ వ అధ్యాయమును చూచిన చక్కగా బోధపడును.

నొక్కొక్కదానినే దాటిపోవుచుందురు. సమాధ్యవస్థ సిద్ధించుటకు ముందు జగత్తు భావమయముగా వారికి కనిపించును. పిమ్మట సమస్తమును అవ్యక్తనాదరూపమును పొంది గంభీరమగు ఓంకారములో లీనమగును. వీని నన్నింటిని వీక్షించుచుండు అతీత మానసము (మనస్సుయొక్క అత్యున్నతస్థితి) కూడ లయమగును. అంతటితో మాయయు తత్సంబంధమగు సర్వమును సమాప్తమగును. మిగిలియుండునదే నిర్వికల్పసమాధి. అదియే ప్రత్యగభిన్నపరమాత్మ యగు అఖండైకరసము. అఖండ శాంతిసమాధియందున్న మహాత్ములు దానియందుండి తిరిగి బాహ్యమునకు వచ్చునప్పుడు తొలుత సమాధికి పోవునప్పుడు, యేయేకక్ష్యలను దాటి (సోపానక్రమమున) పైకి (సమాధిస్థితికి) పోయెనో ఆక్రమముననే క్రిందికి దిగివచ్చును. పూర్వము పైకిపోవునపుడు ఎచ్చటెచ్చట యేయనుభవము కలుగునో క్రిందికి దిగివచ్చునప్పు డట్టి అనుభవమే కలుగునని తాత్పర్యము. అట్టి మహాత్ములే యీ సృష్టి సంహారక్రమమును వారి అనుభవగోచరమైన విధమున శాస్త్రములయందు వివరించిరి.

జిజ్ఞాసువు :- శబ్దమునకు నాశము లేదంటిరి కదా? నిర్వికల్పసమాధియందు నశించెనుగదా?

వేదాంతి :- జగత్ప్రళయమున శబ్దమునకు నాశము లేదంటిని, నిర్వికల్పసమాధియందు శబ్దమున్నదని చెప్పలేదు కదా?

శ్రీమద్భాగవతమునం దిట్లున్నది.

శ్లో॥ అహం వై సర్వభూతాని భూతాత్మా భూతభావనః,
శబ్దబ్రహ్మ పరబ్రహ్మమమోభే శాశ్వతీ తనూ. (6-16-51)

ఇందుకు పోతనగారి ఆంధ్రీకరణము :—

సీ॥ పూని నా రూపంబు - భూత జాలంబులు
భూతభావనుఁడ నే - బొందు పడఁగ
బ్రహ్మంబు మఱియు శ - బ్దబ్రహ్మమును శాశ్వ
తంబైన తనువుల - దనరె నాఁక. (ఆం. భా. 6-178)

మనకు ఈశ్వరసృష్టి బంధ హేతువు కాదు, జీవసృష్టియే బంధ హేతువు. సమస్త భావములు మన బుద్ధుల యందుండి జీవుడు అనేక జన్మము లెత్తుటకు కారణము లగుచున్నవి. బంధ హేతువగు జీవసృష్టి నశింపచేసికొన్నచో ప్రపంచమే తోచదు. అట్టివారు తిరిగి జన్మించుటకు కావలసిన సామగ్రి వారి బుద్ధులయందు లేదు. నిర్వాసనాయుతమగు బుద్ధి (చిత్తము) బ్రహ్మాకారమైనది. కనుక ఇది శుద్ధమై దగ్ధపటమువలె చూచుటకు కనబడునేకాని భోగమున కుపయుక్తము కాదు. జీవేశ్వరుల ద్వివిధ సృష్టిని గుఱించి వేదాంతపంచదశి ద్వైతవివేక ప్రకరణమునం దీవిధముగా చెప్పబడియున్నది :—

శ్లో॥ ఈశకార్యం జీవభోగ్యం జగద్ద్వాభ్యాం సమన్వితమ్,
పితృజన్యా భర్తృభోగ్యా యథా యోషిత్తథేష్యతామ్. (4-118)

తా॥ ఒక స్త్రీ తండ్రిచేత పుట్టింపబడి భర్తచేత అనుభవింపబడినట్లు జగత్తు ఈశ్వరునిచే సృజింపబడి జీవునిచే భోగింపబడుచున్నది. —

అనగా — ధాన్యాదులు ఈశ్వరునిచే సృజింపబడి జీవులకు అన్నమగుచున్నవికదా?

జిజ్ఞాసువు :- ఈశ్వరసృష్టివలన బంధము లేదనియేనా మీ యభిప్రాయము.

వేదాంతి :- దూరదేశమునందున్న భద్రుడను నీ మిత్రుడొకడు బ్రతికియుండినను ఇంకొక మిత్రుడు భద్రుడు నెలదినముల క్రిందట చనిపోయెనని నీకు చెప్పిన నీవు దుఃఖింతువు. మఱియొక సందర్భమున నీకు ప్రేమాస్పదురాలగు మనోరమ అను స్త్రీ సంవత్సరము క్రిందట మరణించి యుండినను, ఆమె సుఖముగా ఉన్నదన్న వార్త విన్న నీవు సంతసింతువు. ఇవి రెండును జీవసృష్టికి సంబంధించినవే.

పర్యవసానమేమనగా :— శ్రీకృష్ణదాసును శ్రీదీక్షితులును, మాటను గుఱించి చేసిన నిర్వచనము స్ఫోటవాదమునకుగాని, శబ్దబ్రహ్మవాదమునకుగాని, చాలవఱకు విరుద్ధము. వేదప్రామాణ్యమంగీకరింపని దీక్షితులవారికి వారి శిష్యులకు శబ్దబ్రహ్మమును గుఱించి తెలియదగినంత తెలియదని వారి వాక్యములవలన తెలిసికొనవచ్చును.

(౮౩) చిదాకాశము - చిత్తాకాశము - జడాకాశము

జిజ్ఞాసువు :- అయ్యా! చిదాకాశ - చిత్తాకాశ - జడాకాశములకు గల భేదమును ఆనతిండు.

వేదాంతి :- జడాకాశమనగా చైతన్య (జ్ఞాన) రహితమగు ఆకాశము. పంచీకృత పంచభూతములలో మొదటిది, పెద్దది. ఆకాశము ఆత్మనుండి కలిగినదని శ్రుతి చెప్పినది. తండ్రిపోలికలు కొన్ని కుమారునియందున్నట్లు ఆత్మలక్షణములు ఆకాశమునందు కొన్ని గలవు. అది పుట్టినప్పుడు అతి

సూక్ష్మమగు శబ్ద తన్మాత్రగా నుండి తరువాత స్థూలమై మహాకాశమనబడినది. ఇది శ్రోత్రేంద్రియమునకు గోచరము కాదు. వెలుతురు, చీకటి దీనియందు వచ్చుచు పోవు చుండును. ఏవియు దీని సంటవు. ఇది బ్రహ్మాండమునందు సర్వత్ర వ్యాపించియున్నది. రెండు వస్తువుల నడుమను, మన యిరువురి మధ్యను, మన యనుభవమువలన తెలియవచ్చున దదియే. దీనినే బయలందురు. చిదాకాశమన నేమి? మన మొక గోడను చూతుము. చూచితిమనగా:— బుద్ధివృత్తి* కుడ్యాకారమును పొందును. ఆ వెంటనే ఒక వృషభమును, ఆ వెనుక ఒక గోవును, చూతుము. ఒక పదార్థమును చూచిన, బుద్ధి ఆ పదార్థరూపముగ పరిణమించును. దానినే బుద్ధివృత్తి యందురు. వెంటనే మఱియొక పదార్థమును చూచినపుడు పూర్వమున్న బుద్ధివృత్తి నశించి మఱియొక పదార్థరూపమున బుద్ధివృత్తి జనించును. ఈ రీతిగ గోడ, యెద్దు, ఆవు మొదలగు రూపముల చూచినపుడు ఆ యా బుద్ధివృత్తులు జనించి నశించుచున్నవి. ఇచ్చట గమనింప వలసిన యంశమిది:— ఒక వృత్తి పుట్టి నశింపగా, మఱియొక వృత్తి పుట్టుచుండగా మొదట కలిగిన వృత్తి నశించిన పిమ్మటను రెండవ వృత్తి పుట్టుటకు పూర్వమును, ఈ మధ్యనున్న వ్యవధిని చిదాకాశ మందురు. అదియే బ్రహ్మము. బ్రహ్మమునందున్న (చిదాకాశమునందున్న) చిత్ శక్తియే చిత్తరూపమును పొంది త్రిపుటి యగుచున్నది.

---

* ఇచట "బుద్ధివృత్తి" అని చెప్పిన ప్రతివాక్యమును "చిదాభాససహితమగు బుద్ధివృత్తి" యని తెలియవలయును.

ఇచట నీకు కొంత చెప్పవలసియున్నది. ఏమన :— 'చిత్తవృత్తి నశించి' అని నేను చెప్పినదాని అర్థమును వివరింతును. ఇంద్రియములతో సంబంధముండి బాహ్యమున నున్న విషయములను (నామరూపములను) బుద్ధి కందించునది మనస్సు. బుద్ధి విషయాకారమును బొందును. బుద్ధి ప్రక్క ననే చిత్తమున్నది. చిత్తమును గొప్ప అగాధ సరోవర ముతో పోల్పవచ్చును. మనము ఒక తాతిని ఒక సరోవర ములో విసరివైచితిమేని, అది నీటి అడుగునకుపోయి అందే స్థిరముగా నిలుచును. మనము సరోవరమున మునిగి ఆ తాతిని బయటికి తీసికొనిరావచ్చును. మనమట్లు చేయకున్న ఆ తాయి యెప్పటికిని సరోవరమునందే యుండునుగదా? ఇచట బుద్ధివృత్తి నశించిన దనగా — బుద్ధి యేవిషయా కారమును పొందెనో ఆ విషయములు (నామరూపములు) సూక్ష్మాతిసూక్ష్మములై (వాసనారూపమున) చిత్తమునందే నిలిచియుండును. అంతేకాని సర్వనాశము కావు. బుద్ధి అవసరమైనపుడు వానిని బయటికిలాగి తిరిగి వాని యాకృతి పొందగలదు. దానినే మన యనుభవమున 'స్మృతి' అని అందుము. వెంటనే ఆ విషయాకారము చిత్తమున చేరి బుద్ధి కొకయొక వృత్తి రూపమును పొందుట కవకాశ మిచ్చెను. అట్లుగాక బుద్ధి స్మృతిరూపమున కొంతవఱకు అట్లే నిలిచి యున్నదానిని ధ్యానమందురు. నేను దేనికి చిత్తసరోవర మని పేరిడితినో యోగవాసిష్ఠము దానినే చిత్తాకాశమని చెప్పినది.

చిదాకాశమును గుఱించి యోగవాసిష్ఠమున నిట్లున్నది :—

శ్లో॥ చిద్వ్యోమ బ్రహ్మ చిన్మాత్ర మాత్మా చితి మహానితి,
పరమాత్మేతి పర్యాయో జ్ఞేయా జ్ఞానవతాంవర.
(యో. వా. 6-175-29)

చిదాకాశము, బ్రహ్మము, చిన్మాత్రము, జీవచైతన్యము, మహాచిద్రూపము, పరమాత్మ అనునవి యన్నియు పర్యాయశబ్దములై యున్నవని వసిష్ఠమహర్షి జ్ఞానులలో శ్రేష్ఠుడగు శ్రీరామచంద్రునకు చెప్పెను.

చిదాకాశమును గురించి మహోపనిషత్తు ఇట్లు చెప్పినది :—

శ్లో॥ చిత్తాకాశం చిదాకాశ మాకాశంచ తృతీయకమ్,
ద్వాభ్యాం శూన్యతరం విద్ధి చిదాకాశం మహామునే. (4-58)

తా॥ ఓ ముని! సంకల్ప సముదాయ మెందుండునో అది చిత్తాకాశము. దృశ్య ప్రపంచ మెందుండునో అది భూతాకాశము. ఈ రెండు దేనియందు లేవో అదియే చిదాకాశము.

శ్లో॥ దేశాద్దేశాంతర ప్రాప్తౌ సంవిదో మధ్యమేవ యత్,
నిమేషేణ చిదాకాశం తద్విద్ధి మునిపుంగవ. (4-59)

నేను పైన చెప్పినట్లు రెండు బుద్ధి వృత్తుల మధ్యనుండు వ్యవధియే చిదాకాశము. ఆకాశమువలె వ్యాపకమైన చిత్తు.

అద్వైతులు చెప్పు బుద్ధి వృత్తి (చిదాభాససంబంధమైన జ్ఞానమునే యొకటి యని పైన చెప్పిన చిదాకాశమే బట్టబయలని దీక్షితులవా రంగీకరించిన వారి సిద్ధాంతమును

గురించి శంకింపవలసి యుండదు. అట్లు కాదేని వారికి శాస్త్రజన్య జ్ఞానముగాని బ్రహ్మానుభవముగాని ఆ సూచన గాసు లేదని అనుమానింపవలసి వచ్చును.

కృష్ణదాసుగారి వాక్యము లివి :—

కం॥ "రెండువస్తువుల నడుమ న
ఖండం బదె కానుపించు గద దీనిని నీ
వుండి కనుగొని చనందగు
మండిత సత్కీర్తి సాంద్రమానవచంద్రా." (70)

'రెండు వస్తువుల నడుమ అఖండంబదె కనుపించు' అన్నారుకదా? దీని తాత్పర్య మేమి? 'రెండు వస్తువుల నడుమ' నుండు అఖండము లోకులు చెప్పినట్టి 'బయలు' అదే మహాకాశము. ఆకాశమే బయలని అందురా? అంత కంటె నాస్తిక మేమున్నది. ఆకసము బయలు కాదని, ఎఱుక యని, దీక్షితులవారును కృష్ణదాసుగారును చెప్పి యున్నారుగదా? వారి పరిభాషలో 'ఆకస' మనగా — యెఱుక, అట్లయిన పక్షమున పై పద్యమున చెప్పబడిన 'రెండు వస్తువుల నడుమ అఖండముగ కనుపించు' నది యేది? మహాకాశమే గదా? బయలును చిదాకాశమని దీక్షితులవారుగాని కృష్ణదాసుగారు కాని వారి గ్రంథములయం దెచ్చటను చెప్పియుండలేదు. దీక్షితులవారు ఒకచోట నిట్లన్నారు. —

"చిదాకాశమన్నారు జడాకాశమన్నారు .... ఇవన్ని కలత వాక్యాలే" (బ్ర. ఉ. ప్ర. 6 అ. 6) అని అద్వైతులను విమర్శించిరి. బయలును చిదాకాశమనుట వారి కిష్టము లేదు.

ఏలయన 'చిత్' అనగా — విశుద్ధ జ్ఞానము. దీక్షితుల వారి మతమున బయలు తన్ను తా నెఱుగదు, ఇతరుల నెఱుగదు. బయలునకే యెఱుక (జ్ఞానము) లేదు. కనుక, దానిని చిదాకాశమన్న వారిమతమునకు మొదటికే మోసము వచ్చునని వారి భయము. అందువలన 'చిదాకాశ' మను నామమును బయలునకు అంగీకరింపరు. రెండు యెఱుకలు ఉన్నట్లు దీక్షితులవారుగాని, కృష్ణదాసుగారు గాని అంగీకరింపరు. అది వారి మతమునకు విరుద్ధము.

దీక్షితులవారు వారి గ్రంథమున అచ్చటచ్చట వారి మతమునకు పత్రాసిగానుండునట్టివని భావించి కొన్ని గీత పద్యముల నుదాహరించియున్నారు. అవి యెవరు వ్రాసినవో వారి పేరు అందు చెప్పబడలేదు. దీక్షితులవారివి కావనుట స్పష్టమే. అందొక గీత పద్య మిట్లున్నది :—

"గీ॥ ఎరుక దైవమైన మరుపేల కలుగును
యెరుక మరపులేని యెఱుకయేదో
నరుడు దానిదెలియ నగుణమౌనని యంద్రు
మరుగులన్ని దెలిసి మరుగుశిష్య."

(బ్ర. పూ. ప్ర. 10)

పై పద్యమునందలి రెండవ పంక్తియందు 'యెరుక మరపులేని యెఱుక' అద్వైతులు చెప్పునట్టి కూటస్థజ్ఞానము, లేక, ఆత్మ, యనునది. మొదటి పంక్తియందు చెప్పబడిన యెఱుక సామాన్యమగు యెఱుక. అది అద్వైతమున చిదాభాసునితో కూడిన బుద్ధి వృత్తి జ్ఞానము. ఇది దైవము కాదని చెప్పి, 'యెఱుక మరపులులేని యెఱుక' మఱియొకటి

కలదని రెండవ పాదమున స్థిరపరచెను. ఆ యెఱుక (కూటస్థ జ్ఞానమే) చిదాకాశము, బ్రహ్మము, ప్రత్యగాత్మ. — పద్యము చివఱన "మఱుగు శిష్య" అన్నారు. దాని అర్థము వారికే యెఱుక. 'యెఱుక మఱపులు లేని యెఱుక' మఱి యొకటి కలదని (పై పద్యము నుదాహరించుటవలన) వా రంగీకరించినట్లే కదా? అట్టి రెండవ యెఱుక నెఱిగినవాడు నిర్గుణుడగునని పద్యమునందలి మూడవ పాదమునందలి అర్థము. దీక్షితులవారు పై పద్యమును వారి సిద్ధాంతమునకు విరుద్ధమని తెలియక దాని నుదాహరించిరి. ఏలయన, "ఎఱుక కలది అచలము కాదు" (బృ. పూ. ప్ర. 10) దీక్షితులవారు ఇట్టి వాక్యము లనేకములు చెప్పియున్నారు.

అచలవేదాంతులు కొందఱు వేమన్నగారిని తమవా డందురు. ఎఱుకను గుఱించి వేమన్నగారు చెప్పిన పద్యము నొకదానిని ఉదాహరింతును. దీనివలన వేమన్నగారు అద్వైతి యని తెలియును.

ఎఱుక యుండువాని కెఱుక యే యుండును
ఎఱుక లేనివాని కెఱుక లేదు,
ఎఱుక లేని యెఱుక నెఱుగుట తత్త్వంబు
విశ్వదాభిరామ వినుర వేమ.

ఇచట పద్యమునందలి మూడవపాదమున 'ఎఱుక లేని యెఱుక' యే చిదాకాశము. అదియే వృత్తి జ్ఞానము లేని శుద్ధజ్ఞానము. వేదాంత తత్త్వము ననుసరించి పై పద్యమునందు మొదటి పాదములో చెప్పిన యెఱుక బుద్ధివృత్తి. (వృత్తి జ్ఞానము)

చిదాకాశమునే ఆత్మ (విశుద్ధ జ్ఞానము) పరబ్రహ్మమని శ్రీ జ్ఞానేశ్వరు లంగీకరించియుండిరి. (అను. 7-185) చిదాకాశమే పరబ్రహ్మమని, శుద్ధజ్ఞానమని, శ్రీజ్ఞానేశ్వరు లంగీకరించినట్లు ఈ క్రింది ప్రమాణములను చూపెదను.

అమృతానుభవము మొదటి ప్రకరణమునందు 64 శ్లోక వ్యాఖ్యానమున (విజయదుందుభియందు) ఇట్లున్నది:—

“... నామరూపక్రియలనెల్ల మిథ్యాత్వదృష్టిని భాగత్యాగ లక్షణముద్వారా వేరుచేయగా చివరకు స్వతస్సిద్ధమైన చిదాకాశమే మిగిలి త్రోసివేయబడిన నామరూపాత్మక జగత్తంతయు వాచారంభణమైనట్లు భావాభావస్థితియందు, వందనాదిక్రియలన్నియు వాచారంభణములే కాని వేరు కావు.” (పుట. 120)

“... గురుశిష్యాదిరూపమైన అధ్యాస ప్రపంచమంతయు చిదాకాశ స్వరూపుడైన నాయందు ‘నభసోనీల వత్’ అనునట్లు ఆకాశమునందు నీలపీతాదులు తోచినరీతి తోచినవి.” (పుట. 148)

విజయదుందుభి 2-57 శ్లోకమున ‘శుద్ధ స్ఫురణరూపేతు’ అని ఉన్నదానినే — శుద్ధ స్ఫురణమే చిదాకాశమని చెప్పిరి. శుద్ధ స్ఫురణ మనగా — విశుద్ధజ్ఞానము.

“మరియు నయ్యాత్మ నైజస్థితి ద్రష్టయు, దృశ్యంబును నను నీ యుభయ విషయంబులు వినష్టంబై పునరుత్పన్నంబగు నమ్మాధ్యంబునం జెల్వొందుచుండునని సారాంశంబగు.”

(అను 7-185)

పై యంశమునే మఱియొక విధముగ స్పష్టపరచిరి.

“కాదేని నేత్రదృష్టి యొక వస్తువునెడఁ బ్రసరించి దానిం దొలంగి యన్యవస్తువునెడఁ బ్రసరింపకయున్న మధ్యావస్థను గూర్చి మన మూహింపగల్గుచో నాత్మ నైజస్థితి యివ్విధంబగు.” (అను. 7-188)

తమ అచలబోధ శ్రీ జ్ఞానేశ్వరస్వాములనుండి గురుశిష్య పరంపరగా శ్రీ దీక్షితులకు లభించినదని చెప్పుకొను అచలవాదులు ఈ యంశము నేల గ్రహింపరు?

జిజ్ఞాసువు :- (1) అచలవాదులు ఆకాశమును శూన్యమన్నారు. ఎఱుకను శూన్యమన్నారు. బయలును తెలిసికొన్న దేది? శూన్యము తన్ను తా నెఱుగదు. ఇతరులను ఎఱుగదుగదా? (2) చిత్తాకాశమనగా నేది? ఈ సంశయముల నివర్తింపుము.

వేదాంతి :- నీవు కలిగిన రెండవ సంశయమును మొదట తొలగింతును. — చిత్తుయొక్క శక్తి చిత్ శక్తి. చిత్ శక్తియే చిత్తరూపమును ధరించినది. ఈ చిత్తమే చిత్తాకాశము. మహాకాశమున సమస్త వస్తువులు ఉన్నట్లు సమస్త వస్తు సముదాయము సూక్ష్మరూపమున చిత్తాకాశమున నుండును. చిత్తాకాశమే తనయందుండు సూక్ష్మ ప్రపంచమును స్థూలరూపమున అభివ్యక్తము చేయును. ఈ విషయమును పూర్ణముగా తెలియగోరుదువేని యోగవాసిష్ఠమును చదివి అర్థము చేసికొనుము.

నీ వడిగిన మొదటి సంశయమును తొలగింతును శ్రద్ధగా వినుము. కృష్ణదాసుగారుగాని దీక్షితులవారుగాని

రెండు బుద్ధివృత్తులకు నడుమ (మధ్య) నుండినది అఖండా మనినను, బయలనినను, దానికి వారు చిదాకాశమని పేరు పెట్టక పోయినను అది చిదాకాశమే. (బ్రహ్మమే) దానిని బయలనినను తప్పేమియును లేదు. కాని కృష్ణదాసుగారు రెండు వృత్తులకు నడుమ అని చెప్పక పద్యమున "రెండు వస్తువుల నడుమ నఖండంబదె కానిపించు" అని స్పష్టముగా చెప్పియున్నందున రెండు వస్తువుల నడుమ అఖండముగ కానిపించునది మహాకాశముగు బయలే. దానినే వారు బట్టబయలని పరిపూర్ణమని యందురు. నేను చెప్పిన ఈ యర్థమును బలపరుచునట్టి వారి వాక్యముల కొన్నిటిని యుదాహరింతును. —

కం॥ నేను గాకొకటి శుద్ధ
జ్ఞానము గలదనుచు బల్కు జ్ఞానుల మాటల్
పూని వినదగదు శుద్ధ
జ్ఞానం బననేనె నేను లేనిదియానే. (కంద. 227)

ఈ విధముగా చిదాకాశమునుగాని కూటస్థునిగాని అంగీకరింపక యున్నది 'ఎరుక' ఒక్కటే నన్నారు.

లోకులు 'ఆకాశమని' దేనినందురో అచలవాదులు దానిని ఎఱుక యందురు. శబ్దమును సహితము మెఱుకయే యందురు. "మాటసుమీ నేననినను" అను కందపద్యమును ఇదివఱకే ఉదాహరించియుంటిని. శబ్దరహితమగు మహాకాశమునే 'బయలని' 'బట్టబయలని' 'పరిపూర్ణమని' యందురు. నేను చెప్పిన యీ యర్థము సరియైనదనుటకు కృష్ణదాసుగారి వాక్యము నుదాహరింతును :—

కం॥ "ఆవరణము నాకసము -
నిరావరణము నచలమనుచు అనిరి మహాత్ముల్ -
ఆవరణము మితము గలిగిన
ఆవరణములేంది యమితమని తెలిసికోరా."

(కందా. 80)

దీని **తాత్పర్యము** :— ఆవరణము ఆకసమనగా శరీరములో నిమిడియున్నది మెఱుక. శరీరము లేకపోయిన మెఱుక లేదు. శరీరము లేకపోయిన మాట లెట్లు వచ్చును. మాటయే తానుగదా ? శబ్దరహితమగు మహాకాశమును (బయలు) నిరావరణము దాని గుణమగు శబ్దమును దాని నుండి విడదీసి (వేఱు వేఱని చెప్పి) శబ్దము మెఱుక యని శబ్దరహితమగునది, 'యేమిలేని ఉత్త బట్టబయలని' చెప్పిరి. అదే 'రెండు వస్తువుల నడుమనుండు అఖండము' అనిరి. కాని అది వేదాంతులు చెప్పు చిదాకాశమని వారంగీకరింపరు. ఆకాశము శూన్యమని (కంద. 81) అదియే మెఱుక యని అచలవాదుల రహస్యమని కృష్ణదాసుగారి పై వాక్యములనుబట్టి యూహించుట సులభము. కృష్ణదాసుగారి యీ క్రింది కందార్థమొకటి నేను చెప్పినపై తాత్పర్యము సరియైనదని దృఢపరచును.

కందా॥ కనబడెడు బయలులోపల
కనుగొనలేదయ్యె యెఱుక గావున శూన్యం
బనవలసెను దీన్నె ఆకస
మన వలసెను దీన - విశ్వమాయనోయప్పా
యింతకువేరే మాయలేదప్పా. (78)

ఆకాశమును మొఱుక యని కృష్ణదాసుగా రనిరి కదా? లోకులు శాస్త్రములు దేనిని ఆకాశమని (తానుండియు సర్వము తనయందుండుటకు అవకాశమిచ్చిన దానిని) యే పేరున పిలువవలయును? అది ఆకసముకదా! దానిని అచలవాదుల పరిభాషలో 'బయలని' 'బట్టబయలని' అనవలయునా? శాస్త్రములయందు సృష్టి క్రమమును చెప్పిన ప్రకారము మహాభూతములకంటె ముందు తన్మాత్రలు పుట్టినవి. ఆ పిమ్మట వాటినుండి మహాభూతములు కలిగినవని చెప్పిరి. అట్లైన మొదట శబ్ద తన్మాత్ర పుట్టినది. దానిని అచలవాదులు మొఱుక యని పేరిడిరి. అచలవాదమును అనుసరించి చెప్పవలయునన్న శబ్ద గుణమును ఆకాశము నుండి వేఱుచేసినచో మహాకాశమే అచలవాదుల బట్టబయలగును. ఇది నా అభిప్రాయముకాదు. అచలవాదుల యొక్క వాక్యములనుండి యీ యర్థ మేర్పడుచున్నది. ఆకాశము శబ్ద గుణకమైనదని అందఱు అంగీకరింతురు. కాని గుణియగు ఆకాశమునుండి గుణమును వేఱుచేయుటెట్లు? ప్రపంచము పుట్టినది మొదలు ఇంతవఱకు వస్తువును, దాని గుణమును వేఱుచేసి చూపినవారు కలరా? వస్తువునందలి గుణము కారణాంతరములచే మార్పు చెందవచ్చును. అనలే గుణము లేకుండ చేయ లేరు. అట్లు చేయగలిగినయెడల గుణరహితమగు ఆ వస్తువే బ్రహ్మము. కృష్ణదాసుగా రిట్లు చెప్పిరి :—

"ఆకాశాదిక భూతా
నీకాత్మక మగుచు మొఱుక యీజగమయ్యెన్

రాకడ పోకడ దీనికి
ప్రాకటముగ దేనిలోనొ బట్టబయలదిరా."
(కందా. 38)

శబ్దము (ఎఱుక) యొక్క రాకడ పోకడ మహాకాశ మునందే జరుగుచున్నదిక దా!

"ఎరుకతో వచ్చిన విశ్వము
యెరుకతొజనుగాని నిల్వదీ బయలైతే
యెరుకతొరా దెరుకతొబో
దెరుక తనందేమిలేదు యిది నిశ్చయమురా
వుందంటే యెరుక తానౌరా." (కందా. 40)

"ఎరుకే బట్టబయలగును. యీ యెరుక బట్టబయలు రెండు సమానమే. ఎంతమాత్రము భేదములేదు." (బృ. పూ. ప్ర. 162, 163) ఇందుకు విరుద్ధముగా అనేక పర్యాయములు చెప్పిన దీక్షితులవారి వాక్యములో ఒకదాని నిదివరకే యుదాహరించి యుంటిని. దానినే మఱల నిట నుదాహరింతును :—

"నీవు అది యెన్నటికికావు. అది నీవుకావు. నీకు దానికి చాల యెక్కువ తక్కువ వున్నది." (బృ. పూ. ప్ర. 109) ఇట్టి స్వవచన వ్యాఘాతములు శ్రీ దీక్షితుల కృష్ణదాసు గారల గ్రంథములయందు అనేకము లున్నవి. ఈ కందార్థము పై 38 వ కందార్థమునందలి అర్థమునే బలపరచినప్పటికి నిందొక విశేషమును చేర్చినారు. ఎఱుక రాకడ పోకడ

లేకయుండిన మెఱుకయే బయలగును. లేదా, బయటే ఎఱుక యగునని భావము.*

శ్రీ దీక్షితులు కృష్ణదాసుగారు బయలునకు కేవలాత్మ యని మఱియొక పేరు పెట్టియున్నారు. ఆ విషయము విచారింతము.

"పుట్టనిది కేవలాత్మ, పుట్టేది చచ్చేది ప్రకృతిద్వయం."
(బ్ర. ఉ. ప్ర. 1)

"ఈ ఉత్త బట్టయలు ఎవరెరుగుదురు కేవలాత్మ .... ఈ కేవలాత్మ గజ్జలుకట్టుకొని ఆడేదికాదు .... యీ కేవలాత్మను ఎరుగుట యనగా యెరుకలేకపోవుట యని అర్థము.
(బ్ర. పు. ప్ర. 10)

శిష్యుడు :- అది బట్టబయలైతే ఉత్త బట్టబయలని యెందుకనవలె, బయలు అనరాదా ?

గురువు :- ఆత్మ అంటే చాలునుగదా ? కేవలాత్మ యని యెందు కనవలెను ? కేవలాత్మ అనగా నిర్మలమైనదని తాత్పర్యము అలాగుననే ఉత్త బట్టబయలనిన అర్థమునుమా ! ఉత్త బట్టబయలనగా కేవలాత్మ యని అర్థము.
(బ్ర. ఉ. ప్ర. 2. అ. 1)

ఆత్మ బట్టబయలు కాదని దీక్షితులవారు పెక్కుమారులు చెప్పి ఇప్పుడు బయలును కేవలాత్మ యని పై

---

* ఈ వాక్యములను దృఢపరచునట్టి దీక్షితులవారి వాక్యములను ఈ ప్రకరణమునందలి ౧౩ వ అధ్యాయము "గురువు" చెప్పిన వాక్యములు చెప్పియున్నాను. చిత్తగింపుడు.

వాక్యముల వలన స్పష్టపరిచిరి. దీక్షితులవారి మతమున అహంకారమే ఆత్మ. అహంకారము వదలిన కేవలాత్మ యట. శ్రీ సీతారామాంజనేయ సంవాదమను గ్రంథమున ఈ క్రింది పద్యమునందు కేవలాత్మయే ఆత్మయని స్పష్టపరుప బడెను.

క౦॥ నేననినఁ దనువునను నభి
మానమునను నర్థముగఁ బ్రమాదము వలనం
గానియవి - రెండనర్థము
తా నేనన కేవలాత్ముడను నే ననఘా.

నేను అనుదాని అర్థము కొందఱు (చార్వాకులు) శరీరమని చెప్పుదురు. (లోకులు వ్యవహారము నందును అందురు) అభిమానమునను = అహంకారమునుద్దేశించి కూడ 'నే' నందురు. పద్యము పై రెండు పాదములయందలి (1) తనువు (2) అహంకారము. ఈ రెండింటిని కలిపి 'నేను' అని కొంద ఱందురు. (అచలవాదులు) దేహమును అహంకారమును ఈ రెండింటిలో దేనినైనను 'నేను' అనిన ఆ రెండును అనర్థములే. ప్రమాదమువలన అట్లందురు. 'నేను' అనగా — 'కేవలాత్మను' అని తాత్పర్యము. మఱియు ఆ గ్రంథమునందే యిట్లున్నది:

సీ॥ ఏను శరీరంబుగా నింద్రియములు
గాను ప్రాణంబులు గాను మనము
గాను చిత్తంబుగా నహంకారంబు
గాను శూన్యంబును గాను బుద్ధి
గాను ... .

తే॥ గాను గానను వాఁడను గానివిషయము
కాను గానను వానిని గాంచువాఁడ
గాంచువానిని సతతంబుఁ గాంచువాఁడ
నౌను గానను వికృతులు లేనివాఁడ. (2-82)

చిదాభాససంబంధముగు బుద్ధివృత్తియే శబ్దాదివిషయముల నెఱుగుచున్నది. అది తన్ను తా నెఱుగదు. చిదాభాసుడు లేని సమయమున అతని లేమియు; ఉన్న సమయమున అతని యునికియు; సతతంబుగాంచునది అచలవాదులు చెప్పునట్టి యెఱుక కాదు. ఇతడే (అదియే) చిదాకాశము, సాక్షి, కూటస్థాత్మ నాశరహితమగు బ్రహ్మచైతన్యము, కేవలాత్మ.

శ్రీ సీతారామాంజనేయ సంవాద గ్రంథకర్తగారు, ఆత్మయనిన చాలును 'కేవలాత్ముడ' నని యనుట యేమన నగా — శరీరమును, అహంకారమును నేను కానని నిషేధించుటద్వారా చిదాభాసునికూడ నిషేధించి) నేను పరబ్రహ్మస్వరూపుడనేగాని అన్యుడను కానంటకు కేవలాత్ముడ ననిరి.

పర్యవసాన మేమనగా :— అద్వైతులు చెప్పు కేవలాత్మ శుద్ధజ్ఞానము (శుద్ధచైతన్యము). అచలవాదులు చెప్పు కేవలాత్మ శుద్ధజడము. ఎఱుకయు జడమే. కనుక నిది జడాద్వైతము, భౌతిక వాదము.

సం॥ అతిబాహ్యం తథాఽబాహ్య మంతరాభ్యంతరం ధియః,
యః పశ్య న్నపశ్య స్త్వం సాక్షీ సంపూర్ణ కేవలః.
(మహో. 2-73)

తా॥ బాహ్యము నతిక్రమించినదియు, బాహ్యము లేనిదియు, బుద్ధిలోపలి తత్త్వమునైనదానిని చూచుచు చూడనివాడ వగుదువు. సాక్షివగు నీవు పరిపూర్ణుడవు. కేవలుడవు.

(౪౪) సింహావలోకనము - సంగ్రహపరిశీలనము

వేదాంతి :- అచలబోధ పరిశీలనము ముగించుటకు ముందు ఇదివఱలో చెప్పిన కొన్నియంశములను సింహావలోకనన్యాయమున దృఢబోధకొఱకు స్మృతికి తెచ్చుకొనుటయేగాక యిదివఱలో చెప్పని విషయములను సందర్భమునను సరించి సంగ్రహముగ చెప్పెదను సావధానుడవై వినుము.

(ఈ ప్రకరణమున 4-వ అధ్యాయమునందు) అచల వాదులలో మితవాదులు అతివాదులు అను రెండు శాఖలున్నవనియు, వారు దీక్షితులవారి గ్రంథమగు బృహద్వాశిష్ఠ సిద్ధాంతమునందలి వాక్యములకు పరస్పర విరుద్ధమగు భిన్నార్థములు చెప్పుదురనియు, చెప్పి (7-వ అధ్యాయములో) షోడశాక్షరీమంత్రమునకు వారుభయులు చెప్పెడి భిన్నార్థములనుగూడ సంగ్రహముగ వివరించియుంటిని. (8-వ అధ్యాయమున) ఆ రెండు శాఖలయందు యెవరివాదము నెంతవఱకు దీక్షితులవారు సమర్థించియున్నారను విషయమును పరిశీలించితిమి. (9-వ అధ్యాయమున) జ్ఞానము యొక్క వివిధ స్వరూపవిచారము చేసితిమి. (10, 11, 12-వ అధ్యాయములయందు) ఎఱుక, సాక్షి, జీవుడు వీరల స్వరూప

విచారము వేదాంతమునుండియు, దీక్షితులవారి మతము నుండియు పరిశీలించితిమి (13-వ అధ్యాయమున) శరీరములు మూడా? నాలుగా? అను అంశము చర్చింపబడెను. ఇందు చాల గొప్పచర్చ జరిగి శ్రుతులకు దీక్షితులవారి మతము విరుద్ధమని ఋజువు చేసితిని.

శివరామదీక్షితులవారి అచలబోధయందు ముఖ్యమైన అంశములు యెఱుక - బయలు - అని నీవెఱుగుదువు. కనుక వానినిగుఱించి పునఃపరిశీలనము చేయుదము.

—: ఎఱుకను గుఱించి పునఃపరిశీలనము :—

దీక్షితులవారు వారి గ్రంథమున వారే యెఱుకను గుఱించి అచ్చటచ్చట పరస్పరభిన్నములగు నిర్వచనములు చేసిరి. ఏవిధగానైనను వారి సిద్ధాంతము శాస్త్రసమ్మతమని నిరూపించుటకు అనేకవిధముల ప్రయత్నముచేసి విఫలులైరి. ముఖ్యముగా వారితత్త్వము (ఎఱుక) భగవద్గీతకు సమ్మతమని నిరూపించుటకు గీతయొక్క యేడవ అధ్యాయమున చెప్పిన పరా - అపరా - ప్రకృతులను, పదుమూడవ అధ్యాయమునందలి క్షేత్ర - క్షేత్రజ్ఞులను, పదునైదవ అధ్యాయము నందలి క్షరా - క్షరములను, మూలములేని గుర్తెరిగే శరీరమే యని నిరూపించుటకు ప్రయత్నించిరి. కాని గీతయొక్క పదుమూడవ అధ్యాయమునందు గీతాచార్యుడు 'మహాభూతములు, అహంకారము, బుద్ధి, అవ్యక్తప్రకృతి యీ సముదాయమునంతయు క్షేత్రములోనే చేర్చిచెప్పి యీ క్షేత్రమును తెలిసికొనుచుండువాడు క్షేత్రి, లేక, క్షేత్రజ్ఞుడు అనియు,

అనేను క్షేత్రమునకంటె భిన్నుడనియు, స్పష్టముగా చెప్పి యున్నందున దీక్షితులవారి ప్రయత్నము విఫలమగుటచే వారికి ఆగ్రహముకలిగి "గుర్తెరిగే క్షేత్రజ్ఞస్వరూపమే పరబ్రహ్మ అయితే క్షేత్రమెందుకు?" (బృ. ఉ. ప్ర. 6 అ. 4) అని ప్రశ్నించిరి. అందులకు నేను సరియగు సమాధానమును (ఈ ప్రకరణమునందలి 14, 15, 16 అధ్యాయములయందు) ఎంతటి సామాన్యబుద్ధులకైనను అర్థమగునట్లు దీక్షితులవారి వెలుక యివి యేవియు కావని చెప్పితిని.

(17-వ అధ్యాయమున) దేహి దేహములు ఒక్కటియేనా? యనియు, (18-వ అధ్యాయమున) పరలోకము పునర్జన్మములు లేవా? అను నంశములను విచారించి శ్రుతి స్మృతి పురాణాదులనుండి అనేక ప్రమాణములను చూపి దీక్షితులవారి మతమును నిరాకరించితిని.

(19, 20 అధ్యాయములయందు) దేహి దేహము భిన్నములని నిరూపించుచు, అందునను ప్రకృతియే పురుషుడను వాదమును శాస్త్రప్రమాణములచూపి త్రోసివేసితిని. ఈ విధముగా (ఇరువది అధ్యాయములయందు) 'మూలము లేని గుర్తెరిగే శరీరము'ను గురించిన విచారమును ముగించితిని.

(21-వ అధ్యాయమున) కలదోచిన శరీరము యెలాగో ఆలాగే అను పంచదశీమంత్రార్థమును పరిశీలించితిని. శ్రీ దీక్షితులవాదము అనుభవమునకు శాస్త్రములకు సమ్మతము కాదని నిరూపించితిని.

(22-వ అధ్యాయమున) 'ఈ ఉత్త బట్టబయలు యేమీలేదు' అను ద్వాదశాక్షరీమంత్రమును (27-వ అధ్యాయమువఱకు) పరిశీలించితిని.

(28-వ అధ్యాయమునుండి 33 వఱకు) దీక్షితులవారు చేసిన వేదాదులనిందనుచూపి దీక్షితులవారి మతము అద్వైతికమని నిరూపించితిని.

(34, 35, 36 అధ్యాయములయందు) శ్రీ దీక్షితుల దర్శనము శ్రీ జ్ఞానదేవ, శ్రీ సమర్థరామదాస, శ్రీ అరవింద, యోగవాసిష్ఠాది దర్శనములకు యెట్లువిరుద్ధమో వివరించితిని. (37-వ అధ్యాయమునందు) అచలబోధకు బౌద్ధదర్శనముతో నెంతవఱకు సారూప్యతకలదో చూపితిని. (38 అధ్యాయమునందు) అచలవాదులు అద్వైతములో అడుగుపెట్టిన సూచనలను వివరించితిని. (39-వ అధ్యాయములో) దీక్షితులవారి మతము ఏవిధముగా అద్వైతికమో వివరించి (40-వ అధ్యాయమున) గురువులు - శాస్త్రములను గురించి బోధించితిని.

కొందఱు అచలవాదులు దీక్షితులవారి మతము శ్రీ బసవేశ్వరులవారి వీరశైవముతో సరిపోవునందురు. అట్టివారు వీరశైవమును గురించి తెలియనివారని చెప్పుచున్నారు. (అట్టివారు యీ గ్రంథముయొక్క తృతీయ భాగమునందు 13, 14-వ అధ్యాయములు చదివి తెలిసికొనవచ్చును.)

జిజ్ఞాసువు :- అయ్యా! తమరు నాకు శాక్తేయమునందలి శ్రీవిద్యనుగురించి చెప్పినపుడు దేవీభాగవతమునందలి

రెండు పద్యములను వినిపించియుండిరి.* వాని యర్థము ఆత్మానాత్మలు ఏకమని చెప్పినట్లు అనుమానించుట కవకాశమున్నది. దానికి మీ రేమందురు.§

వేదాంతి :- ఆ పద్యములను మరలచెప్పి నీ సంశయమును నివర్తింపచేయుదును.

సీ॥ బీజములు రెండు మన్మంత్రరాజమునకు
రెండు భాగములు గల నాదు సృష్టి యెల్ల
జగమనుట గల్గె ద్వైవిద్య మగణిత ప్ర
భావమునఁ బోల్చ నా రెండు భాగములను. (దే. భా. 12-39)

కం॥ ఒకడలరు సచ్చిదానం
దకమై - ప్రకృతి సంజ్ఞఁ దగునొక్కఁడు - చం
ద్రికకుం జంద్రునకుం బలెఁ
బ్రకృతికి నా కైక్యమెలయు వాసన యెపుడున్.
(దే. భా. 12-40)

ఇట్లు ఉమాదేవి ఇంద్రునకు దేవీతత్త్వము నుపదేశించినట్లున్నది. సంగ్రహముగ వీని తాత్పర్యమిది :—

దేవి తన మంత్రమునకు రెండు బీజములు కలవని చెప్పినది. అవి 'ఓమ్' 'హ్రీం' అనునవి. ఆ రెండింటి వలన జగదుత్పత్తి కలిగినది. 'ఓమ్' అను బీజము

* ఈ గ్రంథముయొక్క తృతీయభాగమునందు శాక్తము - దేవీతత్త్వము, పుటలు 324, 325 చదివిన కొన్ని విషయములు బోధపడును.

§ ఆ పద్యములు పూజ్యులు తిరుపతి వేంకటకవుల దేవీభాగవతము లోనివి.

సచ్చిదానందస్వరూపము పరబ్రహ్మమును సూచించును. 'హ్రీం' అను రెండవ బీజము మాయను (ప్రకృతిని) బ్రహ్మమునుగూడ సూచించును. అందు సచ్చిదానందస్వరూపమైన పరబ్రహ్మము నేనే ననియు, ప్రకృతికిని నాకును చంద్రికకు చంద్రునకు సంబంధమువంటి సంబంధమున్నదనియు దేవి చెప్పెను.

మఱియు ఉమాదేవి యిట్లు చెప్పినది — "నామాయ నిత్య; అనగా పుట్టుట గిట్టుట లేనిది. తురీయ రూపమును నేనే తురీయాతీతంబయిన పదము రూపరహితమైనను నా రూపము, పరబ్రహ్మమని దాని నందురు" —

ఇచ్చట దేవి యనగా — యెవరో తెలియునా? ఈ దేవి సాంఖ్యుల ప్రకృతికాదు. అద్వైతుల మాయకాదు. పరబ్రహ్మము (పరమేశ్వరుడు) స్త్రీ మూర్తిగా (స్త్రీ లింగముగా) భావించి చెప్పబడెనని యర్థము. ఈమె పరమేశ్వరుని శక్తి. శక్తికి శక్తిమంతునకును భేదము లేనట్లు, పరబ్రహ్మమునకును దేవికిని భేదము లేదు. కనుక యీ దేవి దీక్షితులవారు చెప్పు 'లేని మెఱుక' కాదు. మఱియు, ఆ పద్యమునకు ముందున్న పద్య మిట్లున్నది:—

కం॥ అనయంబు వల్కు_నది లో
కనిదానము బ్రహ్మము మాయకనుం
గని సర్వ సాక్షియునై
తనరెడి మద్రూపమిది యథార్థం బింద్రా. (దే. భా. 15-37)

దీని తాత్పర్యము సులభమే:—

ఈ పద్యమువలన దేవి మాయకాదనియు, తాను సర్వసాక్షిననియు చెప్పినందున దీక్షితులవారు యెఱుకను మాయ యనిరి. కనుక ఈ రెండు తత్త్వములు భిన్నములు.

ఎఱుక బయలునందు పుట్టినదని దీక్షితులవా రంగీకరింపరు. పై పద్యమున 'మాయకనుంగని' అని యున్నందున మాయ పరబ్రహ్మమునందు కలిగినదని తాత్పర్యము.

అద్వైతులు మాయను గుఱించి చెప్పిన నిర్వచనము నిదివఱకే వినియున్నావు. (ఈ భాగమునందలి మొదటి ప్రకరణమున 5-వ అధ్యాయము) కనుక, ఇచట చెప్ప నవసరము లేదు. ఈ కారణమువలన శ్రీవిద్యకు దీక్షితులవారి అచలబోధ విరుద్ధము.

దీక్షితులవారు 'ఈ మూలం లేని గుర్తెరిగే శరీరం ఏమీ లేదు' అనునది 'షోడశి' యని వారి గ్రంథమున చెప్పిరి. శాక్తేయులు చెప్పిన షోడశియే యిదియని భ్రమపడరాదు. శ్రీవిద్యయందు షోడశిని గుఱించి అచ్చటచ్చట చెప్పినదానిని యీ క్రింద వివరింతును :—

(1) బ్రహ్మప్రణవసథకము ననుసరించి జాగ్రత్స్వప్న సుషుప్తి తురీయములు నాలుగును ఒక్కొక్కదానిని నాలుగు భాగములుగా చేసిన 16 భాగము లగును. అందు ఒక్కొక్క భాగమునకు ఒక్కొక్క నామము నిడియున్నారు. పదునారవదియగు 'తురీయ తురీయ'ను షోడశి యందురు.*

---

* దీనిని ఈ గ్రంథముయొక్క ప్రథమభాగమునందలి రెండవ ప్రకరణమున (౪౬) తురీయాతీత - సత్తాసామాన్యములు అను అధ్యాయమున వివరించియుంటిని. దానిని చిత్తగింతురు గాక.

(2) శరత్కాలమునందలి చంద్రుని పదునారవకళను షోడశి యందురు.

(3) శివశక్త్యైక్యస్వరూపిణి (1000) అని లలితా సహస్రనామములయందు కలదు. దానిని 'అహం' అందురు. అందు 'అ' శివుడు, 'హం' శక్తి. శివశక్తుల కూడికను షోడశి యందురు.

(4) అకారాది హకారాంతమై వైఖరీ వాగ్రూపమున శ్రోత్రేంద్రియముచే తెలియబడును. (ఇవి అచ్చులు 16) దీనిని షోడశి యందురు.

(5) మనస్సును 'షోడశి' కామకల యందురు. మహానిత్యమనియు అందురు.

(6) షోడశిరూప శ్రీవిద్యయే శుద్ధవిద్యయని యందురు.

(7) యజ్ఞమునకుగాను కైకొను ఋత్విజులను 16 గురను షోడశి యందురు.

(8) (i) చర్మము, (ii) రక్తము, (iii) మాంసము, (iv) మెదడు, (v) ఎముకలు, (ఈ అయిదు ధాతువులు శక్తి మూలకములు) (vi) మజ్జ, (vii) వీర్యము, (viii) ప్రాణము, (ix) జీవము (జీవుడు). (ఈ నాలుగును శివమూలకములు) ప్రాణము జీవము ధాతువులు కావు. ఈ శివశక్తుల కలయిక శరీరము. కనుక దీక్షితుల పైతొమ్మిది ధాతువులు కలుపుకొని 'గుర్తెరిగే శరీరము' అని యుండవచ్చునని ఊహింపరాదు. శైవశాక్తముల ననుసరించి దీనికి మూలము కలదు. వారి మతమును మిథ్యయే, 'ఏమి లేదు' కనుక శ్రీవిద్యయందు చెప్పిన షోడశి యిది కాదు.

—: ఎఱుక - భ్రాంతియేనా ? :—

"పరిపూర్ణములో లేనిదే యెరుకొక్కటి తోచి తనను యెరిగిన మృషగా" (కం. 95) అని కృష్ణదాసుగారు చెప్పిరి. వీరి సిద్ధాంతము ననుసరించి ఎఱుకే భ్రాంతి. భ్రాంతి యొకరికో కలిగినది కాదు. వీరి మతమున జీవుడు లేడు, చిదాభాసుడు లేడు; శరీరి, దేహి, అనువారు లేరు. కనుక, భ్రాంతి అను మాటయే సరికాదని అందురు. వ్యావహారిక జగత్తున భ్రాంతి కాధార మొకటి ఉండవలయును. రజ్జువు నాధారముగా చేసికొనియేకదా సర్పభ్రాంతి కల్పింపబడినది. అనిర్వచనీయ మిథ్యాసర్పమునకు రజ్జువు అధిష్ఠానము. అధిష్ఠానము లేని అధ్యాస లోకమునందు లేదు.

మార్గమధ్యమున వెలుతురు కావలసినంత లేని సమయమున మనము రజ్జువును చూచినపుడు, రజ్జువుయొక్క సామాన్యరూపము మాత్రమే మన నేత్రేంద్రియమునకు గోచరమగును. విశేషరూపము కనబడదు. ఆ మసక చీకటిని ఆధారముగ చేసికొని రజ్జూపహిత చైతన్యము నాశ్రయించి యున్న అవిద్యయందలి తమోగుణాంశము మిథ్యాసర్పమును కల్పించినది. అదేసమయమున చిదాభాసునితో కూడిన అంతఃకరణోపహిత చైతన్యము నాశ్రయించియుండిన అవిద్య తనయందలి సత్త్వగుణాంశమువలన సర్పజ్ఞానమును కల్పించినది. ఇట్లు మిథ్యాసర్పమునకును, మిథ్యాసర్పజ్ఞానమునకును, అవిద్య ఉపాదానకారణము. ఇట్లు మిథ్యావస్తువు, మిథ్యాజ్ఞానమును, ఈ రెండునుచేరి 'భ్రమ' అనబడును. దీనినే 'భ్రాంతి' యందురు. ఇక్కడ ఒక సూక్ష్మమయిన

విషయమును చెప్పుచున్నాను. జాగ్రత్తగా వినవలయును. అద్వైతుల ననుసరించి త్రాటియందు త్రాడు అను మెఱుక కలుగక పాము అను నెఱుక కలుగుటయే 'భ్రాంతి' అని అర్థమయినదికదా! దీక్షితులవారు అదే రజ్జుసర్పభ్రాంతిని గుఱించి చెప్పిన వాక్యములను వినుము. —

"యేమిలేని గుర్తెరిగే శరీరం వున్నదన్న భ్రాంతి రజ్జుసర్పభ్రాంతి, వుత్త త్రాడువలె పుట్టని చావనిది సకల దేశాలయందు సమస్తమయిన వస్తువులయందు చలించక యుండగా పాము తోచినట్లు మూలములేని గుర్తెరిగే శరీరము తోచిందిగాని, కలతోచిన శరీరంవుండి మేలుకొంటే యేమీలేదు."

(బృ. పూ. ప్ర. 1)

ఇచ్చట బట్టబయలును రజ్జువుతోను, మెఱుకను సర్పముతోను పోల్చినారా? పోల్పలేదా? బయలునందు యెప్పటికి లేని యెఱుక ఉన్నట్లు ఆ 'లేని యెఱుకకే' తోచినదట. అట్లు తోచుటకు కారణమును వారెచ్చటను చెప్పలేదు. అద్వైతులు చెప్పిన విధమును వారంగీకరించుటకు వారికి కొన్ని ఆక్షేపణలు కలవు. వారు (శ్రీ దీక్షితుల వారు) చిదాభాసు నంగీకరింతురు. వారిమతమున అవిద్యయే యెఱుక. ఎఱుక మూడుకాలములయందును లేనిదే యందురు. ఇది సరికాదు. దీక్షితులవారు చెప్పినట్లు ఉన్న బయలునందు లేని యెఱుక రజ్జువునందు భ్రాంతివశమున సర్పము కనబడినట్లు కనబడినదని చెప్పిరికదా? బయలు యెఱుకకు అధిష్ఠానమనియు, యెఱుక బయలునందు తోచిన అధ్యాసయనియు అంగీకరించినట్లయినదికదా? దీక్షితులవారు యెఱుకకు అధిష్ఠానము లేదన్నారు.

అనగా అర్థమేమి? ఒక వంక బయలునందు లేని మెఱుక త్రాటియందు లేని పామువలె కనబడినదని చెప్పుచు, మిథ్యాసర్పమునకు రజ్జువు అధిష్ఠానము కాదనిన ఆ మాటలకు అర్థమేమైన కలదా? అధిష్ఠానము అధ్యాస భ్రాంతి అను పదముల యర్థము వారికి తెలియునా? తెలిసి యుండిన నిట్లు చెప్పుదురా?

అధ్యాసమనగా — 'అతస్మిన్ తద్బుద్ధిః' 'అది కాని దాని యందు అదియను జ్ఞానము'. అధిష్ఠాన మనగా — అధ్యాసములో దేనియందు దానికంటె వేఱగుబుద్ధి పుట్టునో అది అధ్యాసము. అధ్యారోపము, భ్రాంతి, అనునవి సమానార్థకములు.

భ్రాంతి యనునది ఒక పదార్థమునందు దానికంటెను భిన్నమగు మఱియొక పదార్థముయొక్క ఆరోపణ. అధిష్ఠానమగు రజ్జువు లేకున్న సర్పధ్యాసయే కలుగదు. ఈ సర్పము అద్వైతము ననుసరించి అనిర్వచనీయమైనది. కనబడు చున్నది. కనుక ఇది (సర్పము) లేనిది అని చెప్పకూడదు. వెలుతురు వచ్చినంతనే కనబడుట లేదు కనుక యిది (సర్పము) ఉన్నదని చెప్పకూడదు. ఉన్నదని లేనిదని చెప్పుటకు వీలులేని దానినే వేదాంతులు 'అనిర్వచనీయ' మని చెప్పిరి. దీక్షితులవారి మెఱుక (ప్రపంచము) అనిర్వచనీయముకాదు. ఏలయన? అది 'లేనిది' అని చెప్పిరి. 'లేనిది' అని నిర్వచించుటవలన అనిర్వచనీయము గాక పోయెను. ఎఱుక లేనిదే అయిన కనబడకుండవలెనుగదా?

భ్రమ అనాది కాదని దీక్షితులవారు ఈ విధముగా

చెప్పిరి. "ఈ భ్రమ అనాది యని పలుకుచుందురు. అనాది భ్రమగా విచారించితే నిత్యానిత్యత్వము కలుగుచున్నది. కనుక ఈ భ్రమ అనాది యని యెంచకూడదు. ఈ భ్రమ దుర్వృత్తిమ. ఈ భ్రమలను నమ్మియుండెడివాడు వెఱ్ఱివాడు."

(బ్ర. పూ. ప్ర. 6)

అనాది యనగా పరమసత్య మని యిచ్చట అర్థము కాదు. కర్మ, అవిద్య, సంసారము, కాలము, భ్రాంతి, యివి అనాదులు. అనగా ఆది తెలియనివని అర్థమేగాని, ఆది లేనివని యర్థముగాదు. కనుక వీటిని నాశరహితమైన నిత్యములని అర్థము చేయకూడదు. అట్టి అర్థము నిత్యసత్యమైన పరబ్రహ్మమునకే చెల్లును. ఇతరత్ర చెల్లదు. భ్రాంతి అనాదికా దనిరికదా? భ్రాంతికి ఆది యెప్పుడో ఆ కాలమును దీక్షితులవారుకాని కృష్ణదాసుగారుగాని, నిర్ణయము చేసియుండలేరు. అనాది యనిన 'నిత్యానిత్యము కలుగుచున్న'దట. అనగా — దాని కర్థమేమో వారికి తెలియదు.

—: ఎఱుకను గుఱించి వివరముగా చెప్పలేకపోయిరి :—

దీక్షితులవారి గ్రంథమున నెఱుకను గుఱించి పరస్పర విరుద్ధములైన వాక్యములు గలవు. అందులో కొన్నింటిని యీ క్రింద వివరింతును :—

"శిష్యుడు :- సుషుప్తియందు యెరుక లయమాయెనా కలదా ?

గురువు :- సుషుప్తియందు యెరుక లయమైతే పిలిచితే పలుకుచున్నాడు. గనుక ఎరుక కలదనే తెలియవలయును".

(బృ. పూ. పు. 141)

అదే ప్రకరణమునందు పై వాక్యముయొక్క అర్థమును ఖండించుచు శ్రీ దీక్షితులు చెప్పిన వాక్యములివి :—

"నిదురలో ఎఱుక ప్రకాశించదు. అందువలన ఎరుకకు హాని గలదు. ఏవిధముగా చూచినను ఎరుకకు హానిగానే యున్నది. ఇటువంటి యెరుకను నిత్యమనరాదు"

(బృ. పూ. పు. 161)

ఇవి సామాన్య వాక్యములు కావు. వీటి అర్థమును గమనించిన యెఱుకను గుఱించి దీక్షితులవారికిగాని, కృష్ణదాసుగారికిగాని, సంశయ రహితమైన పూర్ణజ్ఞానము కలుగలేదు. మార్గములేని అడవిలో సంచరించు మానవుడు ఎప్పటికెట్లు తోచిన అప్పటి కాదిశ ననుసరించి పోవునట్లు శ్రీ దీక్షితులు, శ్రీ కృష్ణదాసుగారు ఎప్పటికెట్లు తోచిన అప్పటి కామాటలు చెప్పిరి. కాని స్థిరమైన నిర్ణయము వారికి లేదు. వారు నడుచుటకు రాజబాట యేర్పడలేదు. స్థిర నిర్ణయము లేకపోవుటచేత విసుగెత్తి, తలనొప్పిపుట్టి చెప్పిన వాక్యములా యివి, అని తోపచేయు యీ క్రింది వాక్యముల చెప్పిరి :—

యెరుక కులము అరణ్యము. ఈ అరణ్యములో ప్రవేశించువారు ఎన్నటికి తేలరు. ఈ యెరుక మనకోసరమై గలిగినది. బ్రతుకనిబిడ్డ బారెడను సామెతగాను యెరుక అనేకరూపములు అనేకనామములు. యెరుకను వివరముగా తెలిసికొనజాలరు.

యెరుకే నరకము". (బృ. పూ. ప్ర. 10) కృష్ణదాసుగారు చెప్పిన వాక్యములను చూడుడు :—

కందా॥ నిక్కముగ బీర పీచుల
చిక్కుసుమీ విప్పరాదు ఛీ యీయెరుకన్
మక్కువనే బోధించిన
చిక్కని బోధాగ్నిచేత, సాధించుపోరా
విచ్చేచింత చాలించుకోరా
చొక్కమా యీ బోధకెక్కడ యీడౌను
తక్కిన బోధాల దిక్కు
చూడక దీన సాధించుపోరా
విచ్చేచింత చాలించుకోరా (265)

కందా॥ "యెరకైన రీతినుండును
యెరుగ నశక్యంబటంచు యెన్నిన యెరుకన్
యెరుగుదుననినను
యెరుకన్ యెరుగుట దుర్లభముసుమ్మి". (33)

ఈ విధముగ శ్రీ దీక్షితులు శ్రీ కృష్ణదాసు యెఱుకను గుఱించి సరియైన నిర్వచనము చేయలేకపోయిరి మరియు తమ అసమర్థతను తుదకు అంగీకరించిరి. కాని, సత్యమెఱిగిన వారికి చిక్కేమియు లేదు. సత్యస్ఫురణము లేనివారికి వేదాంతమంతయు చిక్కే. దీక్షితులవారు "నే ననగా ఎఱుక, ఎఱుక యనగా మాయ, మాయ యనగా త్రికాలముల యందును లేనిదే. బయలు నిత్యము" అని అన్నారు. అద్వైతులు చెప్పునది—"మాయ సత్యా సత్యములు రెండును కాదు. పరబ్రహ్మము పరమ సత్యము.

జిజ్ఞాసువు :- అయితే అంత మాత్రమునకు మీరంత చెప్పవలసిన అవసర మేమి గలిగినది?

వేదాంతి :- దీక్షితులవారు పై రెండు వాక్యములతో ఆగి వాని యర్థమందు స్థిరముగా నిలువలేదు. బట్టబయలు కూడ నశించునన్నారు. వేదశాస్త్రములను, సీతాదేవిని, సీతాదేవి భక్తులను, బ్రహ్మాది దేవతలను, శ్రీ శంకరాచార్యులను నిందించిరి. అంతమాత్ర మే కాదు. వేఱొకచోట చెప్పిన యంశమును సత్యమని స్థిరపరచి, వేఱొకచోట దానిని అసత్యమని ఖండించిరి. ఈ కారణములవలన విధిలేక ఇంత విస్తరించి చెప్పవలసి వచ్చినది.

జిజ్ఞాసువు :- అయ్యా! నేను "గొడ్డాలి కొడుకు"ను అని యెవరైనా చెప్పుకొనుటకు వారికి నోరెట్లాడునో నాకు తెలియదు "నాకు నాలుక లేదు" అని అనుట. ఎట్టి అర్థశూన్యమో "నేను శూన్య"మనుట అట్టిదేకదా? నాస్తికులు, భౌతికవాదులు అన్న దేమి? "నాలుగు భూతముల వలన యీ శరీరము కలిగినది. ఈ శరీరములో యెఱుక కలిగినది". దానికిని దీక్షితులవారి మతమునకును భేద మేమి?

వేదాంతి :- నీవన్నది సత్యమే. సకల వేదాంత సారము రెండు వాక్యములలో చెప్పెదను. "నేను అనబడు ఆత్మయే పరమసత్యము. నాకంటె భిన్నమైన దంతయు అసత్యము"—దీక్షితులవారి మతమున నే ననునది అసత్యము తన(నా) కంటె భిన్నమైనది సత్యము" ఇది జ్ఞాపక ముంచుకొనుము. ఈ యంశమును భగవద్గీతయొక్క 3వ అధ్యా

యమునందలి 27, 28. శ్లోకములయందలి యర్థమును గమనింపుము. నీకు సమస్తము విశదపడగలదు. గీతోపదేశమేమనగా :—

నేను ఆత్మను, క్రియాశూన్యుడను. చేయబడుచున్న సమస్తము మాయ (ప్రకృతి)యే చేయుచున్నది. అహంకార విమూఢాత్ముడగు వాడు "నేను కర్తను" అనుచున్నాడు.

దీక్షితులవారు చెప్పినదేమనగా :— నేను మాయను (ప్రకృతిని) ఆత్మను, సమస్తమును చేయుచున్నది నేనే. నేనే కర్తను. గీతోపదేశమే ఉపనిషత్తుల సారము. "అహంకార విమూఢాత్మా కర్తా౽హమితి మన్యతే" అను గీత వాక్యమును దీక్షితులవారు దోసిలొగ్గినారు. ఇచట పరస్పర విరుద్ధ తత్త్వముల యొక్క భావము ఏకమై తిరుగ దూరమైపోయినవి దీక్షితులవారిబోధ యెంత విన్నను సారాంశమింతే, కాని. జిజ్ఞాసువులయందుండు వివేక తారతమ్యముల బట్టి యింత విస్తరించి చెప్పవలసి వచ్చినది. మఱియు, అచల వాదులలో కొందఱు, శాస్త్రపరిచయము లేని జిజ్ఞాసువుల బుద్ధిని కలత పెట్టకుండుటకై యింత విశదపరచితిని.

—: యోగవాసిష్ఠ - బృహద్వాసిష్ఠ సిద్ధాంతముల యందలి ప్రపంచస్థితి ; —

జిజ్ఞాసువు :- అయ్యా! ఇదివఱలో (ఈభాగము ఒకటవ ప్రకరణమున 17వ అధ్యాయములో) తమరు "యోగ

వాసిష్ఠము - అజాతవాదము" అను అంశమును గురించి చెప్పితిరి. సృష్టి జరుగుటకు కారణము లేదు. కనుక కారణాభావమువలన సృష్టి జరుగలేదని మాత్రమే చెప్పితిరి. తదనంతరము శంకరులవారి అజాతవాదము యొక్క ప్రస్తావన రాగా యోగవాసిష్ఠ ప్రసక్తి పూర్తిగాకయే అంతటితో నిలిచిపోయెను. తమరు అచట చెప్పిన ప్రకారము కరుణాభావము వలన సృష్టి జరుగలేదను సిద్ధాంతమును నమ్మినను పంచేంద్రియములచేత వ్యక్తమగుచు, మనస్సుచేత తెలియబడుచున్న నామరూపాత్మక జగత్తు ఎట్టయెదుట ఉండగా యిది పుట్టకపోయినట్లైన ఏల వ్యక్తమగుచున్నది? అను ప్రశ్నకు యోగవాసిష్ఠము తృప్తికరమైన సమాధాన మేమి చెప్పినది? ఆవిషయమును అనుగ్రహించి వివరింపుడు.

వేదాంతి :- ఈ విషయము అతిసూక్ష్మమయినది. యోగవాసిష్ఠము చెప్పినదానినే సంగ్రహించి చెప్పెదను వినుము — పరబ్రహ్మము శుద్ధజ్ఞాన స్వరూపము. మన బుద్ధికి అందునట్లు ఊహించుకొనవలయునన్న పరబ్రహ్మమును ఒక నిస్తరంగసముద్రము వలెను, స్పందము లేని గాలి వలెను భావింపవలెను. వాస్తవముగా పరబ్రహ్మమునందేమియు పుట్టలేదు. గాలిలోనుండు చలనశక్తివలె ప్రపంచము పరబ్రహ్మమునందే అభేద స్వరూపముతో నున్నట్లును, అద్దమునందు తోచు నగరము అద్దమునకంటె అన్యమేదియునుగాక, దర్పణము మాత్రమే యైయున్నట్లును, వాయువునందు చలనశక్తి వాయువునకంటె భిన్నముగా గాని అభిన్నముగా గాని, భిన్నాభిన్నముగా గాని నిరూపించుటకు వీలులేనట్లును — ఆవిధముగనే ప్రపంచముకూడ పరబ్రహ్మ

మునకంటె భిన్నముగా గాని, అభిన్నముగా గాని, భిన్నాభిన్నముగా గాని నిరూపించుటకు వీలులేదు.

జిజ్ఞాసువు :- పరబ్రహ్మము శుద్ధజ్ఞానస్వరూపు డని యంటిరిగదా! ప్రపంచము ఆయనయందున్నదనిన ఆస్వరూపమునకు బాధ కలుగదా?

వేదాంతి :- వస్త్రమునందు చిత్తరువు వలెగాని, ఒక పాత్రయందు నీరు, ధాన్యము వలెగాని, పరబ్రహ్మమునందు ప్రపంచమున్నదని చెప్పుట లేదు. పైన చెప్పితినిగదా — అద్దమునందు తోచు ప్రతిబింబమువలె నున్నది. ప్రతిబింబము చేతికి చిక్కదు. కాని కనబడుచున్నది. ప్రతిబింబములోని మంచి చెడ్డలు అద్దమును యేవిధముగను అంటవు. ప్రతిబింబము కనబడిన కాలమందుగాని, కనబడని కాలమందుగాని అద్దము ఎప్పటివలెనే యుండును. ప్రతిబింబమువలన దాని కట్టి మార్పును కలుగదు. అందువలన ప్రపంచము పరబ్రహ్మమునందు లేదని చెప్పినను ఒకవిధముగా తప్పు కాదు. కాని నీవడిగిన ప్రశ్నకు అట్లు చెప్పుట సరియైన సమాధానము కాదు.

ప్రతిబింబము (ప్రపంచము) అద్దమునందే యున్నది. కాని మాయ ప్రభావముచేత బ్రహ్మమునకంటె వెలుపల నున్నట్లు తోచుచున్నది. ఈ యంశమును తొలుత బ్రహ్మవిచారమును ప్రారంభించినపుడు దక్షిణామూర్తి శ్లోకము నుదాహరించి చెప్పియుంటిని.*

---

*బ్రహ్మజిజ్ఞాస ప్రథమభాగము, 1వ ప్రకరణము 6వ అధ్యాయము.

జిజ్ఞాసువు :- అద్దమునందు పట్టణ ప్రతిబింబమువలె బ్రహ్మమునందు ప్రపంచమున్న దంటిరికదా? బింబ భూత మగు యథార్థ వస్తువుండినపుడే దానికి ప్రతిబింబముండవల యును. ఆవిధముగానైన జగత్తు బ్రహ్మమునకంటె వేఱై యుండి బ్రహ్మమునందు ఆ ప్రపంచము ప్రతిఫలించుచున్న దని అర్థము చేసికొనవచ్చునా?

వేదాంతి :- ఉన్న చిక్కంతయు ఇచ్చటనే. లోక మున బింబభూతమగు పదార్థ మున్నపుడే అది ఒక యుపాధి యందు ప్రతిఫలించిన దానిప్రతిబింబ మేర్పడును. ఇచ్చట నన్ననో బింబ భూత పదార్థమేదియు లేదు. ప్రతిబింబము మాత్రమే కలదు. బ్రహ్మమునందు ప్రపంచము ఆవిధముగా ఉన్నదని నీకు బోధించుటకొఱకు దర్పణ ప్రతిబింబ దృష్టాంత మును అట్లు చెప్పవలసి వచ్చినది.

జిజ్ఞాసువు :- పరబ్రహ్మము నందు లేని ప్రపంచము అట్లు కనుపించుటకు కారణ ముండవలయును గదా?

వేదాంతి :- పరబ్రహ్మమునకంటె భిన్న పదార్థమే లేనపుడు కార్య కారణము లనెడి ద్వంద్వ మెక్కడిది? ఉన్నది పరబ్రహ్మ మొక్కటే. అట్టి బ్రహ్మమునందు, వాయువు నందు చలనశక్తివలె. బ్రహ్మమునకంటె వేఱనిగాని, వేఱుకా దనిగాని చెప్పుటకు సాధ్యపడని ఆయన సంకల్పశక్తి యేర్పడి నది. ఆ సంకల్పశక్తిచేత యేర్పడిన రూపమే మనస్సు. ప్రపంచ మదియే. ఈమనస్సు అతివిచిత్రమయినది. 'కలదు' 'లేదు' అను రెండు భావములకు (సంశయ, నిశ్చయములకు) మధ్య నిలిచి చంచలమైయుండుట యనునది యేది కలదో అదియే

మనస్సునకు రూపము. సంకల్ప, వికల్పము లుండని మనస్సే పరబ్రహ్మము. అది కొంచెము స్థూలమైన ప్రాణాదులతో సంబంధము కలిగించుకొన్నట్లు తోచుచున్నపుడు దానినే జీవుడందురు. మనో ప్రాణముల సంబంధము లేకున్న జీవుని స్వరూపమే పరబ్రహ్మస్వరూపము. ఆ జీవరూపమే ఘనమై అధిక చలనము గలదియై అభిమానరూపమగు అహంకారమును ధరించుచున్నది. ఇది జీవునికంటె స్పష్టముగా మన అనుభవమునందున్నది. దీనియందుండు అభిమానమును దీనినుండి తొలగించిన అప్పుడు ఇది పరబ్రహ్మ స్వరూపమే. ఇది (అహంకారము) మరింత స్థూలమై చిత్తమనబడుచున్నది.

మొదట చెప్పిన మనస్సు సంకల్ప వికల్పాత్మకము. కనుక పరబ్రహ్మమునందు ప్రపంచ (జగత్) కల్పనము చేసినది. మనస్సునకు పరబ్రహ్మమునకంటె భిన్నమగు సత్త లేదు. మనస్సు అనునది శబ్దమాత్రమేగాని అర్థము లేదు. అది పేరుగల ఒక కల్పన మనన శక్తితో కూడిన జ్ఞానమునే లోకులు మనస్సనిరి. చేతనా చేతనములకు నడుమనుండి రెంటితో సంబంధము ఏది కలిగియున్నదో అదియే మనస్సు. మనస్సే సంసారము. కనుక మనస్సుచేత కల్పింపబడిన ప్రపంచము పరబ్రహ్మమునకంటె భిన్నము కాదు. సంకల్ప వికల్పములవలన తోచు జగత్తు నామరూపములు కోల్పోయి పరబ్రహ్మమునందే లయమగుచున్నది. లయమనగా కనబడకపోవుచున్నది. లేదా పరబ్రహ్మరూపముగా కనబడుచున్నది. ఈవిధముగా సంసారికి అద్దమునందు తోచు పట్టణము కైవడి ప్రపంచము సత్యమని తోచుచున్నది. జీవన్ముక్తులకన్ననో నిర్మలమగు అద్దము మాత్రమే కనబడుచున్నది. అందు

పట్టణ ప్రతిబింబము లేదు. లేదా — పట్టణముగ కనబడినను అది మిథ్యాభూతమని, సత్యము కాదని, దర్పణము మాత్రమే యని నిశ్చయమగుచున్నది. మనస్సు, సంకల్ప వికల్పములు కలిగియున్నపుడే, అది ప్రపంచరూపమున తోచుచున్నది. మనస్సు నిశ్చలమైన జగత్తు మిథ్య. ఇంకను విశదముగా చెప్పెదను.

ఆద్యంతరహిత మగు చిద్రూపసముద్ర మొకటి కలదనుకొనుము. అది తనయందే తన స్వరూపమువంటి తరంగములవలె స్పందించిన దనుకొనుము. ఆస్పందమే చిచ్ఛక్తి. శ్రీ జ్ఞానేశ్వరులు చెప్పిన దాస్పందమేకదా? అది శివశక్తులైనదని వారు చెప్పిరికదా?

మహోపనిషత్తు యిట్లు చెప్పినది :—చిద్రూపస్పందమనబడు చిచ్ఛక్తియే దేశకాలానుగుణ్యముగ వృత్తిభేదము ననుసరించి మనస్సనియు, బుద్ధియనియు, వృత్తిజ్ఞానమనియు, క్రియ యనియు, అహంకారమనియు, చిత్తమనియు, ప్రకృతి యనియు, మాయయనియు, మలమనియు, కర్మయనియు, బంధమనియు, పుర్యష్టకమనియు, అవిద్యయనియు, ఇచ్ఛయనియు, చెప్పబడుచున్నది. (5 - 130, 131, 132).

శాస్త్రము లీరీతిగా చెప్పియుండగా దీక్షితులవారు చెప్పిన యొకానొక మనస్సు కాదని చెప్పుటకు వీలులేదు. కాని, దీక్షితులవారు పైన చెప్పిన పరబ్రహ్మసంబంధమైన శక్తి (చిచ్ఛక్తి)యే సర్వరూపములతో ఉన్నదని అంగీకరింపరు. వారు చెప్పిన ఉత్తబట్టబయలునకు ఏశక్తియు లేదట. కనుక యొకానొక బయలునకు సంబంధించినది కాదందురు.

బయలు - ఎఱుక — ఈ రెండింటిలో ఒకటి యెఱుక (జ్ఞానము) కలది. మఱియొకటి యెఱుక లేనిది. ఎఱుక యెన్నటికి బయలుకాదు. బయలు ఎన్నటికి యెఱుక కాబోదు, కాదు, అని యొకచోట చెప్పి మఱియొకచోట అందుకు విరుద్ధముగా చెప్పిరి.

మనస్సే (ఎఱుకే) ప్రపంచరూపమైనది. అది మిథ్య కనుక దాని పరిణామమగు ప్రపంచము మిథ్య. మిథ్య యనగా :— అనిర్వచనీయము కనుక మిథ్య యని వేదాంతులును — ప్రపంచము కుందేటికొమ్మువలె త్రికాలముల యందును లేనిదే యని దీక్షితులవారును భిన్నార్థములను చెప్పిరి. కాని ప్రపంచమనునది పరబ్రహ్మముయొక్క విస్తరమని యోగవాసిష్ఠమును, అట్లు కాదని బృహద్వాసిష్ఠమును చెప్పినవి.

అజాతవాదమును చేసిన యోగవాసిష్ఠకర్తయు, శ్రీ శంకరులును, శ్రీ జ్ఞానేశ్వరులును, శ్రీ దీక్షితులును, జగత్తు పుట్టలేదనుటలో భేదాభిప్రాయములు లేకపోయినను, వారి వారి సిద్ధాంతమును వివరించుటలో భేదమున్నది. ఎట్లయెనుట కనబడుచున్న జగత్తు పుట్టలేదనుట యోగవాసిష్ఠకర్త యిట్లు చెప్పెను :—

శ్లో॥ అబుద్ధిపూర్వం సంజాతా రత్నాద్దీపం యథార్చిషః,
స్వాత్మైవ సంనివేశేన తథైవాసాం జగచ్ఛ్రియః. (6-1:7.30)

తా॥ రత్నములు తమప్రయత్నము(లు) లేకయే తమ

(రత్నముల యొక్క) కాంతులు రత్నములనుండి ప్రకాశించు నట్లు పరబ్రహ్మము సంకల్పము లేకయే జగదాకారమున స్ఫురించుచున్నది.

జిజ్ఞాసువు :- అయ్యా! తమరు తొలుత (ఈ గ్రంథము యొక్క ప్రథమభాగమున) ఆత్మయందు ఆకాశాది సూక్ష్మ భూతపంచకము కలిగినవని, వాటియందలి సత్త్వగుణము యొక్క సమష్టి అర్ధభాగ పంచకములవలన మనస్సుకలిగిన దని చెప్పియుంటిరి. కాపిల సాంఖ్యుల సృష్టిక్రమములోను వారి సృష్టిక్రమమును కొంతవఱకు అనుసరించిన ఉపనిషత్తు లలోను ప్రకృతికి మహత్తును, దానికి సాత్త్వక, తామస భేదములుగల అహంకారమును, అందు సాత్త్వ కాహంకా రమునుండి మనస్సుకలిగినదని చెప్పితిరి. యోగవాసిష్ఠమున పరబ్రహ్మమునుండియే, లేక ఆయనస్పందమే లేదా, ఆయన లీలయే, మనస్సని చెప్పితిరి. ఈ యంశమున యీ భేద మును పరిహరించుటెట్లు?

వేదాంతి :- మొదట చెప్పినది సృష్టివాదుల పద్ధతి. రెండవది అజాతవాదుల పద్ధతి. కనుక యీ భేదమేర్పడినది. విచారించినచో ఇది నామమాత్ర భేదమే. పరబ్రహ్మము యొక్క స్పందము, లేక లీల, అనుదానికే మనస్సను మఱొక పేరు కలదనుకొనిన సరిపోవును కదా? మనస్సు శుద్ధ మనియు — అశుద్ధమనియు — రెండువిధములు. బ్రహ్మము నుండి తొలుత కలిగినదని చెప్పబడినది శుద్ధమానసము. అదియే చిత్తము, స్పందము. మైత్రాయణ్యుపనిషత్తు — శుద్ధ మానసమును హృదయముతో సమానమని చెప్పినది. —

ఏది హృదయమో అదియే మనస్సని ఐతరేయ శ్రుతి చెప్పినది. (ఐ. 3-2). అదియే అతిమానసమని, అతీతమానసమని రెండు విధములుగా చెప్పుదురు. అవి యోగులయందును మహాత్ములయందును నుండు నందురు. పంచేంద్రియములతోకూడి పని చేయు మనస్సు సామాన్యమానసము (భౌతిక మానసము). అదియునుగాక వేదాంతులు అజాతవాదులైనను వారు చెప్పిన దేమన - ఉపనిషత్తులయందు చెప్పిన సృష్టిక్రమము ముముక్షువులకు పరతత్త్వము సులభముగ అవగాహన చేసికొనుటకు కల్పింపబడినదని అందురు.

జిజ్ఞాసువు :- ప్రపంచము నాకు కనబడుచున్నదికదా? అది జడమునకు చైతన్యమునకు మధ్యనుండి మనస్సు ప్రపంచముగా నెట్లు పరిణమించును?

వేదాంతి :- యోగవాసిష్ఠ మిట్లు చెప్పినది :— జడమని — చేతనమని వేర్పాటు సర్గాదియందు లేదు. ఇప్పుడు నీకు కనబడుచున్న ఆ రెండింటికి సత్తు పరబ్రహ్మమే 'సమస్త'మును చిదేకరసమే. జడము లను కల్పన, బుద్ధియొక్క కల్పనయే. ఆయావస్తువులయందున్న ప్రత్యేక బుద్ధి తన్ను ఆయా వృక్ష శిలాదులుగ భావించుకొని ఆయా రూపములతోనే అభివ్యక్తి చెందియున్నది. (3. 55 57-59).

కాని, నీవడిగిన ప్రశ్నకు సూటియైన సమాధానమేమన - మనస్సు. ఇంద్రియముల వైపునకు మరలి చూచిన జడజగత్తును, ఇంద్రియముల నుండి మరలించి అంతర్ముఖమై యుండిన చైతన్యమును చూచును. కనుక మనస్సు జడ చైతన్యముల మధ్యనున్న దనిరి.

ఇవి యంతయు స్వప్నతుల్యమని యోగవాసిష్ఠము చెప్పిన దానినే దీక్షితుల వా రంగీకరించిరి. కనుక మఱి యొకమారు స్వప్న విచారమును గుఱించి పరిశీలింతము.

—: స్వప్నవిచార పునః పరిశీలనము :—

స్వప్నమును గుఱించి వెనుక (ఈ గ్రంథము. I-2-33 యందును) దీక్షితులవారు చెప్పిన పంచదశీ మంత్రార్థమును పరిశీలించు సందర్భమునను (2-21) చెప్పియుంటిని. స్వప్న జాగరములు రెండును నొక్క-టియేయను (దీక్షితులవారి) సిద్ధాంతము శ్రుతులకు సమ్మతము కాదని (21. వ అధ్యాయమున) శ్రుతి వాక్యములను నుదాహరించి యుంటిని.

ప్రస్థానత్రయములయం దొకటిగను, వేదాంత శాస్త్రములయందు సాటిలేని గౌరవము పొందినట్టియు, బ్రహ్మసూత్రముల (వేదాంత సూత్రముల)యందు 3వ అధ్యాయమున 2వ పాదమున సంధ్యాధికరణమున స్వప్న విచారము చేయబడినది. సంధ్య - యనగా రాత్రిగాని, పగలుగాని కాక ఆ రెంటింటికి మధ్యగల సమయము. దానిని శ్రుతుల యందు సంధి యనికూడ చెప్పిరి. స్వప్నము పరలోకము (సుషుప్తి) కాదు. ఇహలోకము (జాగ్రత్తయు) కాదు, మధ్యనున్నది. కనుక సంధియని ఆ యధికరణమునకు నామమిడిరి.

సంధ్యాధికరణము నందలి చర్చలో స్వప్నమున అనుభవింపబడు సృష్టి సత్యమే అని పూర్వపక్షియు, సత్యము కాదు మిథ్య యని సిద్ధాంతియు వాదించినట్లు కలదు. సారాంశమిది :—

స్వప్నము నిద్రనుండి మేల్కొనగనే అసత్యమగును స్వప్నము ప్రాతిభాసిక సత్యమే. జాగ్రత్తు అట్లుకాదు. బ్రహ్మ సాక్షాత్కార పర్యంతము సత్యమే. ఇదే వ్యావహారిక సత్యము. స్వప్న జ్ఞానము కొన్ని సమయములయందు భవిష్యత్తు నందలి జాగ్ర దనుభవమును సూచించును. ఉపాసకులకు వారి ఉపాస్య దేవత స్వప్నమున సాక్షాత్కరించి భక్తులకు వరములిచ్చుచుందురు. దీనిని "సూచ్యసూచక భావ సంబంధ" మందురు. (బ్రహ్మ. 3-2 4) ఇంతమాత్రము చేత స్వప్న జాగరములు ఒకటి యనరాదు. వివరములను తెలియగోరువారు ఈ యధికరణమునకు శ్రీ శంకరులు వ్రాసిన భాష్యమునుగాని బ్రహ్మసూత్రార్థ చంద్రికను గాని చదువవలయును. సూత్రకారులు చేసిన వాదము దీక్షితులవారి మతమును ఖండించుచున్నది.

జాగ్రదవస్థయందు మనకు నామరూపాత్మక జగత్తు పరబ్రహ్మమును అధిష్ఠానముగా జేసికొని మాయచే కల్పింపబడినది. స్వప్న ప్రపంచమున సాక్షి నధిష్ఠానముగా జేసికొని అవిద్య కల్పించుచుండును. స్వప్న జాగరములు నొక్కటియే యైన పక్షమున వారి యనుభవ మీ క్రింది విధముగ నుండవలయును :—

(1) స్వప్నమున నొకనికి నిధి (ధనము) లభించిన మేల్కొన్న పిమ్మటను నిధి వానియొద్ద నుండవలయును,

(2) స్వప్నమున నొకడు వానికి కాలు తెగిపోయినట్లు కలగనిన స్వప్నము నుండి మేల్కొన్న పురుషుని వానికి కాలు తెగియుండవలయును,

(3) స్వప్న ప్రపంచమున కార్య కారణములు రెండును నొక్కమారే కలుగును. జాగ్రత్తయందు మొదట కారణము, దాని ననుసరించి కాల పరిపాకమున కార్యమును కలుగుచుండును.

(4) ఒకడు ఒక ఆదివారమున ఒక గ్రంథమును చదువుటకు ప్రారంభించి యేబది పుటలు చదివె ననుకొనుము, వాడే మరుదినమున ఆ గ్రంథమును గైకొని వెనుకటి దినమున నేబది పుటలు చదివితినని స్మరించి యేబది యొకటవ పుట నుండి చదువుటకు ప్రారంభించి చదువును. కాని, ఆదివారము రాత్రి వానికి కలగలిగిన కలయందు గ్రంథమును ఏబది ఒకటవ పుటనుండి చదువడు. స్వప్నమున వాని కాగ్రంథ స్మరణమే యుండదు. స్వప్నము మనయధీనము కాదు, అనగా — ఒకని కొక రాత్రి నిద్రయందు కలిగిన స్వప్నమునకును, మఱియొక రాత్రి వానికే కలిగిన కలకును సంబంధ (అనుబంధ) ముండదు.

(5) ఒకడు స్వప్నమున నొకయూరికి నడచిపోవు నట్లు కలగనుచుండు నంతలో నిద్రాభంగమై మెలకువ వచ్చెను. అప్పుడు వాడు, తన ఇంటియందే రాత్రి తాను శయనించిన పడుకయందే, మేల్కొనునుగాని, రాత్రి కలలో నడచుచు పోయిన మార్గమధ్యమున మేల్కొనడు.

(6) జాగ్రదవస్థయందు ముక్తిసాధనములగు శాస్త్రాధ్యయనము, జ్ఞానయోగము, అష్టాంగ యోగముల నభ్యసించుటయును, ఈశ్వరారాధనము, మొదలగు వాటిచే

ముక్తిని బొందుటకును అవకాశమున్నది. స్వప్నమున అట్లు చేయుట కవకాశము లేదు.

(7) నేను నాయనుభవమును చెప్పెదను. స్వప్నమును గనుచున్నపుడు ఇది స్వప్నమని తెలియకపోయినను స్వప్నగతమగు నా శరీరమునకు నేను వేఱుగా (సాక్షిగా) నుంటినను అనుభవము జాగ్రదవస్థయందు కంటె స్వప్నమున స్పష్టముగా నుండును. ఈ యనుభవమును మాటలతో విశదీకరించుట కష్టము. ఇందులకు శాస్త్రదృష్టాంతమును సహితము చూపెదను.

మహాభారతాంతర్గత శాంతిపర్వము నందలి, మను బృహస్పతి సంవాదమునందు ఈ విషయ మిట్లు వివరింప బడినది —

చ. కలలోనం దనమేను కూలబడుటన్ గన్గొంచు దానన్య వ
ట్టులు గన్పట్టుచుగాన దేహమునకెప్డున్ భిన్నుడై జీవుడో
డ్డాలు మేనుల్ గాని ధీమనోక్షములతో డుంగ్రి లింగాంతరం
బుల బొల్పొందు నటంచు నీకు దెలియం బోలున్ బుధేంద్రోత్తమా.

(కృ. భా. శాం. 5-366)

ఒకడు వాని స్వప్నమున వాని దేహము క్రిందపడి నట్లు చూచును. తన దేహమును చూచినట్టి తాను వేఱుగను తనచే చూడబడునట్టి తన దేహము వేఱుగను నున్నట్టి యనుభవము కలుగును. కనుక దేహము వేఱుగను నున్నట్టి యనుభవము కలుగును. కనుక దేహమునకంటె జీవుడు భిన్నుడు. అట్లె వాడు మరణించినపుడు, బుద్ధి, మనస్సు,

ఇంద్రియములు, వీటితో కూడినవాడై దేహమును వదలి వేఱొక దేహము పొందినవా డగునట్లు నీవు తెలిసికొన వలెనని తాత్పర్యము.

జిజ్ఞాసువు :- అయ్యా! కొందఱిట్లందురు :— ఒకడొక రాత్రి నిద్రలో ఒక స్త్రీతో సంభోగించినట్లు కలగనును. వాడు కట్టుకొన్న వస్త్రమునందు వానికి వీర్య స్ఖలన మగును. మేల్కొనగనే అది వానికి తెలియును. ఆకారణమున స్వప్న జాగరములు సమములే యందురు. ఇందులకు సమాధాన మేమి?

వేదాంతి :- అది తప్పు. కలగనిన పురుషుడు వాని స్వప్నమున వాడే కాంతతో భోగించెనో దాని యోని యందుగదా వాని వీర్యము పతనమయ్యెను. మేల్కొన్న ప్పుడు ఆ స్త్రీ కనపడనట్టే వాని వీర్యము సహితము కన బడకుండ నుండవలయునుగదా? అట్లుగాక, వాని వీర్యము వాడు కట్టుకొన్న బట్టయందు కనబడుటకు కారణమేమి? శరీరమున ఉష్ణ మధికమైనప్పుడును, ఆనాడు భుజించిన అన్నపానముల వలనను నాడులకు ఉత్తేజము కలిగి లింగో త్థానమై అండములలో (శుక్ల కోశాలలో నిండిన) వీర్యము బయట పడుచున్నది. ఇంకను శారీరక, మానసికముగు నితర కారణములున్నవి. ఇది తాత్త్విక విషయము కాదు. ఇంకొక విషయము గమనింపుము. కలలో కనబడిన ఆ స్త్రీ వానిని గంధ మాల్యాదులతో అలంకరించి, తాంబూల మొసగి, పరిమళ ద్రవ్యములనలంది వానితో సంభోగించి నట్లు కలగనును. వాడు మేల్కొన్న పిదపకూడ ఉపభోగ

చిహ్నములగు దంత నఖ క్షతాదులు వానియం దుండవల యును గదా? మేల్కొనగానే వాటిలో నొక్కటియైనను కనబడదు. స్వప్న జాగరము లొక్కటి కాదనుటకే కారణము చాలదా? స్వప్నగత స్త్రీతో కలిగిన భోగానుభవము నిద్రాదోషముతో కూడిన అవిద్యా కల్పితము. నిద్ర లేకపోవుటతో అవిద్య ఆక్షణమునందే స్వప్న కల్పనము నుపసంహరించినది "కల యెవ్వరి స్వాధీనం లేదు". (బృ. ఉ. ప్ర. 6. ఆ. 2.) అని దీక్షితులవారే చెప్పిరికదా?

కల కార్యకారణబద్ధమై యున్నది. జాగ్రత్త కార్యబద్ధమై మాత్రమే యైయున్నది. దీని వివరమిది:—

త్రివిధావస్థల స్వరూపమును విచారించి చూచిన త్రివిధ సత్తల నంగీకరించుట ఉత్తమపద్ధతి యని నా యభిప్రాయము. పెద్దల యభిప్రాయమే అది.

(1) సుషుప్తి (గాఢనిద్ర):— దీక్షితులవారు చెప్పు ఎఱుక దీనియందు లేదు. అద్వైతులు చెప్పు సాక్షి కలదు. వృత్తి జ్ఞానమును లేదు. దీనియందు స్వప్నము కలిగినది. కనుక స్వప్నమునకు సుషుప్తి కారణము, స్వప్నము దీని కార్యము. సుషుప్తికి కారణము లేదు. కనుక నిద్ర కారణబద్ధము, కార్యబద్ధము కాదు. అనగా నిద్రకు కారణము లేదు.

(2) స్వప్నము:— ఇదే దీక్షితులవారు చెప్పిన ఎఱుక. ఆయన మతము ననుసరించి యిది లేతశరీరము. దీనికి కారణము లేదని వారి వాదము. వారి మతమున నిదే

"మూలములేని గుఱ్ఱెటిగే శరీరము" నిద్రలో స్వప్నము కలుగుచున్నదని మొండి అమాయకుడైనను ఎంతటి పసి ప్రాయుడైనను తెలిసికొనుచున్నాడు. ఇట్టి ప్రత్యక్షానుభవమును కాదనిన నెవరు మోసపోవుదురు? కనుక గుఱ్ఱెటిగే శరీరమునకు మూలమున్నది. ఆ మూలమే సుషుప్తి. అదియే అవిద్య.

స్వప్నమునకు కారణము సుషుప్తి. స్వప్నమునుండి జాగ్రత్త కలిగినది. కనుక స్వప్నమునకు జాగ్రదవస్థ కార్యమును సుషుప్తి కారణమును అయినందున స్వప్నము కారణ - కార్య బద్ధమై యున్నది.

(3) జాగ్రత్త :— ఇది స్వప్నమునుండి కలిగినది. దీనిని దీక్షితులవారు ముదురు శరీరమన్నారు. ఇది స్వప్నమునుండి కలిగినందున కార్యబద్ధమై మాత్రమే యున్నది. దీని యందు మఱియొక యవస్థ కలుగ లేదు. కనుక ఇది కారణబద్ధము కాలేదు. ఇట్లు కార్యకారణ బద్ధమగు స్వప్నమును కేవల కార్యబద్ధము మాత్రమే అయియున్న జాగ్రత్తను ఒక్క ప్రాతిభాసికసత్తయని అంగీకరింపకూడదు.

నదియొక్క ఉభయతటముల యందు సంచరించు చేపవంటిది స్వప్నమని బృహదారణ్యకశ్రుతి (6-3-18) చెప్పినది. మూడవస్థలయందు జీవుడుండు స్థానములు వేఱువేఱని శ్రుతులు చెప్పినవి.

జిజ్ఞాసువు :- అయ్యా! స్వప్నము కేవలము మిథ్యయనవచ్చునా?

వేదాంతి :—(దీనిని గురించి) యోగవాసిష్ఠము నందలి నిర్వాణ ప్రకరణమున 148వ సర్గమున వ్యాధ - ముని సంవాదమును ఇతిహాస రూపమున ఈ తత్త్వము బోధింపబడినది. ఒకమునికి వ్యాధునికి జరిగిన సంవాదమునందు ముని వ్యాధునకు ఇట్లు చెప్పెను :—

స్వప్నఫలములు కొందఱికి కాకతాళీయన్యాయమువలె ఫలము కలుగజేయును. వీటిని సత్య స్వప్నములని తెలియజేయవచ్చును. ఒకానొక మహాపురుషునియందు (సత్త్వగుణ సంపన్నునియందు) స్వప్న ప్రభావము జాగ్రత్తదశయందు సత్యమేయగును. అయినను అది ఆకస్మికమే. ఈ స్వప్నము నిత్యమేయగు జ్ఞానము దృఢ నిశ్చయమైయున్న చోట సత్యమేయగుచున్నది. సంశయ జ్ఞానము కలచోట ఫలమును సంశయమే యగుచున్నది. అట్లే స్వప్నము అజ్ఞానులయొక్క దృష్టియందు ఒకానొకచోట (సంవిత్తుయొక్క దృఢత్వముగ) సత్యముగను, మఱియొకచోట (సంవిత్తుయొక్క అదృఢత్వముగ) అసత్యముగను ఉన్నది. జ్ఞానులయొక్క దృష్టియందు సద్రూపముగగాని అసద్రూపముగ గాని కాక అనిర్వచనీయమై ఒప్పుచున్నది.

స్వప్నములుకూడ శాశ్వతములే యనిన పెద్దలు కొంద ఉన్నారు. శ్రీ అరవిందయోగి స్వప్నములు ఈశ్వర ప్రేరితములై కలుగుననిరి. స్వప్నములు అసత్యములైనను వానివలన భావి శుభాశుభములను తెలిసికొనవచ్చుననిరి—

—: బయలును గురించిన పునఃపరిశీలనము :—

బయలు - ఇది ద్వాదశాక్షరీమంత్రమునకు సంబంధిం

చినది. బయలును గుఱించి వెనుక (22వ అధ్యాయము నుండి 25వ అధ్యాయము వఱకు) చెప్పియుంటిని. ఆ సందర్భమున (23వ అధ్యాయమున) "ఉపనిషత్తులయందలి బ్రహ్మము" అను చర్చయు, (24వ అధ్యాయమున) "భూమి అనగా నేమి" అను చర్చయు, (25వ అధ్యాయమున) "బ్రహ్మము, సగుణ, నిర్గుణ, నిష్ప్రతియోగికములని త్రివిధముగా" చెప్పబడిన యంశమును (43వ అధ్యాయమున) చిదాకాశ, చిత్తాకాశ, జడాకాశముల గుఱించియు చెప్పితిని. అందు (పై అధ్యాయములయందు) బయలునకంటె వేఱగు అంశముల కొన్నింటిని చర్చించినను అవి బయలును గుఱించిన చర్చకు సహాయకారులగు నంశములగుటచే నవియు చర్చింపబడెను. అచట ముఖ్యముగా బయలును గుఱించి చర్చించియున్నందున నిచట ఎక్కువగా చర్చింప నవసరముండదు.

ఒకచోట దీక్షితుల వారిట్లు చెప్పిరి :—

"శంకరాచార్యులవారి అద్వైతము, రామానుజాచార్యుల వారి విశిష్టాద్వైతము, సర్వం వారితోటే పోయింది, వున్నది ద్వైతాద్వైతరహితమైన పరమతత్త్వం. దశముఖుడు వేచే అన్నట్లు మొక్కడబడితే అక్కడే బట్టబయలు వున్నది.

(బృ. ఉ. ప్ర. అ. 2)

అద్వైత విశిష్టాద్వైతములు మొక్కడికి పోలేదు. దశముఖుడు (రావణాసురుడు) "మొక్కడబడితే అక్కడ బట్టబయలు వున్నది" అన్నమాట కర్థమేమి? రావణుడు యుద్ధము సమాప్తము కాకముందు లంకానగరములోని

గోపుర మెక్కి చూచినపుడు వాని చతురంగబలములన్నియు నశించి యుద్ధరంగము శూన్యముగానుండుట చూచి యుండి "యెక్కడిబడితే అక్కడ బట్టబయలుండు" నని అని యుండునా? లేక దశముఖుడు దీక్షితులవారు చూచిన బయలును చూచినాడా? ఇందులకు ప్రమాణ మెచ్చట? కృష్ణదాసుగారు ఇట్లు చెప్పిరి :—

బయలులో మొలక కనబడుట లేదు, కనుక మొలకను శూన్యమువలన వచ్చెనట (కృష్ణదాసుగారి కందములు 77, 78, ఇదివరలో ఉదాహరించితిని). ఆ శూన్యమునే ఆకసమువలన వచ్చెనట. ఆకసమువలననే విశ్వ మయినదట. అది యెట్లు? శూన్యమునుండి యేదియు కలుగదు. శూన్యమునుండి జగత్తుకలిగిన శూన్యము కారణధర్మము గలదియు, తనయందు నుండి కలుగబోవు విశ్వముయొక్క బీజమును గర్భమునందు గలదియు, కనుక సగుణయు జగత్తునకు కారణమును కావలయును. అట్టిది శూన్య మెట్లగును?

శ్రుతియే భూమ, బయలు — అని చెప్పుట కూడ ఒక విధముగా (చూచిన) వ్యావహారికమే. ఏలయన? అల్ప మున్నపుడే అధికమున్నదను భావము కలుగుచున్నది. "బ్రహ్మము" అన్నను, "భూమ" అన్నను, గొప్పది అని, అర్థము. దేనికంటె గొప్పది? తదితరమైన సమస్తమున కంటె గొప్పది. తదితరమే యున్నది. ఉన్నది ఒక్క భూమయేగదా? నిజమే. నానారూపాత్మక నానావిధ వస్తు జాలము కలదను అజ్ఞానులకే ఈ బోధ చేయవలసి వచ్చినందున గురువు అట్టి సంసారియొక్క అనుభవమునకు తగి

వట్లు తనబుద్ధిని శిష్యునిబుద్ధియొక్క స్థానమునకు తెచ్చి పైవిధముగా చెప్పవలసి వచ్చినది. "సదేవ సౌమ్యేద మగ్ర ఆసీత్" అని శ్రుతి చెప్పినది. కాని శ్రుతి పొరపాటుపడదు. పై శ్రుతి వాక్యమున కర్థ మేమనగా :— ఓ సౌమ్యుడా! అగ్రే = సృష్టికి పూర్వమునందు, సత్ = సత్యము మాత్రమే ఉండెను. సృష్టికి పూర్వము అన్నపుడు ఆ సత్పదార్థము ఇపుడు లేదని యర్థమా? భవిష్యత్తునందు ఉండబోదని అర్థమా? త్రికాలాబాధితమైన వస్తువే సత్పదార్థము గదా? పూర్వము అనుట తప్పుగదా? శ్రుతి తప్పుచెప్పదు. మానవుడు పుట్టినది మొదలు వానికి గల జ్ఞానము దేశకాలములచేత పరిమితమై యున్నది. వాని అనుభవము దేశకాలముల నతిక్రమించియుండ లేదు. కనుక వానికి బోధించుటకు శ్రుతి, లేక గురువు, దేశకాల పరిమితిలోనికి తన బుద్ధిని ప్రవేశపెట్టి అచ్చటనుండియే శిష్యులకు బోధింపవలయును. లేనిచో (ముముక్షువునకు) నేల విడిచి సాము చేయుమని చెప్పినట్లగును.

కనుక అఖండాద్వయ వస్తువు ఒకటి కలదంటిమేని ఆ వస్తువు శుద్ధజ్ఞానస్వరూపమై యుండవలయును. ఆ వస్తువు గాక మఱియొకటి కాదనిన ద్వైతము సిద్ధించును. ఒకటే కలదనిన దాని ఉనికి అది తప్ప ఇతరమైన దేదియు మెలుగుటకు వీలు లేదు. ఈ చిక్కును విడదీసి పరిశీలించినట్లయిన దీక్షితులవారు చెప్పు ఈ ఉత్త బట్టబయలు "యేమీ లేదు" అన్నప్పుడు "యేమీ లేని దానిని" గుఱించి యేమి చెప్పవలయును?

బృహద్వాసిష్ఠ సిద్ధాంత గ్రంథముయొక్క ప్రతి యందు గ్రంథము సమాప్తమయిన పిమ్మట "భావార్థ దీపిక"* అను పేరుననున్న దానినే "భావరహిత ప్రకరణ"మని మఱియొకరు భిన్న ప్రతులయందు ముద్రించి యున్నారు. అది వ్రాసినవా రెవరో తెలియదు. సంస్కృతము నందున్నది. ఒక ప్రతిలో దానికి టీకాతాత్పర్యమును కూడ వ్రాసి ముద్రించి యున్నారు. అందులో—

శ్రుతి "సర్వదా మాం అహం న వేద, ప్రత్యక్చైతన్యమాయా రహితత్వాత్, తస్మాత్కదాచి న్మాయయా వేద! మాయయా న వేద!

టీక :- సర్వదా = ఎల్లప్పుడును, మాం = నన్ను, అహం = నేను, ప్రత్యక్చైతన్య = అచల పరిపూర్ణ బ్రహ్మమని చెప్పబడుచున్నాను, మాయారహితత్వాత్ = మాయ రహితమగుటచేత. తస్మాత్ = అందువలన, కదాచిత్ = ఒకప్పుడును, మాయ యా న వేద = మాయను తెలియబడదు".

పై వాక్యములవలన 'అహం' శబ్ద వాక్యమైన ప్రత్యగాత్మయే అచలపరిపూర్ణమని అర్థమగుచున్నది. దీక్షితులవారి వాదమును ఈ వాక్యము ఖండించుచున్నది. ఇది చాలదా?

బౌద్ధమత - అచలబోధలకు గల సామ్యతను

* ఈ ప్రకరణమునందే 187-వ పుటలో శ్రీమద్భాగవతమునకు శ్రీధరస్వాములవారు వ్రాసిన వ్యాఖ్యానమునకు "భావార్థదీపిక" అను పేరని వ్రాసియుంటిని. అందులో అచలవాదులు కొంత భాగము నుదాహరించిరేమో తెలియదు.

గురించి (వెనుక 37-వ అధ్యాయమున) చెప్పియుంటిని. ఆ యంశములను జ్ఞప్తికి తెచ్చుకొనిన నాగార్జునాచార్యులవారి శూన్యవాదముతో దీక్షితులవారు చెప్పిన బట్టబయలునకు కొన్ని పోలిక లున్నవి. మాధ్యమిక బౌద్ధుల శూన్యమునకు అర్థ మేమనగా :— సర్వమును పరివర్తన శీలము గలదై నిలుకడ లేనిదైనందున సర్వము శూన్యమే అనిరి. నాగార్జునాచార్యులవారు చెప్పిన శూన్యము నశించునదని వారెచ్చటను చెప్పియుండ లేదు. దాని భావము వేఱు. శ్రీ దీక్షితులవారు "మహాశూన్యమే అగోచరమై నశించుచున్న" దనిరి, (అ. 26) కనుక ఈ రెండును పూర్తిగా ఒకటికావు. దీక్షితులవారి గురుపరంపరలోని వారిపెద్దలు, మాధ్యమికుల శూన్య భావమును "ఉత్త బట్టబయ లని యేమి లేదని" మార్పులు చేసియుందురని నమ్మవచ్చును.

—: తురీయ - తురీయాతీతముల గురించిన పునఃపరిశీలనము :—

జ్ఞాన భూమికలను గురించి ఇదివరలో అచ్చటచ్చట చెప్పియుంటిని*. వానిలో తురీయ, తురీయాతీతములను గురించి మఱియొకసారి చెప్పెదనని చెప్పియుంటిని, ఇప్పుడా విషయమును విచారింతము — మొదట మూడు భూమికలు సాధించినవారికి పుణ్యలోక ప్రాప్తి కలుగును. నాలుగు నుండి యేడు వరకుగల భూమికలు సాధించినవారు ముక్తులే.

---

* ఈ గ్రంథముయొక్క ౧ — ౧౫ నందు "జ్ఞాన భూమికలను" అ ౪౬ నందు, "తురీయాతీతము - సత్తా సామాన్యము"ను గురించియు, ద్వితీయ భాగమునందలి ౨౫, ౭౬, ౭౭ అధ్యాయములయందు తురీయాతీతమును గురించియు చెప్పియుంటిని. చిత్తగింపుడు.

అయిదవ భూమికయం దుండువారలు సమాధి నుండి యిత రుల ప్రేరణచే జాగ్రదవస్థకు వచ్చెదరు. ఆఱు ఏడు భూమికల యం దుండువారి అనుభవమును గుఱించి శాస్త్రముల యందు భిన్నాభిప్రాయము లున్నవి. ఆఱవ భూమికయం దుండువారు జీవన్ముక్తులనియు, ఏడవ భూమికయందుండు వారు విదేహముక్తులనియు భేదమును చెప్పిరి. "అద్వైతులు జీవన్ముక్తులే గాని విదేహముక్తులు కారనియు, తాము విదేహ ముక్తుల మనియు, అనగా శరీరము లేనివార మనియు శ్రీ జ్ఞానేశ్వరుల సంప్రదాయమునకు చెందిన కొందఱు చెప్పు దురు. "ఉన్నది విదేహముక్తియే గాని జీవన్ముక్తి లే"దని దీక్షితులవారు చెప్పిరి. కనుక యీ యంశమును తిరుగ పరి శీలింపవలసి వచ్చినది.

ఆఱవ భూమికయం దుండువారు సమాధిని చెందిన పుడు వారు ఇతరుల ప్రేరణమున నే జాగ్రదవస్థకు రాగలరు. వారికై వారు రాలేరు. నేనొక యోగిని చూచి తిని, ఆయన సమాధిస్థితికి పోవుటకుముందు అచట నున్న వారితో "నేను రెండు దినములు సమాధినుండి లేవ నేని కొంచెము వెన్న నా తలపై నిడిన జాగ్ర దవస్థకు వత్తును. మీ రా ప్రకారము చేయుడు" అని చెప్పి సమాధ్యవస్థకు పోవును. ఆ యోగి మిత్రులు యోగి చెప్పినట్లు చేయుదురు. ఈ యోగి అయిదవ భూమికయం దుండువాడు. ఆఱవ భూమికయం దుండు సమాధినుండి మేల్కొల్పవలయునన్న ఇంకొక యోగిప్రయత్నముతో మాత్రమే మేల్కొల్ప వలెను. ఇట్లుండగా తాము (అచలవాదులు) 'ఏడవ భూమిక యందుండువార' మని యెట్లు చెప్పుదురో వింతగా నున్నది.

సప్త జ్ఞానభూమికలను, తురీయ, తురీయాతీతములను గురించి వివరించిన ఉపనిషత్తులయందు జీవన్ముక్తులకును విదేహముక్తులకును భేదమును చెప్పలేదు. భేదమును చెప్పినట్లు తోచినను సూక్ష్మముగ విచారించిన భేదము కనబడదు. ఇందులకు ప్రమాణము :—

"...... తురీయే కేవలం పరమాత్మసంబంధినీ భవతి, నిత్యబోధ స్వరూపా భవతి, తదా శనై శ్శనై రుపరమే ద్బుద్ధ్యా ధృతి గృహీతయా ఆత్మ సంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ తదా ప్రాణాపాన యోరైక్యం కృత్వా సర్వం విశ్వ మాత్మ స్వరూపేణ లక్ష్యం ధారయతి తదా తురీయాతీతావస్థా తదా సర్వేషా మానంద స్వరూపో భవతి"

(ధ్యానబిందూపనిషత్తు 4)

"నిర్బీజా వాసనా యత్ర తత్తుర్యం సిద్ధిదం స్మృతమ్, ... నిర్దగ్ధ వాసనా బీజ సత్తా సామాన్యరూపవాన్. సదేహోవా విదేహోవా న భూయో దుఃఖభాగ్భవేత్" (ధ్యాన బిందు)

"కేవలం తుర్యరూపోస్మి తుర్యాతీతోస్మి కేవలః,
సదా చైతన్య రూపోస్మి చిదానంద మయోఽస్మ్యహమ్".

(తేజో. 3 - 4)

"తుర్య తుర్యః పరానందో వైదేహీ ముక్త ఏవసః".

(తేజో. 4 - 48)

"జ్ఞస్య చిత్తం న చిత్తాఖ్యం చిత్తం చిత్తత్త్వమేవహి,
తదేవ తుర్యావస్థాయాం తుర్యాతీతం భవత్యతః".

(అన్నపూర్ణ)

"షష్ఠీం తుర్యాభిదా మన్యాం క్రమా త్పతతి భూమికామ్,
యత్ర నాస దసద్రూపో నాహం నాప్య నహంకృతిః

కేవలం క్షీణమనస ఆస్తే ద్వైతేతి నిర్భయః
నిర్గ్రంధి శ్శాంత సందేహో జీవన్ముక్తో విభావనః".

(అక్ష్యుపనిషత్)

ఎందు (తురీయమునందు) సదసద్భేదముగాని అహంకృతిగాని ద్వైతముగాని, భయముగాని లేదో గ్రంథి నశించి శాంతియు, సంశయ నివృత్తియు, క్షీణమనస్సును పొందుగలదో అదియే జీవన్ముక్తుని స్థితియని శ్రుతులు చెప్పుచుండగా యింతకుమైన చెప్పవలసిన దేమున్నది.

"పరం ప్రయుత్నేన చిరం ప్రయత్నే నావబోధనమ్".

"పదార్థ భావనానామ షష్ఠీ భవతి భూమికా,
షడ్భూమికా చిరాభ్యాసా ద్భేద స్యానుపలంభనాత్,
య త్స్వభావైకనిష్ఠత్వం సా జ్ఞేయా తుర్యగాగతిః".

(వరాహ)

1, 2, 3 భూమికలయందుండువారిని ముముక్షువులనియు, 4, 5, 6, 7 భూమికలయందుండు వారిని క్రమముగా, బ్రహ్మవిత్, బ్రహ్మవిద్వర, బ్రహ్మవిద్వరీయాన్, బ్రహ్మవిద్వరిష్ఠు లని వరాహోపనిషత్తు పేర్లు పెట్టినది.

ఏడవ భూమికయందుండు యోగి బ్రతికియుండుట దుర్లభము. ప్రారబ్ధవశమున కొంతకాలము జీవించియుండినను అతని వృత్తి యెట్లుండును? "ఆకాశమునందు సంచరించు పక్షుల కాలిజాడలనైన తెలుసుకొనగు గాని మహాత్ముల వృత్తి యిట్టిదని మన మెఱుంగజాలము" అని శ్రీ శంకరులు మొదలినగుఱించి చెప్పిరో అట్టివారే వీరు. పైనున్న వస్త్రము క్రిందపడినను అత డెఱుగడు. గోచికూడ ఉండదు. ఎవరైన

బలవంతముగ గోచిని పెట్టిన అది ఉండినంత కాలము ఉండును. అది యూడి క్రిందపడిన దానినెత్తి ఆ మహాత్ముడు ధరింపడు. శాస్త్రకారులు లాగు - ఏడు భూమికలను వేఱు వేఱని చెప్పిరేగాని ఆ భూమికలయం దుండువారి వృత్తము సమానమే. శ్రీవిద్యయందు ప్రవేశము కలిగినవారును మంత్రశాస్త్రమునందు పారంగత దీక్ష గైకొన్నవారును, నగు, శ్రీ విద్యానందనాథ దీక్షానాములగు శ్రీ కనుపర్తి వేంకటరామయ్యగారు తాము రచియించిన 'కైవల్యనవనీత' మను గ్రంథమున, ఈయంశమును గుఱించి ఇట్లు వ్రాసిరి :—

"వీని కన్నింటిపైన వెలుఁగుచుండెడి తుర్యమను పేరుగల ఏడవ భూమిని తుర్యాతీతమని వేదములు వచియించునని తాత్పర్యము".

"ఏడవ భూమిని తుర్యమని తుర్యాతీతమని చెప్పినచో గ్రహించువారికి భ్రమ దోఁచునని దానిని తుర్యమందు జీవన్ముక్తియని, తుర్యాతీతమునందు విదేహముక్తియని మోక్షమును రెండు విధములగు సంజ్ఞలచేత చెప్పుదురు. కార్యమందు ఒక్కటే యగును".

(2-156-157 పద్యముల తాత్పర్యము)

పైన చెప్పినవారు తురీయ తురీయాతీతములను గుఱించి చక్కగా అవగాహనము చేసికొని వ్రాసిరి.

ఋభుగీతయందు (4-72 శ్లోకమున) మోక్షము తురీయమువలననే కలుగునని స్పష్టపరుపబడెను.

శాక్తేయమునందు లలితాభావము చాల ముఖ్య

మైనది. అందు లలితా సహస్ర నామములలో 384వ నామము — "విశ్వసాక్షిణీ" అనియు, 385వ నామము "సాక్షి వర్జితా" అనియు, చెప్పబడినది. సాక్షివర్జితనే తురీయాతీతమని చెప్పిరి. 262వ నామము "తుర్యా" అని తురీయమును కూడ దేవియే యని యున్నది. ఇన్ని ప్రమాణములవలన తురీయ - తురీయాతీతములు ఒక్కటే, బోధ సౌలభ్యము కొఱకు వేఱు వేఱుగా చెప్పబడెనేగాని భిన్నము కాదు. అంతేకాదు.

"తురీయరూపాం తురీయాతీతాం సర్వోత్కటాం సర్వమంత్రాసనగతాం" అని (సౌభాగ్యలక్ష్మ్యుపనిషత్తు)

"కవాస్త్రీతి నిహితా నేగయంతి తురీయం వాచో మనుష్యా వదంతి". అని (సరస్వతీరహస్యోపనిషత్తు) కలదు.

వరాహోపనిషత్తు జీవన్ముక్తుని లక్షణములను విస్తరించి చెప్పినది. అందు శుకమార్గము విహంగమార్గ మని, వామదేవునిమార్గము పిపీలికమార్గ మని పేర్కొన్నది. మఱియు :—

...... "శ్రుత్వా పూర్వాం కామాఖ్యాం తురీయరూపాం తురీయాతీతాం సర్వోత్కటాం సర్వమంత్రాసనగతాం" అని (త్రిపురతాపిన్యుపనిషత్తు) చెప్పినది.

"లక్ష్యాలక్ష్యగతిం త్యక్త్వా యస్తిష్ఠేత్ కేవలాత్మనా,
శివ ఏవ స్వయం సాక్షా దయం బ్రహ్మవిదుత్తమః,
జీవన్నేవ సదాముక్తః కృతార్థో బ్రహ్మవిత్తమః,
ఉపాధినాశా ద్బ్రహ్మైవసత్ బ్రహ్మాప్యేతి నిర్ద్వయం,

శైలూషో వేషసద్భావాద్ భావయోశ్చ యథా పుమాన్
తథైవ బ్రహ్మవిచ్ఛ్రేష్ఠ సదా బ్రహ్మైవ నాపరః,
ఘటే నష్టే యథా వ్యోమ వ్యోమైవభవతి స్వయం.
(ఆత్మోపనిషత్తు)

ఘటము నష్టముకాగానే ఘటాకాశము మహాకాశము ఒక్కటియే యైనట్లు బ్రహ్మవిదుడే బ్రహ్మమగుచున్నాడు. అని శ్రుతి.

తాత్పర్యము :- అన్నపూర్ణోపనిషత్తునందు తురీయ - తురీయాతీతములు రెండును ఒక్కటియే యని చెప్పిన ఈ క్రింది శ్రుతి వాక్యమును గమనింపుము.

“తుర్యాతీతము నిర్ముక్తం నో దేతి నచ శామ్యతి,
జ్ఞస్య చిత్తం న చిత్తాఖ్యం చిత్తత్వమేవహి,
తదేవ తుర్యావస్థా యాం తుర్యాతీతం భవత్యతః”.

జీవన్ముక్తినే అస్పర్శయోగమని వరాహోపనిషత్తు (2 56) చెప్పినది.— అచలవాదులు తనకు దేహము లేదం టురు, ఇందులకు వారి వాక్యము నుదాహరింతును —

“నేను నీకొరకునై మేను దాల్చుకొని
పూనివచ్చిన వాడ పరము దెల్పుటకు
మేనుతో నున్నట్లు మరితోచువాడ
మేను నాకెపుడు లేదన్నా - నీవుండువరకే -
మేను నాకుండునో యన్నా —,, —
(బాలరామ్ గారి ద్విపదార్థములు)

—: శ్రీ దీక్షితులు - వారి గ్రంథరచన :—

దీక్షితులవారు "బృహద్వాసిష్ఠ సిద్ధాంతమును వారు చెప్పుచుండగా వారి శిష్యులు వ్రాసిపెట్టిరని అందురు. వారే స్వయముగా వ్రాసినట్లు వారి వాక్యముల నుదాహరింతును—

"బుద్ధియని, చిత్తమని, అహంకారమని, వేదాలుయని, శాస్త్రాలుయని, పురాణాలుయని, శృతులుయని, వుపనిషత్తులు యని, లక్ష్యాలుయని, మంత్రాలుయని, ఎన్నియని వ్రాతు. .... వ్రాయ శక్యంకాదు" .... "యెన్ని అని వ్రాతు జన్మభ్రాంతిలేకుండ చేసిన వాడు గురువు" అనియును వ్రాసిరి. (బృ. ఉ. పు. 6. అ. 7.)

ఎట్లైనను కర్తృత్వము వారిదే; అందులో భేదము లేదు. వీరి గ్రంథమును చదివిన — వీరు వీరి గురువువలన విన్నది, తమ బుద్ధికి తోచినది వ్రాసిరేగాని, వీ రుదాహరించిన శాస్త్రములు స్వయముగా చదివి యుండ లేదని వీరు వీరి గ్రంథమున ఉదాహరించిన శాస్త్రములయందలి కొన్ని వాక్యములకు ముందును, వాని వెనుకను (ఆ శాస్త్రముల యందు) ఏమున్నదో వీరికి తెలియకయే ఉదాహరించిరని — వీరి రచనవలన అనుమానింపవలసి వచ్చును. వా రొకచోట నిట్లు వ్రాసిరి. "నేను చిన్నతనములోనే వేదములు చదివినాను. శాస్త్రములను చదివినాను, ముద్రల చూచినాను. యోగములు సాధించినాను. మంత్రములు తెలిసికొన్నాను. యెన్ని తెలిసికొన్ననేమి? అన్ని అడవిమార్గములుగానే యున్నవి". (బృ. పూ. ప్ర. 6). కాని వారి గ్రంథమును చదివినవారికి వారి వాక్యములు సత్యములు కావని బోధపడును. వీరు,

పండితులంటే యిష్టపడరు. "చదువుకున్న పాపాత్ములకంటె పూరకే వున్న రాళ్లు నయం" (బృ. ఉ. ప్ర. 6. అ. 3). అని వ్రాసిరి.

దీక్షితులవారి కొన్ని వాక్యములకు అర్థమే ఉండదు, మతాచార్యులలో నెవరు ఏకాలమువారైనది వారికి తెలియదు. ఇందుకు వారి వాక్యమొకటి యుదాహరింతును. "అద్వైతమంటే విశిష్టాద్వైతమే. మూలంలేని యీ శరీరమే లేదు. గనుక వ్యవహారమేలేదు. శ్రీ భాష్యకారులమాట అబద్ధమో, నిబద్ధో, అని శంకరాచార్యులవారు వాదించినారు". (బృ. ఉ. ప్ర. 6. అధ్యా. 11). శ్రీ శంకర భగవత్పాదుల వారి జన్మమునకు తరువాత సుమారు రెండువందల సంవత్సరములకు శ్రీ భాష్యకారులు (శ్రీ మద్రామానుజాచార్యులు) జన్మించినారు. ఇట్టి వాక్యములను ఎట్లు విమర్శింపవలెను?

వీరికి ఒక స్థిరమైన మార్గము లేదు. "ఈ మార్గము లక్ష్యములేని మార్గము". (బృ. ఉ. ప్ర. 6. అ. 10). అని దీక్షితులవారే అన్నారు. వీరి గ్రంథముయొక్క పూర్వభాగమునందలి మూడు నాలుగు ప్రకరణములయందు కుల దూషణ చేసిరి. నాలుగవ ప్రకరణమునకు "వర్ణ నిరసన ప్రకరణము" అని పేరిడిరి. వర్ణవ్యవస్థ లేనట్లే వ్రాసిరి. వర్ణవ్యవస్థను నిరసించునది. "కులములను యెవ్వరు చూచినారు? గోత్రమును యెవ్వరు చూచినారు? కులగోత్రములను అహంకారమే యేర్పరిచినది". (బృ. పూ. 4 వప్ర) ఇది బాగున్నది. ఈవిధముగా వ్రాసినందులకు చాల సంతోషము. ఇది వారి శిష్యులచేత ఆచరణయందు పెట్టించి సంఘమును

సంస్కరింప వలయునుగదా? ఆగ్రాలోని రాధాస్వామి సమాజమువారి గురువుగారు వారి శిష్యులయందు కులభేదమును పాటింపక వివాహము చేసికొనవచ్చునని అనుజ్ఞనిచ్చియున్నారు. ఆ విధముగా కొన్ని వివాహములు జరిగినవట. ఆవిధముగా దీక్షితులవారును చేసియుండిన వారికి నా ధన్యవాదముల నర్పించి యుందును. పూర్వ భాగముయొక్క ఆఱవ ప్రకరణము నందు "అందఱిది ఒక కులమేనని అన్నాను" అని వ్రాసిరి. సంఘమునకు భయపడిరేమో గాని అప్పుడనే "మేము కుల నిరసన ద్వేషము కలవారమై చేయలేదు". అని వ్రాసిరి. అంతటితో తృప్తి చెందక "కుల త్యాగము ఆచార త్యాగము చేయరాదు. కులదూషణ చేయరాదు. కులగురువుల నిందింపరాదు". (బృ. పూ. ప్ర. 2) అని వ్రాసిరి.

బృహద్వాశిష్ఠ సిద్ధాంత గ్రంథమును, యోగవాసిష్ఠమును పరిశీలించినవారికి బృహద్వాశిష్ఠ సిద్ధాంతము నందు నూటికి నలుబది శాతము యోగవాసిష్ఠమున చెప్పినదే వ్రాసిరి. దానినైనను దీక్షితులవారు కొన్నిచోట్ల చక్కగా అర్థము చేసికొనియుండలేదు. ఎందువలన ననగా? దీక్షితులవారు యోగవాసిష్ఠమునంతయు స్వయముగా చదివి సరియైన అర్థము చేసికొనియుండక దానిలోని తత్త్వమును సంగ్రహముగా వారి గురుముఖమున నలువది శాతము వినియుందురనియు, తక్కిన అఱువది శాతము, బౌద్ధ చార్వాకాది మతములతో తమ అభిప్రాయమును కలిపి అదియొక కలగూరగంపగా చేసిరనియు చెప్పవచ్చును.

దీక్షితులవారు వారి గ్రంథమునకు "శ్రీ బృహద్వాశిష్ఠ సిద్ధాంతమను శివరామ దీక్షితీయము" అని పే రేల పెట్టిరి? గ్రంథమునకు వసిష్ఠ మహర్షి పేరిడుటకు కారణమేమి? శివరామ దీక్షితీయమన్న సరిపోవును కదా! దీక్షితులవారు వారి గురుముఖమున విన్నది యోగవాసిష్ఠకారులు చెప్పినదే యని వారికి తెలిసి యుండవచ్చును. దానిని త్రోసివేసికొనలేక తమకిష్టము లేకపోయినను వారట్టి నామకరణము చేసి యుండవచ్చును. అదియే నిజమైనచో అది చాల గొప్ప భావము కదా? కృతజ్ఞత తెలుపుకొనుట కృతజ్ఞుని గుణముకదా? అనుకొనిన, అట్లర్థము చేసికొనుటకను వీలులేదు. వారొకచోట ఇట్లు వ్రాసిరి.— "శ్రీ కృష్ణస్వామికి తగ్గ గురువు సాందీపుడేగాని మరివొకరు లేరు. సాందీపులకు వసిష్ఠులకు చాలయెక్కువ తక్కువ ఉన్నది". (బృ. ఉ. ప్ర. 6. అ. 12). దీనినిబట్టి యోగవాసిష్ఠమునకంటె తమ గ్రంథము గొప్పదని యోగవాసిష్ఠమును కించుపరచుటకు "యోగవాసిష్ఠము" అను పేరునందు 'యోగ' శబ్దమును తొలగించి దానికి బదులు బృహత్ = గొప్పది అని అర్థముతో బృహత్ శబ్దమును చేర్చి, బృహద్వాశిష్ఠ సిద్ధాంతమని పేరిడిరని భావించినచో సరిపోవును. దీనినిబట్టి దీక్షితులవారి అభిప్రాయము తెలియబడెను. వసిష్ఠమహర్షితో సరిచూచుటకు సాందీపని యే గ్రంథమును వ్రాసిరి! వారి యోగ్యత వీరి కెట్లు తెలియును? శ్రీ కృష్ణభగవానుడు బలరామసహితుడై సాందీపనియొద్ద అరువదినాలుగు దినములలో అరువదినాలుగు కళలను (విద్యలను) నేర్చుకొని

వచ్చిరని భాగవతమునందు కలదే గాని బ్రహ్మ విద్యను తెలిసికొన్నట్లు భాగవత పురాణమున వ్రాయలేదు. భగవానుడు రుక్మిణీదేవిని వివాహమాడిన తరువాత సాందీపని వద్దకు పోయి అచలబోధ నెరిగిరనుటకు తగిన ప్రమాణమేది? ఏదైన పుక్కిటి పురాణము నాధారముగ గైకొని వ్రాసిన వ్రాతలకు గౌరవ మీయరాదు.

వీరి రచనయందు దోషములు లెక్కింపరానివి. వీరి వ్యక్తిత్వమును కొంత విచారింతిము. వీరొకచోట "అందుకే తామసము గలుగుచున్నది". (బృ. పూ. ప్ర. 10). అని అన్నారు. 'తామస' మనగా కోపమని వారి భావమై యుండవచ్చును. కాని ఆ అర్థము యే నిఘంటువులో కలదో నాకు తెలియదు. తామసమనగా = తమోగుణము కలది. పాము, ఆలస్యము, అస్త్రములలో ఒక్కటి అని అర్థమేగాని కోపమని నిఘంటువులో లేదు. కోపము వచ్చుననుటకు మారుగ తామస మొస్తుంది అని అనాగరికులు విద్యలేనివా రందురు. విద్యాధికు లనరు. దీక్షితులవారు తాము శరీరము లేని వారమని చెప్పుకొనిరే! శరీరము లేనివారికి కోపము వచ్చునా? మరియు వారిట్లు చెప్పిరి. "సన్మార్గులకు సన్మార్గులవలెనే యుండవలయును, దుర్మార్గులకు దుర్మార్గులవలనే యుండవలయును, కాని మేము సన్మార్గముగా ప్రవర్తించుటకు అనుకూలముగా యుండరాదు". (బ. పూ. ప్ర. 3).

దేహి దేహము ఒకటేనని చేసిన భౌతిక వాదమును ఇదివరలో (7వ అధ్యాయము నుండి 12 వరకు) వివరించి

యుంటిని. గోడమీద నడచుచు కుడి యెడమ ప్రక్కలను చూచు పిల్లి యే ప్రక్కకు దుముకునోయని చూచువారిని సందిగ్ధ స్థితిలో నుంచునట్లు దీక్షితులవారును అచల వాదులలో అతివాద మితవాద పక్షములవారి నిరువురను కొంత వరకు (ముస్లింలను కూడ) సంతృప్తి పరచునట్లు వ్రాసిన వ్రాతలు సామాన్య పాఠకులను సందిగ్ధ స్థితిలో నుంచినవి. అదియొక విధమయిన నేర్పరితనము. ప్రశంసింపదగిన దే. కాని యీ సందర్భమునం దట్టి వ్రాతలవలన ముముక్షువులకు కీడు కలుగును.

దీక్షితులవారు వ్రాయకూడని స్థితి యట్టి అమంగళకరమగునట్టి కొన్ని వాక్యములను వ్రాసిరి. వాటి నన్నిటిని చెప్పవలయునన్న చాల పెద్ద గ్రంథమగును.

పోకల శేషాచలం నాయుడుగారు వ్రాసిన అచల గ్రంథమున, దీక్షితులవారు వారి శిష్యుడగు కంచలూరు అప్పారావు గారికి అచల మతమును గురించి చెప్పిన వాక్యములను ఇదివఱకే (ఈ ప్రకరణము నందలి 39వ అధ్యాయము) ఉదాహరించి యుంటిని. అందుండి కొన్ని వాక్యములను మఱల చెప్పెదను వినుము :—

“ యోరి యప్పయ్యా .... నేను నీకు బోధించిన సకలబోధ త్రిలోకంబులకును త్రిలోక వాసులకును, వేదంబులకును ఉపనిషత్తులకును, శాస్త్రంబులకును మిగుల విరుద్ధముగా నుండును ”.

పై పంక్తులు సువర్ణాక్షరములతో లిఖింపదగినవి.

దీక్షితులవారు సత్యమును చెప్పిరి. ఈ సత్యమును దాచ కూడదని పోకల శేషాచలం నాయుడుగారు లోకము నెదుట పెట్టిరి. బృహదారణ్యక సిద్ధాంతమును అన్వయింపజేయించినవారు కొందఱు పై వాక్యములను వదలి అన్వయించియుందురు. లేదేని అచలవాదులలో ప్రముఖస్థానమాక్రమించి విఖ్యాతి గాంచిన శేషాచలం నాయుడుగారు వారికి అగౌరవమగు అనృతము సృష్టింపరు:—

భారతీయ తత్త్వశాఖలగు అద్వైత విశిష్టాద్వైతాది శాఖలయందు అద్వైతమునను సరించి ఆత్మబ్రహ్మల ఐక్యతను సాధించినవారికి సద్యోముక్తియు, తక్కిన వారికి క్రమముక్తియు కలుగును. ఇచట ముక్తి యనునది అజ్ఞానము లేకపోవుట. స్వరూపస్థితి యని తెలియవలయును. దీక్షితుల వారి అచలబోధను అవలంబించిన మముక్షువులకు ఏ ముక్తియు కలుగదు. ముక్తి యనునది నిత్య సత్యమగు దానికేగాని 'లేని' దానిని ముక్తి యనునదికూడ లేనిదే కదా? కనుక వారికి కడపట కలుగు స్థితిని "పునరపి జననం పునరపి మరణం" అనగా సంసారమే గతి.—

ఇంకను దీక్షితులవారి అచలబోధ గుఱించి నీవు ఇంకేమైన అడగవలసినది కలదేని అడుగుము—

జిజ్ఞాసువు :- అచలబోధను గుఱించి వింటిని. చాలును, నాజన్మ తరించుటకు తత్త్వజ్ఞాన వాసనాక్షయ మనోనాశములు కలుగునట్టి సాధనను యిదివఱకే విపులముగ బోధించి యుంటిరి. (యీ గ్రంథమునందలి రెండవ భాగము జ్ఞాన

యోగ ప్రకరణమున) బోధను దృఢపరచుటకు మరికొన్ని వాక్యములు ఆనతిండు.

శ్లో॥ అపార కారుణ్య సుధాతరంగై
రపాంగ పాతై రవలోకయంతం
కఠోర సంసార నిదాఘతప్తాన్
మునీ నహం నేమి గురుం గురూణాం".

ఇది పరమేశ్వరానుగ్రహమువలన మఱిబోయిన రామ
సుబ్బయ్యచే రచియింపబడిన "బ్రహ్మజిజ్ఞాస"
చతుర్థభాగమందలి "అచలబోధ" అను
రెండవ ప్రకరణము. సంపూర్ణము.
ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓమ్

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

బ్రహ్మ జిజ్ఞాస

చతుర్థ భాగము

మూడవ ప్రకరణము : ముగింపు (ఉపసంహారము)

"శ్లో॥ అవినయ మపనయ విష్ణో
దమయ మనశ్శమయ విషయ మృగ తృష్ణాం,
భూతదయాం విస్తారయ
తారయ సంసార సాగరతః"*

(౧) ఆరంభము

జిజ్ఞాసువు :- స్వామీ! నే నిదివరకు మోక్షోపాయములను (అనగా – అచలమును పొందునట్టి మార్గములను) మీవలన (ద్వితీయ భాగమున) వినియుంటిని. చాలవరకు ఆ వాక్యములు జ్ఞప్తియందున్నవి. అంతకన్నను సులభోపాయమున్న బోధింపుడు.

వేదాంతి :- సులభమార్గమనిన, ఎవరికి సులభము? ఒక వ్యక్తియొక్క పూర్వజన్మ సంబంధమగు శుద్ధ వాసనలు ప్రస్తుత జన్మయందుండు దేశ కాలాదులు, ఆ వ్యక్తి (ముము

* శ్రీహరీ! నా యవినయమును పోగొట్టి నామనస్సును నియమించి శబ్దాది విషయముల యందు నాకు విరక్తి కలుగునట్లు చేసి భూతదయ పెంపొందించి సంసార సముద్రమునుండి నన్నుద్ధరింపుము.

క్షువు) పుట్టి పెరిగిన వాతావరణము - ఇటువంటి మరికొన్ని పరిస్థితులు పైనను, ముముక్షువుయొక్క పట్టుదల, బుద్ధి కుశలత పైనను, ఆధారపడి ఒక మార్గము సులభమగును. వేరొక వ్యక్తికి ఆ మార్గము కష్టతరమగును. శ్రీ శంకరాచార్యులవారి శ్రీ లక్ష్మీనృసింహాస్తోత్రమును చదువుము. అందులో "కరావలంబమ్" అనునపుడు ఆ హృదయమా వేదన నూహించుకొనుము. అది చిన్నగ్రంథమైనను ముముక్షువుయొక్క హృదయావేగము దానియందున్నట్లు ఏ గ్రంథమునందును లేదు. అట్టి ముముక్షువునకు మార్గము సులభము. గమ్యస్థానము సమీపమునందే యుండును.

జిజ్ఞాసువు :- స్వామీ! కొందఱు "సులభ మార్గ మనియు", "సహజ మార్గ"మనియు చెప్పుచున్నారు. సాధనయందు అవి ఎంతమాత్రము సులభ మో ఆనతిండు.

వేదాంతి :- వానిని గుఱించి నేను విన్నాను. స్థాలీపులాకన్యాయమున వానిని గురించి తెలిపెదను.

(౨) సులభ మార్గము

కొందఱు ముముక్షువులు ఇట్లందురు :— నేను అనగా మనస్సే - మనస్సే సంకల్ప వికల్పములు. మనస్సును జయించిన చాలును. నీకు ఏ శాస్త్రములతోను నిమిత్తము లేదు. ద్వైతాద్వైత విశిష్టాద్వైత మత చర్చలతో పని లేదు. నీవు ఇవన్నియు వదలి యేకాంతమున సుఖాసనమున కూర్చుండి అవయవము లన్నియు తేలికయగు నట్లుల సడలించి నీయందుండి వెలువడు, ప్రతిసంకల్పమును తిరిగి నీ

యుందే అణుగులాగున చేయుము. ఈ విధానముగా కొంత కాల మభ్యసించిన మనస్సు నిరోధింపబడును. (సంకల్పము లుడుగును) అదియే సమాధి, అదియే అమనస్కము. ఈశ్వర సాక్షాత్కార మదియే. "నేను లేకపోయితిని, ఉన్నది పరమాత్మయే' అను భావమదియే. ఇది ఒక మతముకాదు. ఇది యొక సాధన పద్ధతి. ఇది యొక యోగ పద్ధతి.

జిజ్ఞాసువు:- మీరు నాకు జ్ఞానయోగమును ఇదివఱలో (రెండవ భాగమునందలి మొదటి ప్రకరణము నందు) బోధించిన సందర్భమున ఈ యంశమును చెప్పియుంటిరి. అచట సమాధి విఘ్నములగు లయ, విక్షేప, కషాయ, సమప్రాప్తులను తొలగించుటకు నిరోధసంస్కారమును వృద్ధి పొందింపవలయు నని బోధించితిరి. అంతకన్న నిందులో విశేష మేమున్నది?

వేదాంతి:- అవును, అప్పుడు విపులముగా చెప్పియుంటిని. మనోనిరోధమునకు ఇదియును ఒక సాధనమే. దీనికి ప్రాణాయామాదులతో పని లేదు. దీనిని "సులభ మార్గ" మని యందురు. కాని ఇది వారనుకొనినంత సులభమార్గము కాదు. ఏలయన? మనస్సునందు అనేక కోట్ల జన్మల (మనోవాక్కాయములతో చేసిన కర్మలయొక్క) సంస్కారములు వాసనా రూపమున నుండును. అవి బీజసహితముగా దగ్ధము కావలయునన్న జ్ఞానాగ్ని చేతనే దగ్ధము కావలయును కాని వేఱొక యుపాయము లేదు. అట్లు చేయకపోయిన మరల జన్మమున్నది. జనరాహిత్యమును కోరినవారు తత్త్వజ్ఞాన, వాసనాక్షయ, మనోనాశములు ఏకకాలమున సాధింపవలసి యున్నది.

మం॥ వాసనాక్షయ విజ్ఞాన మనోనాశ మహామతే।
సమకాలం చిరాభ్యస్తా భవంతి ఫలదామతాః॥
(అన్నపూర్ణ — ముక్తిక)

తా॥ వాసనాక్షయ తత్త్వజ్ఞాన, మనోనాశములు ఏక కాలమునందే యభ్యసింపవలయును, కాలభేదము చేత నొకటి యొకప్పుడు, మఱియొకటి యింకొకప్పుడు సాధించుటకు సాధ్యపడదు.

ఈ యంశము నిదివఱలో* చెప్పియుంటిని. దానిని జ్ఞప్తికి తెచ్చుకొనుము. ఈ యంశమును గుఱించి శ్రీ వివేకానందస్వాములవారి వాక్యము లివి:—

"కాని యెవ్వ రేమన్నను భగవదన్వేషణ జీవనమునకు వైరాగ్య మొక్కటియే మార్గము". అని (జ్ఞానయోగమునందు మాయ భ్రాంతి యను ఉపన్యాసమున) అనిరి. మఱియొకచోట శ్రీ స్వాములవారు ఇట్లు చెప్పిరి:—

"వేదకాలమున నీతి వైరాగ్య ధర్మము లెంత యౌన్నత్యము నంది యుండెనో కాని, భోగాసక్తిని జయించిన వానియందు తప్ప సత్యము దీపింపజాలదని సిద్ధాంతీకరించినది. (అపరోక్షానుభూతి యను నుపన్యాసమున).

భగవద్గీత యొక్క ఆఱవ అధ్యాయమునకు గీతాచార్యులు "ఆత్మసంయమన యోగ"మని పేరిడిరి. "ఆత్మ" శబ్దమునకు. (1) ఆత్మ లేక పరబ్రహ్మమనియు. (2) 'తాను'

* ఈ గ్రంథముయొక్క రెండవ భాగమున జ్ఞానయోగమను మొదటి ప్రకరణమున విస్తరించి చెప్పియున్నాను, చిత్తగింపుడు.

అనియు, (3) అంతఃకరణము లేక మనస్సు అనియు, మూడర్థములు కలవు. గీతయందలి ఆత్మసంయమన యోగమనగా :— అచట ఆత్మ యనునది మనస్సని యొఱుగవలయును. మనస్సంయమన మన, మనస్సును నిగ్రహించుట, జయించుట. ఆ యధ్యాయమునందు మనోనిగ్రహమును గుఱించి భగవానుడు అర్జునున కుపదేశించెను. అద్వైత సిద్ధాంతము ననుసరించి కేవలము మనస్సును నిరోధించినంత మాత్రమున ముక్తి కలుగదు. చెప్పినంత సులభముగ సంకల్పము లుడుగవు (శమింపవు) ఏలయన :— గీత యొక్క 6వ యధ్యాయమునందలి 2వ శ్లోకమున "అసంన్యస్త సంకల్ప" విడువబడని ఫలాపేక్షతో గూడిన కర్మలు గలవాడు. అని యర్థము. అనగా :— పూర్ణ వైరాగ్యము కలవానికే గాని వైరాగ్యము లేనివానికి మనోజయము దుర్లభము. మనస్సు విషయముల వైపునకు పోవును. (విక్షేపము కలుగును). వైరాగ్యవంతుడే భయరహితుడు. వైరాగ్యము లేనివానికి భయము కలుగును. పిరికివానికి మనస్సు నిలువదు. కనుక వైరాగ్యము మనోనిగ్రహమునకు ముఖ్యమగు సాధనము. వైరాగ్యముండిన వానికే బ్రహ్మజిజ్ఞాస కలుగును. అట్టి జిజ్ఞాస కలవాడే వేదాంతశాస్త్ర శ్రవణము చేయును. వేదాంతశాస్త్ర విచారము చేసినవానికే తానెవరు? ఈ జగత్తునకు కర్త యెవరు? జగత్తు ఎట్లు కలిగినది?' అను మొదలగు ప్రశ్నలకు సమాధానము లభించును. అట్టివారికే "ఇది ఆత్మ" "ఇది అనాత్మ" యను వివేకము కలుగును. పిండ, బ్రహ్మాండముల గుఱించిన జ్ఞానముకలిగి బ్రహ్మాండమే సూక్ష్మరూపమున పిండముగా నున్నదనియు

పిండ బ్రహ్మాండములయం దున్న చైతన్యము ఏకమనియు నిరంతరము బ్రహ్మాభ్యాసము చేయవలయును. శ్రుతులు చెప్పిన తత్త్వమస్యాది మహావాక్యముల అర్థమును ఎఱుగుట వలన ఆత్మైక్య బోధసిద్ధించును. అనగా— తత్త్వజ్ఞానము కలుగును. మనోనాశ తత్త్వజ్ఞానములు అను ఈ రెండును ద్వంద్వములు. తత్త్వజ్ఞానము లేనిదే మనోనిగ్రహము (మనోనాశము) కలుగదు. మనోనాశము లేనిదే తత్త్వజ్ఞానము కలుగదు. ఇదియొక విషమ చక్రము. కనుక, రెండును ఒకేసారి సాధింపవలయును. అట్టి బోధ కలవాడే తిరిగి పుట్టడు. మోక్ష సౌధమును నిర్మించుటకు వైరాగ్యమను గట్టి పునాది ఆవశ్యకము. దృఢమైన పునాది లేక కట్టబడిన సౌధము అల్పకాలముననే కూలిపోవునట్లు వైరాగ్యము లేక తాత్కాలికముగ మనస్సును జయించినను తిరిగి మనస్సు వారిని జయించి, వారిని అధఃపతితులను చేసిన గాథలను రామాయణాది గ్రంథములయందు చదివియున్నాము. రావణ, హిరణ్యకశ్యపాదులు మనస్సు నిగ్రహించి తపమాచరించిరి. తపస్సు ఫలింపగనే మనస్సు వారిని జయించి అధఃపతితులను చేసెను. బోధ లేకయే వైరాగ్యము, మనోనిగ్రహము మాత్రమున్నవారికి ముక్తి లభింపదు. అట్టివారికి వారి మరణానంతరము పుణ్యలోకములు మాత్రమే సిద్ధించును. ఈ యంశము ఇదివఱలో (జ్ఞానయోగ ప్రకరణము నందు) విపులముగా చెప్పియుంటిని. దాని నిచట జ్ఞప్తికి తెచ్చుకొనవలయును.

అద్వైతులు చెప్పినది అట్లుండ, మన అనుభవమును

కూడ విచారింతము. మనోనిగ్రహమనగా : మనస్సు సంపూర్ణముగ నశించుట కాదు. మనస్సు ఆత్మాకారమును పొందుట విషయముల వైపునకు మనస్సు పోకుండుట. అదియే మనోజయము, అదియే అమనస్కము".

ఆత్మయందు అనాత్మబుద్ధిగాని, అనాత్మయందు ఆత్మబుద్ధిగాని కలుగదు. అట్టివారికి మనోజయము సులభమగును. "సులభమార్గము" అనగా — ప్రాణాయామాది అష్టాంగ యోగాభ్యాసములతో ఆయాసమును పొందక వివేకముతో కూడిన మనస్సు చేతనే విషయములపైకి పరుగిడుచుండు మనస్సును మెల్ల మెల్లగా (ఏడ్చుచు మారాము చేయుచుండు బాలుని ముద్దుమాటలతో సంతోషింప చేయునట్లు) లక్ష్యమువైపునకు మరలించుచుండవలయును. మరల మనస్సు విషయముల వైపునకు పోయిన మరల నదేవిధముగా చేయవలయునేగాని, కోపగింపక విసుగుకొనక ప్రశాంతతతో మనస్సును లాలింపవలయును. ఈ సందర్భమున నొక ఐతిహ్యము స్మృతికి వచ్చుచున్నది. దాని నిట వివరింతును :—

పంజాబునందు గోస్వాముల వంశమున జన్మించిన సుప్రసిద్ధ మహాపురుషుడు శ్రీ రామతీర్థస్వామి (వారి పూర్వాశ్రమ నామము తీర్థారామ గోస్వామి) వారు మనోనిగ్రహమును సాధన చేయుచుండగా మనస్సు నిలువనందున ఒకదినము ఇట్లు నిశ్చయించుకొనిరి. "ఈదినము సూర్యాస్తమయ మగులోపల నాకు మనోనిగ్రహము కలుగదేని గంగానదిలో పడి మరణింతు"నని ప్రతిజ్ఞ చేసిరి. గంగా తీరమున నొకచోట ఆసనము వేసికొని కూర్చుండిరి. కాని,

యెంత ప్రయత్నము చేసినను ఆనాడు సూర్యాస్తమయ సమయమునకు ఏకాగ్రత కలుగలేదు. స్వామికి కోపమువచ్చి, శరవేగముతో ప్రవహించు గంగా ప్రవాహమున దుమికిరి. గంగా గర్భమున నెచ్చటికో కొంతదూరము పోవునప్పటికి గంగామతల్లి శ్రీ స్వామివారిని అలలతో గట్టునకు విసరి వేసెను. అప్పటికి స్వామికి తెలివి లేదు. అచట నున్నవారు స్వామి చనిపోయియుండురని చూచి ప్రాణమున్నదని తగిన చర్యలు తీసికొని స్వామిని ఆశ్రమమునకు చేర్చిరి. తరువాత స్వామికి సులభముగనే మనోదయము కలిగి జ్ఞానియై అనేకులను సంసారమునుండి తరింపజేసిరి. (రామ చరిత) మనోనిగ్రహము సాధ్యమా? అని సంశయించిన అర్జునుని వాక్యములను త్రోసివేయక భగవానుడు:—

శ్లో॥ అసంశయం మహాబాహో మనోదుర్నిగ్రహం చలం
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే.
(గీత. 6-35)

తా॥ ఓ అర్జునా! నీ వన్నది నిజమే అభ్యాసము వలనను వైరాగ్యము వలనను మనోనిగ్రహము సాధింప వచ్చును.

పై శ్లోకమున భగవానుడు — వైరాగ్యేణ చ = వైరాగ్యము చేతను - అని వైరాగ్యమున కంతటి ప్రాముఖ్య మిచ్చిరి. కనుక మనస్సును జయించుట అంతసులభముకాదు.

(౩) సహజ మార్గము

జిజ్ఞాసువు :- ఇటీవల 'సహజ మార్గ'మను ఒకసమాజము ఏర్పడినదని, దాని గురువు శ్రీ రామచంద్రజీ మహా

రాజ్ గారని అనుచున్నారు. మోక్షమునకు వారు చెప్పు మార్గము దగ్గరదని అతిసులభమైనదని అందురు. దానిని సంగ్రహముగా దయయుంచి తెలుపుడు.

వేదాంతి :- 'సహజ మార్గ'మను మాటకు వారు చెప్పు అర్థమేమో నాకు తెలియదు. 'సహజము' అనగా :- జన్మతో వచ్చినది, అనియర్థము. మోక్షము జన్మతో వచ్చినదైన అది జన్మగలవారి కందరికి సహజముగనే అందుబాటులో ఉండవలయును. లోకమున జన్మించిన ప్రతి ప్రాణియు జన్మనిముక్తికై నిరంతరము కృషి చేయుచున్నదని పెద్దలనిరి. కాని దాని మార్గముమాత్రము ప్రాణులందఱకు తెలియదు. ఇంద్రియములు చూపిన మార్గముననుసరించుటే వాని ప్రవృత్తి. ప్రాణుల యందు ఉత్తమ జన్మ గలవారమగు మానవులయందుకూడ యేకొందఱికో తప్ప తక్కిన వారికి తాము ముక్తికొఱకు పాటుపడుచున్నామని తెలియదు. వారి దృష్టిలో 'ముక్తి' యనునది వారు చేసిన ఋణమును తీర్చుకొనుటయో, భద్రమైన సుందర మందిరమును నిర్మించుకొనుటయో, గొప్ప అధికారమును సంపాదించుటయో, అనుకొని నిరంతరము దానిని పొందుటకు పాటుపడుచున్నారు. అదే అజ్ఞానము. ముక్తి యిట్టిదని తెలియక పోవుటయే గొప్ప తప్పిదము. కనుక అట్టివారి మార్గములు సహజమార్గములు కావు. పెద్దలు, బుద్ధిమంతులకు మాత్రము జన్మరాహిత్యమే ముక్తియని తెలియును. వారు దానికై పాటుపడుచున్నారు. దురదృష్టవశమున అట్టివారిలో కొందరు సరియైన మార్గమున పయనించుట లేదు. పుట్టుకతో అందఱికి ఒకే మార్గము కనబడిన అది సహజమార్గమే.

భిన్న భిన్న మార్గములకు గమ్యస్థాన మొక్కటే కావచ్చును. కాని, భిన్న మార్గములయందు సహజమార్గ మేది? వాని వాని పూర్వ వాసనలు వాని నేమార్గమున కీడ్చునో అదియే వానికి సహజమార్గ మనుకొనుడు. ఏదో ఒక సంఘము, ఒక గురువు చెప్పినదే సహజమార్గమని చెప్ప లేము కదా? ప్రస్తుతము ఆసంఘమునకు గురువు ఉత్తరప్రదేశ్ (U. P.) లోని షాజహాన్ పూర్ నివాసి రామచంద్రజీ మహారాజ్ గారు. వారి బోధను "సహజ మార్గ" మనియు "రాజయోగ" మనియు అందురు. వారు బోధించు తత్త్వము సనాతనమైన దనియు, సూర్యవంశజుడగు దశరథమహారాజునకు 72 తరముల ముందు జీవించియుండిన యొకానొక మహర్షి దీనిని స్థాపించి అనుష్ఠించి కృతార్థుడయ్యె నందురు. కాని, దీని కాధార మేమో తెలియదు.

రామచంద్రజీ మహారాజ్ గారు ఉత్తరప్రదేశ్ లోని ఫతేఘుర్ కు చెందిన సమర్థగురు శ్రీ మహాత్మా రామచంద్రజీ గారు. ప్రస్తుతము వీరు లేరు. ఈశ్వర సన్నిధానమును చెందిరి. వీరే తొలుత ఈ సహజమార్గ, రాజయోగమును కనిపట్టిన వారని. ఇప్పటి గురువుగారగు షాహజహాన్ పూర్ రామచంద్రజీగారు చెప్పియున్నారు. గురువులు యిరువురి నామములు ఒక్కటే, జన్మస్థానములు భిన్నములు. వీరిది ఒక మతము కాదు. భక్తి, ధ్యానములతో కూడిన, అదియొక అనుష్ఠాన (అనుభవ) పద్ధతి. వీ రిట్లు వ్రాసిరి :—

హిందూ మతముయొక్క మూలోద్దేశము మాయము కాగా బాహ్య సంప్రదాయములు మాత్రమే మిగిలియున్నం

దున కల్పితముగ మత విధానమునకు కాలదోషము పట్టిపోయినది. నేటి మతవిధానము పూర్వకాలమునకు చెందిన అవశేషమన్నను, మృతకళేబరమున మిగిలిన అస్థికలన్నను తప్పులేదు". (సత్యోదయము).

వారి అభిప్రాయములను సంగ్రహముగ చెప్పెదను. ముముక్షువు మతపరిమితులకు అతీతుడై యుండవలయును. మతమెచ్చట అంతమగునో ఆధ్యాత్మికత అచ్చట మొదలగును. ఆధ్యాత్మ తత్త్వ మెచ్చట అంతమగునో అచట సత్యానందోదయము కలుగును. అది గతించిన పిమ్మటనే గమ్యస్థానము చేరుదురు.

వారి సిద్ధాంతము ననుసరించి - వారి సమాజమున చేరిన ముముక్షువు శ్రుతిస్మృతి పురాణాదుల అధ్యాయము నిలిపివేయవలయును. శాస్త్రములవలన నే మాత్రము ప్రయోజనము లేదు. అట్లే మంత్ర తంత్రాదికము నిరర్థకమే. గురువును మాత్రము శరణు పొందవలెను. అంతకంటె ముముక్షువు చేయవలసిన దేమియు ఉండదు. గురువునకు శరణాగతుడైన పిమ్మట శిష్యుడేమి చేయవలయునో గురువే చెప్పును. శిష్యుని భారమంతయు గురువే వహించును. శిష్యునకు గురువు ధ్యానపద్ధతి నేర్పును. గురువు ఒక గురుతును చూపి దానియందు లక్ష్యముంచుమని చెప్పును. అప్పుడు గురువు శిష్యుని యందు శక్తిపాతము కలిగించును. గురువు నుండి శిష్యునకు శక్తి సంక్రమించును. అప్పుడు శిష్యుడు తన ధ్యానస్థానమున తేజోలేశ మున్నట్లు గమనించును. అది క్రమముగా వృద్ధి పొందును. సాధకుని సాధన వృద్ధి నొందుకొలది గురువు పురోగమనము తెలుపుచుండును.

గురువుగారు షాజహాపూర్‌నందుండి తన ఆత్మబలముతో యెవనియందైనను యోగశక్తిని ప్రసరింపజేయవచ్చునందురు. దీనిని ప్రాణాహుతి యందురు. ఇది అత్యున్నత స్థితికి చెందిన యోగ సిద్ధియట. గురువుగారు ఎచటనుండియైనను ఒక సమయమున (ఉదాహరణమునకు — ఉదయమున 8 గంటల కనుకొనుము) శక్తి ప్రసారమును చేయ నిమగ్నులగుదురో అదే సమయమున దేశమునందు వివిధ ప్రదేశములయందున్న వారి శిష్యులు వారి వారి ఇండ్లయందుగాని కొందఱు కలసి నియమించుకొనిన ప్రదేశమునందు కాని, ఆసీనులై చిత్తమును ఏకాగ్రముచేసి యుండిరేని గురువుగారి శక్తి ప్రతి శిష్యునియందును ప్రవేశించి శిష్యుని ధ్యానశక్తిని అభివృద్ధినొందించు నందురు.

వీరు గురువును గురించి యిట్లు వ్రాసిరి.—

"పుస్తకములద్వారా గణించిన జ్ఞానముపై నాధారపడి చేయు యోగసాధనములు అపమార్గమును పట్టించునవే గాక మన అధ్యాత్మిక పురోగతికి అపకారకములు గూడ".

"అందుచేతనే ఆధ్యాత్మికాన్వేషణమున నిమగ్నులైన వారికి గురుసాహాయ్య మత్యావశ్యము, తప్పనిసరికూడ. అయినను మహనీయులు కొందఱు నేరుగా దేవుని శరణాగతులై స్వప్రయత్నముతో పరిపూర్ణమును సాధించిన సందర్భములుకొన్ని యున్నవి.* కాని అట్టి దృష్టాంతములు అరుదు".

---

*ఫతేఘర్ శ్రీ రామచంద్రజీ గారు (ప్రస్తుత గురువుగారి గురువు), గురువు లేకయే యీ యోగము సాధించిరని చెప్పియున్నందున పై వాక్యములు చెప్పవలసి వచ్చెను.

వీరు కొన్ని విషయములయందు వేదాంతులతో ఏకీభవింతురు. కాని, చాల విషయములయందు వ్యతిరేకింతురు. వారు చెప్పిన ఒక ముఖ్య విషయమువలన వారి సంప్రదాయ తత్త్వ మెట్టిదైనది బోధపడును. అందులకు దృష్టాంతముగ ఈ క్రింది విషయమును గమనింపవలెను.

శ్రీ రామచంద్రజీగారు కొన్ని గ్రంథములు రచియించిరి. అందులో Reality at Dawn అనుదానిని "సత్యోదయము" అను పేరున తెనిగించిరి. ఆ గ్రంథములో చిన్న చుక్క కేంద్రము (Centre) కలదు. దానిచుట్టును 23 వృత్తములు (23 వలయములు) గీయబడినవి. వాటిని మూడు వర్గములుగా విభజించి యిట్లు వ్రాసిరి.

"బయటినుండి లెక్కించిన మొదటి అయిదు వృత్తములు మాయయొక్క దశలు. మోక్షమని ప్రజలు, లేక శాస్త్రములు, ఊహించినట్టి స్థితి రెండవ మూడవ వృత్తముల మధ్యనున్నది. అత్యంత బాహ్యమున నుండి మనము పయనమారంభించి తదనంతరదశ సంప్రాప్తించుటకు ప్రతివృత్తము దాటుచు కేంద్రమువైపునకు పోవుదము". (పుట. 25).

మఱియు వారిట్లు వ్రాసిరి :— శ్రీ రామకృష్ణాది అవతార పురుషులు ఈ అయిదు వృత్తముల నుండియే జన్మించిరి. అయిదవ వృత్తమువఱకు పూర్వకాల మహాత్ములలో కొందరు మాత్రమే పోగలిగిరి. వారిలో జనక మహారాజొకడు. అయిదు వృత్తములు దాటిన, పదకొండు వృత్తములు అహంకారపు వివిధ దశలను తెలియచేయును. 16 వృత్తముల వఱకు పురోగమించి యుండగలవారు శ్రీ కబీరు

తప్ప యితరు లెవ్వరును లేరు. శ్రీ రామకృష్ణాది అవతార మూర్తులు అయినను వృత్తము దాటలేదని అర్థము. అవతార పురుషుల యోగ్యత ఇంతమాత్రమే అయియుండగ మతాచార్యులగు శ్రీ శంకర, శ్రీ రామానుజాదులను గుఱించి చెప్పవలసిన దేమున్నది? మఱియు వారిట్లు చెప్పిరి :—

"ప్రపంచములోని కొందరు మహాత్ములు, యోగు లందు చాల కొలదిమంది మాత్రమే దానిని (కేంద్రమును) గూర్చిన భావన నేమైనను కలిగియుండిరి. అనేక సందర్భము లలో వారి పురోగతి యెంతైనప్పటికిని - రెండవ మూడవ వృత్తముల వఱకే. ఇంత ప్రాథమికదశయందుండి కూడ వారు కొన్నియెడల తాము సాధించిన పురోగతి చాల గొప్పదని భావించుట దురదృష్టకరము".

(ఈ వాక్యములను శ్రీ శంకరాచార్యాది ఆచార్య పురుషులను గుఱించి చెప్పియుండవచ్చును). "కబీరుగారు తప్ప 16వ వృత్తము వరకు పురోగమించి యుండువారు కానరారు" అని వ్రాసిరి. (పుట. 26, 27).

వీరు అద్వైతులు కారు. పరమేశ్వరునితో జీవాత్మకు పూర్ణముగ ఐక్యత అభేదమునుండు స్థితి నంగీకరింపరు. అద్వైతులవలెనే వీరు సగుణ, నిర్గుణ బ్రహ్మముల అస్తిత్వము నంగీకరింతురు.

శ్రుతి స్మృతులను వీరు త్రోసివేసిరి. జ్ఞానమునకు తగిన గౌరవమివ్వలేదు. బ్రహ్మాదులగు దేవతల మాటకూడ అంతే, వారందరు శ్రీ కబీరు కంటె తక్కువవారే. ఇందు వలన యీ సంప్రదాయము వైదిక సంప్రదాయము కాదని,

భారత దేశ సరిహద్దుల అవలనుండి వచ్చిన తత్త్వములతో వేదాంత తత్త్వము జత చేర్చబడి యీ విధముగా రూపొందింపబడి యుండవచ్చునని నా యభిప్రాయము. ఇందులకు ఆధారము రామచంద్రజీ గారు చెప్పిన వాక్యములను ననుసరింపుము :— "నా పూర్వులు త్రవ్విన బావి యని దాని యందలి ఉప్పునీటినే త్రాగుదునని, పవిత్ర పరిశుభ్రమగు జలమును విసర్జించిన వానివలె నా పూర్వులు చెప్పిన మార్గమున నడతును. ఈ క్రొత్త మార్గమున (మతమున) నడవ నందురు".

ఇందువలన వారి మార్గము పూర్ణముగ ఉపనిషత్తుల మార్గము కాదని వారే అంగీకరించినట్లయినది. వారి అనుభవ మెట్టిదో చెప్పజాలము.

విశ్వమునకు, పైన చెప్పిన 23 వృత్తముల మధ్యనున్న కేంద్రము (Centre) వలెనే మానవునియందు మనస్సు కేంద్రమై యున్నది. మనస్సుతోనే సర్వశక్తిమంతుడు సర్వజ్ఞుడు నగు భగవంతుని భక్తిప్రేమతో శరణు పొందవలయును. పవిత్రమైన మనస్సుతో కడుంగడు వినమ్రములమై దాసులమై ప్రార్థింప వలయును. కేంద్రమును సమీపింప వచ్చును. కేంద్రముతో ఐక్యము కావచ్చును. కాని సంపూర్ణముగా ఐక్యము కారు. "మనస్సు" యొక్క నానావిధములైన కార్యకలాపములను చక్కదిద్దుటే మన ప్రయత్నము. కాని మనస్సును పనిచేయనిస్థితియం దుంచుట కాదు". (పుట. 40).

కొందఱు ఆ సమాజములో చేరిన కొలది కాలము

సక్రే విముఖు లగుచున్నారు. కొందరు భక్తితో దానియందే నిలిచి పురోగమించుచున్నారట. కొన్ని వాక్యములు వారి గ్రంథము నుండియు మరికొన్ని నా వ్యాఖ్యానముగాను యీ విషయము క్లుప్తముగా చెప్పితిని.

వీరు, భగవంతుని శరణుబొందుట, భక్తిభావము, మనస్సును పరిశుభ్రపరచుట యను వాటియందు శ్రద్ధ వహింతురు. కనుక ఇది తప్పుత్రోవ యని అనలేము. వేచి చూడవలయును. కొంతకాలమునకుగాని దీని ఫలితము ప్రపంచమునకు తెలియదు. మీరు ఆగ్రా సమీపమునకున్న దయాల్బాగ్ సత్సంగమువారివలనే కబీరుకు అగ్రస్థానమిచ్చుటవలన యిరువుర సంప్రదాయముల యందు సామ్యత కలదని తోచును. ఇరువుర సంప్రదాయములయందును విదేశీయ వివేకము మిళితమై యున్నది.

(౪) హృదయ విద్య*

జిజ్ఞాసువు :- స్వామీ! మన శరీరమునందు హృదయము మెచ్చట నున్నది! హృదయమునందు పరమాత్మ యున్నా

*ఉపనిషత్తులయందు ఉపాసనలకు విద్యలని పేరు. ఉపనిషత్తులయందలి 32 కలవు. మొదటి దశోపనిషత్తులయందు 27ను, తరువాత కౌషీతకీ, శ్వేతాశ్వతరాది ఉపనిషత్తులయందు తక్కిన 5 విద్యలును కలవు. అందులో "దహరవిద్య" ఛాందోగ్య శ్రుతి 8వ ప్రకరణమున కలదు. బ్రహ్మసూత్రములయందు 1వ అధ్యాయమున 3. గుహాధికరణము. 5. దహరాధికరణము. 3వ అధ్యాయము. 18వ "అనియమాధికరణము" నందును ఈ ప్రసక్తి కలదు.

డని పెద్దలందురు. దానిని తెలిసికొనిన పరమాత్మను సులభముగ తెలిసికొనవచ్చునుగాదా? ఆ విషయము విపులముగ వివరింపుడురని ప్రార్థన.

వేదాంతి :- హృదయమును గురించి తెలిసికొనుట కష్టమే; నీ వనుకొన్నంత సులభకార్యము కాదు. లోకులు వ్యావహారికముగ ఎద, ఎడద, గుండె, ఱొమ్ము, వక్షము అను భాగము రెండు భుజములకు మధ్యనుండు ప్రదేశము అని అనుకొందురు. ఇది శరీరమునందు కనబడుచుండును. ఆ ప్రదేశమునందే శరీరములోపల హృదయమను మాంస పిండముండును. దానినే హృదయమని అందురు. గుండెకాయ యని కొందరందురు.

ఇదివరలో నీకు రాజయోగమును గురించి చెప్పిన సందర్భమున మూలాధారాది షట్చక్రములను గురించి చెప్పియుంటిని. ఆ సందర్భమున అనాహత చక్రమునకు క్రింది భాగమున హృదయ పద్మము కలదనియు, అది అష్ట దళములు గలదనియు, చెప్పియుంటిని.

*అక్కడ ఆ విచారమంతటితో ముగిసినది. హృదయమును గురించి శాస్త్రములయందు ఏకాభిప్రాయము లేదు. అయినను వానిని గురించి సంగ్రహముగా తెలిపెదను. మంత్రపుష్పమునందిట్లున్నది :— మం॥ పద్మకోశ ప్రతీకాశం హృదయంచా ప్యధోముఖమ్, అధోనిష్ట్యా వితస్త్యాంతే నాభ్యా ముపరితిష్ఠతి.

*బ్రహ్మజిజ్ఞాస ద్వితీయ భాగము IIవ ప్రకరణమున, 20వ అధ్యాయమునందు చెప్పియున్నాను.

తా॥ గళమునకు అధో భాగమున నాభికి ఊర్ధ్వ భాగమునను, నడుమ ద్వాదశాంగుళ ప్రమాణ భాగమున అధోముఖమై హృదయకమల మున్నది. ఆ హృదయకమలము నందే దేవుడున్నాడు. (తర్జని మొదలగు నాలుగు అడ్డవేళ్ల కొలతలు మూడైన ద్వాదశాంగుళములు)".

మం॥ సంతతగ్ం శిలాభిస్తు లంబత్యా కోశసన్నిభమ్. తస్యాంతే సుషిరగ్ం సూక్ష్మం తస్మిన్సర్వం ప్రతిష్ఠితమ్॥ తస్యమధ్యే మహానగ్ని ర్విశ్వార్చి ర్విశ్వతోముఖః.

తా॥ ఆ హృదయ పుండరీకము నాశ్రయించి జ్వాలావళులచే ప్రకాశించు నాడీ సమూహము వ్రేలాడుచు జీవునకు ముఖ్యస్థానమై కొంచెము వికసితమైన తామర పుష్పముతో తుల్యమై హృదయాగ్రమందు సూక్ష్మమైన యొక కమలమున్నది. దానియందు సర్వము ప్రతిష్ఠితమై యున్నది. దానినడుమ సర్వత్ర జ్వలించు జఠరాగ్నియైన వైశ్వానరుడున్నాడు.

కఠోపనిషత్తునందిట్లున్నది :— మం॥ తం దుర్దర్శం గూఢం సుప్రవిష్టం గుహాహితం గహ్వరేష్ఠం పురాణం అధ్యాత్మ యోగాధిగమేన దేవం మత్వా ధీరో హర్ష శోకౌ జహాతి. (2-12).

తా॥ చూచుటకు శక్యముకానిది ఏకాంతస్థితియందుండునది హృదయగుహయందు గుప్తమై సనాతనమై (జననము లేనిదై) యుండు పరమాత్మను అధ్యాత్మ ధ్యానము వలన ధీరుడైనవాడు కన్గొని హర్షశోకముల త్యజించుచున్నాడు.

మం॥ అణోరణీయా న్మహతో మహీయా నాత్మా స్య జంతో ర్నిహితం గుహాయాం. (2-20).

తా॥ ఈ ఆత్మ అణువునకంటె అణువుగాను, మహత్తునకంటె మహత్తుగాను, ప్రతిప్రాణి హృదయ కుహరము నందు నివసించుచున్నది.

మం॥ ఋతం పిబన్తౌ సుకృతస్య లోకే, గుహాం ప్రవిష్టౌ పరమే పరార్థే, ఛాయాతపౌ బ్రహ్మవిదో వదంతి, పంచాగ్నయో యేచ త్రిణాచికేతాః. (3-1)

తా॥ పరమాత్మకు స్థానమైన హృదయ కుహరములో కూర్చుండి యేయిరువురు తమ సుకృత ఫలముల నను భవించుచున్నారో వారిని బ్రహ్మవిదులును, పంచాగ్నుల నారాధించి త్రిణాచికేతాగ్నిని వేల్చిన గృహస్థులును, ఆ యిరువురును ఛాయాతపములని చెప్పుచున్నారు.

ఇచట ఛాయ తపములు జీవాత్మ పరమాత్మలా? జీవేశ్వరులా? అను ప్రశ్న కలుగుచున్నది. మన ప్రస్తుత ప్రసంగమునకు దానికి సంబంధము లేదు.

మం॥ యః పూర్వం తపసోజాత మద్భ్యః పూర్వ మజాయత, గుహాం ప్రవిశ్య తిష్ఠన్తం యో భూతేభి ర్వ్యప శ్యత, ఏతద్వైతత్. (4 6)

తా॥ పంచభూతముల మధ్యనున్న వానిగను, బ్రహ్మ యొక్క తపస్సుచే కనబడినవాడును, జలమునకంటె పూర్వమే ఉండినవాడును, హృదయకుహరమందు నివసించు వాడును ఎవనిని ఎవడు చూచుచున్నాడో వాడు బ్రహ్మ

మునే చూచుచున్నాడు. ఇదియే అది. (నీవు ఇంతకుముందు అడిగినది.)

మం॥ యా ప్రాణేన సంభవ త్యదితి ర్దేవతా మయీ, గుహాం ప్రవిశ్య తిష్ఠంతీం యా భూతేభి ర్వ్యజాయత.
(ఏతద్వైతత్. 4-7)

తా॥ ఎవడు సమస్త దేవతామయుడో, సమస్త ప్రాణులతోసహా హృదయ గుహాయందు ప్రవేశించి అచ్చట స్థిరముగా నున్నాడో వానిని తెలిసికొనినవాడు తప్పక బ్రహ్మమును తెలిసికొనుచున్నాడు. ఇదియే అది,

మం॥ అంగుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి, ఈశానో భూత భవ్యస్య నతతో విజుగుప్సతే.
(ఏతద్వైతత్)

మం॥ అంగుష్టమాత్రః పురుషో జ్యోతి రివా ధూమకః, ఈశానో భూతభవ్యస్య స ఏ వాద్య స ఉవిశ్వః.
(ఏతద్వైతత్)

తా॥ అంగుష్ఠమాత్రుడైన పురుషుడు పొగలేని జ్యోతివలె హృదయ మధ్యమున నివసించుచున్నాడు. అతడు భూత భవిష్యత్తులకు ప్రభువు; నేడున్నాడు. అతనిని తెలిసికొనినవాడు భయములేనివాడగుచున్నాడు. ఇదియే అది.

మం॥ న సందృశే తిష్ఠతి రూపమస్య న చక్షుషా పశ్యతి కశ్చ నైనమ్, హృదామనీషా మనసా భిక్లప్తో, య ఏతద్విదు రమృతాస్తే భవంతి. (6-9)

తా॥ అతని స్వరూపము దృగ్గోచరముకాదు, అనగా నేత్రములచేత ఎవనికి ప్రత్యక్షముకాదు. పరిశుద్ధాంతః కరణులు నిరంతరాభ్యాసము చేసి (హృదయము నందు) ఎవరు ఆ బ్రహ్మమును తెలిసికొనుచున్నారో వారమృతత్వమును పొందుచున్నారు.

మం॥ శతం చైకాచ హృదయస్య నాడ్య స్తాసాం మూర్ధాన మభినిస్సృతైకా. తయోర్ధ్వ మాయన్నమృతత్వ మేతి, విష్వజ్ఞన్యా ఉత్క్రమణే భవంతి. (6-16)*

తా॥ హృదయమునందు 101 నాడు లున్నవి. అందులో ఒకటి నడి నెత్తివఱకు పోయినది. (అదియే సుషుమ్న) ప్రాణోత్క్రమణ కాలమున ప్రాణము ఆనాడి నుండి వెడలిపోయిన అట్టి వా రమృతమును పొందుదురు.

మం॥ అంగుష్ఠమాత్రః పురుషో ఽన్తరాత్మా, సదా జనానాం హృదయే సన్నివిష్టః, తం స్వాచ్ఛరీరా త్ప్రవృహే న్ముంజాదివేషీకాం ధైర్యేణ తం విద్యా చ్ఛుక్ర మమృత మితి. (6-17)

తా॥ హృదయమున నివసించు అంగుష్ఠ మాత్ర పురుషుని ముంజగడ్డి మధ్య సన్నని ఈనెను పైపొర తీసి వేఱు చేయునట్లు (అన్వయ వ్యతిరేకములచే) వేఱుచేయవలెను. వానిని పవిత్రమైనవానిగను అమృతునిగను తెలిసికొనవలెను.

---

* ఈ మంత్రము ఏవిధమైన మార్పులేక యోగశిఖోపనిషత్తు (5-17-18) నందున్నది.

ప్రశ్నోపనిషత్తు. మం। హృది హ్యేష ఆత్మా, అత్రై తదేకశతం నాడీనాం తాసాం శతం శతం శత మేకైకస్యాం ద్వాసప్తతి ర్ద్వాసప్తతిః ప్రతిశాఖానాడీ సహస్రాణి భవ త్యాసు వ్యాన శ్చరతి. (3-6)

తా॥ ఆత్మ హృదయము నందున్నది. అచ్చట 101 నాడులు గలవు ఒక్కొక్క దానియందు నూఱు నూఱు శాఖలు కలవు. ఆ శాఖలయందు ప్రతి ఒక్కొక్క శాఖకు 72 వేలు ప్రతిశాఖానాడులు గలవు. వాటియందు వ్యాన వాయువు సంచరించును — (పిప్పలాద మహర్షిని ఆశ్వలా యను డడిగిన ప్రశ్నకు - పైన చెప్పినది ఈ సమాధానము).

ముండకోపనిషత్తు. మం॥ అవి స్సన్నిహితం గుహా చరం నామ మహత్పద మత్రై తత్సమర్పితమ్, ఏజ త్ప్రాణ న్నిమిషచ్చ యదేతజ్జానథ సదసద్వరేణ్యం పరం విజ్ఞానాద్య ద్వరిష్ఠం ప్రజానామ్. (2-2-1)

తా॥ హృదయ గుహయందు ఇంద్రియ వృత్తులచే అభివ్యక్తమగుచు సంచరించుచు వ్యక్తావ్యక్త స్వరూపమైన బ్రహ్మమే మహాధారము. ఇదే సత్తు, ఇదే అసత్తు, ఇదే శ్రేష్ఠము. సర్వభూతములు అందే యున్నది. అట్టి తత్త్వ మును తెలిసికొనవలెను.

మం॥ మనోమయః ప్రాణశరీరనేతా ప్రతిష్ఠితో౽న్నే హృదయం సన్నిధాయ, తద్విజ్ఞానేన పరిపశ్యంతి ధీరా ఆనందరూప మమృతం యద్విభాతి. (2-2-7)

తా॥ మనోమయుడై ప్రాణములకు నియామకుడై

హృదయమునందు నిలిచియుండువాడును, ఆనందరూపము గ
అమృతమయుడై ప్రకాశించు ఈ ఆత్మను ధీరులైన జ్ఞానులు
సర్వత్ర గాంతురు.

మం॥ ద్వా సుపర్ణా స యుజా సఖాయా! సమానం
వృక్షం పరిషస్వజాతే, తయోరన్యః పిప్పలం సాద్వత్త్యనశ్న
న్నన్యో అభిచాకశీతి. (3-1-1).

తా॥ ఒకే వృక్షముపై అందమైన రెక్కలుగల
వియు, అత్యంత స్నేహము గలవియు, రెండు పక్షులు జంట
గలిసి యున్నవి. అందులో ఒకటి ఆ చెట్టుయొక్క మంచి
రుచిగల ఫలములను తినును. రెండవది తినక తినుచుండు
మిత్రుని చూచుచుండును. (ఈ మంత్రమునందు వృక్షమని
చెప్పబడినదే హృదయమని అర్థము చేసికొనవలయును).

మం॥ దురాత్సుదూరే తదిహాంతికే చ పశ్యంత్స్వి
హైనం నిహితం గుహాయామ్. (3-1-7)

తా॥ అది దూరముకంటె అతిదూరమును సమీప
మునకంటె అత్యంత సమీపమునై యుండి దివ్యదృష్టిగల
జ్ఞానులు వారి హృదయ గుహారమందే చూచుచున్నారు.

<u>తైత్తిరీయోపనిషత్తు.</u> మం॥ స య ఏషో ఽంతర్హృ
దయ ఆకాశః తస్మిన్నయం పురుషో మనోమయః అమృతో
హిరణ్మయః. అంతరేణ తాలుకే య ఏష స్తన ఇవాలంబతే
సేంద్రయోనిః యత్రాసౌ కేశాంతో వివర్తతే. వ్యపోహ్య
శీర్ష కపాలే, భూరిత్యగ్నౌ ప్రతితిష్ఠతి, భువ ఇతివాయౌ.

(శిక్షావల్లి. 6-1)

తా ॥ అంతర హృదయమునందు ఆకాశమున్నది. అచటనుండు నీ పురుషుడు మనోమయుడు అమృతుడు హిరణ్మయుడు, రెండు తాలుపుల మధ్య స్తనాకారముగ వ్రేలాడు మాంసపిండము కొండనాలుక ఇంద్రుని ఉత్పత్తి స్థానము. కపాలద్వయ మధ్యమున జేరి కేశాంతము వఱకు వ్యాపించి యున్నది. భూః అని అగ్నియందుండును. భువ అని వాయువునందుండును.

మం ॥ బ్రహ్మవి దాప్నోతి పరమ్, త దేషా భ్యుక్తా సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ యో వేద నిహింతం గుహాయాం పర మే వ్యోమన్ సోఽశ్నుతే సర్వాన్కా-మాంత్సంహ....
(బ్రహ్మానందవల్లి. 1. అ)

తా ॥ బ్రహ్మజ్ఞాని పరమపదమును పొందును. బ్రహ్మము నెఱింగినవాడు బ్రహ్మమే యగును. హృదయ గుహాయందుండు సత్య జ్ఞానానంద స్వరూపమగు బ్రహ్మము నెఱింగినవాడు సమస్త కోరికలు పొందినవాడగును.

ఐతరేయోపనిషత్తు. మం ॥ య దేత ద్ధృదయం మనశ్చైతత్. (3-2).

తా ॥ ఏది హృదయమో అది మనస్సు.

జిజ్ఞాసువు :- స్వామీ ! మనస్సు హృదయము రెండును ఒకటే యెట్లగును ?

వేదాంతి :- "మనోహి ద్వివిధం ప్రోక్తం శుద్ధం చా శుద్ధ మేవ చ, అశుద్ధం కామ సంకల్పం శుద్ధం కామ వివ

ర్జితమ్. లయ విక్షేపరహితం మనః కృత్వా సునిశ్చలమ్. యదా యాత్యమనీభావం తదా తత్పరమంపదమ్. ... (మైత్రాయణి. ప్ర. 4). అని చెప్పియున్నందున శుద్ధ మానసము హృదయముతో సమానమని శ్రుతి చెప్పినది.

<u>బృహదారణ్యకోపనిషత్తు</u> :- చతుర్థాధ్యాయము ప్రథమ బ్రాహ్మణము గార్గ్యబాలాకికిని అజాతశత్రుడను రాజునకును జరిగిన సంవాదమునందు అజాతశత్రువు ఇట్లు చెప్పెను :- మం॥ యత్రైష ఏతత్సుప్తోఽభూద్య ఏష విజ్ఞానమయః పురుష స్తదేషాం ప్రాణానాం విజ్ఞానేన విజ్ఞాన మాదాయ య ఏషోఽంతర్హృదయ ఆకాశ స్తస్మిఞ్ఛేతే తాని. (17).

తా॥ ఇతడు నిద్రించిన కాలమున ఈ విజ్ఞానమయ పురుషుడు ఈ ప్రాణములు విజ్ఞానముతో సహ తెలియు శక్తిని గ్రహించి హృదయాంతర్గతమై యుండు ఆకాశమున విశ్రమించి యుండును.

తరువాత పంచమాధ్యాయము 9వ బ్రాహ్మణమునందు యాజ్ఞవల్క్య శాకల్య సంవాదమునందు :- మం॥ ... కస్మి న్ను రూపాణి ప్రతిష్ఠితా నీతి హృదయ ఇతి హోవాచ హృదయేన హి రూపాణి సర్వలోకో జానాతి తస్మాద్ధృదయే హ్యేవ రూపాణి ప్రతిష్ఠితాని భవంతీ త్యేవ మేవైత ద్యాజ్ఞవల్క్యః. (20).

తా॥ ప్రశ్న :— రూపము దేని యందు ప్రతిష్ఠితమై యున్నది ?

సమాధానము :— హృదయమునందు. హృదయము

నుండియే మనుష్యుడు రూపమును గ్రహించును. హృదయమునందే రూపము లన్నియు ప్రతిష్ఠింపబడినవి".

కైవల్యోపనిషత్తు. మం॥ ... పరేణ నాకం నిహితం గుహాయాం విభ్రాజ దేత ద్యతయో విశన్తి (3) వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థాః సన్న్యాసయోగా ద్యతయః శుద్ధ సత్వాః. (4).

తా॥ స్వర్గముకంటె పరమునందుండునదై, హృదయ గుహాయం దుండునదై ఏది ప్రకాశించుచున్నదో, ఆ పరబ్రహ్మమును వేదాంత జ్ఞానముచేత చక్కగా నిశ్చయింపబడియుండు అర్థమును తెలిసికొన్నవారును, సన్న్యాస యోగముచేత పరిశుద్ధమైన అంతఃకరణము కలవారునునగు యతులు ప్రవేశించుచున్నారు. అనగా పరబ్రహ్మమును బొందుచున్నారు.

మం॥ ... హృత్పుండరీకం విరజం విశుద్ధం విచిన్త్య మధ్యే విశదం విశోకమ్, అచిన్త్య మవ్యక్త మనంతరూపం శివం ప్రశాంత మమృతం బ్రహ్మయోనిమ్ ... ఉమా సహాయం పరమేశ్వరం ప్రభుం ... (6).

తా॥ హృదయ కమలము రజోగుణము లేనిదనియు శుద్ధమైనదనియు భావించి(న వాడు) హృదయకమల మధ్యమున ... ఉమాసహితుడైన పరమేశ్వరుని (బొందుచున్నాడు).

జాబాలోపనిషత్తు. మం॥ దహరేవ విరజే త్తదహరేవ ప్రవ్రజేత్.

శ్వేతాశ్వతరోపనిషత్తు. మం॥ అణోరణీయా న్మహతో మహీయా నాత్మాగుహాయాం నిహితోఽస్య జంతోః, తమక్రతుం పశ్యతి వీతశోకో, ధాతుః ప్రసాదాన్మహిమాన మీశమ్. (3-20).

(ఈ మంత్రము కఠోపనిషత్తులో పూర్వము చెప్పబడినదే).

అథర్వశిరోపనిషత్తు. మం॥ హృదిస్థా దేవతా సర్వా హృది ప్రాణాః ప్రతిష్ఠితా, హృది త్వమసి యోనిత్యం త్రిస్రోమాత్రాః పరస్తు సః. (4-1).

తా॥ హృదయ కమలమునందు సమస్త దేవతలు, ప్రాణము, సూత్రాత్మ కలరు. ఎల్లప్పుడు ప్రతిసిద్ధిగల ఓంకార స్వరూపుడవగు నీవు (రుద్రుడవు) ఆహృదయకమలమునందు కలవు. (అనగా రుద్రుని పరబ్రహ్మముగా దేవతలు స్తుతించిరి).

మం॥ వాలాగ్రమాత్రం హృదయస్య మధ్యే, విశ్వం దేవం జాతవేదం వరేణ్యమ్, తమాత్మస్థం యే ను పశ్యంతి ధీరాః, తేషాం శాంతి శ్శాశ్వతీ నేతరేషామ్.

తా॥ కేశాగ్రమువలె అతి సూక్ష్మమైనట్టివాడును, హృదయ మధ్యమునందుండు వాడును విశ్వరూపుడును వేదములకు జనకుడును స్వయంప్రకాశుడును వరణీయుండును అంతఃకరణమునందుండు వాడును అగు దేవుని(రుద్రుని) ఏమహాత్ములు యెఱిగి సాక్షాత్కారమును పొందుదురో వారే ధీరులు. అథర్వశిరోపనిషత్తునకు ఆనామము ఈకారణమున

కలిగెనో ఆకారణమును శ్రుతి నిర్వచన రూపమున యీ క్రింది ఆఖ్యాయిక చెప్పినది :—

పూర్వ మొకప్పుడు ఒక మహర్షి అథర్వునకు యిట్లు శాపమిచ్చెను :— "తక్షణ మీ అథర్వుని శిరమూడి క్రింద పడుగాక, వాని హృదయము చైతము పడిపోవుగాక" ఈ శాప వృత్తాంతమును అథర్వుడెఱిగి యోగాభ్యాసబలము చేత తాను తన శరీరమునుండి వెలుపలికివచ్చి దేహమున కంటె భిన్నరూపుడై క్రిందపడియున్న తన శిరస్సును హృదయమును సూక్ష్మ (లింగ) శరీరములో మొదనునందలి పై భాగమున ప్రవేశించి శిరమును, హృదయమును వాటి వాటి స్థానములచేర్చి బ్రతికెను. ప్రాణోపాసనవలన ప్రాణరూపు డగుటచేత ఆమహాత్ము డిట్లు చేయగలుగుటచే ఆయనకు "పవమానుడు" అను పేరుకలిగెను. అథర్వునిచే చెప్పబడినది గనుక శ్రుతికి అథర్వశిరోపనిషత్తని పేరు కలిగెను.

సుబాలోపనిషత్తు. మం॥ హృదయస్య మధ్యే లోహితం మాంసపిండం, యస్మిన్ తద్దహరం పుండరీకం కుముదమివానేకధా వికసితం ...

తా॥ హృదయ మధ్యమందు ఎఱ్ఱనగు లేక కుంకుమ పువ్వు రంగు గలిగిన మాంసపిండము కలదు. దానియందు దహరము తామరపువ్వువలె వికసించి యుండును. (ఈ శ్రుతియందే మఱికొన్నిచోట్ల హృదయమును గురించి వ్రాయబడినది).

ధ్యాన బిందూపనిషత్తు. మం॥ అష్ట పత్రంతు హృ

త్పద్మం ద్వా త్రింశత్కేసరాన్వితం, తస్యమధ్యే స్థితో భాను ర్భాను మధ్యే గతశ్శశీ. (26).

మం॥ అబ్జపత్ర మధఃపుష్ప మూర్ధ్వనాళ మధో ముఖమ్, కదళీ పుష్ప సంకాశం సర్వవేదమయం శివమ్. (33).

యోగతత్త్వోపనిషత్తు. మం॥ హృదిస్థానే స్థితం పద్మం తస్య వక్త్ర మధోముఖమ్.

తా॥ హృదయ స్థానమందు అధోముఖముగల పద్మ మున్నది. (అదే హృదయపద్మము).

మహోపనిషత్తు. మం॥ పద్మకోశ ప్రతీకాశం లంబ త్యాకోశ సన్నిభమ్, హృదయం చాప్యధోముఖం సంతతైః సీత్కారాభిశ్చ, తస్య మధ్యే మహానర్చి ర్విశ్వార్చి ర్విశ్వతో ముఖమ్, తస్యమధ్యే వహ్నిశిఖా అణియోర్ధ్వా వ్యవస్థితా, తస్యాః శిఖాయామధ్యే పరమాత్మా వ్యవస్థితా.

"తా॥ అధోముఖమైన పద్మపు మొగ్గవలె నుండి కోశ సమానముగ హృదయము వ్రేలాడుచుండును. అందు అనేకనాడులుచేరి యున్నవి. దాని మధ్యమున నలుప్రైపుల మహాజ్వాలలతో వైశ్వానరాగ్ని ప్రకాశించుచున్నది. ఆ యగ్ని మధ్యమున అతి సూక్ష్మమైన దీప శిఖవలె నుండి ఒక జ్వాల ఊర్ధ్వముఖముగా విలసిల్లుచుండును. దాని శిఖామధ్యమున పరమాత్మ వెలుగుచున్నాడు".

మం॥ అహంకార కళాయుక్తం బుద్ధిబీజ సమన్వితమ్, తత్పూర్వష్టక మిత్యుక్తం భూతహృత్పద్మషట్పదమ్.
(5-153)

తా. అహంకారమును కళచేత కూడినదియు, బుద్ధియే బీజముగా గలదియు నగు, పుర్యష్టకమే ప్రాణులయొక్క హృదయమనెడి స్థానమున వసించు తుమ్మెద యగుచున్నది.

శారీరకోపనిషత్తు. మం॥ మనస్థానం గళాన్తం బుద్ధేర్వదన మహంకారస్య హృదయం చిత్తస్యనాభి రితి.

తా॥ మనస్సుయొక్క స్థానము కంఠము. బుద్ధియొక్క వాసస్థానము వాక్కు. అహంకారముయొక్క వాసస్థానము నాభి. (మంత్రము "బుద్ధేర్వదన" అని కొన్ని ప్రతులయందును "బుద్ధేర్వచన" అని కొన్ని ప్రతుల యందును గలదు).

బ్రహ్మసూత్రములు. పై యంశము బ్రహ్మసూత్రములయం దేమి చెప్పబడినదో దాని నిచట విచారింతము :-

సూ॥ అర్భకౌకస్త్వాత్త ద్వ్యపదేశాచ్చ నేతిచే న్నిచాయత్వా దేవం వ్యోమవచ్చ. (బ్ర. సూ. 1-2-7).

తా॥ ఉపాసకుడు సర్వవ్యాపకుని ఉపాసింపజాలడు కనుక సర్వవ్యాపకుండగు పరమాత్మను ప్రాదేశ మాత్రముగ హృదయమునందున్నాడనుట తప్పుకాదు.

సూ॥ హృద్యపేక్షయా తు మనుష్యాధికారత్వాత్.
(బ్ర. సూ. 1-3-24)

తా॥ విద్యాధికారియగు మానవునకు హృదయమునందుండు పరబ్రహ్మమును తెలిసికొనుటకు (ఉపాసన కొఱకై) అంగుష్ఠ మాత్రుడని చెప్పబడినది.

బ్రహ్మసూత్రములయందు ప్రథమాధ్యాయ ద్వితీయ పాదమునందలి (3) గుహాధికరణము నందును, తృతీయ పాదమునందలి (5) దహరాధికరణము నందును, తృతీయాధ్యాయ ద్వితీయ పాదమునందు తదభావాధికరణమునందును ఈ చర్చ జరిగినది. మఱియు—

సూ॥ గుహాం ప్రవిష్టా వాత్మానౌ హి తద్దర్శనాత్.
(బ్ర. సూ. 1-2-11)

తా॥ ఈ సూత్రభాష్యమునందు భాష్యకారులు (నే నిదివరలో చెప్పిన) కఠోపనిషత్తు నందలి "ఋతం పిబంతౌ" (3-1) మంత్రమును, ముండక శ్రుతి యందలి "ద్వాసుపర్ణా" (3-1-1) అను మంత్రమును ఉదాహరించి యున్నారు.

సూ॥ దహర ఉత్తరేభ్యః. (బ్ర. సూ. 1-3-14)

తా॥ దహరాకాశ మనగా బ్రహ్మమే.

సూ॥ ధృతేశ్చ మహిమ్నో ఒస్యాస్మి న్నుపలబ్ధేః.
(బ్ర. సూ. 1-3-16)

తా॥ మఱియు విశ్వమును ధరించిన వాడని చెప్పుట చేతను దహరాకాశము పరబ్రహ్మమని తెలియుచున్నది. "అథ య ఆత్మా స సేతు ర్విధృతిః" ఈ ఆత్మయే సమస్త జగత్తును ధరించి నియమన మొనర్చుచున్నాడని చెప్పుట వలన 'దహర' మనగా బ్రహ్మమే.

భగవద్గీత.

శ్లో॥ జ్యోతిషా మపి తజ్జ్యోతి స్తమసః పర ముచ్యతే,
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్.
(గీత. 13-18)

తా॥ ఆ బ్రహ్మము సూర్యాది తేజస్సులకు ప్రకాశ మొసఁగునదియు, అజ్ఞానమునకంటె పరమునం దున్నదియు, సమస్త ప్రాణులయొక్క హృదయమునం దున్నదియు అని చెప్పబడినది.

ఈ శ్లోకమునకు శ్రీ శంకరానంద స్వాములవారు రచియించిన వ్యాఖ్యానము యొక్క ఆంధ్రీకరణమునం దిట్లున్నది:—

"బ్రహ్మాది స్తంభ పర్యంతముగల సమస్త ప్రాణి సమూహముయొక్క హృదయమునందు - బుద్ధి గుహ యనబడు అవ్యాకృతాకాశమునందు సర్వ ప్రాణులకును సంబంధించిన బుద్ధికిని, ప్రాణుల వ్యాపారమునకును, వాని యవస్థలకును, సాక్షిగా నుండి "నేను" "నేను" అని అహం ప్రత్యయమునకు అర్థముగా విశేషించియున్నది."

ఉత్తరగీత.

శ్లో॥ హృదయకమలమధ్యే దీపవ ద్వేదసారం
ప్రణవమయ మతర్క్యం యోగిహృ ద్ధ్యానగమ్యమ్
అజ హరి శివయోగం సర్వభూతస్థ మేకం
సకృదపి మనసా మాం ధ్యాయతే యస్సయుక్తః (4-21)

తా॥ "హృదయకమల మధ్యమునందు, దీపమువలె ప్రకాశించు వాడును, వేదముయొక్క సార స్వరూపుడును,

ప్రణవ స్వరూపుడును, యోగులచేత ధ్యానింపబడినపిదప వారి హృదయముల యందు గోచరించువాడును, బ్రహ్మ, విష్ణు, శివ స్వరూపుండును సకల భూతములయం దుండు వాడును, అద్వితీయుడును అగు నన్ను (పరమేశ్వరుని) ఒక్క పర్యాయమైనను ఎవడు ధ్యానించుచున్నాడో వాడు ముక్తుడగుచున్నాడు".

శ్లో॥ అధోముఖంతు హృత్పద్మ ముద్ధృత్య ప్రణవేనతు,
గత్వాతు పద్మకోశాంత మేక స్సేవ్యో పునః పునః. (4-31)

తా॥ "అధోముఖమైన హృదయ పద్మమును ప్రణవముచేత లేవదీసి పద్మకోశాంతమును బొంది అతడు (విష్ణుదేవుడు) ఒక్కడే మాటిమాటికి సేవింపదగినవాడు".

శ్లో॥ తతః పశ్చా ద్భవేత్పద్మం సర్వగాత్ర సుఖావహమ్,

తా॥ పిదప ఆపద్మము దేహమున కంతయు (అనగా సకాల వయవములకు) సుఖమును కలుగుజేయునది యగును.

శ్లో॥ హృదిస్థితం పంకజ మష్టపత్రం
సకేసరం కర్ణిక మప్యలీనమ్,
అంగుష్ఠ మాత్రం మునయోవదన్తి
ధ్యాయేతి విష్ణుం పురుషం పురాణమ్. (4-32)

తా॥ "ఆ పద్మము హృదయమునం దున్నది. ఆ పద్మమునకు ఎనిమిది దళములు గలవు. కింజల్కమునందు కర్ణికయు (బొడ్డును) గలదియైనను లీనమైనది కాదు. అంగుష్ఠ పరిమాణము గలది. అయ్యంగుష్ఠ పరిమాణముగల హృదయ పద్మమునందు పురాణపురుషుడగు శ్రీ మహావిష్ణువు నను ధ్యానింపవలయును".

ఈ శ్లోకమున హృదయపద్మమని చెప్పక (హృదయమే పద్మాకారముగనున్న దనక) హృదయమునందు పద్మమున్నట్లు చెప్పబడినది.

శ్లో॥ అష్టపత్రం తు హృత్పద్మం ద్వాంత్రిశ త్కుసుమం తథా,
తత్ర మధ్యస్థితం ధ్యాయే దింద్రాద్యా న్దిశ దేవతాః. (4-33)

తా॥ హృదయకమలము ఎనిమిది దళములును, ముప్పదిరెండు కుసుమములును గలిగియున్నది. ఆ పద్మ మధ్యభాగమునను న్న దేవుని ఇంద్రాది దిగ్దేవతలను ధ్యానము చేయవలయును".

శ్రీ వివేకానందస్వాములవారు ఇట్లు చెప్పిరి:— "కుండలిని యొక చక్రమునుండి మఱియొక చక్రమునకు ఊర్ధ్వముఖముగా బోవునప్పుడు హృదయకమల మందలి దళము లొకదాని వెంబడి నొకటిగా వికసించుట కారంభించును". (ఆంధ్రానువాదము, రాజయోగము, చతుర్థాధ్యాయము).

"మఱియొక విధమైన ధ్యానము కలదు. నీ హృదయాకాశమధ్యమున నొక జ్యోతి ప్రకాశించుచున్నట్లు భావింపుము. ఆ జ్యోతియే నీ యాత్మయనియు దివ్య తేజోమయమగు మఱియొక జ్యోతి దానియందు వెల్గొందుచున్న దనియు, అదియే పరమాత్మ యనియు భావించి ధ్యానింపుము". (రా. యో. అష్టమాధ్యాయము).

శ్రీ వివేకానందస్వాములవారు చెప్పిన జ్యోతి, వాసుదేవోపనిషత్తు చెప్పిన మంత్రమునకు సరిపోవును.

శ్రీ అరవిందుల శిష్యురాలగు శ్రీమాత (శ్రీమతి అల్ఫాసామీరాగారు) యిట్లు చెప్పిరి:— "ధ్యానమునకు ఇతర లక్ష్యస్థానములు కలవు. ఉదాహరణమునకు: శిరమునకు పైనొకటి (దీనిని సహస్రారమునకు పై బ్రహ్మరంధ్రమందురు) భ్రూ మాధ్యమునకు మఱియొకటి. ఒక్కొక్కటియు నొక ప్రభావము గలది; ఒక ఫల విశేషము నిచ్చును. కాని, హృదయమునందుండియే (దివ్యమైన) మార్పునకు కావలసిన ప్రేరణ, సాక్షాత్కార సామర్థ్యము, క్రియాపర శక్తి - ఇవి యన్నియును సకల ముఖ్యవృత్తులును బయలుదేరును". (శ్రీ మాతృ వాక్కులు. 1వ. ప్ర.) మఱియు శ్రీమాత యిట్లు చెప్పిరి:— "మనస్సు, భిన్న భిన్న జనులయందు, భిన్న భిన్న మార్గముల బనిచేయును. హృదయము మాత్రము ఎచ్చటను ఏకరూపమైనదే. హృదయము సత్యతరమైన వాస్తవము. (శ్రీ మాతృ వాక్కులు, 2వ ప్ర.)

హృదయమును గుఱించి శాస్త్రములు మహాత్ములు చెప్పినదానిని సంగ్రహముగ వివరించితిని. కాని ఇందులో కొన్ని అంశముల గుఱించి పరిశీలింపవలసి యున్నది. ఉపనిషత్తులయందు కఠోపనిషత్తు హృదయమును గుఱించి విస్తరించి చెప్పినది. దశోపనిషత్తులయందు, ఈశ, కేశ, మాండూక్యోపనిషత్తులు తప్ప తక్కిన ఏడు ఉపనిషత్తులును, హృదయమును గుఱించి చెప్పినవి. ఈశోపనిషత్తు నందు "హిరణ్మయేన పాత్రేణ" అను 15వ సూత్రమునందు హిరణ్మయ పాత్రను హృదయ గుహాగా అర్థము చేసికొనిన కేన, మాండూక్య శ్రుతుల యందు మాత్రమే యీ ప్రసక్తి ప్రత్యక్షమగుట లేదు.

దశోపనిషత్తులుగాక యితర ఉపనిషత్తులయం దన్నింటి యందో హృదయమును గురించి వ్రాయబడినది. కాని, వాటిలో కొన్నింటిని మాత్రమే, పైన చెప్పియుంటిని.

భగవద్గీత యందలి శ్లోకము నుదాహరించితిని. అదిగాక "ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశే ఽర్జున తిష్ఠతి". (గీత. 18-61), ఈశ్వరుడు సమస్త ప్రాణులయొక్క హృదయ ప్రదేశమం దున్నాడు. ఇచట చెప్పబడిన "ఈశ్వరుడు" సగుణబ్రహ్మము.

పై విధముగా ప్రస్థానత్రయములయం దేగాక అనేక వేదాంత గ్రంథములయందు సయితము హృదయాకాశ మును గురించి చెప్పబడియున్నది. హృది = హృదయము నందు, అయం = బ్రహ్మమున్నది. కనుక (హృదయము) హృదయ మనబడుచున్నది. దీనిని దహరాకాశమనియు అందురు.

జిజ్ఞాసువు :- హృదయమును గురించి శ్రుతులయందు చెప్పినది విద్య (ఉపాసన)యా ? లేక బ్రహ్మవిచారనూ ?

వేదాంతి :- రెండును అని నా యభిప్రాయము. కాని, విద్యకే ప్రాధాన్య మున్నది.

జిజ్ఞాసువు :- శాస్త్రములయందు "హృదయా కాశము" అనియు "హృదయ పద్మము" అనియు రెండు విధములుగ చెప్పిరికదా ? ఈ భేదమునకు కారణమేమైన కలదా ?

వేదాంతి :- ఇందును గురించి నా యభిప్రాయ మే మనగా :— రెండు పద్ధతులలో వస్తు భేదము లేదు. పదార్థ మొక్కటే. హృదయ పద్మమని చెప్పువారు, సాకార, సగుణ బ్రహ్మోపాసకులని భావింపవచ్చును. ముఖ్యముగా వైష్ణవులు వారి యిష్ట దైవమును వారి హృదయ పద్మము నందున్నట్లు భావించి యుపాసింతురు. హృదయ పద్మము కోశమువలె అధోముఖముగా వ్రేలాడుచున్నదనియు, ఆ పద్మ కర్ణికయందు శ్రీ మన్మహావిష్ణువో, శ్రీ కృష్ణ భగవానుడో, లక్ష్మీనారాయణులో ఉన్నట్లు భావించుకొని ఉపాసింతురు. హృదయ గుహాయందు ఆకాశమని చెప్పువారు నిర్గుణ నిరాకార బ్రహ్మోపాసకులు. లేక బ్రహ్మ విచార పరులు హృదయమున వారెట్టి ఆకారమును భావింపరు.

జిజ్ఞాసువు :- హృదయగుహ అంగుష్ఠ మాత్ర పరిమాణముగలది యందురు కదా? అపరిచ్ఛిన్నుడగు పరమాత్మను పరిచ్ఛిన్నునిగా భావించుట తప్పుకాదా?

వేదాంతి :- మన లోకానుభవమునందు పర్వతములలో గుహలను చూచి యున్నాము. గుహాయందుండు ఆకాశమును (శూన్య ప్రదేశమును) మహాకాశము (భూతాకాశము) నుండి వేఱు కాదు. మహాకాశమును పరిచ్ఛిన్నమొనర్చుటకు సాధ్యము కాదు. ఘటము పుట్టగనే ఘటాకాశమను వ్యవహారము కలిగినది. ఘటాకాశమను వ్యవహార మున్నను, ఘటమునందును ఘటము వెలుపలను సర్వత్ర ఆకాశముండుటవలన అది పరిచ్ఛిన్నము కాలేదు. అట్లే హృదయమున నుండు పరమాత్ముడు అఖండా ద్వితీయు

వస్తువే గాని పరిచ్ఛిన్నుడు కాడు. హృదయాకాశమునందు సమస్త విశ్వమును కలదు. అట్లనుటవలన చిన్న ఫిలిమ్‌లో రూపములు కనబడునట్లు కాదు. సూర్య, చంద్ర, నెబ్యులాలు, గెలాక్సీలు, (తేజోరాసులు), సహితము ఏవేవి ఎంతెంత పరిమాణముతో పరిభ్రమించుచున్నవో, ఎట్టి యాకృతులతో నున్నవో యోగులకు అవి యథారీతిగ కనబడును. ఋషులు, యోగులు ప్రపంచమునం దెచ్చటనో జరుగుచుండు కార్యములు తామున్న చోటునుండియే చూడ గలుగుటయు, వాక్యములను వినుటయు పరుల హృదయముల యందలి భావములను తెలిసికొన గలుగుటయు వారు వారి హృదయాకాశమునందు చూచుచుండుట వలననే గదా? అట్టి హృదయాకాశమును చూచినవారు అమృత స్వరూప మగు బ్రహ్మమే.

హృదయాకాశము అంగుష్ఠ మాత్ర ప్రమాణముగల దని కొన్ని శ్రుతులయందు చెప్పియుండినను, కఠోపనిషత్తు నందును (2-20) శ్వేతాశ్వతరోపనిషత్తు నందును, (3-20) హృదయమున నుండు పరమాత్మ (హృదయాకాశము) అణువునకంటె చిన్నదనియు, మహత్తునకంటె పెద్దదనియు వర్ణించినవి. ఇట్టి వర్ణనవలన అంగుష్ఠ మాత్రమే యని మేరను నిర్ధారణ చేయ నవసరము లేదు. సర్వమునకును హృదయాకాశమే అధిష్ఠానమని యెప్పుడు చెప్పబడెనో అప్పుడే అంగుష్ఠ ప్రమాణము సాధకుని ఉపాసనా సౌకర్యము కొఱకు చెప్పబడియుండునని నిశ్చయమైనది. సాలగ్రామమును విష్ణుమూర్తి అని, లింగము శివుడని యుపాసించుట లేదా?

జిజ్ఞాసువు :- హృదయమనునది (గుహాయని గాని, లేక పద్మమని గాని) శరీరమునందుండు ఒక మాంస పిండమా? లేక, ఎదలోపలి భాగమున ఒకానొక నిర్దిష్ట స్థానమునందు అట్టిది ఒకటి లేకపోయినను కలదని సాధకుడు భావించుకొనుచున్నాడా?

వేదాంతి :- స్థూలముగనో - సూక్ష్మముగనో హృదయము పదార్థ రూపమున లేకున్నచో, అష్టదళ పద్మకోశమనియు, దాని నాశ్రయించి 101 నాడులున్నవనియు (కఠ. 6-16) మొదలగు శ్రుతి వాక్యములు అర్థశూన్యములు కావలసి వచ్చును* కొందఱు, హృదయమను నట్టి పదార్థమేమియు లేదనియు, ఉపాసన కొఱకు సాధకుడావిధముగా ఉన్నట్లు భావించుకొనవలయు ననియు దేహమునందలి రక్తమును పరిశుభ్రపరచి దేహమునకంతకును ప్రసారముచేయు యంత్రమువంటి గుండె (Heart) శాస్త్రములయందు చెప్పు నట్టి హృదయకోశము కాదనియు చెప్పుదురు. సుబాలోపనిషత్తు "హృదయస్య మధ్యే లోహితం మాంసపిండం" ఎఱ్ఱనైనది - లేదా - కుంకుమపువ్వు వర్ణము కలది మాంసపు ముద్ద అని స్పష్టము చేసియున్నందున పదార్థము లేకయో కేవల

*కొందఱు ఇన్ని లక్షల నాడులుండునా? ఇది కల్పన యని యనుకొందురు. మన శరీరమునందలి ప్రతి కండరము నాడులయొక్క సముదాయమే. మానవుని మెదడు (Brain)ను ఫోటోతీసి దానిని, న్యూయార్కు నగరమంత పెద్దదానిగా (Enlarge) చేసి చూపవచ్చునట. మెదడు సర్వమును వెంట్రుకలకంటె అతిసూక్ష్మమగు నాడుల పదార్థ సముదాయమే యందురు.

భావనామాత్రమున ఉపాసన చేయుదురను వాదమునకు బలము చాలదు. "పద్మకోశ ప్రతీకాశం" అని చెప్పి యుండుటవలన, (కోశ మనగా = కత్తినుంచుకొను ఒఱ). కొంచెముగా వికసించిన పద్మము పరమాత్మకు ఒఱగా నున్నదని స్పష్టపరుపబడినది.

జిజ్ఞాసువు :- మానవ శరీరమునుకోసి మనము దానిని చూడవచ్చునా?

వేదాంతి :- మానవుడనగా నేమి? పాంచభౌతికమగు స్థూల శరీరమును అందుండు జీవుడును కలిసి యున్నపుడే మానవుడందురు. ఈ రెండింటిలో యేది లేకున్నను మానవుడనరు. జీవుడు శరీరమునుండి వెళ్లిన తరువాత ఉండు కళేబరము (శవము)నకును, బ్రతికియున్నప్పటి శరీరమునకును చాల భేదమున్నది. ప్రాణము (జీవుడు) శరీరమునుండి వెడలగనే ఆశరీరమునందు అనేక మార్పులు జరుగుచున్నవి. ప్రాణమున్నపుడు నాడులు తేజస్వంతములై వివిధ వర్ణములు కలిగియుండును. అది యట్లుండనిమ్ము. జీవుడున్నప్పుడు కూడ హృదయాకాశమును కొందఱు మాత్రమే చూడగలరు. వారెవరనగా :—

అధ్యాత్మ యోగమున ధీరులైన వారును (కఠ. 2-12) ముంజగడ్డిలోనున్న సన్నని యీనెను పై పొరలు తీసి ముల్లును వేఱు చేయునట్లు పంచకోశములను విచారించి వాటిని వేఱుగా భావించి వాటి మధ్యమున నున్న ఆత్మను చూచునట్టివారును, యోగముచే నాడులను శుద్ధము చేసిన వారును, నియతాహార విహారములు గలవారును, వాసనా

రహితమైన చిత్తము గలవారును అగు మహానీయులే చూడ గలరు. తక్కినవారు చూడలేరు. ఒఱలో కత్తి యున్నపుడు మనము ఒఱను మాత్రమే చూడగలము. కత్తిని చూడ లేము. అట్లే శవమును శోధించు (Post mortem చేయు)వా డెట్లు హృదయ కోశమును చూడగలడు? శవమునందు మనస్సును వెదకిన కనబడునా? వేదాంత గ్రంథములయందు పరమాత్మను చూచుటకు ఏయే యుపాయములను ఎట్టి సాధనములను చెప్పిరో అవియే హృదయాకాశమును చూచుటకు సాధనములు. ఏల యందువా? అది బ్రహ్మమే కనుక. "వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థా" అని కైవల్యో పనిషత్తు చెప్పియుండలేదా?

జిజ్ఞాసువు :- హృదయ గుహాయందు ఛాయా - తపములవలె యిరువురున్నట్లు, ఒక వృక్ష శాఖపై రెండు పక్షులున్నట్లును చెప్పిరికదా? ఈ ద్వైతముయొక్క భావమేమి?

వేదాంతి :- ఛాయా తపము లనగా జీవాత్మ పరమాత్మలే యని అర్థము చెప్పిరి. చెట్టుపైన రెండు పక్షులున్నట్లు చెప్పిన వాక్యములకు అదే అర్థము. ఇందువలన ద్వైతము సిద్ధింపదు. నీ ఛాయ నీకంటె భిన్నమగు స్వతంత్రాస్తిత్వముగల వస్తువు కాదు. రెండు పక్షులయందు ఫలములను తినక చూచుచుండు పక్షియొక్క ఛాయయే రెండవ పక్షి. కనుక యిచట ద్వైతమునకు చోటులేదు.

పరమేశ్వరుడు జగత్తుయొక్క సృష్టి స్థితి లయములకు కారణమని చెప్పిన వాక్యముల రహస్యమును విచారిం

చినచో పిండమే బ్రహ్మాండము. ఇందలి యింద్రియములు ఇంద్రియాదిష్ఠాన దేవతలు, ప్రాణము. మనోబుద్ధ్యాదులు - జాగ్రత్స్వప్నములయందు వివిధ వ్యాపారములచే ఆనందము పొందవలెనని వ్యవహరించి ఆనందమును పొందలేక తుదకు అలసి శ్రమచేత శక్తి హీనములై తొలుత యివన్నియు యే యమృత స్వరూపు నుండి వెలువడినవో అట్టి దహరాకారా కాశమగు ఆనందమును బొంది తిరిగి బలమును పుంజుకొని వాటి వాటి స్థానములకు చేరి తిరిగి యెప్పటి యట్ల కర్మల నాచరించుచున్నవి. ఇది ప్రాణులకు నిత్యపరిపాటి యైనది. దేహము నందలి సమస్త నాడులు హృదయమున చేరి అచట ఆనందమును అనుభవించి (శక్తిని ఆర్జించి) ఊర్ధ్వ, అధో, భాగములకు వ్యాపించుచున్నవి. అహంకారము మాత్రమే హృదయమునందు నిలిచి యుండునని శాస్త్రములు చెప్పుచున్నవి. అందువలననే శ్రుతి ఛాయా తపము లనునామములచే వాటిని చెప్పినది.

జిజ్ఞాసువు :- హృదయ మనగా లోకవ్యవహారముల యందు ఎద, రొమ్ము అని యందురు. ఇందు ఎచ్చట హృదయ మున్నది ?

వేదాంతి :- ఇందులోను అభిప్రాయ భేదమున్నది. ఎడమప్రక్క అనువా రనేకులు. ఇటీవల శివైక్యమును చెందిన భగవాన్ శ్రీ రమణమహర్షి గారు, హృదయము కుడిప్రక్కన కలదని చెప్పిరి. వారి విషయమై కొంత విస్తరించి చెప్పవలసి యున్నది. సావధానుడవై వినుము :—

<u>రమణగీత</u> :— శ్రీ రమణమహర్షి* శిష్యులలో ఒకరు ఒక శ్లోకమును వ్రాయదలచి "హృదయకుహరమధ్యే" అని వ్రాసి తరువాత నేమి వ్రాయవలయునో తోచక యుండుటను భగవానుడు చూచి అతనివద్దనున్న కాగితమును పెంసిలును తీసికొని ఆ శ్లోకమును వారే యీ క్రిందివిధముగా పూర్తి చేసిరి.

శ్లో॥ హృదయకుహరమధ్యే కేవలం బ్రహ్మమాత్రం
హ్యహమహమితి సాక్షాదాత్మరూపేణ భాతి,
హృది విశ మనసా స్వం చిన్వతా మజ్జతా వా
పవనచలనరోధా దాత్మనిష్ఠో భవత్వం॥

తా॥ "హృదయమను గుహయొక్క మధ్యమున కేవలము బ్రహ్మమే 'నేను నేను' అని ప్రత్యక్షముగ ఆత్మరూపముగ ప్రకాశించుచున్నది. ఆత్మను గురించి వెదకుట చేతనో, లేక, తనయందు మునుగుట చేతనో, లేక, ప్రాణవృత్తి నిరోధము వలననో మనస్సుచే హృదయమున ప్రవేశించి నీ వాత్మయందు నిలకడఁ గలవాడవగుము".

శ్రీ రమణమహర్షి శిష్యులలో అగ్రగణ్యులు గణపతి దేవుని అవతారమని ప్రసిద్ధికెక్కిన కావ్యకంఠ గణపతిముని గారు. వీరికి దైవయోగమున శ్రీ రమణమహర్షి దర్శనము కలిగినది. గణపతిమునిగారు మహర్షియొక్క రెండు పాదములను తన రెండుచేతులతో పట్టుకొని - 'తా నెంత ప్రయ

---

*శ్రీ రమణ భగవానుడు 30-12-1879 తేది జన్మించి 14-4-1950 లో భౌతిక దేహమును వదలిరి.

త్నించినను తనకు తపః ఫలము (శాంతి) లభింపలేదని చెప్పుకొనిరి. అంతకుముందు దొక పర్యాయము మహర్షి గణపతి గారిని చూచి వారి యోగ్యతను తెలిసికొని యుండిరి. మహర్షికి అది అప్పుడు స్ఫురించెను. ఇట్లు శరణాగతుడైన గణపతిగారితో మహర్షి యిట్లనిరి:— "ఈ 'నేను' అను భావము యెందుండి పొడముచున్నదో పరికించిన మనస్సు అందు లీనమగును. అదియే తపస్సు".

"మంత్రజప మప్పుడు మంత్రనాద మెందుద్భవించునో పరికించిన మనస్సు అందులో లీనమగును. అదియే తపస్సు".

గణపతుల* కప్పు హృదయమున నమృతసేచన మయ్యెను (శ్రీ రమణలీల - 5వ ప్రకరణము).

మహర్షి సన్నిధానమున వారి శిష్యులు అధ్యాత్మానుభవమున వారికిగల సంశయముల నడుగుచుందురు. మహర్షి వారికి సమాధానము చెప్పుచుందురు. అచ్చట నున్న శిష్యులలో ఒకరు జాగ్రత్తగ ఆ ప్రశ్నోత్తరములను వ్రాసియుంచెదరు. వాటిలో కొన్నింటికి గణపతి మునిగారు శ్లోకములుగా వ్రాసి, ఆ శ్లోకములకు తామే తాత్పర్యమును వ్రాసిరి. అది గ్రంథరూపము దాల్చినది. దానికి 'రమణగీత'

---

*శ్రీ గణపతిముని గారిని రమణాశ్రమవాసులు "నాయన" అని పిలుతురు. వీరు 17-11-1878న జన్మించిరి. 25-7-1936న సిద్ధి పొందిరి. వీరి జన్మస్థానము బొబ్బిలి సమీపమున కలువరాయి అను అగ్రహారము. మహర్షితో వీరికి ప్రథమ పరిచయము 1903లో. వీరి జీవిత చరిత్రమును గురించి తెలియగోరువారు 'నాయన' అను గ్రంథమును చదువవలయును.

అని పేరిడిరి. దానిని మహర్షి జాగ్రత్తగా చూచి వారి ఆమోదముద్ర నిడిరి. అందు హృదయమును గురించి చెప్పిన శ్లోకములను కొన్నింటిని యీ క్రింద ఉదాహరింతును :—

శ్లో॥ నిర్గచ్ఛంతి యతస్సర్వా వృత్తయో దేహధారిణాం,
హృదయం తత్సమాఖ్యాతం భావనాకృతి వర్ణనం".
(ర. గీ. 5-2)

తా॥ "దేహధారులకు సకలములగు వ్యాపారము లెచ్చటనుంచి బయలు వెడలుచున్నవో అదియే హృదయ మనబడును. ఆకార వర్ణనము కేవల భావన".

శ్లో॥ తస్య దక్షిణతో ధామ హృత్పీఠే నైవ వామతః।
తస్మాత్ ప్రవహతి జ్యోతిః సహస్రారం సుషుమ్నయా॥
(ర. గీ. 5-6)

"తా॥ హృత్ఫలకమునందు హృదయము కుడివైపున నున్నది. ఎడమవైపున కాదు. ఆ హృదయ స్థానమునుండి సుషుమ్నా నాడియొక్క మార్గముగ జ్యోతిస్సు (వెలుతురు) సహస్రారమునకు ప్రవహించుచున్నది".

శ్లో॥ సర్వాసామపి వృత్తీనాం సమష్టి ర్యా సమీరితం
అహంవృత్తే రముష్యాస్తు జన్మస్థానం విమృశ్యతాం॥
(ర. గీ. 7-3)

"తా॥ దేనిని సకలమగు వృత్తులయొక్క చేరిక యని చెప్పుదురో అట్టి ఈ 'నేను' అను వృత్తియొక్క పుట్టిన తావును విమర్శింపవలయును".

శ్రీ రమణమహర్షి (ర. గీ. 5-2) శ్లోకమునందు - శాస్త్రములయందు వర్ణింపబడిన విధమున హృదయమను పదార్థము లేదనియు, హృత్పీఠము - బహుశః ఎదలోపల నుండు ఒకానొక స్థలమునే హృదయమని భావించుటయే లక్ష్యమనియు చెప్పిరి. మహర్షి వాక్యములను కాదని త్రోసి వేయుటకు వీలు లేదు. కాని, ఇదివఱలో నే నుదాహరించిన శ్రుతి వాక్యములు మహర్షులు చెప్పినవే, అవియును త్రోసి వేయరానివే.

సామాన్యమానవునకు హృత్పీఠము - లేక - ఱొమ్ము (Chest) అనబడునది కుడి చంకవద్ద నుండి ఎడమ చంక వఱకు కొలిచిన సుమారు 16 అంగుళములు (Inches) ఉండును. కంఠమూలమునుండి క్రిందికి కొలిచిన సుమారు 7 అంగుళము లుండును. దీనినే ఎద యందురు. దీని క్రింది భాగమున నాభివఱకు నుండు భాగమును "కడుపు" అని అందురు. కడుపు పై భాగమున పైన చెప్పినట్లు యెదలోపల హృదయమునున్నది యెచ్చటకలదో ఇదివఱకు యెవఱును స్పష్టముగ చెప్పలేదు. అనాహతచక్రమునకు క్రింది భాగమున కలదని నే నిదివఱలో రాజయోగమును గుఱించి చెప్పినపుడు (ద్వితీయ భాగమునందు) చెప్పియుంటిని.

శారీరక శాస్త్రజ్ఞులు ఎదక్రింది భాగమును ఫోటోతీసి ఆయా అవయవములకు ఆయాకారంగులతో చిత్రపటము ముద్రించి చూపియున్నారు. గుండె (Heart) ఎద యొక్క యెడమ భాగమునందే ఊపిరితిత్తికి క్రింది భాగమునన్నది. స్వల్ప మాత్రము కుడి ప్రక్కన కనబడును. దానిపై ఊపిరి

శక్తియొక్క ఆచ్ఛాదనము లేదు. ఇది కేవల భావన కాదు. దీనిని సమన్వయించు టెట్లు?

నా యనుభవ మొకటి చెప్పెదను. ఇప్పటికి సుమారు 45 సంవత్సరముల క్రిందట ఒక డాక్టరు, నా యెదుట ఒక బాలుని పరీక్షించెను. అంతట ఆ డాక్టరు చకితుడై యిట్లనెను — "ఈ బాలునకు గుండె కుడిభాగమున నున్నది. ఎడమ భాగమున లేదు. ఇట్టి వింత నేను వినలేదు. ఈ బాలుని మద్రాసు జనరల్ ఆసుపత్రికి తీసికొనిపోయి చూపింపుమని ఆ బాలుని తండ్రితో చెప్పిపంపెను. ఆ బాలునకు పండ్రెండేండ్ల ప్రాయము. కొంతకాలమునకు ఆ బాలుడు మరణించెనని తెలిసినది—

రమణమహర్షి "కుడిప్రక్కన ఉన్నదని చెప్పుటయే గాక "ఎడమప్రక్క లేదు", అని చెప్పిరి. ఈ వైరుధ్యమును సమన్వయించుకొను టెట్లు?

జిజ్ఞాసువు :- అధర్వశిరుడను ఋషి వేఱొక మహర్షి చేత శపింపబడినవాడై అతని శిరము హృదయము శరీరము (అధర్వశిరుని దేహము)నుండి వేఱై క్రిందపడినట్లు చెప్పితిరి. హృదయము ఎంత సూక్ష్మమైన దైనను, భావనా మాత్రము గాక యథార్థ పదార్థమై యుండినపుడే దేహము నుండి క్రిందపడుటయు దానిని అధర్వశిరుడు తిరిగి అది తొలుత ఉన్నచోట చేర్చి అతికించుటయు జరుగను. హృదయపద్మమునకు అష్టదళములు గలవని ఉత్తరగీతయు, శ్రీ వివేకానందస్వాములును, చెప్పిరిగదా? వాటిని కాదనుట

యెట్లు? ఇంతవఱకు యెవరుగాని వ్రేలుపెట్టి చూపినట్లు, ఇదిగో హృదయము అని చెప్పలేదుగదా?

వేదాంతి :- అథర్వశిర ఋషి హృదయపీఠము క్రింద పడునపుడు దానిలో హృదయస్థానము యెచటనున్నను క్రిందపడిపోవునుగదా? హృదయము అష్టదళ పద్మము లనగా - ఎదలో అష్టదిక్కుల నుండి అష్ట విధములైన ముఖ్య నాడీ సమూహము ఒకచోట చేరును. అవి పద్మాకారము గలవిగా అధ్యాత్మదృష్టి గలవారికి కనిపించును. అసంఖ్యాక మగు నాడీ సమూహమునకు వాటిలో సంబంధముండును. అందుండియే శరీరమునందలి అష్టదిక్కులకు అమృతమును ప్రాణశక్తియు, ప్రవహించును. అధోముఖముగా నున్న నాడులు యోగమువలన ఊర్ధ్వముగా లేచుననుటయు యుక్తమే. అప్పుడు పద్మకోశాకారముగ కన్పట్టునని యోగులు కనుగొందురు.

నీవు "ఎవఱుగాని వ్రేలుపెట్టి" — ఇందులో యీ స్థానమే హృదయముండునది అని చూపినట్లు చెప్ప లేదుగదా?" అని అడిగితివి. శ్రీ రమణమహర్షి గారు రెండు సందర్భములయందు అట్లు చూపి చెప్పినట్లు కలదు. 'శ్రీ రమణలీల' అను గ్రంథమున వ్రాసియున్నదాని నిచట నుదాహరింతును :—

కొందఱు స్వామీ! మీరు హృదయము వృక్షస్థల మున కుడిభాగమున నున్నదందురు. మా కనుభవమునకు వచ్చుటలేదే? యనిరి. వారిని స్వామి తన దేహమున తాము చెప్పిన హృదయ స్థానమును తాకు డనిరి. అంత హృదయ

స్ఫురణ త్వరత్వరగా మూడు స్పందనములు తర్వాత దీక్ష విరామము తాకినవారి చేతులకును తెలిసినది. వారి శరీరము లంతటను శక్తి ప్రసారముపలె నయ్యెను. (రమణలీల, అమృతలీలా ఖండము). "నాయన" అను గ్రంథమునం దిట్లున్నది :—

"దీనిని పరిమిత మొకచ్చి శరీరమందొకచో నున్నట్లు వచింపరాదు. అట్లయినను శరీరమందు వ్యాపారస్ఫూర్తి యెక్కడ పుట్టుచున్నదో ఆస్థలము హృదయ స్థలమని నిర్దేశింపక తప్పదు. అది యనుభవమునందు తెలియవలసిన దైనను రొమ్మునకు దక్షిణ భాగమం దిదిగో. అక్కడనే ... "యని దాని నిర్దేశ స్థలము స్ఫురించుటకు నాపైపు దృష్టి నొకసారి హఠాత్తుగా బరపి మహర్షి యటుప్రక్కకు దిరిగెను". (నాయన. పుటలు. 737-740).

నేను హృదయమును (Heart) కుడిప్రక్కనగల బాలుని గురించి చెప్పితినికదా ? శ్రీ రమణమహర్షి గారికి కూడ అట్లే కుడి భాగమున పుట్టియుండును. కుడిప్రక్క గుండె ఉన్నవారు కలరని వార్తాపత్రికలయందు మనము అప్పుడప్పుడు చదువుచున్నాము. అట్టివారిలో మహర్షి ఒకరని యూహించిన సమస్య విడిపోవును.

ఇటీవల వ్యాప్తిలోనికి వచ్చుచున్న రామచంద్ర మిషన్ గురువుగారగు రామచంద్రజీ మహరాజ్ గారు 'రాజయోగ ప్రభావ'మను గ్రంథమున హృదయస్థానమును నిర్దేశించి చూపినట్లు చెప్పిరి. వివరములు తెలియగోరువారు ఆ గ్రంథమును చూడవలెను.

ఏది యెట్లున్నను మనకు కావలసినది అనుభవము కనుక నీ ప్రశ్నలకు సమాధానము వెదకి పరస్పర విరుద్ధాంశములవలె కనబడు శాస్త్ర వాక్యముల సమన్వయము కుదుర్చుకొనుటకంటె శ్రీ రమణ మహర్షి చెప్పినట్లు సాధన చేయవలయును. నీమనస్సును వాసనాక్షయముగ (శుద్ధముగ చేసికొని) శుద్ధ మానసముతో హృదయము నన్వేషించినచో మనస్సు యెక్కడికిపోయి లయమగునో ఆ చోటనే హృదయమని నీమనమున నిశ్చయింపుము. కొంతకాలము యీ విధముగ సాధనచేసిన ఒకనాడు ఫలము సిద్ధించును. తరువాత కష్టము లేకయే నీమనస్సు అప్రయత్నముగ హృదయముతో చేరును. నీకు కావలసిన దదియేకదా? దానితో నీకు గల సర్వసంశయములు తీరును. పర్యవసాన మేమనగా:—నేనిదివఱలో చెప్పినట్లు ఉపనిషత్తులయందు యే కొన్నింటి యందో తప్ప సామాన్యముగ అన్నింటి యందును హృదయ ప్రస్తావన వచ్చియున్నది. అందులో కొన్ని శ్రుతులు హృదయమును గుహతోను, మఱికొన్ని శ్రుతులు హృదయమును పద్మకోశముతోను పోల్చినవి. ధ్యాన బిందూపనిషత్తు నందు అధికముగా "కదళీపుష్ప సంకాశం సర్వవేదమయం శివమ్." (33) అని చెప్పబడినది. కాని "హృదయ మిదిగో యిచ్చట నున్నదని" చూపినట్లు స్థలనిర్దేశము చేసి చెప్పలేదు. మంత్రపుష్పమునందు కుడియెడమ భేదములు చెప్పక నాభికి చక్కగా ద్వాదశాంగుళములు (నాలుగు బెత్తెలు) పైన కలదని నిర్ధారణ చేసియున్నది. శ్రీ రమణమహర్షి వారి శిష్యులకు సూచన చేసిరిగాని పూర్తిగా స్పష్టపరుపలేదు.

శరీరమునందు వ్యాపార స్ఫూర్తి యెక్కడ పుట్టుచున్నదో ఆ స్థలము హృదయస్థల మని నిర్దేశింపక తప్పదనిరి.

ఎట్లైనను, జీవించి యుండగా ఏ మహాత్ములు హృదయ నిర్గుణబ్రహ్మభావన చేయుదురో వారు క్రమముక్తిని పొందుదురు. ఎవరు హృదయపద్మమునందు సత్య సంకల్ప సత్యకామాది గుణ విశిష్టునిగ బ్రహ్మము నుపాసింతురో అట్టి విద్వాంసులు సత్యకామ సత్య సంకల్పులై సమస్తలోక సంచారమును పొందుటకు అర్హు లగుచున్నారు. శ్రీ రమణ మహర్షి గారికి సత్యకామ, సత్యసంకల్పములును, వియద్గమ నాది మహిమలును, ఉన్నట్లు వారి జీవితచరిత్రయందు వ్రాసియున్నందునను, తొలుత వారు సత్యకామాది గుణ ములుగల సగుణబ్రహ్మమును ఉపాసించుచు సిద్ధి నొంది రనియు, అనంతరము నిర్గుణబ్రహ్మమును విచారము చేసి తత్త్వజ్ఞానము నార్జించిరనియు తెలియుచున్నది. వారు యే దేవతా తేజమునుండి భూమిపై నవతరించిరో భౌతిక దేహమును వదలిన తరువాత ఆ దేవతా (స్కందుని) తేజ మున ఐక్య మైరనియు చెప్పవచ్చును.

జిజ్ఞాసువు :- స్వామీ! నాసికాగ్రము బ్రహ్మమునకు స్థానమందురు గదా?

వేదాంతి :- హృదయము బ్రహ్మమునకు స్థానమని చెప్పిన ఉపనిషత్తులను తెలిపితిని. నాసికాగ్రము (భ్రూ మధ్యము) బ్రహ్మమునకు స్థానమని కొందఱందురు గాని అది అధిక వ్యాప్తిలో లేదు. గీతయొక్క 6-13 శ్లోకమున - ఉపాస

కుడు(సాధకుడు) తన దేహమును, మెడను, శిరమును చక్కగా నిలిపి, స్థిర చిత్తుడై, దిక్కులుచూడక, చూపును నాసికాగ్రమున నిలుపవలయునని చెప్పుటవలన మనస్సు ఏకాగ్రమగుటచే జీవము బ్రహ్మైక్యమునకు సాధనమగునని యేగాని అది పరబ్రహ్మమునకు స్థానమని చెప్పుట కాదని కొందఱు పెద్దల యభిప్రాయము. "నాసాగ్రే చైవ హృన్మధ్యే బిందు మధ్యే తురీయకం" అని వరాహోపనిషత్తు చెప్పినది. తిక్కనసోమయాజిగారు మహాభారత భీష్మపర్వారంభమున నిట్లు చెప్పిరి :—

కం॥ శ్రీ సంపాది పదాంబుజ
నాసాగ్ర నివాస రసిక నాదామృత ధా
రా సార రూప వేద
వ్యాస వ్యంజిత విహార హరిహర నాథా॥

నాసికాగ్ర నివాసమును ధృఢపరచిరి.

(౨) బోధ - ప్రదీకరణము

జిజ్ఞాసువు :- స్వామీ! తాము ఇదివఱలో (ఈ భాగము (ప. 1. అ. 16) అఖండాకారవృత్తి - అఖండైక రసము అనునంశమును బోధించు సందర్భమున జ్ఞాతృత్వము బుద్ధియొక్క జ్ఞాతృత్వ మనియు, ప్రత్యగాత్మ జ్ఞాతృత్వ మనియు - రెండు విధములని చెప్పియుంటిరి. తరువాత (2 ప్రకరణము. 9వ అధ్యాయమున) జ్ఞానము 7 విధములని బోధించితిరి. చైతన్యము అద్వితీయమనిగదా తమరు ముఖ్యముగా బోధించినది. ఈ భేదమును ఎట్లు సమన్వయింతురు?

వేదాంతి :- బోధ కొఱకు అట్లు చెప్పవలసివచ్చెను. అది వాస్తవముకాదని అచ్చటనే చెప్పియుంటిని. బోధ దృఢపడుటకై ఇప్పుడు మఱల చెప్పెదను. సావధానుడవై వినుము. ఇదియే వేదాంతమునందలి కడపటి బోధ. దీనిని తెలిసికొనిన తరువాత తెలిసికొనవలసిన దేదియు మిగులదు.

శ్రీ విద్యారణ్యస్వాములవారు వేదాంతపంచదశియందు యిట్లు చెప్పిరి :—

శ్లో॥ యస్మిన్ యస్మిన్నస్తి లోకే బోధస్తత్తదుపేక్షణే,
యద్బోధమాత్రం తద్బ్రహ్మేత్యేవం ధీర్బ్రహ్మనిశ్చయః ॥
(వే. పం. ౭-21)

తా॥ లోకమునందు ఏ పదార్థమునందు బోధ కలుగునో ఆయా పదార్థములను త్రోసివైచిన ఏ బోధమాత్రము (స్ఫురణ మాత్రము) మిగిలి యుండునో ఆ స్ఫురణమే (జ్ఞానమే, లేక బోధయే) పరబ్రహ్మమని నిశ్చయింపుము.

నీవు ఘటమును, పటమును, కుడ్యమును (గోడను), జలమును చూడుము. ఘటమును చూచిన జ్ఞానము (బోధ) కంటెను, పటమున చూచిన జ్ఞానము వేఱనియును, ఘట, పటముల చూచిన జ్ఞానమునకంటె గోడను చూచిన జ్ఞానము వేఱనియును, ఆవిధముగనే జలమునుచూచిన జ్ఞానము అంతకంటెను వేఱనియును తలంతువా!

త్నించినను తనకు తపః ఫలము (శాంతి) లభింపలేదని చెప్పుకొనిరి. అంతకుముందు దాక పర్యాయము మహర్షి గణపతి గారిని చూచి వారి యోగ్యతను తెలిసికొని యుండిరి. మహర్షికి అది అప్పుడు స్ఫురించెను. ఇట్లు శరణాగతుడైన గణపతిగారితో మహర్షి యిట్లనిరి:— "ఈ 'నేను' అను భావము యెందుండి పొడముచున్నదో పరికించిన మనస్సు అందు లీనమగును. అదియే తపస్సు".

"మంత్రజప మప్పుడు మంత్రనాద మెందుద్భవిం వించునో పరికించిన మనస్సు అందులో లీనమగును. అదియే తపస్సు".

గణపతుల* తప్త హృదయమున నమృత సేచనమయ్యెను (శ్రీ రమణలీల - 5వ ప్రకరణము).

మహర్షి సన్నిధానమున వారి శిష్యులు అధ్యాత్మానుభవమున వారికిగల సంశయముల నడుగుచుందురు. మహర్షి వారికి సమాధానము చెప్పుచుందురు. అచ్చట నున్న శిష్యులలో ఒకరు జాగ్రత్తగ ఆ ప్రశ్నోత్తరములను వ్రాసియుంతురు. వాటిలో కొన్నింటికి గణపతి మునిగారు శ్లోకములుగా వ్రాసి, ఆ శ్లోకములకు తామే తాత్పర్యమును వ్రాసిరి. అది గ్రంథరూపము దాల్చినది. దానికి 'రమణగీత'

---

*శ్రీ గణపతిముని గారిని రమణాశ్రమవాసులు "నాయన" అని పిలుతురు. వీరు 17-11-1878న జన్మించిరి. 25-7-1936న సిద్ధి పొందిరి. వీరి జన్మస్థానము బొబ్బిలి సమీపమున కలువరాయి అను అగ్రహారము. మహర్షితో వీరికి ప్రథమ పరిచయము 1903లో. వీరి జీవిత చరిత్రమును గురించి తెలియగోరువారు 'నాయన' అను గ్రంథమును చదువవలయును.

మాత్రమే గైకొనిన ఆ బోధయే బ్రహ్మము. ఇందులకు ఎట్టి సంశయము వలదని పెద్ద లానతిచ్చిరి.

జిజ్ఞాసువు :- స్వామీ! ఘటాదుల నుండి బోధను వేఱుచేయుటకు ఉపాయ మేమి?

వేదాంతి :- ఘటమును నీవెట్లు "ఇది ఘటము" అని తెలిసికొంటివి?

జిజ్ఞాసువు :- వెలుతురు సహాయమువలన నేత్రేంద్రియము ద్వారా మనస్సు ఘటమున ప్రవేశించి ఆయాకృతిని మనస్సు చిదాభాసునితో కూడిన బుద్ధి కదింపగా బుద్ధి ఘటాకారమును పొందును. అప్పుడు నాకు ఘటమని తెలియవచ్చుచున్నది.

వేదాంతి :- బుద్ధి ఘటాకారమును పొందకున్నచో నేమగును?

జిజ్ఞాసువు :- అచ్చట ఘటమున్నను ఘట మున్నదని నాకు తెలియబడదు.

వేదాంతి :- ఘటాదులు నామరూపములు మాత్రమే యని యంటివి. అనగా - మాయ. ఘటమును చేత గైకొని పరిశీలించిన అది మృత్తికయే. మృత్తికను ఘటమంటివి. ఘటమను నామ మెట్లు మిథ్యయో ఘటాకారమును మిథ్యయే. సత్యమే మన మృత్తిక. శ్రుతి యిట్లు చెప్పినది "యథా సౌమ్యైకేన మృత్పిండేన సర్వం మృణ్మయం విజ్ఞాతంస్యాద్వాచారమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్". (ఛాందో. 6-1-4).

జిజ్ఞాసువు :- ఘటము మృత్తికయే యైనను నానా రూపములయందు మృత్తికకు భేదము కలదుగదా? ఈ భేదము నశించు టెట్లు?

వేదాంతి :- ఒక నారింజపండును కోసి దానిరసమును ఒక పాత్రలో పిండిన దానియందు రసము బీజములు (విత్తనములు) కలసియుండును. వేఱొక పాత్రయందు వస్త్రము వేసి దానిని వడియగట్టిన రసము వేఱుగను విత్తనములు వేఱుగను నేర్పడును. నీవు రసమును మాత్రము గ్రహించుచు విత్తనములను వదలివేయుదువు.

జిజ్ఞాసువు :- విత్తనములు వేఱు రసము వేఱను ద్వైతభావ ముండునుగదా?

వేదాంతి :- నారింజ వృక్షమునకు తొలుత ఒక బీజము కారణము. ఆ బీజమే వృక్షమైనది. దానికి వేయి నారింజ ఫలములు పుట్టినవి. ఒక్కొక్క ఫలమునందు నూఱు బీజములున్నవి. వానిలో చిన్నవి, పెద్దవి, నాసి రకమైనవి మొదలగు భేదములున్నవి. ఈ లక్ష బీజములకును, ఆ వృక్షమునకును, దాని ఆకులు, కొమ్మలు మొదలగువాని కన్నిటికి కారణమైనది. తొలుత భూమిలో వేసిన బీజ మొక్కటియే యని తెలియునుగదా? కనుక నీకు కనబడిన భేదమంతయు మిథ్యయే కదా?

శ్లో॥ విజాయమాన విషయం సన్నికర్షేణ యద్యపి
నభవే ద్యోగ భంగాయ భేదస్యాగ్రహణే మనః. (ర. గీత.)

తా॥ మనస్సు సాన్నిధ్యముచే లోక విషయంబుల

తెలిసికొనుచున్నను, భేదము గ్రహింపనప్పుడు యోగము నకు భంగము కలుగదు. ఏలయన? నేను పైన చెప్పినట్లు నారింజ వృక్షములకు మూలము బీజము ఒక్కటియే యని నిశ్చయము నీ మనమున నిలకడ చెందియుండెనేని లక్ష బీజముల యందును భేదదృష్టి కలుగదు. కనుక, నీవు ఎచ్చటెచ్చట యే యే నామ రూపముల చూచుచున్నావో ఆ యా నామరూపము లన్నియు మాయా కల్పితములు. ఒక కట్టె చేతియందున్నది. దానిని నిప్పంటించిన అది కాలి బూడిద యగును. ఇప్పుడు కట్టెయను నామమును కట్టె యొక్క రూపమును నేమైనవి? ఎచటికి పోయినవి? బూడిదయను పేరును, దాని యాకృతియు నెచ్చటినుండి వచ్చినవి. ఇదియే మాయ. మాయ యనునది పరబ్రహ్మము యొక్క శక్తియే. శక్తికి శక్తిమంతునకు భేదము లేదు. ఇప్పుడు ప్రపంచ మెచ్చట నున్నది?

జిజ్ఞాసువు :- ప్రపంచమనునది కేవల వ్యావహారిక సత్యమేగాని వాస్తవముగ లేదు. బ్రహ్మ మొక్కటే కలదు.

వేదాంతి :- ఉపనిషత్కారులగు మహాత్ములు ఉపనిషత్తులయందు మోక్ష సౌధమును ప్రవేశించుటకు అనేక సోపానములు నిర్మించిరి. వారు దయామయులు గనుక వారు మనకు చేయూతనిచ్చి ఒక్కొక్క సోపానమునే యెక్కించుచు మోక్ష సౌధమును ప్రవేశింప శక్తి నొసగిరి. క్రింద నున్న సోపానము యెక్కినప్పుడే ముముక్షువులు, కనబడి కనబడనియట్లుండు, మోక్ష సౌధమును చూతురు. ఇట్లు

పోను పోను పై సోపానమును (కట్టకడపటి సోపానమును) ఎక్కగనే మోక్ష సౌధమునందు ప్రవేశించిన ట్లయినది. అప్పుడే శ్రుతి యీ విధముగా పలికినది. "సర్వం ఖ ల్విదం బ్రహ్మ నేహనా నాస్తి కించ న" సర్వమును బ్రహ్మమే. ఇతరమైనది కొంచెమైనను లేదు. అనుభవము కలుగునంత పర్యంతము, ప్రపంచము మిథ్యయని శాస్త్రముల యందును గురు వాక్యముల యందును నమ్మకముంచిన ఆ కడపటి సోపానమును దాటి మోక్ష సౌధమును ప్రవేశించినపుడు కలుగు దృఢమగు విశ్వాసమువంటి విశ్వాసము (శ్రద్ధ) కలుగదు. ఇదియే కడపటి బోధ (వాక్యము) ఇంతకు మించి యింకేదియు లేదు. మోక్ష సౌధములో అడుగిడగనే మాటలు లేవు. మనస్సు లేదు.

మోక్ష సౌధమునందును, బయటను ఉన్నది. నీవొక్కడవే. మోక్షమే నీవై యున్నావు. బ్రహ్మయే నీవై యున్నావు. ఇదియే అద్వైతము నందలి రహస్యము. నీవట్టి బోధ స్వరూపుడవని నిశ్చయించుకొని సంశయ రహితుడవు కమ్ము "తత్త్వమసి" అదియే నీవయి యున్నావు. అను మహావాక్యమునందలి అర్థము అనుభవమునకు వచ్చును. "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి". (ముండక. 3-2-9). ఈ బోధను నిరంతరము మరవకుండుము. ఇట్టి ఆత్మైక్య బోధ కలవాడు తిరిగి పుట్టడు. ఇట్టి బోధ లోకమునకు బోధించిన మహాత్ముల పాదపద్మములకు నమస్కరింతము.

(౫) ముగింపు - (ఉపసంహారము)

జిజ్ఞాసువు :- (సాష్టాంగ నమస్కృతుల నర్పించి) స్వామీ! ధన్యుడను. ఓ మహాత్మా! పరబ్రహ్మ విషయమైన సర్వవిధములగు జ్ఞాన, విజ్ఞానములు మీకృపవలన తెలియ గలిగితిని. ఇప్పుడు నాకు తెలియదగిన దేదియు లేదు. నా సంశయములన్నియు తొలగిపోయినవి.

వేదాంతి :- నీవేమి తెలిసికొంటివో నాకు చెప్పుము?

జిజ్ఞాసువు :- స్వామీ! గురుదేవా? సత్యాన్వేషినై నేను తొలుత తమ సన్నిధికి వచ్చినపుడు శూద్రకుల జాతుడనే, నేను వేదాంతము తెలిసికొనుట కర్హుడను కానేమో? అని సంశయించి యుంటిని. అట్టి సంశయమును సంపూర్ణముగ తొలగించితిరి. ఆప్రసంగమునందే అచలవేదాంత ప్రసక్తిరాగా "అద్వైత వేదాంతమును గురించి చక్కగా తెలిసికొనిన పిమ్మట అచలబోధ యెట్టిదైనది నీకు సులభముగా బోధపడును" అని తమ రానతిచ్చిన వాక్యముల యందలి గంభీరత యింతటిదని యిప్పుడు నా కవగతమయినది*. తదనంతరము అద్వైత సిద్ధాంతము ననుసరించి "పరబ్రహ్మము, మాయ, ఈశ్వరుడు, జీవుడు, కూటస్థుడు, చిదాభాసుడు మొదలగు విషయము లన్నియు బోధించితిరి.

ఆపిమ్మట జీవులు మరణానంతరము దేవయాన పితృ

---

*బ్రహ్మజిజ్ఞాస ప్రథమ భాగము మొదటి ప్రకరణమునందలి విషయము.

యాణ మార్గముల ననుసరించి *బ్రహ్మాది లోకములకు పోవుటయు కొందఱు జీవులు తిరిగి భూలోకమునకు వచ్చి జన్మించుటయు, బ్రహ్మాదులకు మాత్రము ఉత్క్రాంతి లేకుండుటయు మొదలగు విషయములు బోధించితిరి.

ఓ కరుణామూర్తీ! ముముక్షువు ఏ మార్గము ననుసరించిన తిరిగి పుట్టడో అట్టి మోక్షోపాయమును తెలుపుడని నేను ప్రార్థింప మొదట జ్ఞానమార్గమును వెలిగించితిరి. జ్ఞానమార్గమునకు అనర్హులగు మందాధికారుల కొఱకు పాతంజల రాజయోగమును రెండవ యుపాయము సాంగోపాంగముగ వివరించితిరి. అందుకును అర్హత లేని వారికిని జ్ఞానులయ్యును సన్న్యసింపక లోక కల్యాణమునకు పాటుపడు వారికిని సులభమగు కర్మయోగమను మూడవ యుపాయమును గీతాశాస్త్రము ననుసరించి యీ కాలానుగుణ్యముగ నుండునట్లు బోధించితిరి. జీవులయొక్క పూర్వ జన్మ సంస్కారముల ననుసరించి కలిగిన రుచిభేదముల వలన పై మూడుపాయములు రుచియింపని వారికి, హిందూమతేతరులకు సయితము ఆమోదయోగ్యమగునట్టియు అనేక విధములగు ఈశ్వర భక్తియను నాలుగవ యుపాయమును ఉపదేశించితిరి. ఈశ్వరభక్తిని అనుష్ఠింపలేని రోగులు దుర్బలులు, వీరు వారను భేదములేక ఉపాయమును, ఉపేయమును నగు ఈశ్వర శరణాగతిని (ప్రపత్తిని) అతి సామాన్యజనులకు సయితము అవగాహనమగునట్లు ఐదవ

*బ్రహ్మజిజ్ఞాస ప్రథమభాగమునందు రెండవ ప్రకరణమున చెప్పిన విషయము.

యుపాయమును యెఱిగించితిరి. ఇట్లు పంచవిధ మోక్షోపాయముల యందు *మీరు చెప్పక వదలిన ముఖ్యవిషయమేమియు ఉండదని నా నిశ్చయము.

ఇంతేకాదు †హిందూమతమునకు మూలాధారము లయినట్టియు, ఈ భూమిపై నుండు గ్రంథము లన్నిటి కంటెను, అతి ప్రాచీనములగు చతుర్వేదముల గుఱించియు షడ్దర్శనముల యొక్క మూలరూపమనదగిన "అన్వీక్షకి"ని గుఱించియు, షడ్దర్శనములయందు ఆత్మ చైతన్యమను నట్టియు, ఆత్మ జడమనునట్టియు, దర్శనముల భేదమును తెలిసికొంటిని. దర్శనములాధారముగా రచియింపబడిన వివిధ దర్శనకారుల సూత్రములను గుఱించి తెలిసికొంటిని.

షడ్దర్శనములచే పెంపొందిన షణ్మతములయందు, శైవ, వైష్ణవ, శాక్తాది మతములను వాటియందుగల వివిధ భేదములను, శ్రీ శంకరాది భాష్యకారుల భిన్న భిన్న భావములను, భాష్యకారులుగాని, శ్రీ కృష్ణచైతన్య స్వాముల వారి మతమును, శైవ, వైష్ణవ, శాక్తాది మతముల పోషించిన ఆయా భక్తుల యొక్కయు, వారి వారి మతముల యందు కలిగిన పరిణామములును, మంత్రశాస్త్రమును, శ్రీ విద్యయు, కాశ్మీర శైవము, శాక్తమునందలి లలితా భావ

---

*జ్ఞాన, రాజ, కర్మ, భక్తి యోగములును, ప్రపత్తియు, యీ అయిదు ప్రకరణములుగా "బ్రహ్మజిజ్ఞాస" ద్వితీయ భాగము (ద్వితీయ సంపుటము)గా ముద్రింపబడినది.

†ఇచ్చట తృతీయభాగమునందలి విషయములు చెప్పుచుంటిని.

మును, మొదలగు వైదిక మత విషయములు మీ కృపచే అవగాహన చేసికొన గలిగితిని.

జైన, బౌద్ధములే గాక చార్వాకాది నాస్తిక మతములును ఇంద్ర విరోచన మతములును అవగతము* లైనవి.

శివరామ దీక్షితులవారు, వారి అచలబోధ శ్రీ జ్ఞానేశ్వరుల నుండి గురు పరంపరగా తమకు లభించినట్లు శ్రీ జ్ఞానేశ్వరులవారి తత్త్వ మిట్టిదని తెలిసిననే సత్యము బయలు పడునని శ్రీ జ్ఞానదేవుల మత మిట్టిదని స్థాలీపులాక న్యాయమున బోధించితిరి. శివశక్తి తత్త్వమును గురించి చెప్పు సందర్భమును బట్టి ఆనుషంగికముగా వచ్చిన శ్రీ అరవింద యోగి యొక్క శివ - శక్తి తత్త్వ మిట్టిదని వివరించితిరి. దీక్షితుల వారు తమ గురువు శ్రీధరస్వామి యని చెప్పి యున్నందున సమర్థ రామదాస పంథకు చెందిన శ్రీధరు కవియో, ఆ శ్రీధరస్వామియై యుండ వచ్చునని శ్రీ సమర్థుల మతమునుగూడ సంగ్రహముగ వివరించితిరి.

దీక్షితులవారి బోధ యిట్టిదని వారి వాక్యముల నుదాహరించి బోధించుటతో అచలబోధను నేను సులభముగా గ్రహింప గలిగితిని. నేను "అచలబోధ అనగా నెట్టిది?" అని తొలుత మిమ్ముల ప్రశ్నించినపుడు మీరు తొందరపడక యెప్పు డద్దానిని గురించి చెప్పిన భాగమునకో ఆ సమయముననే బోధించితిరి. నేను తమవలన విన్నంతవరకు

---

*అంతటితో తృతీయభాగము పూర్తి అయినది.

స్మరించిన ఒక మహాగ్రంథముగును. దానిని నావంటివాడు ప్రశంసించుటకు అశక్తుడు.

అచలబోధపరిశీలన మనువ్యాజమున వేదాంతము నందలి నిగూఢాంశముల నన్నింటినీ సులభగ్రాహ్యముగు నట్లు బోధించితిరి. కేవలము అచలబోధ స్వరూప మిట్టిదని మాత్రమే తెలుపుటకు ఇంతటి దీర్ఘోపన్యాసము అవసరము లేకయే మీరు నావంటి మందబుద్ధికి బోధించియుండ గలరు. కాని, అచల వేదాంతులమాటలు విని ఆదురుతువగు జిజ్ఞాసువు తబ్బిబ్బు పడకుండుటకై అచల వేదాంతమును అద్వైత మును రెండును ఒకచోట చేర్చి రెండింటి భేదమును వివరించి చెప్పుటవలన రెండింటిలో నేది శ్రేష్ఠము? ఏది కనిష్ఠము? అను నిర్ణయమునకు సులభముగ రాగలిగితిని. తమవంటి సద్గురువు నాకు లభించుట నాపురాకృత సుకృత ఫలము. భగవంతుడే నన్ను ప్రేరేపించి తమ సన్నిధికి తెచ్చెనో, అట్లుగాక భగవంతుడే మీ రూపమున నాకు బోధించెనో, అని నమ్ముచున్నాను. శ్రీ సదానందయోగి చెప్పినట్లు—

" ధరణి లోపలఁ దనరారు తత్త్వములను
నెవరుఁ దెలియరు తత్త్వంబు నెవ్వఁడెఱుఁగు
శివుడు గురురూపమై వచ్చి చెప్పకున్న
నవ్యతరభోగి శ్రీ సదానందయోగి ? "

అను పద్యములోని భావము తెలిసికొంటిని. అందులకే కృతులు.

గురుర్బ్రహ్మా గురుర్విష్ణు ర్గురుర్దేవో మహేశ్వరః
గురురేవ పరబ్రహ్మ, తస్మై శ్రీ గురవేనమః.

అను మంత్రార్థము బోధపడినది. సమస్త మహామండలాధిపత్యము నా కబ్బినను నేనిప్పుడు పొందియుండునట్టి ఆనందమును పొందియుండ లేను. స్వామీ! గురుదేవా! మీకెంత ఋణపడితినో చెప్పజాలను. మీ ఋణము నేనెట్లు తీర్పగలను. ఋణము తీర్పలేని శిష్యుని జన్మము వ్యర్థము. మీకు గురుదక్షిణ నేనేమి సమర్పింపగలను? మీకెట్లు సేవ చేయగలను? ఈ శరీర మనః ప్రాణాదులను మీ కర్పణ చేసితిని. ఈ యంశమున నాకు తమపై గల భక్తిభావమును ఉన్నదున్నట్లు తమ కెఱిగించుటకు నేను పండితుడను కాను, కవిని గాను, నాయందేదైన గుణమున్న అది నేను తమ యందు గురుభావముంచు టొక్కటే.

వేదాంతి:— మిత్రుడా! బుద్ధిమంతులగు వారు సామాన్యముగ చెప్పునట్టి మాటలనే నీవును చెప్పితివి. పరమార్థమునందు, 'నీవు', 'నేను' అను భేద మెచ్చట గలదు? రెండు ప్రమిదెలయందు ఇంత నూనె వేసి, రెంటి యందును ఒక్కొక్క దానియందు ఒక్కొక్క వత్తిని వేసి, ఒక దీపమును వెలిగించి యుండగా నే కారణముననో రెండవ ప్రమిదె మొదటిదీపమును సమీపించిన సమయమున మొదటి ప్రమిదెయందలి జ్యోతి యొక్క సంయోగము రెండవ ప్రమిదె యందలి వత్తికి కలిగి అదియును వెలిగి

నపుడు రెండింటియందలి జ్యోతులు (అగ్ని) భిన్నములుగా (రెండుగా) కనబడుచున్నను రెండును ఒక్కటియేకదా? రెండు ప్రమిదెలయందలి వత్తులను ఒక ప్రమిదయందుంచిన, అనగా రెండింటికి సంయోగము కలిగించిన, అప్పుడు రెండు ప్రత్యేక జ్యోతులుగా గాక రెండు దీప జ్వాలలు ఒకే తేజముగునట్లు మన మిరువురము వేఱుకాము. ఇరువురము ఒక్కటియే యయ్యును వేఱుపడినట్లుండి యేకమైతిమి. ఇప్పుడు గురు శిష్య భావము లేనే లేదు.

శుక్ల యజుర్వేదమునకు సంబంధించిన శ్రుతుల యందు ఆరంభమునను అంతమునను చెప్పు శాంతి మంత్రమును చెప్పి దాని యర్థమును చెప్పెదను వినుము :—

మం॥ పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ మిద ముచ్యతే, పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమే వావశిష్యతే ॥

పూర్ణ + అదః = శ్రుతియందు తత్త్వమసి, (తత్ + త్వమ్ + అసి) అది నీవై యున్నావు, అను మహావాక్యము నందలి తచ్ఛబ్ద వాచ్యమైనది (అది) బ్రహ్మము పూర్ణమైనది. అఖండా ద్వితీయమైన పరిపూర్ణవస్తువని భావము - పూర్ణం + ఇదం = పై మహావాక్యము నందలి త్వం శబ్ద నిర్దిష్టమైన ప్రత్యగాత్మ స్వరూపము (ఇది అనబడినది) పూర్ణమైనది. (ఈ తత్త్వం పదముల రెంటికిని ఎట్లు పూర్ణత్వము కలుగుచున్నదో చెప్పుచున్నది. అనగా : రెండు పూర్ణము

లుండవుగదా? పూర్ణమనిన 'ఏకమే వాద్వితీయం బ్రహ్మ' అన్నట్లు బ్రహ్మము మాత్రమే పూర్ణము; పూర్ణాత్ = పూర్ణమునుండి, పూర్ణం + మిదముచ్యతే = పూర్ణమే సంభవించుచున్నది. జీవేశ్వరుల కిరువురకు పూర్ణత్వమని అర్థము. పూర్ణరూపం + ఆదాయ = పూర్ణరూపమును గ్రహించి తత్త్వం పదార్థముల శోధించి, శోధింపబడిన పదార్థములు గలవాడనై అని అర్థము. పూర్ణం + ఏవ అవశిష్యతే = పూర్ణమగు బ్రహ్మమైయే శేషించుచున్నాడు. బ్రహ్మమే అగుచున్నాడని అర్థము.

రెండు అఖండములు (పూర్ణములు) ఉండజాలవు. రెండు అఖండములు కలవనిన అవి రెండును ఖండములేగాని అఖండములు కావు. పూర్ణ మనగా - పరిపూర్ణమనియే, కొఱత లేనిది. బ్రహ్మాండము నంతటను వ్యాపించియున్న మహాకాశము (భూతాకాశము) నందున్న భూమి నుండి కుమ్మరివాడు కొంత మట్టిని తీసికొని కుండను చేసెనను కొనుము. కుండ (రెండు కపాలములు ఏకముకాగానే కుండ యగును), ఘటము కలిగినదనగా ఘటమునందున్నది మహాకాశమే యైనను, ఘటాకాశమని వ్యవహారము కలిగినది. అట్లే పరిపూర్ణమునుండి ఘటాకాశమువలె ఉద్ధరింపబడిన జీవుడు పరిపూర్ణుడనియే తాత్పర్యము. ఎచ్చట నుండియో జీవుడు లేక ఎఱుక వచ్చినదనియు, అది పరిపూర్ణముతో సంబంధము లేనిదనియు చెప్పిన, అప్పుడు పరిపూర్ణమను

నదియే యుండుటకు వీలు లేదు. పూర్ణము కాక అన్యమైనది కలదనిన పూర్ణము సహితము లేనిదే యగును. ఈ విష యము అటుంచుము.

నాకు నీవు ఋణపడితి వంటివి. నాకు నీ వెంత ఋణ పడితివో నీకును నే నంతయో ఋణపడియున్నాను. బోధయగు నతనికి నిజమైన జిజ్ఞాసువు (ముముక్షువు) లభించుట వాని యదృష్టము. 'ఏలయన? విద్వాంసు డగువాడు వాడెఱిగిన విద్యను ఇతరులకు తెలుపడేని వాని శరీరము వ్యర్థముగా నశించును. జన్మ సార్థకము కాదు. నీ యట్టి జిజ్ఞాసువు లభిం చుట దుర్లభము. లోకమునందలి మానవుల పరిశీలించి చూడుము. నీవలె వేదాంత విచారము చేయవలెనను ఆకాంక్ష గలవా రెందఱున్నారు? నాకు గురుదక్షిణ నిచ్చెద నంటివి. "మీకెట్లు సేవచేసెద" నంటివి. చెప్పెదను వినుము. నావలన విన్న సమస్తమును కుల, మత, స్త్రీ, పురుష భేదమును పాటింపక నీవంటి ముముక్షువునకు నీవు చెప్పుము, అదియే నీవు నాకు చేయవలసిన సేవ. అదియే నాకు ప్రియతమమగు గురు దక్షిణ. లోభివిగాకుము. నేనింత శ్రమపడి ఆర్జించిన వేదాంత విద్యను ప్రతిఫలరహితముగ నేల యీయవలయు ననుకొన కుము. '<u>కేవల కృపచేత</u>' జిజ్ఞాసువులకు (ముముక్షువులకు) జ్ఞానదానము చేసిన, వానికి కలుగు ఫలముతో సమస్త సంపదలతోటి సర్వాంసహా చక్రదాన ఫలము సరి తూగ జాలదు. కాని అట్టి ఫలమును మనస్సున ఉంచుకొనకుము.

“కేవలకృప” అని చెప్పితిని. అంతకంటె ఫలమును కోరకుము.

(ఉ) ఫలశ్రుతి

జిజ్ఞాసువు :- స్వామీ! తాము నా కుపదేశించిన తత్త్వజ్ఞాన మంతయు గ్రంథరూపమున వెలువడునట్లును, ఈ గ్రంథమును శ్రద్ధాభక్తులతో చదివినవారికి తప్పక దీర్ఘాయురారోగ్య ఐశ్వర్యములును, సత్సంతానమును కలిగి వారి వంశమున బ్రహ్మజ్ఞానులు జన్మించునట్లును, అంతమున అక్షయమగు పుణ్యలోకములు సిద్ధించునట్లును - ఇందలి తత్త్వము అర్థముచేసికొని అనుభవమునకు తెచ్చుకొనిన భాగ్యవంతులకు శరీరపతనానంతరము అర్చిరాది మార్గమున చతుర్ముఖుని లోకమునకేగి బ్రహ్మసాయుజ్యము పొందునట్లును - ఇందలి అద్వైత సిద్ధాంతమును చక్కగా అర్థము చేసికొని ఆత్మానాత్మ వివేకము కలిగి ఆత్మైక్యబోధ సిద్ధించిన మహాత్ములు జీవన్ముక్తులగునట్లును, ఈ గ్రంథము జగమున్నంతదనుకను ప్రచారమునం దుండునట్లును, పరమేశ్వరు డనుగ్రహించునట్లు ఆశీర్వదింపుడు.

వేదాంతి :- తథాస్తు — నీవన్నవన్నియు అధికార భేదమునుబట్టి సహజముగనే సిద్ధించును. ఇందుకు నా ఆశీస్సులేల? సర్వమును బ్రహ్మస్వరూపముగ చూచు మహానీయుల పాదపద్మముల స్మరించుచు నీ వన్నట్లే యగుగాక యని కోరుచున్నాను.

ఓం నమో విశ్వరూపాయ విశ్వస్థిత్యంత హేతవే,
విశ్వేశ్వరాయ విశ్వాయ గోవిందాయ నమోనమః ".

నమస్తే నమస్తే విభో! విశ్వరూప!
నమస్తే నమస్తే చిదానందరూప!
నమస్తే నమస్తే తపోయోగగమ్య!
నమస్తే నమస్తే శ్రుతిజ్ఞాన గమ్య!

శాంతి వాక్యములు

ఓమ్ సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యంకరవావహై, తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

తా॥ స = ఆ ఉపనిషత్ప్రతిపాదిత పరబ్రహ్మము, హ = ప్రసిద్ధముగా, నౌ = శిష్యాచార్యులమయిన మాయిద్దఱిని, అవతు = రక్షించుగాక, మేమిద్దఱము బ్రహ్మవిద్యాభ్యాసము చేయుచున్నాము. మా యిద్దఱిచేత అధ్యయనము చేయబడిన బ్రహ్మవిద్య తేజోవంతమగు గాక. మే మిద్దఱము ఎప్పుడును ఒకరి నొకరు ద్వేషింపక ఉందుముగాక.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓమ్ భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః,
భద్రం పశ్యే మాక్షభిర్యజత్రాః, స్థిరైరంగై స్తుష్టువాగం సస్తనూభిః, వ్యశేమ దేవహితం యదాయుః

స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః స్వస్తినః పూషా విశ్వ
వేదాః స్వస్తిన స్తార్క్ష్యో అరిష్టనేమిః స్వస్తినో బృహ
స్పతి ర్దధాతు,

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

తా॥ ఓ దేవతలారా! శిష్యాచార్యులమగు మా శ్రవణములచే మంగళకరమగు శబ్దజాలమునే విందుముగాక. మా నేత్రములచే మంగళప్రదమగు కృత్యముల (దృశ్యముల) చూచెదముగాక, దృఢమగు అవయవములు గల శరీరము గలవారమై మేము భగవంతుడు మాకు ప్రసాదించిన ఆయువు నంతయు మీ స్తోత్రములచే గడుపుదుముగాక. శ్రేష్ఠుడును, జ్ఞానియునగు ఇంద్రుడు మాకు శుభములు కలిగించుగాక. సర్వద్రష్టయగు సూర్యుడు మాకు శుభమును ప్రసాదించుగాక. సర్వారిష్టవినాశకరుడగు గరుడుడు మమ్ము కృపాదృష్టితో చూచుగాక. దయామయుడగు బృహస్పతి మాకు శుభములు కలిగించుగాక.

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతి ర్గమయ
మృత్యోర్మా మమృతం గమయ.

(బృహదారణ్యక శ్రుతి)

తా॥ అసత్తు (అసత్యము)నుండి మమ్ముల సత్యమును చేర్పుము. తమస్సు (అజ్ఞానము)నుండి తేజస్సు (జ్ఞానము)ను చేర్పుము. మృత్యువునుండి అమృతమును చేర్పుము.

ఇది పరమేశ్వరానుగ్రహమువలన
మట్టిబోయిన రామసుబ్బయ్యచే రచియింపబడిన
"బ్రహ్మజిజ్ఞాస" చతుర్థభాగమందలి
"బోధద్రఢీకరణ ఉపసంహారము"
అను మూడవ ప్రకరణముతో
గ్రంథము సర్వము
సంపూర్ణము

హరిః ఓమ్ తత్సత్

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః



సవరణపత్రము

పుట	పంక్తి	తప్పు	సవరణ
9	17	కేవలమాయ	మాయ
34	17	శ్రోత సంబంధమగు	శ్రౌత సంబంధమగు
53	4	కనూరి	కస్తూరి
65	21	జీవుడు మొదలు	జీవుడు మొదట
69	3	అనిగీతి	అనిగీత
,,	4	13 - శ్లోకమునందు	13 - అధ్యాయమునందు
,,	8	11 వ అంశ	12 వ అంశ
75	4	దా. తో	దా. బో
76	3	దా. తో	దా. బో
83	7	వైశ	వైశే
89	4	దాసబోధయందు	దాసబోధయందు,
,,	11	ఈశ్వరుడు లేదు	ఈశ్వరుడు లేడు
95	21	ప్రవోచచ్	ప్రవోచత్
97	6	'అసత్త'	'అసత్తు'
104	4	సృష్టించెనని	సృష్టించెననిన
124	11	శుద్దాద్వైతము	శుద్ధాద్వైతము
128	4	తన భర	తన భర్త
134	12	వాక్యముల	ఆ వాక్యముల
136	28	వ ప్రకరణవ	వ ప్రకరణము
137	9	దర్శనము నను	దర్శనమును
,,	20	పట్టి నిడ	పట్టి నీడ
152	20	వసిష్ఠ మషర్షి	వసిష్ఠ మహర్షి
158	23	సజాతీయ స్వగత	సజాతీయ విజాతీయ, స్వగత
177	14	అనునపుడు అవి	అనునపుడు పర్వతములు
182	4	"బృహద్వాశిష్ఠ సిద్ధాంతము" శివ	"బృహద్వాశిష్ఠ సిద్ధాంతము" అను "శివ

పుట	పంక్తి	తప్పు	సవరణ
185	2	ప్రస్తాపంబున నుండెను	ప్రస్తావంబున నుండెను
199	6	అంగ్రీకరింప లేదు	అంగ్రీకరింపలేదు
207	20	"ఎఱుకే జానం"	"ఎఱుకే జ్ఞానం"
219	23	ఒకప్పుడు మనము	ఒకప్పుడు మనకు
221	15	శ్రికృష్ణ చైతన్యుల	శ్రీకృష్ణ చైతన్యుల
,,	,,	నిలకంఠ	నీలకంఠ
222	4	ధర్మభూతజ్ఞాన	ధర్మిజ్ఞాన
224	8	ప్ర. 35	పు. 35
225	11	(బృ. పూ. ప్ర. 88)	(బృ. పూ. పు. 88)
227	4	(బృ. పూ. ప్ర. 22)	(బృ. పూ. పు. 22)
,,	5	బృ. పూ. ప్ర. 25)	(బృ. పూ. పు. 25)
228	20	అధ్యాయములయంగు	అధ్యాయముల యందు
240	14	వున్నంత సేపూ	శరీరం వున్నంత సేపూ
241	22	యత్ర త్యాక్షీ	యత్ర త్సాక్షీ
247	9	'హాం'	'హా'
260	4	(అపరా)	(పరా)
275	13	అవిశేక	అదిశేక
,,	16	బింబు వందు	బిందువందు
279	13	ముదతం	ముదితం
300	6	పద్యముయొక	పద్యముయొక్క
337	3	కావలయునని	కావలయునని ఒకడు
339	14	మహాత్ము	మహాత్ములు
357	4	చెప్పి	చెప్పిన
369	25	అలానసే	అలాగనసే
390	9	వాక్యములు	ఈ వాక్యములు

399	24	యేక భావము లేదు	యేకీభావము లేదు
433	24	గ్రంథపసక్తిని	గ్రంథ ప్రసక్తిని
441	3	కూడి	కూడ
445	14	గురుపత్ని యెగిలి	గురుపత్ని యెంగిలి
456	8	దృష్టి మాత్రమునకు	దృష్టి మాత్రమునను
458	12	నిర్మాణ ప్రకరణము	నిర్వాణ ప్రకరణము
469	20	బుద్ది	బుద్ధి
502	19	చిదాభాసునంగీకరింతురు	చిదాభాసునంగీకరింపరు
507	5	వా యర్థమందు	వాటి యర్థమందు
,,	8	వేఱొకచోట	ఒకచోట
509	7	కరుణా	కారణా
527	9	త్రికాలాది బాధితమైన	త్రికాలాబాధితమైన
537	21	నిరసించునది	నిరసించిరి
539	16	కించు	కించ
541	12	వాతి	వాటి
545	24	వెలువడ	వెలువడు
554	13	అధ్యాయము	అధ్యయనము
559	19	యదలి 32 కలవు	యుందవి 32 కలవు
561	18	గూఢంస	గూఢమును
,,	,,	గహ్వరేష్ఠ పురాణం	గహ్వరేష్ఠం పురాణం
563	12	సతే	సతో
564	7	స్తానాం	స్తాసాం
565	4	నాదీ	నాడీ
,,	,,	ద్వాసప్తతి	ద్వాసప్తతిః
566	15	హైనం	హైవ
567	11	సర్వాన్నామాంత్యంహ	సర్వాన్నాన్మాంత్యసహ

,,	22	శుద్దం	శుద్ధం
568	11	స్త్రిశూద్రాచ్చతేతాని	స్త్రిశూద్రాచ్ఛతేతాని
,,	,,	ఏషాంతర్హృదయ	యఏషాంతర్హృదయ
,,	19	వాచహృదయేన	వాచయస్మాద్ధృదయేన
576	15	సకాల	సకలా
578	6	మాధ్యమునకు	మధ్యమూనకు
,,	20	కేశ	కేన
579	3	యందో	యందు
587	12	గణపతులతప్ప	గణపతులత ప్త
588	5	నిర్గచ్ఛంతియత	నిర్గచ్ఛంతియత
598	22	సామ్యై	సోమ్యే
601	15	బ్రహ్మయే	బ్రహ్మమే

290	3	శక్త్యాద్వైతము	శక్త్యద్వైతము
474	22	,,	,,

496 వ పుటను 466 వ పుట అని తప్పు వేసినారు.

'సంయక్' అని 31, 43, 44, 46, 86, 151, 172, 175, 218 పుటలలో ఉన్న దానిని "సమ్యక్" అని సరిచూచుకొనవలెను.

మఱియొకచోట శక్త్యానుసారమని ఉన్నది, తప్పు. శక్త్యనుసారము అని సవరించుకొనవలెను.

ముద్రణము
వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్
3, మల్లికేశ్వరస్వామి గుడి సందు,
లింగిసెట్టి వీధి, మదరాసు - 600 001